# SIVA PURANA

# VAYUVEEYA SAMHITHA

11



KAUSIKI

# శ్రీ శివ మహా పురాణము

## వాయవీయ సంహితము

## 1 – 20 అధ్యాయములు

శ్రీ గణేశాయ నమః     ఓం నమశ్శివాయ

# 1 – పురాణ స్వరూప నిరూపణము

వ్యాస ఉవాచ।

నమశ్శివాయ సోమాయ సగణాయ ససూనవే ।
ప్రధానపురుషేశాయ సర్గస్థిత్యంతహేతవే ॥
శక్తిరప్రతిమా యస్య హ్యైశ్వర్యం చాపి సర్వగమ్ ।
స్వామిత్వం చ ప్రభుత్వం చ స్వభావం సంప్రచక్షతే ॥
తమజం విశ్వకర్మాణం శాశ్వతం శివమవ్యయమ్ ।
మహాదేవం మహాత్మానం వ్రజామి శరణం శివమ్ ॥
ధర్మక్షేత్రే మహాతీర్థే గంగాకాలిందసంగమే ।
ప్రయాగే నైమిషారణ్యే బ్రహ్మలోకస్య వర్త్మని ॥
మునయశ్శంసితాత్మానస్సత్యవ్రతపరాయణాః ।
మహౌజసో మహాభాగా మహాసత్రం వితేనిరే ॥
తత్ర సత్రం సమాకర్ణ్య తేషామక్లిష్టకారిణామ్ ।
సాక్షాత్సత్యవతీసూనోర్వేదవ్యాసస్య ధీమతః ॥
శిష్యో మహాత్మా మేధావీ త్రిషు లోకేషు విశ్రుతః ।
పంచావయవయుక్తస్య వాక్యస్య గుణదోషవిత్ ॥
ఉత్తరోత్తరవక్తా చ బ్రువతో ఽ పి బృహస్పతేః ।
మధురః శ్రవణానాం చ మనోజ్ఞపదపర్వణామ్ ॥
కథానాం నిపుణో వక్తా కాలవిన్నయవిత్కవిః ।
ఆజగామ స తం దేశం సూతః పౌరాణికోత్తమః ॥
తం దృష్ట్వా సూతమాయాంతం మునయో హృష్టమానసాః ।
తస్మై సామ చ పూజాం చ యథావత్ప్రత్యపాదయన్ ॥
ప్రతిగృహ్య స తాం పూజాం మునిభిః ప్రతిపాదితామ్ ।
ఉద్దిష్టమాసనం భేజే నియుక్తో యుక్తమాత్మనః ॥
తతస్తత్సంగమాదేవ మునీనాం భావితాత్మనామ్ ।
సోత్కంఠమభవచ్చిత్తం శ్రోతుం పౌరాణికీం కథామ్ ॥
తదా తమనుకూలాభిర్వాగ్భిః పూజ్య మహర్షయః ।
అతీవాభిముఖం కృత్వా వచనం చేదమబ్రువన్ ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

జగన్మాతతో, గణములతో మరియు పుత్రులతో కూడియున్నవాడు, ప్రకృతిని మరియు జీవులను నియంత్రించువాడు, సృష్టిస్థితిలయములకు కారణమైనవాడు అగు శివుని కొరకు నమస్కారము (1). ఏ ఈశ్వరుని సాటిలేని శక్తి, సర్వవ్యాపకమగు ఈశ్వరభావము, స్వామి అయి ఉండుట, సర్వమునందు

ఉపాదానకారణముగా అనువృత్తమగుట అను లక్షణములు మాయామూలకములని చెప్పబడుచున్నవో (2), పుట్టుక లేనివాడు, జగత్తును సృష్టించినవాడు, శాశ్వతుడు, మంగళకరుడు, వినాశము లేనివాడు, దేవతలలో శ్రేష్ఠుడు, సర్వజగత్తునకు ఆత్మ అయినవాడు అగు అట్టి శివుని శరణు వేడుచున్నాను (3). నైమిషారణ్యములో ధర్మస్థానము, గొప్ప క్షేత్రము, గంగాయమునాసంగమము, బ్రహ్మలోకమునకు మార్గము అగు ప్రయాగలో (4) ప్రశంసించదగిన అంతఃకరణము గలవారు, సత్యము అనే వ్రతమునందు తత్పరత గలవారు, గొప్ప తేజశ్శాలురు, మహాత్ములు అగు మునులు పెద్ద సత్రయాగమును చేసిరి (5). గొప్ప కార్యములను తేలికగా సాధించే ఆ మహర్షులు అచట సత్రయాగమును చేయుచున్నారని విని, సాక్షాత్తుగా సత్యవతీపుత్రుడు మరియు మహాబుద్ధిశాలియగు వేదవ్యాసుని శిష్యుడు, మహాత్ముడు, ప్రజ్ఞాశాలి, ముల్లోకములలో పేరు గాంచినవాడు, అయిదు అంశములు గల తార్కికుల అనుమానవాక్యములలోని గుణదోషములు తెలిసినవాడు (6,7), బృహస్పతి అడిగే ప్రశ్నలకైననూ ఉత్తరమునీయగలవాడు, చెవులకు ఇంపుగా మనస్సునకు ఉల్లాసమును కలిగించు విధముగా అందమగు పదములతో కథలను చెప్పుటలో నిష్ణాతుడు, కాలస్వరూపము తెలిసినవాడు, నీతిశాస్త్ర వేత్త, మహాజ్ఞాని, పౌరాణికులలో ఉత్తముడు అగు సూతుడు ఆ స్థానమునకు విచ్చేసెను (8, 9). ఆ సూతమహర్షి వచ్చుచుండగా చూచి ఆనందముతో నిండిన హృదయములు గల మహర్షులు ఆయనకు ఎదురేగి స్వాగతవచనములను పలికి యథావిధిగా పూజించిరి (10). మునులచే ఈయబడిన ఆ సత్కారమును ఆయన స్వీకరించి, వారిచే చూపించబడి తనకు ఉద్దేశించబడిన తనకు తగిన ఆసనమునందు కూర్చుండెను (11). పవిత్రమగు అంతఃకరణముగల మునులకు ఆయనను కలియుట మాత్రము చేతనే మనస్సులో పురాణగాథను వినాలనే ఉత్కంఠ బయలుదేరెను (12). అపుడు ఆ మహర్షులు ఆయనను మధురవచనములతో పూజించి, తమ విషయములో మిక్కిలి ప్రసన్నముగా చేసుకొని, ఈ విధముగా పలికిరి.

**ఋషయ ఊచుః ।**

**రోమహర్షణ సర్వజ్ఞ భవాన్నై భాగ్యగౌరవాత్ ।**
**సంప్రాప్తోఽద్య మహాభాగ శైవరాజ మహామతే ॥**
**పురాణవిద్యామఖిలాం వ్యాసాత్ప్రత్యక్షమీయివాన్ ।**
**తస్మాదాశ్చర్యభూతానాం కథానాం త్వం హి భాజనమ్ ॥**
**రత్నానామురుసారాణాం రత్నాకర ఇవార్ణవః ।**
**యచ్చ భూతం యచ్చ భవ్యం యచ్చాన్యద్వస్తు వర్తతే ॥**
**న తవావిదితం కించిత్త్రిషు లోకేషు విద్యతే ।**
**త్వమదృష్టవశాదస్మద్దర్శనార్థమిహాగతః ।**
**అకుర్వన్ కిమపి శ్రేయో న వృథా గంతుమర్హసి ॥**
**తస్మాచ్ఛ్రావ్యతరం పుణ్యం సత్కథాజ్ఞానసంహితమ్ ।**
**వేదాంతసారసర్వస్వం పురాణం శ్రావయాశు నః ॥**

ఏవమభ్యర్థితస్సూతో మునిభిర్వేదవాదిభిః ।
శ్లక్ ష్ణాం చ న్యాయసంయుక్తాం ప్రత్యువాచ శుభాం గిరమ్ ॥

ఋషులు ఇట్లు పలికిరి -

రోమహర్షణా! (శరీరములో గగుర్పాటు కలిగే విధముగా కథలను చెప్పువాడా!) మహాత్మా! శి◌ివభక్తాగ్రగణ్యా! మహాబుద్ధిశాలీ! మా భాగ్యము గొప్పది అగుట వలన సర్వజ్ఞుడవగు నీవు ఈనాడు ఇచటకు విచ్చేసితివి (14). నీవు సాక్షాత్తుగా వ్యాసుని వద్దనుండి సమస్తమగు పురాణవిద్యను పొందియుంటివి. కావున, గొప్ప విలువైన రత్నములకు సముద్రము వలె, ఆశ్చర్యకరమగు గాథలకు నీవు నిధివి. భూతభవిష్యద్వర్తమానకాలములలో ముల్లోకములలో ఏయే వస్తువులు గలవో, వాటిలో నీకు తెలియనిది ఏదీ లేదు. నీవు మా భాగ్యవశముచే మమ్ములను చూచుటకు ఇచటకు వచ్చితివి. మాకు ఏదో కొంత శ్రేయస్సును కలిగించకుండగా వ్యర్థముగా మరలి పోవుట నీకు తగదు ( 15-17). కావున, వినుటకు ఇంపైనది, పవిత్రమైనది, మంచి కథల జ్ఞానముయొక్క సమాహారరూపమైనది, ఉపనిషత్తుల సారమునంతనూ తనలో ఇముడ్చుకున్నది అగు పురాణమును మాకు వెంటనే వినిపింపుము (18). వేదవేత్తలగు ఆ మునులచే అభ్యర్థింపబడిన సూతుడు అర్థగౌరవము గలది, మధురమైనది, శుభకరమైనది అగు వచనమును ఈ విధముగా బదులు చెప్పెను.

సూత ఉవాచః

పూజితోఽనుగృహీతశ్చ భవద్భిరితి చోదితః ।
కస్మాత్సమ్యఙ్ న విబ్రూయాం పురాణమృషిపూజితమ్ ॥
అభివంద్య మహాదేవం దేవీం స్కందం వినాయకమ్ ।
నందినం చ తథా వ్యాసం సాక్షాత్సత్యవతీసుతమ్ ॥
వక్ష్యామి పరమం పుణ్యం పురాణం వేదసమ్మితమ్ ।
శివజ్ఞానార్ణవం సాక్షాద్భుక్తిముక్తిఫలప్రదమ్ ॥
శబ్దార్థన్యాయసంయుక్తైరాగమార్థైర్విభూషితమ్ ।
శ్వేతకల్ప ప్రసంగేన వాయునా కథితం పురా ॥
విద్యాస్థానాని సర్వాణి పురాణానుక్రమం తథా ।
తత్పురాణస్య చోత్పత్తిం బ్రువతో మే నిబోధత ॥
అంగాని వేదాశ్చత్వారో మీమాంసాన్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యాశ్చైతాశ్చతుర్దశ ॥
ఆయుర్వేదో ధనుర్వేదో గంధర్వశ్చేత్యనుక్రమాత్।
అర్థశాస్త్రం పరం తస్మాద్విద్యా హ్యష్టాదశ స్మృతాః ॥
అష్టాదశానాం విద్యానామేతాసాం భిన్నవర్త్మనామ్ ।
ఆదికర్తా కవిస్సాక్షాచ్ఛూలపాణిరితి శ్రుతిః ॥
స హి సర్వజగన్నాథస్సిసృక్షురఖిలం జగత్ ।
బ్రహ్మాణం విదధే సాక్షాత్పుత్రమగ్రే సనాతనమ్ ॥

తస్మై ప్రథమపుత్రాయ బ్రహ్మణే విశ్వయోనయే ।
విద్యాశ్చేమా దదౌ పూర్వం విశ్వసృష్ట్యర్థమీశ్వరః ॥
పాలనాయ హరిం దేవం రక్షాశక్తిం దదౌ తతః ।
మధ్యమం తనయం విష్ణుం పాతారం బ్రహ్మణో ఒ పి హి ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఈ విధముగా నన్ను ప్రేరేపించుట ద్వారా మీరు నన్ను పూజించి అనుగ్రహించినారు. ఇట్టి స్థితిలో ఋషులచే పూజింపబడే పురాణమును చక్కగా ఏల చెప్పకుందును? (20) మహాదేవుని, పార్వతీదేవిని, కుమారస్వామిని, వినాయకుని, నందీశ్వరుని మరియు సాక్షాత్తుగా సత్యవతియొక్క పుత్రుడగు వ్యాసుని నమస్కరించి (21), పరమపవిత్రమైనది, వేదముతో సమానమైనది, శివజ్ఞానమునకు సముద్రము వంటిది, సాక్షాత్తుగా భుక్తి మరియు ముక్తి అనే ఫలములను ఇచ్చునది, సుందరమగు శబ్దములు అర్థాలంకారములు యుక్తులు వేదార్థములు అనువాటితో కూడి శోభిల్లునది అగు పురాణమును చెప్పెదను. శ్వేతవరాహకల్పమునందు పూర్వము దీనిని వాయువు చెప్పియున్నాడు (22,23). సకలవిద్యాస్థానములను, పురాణముల క్రమమును, ఆ పురాణముల ఉత్పత్తిని నేను చెప్పెదను; గమనించుడు (24). ఆరు వేదాంగములు (శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము, కల్పము, నిరుక్తము), నాలుగు వేదములు, మీమాంస, న్యాయశాస్త్రము, పురాణము మరియు ధర్మశాస్త్ర ము అను పదునాలుగు విద్యలు గలవు (25). వీటికి ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వవేదములను మరియు అర్థశాస్త్రమును కలిపినచో, పదునెనిమిది విద్యలు అగునని మహర్షులు చెప్పుచున్నారు (26). వివిధ విషయములను బోధించే ఈ పదునెనిమిది విద్యలను సృష్టికి ఆరంభములో సర్వజ్ఞుడు, పినాకపాణి అగు శివుడే స్వయముగా రచించినాడని వేదములు చెప్పుచున్నవి (27). సర్వజగత్తులకు తండ్రియగు ఆ శివుడు సకలజగత్తులను సృష్టించగోరి, ముందుగా సనాతనుడగు బ్రహ్మను సాక్షాత్తుగా తన పుత్రునిగా సృజించెను (28). సృష్టికర్త, ఈశ్వరుని మొదటి పుత్రుడు అగు ఆ బ్రహ్మకు ఈశ్వరుడు పూర్వమునందు జగత్తులను సృష్టించుట కొరకై ఈ విద్యలను ఇచ్చియుండెను (29). తరువాత ఆయన తన మధ్యమపుత్రునిగా మరియు బ్రహ్మకు రక్షకునిగా విష్ణుదేవుని సృష్టించి, ఆయనకు రక్షించే సామర్థ్యము నొసంగెను.

లబ్ధవిద్యేన విధినా ప్రజాసృష్టిం వితన్వతా ।
ప్రథమం సర్వశాస్త్రా ణాం పురాణం బ్రహ్మణా స్మృతమ్ ॥
అనంతరం తు వక్త్రే భ్యో వేదాస్తస్య వినిర్గతాః ।
ప్రవృత్తిస్సర్వశాస్త్రా ణాం తన్ముఖాదభవత్తతః ॥
యదాస్య విస్తరం శక్తా నాధిగంతుం ప్రజా భువి ।
తదా విద్యాసమాసార్థం విశ్వేశ్వరనియోగతః ॥
ద్వాపరాంతేషు విశ్వాత్మా విష్ణుర్విశ్వంభరః ప్రభుః ।
వ్యాసనామ్నా చరత్యస్మిన్నవతీర్య మహీతలే ॥

ఏవం వ్యస్తాశ్చ వేదాశ్చ ద్వాపరే ద్వాపరే ద్విజాః ।
నిర్మితాని పురాణాని అన్యాని చ తతః పరమ్ ॥
స పునర్ద్వాపరే చాస్మిన్ కృష్ణద్వైపాయనాఖ్యయా ।
అరణ్యామివ హవ్యాశీ సత్యవత్యామజాయత ॥
సంక్షిప్య చ పునర్వేదాంశ్చతుర్ధా కృతవాన్మునిః ।
వ్యస్తవేదతయా లోకే వేదవ్యాస ఇతి శ్రుతః ॥
పురాణానాం చ సంక్షిప్తం చతుర్లక్షప్రమాణతః ।
అద్యాపి దేవలోకే తచ్ఛతకోటిప్రవిస్తరమ్ ॥
యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదాన్ ద్విజః ।
న చేత్పురాణం స విద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥
ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రతరిష్యతి ॥

బ్రహ్మ విద్యలను పొంది ప్రజలను సృష్టించుచూ, సర్వశాస్త్రములలో ప్రధానమగు పురాణమును స్మరించెను (31). తరువాత ఆయన ముఖములనుండి వేదములు ఉద్భవించినవి. తరువాత ఆయన ముఖమునుండి సకలశాస్త్ర ములు పుట్టినవి (32). భూలోకములో జనులకు ఈ విశాలమగు పురాణవాఙ్మయమును తెలుసుకొనే సామర్థ్యము లేకుండెను. అపుడు ఈ విద్యలను సంగ్రహించి చిన్నవిగా చేయుట కొరకై విశ్వేశ్వరునిచే ఆదేశింపబడి (33), జగత్తునకు ఆత్మయై జగత్తును రక్షించువాడు, సర్వసమర్థుడు అగు విష్ణువు వ్యాసుడు అను పేరుతో ఈ భూలోకమునందు అవతరించి సంచరించుచున్నాడు (34). ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా ప్రతి ద్వాపరయుగమునందు వేదములు విభాగము చేయబడును. తరువాత పురాణములు, మరియు ఇతరశాస్త్ర ములు నిర్మించబడును (35). ఆ వ్యాసుడు ద్వాపరయుగమునందు కృష్ణద్వైపాయనుడు అను పేరుతో అరణియందు అగ్ని వలె సత్యవతియందు జన్మించెను (36). ఆ ముని వేదములను సంక్షేపము చేసి నాలుగు భాగములుగా విభజించెను. అట్లు విభాగమును చేయుటచే ఆయనకు లోకమునందు వేదవ్యాసుడను ప్రసిద్ధి కలిగినది (37). ఈ నాటికీ దేవలోకములో వంద కోట్ల శ్లోకముల విస్తారము గల పురాణములను ఆయన నాలుగు లక్షల శ్లోకములలోనికి సంక్షేపించినాడు (38). నాలుగు వేదములను అంగములతో మరియు ఉపనిషత్తులతో సహా నేర్చిన బ్రాహ్మణుడైననూ, పురాణములను తెలియకున్నచో ఆతడు పండితుడు కాజాలడు (39). వేదముల అర్థమును ఇతిహాసపురాణముల సాహాయ్యముతో వ్యాఖ్యానించి విస్తరింపజేయ వలెను. తక్కువ విజ్ఞానము గలవానిని చూచి వీడు నన్ను మోసగించునని వేదము భయపడుచుండును.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ ।
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్ ॥
దశధా చాష్టధా చైతత్పురాణముపదిశ్యతే ।
బృహత్సూక్ష్మప్రభేదేన మునిభిస్తత్త్వవిత్తమైః ॥

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ శైవం భాగవతం తథా ।
భవిష్యం నారదీయం చ మార్కండేయమతః పరమ్ ॥
ఆగ్నేయం బ్రహ్మవైవర్తం లైంగం వారాహమేవ చ ।
స్కాందం చ వామనం చైవ కౌర్మం మాత్స్యం చ గారుడమ్ ॥
బ్రహ్మాండం చేతి పుణ్యో ఽ యం పురాణానుమనుక్రమః ।
తత్ర శైవం తురీయం యచ్ఛార్వం సర్వార్థసాధకమ్ ॥
గ్రంథో లక్షప్రమాణం తద్వ్యస్తం ద్వాదశసంహితమ్ ।
నిర్మితం తచ్ఛివేనైవ తత్ర ధర్మః ప్రతిష్ఠితః ॥
తదుక్తేనైవ ధర్మేణ శైవాస్త్రై వర్ణికా నరాః ।
తస్మాద్విముక్తిమన్విచ్ఛన్ శివమేవ సమాశ్రయేత్ ॥
తమాశ్రిత్యైవ దేవానామపి ముక్తిర్న చాన్యథా ॥
యదిదం శైవమాఖ్యాతం పురాణం వేదసంమితమ్ ।
తస్య భేదాన్ సమాసేన బ్రువతో మే నిబోధత ॥

సృష్టి, అవాంతరసృష్టి, రాజవంశములు, మన్వంతరములు, వివిధకాలములలో రాజవంశముల చరిత్ర అను ఐదు అంశములు పురాణములలో వర్ణింపబడును (41). తత్త్వవేత్తలలో అగ్రగణ్యులగు మునులు పది పెద్ద పురాణములను, ఎనిమిది సూక్ష్మ (తక్కువ శ్లోకసంఖ్య గలవి) పురాణములను ఉపదేశించుచున్నారు (42). బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, భవిష్య, నారద, మార్కండేయ (43), అగ్ని, బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, స్కాంద, వామన, కూర్మ, మత్స్య, గరుడ (44), బ్రహ్మాండ పురాణములు అనే ఈ పురాణ క్రమము పవిత్రమైనది. దానిలో నాల్గవది యగు శివపురాణము లయకర్తయగు శివుని గురించి బోధించి సకలప్రయోజనములను సిద్ధింప జేయును (45). లక్ష శ్లోకములు కలిగి పన్నెండు సంహితలుగా విభజింపబడియున్న ఆ పురాణమును శివుడే నిర్మించినాడు. దానియందు ధర్మము స్థిరముగా బోధింపబడియున్నది (46). మూడు వర్ణముల మానవులు దానిలో చెప్పబడిన ధర్మముచే మాత్రమే శివభక్తులు అగుచున్నారు. కావున, మోక్షమును కోరు మానవుడు శివుని మాత్రమే శరణు వేడవలెను (47). దేవతలకైననూ శివుని ఆశ్రయించుటచే మాత్రమే మోక్షము లభించును; మరియొక మార్గము లేదు (48). ఈ శివపురాణము వేదములతో సమానమైనదని నేను చెప్పియుంటిని. దానిలోని విభాగములను సంగ్రహముగా చెప్పెదను. తెలుసుకొనుడు.

విద్యేశ్వరం తథా రౌద్రం వైనాయకమనుత్తమమ్ ।
ఔమం మాతృపురాణం చ రుద్రైకాదశకం తథా ॥
కైలాసం శతరుద్రం చ కోటిరుద్రాఖ్యమేవ చ ।
సహస్రకోటిరుద్రాఖ్యం వాయవీయం తతః పరమ్ ॥
ధర్మసంజ్ఞం పురాణం చేత్యేవం ద్వాదశ సంహితాః ।
విద్యేశం దశసాహస్రముదితం గ్రంథసంఖ్యయా ॥

రౌద్రం వైనాయకం చౌమం మాతృకాఖ్యం తతః పరమ్ ।
ప్రత్యేకమష్టసాహస్రం త్రయోదశసహస్రకమ్ ॥
రుద్రై కదశకాఖ్యం యత్కైలాసం షట్ సహస్రకమ్ ।
శతరుద్రం త్రిసాహస్రం కోటిరుద్రం తతః పరమ్ ॥
సహస్రై ర్నవభిర్యుక్తం సర్వార్థజ్ఞానసంయుతమ్ ।
సహస్రకోటిరుద్రాఖ్యమేకాదశసహస్రకమ్ ॥
చతుస్సహస్రసంఖ్యేయం వాయవీయమనుత్తమమ్ ।
ధర్మసంజ్ఞం పురాణం యత్తద్ద్వాదశసహస్రకమ్ ॥
తదేవం లక్షముద్దిష్టం శైవం శాఖావిభేదతః ।
పురాణం వేదసారం తద్భుక్తిముక్తిఫలప్రదమ్ ॥
వ్యాసేన తత్తు సంక్షిప్తం చతుర్వింశత్సహస్రకమ్ ।
శైవం తత్ర పురాణం వై చతుర్థం సప్తసంహితమ్ ॥
విద్యేశ్వరాఖ్యా తత్రాద్యా ద్వితీయా రుద్రసంహితా ।
తృతీయా శతరుద్రాఖ్యా కోటిరుద్రా చతుర్థికా ॥
పంచమీ కథితా చోమా షష్టీ కైలాససంహితా ।
సప్తమీ వాయవీయాఖ్యా సప్తైవం సంహితా ఇహ ॥

విద్యేశ్వర-రుద్రసంహితలు, సర్వశ్రేష్ఠమగు వినాయకసంహిత, ఉమాసంహిత, మాతృపురాణము, రుద్రైకాదశక (50), కైలాస, శతరుద్ర, కోటిరుద్ర, సహస్రకోటిరుద్ర, వాయవీయ (51), ధర్మపురాణసంహితలు అనే పన్నెండు సంహితలు ఈ పురాణమునందు గలవు. విద్యేశ్వరసంహితయందు పదివేల శ్లోకములు గలవని చెప్పబడినది (52). రుద్ర, వినాయక, ఉమా, మాతృకములనే సంహితలలో ఒక్కొక్క దానియందు ఎనిమిది వేలు, రుద్రై కాదశకసంహితయందు పదమూడు వేలు, కైలాససంహితయందు ఆరు వేలు, శతరుద్రసంహితయందు మూడు వేలు, కోటి రుద్రసంహితయందు తొమ్మిది వేలు శ్లోకములు గలవు. సర్వవిషయముల జ్ఞానముతో కూడియున్న సహస్రకోటిరుద్రసంహితయందు పదకొండు వేల శ్లోకములు గలవు (53-55). సర్వశ్రేష్ఠమగు ఈ వాయవీయసంహితలో నాలుగు వేలు, ధర్మపురాణసంహితయందు పన్నెండు వేల శ్లోకములు గలవు (56). ఈ విధముగా వేదముల సారము, భుక్తి మరియు ముక్తి అనే ఫలములను ఇచ్చునది అగు శివపురాణములోని లక్ష శ్లోకములు వివిధసంహితల రూపములో విభజింపబడి యున్నవి (57). వ్యాసుడు దానిని ఇరవై నాలుగు వేల శ్లోకములలోనికి కుదించినాడు. పురాణములలో నాల్గవది యగు ఈ శివపురాణమునందు ఏడు సంహితలు గలవు (58). దానిలో మొదటిది విద్యేశ్వరసంహిత, రెండవది రుద్రసంహిత, మూడవది శతరుద్రసంహిత, నాల్గవది కోటిరుద్రసంహిత (59). అయిదవది ఉమాసంహిత, ఆరవది కైలాససంహిత, ఏడవది వాయవీయ సంహిత. ఈ విధముగా దీనియందు ఏడు సంహితలు గలవు.

విద్యేశ్వరం ద్విసాహస్రం రౌద్రం పంచశతాయుతమ్ ।
త్రింశత్తథా ద్విసాహస్రం సార్ధైకశతమీరితమ్ ॥
శతరుద్రం తథా కోటిరుద్రం వ్యోమయుగాధికమ్ ।
ద్విసాహస్రం చ ద్విశతం తథోమం భూసహస్రకమ్ ॥
చత్వారింశత్సాష్టశతం కైలాసం భూసహస్రకమ్ ।
చత్వారింశచ్చ ద్విశతం వాయవీయమతః పరమ్ ॥
చతుస్సహస్రసంఖ్యాకమేవం సంఖ్యావిభేదతః ।
శ్రుతం పరమపుణ్యం తు పురాణం శివసంజ్ఞకమ్ ॥
చతుస్సహస్రకం యత్తు వాయవీయముదీరితమ్ ।
తదిదం వర్తయిష్యామి భాగద్వయసమన్వితమ్ ॥
నావేదవిదుషే వాచ్యమిదం శాస్త్ర మనుత్తమమ్ ।
న చైవాశ్రద్దధానాయ నాపురాణవిదే తథా ॥
పరీక్షితాయ శిష్యాయ ధార్మికాయానసూయవే ।
ప్రదేయం శివభక్తాయ శివధర్మానుసారిణే ॥
పురాణసంహితా యస్య ప్రసాదాన్మయి వర్తతే ।
నమో భగవతే తస్మై వ్యాసాయామితతేజసే ॥
ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే
విద్యావతారకథనం నామ ప్రథమోఽధ్యాయః ॥

విద్యేశ్వరసంహితయందు రెండు వేలు, రుద్రసంహితయందు పదివేల అయిదు వందలు, శతరుద్రసంహితయందు రెండు వేల నూట ఎనభై, కోటిరుద్రసంహితయందు రెండు వేల రెండు వందల నలభై, ఉమాసంహితయందు ఒక వేయి ఎనిమిది వందల నలభై, కైలాససంహితయందు ఒక వేయి రెండు వందల నలభై మరియు వాయవీయ సంహితయందు నాలుగు వేల శ్లోకములు గలవు. ఈ విధముగా పరమపవిత్రమగు శివపురాణములో శ్లోకముల సంఖ్య చెప్పబడినది (61-64). నాలుగు వేల శ్లోకములతో రెండు భాగములుగా విభజింపబడి యున్న ఈ వాయవీయసంహితను నేను ఇప్పుడు ఆరంభించి చెప్పెదను (65). సర్వోత్తమమగు ఈ శాస్త్ర మును వేదవేత్త కానివానికి, శ్రద్ధ లేనివానికి మరియు పురాణములు తెలియని వానికి చెప్పరాదు (66). ధర్మబుద్ధి గలవాడు, అసూయ (గుణములయందు దోషములను ఎత్తి చూపుట) లేనివాడు, శివభక్తుడు, శివధర్మమును అనుసరించువాడు అగు శిష్యుని పరీక్షించి చెప్పవలెను (67). ఎవని అనుగ్రహముచే నాకు పురాణజ్ఞానము అలవడినదో, మహాతేజశ్శాలియగు అట్టి వ్యాసభగవానునకు నమస్కారమగుగాక!

శ్రీశివమహాపురాణములోని వాయవీయసంహితలో పూర్వభాగమునందు పురాణ స్వరూపమును నిరూపించే మొదటి అధ్యాయము ముగిసినది.

# 2 – మునులు బ్రహ్మను ప్రశ్నించుట

సూత ఉవాచ।

పురా కాలేన మహతా కల్పే ఽ తీతే పునః పునః ।
అస్మిన్నుపస్థితే కల్పే ప్రవృత్తే సృష్టికర్మణి ॥
ప్రతిష్ఠితాయాం వార్తాయాం ప్రబుద్ధాసు ప్రజాసు చ ।
మునీనాం షట్కులీయానాం బ్రువతామితరేతరమ్ ॥
ఇదం పరమిదం నేతి వివాదస్సుమహానభూత్ ।
పరస్య దుర్నిరూపత్వాన్న జాతస్తత్ర నిశ్చయః ॥
తే ఽ భిజగ్ముర్విధాతారం ద్రష్టుం బ్రహ్మాణమవ్యయమ్ ।
యత్రాస్తే భగవాన్ బ్రహ్మా స్తూయమానస్సురాసురైః ॥
మేరుశృంగే శుభే రమ్యే దేవదానవసంకులే ।
సిద్ధచారణసంబాధే యక్షగంధర్వసేవితే ॥
విహంగసంఘసంఘుష్టే మణివిద్రుమభూషితే ।
నికుంజకందరదరీగుహానిర్ఝ రశోభితే ॥
తత్ర బ్రహ్మవనం నామ నానామృగసమాకులమ్ ।
దశయోజనవిస్తీర్ణం శతయోజనమాయతమ్ ॥
సురసామలపానీయపూర్ణరమ్యసరోవరమ్ ।
మత్తభ్రమరసంఛన్నరమ్యపుష్పితపాదపమ్ ॥
తరుణాదిత్యసంకాశం తత్ర చారు మహత్పురమ్ ।
దుర్ధర్షం బలదృప్తానాం దైత్య దానవరక్షసామ్ ॥
తప్తజాంబూనదమయం ప్రాంశుప్రాకారతోరణమ్ ।
నిర్వ్యూహవలభీకూటప్రతోలీశతమండితమ్ ॥
మహార్హమణిచిత్రాభిర్లేలిహానమివాంబరమ్ ।
మహాభవనకోటిభిరనేకాభిరలంకృతమ్ ॥

సూతుడు ఇట్లు పలికెను –

పూర్వము చాల కాలము క్రితము అనేకకల్పములు గడచిన తరువాత ఈ కల్పము వచ్చి సృష్టి ఆరంభమయ్యెను (1). మానవులు తెలివితేటలు గలవారైరి. వారియందు సంస్కృతీ సంప్రదాయములు స్థిరపడెను. ఆరు కులములకు చెందిన మునుల మధ్యలో పరస్పర సంభాషణలు జరిగినవి (2). ఇది గొప్ప; ఇది దీనికంటే గొప్ప అంటూ పెద్ద వివాదము చెలరేగెను. కాని, ఏది గొప్ప అను విషయమును నిరూపించుట చాల క్లేశముతో కూడిన పని యగుటచే, వారు ఆ సమయములో ఒక నిశ్చయమునకు రాలేకపోయిరి (3). వారు వినాశము లేని బ్రహ్మను చూచుటకు వెళ్లిరి. భగవాన్ బ్రహ్మ దేవతలచే మరియు అసురులచే స్తుతింపబడుచూ బ్రహ్మవనమునందుండెను (4). శుభకరమైనది, సుందరమైనది, దేవదానవులతో రద్దీగానున్నది, సిద్ధచారణుల గుంపులతో కూడియున్నది,

యక్షులచే మరియు గంధర్వులచే సేవింపబడునది, పక్షుల గుంపుల కిలకిలారావములతో నిండియున్నది, మణులతో మరియు పగడములతో అలంకరింపబడియున్నది, పొదరిళ్లు లోయలు కనుమలు మరియు గుహలు అను వాటితో శోభిల్లునది ఆగు మేరుపర్వతశిఖరమునందు (5,6), అనేకమృగములతో హడావుడిగా నున్నది, పది యోజనముల నిడివి, వంద యోజనముల పొడవు గలది, రుచికరమైన స్వచ్ఛమైన నీటితో నిండియున్న అందమగు సరోవరములు గలది, మదించిన తుమ్మెదలచే కప్పివేయబడియున్న సుందరమగు పుష్పములతో కూడిన చెట్లు గలది అగు బ్రహ్మవనమనే పేరుగల అడవి గలదు (7,8). దానిలో ఉదయించే సూర్యుని పోలిన కాంతులు గలది, సుందరమైనది, బలముచే గర్వించియుండే దైత్యులకు దానవులకు మరియు రాక్షసులకు ముట్టడించ శక్యము కానిది, పుటము పెట్టిన బంగారముతో నిండి యున్నది, ఎత్తైన ప్రాకారములు మరియు తోరణములు గలది, వందల సంఖ్యలో దిట్టముగా నిర్మించబడిన డాబాలు ఇళ్లు రాజమార్గములు అనువాటితో ప్రకాశించునది, గొప్ప విలువైన మణులనుండి ప్రసరించే రంగు రంగుల కాంతులు గల అనేకములగు పెద్ద భవనముల సముదాయములతో అలంకరింపబడి ఆకాశమును చుంబించుచున్నదా యన్నట్లు ఉన్నది అగు పెద్ద నగరము గలదు.

**తస్మిన్నివసతి బ్రహ్మా సభ్యైస్సార్ధం ప్రజాపతిః ।**
**తత్ర గత్వా మహాత్మానం సాక్షాల్లోకపితామహమ్ ॥**
**దదృశుర్మునయో దేవా దేవర్షిగణసేవితమ్ ।**
**శుద్ధచామీకరప్రఖ్యం సర్వాభరణభూషితమ్ ॥**
**ప్రసన్నవదనం సౌమ్యం పద్మపత్రాయతేక్షణమ్ ।**
**దివ్యకాంతిసమాయుక్తం దివ్యగంధానులేపనమ్ ॥**
**దివ్యశుక్లాంబరధరం దివ్యమాలావిభూషితమ్ ।**
**సురాసురేంద్రయోగీంద్రవంద్యమానపదాంబుజమ్ ॥**
**సర్వలక్షణయుక్తాంగ్యా లబ్ధచామరహస్తయా ।**
**భ్రాజమానం సరస్వత్యా ప్రభయేవ దివాకరమ్ ॥**
**తం దృష్ట్వా మునయస్సర్వే ప్రసన్నవదనే క్షణాః ।**
**శిరస్యంజలిమాధాయ తుష్టువుస్సురపుంగవమ్ ॥**

ఆ నగరములో ప్రజలకు ప్రభువు అగు బ్రహ్మ సభాసదులతో గూడి నివసిం◌ంచును. మునులు మరియు దేవతలు అచటకు వెళ్లి, మహాత్ముడు, సాక్షాత్తుగా లోకములకు పితామహుడు, దేవర్షుల గణములచే సేవింపబడువాడు, మేలిమి బంగారపు మేని కాంతి గలవాడు, సకలములగు ఆభరణములచే అలంకరింప బడినవాడు, ప్రసన్నమగు ముఖము గలవాడు, ఉల్లాసముతో నిండిన మనస్సు గలవాడు, పద్మపు రేకులవంటి నిడివి కన్నులు గలవాడు, దివ్యమగు కాంతితో కూడియున్నవాడు, దివ్యమగు గంధమును పూసుకున్నవాడు, దివ్యమగు తెల్లని వస్త్ర ములను ధరించినవాడు, దివ్యమగు మాలచే చక్కగా అలంకరింపబడి యున్నవాడు, దేవతలు రాక్షసులు వారి ప్రభువులు యోగిశ్రేష్ఠులు అనువారిచే

నమస్కరింపబడే పాదపద్మములు గలవాడు, సమస్తలక్షణములతో కూడిన అవయవములు కలిగి చేతిలో వింజామరను పట్టుకొని యున్న సరస్వతితో కూడి వెలుతురుతో కూడియున్న సూర్యుని పోలియున్నవాడు అగు బ్రహ్మను చూచిరి ( 12-16). మునులు అందరు ఆ దేవదేవుని చూచి ప్రసన్నమగు ముఖము మరియు కన్నులు గలవారై శిరస్సులపై చేతులను జోడించి స్తోత్రమును చేసిరి.

**మునయ ఊచుః ।**

**నమస్త్రి మూర్తయే తుభ్యం సర్గస్థిత్యంతహేతవే ।**
**పురుషాయ పురాణాయ బ్రహ్మణే పరమాత్మనే ॥**
**నమః ప్రధానదేహాయ ప్రధానక్షోభకారిణే ।**
**త్రయోవింశతిభేదేన వికృతాయావికారిణే ॥**
**నమో బ్రహ్మాండదేహాయ బ్రహ్మాండోదరవర్తినే ।**
**తత్ర సంసిద్ధకార్యాయ సంసిద్ధకరణాయ చ ॥**
**నమోఽస్తు సర్వలోకాయ సర్వలోకవిధాయినే ।**
**సర్వాత్మదేహసంయోగవియోగవిధిహేతవే ॥ ।**
**త్వయైవ నిఖిలం సృష్టం సంహృతం పాలితం జగత్ ।**
**తథాపి మాయయా నాథ న విద్మస్త్వాం పితామహ ॥**

మునులు ఇట్లు పలికిరి –

త్రిమూర్తుల రూపములో సృష్టిస్థితిలయములను చేయువాడు, పురాణపురుషుడు, పరంబ్రహ్మ, పరమాత్మ అగు నీకు నమస్కారము. (18). ప్రకృతియే దేహముగా గలవాడు, ప్రకృతియొక్క సామ్యావస్థయందు సంక్షోభమును కలిగించువాడు, ఇరవై మూడు తత్త్వములుగా వికారమును చెందియున్ననూ వికారములు లేనివాడు అగు నీకు నమస్కారము (19). బ్రహ్మాండమే దేహముగా గలవాడు, బ్రహ్మాండముయొక్క ఉదరమునందు ఉండువాడు, దానిలో పరిపూర్తిచేయబడిన జగత్కార్యము గలవాడు, జగత్తును సృష్టించుటయందు పరిపూర్తిని చెందిన క్రియాశక్తి గలవాడు అగు నీకు నమస్కారము (20). సమస్తలోకముల రూపములోనున్నవాడు, సకల లోకములను, సృష్టించువాడు, ఆత్మకు సమస్త దేహములతో సంయోగ వియోగములు కలుగుటకు కారణమైనవాడు అగు నీకు నమస్కారమగుగాక! (21) నీవే సర్వజగత్తును సృష్టించి పాలించి ఉపసంహరించుచున్నావు. ఓ నాథా! పితామహా! అయిననూ, మేము మాయాప్రభావముచే నిన్ను తెలియలేకున్నాము.

**సూత ఉవాచః**

**ఏవం బ్రహ్మ మహాభాగైర్మహర్షిభిరభిష్టుతః ।**
**ప్రాహ గంభీరయా వాచా మునీన్ ప్రహ్లాదయన్నివ ॥**

సూతుడు ఇట్లు పలికెను -

మహాత్ములగు మహర్షులచే ఆ విధముగా స్తుతించబడిన బ్రహ్మ మునులకు ఆహ్లాదమును కలిగించుచున్నాడా యన్నట్లు గంభీరమగు వాక్కుతో నిట్లనెను.

**బ్రహ్మో వాచః**

**ఋషయో హే మహాభాగా మహాసత్త్వా మహౌజసః ।**
**కిమర్థం సహితాస్సర్వే యూయమత్ర సమాగతాః ॥**
**తమేవంవాదినం దేవం బ్రహ్మాణం బ్రహ్మవిత్తమాః ।**
**వాగ్భిర్వినయగర్భాభిస్సర్వే ప్రాంజలయో ఽ బ్రువన్ ॥**

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ ఋషులారా! మహాత్ములారా! మీరు గొప్ప తేజస్సు మరియు సాత్త్వికస్వభావము గలవారు. మీరందరు కూడగట్టుకొని ఇచటకు వచ్చుటకు కారణమేమి? (24) ఈ విధముగా పలికిన బ్రహ్మదేవునితో బ్రహ్మవేత్తలగు మునులు అందరు చేతులను జోడించినవారై, వినయముతో నిండియున్న వచనములతో ఇట్లు పలికిరి.

మునయ ఊచుః ।

భగవన్నంధకారేణ మహతా వయమావృతాః ।
ఖిన్నా వివదమానాశ్చ న పశ్యామోఽ త్ర యత్పరమ్ ॥
త్వం హి సర్వజగద్ధాతా సర్వకారణకారణమ్ ।
త్వయా హ్యవిదితం నాథ నేహ కించన విద్యతే ॥
కః పుమాన్ సర్వసత్త్వేభ్యః పురాణః పురుషః పరః ।
విశుద్ధః పరిపూర్ణశ్చ శాశ్వతః పరమేశ్వరః ॥
కేనైవ చిత్రకృత్యేన ప్రథమం సృజ్యతే జగత్ ।
తత్త్వం వద మహాప్రాజ్ఞ స్వసందేహాపనుత్తయే ॥
ఏవం పృ ష్టస్తదా బ్రహ్మా విస్మయస్మేరవీక్షణః ।
దేవానాం దానవానాం చ మునీనామపి సన్నిధౌ ॥
ఉత్థాయ సుచిరం ధ్యాత్వా రుద్ర ఇత్యుచ్చరన్ గిరమ్ ।
ఆనందక్లిన్నసర్వాంగః కృతాంజలిరభాషత ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే
మునిప్రశ్నవర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥

మునులు ఇట్లు పలికిరి -

హే భగవాన్! మేము పెను చీకటిచే ఆవరింపబడి ఖేదమును పొందినవారమై కలహించుచున్నాము. ఈ జగత్తులో సర్వోత్కృష్టమైన తత్త్వమును తెలియలేకున్నాము (26). నీవు సకల జగత్తును సృష్టించినవాడవు; కారణములన్నింటికీ కారణమైనవాడవు. ఓ నాథా! ఈ లోకములో నీకు తెలియనిది ఏదీ లేదు (27). సర్వప్రాణులకంటే పూర్వమునందు ఉన్నవాడు, సర్వోత్కృష్టుడు, సంసారదోషములు లేనివాడు, పరిపూర్ణుడు, వినాశము లేనివాడు, పరమేశ్వరుడు అగు పురుషుడు ఎవరు? (28) ఎవని విచిత్రమగు కార్యముచే ముందుగా జగత్తు సృష్టించబడుతున్నది? ఓ మహాబుద్ధిశాలీ! మా సందేహములను పోగొట్టుటకై ఈ సత్యమును చెప్పుము (29). ఈ విధముగా వారు ప్రశ్నించగా, అపుడు బ్రహ్మ ఆశ్చర్యపడినవాడై చిరునవ్వు కన్నులలో కానవచ్చుచుండగా దేవతలు దానవులు మరియు మహర్షుల సన్నిధిలో (30) లేచి నిలబడి చాలసేపు ఆలోచించి రుద్రుడు అను పదమును పలికి, ఆనందముతో గగుర్పాటును చెందిన సకలమగు అవయవములు గలవాడై, చేతులను జోడించి, ఇట్లు పలికెను.

శ్రీ శివ మహాపురాణము లోని వాయవీయ సంహితయందు పూర్వభాగములో మునులు బ్రహ్మను ప్రశ్నించుటను వర్ణించే రెండవ అధ్యాయము ముగిసినది.

# 3 – నైమిషోపాఖ్యానము

బ్రహ్మోవాచః

యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ।
ఆనందం యస్య వై విద్వాన్న బిభేతి కుతశ్చన ॥
యస్మాత్సర్వమిదం బ్రహ్మవిష్ణురుద్రేంద్రపూర్వకమ్ ।
సహ భూతేంద్రియైస్సర్వైః ప్రథమం సంప్రసూయతే ॥
కారణానాం చ యో ధాతా ధ్యాతా పరమకారణమ్ ।
న సంప్రసూయతేఽన్యస్మాత్కుతశ్చన కదాచన ॥
సర్వైశ్వర్యేణ సంపన్నో నామ్నా సర్వేశ్వరస్స్వయమ్ ।
సర్వైర్ముముక్షుభిర్ధ్యేయశ్శంభురాకాశమధ్యగః ॥
యో ఽ గ్రే మాం విదధే పుత్రం జ్ఞానం చ ప్రహిణోతి మే ।
తత్ప్రసాదాన్మయా లబ్ధం ప్రాజాపత్యమిదం పదమ్ ॥
ఈశో వృక్ష ఇవ స్తబ్ధో య ఏకో దివి తిష్ఠతి ।
యేనేదమఖిలం పూర్ణం పురుషేణ మహాత్మనా ॥
ఏకో బహూనాం జంతూనాం నిష్క్రి యాణాం చ సక్రియః ।
య ఏకో బహుధా బీజం కరోతి స మహేశ్వరః ॥
జీవైరేభిరిమాంల్లోకాన్ సర్వానీశో య ఈశతే ।
య ఏకో భగవాన్ రుద్రో న ద్వితీయోఽస్తి కశ్చన ॥
సదా జనానాం హృదయే సన్నివిష్టో ఽ పి యః పరైః ।
అలక్ష్యో లక్షయన్ విశ్వమధితిష్ఠతి సర్వదా ॥
యస్తు కాలాత్స ముక్తాని కారణాన్యఖిలాన్యపి ।
అనంతశక్తిరేవైకో భగవానధితిష్ఠతి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

పరమేశ్వరుని చేరుకొన (వర్ణించ) లేక వాక్కులు మనస్సుతో సహా వెనుదిరుగుచున్నవి. ఆనందస్వరూపుడగు పరమేశ్వరుని తెలుసుకున్న జ్ఞాని దేనివలనైననూ భయపడడు (1). బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు, సర్వభూతములు మరియు ఇంద్రియములతో సహా ఈ సర్వము సృష్ట్యాదియందు ఆయననుండి ఉద్భవించుచున్నది (2). సర్వకారణములను సృష్టించే పరమకారణము పరమేశ్వరుడే. ధ్యానము చేయువాని స్వరూపము ఆయనయే. ఈ జగత్తు ఏ కాలమునందైననూ ఆయనకంటే భిన్నముగా మరియొక కారణమునుండి ఉద్భవించుట లేదు (3). సకలములగు ఐశ్వర్యములతో పూర్ణుడై యున్న ఆయనకు స్వయముగా సర్వేశ్వరుడని పేరు. మోక్షమును కోరువారందరిచే శంభుడు హృదయాకాశములో ధ్యానింపబడుచున్నాడు (4). ఆయన మున్ముందుగా నన్ను తన పుత్రునిగా సృజించి నాకు జ్ఞానమునొసంగెను. ఆయన అనుగ్రహముచే మాత్రమే నేనీ ప్రజాపతి స్థానమును పొందియున్నాను (5).



అద్వితీయుడగు ఆ పరమేశ్వరుడు స్వప్రకాశస్వరూపమునందు వృక్షము వలె అవికారియై ప్రతిష్ఠితుడై యున్నాడు. సర్వజగత్తు ఆత్మగా గల ఆ పరమేశ్వరునిచే ఈ జగత్తు అంతా నిండియున్నది (6). పుట్టి మరణించే ప్రాణులు స్వతః క్రియాశక్తి కలవి గావు. వాటియందు క్రియాశక్తి రూపములో ఈశ్వరుడే ఉన్నాడు. అద్వితీయుడగు ఆ మహేశ్వరుడే మాయాశక్తిని అనేకప్రాణుల రూపములో ప్రకటింపజేయుచున్నాడు (7). ఆ ఈశ్వరుడే జీవులతో నిండియున్న ఈ లోకములను పాలించుచున్నాడు. ఆ రుద్రభగవానుడు అద్వితీయుడు. అనగా, ఆయనకంటే భిన్నముగా రెండవ వస్తువు లేదు (8). కంటికి కానవచ్చే జగత్తునకు సర్వకాలములలో అధిష్ఠానమై యున్న పరమేశ్వరుడు సర్వదా జనుల హృదయములో సుస్పష్టముగా ప్రకటమగుచున్ననూ సామాన్య జనులకు కానరాకున్నాడు (9). అనంతశక్తిస్వరూపుడగు ఆ అద్వితీయ పరమాత్మ మాత్రమే కాలాతీతములగు కారణములకు అన్నింటికీ కూడ అధిష్ఠానమై యున్నాడు.

**న యస్య దివసో రాత్రిర్న సమానో న చాధికః ।**
**స్వాభావికీ పరా శక్తిర్నిత్యా జ్ఞానక్రియే అపి ॥**
**యదిదం క్షరమవ్యక్తం యదప్యమృతమక్షరమ్ ।**
**తావుభావక్షరాత్మానావేకో దేవస్స్వయం హరః ॥**
**ఈశతే తదభిధ్యానాద్యో జనస్తత్త్వభావనః ।**
**భూయో హ్యస్య పశోరంతే విశ్వమాయా నివర్తతే ॥**
**యస్మిన్న భాసతే విద్యుత్ న సూర్యో న చ చంద్రమాః ।**
**యస్య భాసా విభాతీదమిత్యేషా శాశ్వతీ శ్రుతిః ॥**
**ఏకో దేవో మహాదేవో విజ్ఞేయస్తు మహేశ్వరః ।**
**న తస్య పరమం కించిత్పదం సమధిగమ్యతే ॥**
**అయమాదిరనాద్యంతస్స్వభావాదేవ నిర్మలః ।**
**స్వతంత్రః పరిపూర్ణశ్చ స్వేచ్ఛాధీనశ్చరాచరః ॥**
**అప్రాకృతవపుః శ్రీమాంల్లక్ష్యలక్షణవర్జితః ।**
**అయం ముక్తో మోచకశ్చ హ్యకాలః కాలచోదకః ॥**
**సర్వోపరికృతావాసస్సర్వావాసశ్చ సర్వవిత్ ।**
**షడ్విధాధ్వమయస్యాస్య సర్వస్య జగతః పతిః ॥**
**ఉత్తరోత్తరభూతానాముత్తరశ్చ నిరుత్తరః ।**
**అనంతానందసందోహమకరందమధువ్రతః ॥**
**అఖండజగదండానాం పిండీకరణపండితః ।**
**ఔదార్యవీర్యగాంభీర్యమాధుర్యమకరాలయః ॥**

ఈశ్వరునకు రాత్రింబగళ్లు (కాలము) లేవు. ఈశ్వరునితో సమానమైనవాడు గాని, ఆయన కంటే అధికుడు గాని లేడు. నిత్యము, జ్ఞానక్రియారూపము మరియు సర్వకారణము అగు మాయాశక్తి ఆయనయొక్క స్వభావమై (స్వరూపము కంటే భిన్నము కానిదై) యున్నది (11). పరివర్తనశీలమగు

ఈ జగత్తు మరియు దానికి కారణము, అవినాశి, చావు పుట్టుకలు లేనిది అగు మాయాశక్తి అనే రెండు ఆ అక్షరపరబ్రహ్మయే ఆత్మగా కలిగియున్నవి. అట్టి అద్వితీయ స్వయంప్రకాశ పరంబ్రహ్మ శివుడే (12). ఏ మానవుడు సాత్త్వికమగు అంతఃకరణము గలవాడై ఆ పరం బ్రహ్మను ధ్యానించునో, ఆతడు సర్వసమర్థుడగును. ఆతని విషయములో ఈ మాయ తొలగిపోవుటచే జీవభావము నిషిద్ధమై ఆతడు జీవన్ముక్తుడగును (13). మెరుపు, సూర్యుడు, చంద్రుడు అనే జ్యోతిస్సులు ఈశ్వరుని ప్రకాశింప జేయలేవు. ఈ సర్వము ఈశ్వరుని ప్రకాశమునననుసరించి ప్రకాశించుచున్నదని శాశ్వతమగు వేదవచనములు చెప్పుచున్నవి (14). స్వయంప్రకాశస్వరూపుడు, మహాదేవుడు అగు మహేశ్వరుడు అద్వితీయుడని తెలియవలెను. ఆయనకంటే ఉత్కృష్టమైన పొందదగిన గమ్యము మరియొకటి ఏదియు కానవచ్చుట లేదు (15). ఈ పరమేశ్వరుడు ఆది-అంతములు లేనివాడు, స్వభావము చేతనే దోషరహితుడు, స్వతంత్రుడు మరియు పరిపూర్ణుడు. చరాచరజగత్తు ఆయన ఇచ్ఛకు అధీనమై యుండును (16). నిర్గుణుడు, వాక్కులకు మనస్సునకు గోచరము కానివాడు, ముక్తుడు, ముక్తిని ఇచ్చువాడు, కాలాతీతుడు, కాలమును ప్రవర్తింప జేయువాడు అగు పరమేశ్వరుడు దివ్యమగు దేహముతో శోభిల్లుచున్నాడు (17). ఆరు రకముల మార్గములతో కూడియున్న ఈ జగత్తునకంతకూ ప్రభువు, సర్వమునందు ఆత్మరూపముగా నుండే సర్వజ్ఞుడు అగు పరమేశ్వరుడు సర్వమునకు పైన నివసించియున్నాడు (18). ఒకదానికంటే మరియొకటి గొప్పది అనే గణనములో అంతమునందు ఆ ఈశ్వరుడు సర్వోత్కృష్టుడై యుండును. ఆయనకు పైన మరియొకటి లేదు. తేనెయందు తుమ్మెదవలె ఆయన అనంత ఆనంద-ఘన-స్వరూపమునందు ప్రతిష్ఠితుడై యుండును (19). ఔదార్యము, సామర్థ్యము, గాంభీర్యము మరియు మాధుర్యము అను గుణములకు నిధియగు పరమేశ్వరుడు విశాలమగు బ్రహ్మాండములను తనలో ఇముడ్చుకొనుటలో దిట్ట.

**దేవస్య సదృశం వస్తు నాధికం చాపి కించన ।**
**అతులస్సర్వభూతానాం రాజరాజశ్చ తిష్ఠతి ॥**
**అనేన చిత్రకృత్యేన ప్రథమం సృజ్యతే జగత్ ।**
**అంతకాలే పునశ్చేదం తస్మిన్ ప్రలయమేష్యతి ॥**
**అస్య భూతాని వశ్యాని అయం సర్వనియోజకః ।**
**అయం తు పరయా భక్త్యా దృశ్యతే నాన్యథా క్వచిత్ ॥**
**వ్రతాని సర్వదానాని తపాంసి నియమాస్తథా ।**
**కథితాని పురా సద్భిర్భావార్థం నాత్ర సంశయః ॥**
**హరిశ్చాహం చ రుద్రశ్చ తథాన్యే చ సురాసురాః ।**
**తపోభిరుగ్రై రద్యాపి తస్య దర్శనకాంక్షిణః ॥**
**అదృశ్యః పతితైర్మూఢైర్దుర్జనైరపి కుత్సితైః ।**
**భక్తైరంతర్బహిశ్చాపి పూజ్యస్సంభాష్య ఏవ చ ॥**

తదిదం త్రివిధం రూపం స్థూలం సూక్ష్మం తతః పరమ్ ।
అస్మదాద్యమరైర్దృశ్యం స్థూలం సూక్ష్మం చ యోగిభిః ॥
తతః పరం తు యన్నిత్యం జ్ఞానమానందమవ్యయమ్ ।
తన్నిష్ఠైస్తత్పరైర్భక్తైర్దృశ్యం తద్వ్రతమాశ్రితైః ॥
బహునా ऽ త్ర కిముక్తేన గుహ్యాద్గుహ్యతరం పరమ్ ।
శివే భక్తిర్న సందేహస్తయా యుక్తో విముచ్యతే ॥
ప్రసాదాదేవ సా భక్తిః ప్రసాదో భక్తిసంభవః।
యథా చాంకురతో బీజం బీజతో వా యథాంకురః ॥

ఆ పరమేశ్వరునితో సాటి వచ్చే వస్తువు గాని, అధికమగు వస్తువు గాని ఏదియూ లేదు. సాటి లేని ఆ ఈశ్వరుడు రాజులకు రాజుగా నిలబడియున్నాడు (21). లీలలను నెరపే ఆ ఈశ్వరుడు ముందుగా ఈ జగత్తును సృష్టించును. ప్రళయకాలమునందు అది మరల ఆయనలో లీనమగును (22). ప్రాణులు ఆయన వశములో నుండును. సర్వమును నియంత్రించువాడు ఆయనయే. పరా (సర్వోత్కృష్టమగు) భక్తిచే మాత్రమే ఆయన కానవచ్చును. ఆయనను కనుటకు మరియొక మార్గము లేదు (23). వ్రతములు, సకలదానములు, తపస్సులు మరియు నియమములు అంతఃకరణశుద్ధి కొరకు సహకరించునని పూర్వము పెద్దలు చెప్పియున్నారు. దీనిలో సందేహము లేదు (24). విష్ణువు, నేను, రుద్రుడు మరియు ఇతరదేవతలు ఆయనను చూడగోరి ఈ నాటికీ కఠోరమగు తపస్సులను చేయుచున్నారు (25). పతితులు, మూర్ఖులు, దుష్టులు, నీచప్రవృత్తి గలవారు ఆయనను చూడలేరు. భక్తులు ఆయనను తమలో మాత్రమే గాక బయట కూడ పూజించి, ఆయనతో సంభాషించుచుందురు (26). ఆయనకు స్థూలము, సూక్ష్మము మరియు పరము అనే మూడు రూపములు గలవు. మావంటి వారలకు స్థూలరూపము కానవచ్చును. కాని, యోగులు సూక్ష్మరూపమును చూచెదరు (27). ఈ రెండింటికీ అతీతమైనది, నిత్యము, జ్ఞాన-ఆనంద-ఘనము మరియు వినాశము లేనిది అగు రూపమును ఆయనయందు నిష్ఠ గల వారు, ఆయన మాత్రమే చరమలక్ష్యముగా గలవారు, ఆయనయొక్క వ్రతమును ఆశ్రయించిన వారు అగు భక్తులు గాంచెదరు (28). ఈ విషయములో ఇన్ని మాటలేల? శివునియందలి భక్తి రహస్యములలోకెల్లా రహస్యమైనది. అది గలవాడు నిస్సందేహముగా మోక్షమును పొందును (29). మొక్కనుండి విత్తు, విత్తునుండి మొక్క వచ్చినట్లుగా, శివుని అనుగ్రహముచే మాత్రమే ఆ భక్తి అబ్బును; అనుగ్రహము భక్తి వలన కలుగును.

ప్రసాదపూర్వికా ఏవ పశోస్సర్వత్ర సిద్ధయః ।
స ఏవ సాధనైరంతే సర్వైరపి చ సాధ్యతే ॥
ప్రసాదసాధనం ధర్మస్స చ వేదేన దర్శితః ।
తదభ్యాసవశాత్సామ్యం పూర్వయోః పుణ్యపాపయోః ॥
సామ్యాత్ప్రసాదసంపర్కో ధర్మస్యాతిశయస్తతః ।
ధర్మాతిశయమాసాద్య పశోః పాపపరిక్షయః ॥

ఏవం ప్రక్షీణపాపస్య బహుభిర్జన్మభిః క్రమాత్ ।
సాంబే సర్వేశ్వరే భక్తిః జ్ఞానపూర్వా ప్రజాయతే ॥
భావానుగుణమీశస్య ప్రసాదో వ్యతిరిచ్యతే ।
ప్రసాదాత్కర్మసంత్యాగః ఫలతో న స్వరూపతః ॥
తస్మాత్కర్మఫలత్యాగాచ్ఛివధర్మాన్వయశ్శుభః ।
స చ గుర్వనపేక్షశ్చ తదపేక్ష ఇతి ద్విధా ॥
తత్రానపేక్షాత్సాపేక్షో ముఖ్యశ్శతగుణాధికః ।
శివధర్మాన్వయస్యాస్య శివజ్ఞానసమన్వయః ॥
జ్ఞానాన్వయవశాత్పుంసస్సంసారే దోషదర్శనమ్ ।
తతో విషయవైరాగ్యం వైరాగ్యాద్భావసాధనమ్ ॥
భావసిద్ధ్యుపపన్నస్య ధ్యానే నిష్ఠా న కర్మణి ।
జ్ఞానధ్యానాభియుక్తస్య పుంసో యోగః ప్రవర్తతే ॥
యోగేన తు పరా భక్తిః ప్రసాదస్తదనంతరమ్ ।
ప్రసాదాన్ముచ్యతే జంతుర్ముక్తశ్శివసమో భవేత్ ॥

సర్వకాలములలో జీవునకు అనుగ్రహము వలన మాత్రమే సర్వకార్యములు సిద్ధించును. సాధనములన్నింటిచే అంతములో సాధించబడేది ఆ అనుగ్రహము మాత్రమే (31). అనుగ్రహమునకు సాధనము ధర్మము. ఆ ధర్మమును వేదము బోధించుచున్నది. నిత్యము ధర్మమును అనుష్ఠించుట వలన పూర్వమునందలి పుణ్యపాపములు సమానమగును (32). ఇట్టి సామ్యము వలన సాధకునకు పరమేశ్వరుని అనుగ్రహముతో సంపర్కము కలుగును. దాని వలన వాని ధర్మము ఇనుమడించును. ధర్మము ఇనుమడించుట వలన జీవుని పాపములు పూర్తిగా క్షయమగును (33). ఈ విధముగా నశించిన పాపములు గల వ్యక్తికి అనేకజన్మలలో క్రమముగా జగన్మాతతో కూడియున్న ఆ సర్వేశ్వరునియందు జ్ఞానపూర్వకమగు భక్తి ఉదయించును (34). అంతఃకరణశుద్ధిని అనుసరించి ఈశ్వరుని అనుగ్రహములో హెచ్చుతగ్గులు ఉండవచ్చును. ఈశ్వరుని అనుగ్రహముచే కర్మసన్న్యాసము సిద్ధించును. కర్మసన్న్యాసమనగా కర్మల ఫలమును త్యాగము చేయుట మాత్రమే; వాస్తవముగా కర్మలను విడిచిపెట్టుట కాదు (35). అట్టి కర్మఫలత్యాగము వలన శుభకరమగు శివధర్మనిష్ఠ లభించును. శివధర్మము గురువును అపేక్షించేదీ మరియు గురువుయొక్క అపేక్ష లేనిది అని రెండు రకములుగా నున్నది (36). వాటిలో గురువు యొక్క అపేక్ష గల ధర్మము ముఖ్యమైనది; గురువుయొక్క అపేక్ష లేనిదానికంటే వంద రెట్లు గొప్పది. ఈ శివధర్మనిష్ఠ యందు శివజ్ఞానము కూడ సమ్మిళితమై యుండును (37). శివ జ్ఞానము యొక్క సమన్వయము వలన సాధకుడు సంసారములోని దోషములను దర్శించును. దానివలన ఇంద్రియ సుఖములయందు వైరాగ్యము కలుగును. వైరాగ్యము అంతఃకరణశుద్ధికి సాధనము (38). అంతఃకరణశుద్ధి గలవాని నిష్ఠ ధ్యానమునందే గాని కర్మయందు ఉండదు. జ్ఞానము మరియు ధ్యానము అనువాటితో కూడిన పురుషునకు యోగము ఆరంభమగును (39). అట్టి

యోగముచే పరాభక్తి (సర్వోత్కృష్టమగు భక్తి) నెలకొనును. దాని వెనువెంటనే ఈశ్వరానుగ్రహము కలుగును. జీవుడు అట్టి అనుగ్రహముచే మోక్షమును పొంది, శివునితో సమానుడగును.

**అనుగ్రహప్రకారస్య క్రమోఽయమవివక్షితః ।**
**యాదృశీ యోగ్యతా పుంసస్తస్య తాదృగనుగ్రహః ॥**
**గర్భస్థో ముచ్యతే కశ్చిజ్జాయమానస్తథాపరః ।**
**బాలో వా తరుణో వాథ వృద్ధో వా ముచ్యతేఽపరః ॥**
**తిర్యగ్యోనిగతః కశ్చిన్ముచ్యతే నారకో ఽ పరః ।**
**అపరస్తు పదం ప్రాప్తో ముచ్యతే స్వపదక్షయే ॥**
**కశ్చిత్ క్షీణపదో భూత్వా పునరావర్త్య ముచ్యతే ।**
**కశ్చిదధ్వగతస్తస్మిన్ స్థిత్వా స్థిత్వా విముచ్యతే ॥**
**తస్మాన్నైకప్రకారేణ నరాణాం ముక్తిరిష్యతే ।**
**జ్ఞానభావానురూపేణ ప్రసాదేనైవ నిర్వృతిః ॥**
**తస్మాదస్య ప్రసాదార్థం వాఙ్మనోదోషవర్జితాః ।**
**ధ్యాయంతశ్శివమేవైకం సదారతనయాగ్నయః ॥**
**తన్నిష్ఠాస్తత్పరాస్సర్వే తద్యుక్తాస్తదుపాశ్రయాః ।**
**సర్వక్రియాః ప్రకుర్వాణాస్తమేవ మనసా గతాః ॥**
**దీర్ఘసూత్రసమారబ్ధం దివ్యవర్షసహస్రకమ్ ।**
**సత్రాంతే మంత్రయోగేన వాయుస్తత్ర గమిష్యతి ॥**
**స ఏవ భవతాం శ్రేయస్యోపాయం కథయిష్యతి ।**
**తతో వారాణసీ పుణ్యా పురీ పరమశోభనా ॥**
**గంతవ్యా యత్ర విశ్వేశో దేవ్యా సహ పినాకధృక్ ।**
**సదా విహరతి శ్రీమాన్ భక్తానుగ్రహకారణాత్ ॥**

అనుగ్రహము ఈ క్రమములో మాత్రమే లభించునని చెప్పుటలో తాత్పర్యము లేదు. పురుషుని యోగ్యత ఎట్టిదియో, వానికి దానికి తగిన అనుగ్రహము లభించును (41). ఒకడు తల్లి కడుపులో నుండగనే ముక్తుడగును. మరియొకడు పుట్టుచుండగనే ముక్తుడగును. ఇంకొకడు బాల్యములో, యౌవనములో లేదా వృద్ధాప్యములో ముక్తుడగును (42). ఒకానొక జీవి పశుపక్ష్యాదిదేహములో నుండగా ముక్తుడగును. మరియొకడు నరకములోనుండగా ముక్తిని పొందును. మరియొకడు స్వర్గాదిపుణ్యలోకమును పొంది, అచట పుణ్యము క్షీణించి, ఆ లోకము జారి పోవుచుండగా ముక్తుడగును (43). ఒకానొకడు పుణ్యలోకమును కోల్పోయిన తరువాత మరల భూలోకములో జన్మించి ముక్తుడగును. మరియొకడు ఈ విధముగా తిరిగి వచ్చే మార్గములో ఉంటూ ఉండగానే ముక్తుడగును (44). కావున, మానవులు ఒకే విధములో ముక్తులగుదురని చెప్పుట తగదు. జ్ఞానమునకు మరియు అంతఃకరణశుద్ధికి అనురూపమగు అనుగ్రహము వలన మాత్రమే ముక్తి లభించును (45). కావున,

మీరందరు శివుని అనుగ్రహము కొరకె వాక్కులో మరియు మనస్సులో దోషములను విడిచిపెట్టి, భార్య పిల్లలు మరియు అగ్నులతో కూడినవారై అద్వితీయుడగు శివుని మాత్రమే ధ్యానిస్తూ, శివునియందు నిష్ఠ గలవారై, శివుడే పరమలక్ష్యముగా గలవారై, శివునియందు లగ్నమైన మనస్సులు గలవారై, శివుని శరణు పొంది, ఆయనను మాత్రమే మనస్సులో నిలుపుకొని, కర్మలను అన్నింటినీ చేయుడు (46,47). వేయి సంవత్సరములు సాగే దీర్ఘసత్రయాగము మీచే ఆరంభించ బడినది. ఈ సత్రయాగము పూర్తి కాగానే, మంత్రముల ప్రభావముచే ఇచటకు వాయుదేవుడు రాగలడు (48). ఆయనయే మీకు మోక్షమును దానికి కావలసిన ఉపాయములతో సహా బోధించగలడు. తరువాత మీరు పవిత్రమైనది, మిక్కిలి సుందరమైనది అగు వారాణసీ నగరమునకు వెళ్లుడు. అచట శోభాయుక్తుడు, పినాకధారి అగు శివుడు పార్వతీదేవితో కూడి భక్తులననుగ్రహించుట కొరకై సర్వదా విహరించుచుండును.

**తత్రాశ్చర్యం మహద్దృష్ట్వా మత్సమీపం గమిష్యథ ।**
**తతో వః కథయిష్యామి మోక్షోపాయం ద్విజోత్తమాః ॥**
**యేనైకజన్మనా ముక్తిర్యుష్మత్కరతలే స్థితా ।**
**అనేకజన్మసంసారబంధనిర్మోక్షకారిణీ ॥**
**ఏతన్మనోమయం చక్రం మయా సృష్టం విసృజ్యతే ।**
**యత్రాస్య శీర్యతే నేమిస్స దేశస్తపసశ్శుభః ॥**
**ఇత్యుక్త్వా సూర్యసంకాశం చక్రం దృష్ట్వా మనోమయమ్ ।**
**ప్రణిపత్య మహాదేవం విససర్జ పితామహః ॥**
**తే ఽ పి హృష్టతరా విప్రాః ప్రణమ్య జగతాం ప్రభుమ్ ।**
**ప్రయయుస్తస్య చక్రస్య యత్ర నేమిరశీర్యత ॥**
**చక్రం తదపి సంక్షిప్తం శ్లక్ ష్ణం చారుశిలాతలే ।**
**విమలస్వాదుపానీయే నిపపాత వనే క్వచిత్ ॥**
**తద్వనం తేన విఖ్యాతం నైమిషం మునిపూజితమ్ ।**
**అనేకయక్షగంధర్వవిద్యాధరసమాకులమ్ ॥**
**అష్టాదశ సముద్రస్య ద్వీపా గచ్ఛన్ పురూరవాః ।**
**విలాసవశమూర్వశ్యా యాతో దైవేన చోదితః ॥**
**అక్రమేణ హరన్మోహాద్యజ్ఞవాటం హిరణ్మయమ్ ।**
**మునిభిర్యత్ర సంక్రుద్ధైః కుశవజ్రై ర్నిపాతితః ॥**
**విశ్వం సిసృక్షమాణా వై యత్ర విశ్వసృజః పురా ।**
**సత్రమారేభిరే దివ్యం బ్రహ్మేశా గార్హపత్యగాః ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! అచట గొప్ప అద్భుతమును చూచి నా వద్దకు రండు. అపుడు మీకు మోక్షము కొరకై ఉపాయమును బోధించెదను (51). దాని వలన ఒకే ఒక జన్మలో మోక్షము మీకు కరతలామలకము కాగలదు. ఆ మోక్షము మీకు అనేకజన్మల సంసారబంధమునుండి విముక్తిని కలిగించును (52). నేను ఈ

మనస్సుచే సృష్టించబడిన చక్రమును విడిచిపెట్టుచున్నాను. దీని అంచు ఏ స్థలములో భగ్నమగునో, ఆ దేశము తపస్సు చేయుటకు శుభకరమగును (53). ఇట్లు పలికి, పితామహుడు సూర్యుని వలె వెలుగొందే చక్రమును మనస్సుతో సృష్టించి, మహాదేవునకు నమస్కరించి దానిని విడిచిపెట్టెను (54). ఆ బ్రాహ్మణులు కూడ చాల సంతోషించి జగత్తులకు ప్రభువగు బ్రహ్మకు నమస్కరించి, ఆ చక్రముయొక్క ధార విరిగిన స్థలమునకు బయలు దేరిరి (55). ఆ విధముగా విడిచిపెట్ట బడిన ఆ మృదువైన చక్రము స్వచ్ఛము మరియు రుచికరము అగు నీరు గల అడవిలో ఒకానొక స్థలములో సుందరమగు రాతి పలకపై పడెను (56). ఆ కారణముచే మహర్షులచే పూజించబడే ఆ వనమునకు నైమిషారణ్యము అను పేరు వచ్చెను. ఆ వనము అనేకులగు యక్ష గంధర్వ విద్యాధరులతో రద్దీగా నుండును (57). పురూరవ మహారాజు ఊర్వశితో కూడి విహరిస్తూ దైవముచే ప్రేరేపించ బడినవాడై సముద్రములోని పదునెనిమిది ద్వీపములను దాటి అచటకు వెళ్లెను (58). ఆయన అజ్ఞానముచే బంగరు యజ్ఞవాటికను అక్రమముగా హరించుచుండగా, మిక్కిలి కోపించిన మునులు అచట ఆయనను దర్భలను వజ్రములుగా మార్చి పడగొట్టిరి (59). పూర్వము బ్రహ్మచే ఆజ్ఞాపించబడి జగత్తును సృష్టించగోరి ప్రజాపతులు ఇచటనే గార్హపత్యాగ్నిని ఆశ్రయించి సత్రయాగమునారంభించిరి.

**ఋషిభిర్యత్ర విద్వద్భిశ్శబ్దార్థన్యాయకోవిదైః ।**

**శక్తిప్రజ్ఞాక్రియాయోగైర్విధిరాసీదనుష్ఠితః ॥**

**యత్ర వేదవిదో నిత్యం వేదవాదబహిష్కృతాన్ ।**

**వాదజల్పబలైర్ఘ్నంతి వచోభిరతివాదినః ॥**

**స్ఫటికమయమహీభృత్పాదజాభ్యశ్శిలాభ్యః ।**

**ప్రసరదమృతకల్పస్వచ్ఛపానీయరమ్యమ్ ॥**

**అతిరసఫలవృక్షప్రాయమవ్యాలసత్త్వం తపస ఉచితమాసీన్నైమిషం తన్మునీనామ్ ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయ సంహితాయాం పూర్వభాగే నైమిషోపాఖ్యానం నామ తృతీయోఽధ్యాయః ॥**

అచట వ్యాకరణ- మీమాంసా- తర్కశాస్త్రములలో నిష్ణాతులు, విద్వాంసులు అగు ఋషులు శక్తితో, జ్ఞానముతో మరియు కర్మయోగభావనతో కర్మలను అనుష్ఠించిరి (61). అచట నిత్యము అతివాదులగు వేదవేత్తలు వేదధర్మమునుండి బహిష్కరింపబడిన వారిని వాదము మరియు జల్పము (ఇతరుల సిద్ధాంతమును పరుషముగా ఖండించి తన సిద్ధాంతమును స్థాపించుట) అనువాటి బలముచే ఇబ్బంది పెట్టుచుండిరి (62). స్ఫటికములతో నిండియున్న పర్వతముల క్రింది భాగములయందు గల రాళ్లనుండి జారిపడే అమృతతుల్యమైన స్వచ్ఛమగు నీటితో సుందరమైనది, మిక్కిలి రుచికరమగు పళ్లతో కూడిన చెట్లతో నిండియున్నది, హింసను విడనాడిన మృగములు గలది అగు ఆ నైమిషారణ్యము మునుల తపస్సునకు అనుకూలముగా నుండెను.

# 4 – సత్త్రయాగమునకు వాయుదేవుడు విచ్చేయుట

సూత ఉవాచః

తస్మిన్ దేశే మహాభాగా మునయశ్శంసితవ్రతాః ।
అర్చయంతో మహాదేవం సత్త్రమారేభిరే తదా ॥
తత్ర సత్త్రం ప్రవవృతే సర్వాశ్చర్యం మహర్షిణామ్ ।
విశ్వం సిసృక్షమాణానాం పురా విశ్వసృజామివ ॥
అథ కాలే గతే సత్త్రే సమాప్తే భూరిదక్షిణే ।
పితామహనియోగేన వాయుస్తత్రాగమత్స్వయమ్ ॥
శిష్యస్స్వయంభువో దేవస్సర్వ ప్రత్యక్షదృగ్వశీ ।
ఆజ్ఞాయాం మరుతో యస్య సంస్థితాస్సప్తసప్తకాః ॥
ప్రేరయన్ శశ్వదంగాని ప్రాణాద్యాభిస్స్వవృత్తిభిః ।
సర్వభూతశరీరాణాం కురుతే యశ్చ ధారణమ్ ॥
అణిమాదిభిరష్టాభిరైశ్వర్యైశ్చ సమన్వితః ।
తిర్యక్కారాదిభిర్మేధ్యైర్భువనాని బిభర్తి యః ॥
ఆకాశయోనిర్ద్విగుణస్స్పర్శశబ్దసమన్వయాత్ ।
తేజసాం ప్రకృతిశ్చేతి యమాహుస్తత్త్వచింతకాః ॥
తమాశ్రమగతం దృష్ట్వా మునయో దీర్ఘసత్త్రిణః ।
పితామహవచస్స్మృత్వా ప్రహర్షమతులం యయుః ॥
అభ్యుత్థాయ తతస్సర్వే ప్రణమ్యాంబరసంభవమ్ ।
చామీకరమయం తస్మై విష్టరం సమకల్పయన్ ॥
సోఽపి తత్ర సమాసీనో మునిభిస్సమ్యగర్చితః ।
ప్రతినంద్య చ తాన్ సర్వాన్ పప్రచ్ఛ కుశలం తతః ॥

సూతుడు ఇట్లు పలికెను –

మహాత్ములు, కొనియాడబడే వ్రతము గలవారు అగు మునులు అపుడు ఆ స్థానము నం◌ందు మహాదేవుని పూజిస్తూ సత్త్రయాగమునారంభించిరి (1). అచట పూర్వము జగత్తును సృష్టించగోరిన ప్రజాపతుల సత్త్రయాగము వలెనే, సర్వులకు ఆశ్చర్యమును కలిగించే మహర్షుల సత్త్రయాగము కూడ ఆరంభమయ్యెను (2). తరువాత కొంత కాలమునకు అధికమగు దక్షిణలు ఈయబడిన ఆ సత్త్రయాగము పూర్తి అయ్యెను. అపుడు అచటకు బ్రహ్మగారి ఆదేశముచే వాయువు స్వయముగా విచ్చేసెను (3). బ్రహ్మగారి శిష్యుడు, సర్వమును ప్రత్యక్షముగా దర్శించువాడు, స్వతంత్రుడు అగు వాయుదేవుని ఆజ్ఞను నలభై తొమ్మిది మంది మరుత్తులు పాలించుచుందురు (4). ఆయన సర్వకాలములలో తన ప్రాణాపానాదివృత్తులతో అవయవములకు కదిలే శక్తిని ఇస్తూ, సర్వప్రాణుల శరీరములను నిలబెట్టుచున్నాడు (5). అణిమ (తేలికగా అయ్యే సిద్ధి) మొదలగు ఎనిమిది

సిద్ధులతో కూడియున్న ఆయన పవిత్రము చేసే గాలులను భూమికి సమాంతరముగా వీచి, లోకములను నిలబెట్టుచున్నాడు (6). ఆకాశమునుండి పుట్టినవాడు, శబ్దము మరియు స్పర్శ అనే రెండు గుణములు ఉండుటచే ఆకాశము కంటే రెట్టింపు గుణములు గలవాడు అగు వాయువు అగ్నికి కారణమని తత్త్వములను వర్ణించే విద్వాంసులు చెప్పెదరు (7). ఆశ్రమమునకు విచ్చేసిన ఆ వాయువును చూచి దీర్ఘమగు సత్రయాగమును చేసియున్న మునులు బ్రహ్మగారి మాటలను గుర్తు చేసుకొని, సాటి లేని హర్షమును పొందిరి (8). అపుడు వారందరు లేచి నిలబడి, ఆకాశపుత్రుడగు వాయువునకు నమస్కరించి, ఆయన కోరకు బంగరు ఆసనమును ఏర్పాటు చేసిరి (9). ఆయన దానియందు కూర్చుండి మునులచే పూజింపబడినవాడై, వారిని అభినందించి, తరువాత వారిని అందరినీ కుశలప్రశ్నలను వేసెను.

**వాయురువాచః**

**అత్ర వః కుశలం విప్రాః కచ్చిద్వృత్తే మహాక్రతౌ ।**
**కచ్చిద్యజ్ఞహనో దైత్యా న బాధేరన్ సురద్విషః ॥**
**ప్రాయశ్చిత్తం దురిష్టం వా న కశ్చిత్సమజాయత ।**
**స్తోత్రశస్త్ర గ్రహైర్దేవాన్ పితౄన్ పిత్ర్యైశ్చ కర్మభిః ॥**
**కచ్చిదభ్యర్చ్య యుష్మాభిర్విధిరాసీత్స్వనుష్ఠితః ।**
**నివృత్తే చ మహాసత్రే పశ్చాత్కిం వశ్చికీర్షితమ్ ॥**
**ఇత్యుక్తా మునయస్సర్వే వాయునా శివభావినా ।**
**ప్రహృష్టమనసః పూతాః ప్రత్యూచుర్వినయాన్వితాః ॥**

వాయువు ఇట్లు పలికెను –

ఓ బ్రాహ్మణులారా! ఈ గొప్ప యజ్ఞము కొనసాగుతుండగా మీరు ఇచట క్షేమముగా నుంటిరా? యజ్ఞములను చెడగొట్టే రాక్షసులు మిమ్ములను బాధించలేదు గదా? (11) ప్రాయశ్చిత్తము గాని, ఆపద గాని ఏదీ సంభవించ లేదు గదా? స్తోత్రములతో, సూక్తములతో, గ్రహములతో (సోమరసమును గ్రహించే పాత్రలు) దేవతలను మరియు పితృకర్మలతో పితృదేవతలను మీరు యథావిధిగా పూజించి, కర్మకాండను చక్కగా అనుష్ఠించినారా? ఈ గొప్ప సత్రయాగము పూర్తి అయిన తరువాత మీరు ఏమి చేయగోరుచున్నారు? శివుని ధ్యానించే వాయువు ఇట్లు పలుకగా, మునులందరు సంతోషముతో నిండిన మనస్సులు గలవారై, వాయువుయొక్క దర్శనముచే పవిత్రులై, వినయముతో కూడినవారై ఇట్లు పలికిరి.

మునయ ఊచుః ।

అద్య నః కుశలం సర్వమద్య సాధు భవేత్తపః ।
అస్మచ్ఛ్రే యోఽభివృద్ధ్యర్థం భవానత్రాగతో యతః ॥
శృణు చేదం పురా వృత్తం తమసాఽక్రాంతమానసైః ।
ఉపాసితః పురా ఽ స్మాభిర్విజ్ఞానార్థం ప్రజాపతిః ॥
సో ఽప్యస్మాననుగృహ్యాహ శరణ్యశ్శరణాగతాన్ ।
సర్వస్మాదధికో రుద్రో విప్రాః పరమకారణమ్ ॥
తమ ప్రతర్క్యయాథాత్మ్యం భక్తిమానేవ పశ్యతి ।
భక్తిశ్చాస్య ప్రసాదేన ప్రసాదాదేవ నిర్వృతిః ॥
తస్మాదస్య ప్రసాదార్థం నైమిషే సత్రయోగతః ।
యజ్ఞ్యధ్వం దీర్ఘసత్రేణ రుద్రం పరమకారణమ్ ॥
తత్ప్ర సాదేన సత్రాంతే వాయుస్తత్రాగమిష్యతి ।
తన్ముఖాత్ జ్ఞానలాభో వస్తత్ర శ్రేయో భవిష్యతి ॥
ఇత్యాదిశ్య వయం సర్వే ప్రేషితాః పరమేష్ఠినా ।
అస్మిన్ దేశే మహాభాగ తవాగమనకాంక్షిణః ॥
దీర్ఘసత్రం సమాసీనా దివ్యవర్షసహస్రకమ్ ।
అతస్తవాగమాదన్యత్ప్రా ప్యం నో నాస్తి కించన ॥
ఇత్యాకర్ణ్య పురావృత్తమృషీణాం దీర్ఘసత్రిణామ్ ।
వాయుః ప్రీతమనా భూత్వా తత్రాసీన్మునిసంవృతః ॥
తతస్తైర్మునిభిః పృష్టస్తేషాం భావవివృద్ధయే ।
సర్గాది శార్వమైశ్వర్యం సమాసాదవదద్విభుః ॥

ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే వాయు సమాగమో నామ చతుర్థోఽధ్యాయః ॥

మునులు ఇట్లు పలికిరి -

ఈ నాడు మాకు సర్వము కుశలము. ఈనాడు మా తపస్సు బాగుగా నున్నది. ఏలయనగా, మా శ్రేయస్సును అభివృద్ధి చేయుట కోరకై నీవు ఇచటకు విచ్చేసితివి (15). నీవీ పూర్వవృత్తాంతమును వినుము. అజ్ఞానముచే ఆక్రమించబడిన మనస్సులు గల మేము పూర్వము జ్ఞానము కొరకై బ్రహ్మగారిని ఉపాసించితిమి (16). శరణాగతవత్సలుడగు ఆయన శరణుజొచ్చిన మమ్ములను అనుగ్రహించి, ఇట్లు పలికెను. ఓ బ్రాహ్మణులారా! సర్వకారణకారణుడగు రుద్రుడు అందరి కంటే అధికుడు (17). తర్కమునకు అందని ఆయనయొక్క స్వరూపమును భక్తి గలవాడు మాత్రమే చూడగల్గును. శివుని అనుగ్రహము వలన భక్తి కలుగును. అనుగ్రహము వలన మాత్రమే మోక్షము కలుగును (18). కావున, పరమకారణుడగు రుద్రుని అనుగ్రహము కొరకై నైమిషారణ్యములో దీర్ఘకాలము సాగే సత్రయాగమును సాధనముగా చేసుకోని ఆయనను ఆరాధించుడు (19). సత్రయాగము పూర్తి అయిన పిదప, ఆయన యొక్క అనుగ్రహముచే అచటకు వాయుదేవుడు రాగలడు. అపుడు ఆయన ముఖము నుండి మీకు జ్ఞానము లభించి, శ్రేయస్సు కలుగగలదు (20). బ్రహ్మగారు ఈ విధముగా ఆదేశించి మమ్ములను. అందరినీ పంపివేసెను. ఓ మహాత్మా! మేమీ స్థానములో నీ రాకకొరకు ఎదురు చూచుచున్నాము (21). మేము వేయి దివ్యసంవత్సరముల కాలము కొనసాగే దీర్ఘసత్రయాగమును చేయుచున్నాము. కావున, నీ రాకను మించి మరియొక దానిని మేము కోరుట లేదు (22). దీర్ఘమగు సత్రయాగమును చేయుచున్న మునులయొక్క ఈ పూర్వవృత్తాంతమును విని, మునులచే చుట్టువార బడియున్న వాయువు మనస్సులో సంతోషించి, అక్కడ ఉండెను (23). అపుడా మునులు భక్తి వర్ధిల్లుట కొరకై ఆయనను ప్రశ్నించగా, ఆ ప్రభుడు శివునియొక్క సృష్టి మొదలగు ఈశ్వరభావమును గురించి సంగ్రహముగా చెప్పెను.

శ్రీశివమహాపురాణములోని వాయవీయసంహితయొక్క పూర్వభాగమునందు వాయుదేవుడు సత్రయాగమునకు విచ్చేయుటను వర్ణించే నాల్గవ అధ్యాయము ముగిసినది.

# 5 – జీవ స్వరూప నిరూపణము

**సూత ఉవాచః**

**తత్ర పూర్వం మహాభాగా నైమిషారణ్యవాసినః ।**

**ప్రణిపత్య యథాన్యాయం పప్రచ్ఛుః పవనం ప్రభుమ్ ॥**

సూతుడు ఇట్లు పలికెను –

ఆ సమయములో నైమిషారణ్యమునందు నివసించే మహాత్ములగు మునులు ముందుగా వాయుప్రభునకు యథావిధిగా నమస్కరించి ఇట్లు ప్రశ్నించిరి.

**నైమిషీయా ఊచుః ।**

**భవాన్ కథమనుప్రాప్తో జ్ఞానమీశ్వరగోచరమ్ ।**

**కథం చ శిష్యభావస్తే బ్రహ్మణో ఽ వ్యక్తజన్మనః ॥**

నైమిషారణ్యవాసులగు మునులు ఇట్లు పలికిరి –

ఈశ్వరీయమగు జ్ఞానమును నీవు ఎట్లు పొందితివి? పరంబ్రహ్మయొక్క మాయాశక్తినుండి పుట్టిన బ్రహ్మ గారికి నీవు శిష్యుడవు ఎట్లు అయితివి?

**వాయురువాచః**

**ఏకోనవింశతిః కల్పో విజ్ఞేయశ్శ్వేతలోహితః ।**

**తస్మిన్ కల్పే చతుర్వక్త్ర స్స ష్టుకామోఽతపత్తపః ॥**

**తపసా తేన తీవ్రేణ తుష్టస్తస్య పితా స్వయమ్ ।**

**దివ్యం కౌమారమాస్థాయ రూపం రూపవతాం వరః ॥**

**శ్వేతో నామ మునిర్భూత్వా దివ్యాం వాచముదీరయన్ ।**

**దర్శనం ప్రదదౌ తస్మై దేవదేవో మహేశ్వరః ॥**

**తం దృష్ట్వా పితరం బ్రహ్మ బ్రహ్మణోఽధిపతిం పతిమ్ ।**

**ప్రణమ్య పరమజ్ఞానం గాయత్ర్యా సహ లబ్ధవాన్ ॥**

**తతస్స లబ్ధవిజ్ఞానో విశ్వకర్మా చతుర్ముఖః ।**

**అసృజత్సర్వభూతాని స్థావరాణి చరాణి చ ॥**

**యతః శ్రుత్వా ఽకమృతం లబ్ధం బ్రహ్మణా పరమేశ్వరాత్ ।**

**తతస్తద్వదనాదేవ మయా లబ్ధం తపోబలాత్ ॥**

వాయువు ఇట్లు పలికెను –

ఇరువది ఒకటవ కల్పమునకు శ్వేతలోహితకల్పమని పేరు. ఆ కల్పమునందు నాల్గుమోముల వేల్పు (బ్రహ్మ) సృష్టిని చేయగోరి తపస్సును చేసెను (3). బ్రహ్మకు తండ్రి, రూపము గలవారిలో శ్రేష్ఠుడు అగు మహేశ్వరుడు స్వయముగా దివ్యమగు కుమారుని రూపమును దాల్చి, శ్వేతుడనే మహర్షి రూపములో దివ్యమగు వాక్కులను పలుకుతూ, బ్రహ్మకు దర్శనమునిచ్చెను (4, 5). బ్రహ్మకు

అధిపతి, జగత్పతి అగు తన ఆ తండ్రిని చూచి బ్రహ్మగారు నమస్కరించి, గాయత్రితో సహా గొప్ప జ్ఞానమును పొందియుండెను (6). జగత్తును సృష్టించే ఆ నాల్గు మోముల వేల్పు (బ్రహ్మగారు) ఈ విధముగా శివునినుండి విజ్ఞానమును పొందినవాడై, స్థావరజంగమాత్మకమగు జగత్తును అంతనూ సృష్టించెను (7). బ్రహ్మ పరమేశ్వరునినుండి విని ఈ అమృతరూపమగు జ్ఞానమును పొందెను. అదే విధముగా నేను కూడ తపస్సుయొక్క బలముచే ఆ బ్రహ్మగారు చెప్పగా విని ఈ జ్ఞానమును పొందియుంటిని.

**మునయ ఊచుః ।**

**కిం తద్ జ్ఞానం త్వయా లబ్ధం తథ్యాత్తథ్యతరం శుభమ్ ।**
**యత్ర కృత్వా పరాం నిష్ఠాం పురుషస్సుఖమృచ్ఛతి ॥**

మునులు ఇట్లు పలికిరి -

నీవు పొందిన ఆ జ్ఞానము ఎయ్యదీ? శుభకరమగు ఆ జ్ఞానము సత్యములన్నింటికంటే గొప్ప సత్యము. దానియందు ఉత్కృష్టమగు నిష్ఠగల వ్యక్తి సుఖమును పొందును.

**వాయురువాచః**

**పశుపాశపతిజ్ఞానం యల్లబ్ధం తు మయా పురా ।**
**తత్ర నిష్ఠా పరా కార్యా పురుషేణ సుఖార్థినా ॥**
**అజ్ఞానప్రభవం దుఃఖం జ్ఞానేనైవ నివర్తతే ।**
**జ్ఞానం వస్తుపరిచ్ఛేదో వస్తు చ ద్వివిధం స్మృతమ్ ॥**
**అజడం చ జడం చైవ నియంతృ చ తయోరపి ।**
**పశుః పాశః పతిశ్చేతి కథ్యతే తత్త్రయం క్రమాత్ ॥**
**అక్షరం చ క్షరం చైవ క్షరాక్షరపరం తథా ।**
**తదేతత్త్రితయం భూమ్నా కథ్యతే తత్త్వవేదిభిః ॥**
**అక్షరం పశురిత్యుక్తః క్షరం పాశ ఉదాహృతః ।**
**క్షరాక్షరపరం యత్తత్పతిరిత్యభిధీయతే ॥**

వాయువు ఇట్లు పలికెను -

నేను పూర్వము పశు-పాశ-పతుల జ్ఞానమును పొందియుంటిని. సుఖమును కోరు మా◌ానవుడు దానియందు తీవ్రమగు నిష్ఠ (స్థిరముగా నుండుట) ను చేయవలెను (10). అజ్ఞానము నుండి పుట్టే దుఃఖము జ్ఞానముచేత మాత్రమే తొలగును. వస్తుతత్త్వమును యథాతథముగా నెరుంగుటయే జ్ఞానమనబడును. జడము, చేతనము అని వస్తువు రెండు విధములుగా నున్నదని మహర్షులు చెప్పుచున్నారు. చేతనమునకు పశువు అనియు, జడమునకు పాశమనియు, వాటిని రెండింటిపీ నియంత్రించే ఈశ్వరునకు పతి అనియు క్రమముగా పేర్లు (11, 12). తత్త్వవేత్తలు తరచుగా ఈ మూడింటినీ క్రమముగా అక్షరము, క్షరము, క్షరాక్షరపరము అని వ్యవహరింతురు (13). పశువే అక్షరుడనబడును. క్షరమనగా పాశమని చెప్పబడినది. వాటి పతికి క్షరాక్షరపరమని పేరు.

**మునయ ఊచుః ।**

**కిం తచ్చ క్షరమిత్యుక్తం కిం చాక్షరముదాహృతమ్ ।**

**తయోశ్చ పరమం కిం వా తదేతద్బ్రూహి మారుత ॥**

మునులు ఇట్లు పలికిరి –

ఓ వాయుదేవా! క్షరమనగా నేమి? అక్షరమనగా నేమి? వాటికంటే పరమమగు తత్త్వమేది? ఈ విషయమును చెప్పుము.

**వాయురువాచః**

**ప్రకృతిః క్షరమిత్యుక్తం పురుషోఽ క్షర ఉచ్యతే ।**

**తావిమౌ ప్రేరయత్యన్యస్స పరః పరమేశ్వరః ॥**

వాయువు ఇట్లు పలికెను –

క్షరమనగా ప్రకృతి (మాయాశక్తి). పురుషుడే అక్షరుడనబడును. ఈ రెండింటినీ ప్రేరేపించే మరియొక తత్త్వమే పరమనబడే పరమేశ్వరుడు.

**మునయ ఊచుః ।**

**కైషా ప్రకృతిరత్యుక్తా క ఏష పురుషో మతః ।**

**అనయోః కేన సంబంధః కోఽ యం ప్రేరక ఈశ్వరః ॥**

మునులు ఇట్లు పలికిరి –

ఈ ప్రకృతి అనగా నేమి? ఈ పురుషుడు ఎవరు? వీటి రెండింటికీ దేని మూలకముగా సంబంధము ఏర్పడినది? వీటిని ప్రేరేపించే ఈశ్వరుడెవరు?

**వాయురువాచః**

**మాయా ప్రకృతిరుద్దిష్టా పురుషో మాయయాఽవృతః ।**

**సంబంధో మూలకర్మభ్యాం శివః ప్రేరక ఈశ్వరః ॥**

వాయువు ఇట్లు పలికెను –

మాయయే ప్రకృతి యనబడును. పురుషుడు మాయచే కప్పబడియున్నాడు. మూలము నందు గల అజ్ఞానము మరియు కర్మ అనునవి ఈ రెండింటికీ సంబంధమునేర్పరచుచున్నవి. వీటిని ప్రేరేపించే ఈశ్వరుడే శివుడు.

**మునయ ఊచుః ।**

**కేయం మాయా సమాఖ్యాతా కింరూపో మాయయా వృతః ।**

**మూలం కీదృక్ కుతో వాస్య కిం శివత్వం కుతశ్శివః ॥**

మునులు ఇట్లు పలికిరి –

ఈ మాయా యనగా నేమి? మాయచే కప్పబడిన పురుషుని స్వరూపమెట్టిది? ఈ పురు◌ుషుని మూలము ఎట్టిది? ఎక్కడనుండి వచ్చినది? శివత్వము అనగా నేమి? శివుడు ఎక్కడి వాడు?

**వాయురువాచః**

**మాయా మాహేశ్వరీ శక్తిశ్చిద్రూపో మాయయా వృతః ।**

**మలశ్చిచ్ఛాదకో నైజో విశుద్ధిశ్శివతా స్మృతః ॥**

వాయువు ఇట్లు పలికెను –

మహేశ్వరుని శక్తియే మాయ. చైతన్యస్వరూపము మాయచే కప్పబడి యున్నది. చైతన్యమును మాలిన్యము కప్పివేయుచున్నది. ఈ దోషము లేని స్వభావసిద్ధమైన స్థితియే శివత్వము.

**మునయ ఊచుః ।**

**ఆవృణోతి కథం మాయా వ్యాపినం కేన హేతునా ।**

**కిమర్థం చావృతిః పుంసః కేన వా వినివర్తతే ॥**

మునులు ఇట్లు పలికిరి –

సర్వవ్యాపకమగు చైతన్యమును మాయ ఎట్లు ఏ కారణముచే కప్పివేయు చున్నది? పురుషునకు ఈ ఆవరణము దేని కొరకు? ఇది దేనిచే తొలగిపోవును?

**వాయురువాచః**

**ఆవృతిర్వ్యాపినోఽపి స్యాద్వ్యాపి యస్మాత్కలాద్యపి ।**

**హేతుః కర్మైవ భోగార్థం నివర్తేత మలక్షయాత్ ॥**

వాయువు ఇట్లు పలికెను –

చైతన్యము వ్యాపకమే అయిననూ, దానికి ఆవరణము తప్పదు. ఏలయనగా, వ్యాపకములగు కళ మొదలగునవి కూడ ఆవరించబడుచున్నవి. భోగమునకు కారణము కర్మ మాత్రమే. అది దోషముల నాశముచే తొలగి పోవును.

**మునయ ఊచుః ।**

**కలాది కథ్యతే కిం తత్కర్మ వా కిముదాహృతమ్ ।**

**తత్కిమాది కిమంతం వా కింఫలం వా కిమాశ్రయమ్ ॥**

**కస్య భోగేన కిం భోగ్యం కిం వా తద్భోగసాధనమ్ ।**

**మలక్షయస్య కో హేతుః కీదృక్ క్షీణమలః పుమాన్ ॥**

మునులు ఇట్లు పలికిరి –

కళ మొదలగునవి ఏవి? కర్మ అనగా నేమి? దానికి ఆది యేమి? అంతము ఏమి? దాని ఫలము ఏది? దానికి ఆధారము ఏది? (23) భోగము ఎవరికి? భోగముచే భోగింపబడేది యేది? ఆ భోగమునకు సాధనము ఏది? మాలిన్యమును ఏది పోగొట్టును? మాలిన్యము నశించిన పురుషుడు ఎట్లుండును?

**వాయురువాచః**

**కలా విద్యా చ రాగశ్చ కాలో నియతిరేవ చ ।**
**కలాదయస్సమాఖ్యాతా యద్భోక్తా పురుషో భవేత్ ॥**
**పుణ్యపాపాత్మకం కర్మ సుఖదుఃఖఫలం తు యత్ ।**
**అనాదిమలభోగాంతమజ్ఞానాత్మసమాశ్రయమ్ ॥**
**భోగః కర్మవినాశాయ భోగమవ్యక్తముచ్యతే ।**
**బాహ్యాంతఃకరణద్వారం శరీరం భోగసాధనమ్ ॥**
**భావాతిశయలబ్ధేన ప్రసాదేన మలక్షయః ।**
**క్షీణే చాత్మమలే తస్మిన్ పుమాన్ శివసమో భవేత్ ॥**

వాయువు ఇట్లు పలికెను -

కళ మొదలగునవి యనగా కళ, విద్య, రాగము, కాలము మరియు నియతి. పురుషుడు వీటికి భోక్త యగుచున్నాడు (25). పుణ్యము మరియు పాపము అనే రూపము గల కర్మ సుఖము మరియు దుఃఖము అనే ఫలములనిచ్చును. ఈ కర్మ దోషమునకు ఆది లేదు. అనుభవించుటచే నశించే ఈ కర్మ మిథ్యాత్మయగు జీవుని ఆశ్రయించి ఉండును (26), సుఖదుఃఖముల అనుభవము వలన కర్మ క్షయమగును. భోగము (భోగింపబడేది) అవ్యక్తమనబడును. బాహ్యమునందు ఉండే ఇంద్రియములు మరియు అంతరింద్రియమగు మనస్సు అను వాటిద్వారా ఈ శరీరము భోగమునకు సాధనమగుచున్నది (27). అతిశయించిన భక్తి వలన లభించే ఈశ్వరానుగ్రహము వలన ఈ మాలిన్యము క్షయమగును. జీవుని ఈ అజ్ఞానదోషము క్షీణము కాగానే, పురుషుడు శివునితో సమానుడగును.

**మునయ ఊచుః ।**

**కలాదిపంచతత్త్వానాం కిం కర్మ పృథగుచ్యతే ।**
**భోక్తేతి పురుషశ్చేతి యేనాత్మా వ్యపదిశ్యతే ॥**
**కిమాత్మకం తదవ్యక్తం కేనాకారేణ భుజ్యతే ।**
**కిం తస్య శరణం భుక్తౌ శరీరం చ కిముచ్యతే ॥**

మునులు ఇట్లు పలికిరి -

కళ మొదలగు అయిదు తత్త్వముల పని యేమి? భోక్త అనియు, పురుషుడు అనియు వేర్వేరుగా నిర్దేశించుటకు కారణమేమి? (29) అవ్యక్త ముయొక్క స్వరూపమెట్టిది? అది ఏ రూపములో భోగింపబడును? భోగమునందు దానికి ఆశ్రయము ఏది? శరీరమనగా నేమి?

వాయురువాచః

దిక్క్రియావ్యంజకా విద్యా కాలో రాగః ప్రవర్తకః ।
కాలో ఽ వచ్ఛేదకస్తత్ర నియతిస్తు నియామికా ॥

అవ్యక్తం కారణం యత్తత్త్రి గుణం ప్రభవాప్యయమ్ ।
ప్రధానం ప్రకృతిశ్చైతి యదాహుస్తత్త్వచింతకాః ॥

కలాతస్తదభివ్యక్తమనభివ్యక్తలక్షణమ్ ।
సుఖదుఃఖవిమోహాత్మా భుజ్యతే గుణతస్త్రి ధా ॥

సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।
ప్రకృతౌ సూక్ష్మరూపేణ తిలే తైలమివ స్థితాః ॥

సుఖం చ సుఖహేతుశ్చ సమాసాత్సాత్త్వికం స్మృతమ్ ।
రాజసం తద్విపర్యాసాత్ స్తంభమోహౌ తు తామసౌ ॥

సాత్త్వికృర్వ్వగతిః ప్రోక్తా తామసీ స్యాదధోగతిః ।
మధ్యమా తు గతిర్యా సా రాజసీ పరిపఠ్యతే ॥

తన్మాత్రాపంచకం చైవ భూతపంచకమేవ చ ।
జ్ఞానేంద్రియాణి పంచైక్యం పంచకర్మేంద్రియాణి చ ॥

ప్రధానబుద్ధ్యహంకారమనాంసి చ చతుష్టయమ్ ।
సమాసాదేవమవ్యక్తం సవికారముదాహృతమ్ ॥

తత్కారణదశాపన్నమవ్యక్తమితి కథ్యతే ।
వ్యక్తం కార్యదశాపన్నం శరీరాదిఘటాదివత్ ॥

యథా ఘటాదికం కార్యం మృదాదేర్నాతిభిద్యతే ।
శరీరాది తథా వ్యక్తమవ్యక్తాన్నాతిభిద్యతే ॥

తస్మాదవ్యక్తమేవైక్యకారణం కరణాని చ ।
శరీరం చ తదాధారం తద్భోగ్యం చాపి నేతరత్ ॥

వాయువు ఇట్లు పలికెను –

దిక్కును మరియు క్రియను తెలుపుడు చేయునది విద్య యనబడును. కాలము మరియు రాగము మానవుని కర్మలయందు ప్రవర్తింప జేయును. కాలము సర్వమును పరి చ్ఛిన్నము (ఆది– అంతములు కలిగియుండుట) చేయుచుండును. నియతి (పూర్వకర్మానుసారముగా ఫలము లభించి తీరుననే ఈశ్వరీయ – అధ్యాదేశము) సర్వమును నియమించుచుండును (31). జగత్తు యొక్క ఉపాదానకారణమునకు అవ్యక్తమని పేరు. జగత్తు దానినుండి పుట్టి దానియందే లయమగును. మూడు గుణములతో కూడియున్న ఈ అవ్యక్తమునకే ప్రధానమనియు, ప్రకృతి అనియు పేర్లు అని తత్త్వముల స్వరూపము తెలిసినవారు చెప్పుచున్నారు (32). సహజముగా అభివ్యక్తము (జగద్రూపముగా ప్రకటమగుట) కాని స్థితిలో మూడు గుణములు కలిగి ఉండే ప్రకృతి కళల వలన సుఖము దుఃఖము మరియు మోహము అనే మూడు రూపములలో అభివ్యక్తమై, పురుషునిచే భోగింపబడును (33). నువ్వులలో నూనెవలె, ప్రకృతి యందు సత్త్వము,

రజస్సు మరియు తమస్సు అనే మూడు గుణములు సూక్ష్మ రూపములోనున్నవి (34). సుఖము మరియు సుఖహేతువు కలిపి సాత్త్వికము (సత్త్వగుణకార్యము) అని చెప్పబడుచున్నవి. దానికి విరుద్ధముగా దుఃఖము మరియు దాని హేతువు రాజసమగును. జడత్వము మరియు మోహము తామసమగును (35). సాత్త్విక ప్రకృతి మనిషిని మరణించిన పిదప ఊర్ధ్వ (పుణ్య) లోకములకు గొనిపోవును. తామసస్వభావము మనిషిని క్రింది (పాప) లోకములకు తీసుకొని పోవును. రాజసస్వభావము మధ్యమ (భూలోకములో మనుష్య జన్మ) గతిని ఇచ్చునని మహర్షులు చెప్పచున్నారు (36). అయిదు సూక్ష్మభూతములు (పృథివి, జలము, అగ్ని, వాయువు మరియు ఆకాశము), అయిదు స్థూలభూతములు, అయిదు జ్ఞానేంద్రియములు (ముక్కు, నాలుక, కన్ను, చర్మము మరియు చెవి), అయిదు కర్మేంద్రియములు (చేతులు, కాళ్లు, వాక్కు, విసర్జన - మరియు జనన-ఇంద్రియములు) (37), సమష్టిబుద్ధి (మహత్తత్త్వము), అహంకారము మరియు మనస్సు అను వికారము (కార్యము) లతో కూడిన ప్రధానము జగత్కారణమగుచున్నది. అవ్యక్తమనగా సంగ్రహముగా ఇదియే (38). కారణావస్థలోనున్న జగత్తునకే అవ్యక్తమని పేరు. అది శరీరములు, ఘటములు మొదలైన కార్యముల రూపములో ప్రకటమగుచుండును (39). ఘటము మొదలగు కార్యములు మట్టి మొదలగు కారణముల కంటే అతీతముగా లేవు. అదే విధముగా, శరీరము మొదలగు ప్రకటరూపములు కారణమగు అవ్యక్తము కంటే భిన్నముగా లేవు (40). కావున, శరీరము, ఇంద్రియములు, వాటికి ఆధారమగు ప్రకృతివికారములు (పంచభూతములు మొదలైనవి) అను వాటికి అన్నింటికీ ఏకైకకారణము అవ్యక్తమే. అదియే భోగ్యము అగును. మరియొక భోగ్యము లేదు.

**మునయ ఊచుః ।**

**బుద్ధీంద్రియశరీరేభ్యో వ్యతిరేకస్య కస్యచిత్ ।**
**ఆత్మశబ్దాభిధేయస్య వస్తుతో ఽపి కుతః స్థితిః ॥**

మునులు ఇట్లు పలికిరి -

బుద్ధి, ఇంద్రియములు మరియు శరీరము అని వాటికంటె విలక్షణమైనది, ఆత్మ అనే పదముచే వ్యవహరించ బడునది అగు ఒకానొక తత్త్వము గలదు. దాని స్వరూపమేమి? అది ఎక్కడ నుండును?

**వాయురువాచః**

**బుద్ధీంద్రియశరీరేభ్యో వ్యతిరేకో విభుర్ధ్రు వమ్ ।**
**అస్త్యేవ కశ్చిదాత్మేతి హేతుస్తత్ర సుదుర్గమః ॥**
**బుద్ధీంద్రియశరీరాణాం నాత్మతా సద్భిరిష్యతే ।**
**స్మృతేరనియతజ్ఞానాదయావద్దేహవేదనాత్ ॥**
**అతస్స్మర్తానుభూతానామశేషజ్ఞేయగోచరః ।**
**అంతర్యామీతి వేదేషు వేదాంతేషు చ గీయతే ॥**
**సర్వం తత్ర స సర్వత్ర వ్యాప్య తిష్ఠతి శాశ్వతః ।**
**తథాపి క్వాపి కేనాపి వ్యక్తమేష న దృశ్యతే ॥**

నైవాయం చక్షుషా గ్రాహ్యో నాపరైరింద్రియైరపి ।
మనసైవ ప్రదీప్తేన మహానాత్మాఽవసీయతే ॥

న చ స్త్రీ న పుమానేష నైవ చాపి నపుంసకః ।
నైవోర్ధ్వం నాపి తిర్యక్ చ నాధస్తాన్న కుతశ్చన ॥

అశరీరం శరీరేషు చలేషు స్థాణుమవ్యయమ్ ।
సదా పశ్యతి తం ధీరో నరః ప్రత్యవమర్శనాత్ ॥

కిమత్ర బహునోక్తేన పురుషో దేహతః పృథక్ ।
అపృథగ్యే తు పశ్యంతి హ్యసమ్యక్ తేషు దర్శనమ్ ॥

యచ్ఛరీరమిదం ప్రోక్తం పురుషస్య తతః పరమ్ ।
అశుద్ధమవశం దుఃఖమధ్రువం న చ విద్యతే ॥

విపదాం బీజభూతేన పురుషస్తేన సంయుతః ।
సుఖీ దుఃఖీ చ మూఢశ్చ భవతి స్వేన కర్మణా ॥

అద్భిరాప్లావితం క్షేత్రం జనయత్యంకురం యథా ।
అజ్ఞానాత్ ప్లావితం కర్మ దేహం జనయతే తథా ॥

వాయువు ఇట్లు పలికెను –

ఆత్మ అనే ఒకానొక తత్త్వము నిశ్చయముగా గలదు. సర్వవ్యాపకమగు ఆత్మ ని౦శ్చయముగా బుద్ధి, ఇంద్రియములు మరియు శరీరము అనువాటి కంటే విలక్షణమైనది. దీనికి కారణమును తెలియుట చాల కష్టము (43). స్మరణము ఖచ్చితమగు జ్ఞానహేతువని చెప్పుటకు వీలు లేదు. అశాశ్వతమగు ఈ దేహమునకు ఆత్మ సాక్షి యగుచున్నది. మరియు పూర్ణదేహము ఏకకాలములో అనుభవమునకు వచ్చుట లేదు. ఈ కారణములచే బుద్ధి, ఇంద్రియములు మరియు శరీరము అనునవి ఆత్మ కాదని విద్వాంసులు చెప్పుచున్నారు (44). కావుననే, స్మరింపబడే మరియు అనుభవింపబడే సకలదృశ్య (చూడబడే) పదార్థములను తెలుసుకొనే ఆత్మ అంతర్యామి యని వేదవేదాంతములయందు కీర్తింపబడుచున్నది (45). శాశ్వత మగు ఆత్మయందు సర్వము ఉనికిని కలిగియున్నది. ఆత్మ సర్వమునందు వ్యాపించి యున్నది అయిననూ, ఏ కాలమునందైననూ ఎవనిచే నైననూ ఈ ఆత్మ సుస్పష్టముగా దర్శించబడుట లేదు (46). ఈ ఆత్మ జ్ఞానముచే ప్రకాశింప జేయబడిన అంతఃకరణమునందు మాత్రమే నిశ్చయముగా దర్శించబడును (47). ఆత్మ పురుషుడు గానీ, స్త్రీ గాని, నపుంసకుడు గాని కాదు. ఆత్మ పైన గాని, క్రింద గాని, భూమికి సమతలముగా గాని, ఎక్కడనైననూ ఒకానొక విశిష్టదేశమునకు పరిమితమై లేదు (48). చంచలమగు ఈ దేహములయందు ఉపలభ్యమగుచున్న ఈ ఆత్మ శరీరము (శరీరమువలె శిథిలమయ్యేది) కాదు. వికారములు లేనిది, వినాశము లేనిది అగు ఆ ఆత్మను జ్ఞాని విచారముచే సర్వకాలములలో కనుగొనును (49). దీని గురించి ఇన్ని మాటలేల? పురుషుడు దేహము కంటే విలక్షణుడు. ఎవరైతే పురుషుని దేహము కంటే భిన్నముగా చూడరో, వారి దర్శనము అయోగ్యము (50). పురుషుని ఈ దేహముకంటే అపవిత్రము, అస్వతంత్రము, దుఃఖహేతువు, వినాశి అగునది మరియొకటి లేదని చెప్పబడినది

(51). పురుషుడు ఆపదలకు నిలయమగు ఆ దేహముతో కూడియున్నవాడై, తన కర్మను బట్టి సుఖి, దుఃఖి మరియు మూఢుడు అగుచున్నాడు (52). నీరు పెట్టిన పొలములోని విత్తనము అంకురించిన విధముగా, అజ్ఞానముచే పోషించబడిన కర్మ దేహమును కలిగించును.

**అత్యంతమసుఖావాసాస్స్మృతాశ్చైకాంతమృత్యవః ।**

**అనాగతా అతీతాశ్చ తనవోఽస్య సహస్రశః ॥**

**ఆగత్యాగత్య శీర్ణేషు శరీరేషు శరీరిణః ।**

**అత్యంతవసతిః క్వా ఽపి న కేనాపి చ లభ్యతే ॥**

**ఛాదితశ్చ వియుక్తశ్చ శరీరేషు లక్ష్యతే ।**

**చంద్రబింబవదాకాశే తరలైరభ్రసంచయైః ॥**

**అనేకదేహభేదేన భిన్నా వృత్తిరిహాత్మనః ।**

**అష్టాపదపరిక్షేపే హ్యక్షము ద్రేవ లక్ష్యతే ॥**

**నైవాస్య భవితా కశ్చిన్నాసౌ భవతి కస్యచిత్ ।**

**పథి సంగమ ఏవాయం దారైః పుత్రై శ్చ బంధుభిః ॥**

**యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహోదధౌ ।**

**సమేత్య చ వ్యపేయాతాం తద్వద్భూతసమాగమః ॥**

**స పశ్యతి శరీరం తచ్ఛరీరం తన్న పశ్యతి ।**

**తౌ పశ్యతి పరః కశ్చిత్తావుభౌ తం న పశ్యతః ॥**

**బ్రహ్మాద్యాః స్థావరాంతాశ్చ పశవః పరికీర్తితాః ।**

**పశునామేవ సర్వేషాం ప్రోక్తమేతన్నిదర్శనమ్ ॥**

**స ఏష బధ్యతే పాశైస్సుఖదుఃఖాశనః పశుః ।**

**లీలాసాధనభూతో య ఈశ్వరస్యేతి సూరయః ॥**

**అజ్ఞో జంతురనీశోఽయమాత్మనస్సుఖదుఃఖయోః ।**

**ఈశ్వరప్రేరితో గచ్ఛేత్స్వర్గం వా శ్వభ్రమేవ వా ॥**

మిక్కిలి దుఃఖనిలయములు, సుతరాము నశించునవి అగు దేహములు ఈ పురుషునకు వేల సంఖ్యలో పూర్వము వచ్చియున్నవి, ఇంకనూ రాబోవుచున్నవి అని మహర్షులు చెప్పుచున్నారు (54). శిథిలమయ్యే అసంఖ్యాకములగు శరీరములను స్వీకరిస్తూ ఉండే ఈ శరీరధారియగు పురుషునకు ఏ విధముగనైననూ ఎక్కడనైననూ స్థిరమగు శరీరమునందు నివాసము లభించదు (55). ఆకాశమునందు చంద్రబింబమును ఒకప్పుడు చంచలమగు మేఘసమూహములు కప్పివేయగా, మరియొకప్పుడు మేఘములు ప్రక్కకు తొలగుచుండును. అదే విధముగా, పురుషుడు ఒకప్పుడు శరీరముచే కప్పబడి యుండును; మరియొకప్పుడు శరీరము లేకుండగా నుండును (56). చదరంగపు బల్లపై బంటు తిరుగాడినట్లు, జీవుడు అనేకములగు విభిన్నదేహములలో తిరుగాడుచుండును (57). జీవునకు ఎవ్వరైననూ తనవాడు కాడు. జీవుడు ఎవ్వరికైననూ తనవాడు కాడు. భార్య, పిల్లలు మరియు బంధువులు అనే వారితోడి కలయిక

ప్రయాణీకులకు మార్గమధ్యములో జనుల కలయిక వంటిది మాత్రమే (58). పెద్ద సముద్రములో ఒక కట్టె మరియొక కట్టెతో కలిసి మరల విడిపోవును. జీవునకు వివిధప్రాణులతో కలిగే సమాగమము అట్టిది మాత్రమే (59). జీవుడు శరీరమును చూచును. కాని, శరీరము జీవుని చూడజాలదు. వీరిద్దరినీ వీరి కంటే సూక్ష్మమగు సాక్షిచైతన్యము చూచును. వీరిద్దరు ఆ సాక్షిని చూడలేరు (60). బ్రహ్మతో మొదలిడి గడ్డిపోచ వరకు గల సర్వ ప్రాణులకు పశువులని పేరు. పైన చెప్పిన దృష్టాంతములు సకలపశువులకు మాత్రమే వర్తించును (61). సుఖదుఃఖములననుభవించే ఆ ఈ పశువు త్రాళ్ల (రాగద్వేషముల) చే బంధింపబడి ఈశ్వరుని లీలలో సాధనములవంటివాడు అగుచున్నాడని పండితులు చెప్పెదరు (62). తనకు రాబోయే సుఖదుఃఖములను గురించి తెలియని అస్వతంత్రుడగు ఈ జీవుడు ఈశ్వరునిచే ప్రేరేపించ బడినవాడై స్వర్గమును పొందును; లేదా, నరకకూపములో పడును.

**సూత ఉవాచః**

**ఇత్యాకర్ణ్యానిలవచో మునయః ప్రీతమానసాః ।**

**ప్రోచుః ప్రణమ్య తం వాయుం శైవాగమవిచక్షణమ్ ॥**

**ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే శివతత్త్వజ్ఞాన వర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥**

సూతుడు ఇట్లు పలికెను -

మునులు వాయుదేవుని ఈ వచనములను విని సంతోషముతో నిండిన మనస్సులు గల వారై, శైవాగమములో విద్వాంసుడగు ఆయనకు ప్రణమిల్లి ఇట్లు పలికిరి.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో శివతత్త్వజ్ఞానమును వర్ణించే అయిదవ అధ్యాయము ముగిసినది.

# 6 – శివ తత్త్వజ్ఞానము

**మునయ ఊచుః ।**

**యో ఽయం పశురితి ప్రోక్తో యశ్చ పాశ ఉదాహృతః ।**
**ఆభ్యాం విలక్షణః కశ్చిత్కో ఽ యమస్తి తయోః పతిః ॥**

మునులు ఇట్లు పలికిరి –

పశువు మరియు పాశము అనునవి చెప్పబడినవి. ఈ రెండింటికీ ప్రభువు మరియు వీటికంటే విలక్షణమైనవాడు అగు పురుషుడు ఎట్టివాడు?

**వాయురువాచః**

**అస్తి కశ్చిదపర్యంతరమణీయగుణాశ్రయః ।**
**పతిర్విశ్వస్య నిర్మాతా పశుపాశవిమోచనః ॥**
**అభావే తస్య విశ్వస్య సృష్టియేషా కథం భవేత్ ।**
**అచేతనత్వాదజ్ఞానాదనయోః పశుపాశయోః ॥**
**ప్రధానపరమాణ్వాది యావత్కించిదచేతనమ్ ।**
**తత్కర్తృకం స్వయం దృష్టం బుద్ధిమత్కారణం వినా ॥**
**జగచ్చ కర్తృసాపేక్షం కార్యం సావయవం యతః ।**
**తస్మాత్కార్యస్య కర్తృత్వం పత్యుర్న పశుపాశయోః ॥**
**పశో రపి చ కర్తృత్వం పత్యుః ప్రేరణపూర్వకమ్ ।**
**అయథాకరణజ్ఞానమంధస్య గమనం యథా ॥**
**ఆత్మానం చ పృథఙ్ మత్వా ప్రేరితారం తతః పృథక్ ।**
**అసౌ జుష్టస్తతస్తేన హ్యమృతత్వాయ కల్పతే ॥**
**పశోః పాశస్య పత్యుశ్చ తత్త్వతోఽస్తి పదం పరమ్ ।**
**బ్రహ్మవిత్తద్విదిత్వైవ యోనిముక్తో భవిష్యతి ॥**
**సంయుక్తమేతద్ద్వితయం క్షరమక్షరమేవ చ।**
**వ్యక్తావ్యక్తం బిభర్తీశో విశ్వం విశ్వవిమోచకః ॥**
**భోక్తా భోగ్యం ప్రేరయితా మంతవ్యం త్రివిధం స్మృతమ్ ।**
**నాతః పరం విజానద్భిర్వేదితవ్యం హి కించన ॥**

వాయువు ఇట్లు పలికెను –

అనంతసుందరగుణములకు ఆశ్రయమైనవాడు, జగత్తును నిర్మించినవాడు, జీవుల సంసారబంధమును విడిపించువాడు అగు ప్రభుడు ఒకానొకడు కలడు (2). జీవుడు అజ్ఞాని ; పాశము జడము. కావున, ఆయనయే లేనిచో, ఈ సృష్టి ఎట్లు సంభవమయ్యెడిది? (3) ప్రధానము, పరమాణువులు మొదలగు జడవస్తువులను జగద్రూపముగా మలిచిన కర్త ఆ పరమేశ్వరుడేనని సుస్పష్టమగుచున్నది. చేతన కారణము లేనిదే వీటి పుట్టుక ఎట్లు సంభవమగును?

(4) జగత్తు అవయవములు గలది, మరియు కార్యము. కావున, దానికి కర్త ఉండి తీరవలెను. కావున, కార్యజగత్తుయొక్క కర్త శివప్రభుడే గాని, పశుపాశములు కావు (5). జీవునియందు గల కర్తృత్వము శివప్రభుని ప్రేరణ వలన మాత్రమే సంభవమగుచున్నది. గుడ్డివాని నడక వలె జీవుని ఇంద్రియములు యథార్థ జ్ఞానమును ఈయజాలవు (6). ఆరంభములో తనను వేరుగా మరియు ప్రేరకుడుగు పరమేశ్వరుని వేరుగా తలంచినను, తరువాత జీవుడు ఈశ్వరునితో గల తన స్వరూపమునకు గల అభేదమును గుర్తించి మోక్షమునకు అర్హుడగును (7). శివప్రభుని పరమపదము పశుపాశముల స్వరూపమే యగుచున్నది. దానిని తెలుసుకున్న బ్రహ్మవేత్త మరల జన్మను పొందడు (8). ఈ క్షర- అక్షరతత్త్వముల రెండింటి కలయికను, అవ్యక్తము (ప్రకృతి) ను మరియు దానినుండి వ్యక్తమయ్యే జగత్తును ఈశ్వరుడే నిలబెట్టుచున్నాడు. ఆయనయే జీవునకు సంసారమునుండి మోక్షమునిచ్చును (9). భోక్త (కర్మఫలముల ననుభవించు జీవుడు), భోగ్యము (ప్రకృతి) మరియు ప్రేరకుడు (ఈశ్వరుడు) అనే మూడు తత్త్వములు మాత్రమే గలవని మహర్షులు వర్ణించుచున్నారు. జిజ్ఞాసువులు ఇంతకు మించి తెలియ దగినది ఏదియూ లేదు.

**తిలేషు వా యథా తైలం దధ్ని వా సర్పిరర్పితమ్ ।**
**యథాపస్స్రోతసి వ్యాప్తా యథారణ్యాం హుతాశనః ॥**
**ఏవమేవ మహాత్మానమాత్మన్యాత్మవిలక్షణమ్ ।**
**సత్యేన తపసా చైవ నిత్యయుక్తోఽనుపశ్యతి ॥**
**య ఏకో జాలవానీశ ఈశానీభిస్స్వశక్తిభిః ।**
**సర్వాంల్లోకానిమాన్ కృత్వా ఏక ఏవ స ఈశతే ॥**
**ఏక ఏవ సదా రుద్రో న ద్వితీయోఽస్తి కశ్చన ।**
**సంసృజ్య విశ్వభువనం గోప్తాంతే సంచుకోచ యః ॥**
**విశ్వతశ్చక్షురేవాయముతాయం విశ్వతోముఖః ।**
**తథైవ విశ్వతోబాహుర్విశ్వతః పాదసంయుతః ॥**
**ద్యావాభూమీ చ జనయన్ దేవ ఏకో మహేశ్వరః ।**
**స ఏవ సర్వదేవానాం ప్రభవశ్చోద్భవస్తథా ॥**
**హిరణ్యగర్భం దేవానాం ప్రథమం జనయేదయమ్ ।**
**విశ్వస్మాదధికో రుద్రో మహర్షిరితి హి శ్రుతిః ॥**
**వేదాహమేతం పురుషం మహాంతమమృతం ధ్రువమ్ ।**
**ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్సంస్థితం ప్రభుమ్ ॥**
**అస్మాన్నాస్తి పరం కించిదపరం పరమాత్మనః ।**
**నాణీయో ఽ స్తి న చ జ్యాయస్తేన పూర్ణమిదం జగత్ ॥**
**సర్వాననశిరో గ్రీవస్సర్వభూతగుహాశయః ।**
**సర్వవ్యాపీ చ భగవాంస్తస్మాత్సర్వగతశ్శివః ॥**

సర్వతః పాణిపాదోఽయం సర్వతోఽక్షిశిరోముఖః ।

సర్వతః శ్రుతిమాంల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥

నిత్యము సత్యమును పాటిస్తూ తపస్సును చేయు యోగి శాస్త్రోపదేశమును పొంది నువ్వులలో నూనె వలె, పెరుగులో నేయి వలె, నదీప్రవాహములో నీరు వలె, మరియు అరణి (నిప్పును మథించే చెక్క) లో అగ్నివలె, బుద్ధియందు బ్రహ్మ- అభిన్నము మరియు దేహాదుల కంటే విలక్షణము అగు ఆత్మను దర్శించును (11, 12). అద్వితీయుడు, మాయావి అగు పరమాత్మ సర్వసమర్థములగు తన శక్తులతో కూడినవాడై, ఈ సకలలోకములను సృష్టించి, తాను దానియందు జన్మించి (ప్రవేశించి), తాను ఒక్కడే సర్వమును పాలించుచున్నాడు (13). సర్వకాలములలో ఒకే ఒక రుద్రుడు గలడు. రెండవవాడు ఎవ్వడైననూ లేడు. ఆయనయే సకలలోకములను సృష్టించి రక్షించి ప్రళయకాలమునందు సంహరించుచున్నాడు (14). ఈ జగత్తులోని కన్నులు, ముఖములు, చేతులు మరియు కాళ్లు సర్వము ఆయనకు సంబంధించినవియే (15). అద్వితీయుడగు మహేశ్వరుడు భూలోక, స్వర్గలోకములను సృష్టించినాడు. సకలదేవతలు ఆయననుండి పుట్టి ఆయనలో లీనమగుదురు (16). దేవతలలో మొదటివాడగు హిరణ్యగర్భుని ఆయనయే సృష్టించుచున్నాడు. సర్వజ్ఞుడగు రుద్రుడు సర్వులకంటే అధికుడని వేదము వర్ణించుచున్నది (17). చేతనస్వరూపుడు, సర్వముకంటే పెద్దవాడు, అవినాశి, అవికారి, ఆదిత్యుని వలె ప్రకాశించువాడు, అజ్ఞానమును ప్రకాశింపజేస్తూ దానికి అతీతుడై యుండువాడు అగు ఈ శివప్రభుని నేను తెలుసుకున్నాను (18). ఈ పరమాత్మ కంటే గొప్పది గాని, తక్కువది గాని మరియొకటి లేదు. ఈయన కంటే చిన్నది గాని, పెద్దది గాని లేదు. ఈ జగత్తు ఆయనచే వ్యాప్తమై యున్నది (19). ముఖములు, తలలు మరియు మెడలు అన్నీ ఆయనవియే. సర్వప్రాణుల బుద్ధి అనే గుహలో ఆయనయే నివాసమున్నాడు. ఈ శివభగవానుడు సర్వమునందు కారణరూపముగా అనువృత్తుడై సర్వమును వ్యాపించి యున్నాడు (20). ఈ సృష్టిలోని చేతులు, కాళ్లు, కన్నులు, తలలు, ముఖములు, చెవులు అన్నీ ఆయనవియే. ఆయనయే సర్వమును వ్యాపించి యున్నాడు.

సర్వేంద్రియగుణాభాసస్సర్వేంద్రియవివర్జితః ।

సర్వస్య ప్రభురీశానస్సర్వస్య శరణం సుహృత్ ॥

అచక్షురపి యః పశ్యత్య కర్ణోఽపి శృణోతి యః ।

సర్వం వేత్తి న వేత్తాఽస్య తమాహుః పురుషం పరమ్ ॥

అణోరణీయాన్మహతోమహీయానయమవ్యయః ।

గుహాయాం నిహితశ్చాపి జంతోరస్య మహేశ్వరః ॥

తమక్రతుం క్రతుప్రాయం మహిమాతిశయాన్వితమ్ ।

ధాతు ప్రసాదాదీశానం వీతశోకః ప్రపశ్యతి ॥

వేదాహమేనమజరం పురాణం సర్వగం విభుమ్ ।

నిరోధం జన్మనో యస్య వదంతి బ్రహ్మవాదినః ॥

ఏకో৽పి త్రీనిమాంల్లోకాన్ బహుధా శక్తియోగతః ।

విదధాతి విచేత్యంతే విశ్వమాదౌ మహేశ్వరః ॥

విశ్వధాత్రీత్యజాఖ్యా చ శైవీ చిత్రాకృతిః పరా ।

తామజాం లోహితాం శుక్లాం కృష్ణామేకాం త్వజః ప్రజామ్ ॥

జనిత్రీమనుశేతే ఽ న్యో జుషమాణస్స్వరూపిణీమ్ ।

తామేవజామజో৽న్యస్తు భుక్తభోగాం జహాతి చ ॥

ద్వా సుపర్ణా సయుజౌ సమానం వృక్షమాస్థితౌ ।

ఏకో৽త్తి పిప్పలం స్వాదు పరో৽నశ్నన్ ప్రపశ్యతి ॥

వృక్షే ఽ స్మిన్ పురుషో మగ్నో ముహ్యమానశ్చ శోచతి ।

జుష్టమన్యం యదా పశ్యేదీశం పరమకారణమ్ ॥

తదాస్య మహిమానం చ వీతశోకస్సుఖీ భవేత్ ।

ఛందాంసి యజ్ఞాః క్రతవో యద్భూతం భవ్యమేవ చ ॥

మాయావిశ్వం సృజత్యస్మిన్నివిష్టో మాయయా పరః ।

మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్ ॥

ఇంద్రియవ్యాపారములన్నింటిలో పరమేశ్వరుడే చైతన్యస్వరూపుడై యున్నాడు. కాని, ఆయనకు ఇంద్రియవ్యాపారములతో సంపర్కము లేదు. సర్వజగత్తునకు ప్రభువు అగు ఈశ్వరుడు సర్వులకు శరణునిచ్చే చక్కని హృదయము గల మిత్రుడు (22). ఆయన కన్నులు లేకుండగనే చూచును. చెవులు లేకుండగనే వినును. ఆయన సర్వమును తెలుసుకొనును. కాని ఆయనను తెలిసినవాడు లేడు. ఆయన పరమపురుషుడని మహర్షులు వర్ణించుచున్నారు (23). అవినాశియగు ఈ పరమాత్మ అణువు (మిక్కిలి చిన్నది) కంటె చిన్నవాడు. కాని, మిక్కిలి పెద్దదానికంటె పెద్దవాడు. మహేశ్వరుడు ఈ ప్రాణుల బుద్ధి అనే గుహలో దాగి యున్నాడు (24). సంకల్పములు లేనివాడు, కాని సంకల్పముల రూపములో ప్రకటమగువాడు, అతిశయించిన మహిమ గలవాడు అగు ఆ ఈశ్వరుని, శరీరములోని ఇంద్రియముల పాటవము అనే అనుగ్రహముచే తెలుసుకొని మానవుడు శోకమునుండి విముక్తిని పొందును (25). ఏ పరమేశ్వరునకు జన్మ లేదని బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారో, అట్టి ముసలి దనము లేని, సనాతనుడు సర్వమునందు కారణరూపముగా అన్వయించువాడు మరియు సర్వవ్యాపకుడు అగు ఈ ఈశ్వరుని నేను తెలుసుకొంటిని (26). మహేశ్వరుడు అద్వితీయుడే అయిననూ, శక్తితో కూడినవాడై, ఈ ముల్లోకములలోని అనేకరూపములతో గూడిన బ్రహ్మండమును సృష్ట్యాదియందు నిర్మించి, ప్రళయకాలమునందు తనలోనికి ఉపసంహరించుచున్నాడు (27). వివిధరూపములలో ప్రకటము కాగలది, జగన్మాత, అజ (పుట్టుక లేనిది) అను పేరు గలది అగు శివుని పరా (సర్వకారణము) శక్తి జగత్తునకు ఉపాదానకారణమగుచున్నది. ఎరుపు (అగ్ని), తెలుపు (జలము), నలుపు (పృథివి) రంగులు గలది, స్వయముగా పుట్టుక లేనిది అగు ఆ మాయాశక్తి మహత్తు మొదలైన వివిధతత్త్వముల రూపములోనికి పరిణమించుచున్నది. అజుడగు

జీవుడు అట్టి జగత్తునందు ప్రీతి గలవాడై అజ్ఞానముచే దానితో తాదాత్మ్యమును పొంది సంసారి యగుచున్నాడు. కాని, శబ్దాదివిషయగ్రహణరూపములో భోగ్యము అగుచున్న ఆ మాయకు అతీతుడై, అజుడగు పరమేశ్వరుడు చైతన్యస్వరూపమునందు పరినిష్ఠితుడై యున్నాడు (28, 29). జీవుడు మరియు ఈశ్వరుడు అనే రెండు పక్షులు ఒకే సంసారమనే చెట్టును ఆశ్రయించుకొని కలిసి మెలిసి జీవించుచున్నవి. వాటిలో ఒకటి (జీవుడు) కర్మఫలము అనే పండును భక్షించుచుండగా, రెండవ పక్షి (ఈశ్వరుడు) దేనినీ తినకుండగా సాక్షియై చూచుచున్నాడు (30). మోహముచే ఈ సంసారవృక్షమునందు నిమగ్నమై యున్న జీవుడు దుఃఖించుచున్నాడు. కాని, ఆ జీవుడు అదే వృక్షమును ఆశ్రయించి ఉన్న సర్వకారణకారణమగు ఈశ్వరుని ఏనాడు కనుగొనునో, ఆయన మహిమను గుర్తించునో, ఆనాడు ఆతడు శోకమునుండి విముక్తుడై సుఖమును పొందును. వేదములు, వివిధములగు ఆరాధనలు, యాగములు, భూతకాలమునందలి సర్వము మరియు భవిష్యత్కాలములోని సర్వము కూడ ఆ మాయావిచే రచింపబడుచున్నది. పరమాత్మ మాయను వశము చేసుకొని జగత్తును సృష్టించి దానియందు ప్రవేశించి యున్నాడు. జగత్తుయొక్క ఉపాదానకారణము మాయ అనియు, మాయను ఈశ్వరుడు తన వశములో నుంచుకొనుననియు తెలియవలెను.

తస్యావయవభూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్ ।
సూక్ష్మాతిసూక్ష్మమీశానం కలలస్యాపి మధ్యతః ॥
స్రష్టారమపి విశ్వస్య వేష్టితారం చ తస్య తు ।
శివమేవేశ్వరం జ్ఞాత్వా శాంతిమత్యంతమృచ్ఛతి ॥
స ఏవ కాలే గోప్తా చ విశ్వస్యాధిపతిః ప్రభుః ।
తం విశ్వాధిపతిం జ్ఞాత్వా మృత్యుపాశాత్ప్ర ముచ్యతే ॥
ఘృతాత్పరం మండమివ సూక్ష్మం జ్ఞాత్వా స్థితం ప్రభుమ్ ।
సర్వభూతేషు గూఢం చ సర్వపాపైః ప్రముచ్యతే ॥
ఏష ఏవ పరో దేవో విశ్వకర్మా మహేశ్వరః ।
హృదయే సంనివిష్టం తం జ్ఞాత్వైవామృతమశ్నుతే ॥
యదా సమస్తం న దివా న రాత్రిర్న సదప్యసత్ ।
కేవలశ్శివ ఏవైకో యతః ప్రజ్ఞా పురాతనీ ॥
నైనమూర్ధ్వం న తిర్యక్చ న మధ్యం పర్యజిగ్రహత్ ।
న తస్య ప్రతిమా చాస్తి యస్య నామ మహద్యశః ॥
అజాతమిమమేవైకే బుద్ధ్వా జన్మని భీరవః ।
రుద్రస్యాస్య ప్రపద్యంతే రక్షార్థం దక్షిణం ముఖమ్ ॥
ద్వే అక్షరే బ్రహ్మపరే త్వనంతే సముదాహృతే ।
విద్యావిద్యే సమాఖ్యాతే నిహితే యత్ర గూఢవత్ ॥
క్షరం త్వవిద్యా హ్యమృతం విద్యేతి పరిగీయతే ।
తే ఉభే ఈశతే యస్తు సోఽన్యః ఖలు మహేశ్వరః ॥

ఈ జగత్తు అంతయు ఆ ప్రకృతియొక్క అవయవములచే మాత్రమే వ్యాప్తమై యున్నది. సూక్ష్మమైనవాటి కంటె కూడ సూక్ష్మమైనవాడు, పరిపాలకుడు, తల్లి గర్భములోని పిండమునందు కూడ చైతన్యరూపముగా ప్రకటమగువాడు, జగత్తును సృష్టించి దానిని ఆవరించి యున్న వాడు, మంగళకరుడు అగు ఈశ్వరుని తెలుసుకున్న మానవుడు ఆత్యంతికమగు (మోక్షరూపమైన) శాంతిని పొందును (34, 35). జగత్తునకు అధిపతి, సర్వసమర్థుడు అగు ఆ ఈశ్వరుడే కాలస్వరూపుడై రక్షించుచున్నాడు. ఆ జగన్నాథుని తెలుసుకున్న వ్యక్తి మృత్యువు అనే పాశమునుండి విముక్తిని పొందును (36). నెయ్యికి వెన్న వలే జగత్తునకు కారణమై దాని కంటే సూక్ష్మరూపములో సర్వప్రాణులలో రహస్యముగా చైతన్యరూపుడై ఉండే ఆ ఈశ్వరుని తెలుసుకున్న వ్యక్తి పాపములన్నింటినుండియు విముక్తుడగును (37). జగత్తును సృష్టించిన దేవాధిదేవుడు అగు ఈ మహేశ్వరుడు హృదయములో చాల దగ్గరగా నున్నాడు. ఆయనను తెలుసుకున్నప్పుడు మాత్రమే మానవుడు మోక్షమును పొందును (38). ఈ సర్వజగత్తు ఏ కాలములో లేదో, సత్తు (ఉనికి గలది) గాని, అసత్తు (లేనిది) గాని కాదో, ఏ కాలములో రాత్రింబగళ్లు లేవో, అప్పుడు కేవలుడగు శివుడు మాత్రమే ఉండెను. ఆయననుండియే సనాతనమగు జ్ఞానము పుట్టినది (39). ఆయనను పైన గాని, అడ్డముగా గాని, మధ్యలో గాని ఎవ్వరైననూ పట్టుకొనలేరు. ఆయనకు సాటి లేదు. ఆయన పేరు గొప్ప కీర్తిని కలిగియున్నది (40). ఎవరో కొద్దిమంది మరల జన్మ వలన భయపడినవారై పుట్టుక లేని ఈ ఈశ్వరునీ తెలుసుకొని, రక్షణ కొరకై ఈ రుద్రుని దక్షిణముఖమును (దక్షిణామూర్తిని) శరణు వేడెదరు (41). అవినాశి, అనంతము అగు పరంబ్రహ్మయందు విద్య (జ్ఞానము) మరియు అవిద్య ( కర్మ) అనే రెండు, రహస్యములా యన్నట్లు నిక్షిప్తములై యుండునవి మహర్షులు చెప్పుచున్నారు (42). అవిద్య వినాశి (క్షరము) అనియు, విద్య అమృతము (మోక్షము) అనియు కీర్తించబడినది. ఆ రెండింటిని పాలించే మహేశ్వరుడు వాటికంటె అతీతుడు.

ఏకైకం బహుధా జాలం వికుర్వన్నేకవచ్చ యః ।
సర్వాధిపత్యం కురుతే సృష్ట్వా సర్వాన్ ప్రతాపవాన్ ॥
దిశ ఊర్ధ్వమధస్తిర్యగ్ భాసయన్ భ్రాజతే స్వయమ్ ।
యోనిస్స్వభావాదప్యేకో వరేణ్యస్స్వధితిష్ఠతి ॥
స్వభావవాచకాన్ సర్వాన్ వాచ్యాంశ్చ పరిణామయన్ ।
గుణాంశ్చ భోగ్యభోక్తృత్వే తద్విశ్వమధితిష్ఠతి ॥
తే వై గుహ్యోపనిషది గూఢం బ్రహ్మ పరాత్పరమ్ ।
బ్రహ్మయోనిం జగత్పూర్వం విదుర్దేవా మహర్షయః ॥
భావగ్రాహ్యమనీహాఖ్యం భావాభావకరం శివమ్ ।
కలాసర్గకరం దేవం యే విదుస్తే జహుస్తనుమ్ ॥
స్వభావమేకే మన్యంతే కాలమేకే విమోహితాః ।
దేవస్య మహిమా హ్యేష యేనేదం భ్రామ్యతే జగత్ ॥

యేనేదమావృతం నిత్యం కాలకాలాత్మనా యతః ।
తేనేరితమిదం కర్మ భూతైస్సహ వివర్తతే ॥
తత్కర్మ భూయశః కృత్వా వినివృత్య చ భూయశః ।
తత్త్వస్య సహ తత్త్వేన యోగం చాపి సమేత్య వై ॥
అష్టాభిశ్చ త్రిభిశ్చైవ ద్వాభ్యాం చైకేన వా పునః ।
కాలేనాత్మగుణైశ్చాపి కృత్స్నమేవ జగత్క్షయమ్ ॥
గుణైరారభ్య కర్మాణి స్వభావాదీని యోజయేత్ ।
తేషామభావే నాశస్స్యాత్కృతస్యాపి చ కర్మణః ॥

ప్రతాపశాలియగు పరమేశ్వరుడు తన మాయను పలువిధములుగా విస్తరింపజేసి, సర్వులను సృష్టించి, శాసించుచున్నాడు. ఆయన మరల ప్రళయములో ఈ వికార సముదాయమును తన అద్వితీయస్వరూపములోనికి ఉపసంహరించుచున్నాడు (44). తాను స్వయంప్రకాశ స్వరూపుడై, దిక్కులను, క్రింద మరియు పైన కూడ ప్రకాశింప జేయు సూర్యుని వలె సర్వమునకు అధీశ్వరుడై యున్నాడు (45). త్రిగుణాత్మకమగు ప్రకృతిని నామరూపాత్మకమగు జగద్రూపముగా పరిణమింపజేసి, తానే భోగ్యమై, తానే భోక్తయై, ఆ జగత్తునకు అధీశ్వరుడై యున్నాడు (46). రహస్యములగు ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడువాడు, హృదయగుహలో నిగూఢముగా నుండువాడు, ప్రకృతికి అతీతుడు, హిరణ్యగర్భునకు తండ్రి, జగత్తునకు కారణము అగు పరంబ్రహ్మను దేవతలు మరియు మహర్షులు తెలియుచున్నారు (47). శుద్ధమగు అంతఃకరణముచే పొందబడువాడు, ఆశ్రయరహితుడని వర్ణింపబడినవాడు, సృష్టి ప్రళయములను చేయువాడు, కళలను సృష్టించువాడు అగు శివదేవుని ఎవరు తెలియుదురో, వారికి పునర్జన్మ లేదు (48). ఆ పరమేశ్వరుని మహిమ వలననే ఈ జగచ్చక్రము తిరుగుచున్నది. కానీ మోహమును పొందిన జనులు జగచ్చక్రము తిరుగుటకు కారణము స్వభావమనియు, కాలమనియు భ్రాంతి పడుచున్నారు (49). మృత్యువునకు మృత్యువు అగు ఆ పరమేశ్వరునిచే ఈ సర్వము చుట్టువారబడి యున్నది. ఆయనచే ప్రేరేపించబడిన కర్మనియతి పంచభూతములతో కలిసి జగద్రూపముగా భాసిల్లుచున్నది (వివర్తము) (50). జీవుడు అధికముగా కర్మలను చేసి, వాటి ఫలమును అనుభవించుటకై మరల మరల జన్మించుచుండును. ప్రతి జన్మయొక్క అంతములో దేహమునకు కారణమగు పంచభూతములు మహాభూతములలో కలియుటచే మరణము సంభవించును (51). జీవుడు పంచభూతములు మనో బుద్ధ్యహంకారములు అనే ఎనిమిది తత్త్వములతో గూడి సత్త్వరజస్తమోగుణములకు వశుడై, ఒకే ప్రకృతి ఆశ్రయముగా గలవాడై సుఖదుఃఖములనే రెండు ఫలములను ఆయా కాలములలో అనుభవించుచున్నాడు. పరమేశ్వరుడు తన స్వభావమైన త్రిగుణాత్మకమగు ప్రకృతినుండి సకలజగత్తును స్వయముగా ప్రకటింపజేసి, అజ్ఞానకామకర్మమూలకమగు సంసారమును జీవులకు వారి కర్మలను బట్టి కలిగించును. ఈ త్రిగుణములకు అతీతుడగు జ్ఞాని విషయములో సంచిత (పూర్వజన్మలలో చేసియున్న) కర్మలు పూర్తిగా నాశమును పొందును.

కర్మక్షయే పునశ్చాన్యత్తతో యాతి స తత్త్వతః ।
స ఏవాదిస్స్వయం యోగనిమిత్తం భోక్తృభోగయోః ॥
పరస్త్రి కాలాదకలస్స ఏవ పరమేశ్వరః ।
సర్వవిత్ త్రిగుణాధీశో బ్రహ్మ సాక్షాత్పరాత్పరః ॥
తం విశ్వరూపమభవం భావనీయం ప్రజాపతిమ్ ।
దేవదేవం జగత్పూజ్యం స్వచిత్తస్థముపాస్మహే ॥
కాలాదిభిః పరో యస్మాత్ప్ర పంచః పరివర్తతే ।
ధర్మావహం పాపనుదం భోగేశం విశ్వధామ చ ॥
తమీశ్వరాణాం పరమం మహేశ్వరం తం దేవతానాం పరమం చ దైవతమ్ ।
పతిం పతీనాం పరమం పరస్తాద్విదామ దేవం భువనేశ్వరేశ్వరమ్ ॥
న తస్య విద్యతే కార్యం కారణం చ న విద్యతే ।
న తత్సమోఽధికశ్చాపి క్వచిజ్జగతి దృశ్యతే ॥
పరాస్య వివిధా శక్తిః శ్రుతౌ స్వాభావికీ శ్రుతా ।
జ్ఞానం బలం క్రియా చైవ యాభ్యో విశ్వమిదం కృతమ్ ॥
న తస్యాస్తి పతిః కశ్చిన్నైవ లింగం న చేశితా ।
కారణం కారణానాం చ స తేషామధిపాధిపః ॥
న చాస్య జనితా కశ్చిన్న చ జన్మ కుతశ్చన ।
న జన్మ హేతవస్తద్వన్మలమాయాదిసంజ్ఞితాః ॥
స ఏకస్సర్వభూతేషు గూఢో వ్యాప్తశ్చ విశ్వతః ।
సర్వభూతాంతరాత్మా చ ధర్మాధ్యక్షస్స కథ్యతే ॥
సర్వభూతాధివాసశ్చ సాక్షీ చేతా చ నిర్గుణః ।
ఏకో వశీ నిష్క్రియాణాం బహూనాం వివశాత్మనామ్ ॥

ఒక జన్మను ఆరంభించిన కర్మ క్షయము కాగానే, ఆ జీవుడు మరియొక దేహమును పొందును. భోక్తయగు జీవునకు, భోగ్యము అగు లోకమునకు కర్మ ద్వారా సంబంధమును కలిగించేది జగత్కారణమగు ఆ పరమేశ్వరుడు మాత్రమే (54). భూత భవిష్యద్వర్తమాన కాలములకు అతీతుడు, అంశములు లేనివాడు, సర్వము తెలిసినవాడు, త్రిగుణాత్మకమగు ప్రకృతి తన వశములో గలవాడు, సర్వజగత్కారణమగు ప్రకృతికి అతీతుడు అగు ఆ పరమేశ్వరుడే సాక్షాత్తుగా పరంబ్రహ్మ (55). జగద్రూపముగా నున్నవాడు, పుట్టుక లేని వాడు, ధ్యానించదగినవాడు, ప్రాణికోటికి తండ్రి, జగత్తునకు పూజించదగినవాడు, మా చిత్తములయందున్నవాడు, ధర్మమునకు నిధానము, పాపములను పోగొట్టువాడు, భోగములకు ప్రభువు, జగత్తునకు ఆశ్రయము అగు ఆ దేవదేవుని ఉపాసించుచున్నాము. కాలము మొదలగు వాటికి అతీతుడగు ఆ పరమేశ్వరుని వలన మాత్రమే ఈ జగచ్చక్రము తిరుగుచున్నది (5 6, 57). లోకపాలాది ప్రభువులకు కూడ ప్రభువు, దేవతలకు కూడ పరమదైవము, తండ్రులకు తండ్రి, సర్వజగత్కారణమగు ప్రకృతికి అతీతుడు, ప్రకాశస్వరూపుడు, ముల్లోకములలోని ప్రభువులకు కూడా ప్రభువు అగు మహేశ్వరుని తెలియుచున్నాము (58).

పరంబ్రహ్మనుండి యథార్థమగు కార్యము ఉద్భవించుట లేదు. ఆయనకు మరియొక కారణము లేదు. ఆయనతో సమానుడు గాని, అధికుడు గాని లోకములో ఎక్కడనైననూ కానవచ్చుట లేదు (59). స్వభావసిద్ధము, సర్వోత్కృష్టము అగు పరమేశ్వరుని శక్తి వివిధరూపములలో ప్రకటమగునని వేదము చెప్పుచున్నది. జ్ఞానము, బలము మరియు క్రియ అనునవి ఆ శక్తి యొక్క రూపములే. వాటి వలన మాత్రమే ఈ జగత్తు సృష్టించబడు చున్నది (60). ఈశ్వరునిపై మరియొక ప్రభువు లేడు. పరంబ్రహ్మకు లింగము (గుణము, లేక స్త్రీ పురుషభేదము) లేదు. పరంబ్రహ్మయందు వాస్తవమగు ఈశ్వరత్వము కూడ లేదు. సర్వకారణములకు కారణమగు పరమేశ్వరుడు ప్రభువులందరికీ ప్రభువు (61). ఆయనకు తండ్రి ఎవ్వరూ లేరు. ఆయనకు దేనినుండియు పుట్టుక లేదు. అదే విధముగా కర్మ దోషములు, అజ్ఞానము మొదలగు జన్మకారణములు ఏవియు ఆయనకు లేవు (62). అద్వితీయుడగు పరమేశ్వరుడు సర్వమును వ్యాపించి, సర్వప్రాణులలో రహస్యముగా అంతర్యామి రూపముగా దాగియున్నాడు. ఆయన ధర్మమునకు అధ్యక్షుడుని వర్ణించబడుచున్నాడు (63). సర్వప్రాణులకు నివాసస్థానమగు ఆ పరమేశ్వరుడు సర్వప్రాణులలో సాక్షిరూపములో నుండే చేతనుడు. అనేకులు, అస్వతంత్రులు, స్వయముగా క్రియలను చేయలేని వారు అగు జీవులలోనుండే అద్వితీయుడగు పరమాత్మ నిర్గుణుడు మరియు స్వతంత్రుడు.

**నిత్యానామప్యసౌ నిత్యశ్చేతనానాం చ చేతనః ।**
**ఏకో బహూనాం చాకామః కామానీశః ప్రయచ్ఛతి ॥**
**సాంఖ్యయోగాధిగమ్యం యత్కారణం జగతః పతిమ్ ।**
**జ్ఞాత్వా దేవం పశుః పాశైస్సర్వైరేవ విముచ్యతే ॥**
**విశ్వకృద్విశ్వవిత్స్వాత్మయోనిజ్ఞః కాలకృద్గుణీ ।**
**ప్రధానః క్షేత్రజ్ఞపతిర్గుణేశః పాశమోచకః ॥**
**బ్రహ్మాణం విదధే పూర్వం వేదాంశ్చోపాదిశత్స్వయమ్ ।**
**యో దేవస్తమహం బుద్ధ్వా స్వాత్మబుద్ధిప్రసాదతః ॥**
**ముముక్షురస్మాత్సంసారాత్ప్ర పద్యే శరణం శివమ్ ।**
**నిష్కలం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనమ్ ॥**
**అమృతస్య పరం సేతుం దగ్ధేంధనమివానలమ్ ।**
**యదా చర్మవదాకాశం వేష్టయిష్యంతి మానవాః ॥**
**తదా శివమవిజ్ఞాయ దుఃఖస్యాంతో భవిష్యతి ॥**
**తపఃప్రభావాద్దేవస్య ప్రసాదాచ్చ మహర్షయః ।**
**ఆత్మాశ్రమోచితజ్ఞానం పవిత్రం పాపనాశనమ్ ॥**
**వేదాంతే పరమం గుహ్యం పురా కల్పప్రచోదితమ్ ।**
**బ్రహ్మణో వదనాల్లబ్ధం మయేదం భాగ్యగౌరవాత్ ॥**
**నా ప్రశాంతాయ దాతవ్యమేతద్ జ్ఞానమనుత్తమమ్ ।**
**న పుత్రాయాసువృత్తాయ నాశిష్యాయ చ సర్వథా ॥**

యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥
అతశ్చ సంక్షేపమిదం శృణుధ్వం శివః పరస్తాత్ప్ర కృతేశ్చ పుంసః ।
స సర్గకాలే చ కరోతి సర్వం సంహారకాలే పునరాదదాతి ॥
ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే
శివతత్త్వజ్ఞానవర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥

పరమేశ్వరుడు (ప్రవాహరూపముగా) నిత్యమగు వాటిలో (కూటస్థ) నిత్యుడు; అనేకములగు చేతనములలోని అద్వితీయ చేతనుడు. కోరికలు లేని ఆ ఈశ్వరుడు కోరికలనిచ్చును (65). జ్ఞానయోగముచే పొందదగినవాడు, జగత్తునకు కారణమైనవాడు, జగన్నాథుడు అగు ఆ దేవుని తెలుసుకున్న జీవుడు సంసారబంధములన్నింటినుండి నిశ్చితముగా విముక్తుడగును (66). జగత్తును సృష్టించినవాడు, జగత్తును సాక్షిరూపముగా తెలియువాడు, తన స్వరూపమును తెలిసిన వాడు, కాలమును సృష్టించువాడు, మాయాసంబంధముచే కల్యాణగుణములు కలవాడు, ప్రకృతికి అధిష్ఠానమైనవాడు, జీవులకు ప్రభువు, సత్త్వరజస్తమోగుణములకు అధిష్ఠానము అగు ఆ ఈశ్వరుడు సంసారబంధమునుండి విముక్తిని కలిగించును (67). ఆ దేవుడు సృష్ట్యాదియందు బ్రహ్మను సృష్టించి ఆయనకు స్వయముగా వేదములను ఉపదేశించెను. మోక్షమును కోరు నేను ప్రసన్నమగు నా బుద్ధియొక్క ప్రభావముచే అంశములు లేనివాడు, క్రియాసంబంధము లేనివాడు, సర్వనిషేధములకు అవధి, దోషరహితుడు, కర్మలేపము లేనివాడు అగు ఆ శివుని తెలుసుకొని శరణు వేడుచున్నాను (68, 69). మోక్షమునకు సర్వోత్కృష్టమగు సేతువు వంటి వాడు అగు శివుని తెలుసుకొని నేను కట్టెలన్నియు కాలిన తరువాత నిప్పువలే నా స్వరూపమగు శివునిలో నా అహంకారమును ఉపశమింపజేసెదను. మానవులు చర్మమును వలె ఆకాశమును కూడ ధరించ గల్గిననాడు శివుని తెలియకుండగనే దుఃఖము అంతమగును (అనగా, శివుని తెలియకుండగా దుఃఖము అంతము కాదు) (70,71). ఓ మహర్షులారా! తపస్సుయొక్క మహిమచే మరియు దేవుని అనుగ్రహముచే మీ ఆశ్రమమునకు తగినది, పవిత్రమైనది, పాపములను నశింపజేయునది, ఉపనిషత్తులలో రహస్యముగా దాగియున్నది, పూర్వకల్పములో బోధించబడినది అగు ఈ జ్ఞానమును నేను నా భాగ్యము దొడ్డది అగుట వలన బ్రహ్మగారి నోటినుండి వినియుంటిని (72,73). సర్వోత్కృష్టమగు ఈ జ్ఞానమును ప్రసన్నమగు మనస్సు లేనివానికి, పుత్రుడే అయిననూ సచ్ఛీలము లేనివానికి, శిష్యుడు కానివానికి ఎట్టి పరిస్థితులలోనైననూ ఈయరాదు (74). ఎవనికైతే పరమేశ్వరునియందు సర్వోత్కృష్టమగు భక్తి ఉండునో, దేవునితో సమానమగు భక్తి గురువుయందు ఉండునో, అట్టి మహాత్మునకు ఇంతవరకు చెప్పబడిన విషయములు చక్కగా అవగాహనకు వచ్చును (75). ఈ పైన సంగ్రహముగా చెప్పెదను. వినుడు. ప్రకృతికి మరియు పురుషునకు కూడ శివుడు అతీతుడై యున్నాడు. ఆయన సృష్టిసమయములో సర్వమును సృష్టించి, ప్రళయకాలములో మరల తనలోనికి ఉపసంహరించును.

# 7 – కాల మహిమ

మునయ ఊచుః ।

కాలాదుత్పద్యతే సర్వం కాలాదేవ విపద్యతే ।
న కాలనిరపేక్షం హి క్వచిత్కించిద్ధి విద్యతే ॥
యదాస్యాంతర్గతం విశ్వం శశ్వత్సంసారమండలమ్ ।
సర్గసంహృతిముద్రాభ్యాం చక్రవత్పరివర్తతే ॥
బ్రహ్మా హరిశ్చ రుద్రశ్చ తథాఽ   న్యే చ సురాసురాః ।
యత్కృతాం నియతిం ప్రాప్య ప్రభవో నాతివర్తితుమ్ ॥
భూతభవ్య భవిష్యాద్యైర్విభజ్య జరయన్ ప్రజాః ।
అతిప్రభురితి స్వైరం వర్తతేఽతిభయంకరః ॥
క ఏష భగవాన్ కాలః కస్య వా వశవర్త్యయమ్ ।
క ఏవాస్య వశే న స్యాత్కథమైతద్విచక్షణ ॥

మునులు ఇట్లు పలికిరి –

సర్వము కాలము వలన పుట్టి, కాలము వలననే నశించుచున్నది. కాలసం౦బంధము లేనిది ఏదైననూ ఎక్కడైననూ లేదు (1). కాలముయొక్క నోటిలోపల చిక్కుకున్న బ్రహ్మాండ మండలమంతయు సృష్టి మరియు ప్రలయము అనే రెండు అవధుల మధ్యలో చక్రము వలె నిరంతరముగా తిరుగుచున్నది (2). కాలము నిర్ధారించే భాగ్యాభాగ్యములను బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మరియు ఇతరులగు దేవతలు, రాక్షసులు కూడ అతిక్రమింప సమర్థులు కారు (3). మిక్కిలి భయంకరమగు కాలము తనను తాను భూతవర్తమానభవిష్యత్తులనే మూడు ఖండములుగా విభాగము చేసి జనులను ముదుసలులను చేయుచూ సర్వాధికారములను చేజిక్కుంచుకున్న పాలకుని వలే యథేచ్ఛగా ప్రవర్తిల్లుచున్నది (4). ఈ కాలభగవానుడు ఎవరు? ఈ కాలము ఎవరి వశములో నున్నది? దీనికి వశము కానివారు ఎవరు? ఓ జ్ఞానీ! ఈ విషయమును చెప్పుము.

వాయురువాచః

కలాకాష్ఠానిమేషాదికలాకలితవిగ్రహమ్ ।
కాలాత్మేతి సమాఖ్యాతం తేజో మాహేశ్వరం పరమ్ ॥
యదలంఘ్యమశేషస్య స్థావరస్య చరస్య చ ।
నియోగరూపమీశస్య బలం విశ్వనియామకమ్ ॥
తస్యాంశాంశమయీ శక్తిః కాలాత్మని మహాత్మని ।
తతో నిష్క్రమ్య సంక్రాంతా విస్ఫులిఙ్గేరివాయసీ ॥
తస్మాత్కాల వశే విశ్వం న స విశ్వవశే స్థితః ।
శివస్య తు వశే కాలో న కాలస్య వశే శివః ॥
యతోఽప్రతిహతం శార్వం తేజః కాలే ప్రతిష్ఠితమ్ ।
మహతీ తేన కాలస్య మర్యాదా హి దురత్యయా ॥

కాలం ప్రజ్ఞావిశేషేణ కోఽతివర్తితుమర్హతి ।
కాలేన తు కృతం కర్మ న కశ్చిదతివర్తతే ॥
ఏకచ్ఛత్రాం మహీం కృత్స్నాం యే పరాక్రమ్య శాసతి ।
తేఽపి నైవాతివర్తంతే కాలం వేలామివాబ్ధయః ॥
యే నిగృహ్యేంద్రియగ్రామం జయంతి సకలం జగత్ ।
న జయంత్యపి తే కాలం కాలో జయతి తానపి ॥
ఆయుర్వేదవిదో వైద్యాస్స్వనుష్ఠితరసాయనా।
న మృత్యుమతివర్తంతే కాలో హి దురతిక్రమః ॥
శ్రియా రూపేణ శీలేన బలేన చ కులేన చ ।
అన్యచ్చింతయతే జంతుః కాలో ఽ న్యత్కురుతే బలాత్ ॥

వాయువు ఇట్లు పలికెను –

మహేశ్వరుని సర్వోత్కృష్టమగు తేజస్సు కళ, కాష్ఠ, నిమేషము మొదలైన కాలావయవములతో రాజిల్లునదియై కాలాత్మ అని పిలువబడుచున్నది (6). ఈశ్వరుని బలము అనదగిన కాలము సమస్తమైన చరాచరజగత్తు ఉల్లంఘించ శక్యము కాని ఈశ్వరుని అధ్యాదేశము వంటిది. కాలమే జగత్తును నియంత్రించుచున్నది (7). ఆ పరమేశ్వరుని శక్తియొక్క అంశములోని అంశము నిప్పులను గ్రక్కే ఇనుప ముక్క వలె ఆయననుండి బయటకు వచ్చి గొప్పది యగు కాలపురుషరూపముగా సంక్రమించినది (8). కావున, జగత్తు కాలమున అధీనమై యున్నది. కాలము జగత్తునకు వశములో లేదు. కాని, కాలము శివుని వశములో నున్నది. శివుడు కాలమునకు వశములో లేడు {9}. ప్రతిఘటింప శక్యము కాని శివుని తేజస్సు కాలము నందు ప్రతిష్ఠితమై యున్నది. కావున, కాలముయొక్క పరిధి చాల గొప్పది మరియు అతిక్రమించ శక్యము కానిది (10). ఏ మానవుడు తన బుద్ధియొక్క మహిమచే కాలమునతిక్రమించ గలడు? కాలముచే సంక్రమింప జేయబడిన కర్మఫలమును ఎవ్వరైననూ తప్పించుకొనలేరు (11). ఎవరైతే పరాక్రమించి భూమినంతనూ ఏకచ్ఛత్రాధిపత్యముగా పాలించెదరో, వారైననూ సముద్రములు చెలియలికట్టను వలె కాలమును అతిక్రమించలేరు (12). ఎవరైతే ఇంద్రియసమూహమును నిగ్రహించి సకలజగత్తును జయించెదరో, వారైననూ కాలమును జయించలేరు. కాలమే వారిని జయించును (13). ఆయుర్వేద విద్వాంసులగు వైద్యులు రసాయనములను తయారు చేసెదరు. కానీ, వారు మృత్యువును అతిక్రమించలేరు. కాలము ఎవ్వరికైననూ అతిక్రమింప శక్యము కానిది (14). సంపద, సౌందర్యము, శీలము, బలము, కులము అను వాటిని ఆధారముగా చేసుకొని మానవుడు ఒకటి తలపెట్టగా, కాలము బలాత్కారముగా మరియొక దానిని చేసిపెట్టును.

అప్రియైశ్చ ప్రియైశ్చైవ హ్యచింతితసమాగమైః।
సంయోజయతి భూతాని వియోజయతి చేశ్వరః ॥
యదైవ దుఃఖితః కశ్చిత్తదైవ సుఖితః పరః ।
దుర్విజ్ఞేయస్వభావస్య కాలస్యాహో విచిత్రతా ॥
యో యువా స భవేద్వృద్ధో యో బలీయాన్ స దుర్బలః ।
యః శ్రీమాన్ సో ఽపి నిఃశ్రీకః కాలశ్చిత్రగతిర్ద్విజాః ॥
నాభిజాత్యం న వై శీలం న బలం న చ నైపుణమ్ ।
భవేత్కార్యాయ పర్యాప్తం కాలశ్చ హ్యనిరోధకః ॥
యే సనాథాశ్చ దాతారో గీతవాద్యైరుపస్థితాః ।
యే చానాథాః పరాన్నదా కాలస్తేషు సమక్రియః ॥
ఫలంత్యకాలే న రసాయనాని సమ్యక్ప్రయుక్తాన్యపి చౌషధాని ।
తాన్యేవ కాలేన సమాహృతాని సిద్ధిం ప్రయాంత్యాశు సుఖం దిశంతి ॥
నాకాలతోఽయం మ్రియతే జాయతే వా నాకాలతః పుష్టిమగ్ర్యాముపైతి ।
నాకాలతస్సుఖితం దుఃఖితం వా నాకాలికం వస్తు సమస్తి కించిత్ ॥
కాలేన శీతః ప్రతివాతి వాతః కాలేన వృష్టిర్జలదానుపైతి ।
కాలేన చోష్మా ప్రశమం ప్రయాతి కాలేన సర్వం సఫలత్వమేతి ॥
కాలశ్చ సర్వస్య భవస్య హేతుః కాలేన సస్యాని భవంతి నిత్యమ్ ।
కాలేన సస్యాని లయం ప్రయాంతి కాలేన సంజీవతి జీవలోకః ॥
ఇత్థం కాలాత్మనస్తత్వం యో విజానాతి తత్త్వతః ।
కాలాత్మానమతిక్రమ్య కాలాతీతం స పశ్యతి ॥
న యస్య కాలో న చ బంధముక్తి న యః పుమాన్న ప్రకృతిర్న విశ్వమ్ ।
విచిత్రరూపాయ శివాయ తస్మై నమః పరస్మై పరమేశ్వరాయ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే కాలమహిమ
వర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥

పరమేశ్వరుడు ప్రాణులకు ప్రియములు మరియు ప్రియములు కానివి అగు వస్తువులతో, లేదా వ్యక్తులతో అనుకోకుండగా సమాగమమును కలిగించి, మరల వియోగమును కలిగించుచున్నాడు (16). ఏ కాలములో ఒకడు దుఃఖించుచున్నాడో, అదే కాలములో మరియొకడు సుఖించుచున్నాడు. అహో! తెలియ శక్యము కాని స్వభావము గల కాలము ఎంత విచిత్రమైనదియో! (17) యువకుడు ముదుసలి యగుచున్నాడు. బలవంతుడు దుర్బలుడగుచున్నాడు. ధనవంతుడు దరిద్రుడగుచున్నాడు. ఓ బ్రాహ్మణులారా! కాలముయొక్క తీరుతెన్నులు చిత్రమైనవి (18). ఒక వ్యక్తి పుట్టిన వంశముయొక్క మహిమ గాని, శీలము, బలము, నైపుణ్యము అనునవి గాని, ఒక కార్యమును సాధించుటకు చాలవు. కాలమును ఆపగలవారు లేరు (19). తమకు రక్షకులు ఉండి దాతలు అయినవారు, సంగీతము వాద్యములు మొదలగు వాటితో తులదూగువారు, అనాథులు, బిచ్చమెత్తుకుని బ్రతుకువారు, వీరందరియందు కాలము సమానమగు ప్రవృత్తిని చూపుచున్నది (20). శాస్త్రీయముగా తయారు కాబడిన ఎంత చక్కని మందులు అయిననూ, కాలము పరిపక్వము కానిదే పని చేయవు. కాని, కాలము కలిసి వచ్చినప్పుడు అవే మందులను వాడినచో వెంటనే ఆరోగ్యము సిద్ధించి సుఖము లభించును (21). మానవుడు కాలము రాకుండగా మరణించడు; పుట్టడు; మరియు, కాలము రానిదే, కొనియాడదగిన పుష్టిని పొందడు. కాలము రాకుండగా సుఖము గాని, దుఃఖము కాని,సంప్రాప్తము కావు. సమస్తజగత్తులో కాలము పరిపక్వము కానిదే ఏ వస్తువు అయిననూ లభించదు (22). కాలమును బట్టి చలిగాలులు వీచును. కాలమును బట్టి మేఘములలోనికి నీరు వచ్చును. కాలము వచ్చినప్పుడు వేడి తగ్గును. కాలము వచ్చినప్పుడు సర్వము సఫలమగును (23). పుట్టుకలన్నింటికీ కాలమే కారణము. కాలము వచ్చినప్పుడు మాత్రమే ప్రతి సంవత్సరము పంటలు పండును. కాలము వచ్చినప్పుడు పంటలు చెడిపోవును. ఈ ప్రాణిసముదాయము తమ తమ ఆయుఃకాలములో చక్కగా జీవించును (24). కాలపురుషుని తత్త్వమును ఈ విధముగా యథార్థముగా ఎవడు తెలుసుకొనునో, ఆతడు ఈశ్వరుని కాలస్వరూపమునతిక్రమించి, కాలాతీతుడగు ఈశ్వరుని దర్శించును (25). ఎవనికి కాలము గాని, బంధము గాని, మోక్షము గాని లేవో, ఎవడు పురుషుడు గాని, ప్రకృతి గాని, జగత్తు గాని కాదో, అట్టి విచిత్రమగు స్వరూపము గలవాడు, మంగళకరుడు, సర్వాతీతుడు అగు పరమేశ్వరుని కొరకు నమస్కారము.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో కాలమహిమను వర్ణించే ఏడవ అధ్యాయము ముగిసినది.

# 8 – యుగ సంఖ్యా వర్ణనము

**ఋషయ ఊచుః ।**

**కేన మానేన కాలే ఽస్మిన్నాయుస్సంఖ్యా ప్రకల్ప్యతే ।**
**సంఖ్యారూపస్య కాలస్య కః పునః పరమోఽ వధిః ॥**

ఋషులు ఇట్లు పలికిరి –

ఈ కాలమునందు ఏ మానముచే ఆయుర్దాయము పరిగణించబడుచున్నది? సంఖ్యారూపములోనుండే ఈ కాలమానములో చరమసంఖ్య ఏది?

**వాయురువాచః**

**ఆయుషోఽత్ర నిమేషాఖ్యమాద్యమానం ప్రచక్షతే ।**
**సంఖ్యారూపస్య కాలస్య శాంత్యతీతకలావధిః ॥**
**అక్షిపక్ష్మపరిక్షేపో నిమేషః పరికల్పితః ।**
**తాదృశానాం నిమేషాణాం కాష్ఠా దశ చ పంచ చ ॥**
**కాష్ఠాస్త్రింశత్కలా నామ కలాస్త్రింశన్ముహూర్తకః ।**
**ముహూర్తానామపి త్రింశదహోరాత్రం ప్రచక్షతే ॥**
**త్రింశత్సంఖ్యైరహో రాత్రై ర్మాసః పక్షద్వయాత్మకః ॥**
**జ్ఞేయం పిత్ర్యమహోరాత్రం మాసః కృష్ణసితాత్మకః ॥**
**మాసైస్త్రరయనం షడ్భిర్వర్షం ద్వే చాయనే మతమ్ ।**
**లౌకికేనైవ మానేన అబ్దో యో మానుషస్స్మృతః ॥**
**ఏతద్దివ్యమహోరాత్రమితి శాస్త్రస్య నిశ్చయః ।**
**దక్షిణం చాయనే రాత్రిస్తథోదగయనం దినమ్ ॥**
**మాసస్త్రింశదహోరాత్రై ర్దివ్యో మానుషవత్స్మృతః ।**
**సంవత్సరోఽపి దేవానాం మాసైర్ద్వాదశభిస్తథా ॥**
**త్రీణి వర్షశతాన్యేవ షష్టివర్షయుతాన్యపి ।**
**దివ్యస్సంవత్సరో జ్ఞేయో మానుషేణ ప్రకీర్తితః ॥**
**దివ్యేనైవ ప్రమాణేన యుగసంఖ్యా ప్రవర్తతే ।**
**చత్వారి భారతే వర్షే యుగాని కవయో విదుః ॥**

వాయువు ఇట్లు పలికెను –

ఆయుర్దాయములోని మొట్టమొదటి మానమునకు నిమేషము అని పేరు. సంఖ్యారూపమగు కాలమునకు శాంత్యతీతము అనే కాలాంశము అంతిమమానమని చెప్పెదరు (2). కనురెప్పపాటు కాలమునకు నిమేషము అని పేరు. పదిహేను నిమేషములు ఒక కాష్ఠ యగును (3). ముప్పది కాష్ఠలు ఒక కళ యగును. ముప్పది కళలు ఒక ముహూర్తము అగును. ముప్పది ముహూర్తములు ఒక రోజు (రాత్రి మరియు పగలు) అగును (4). ముప్పది రోజులు ఒక నెల. ఒక

నెలలో రెండు పక్షములు గలవు (5). కృష్ణపక్షము మరియు శుక్లపక్షము కలిసి ఒక నెల అగును. అట్టి నెల పితృదేవతలకు ఒక రోజు అగును (6). ఆరు మాసములు ఒక అయనము. రెండు అయనములు ఒక సంవత్సరము. ఈ లోకములో మనుష్యమానముచే ఏ కాలము సంవత్సరమో, అదే కాలము దేవతలకు ఒక రోజు అని, అనగా ఉత్తరాయణము పగలు మరియు దక్షిణాయనము రాత్రి అని శాస్త్రముయొక్క నిశ్చయము (7,8). మనుష్యమానములో వలెనే, ముప్పది దివ్య దినములు ఒక దివ్యమాసము అగును. అదే విధముగా, పన్నెండు దివ్యమాసములు దేవతలకు ఒక సంవత్సరమగును (9). మనుష్యమానముచే మూడు వందల అరవై సంవత్సరముల కాలము దేవతలకు ఒక సంవత్సరమగును (10). యుగముల సంఖ్య దివ్యమానముచే మాత్రమే లెక్కించబడుచున్నది. భారతదేశములో నాలుగు యుగములు ఉండునని పండితులు చెప్పుచున్నారు.

పూర్వం కృతయుగం నామ తతస్త్రేతా విధీయతే ।
ద్వాపరం చ కలిశ్చైవ యుగాన్యేతాని కృత్స్నశః ॥
చత్వారి తు సహస్రాణి వర్షాణాం తత్కృతం యుగమ్ ।
తస్య తావచ్ఛతీ సంధ్యా సంధ్యాంశశ్చ తథావిధః ॥
ఇతరేషు ససంధ్యేషు ససంధ్యాంశేషు చ త్రిషు ।
ఏకపాయేన వర్తంతే సహస్రాణి శతాని చ ॥
ఏతద్ద్వాదశసాహస్రం సాధికం చ చతుర్యుగమ్ ।
చతుర్యుగసహస్రం యత్స కల్ప ఇతి కథ్యతే ॥
చతుర్యుగైకసప్తత్యా మనోరంతరముచ్యతే ।
కల్పే చతుర్దశైకస్మిన్మనూనాం పరివృత్తయః ॥
ఏతేన క్రమయోగేన కల్పమన్వంతరాణి చ ।
సప్రజాని వ్యతీతాని శతశో ఽ థ సహస్రశః ॥
అజ్ఞేయత్వాచ్చ సర్వేషామసంఖ్యేయతయా పునః ।
శక్యో నైవానుపూర్వ్యాద్వై తేషాం వక్తుం సువిస్తరః ॥
కల్పో నామ దివా ప్రోక్తో బ్రహ్మణో ఽ వ్యక్తజన్మనః ।
కల్పానాం వై సహస్రం చ బ్రాహ్మం వర్షమిహోచ్యతే ॥
వర్షాణామష్టసాహస్రం యచ్చ తద్బ్రహ్మణో యుగమ్ ।
సవనం యుగసాహస్రం బ్రహ్మణః పద్మజన్మనః ॥
సవనానాం సహస్రం చ త్రిగుణం త్రివృతం తథా ।
కల్ప్యతే సకలః కాలో బ్రహ్మణః పరమేష్ఠినః ॥

కృత, త్రేతా, ద్వాపర, కలియుగములు అనునవి మొత్తము నాలుగు యుగములు (12). నాలుగు వేల సంవత్సరములు కృతయుగము. నాలుగు వందల సంవత్సరములు రెండు యుగముల మధ్య సంధి. వంద సంవత్సరములు సంధ్యాంశము (సంధిలోని భాగము) (13). వీటిలో క్రమముగా ఒకటి ఒకటి చొప్పున వేలలో తగ్గించినచో యుగములు, వందలలో తగ్గించినచో యుగసంధులు

మరియు సంధ్యాంశములు అగును (14). ఈ విధముగా అధికాంశములతో కలిపి పన్నెండు వేల సంవత్సరముల కాలము ఒక కల్పము అని పేరు (15). డెబ్బది ఒక్క చతుర్యుగములు ఒక మన్వంతరమగును. ఒక కల్పములో పదు నాలుగు మన్వంతరములు ఉండును (16). ఈ విధముగా ప్రజలతో కూడియున్న కల్పములు మరియు మన్వంతరములు వందల మరియు వేల సంఖ్యలో ఒక క్రమములో గడచి పోయినవి (17). వాటి సంఖ్య అపరిమితము. వాటిని సంపూర్ణముగా తెలియుట సాధ్యము కాదు. కావున వాటిని ఖచ్చితమగు క్రమములో విస్తారముగా వర్ణించుట శక్యము కానే కాదు (18). అవ్యక్తము (మాయాశక్తి) నుండి జన్మించిన బ్రహ్మకు కల్పము ఒక పగలు అగును. ఈ బ్రహ్మాండములో వేయి కల్పములు బ్రహ్మకు ఒక సంవత్సరమగును (19). ఇట్టి వేయి సంవత్సరములు బ్రహ్మకు ఒక యుగము అగును. ఇట్టి వేయి యుగములు పద్మమునుండి జన్మించిన బ్రహ్మకు ఒక సవనమగును (20). సర్వజగత్కారణమగు బ్రహ్మకు మూడువేల మూడు సవనములు పూర్ణమగు ఆయుర్దాయము అగును.

**తస్య వై దివసే యాంతి చతుర్దశ పురందరాః ।**
**శతాని మాసే చత్వారి వింశత్యా సహితాని చ ॥**
**అబ్దే పంచ సహస్రాణి చత్వారింశద్యుతాని చ ।**
**చత్వారింశత్సహస్రాణి పంచ లక్షాణి చాయుషి ॥**
**బ్రహ్మా విష్ణోర్దినే చైకే విష్ణూ రుద్రదినే తథా ।**
**ఈశ్వరస్య దినే రుద్రస్సదాఖ్యస్య తథేశ్వరః ॥**
**సాక్షాచ్ఛివస్య తత్సంఖ్యస్తథా సోఽపి సదాశివః ।**
**చత్వారింశత్సహస్రాణి పంచలక్షాణి చాయుషి ॥**
**తస్మిన్ సాక్షాచ్ఛివేనైష కాలాత్మా సంప్రవర్తతే ।**
**యత్తత్సృష్టేస్సమాఖ్యాతం కాలాంతరమిహ ద్విజాః ॥**
**ఏతత్కాలాంతరం జ్ఞేయమహర్వై పరమేశ్వరమ్ ।**
**రాత్రిశ్చ తావతీ జ్ఞేయా పారమేశస్య కృత్స్నశః ॥**
**అహస్తస్య తు యా సృష్టీ రాత్రిశ్చ ప్రలయస్స్మృతః ।**
**అహర్న విద్యతే తస్య న రాత్రిరితి ధారయేత్ ॥**
**ఏషో ఽ పచారః క్రియతే లోకానాం హితకామ్యయా ।**
**ప్రజాః ప్రజానాం పతయో మూర్తయశ్చ సురాసురాః ॥**
**ఇంద్రియాణీంద్రియార్థాశ్చ మహాభూతాని పంచ చ ।**
**తన్మాత్రాణ్యథ భూతాదిర్బుద్ధిశ్చ సహ దైవతైః ॥**
**అహస్తిష్ఠంతి సర్వాణి పరమేశస్య ధీమతః ।**
**అహరంతే ప్రలీయంతే రాత్ర్యంతే విశ్వసంభవః ॥**
**యో విశ్వాత్మా కర్మకాలస్వభావాద్యర్థే శక్తిర్యస్య నోల్లంఘనీయా ।**
**యస్యైవాజ్ఞాధీనమేతత్సమస్తం నమస్తస్మై మహతే శంకరాయ ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే చతుర్యుగసంఖ్యా నిరూపణం నామ అష్టమోఽధ్యాయః ॥**

బ్రహ్మగారి ఒక రోజులో పదు నాలుగు, నెలలో నాలుగు వందల ఇరవై, సం◌ంవత్సరములో ఆయిదు వేల నలభై, మరియు పూర్ణాయుర్దాయములో అయిదు లక్షల నలభై వేల ఇంద్రుల ఆయుర్దాయము పూర్తి యగును (22, 23). బ్రహ్మయొక్క ఆయుర్దాయము విష్ణువునకు ఒక రోజు, విష్ణువుయొక్క ఆయుర్దాయము రుద్రునకు ఒక రోజు. అదే విధముగా, రుద్రుని ఆయుర్దాయము సదాశివునకు ఒక రోజు, సదాశివుని ఆయుర్దాయము సాక్షాత్తుగా ఈశ్వరునకు ఒక రోజు, సదాశివుని ఆయుర్దాయములో అయిదు లక్షల నలభై వేల మంది రుద్రులు ఉందురు (24,25). ఈ కాలపురుషుడు సాక్షాత్తుగా శివునిచే ప్రేరితుడై జగత్తులో ప్రవర్తిల్లుచున్నాడు. ఓ బ్రాహ్మణులారా! ఈ లోకములో సృష్టికి సంబంధించి వర్ణించబడిన సర్వము కాలములో అంతర్భాగమగును (26). ఈ సృష్టి అనే కాలఖండము పరమేశ్వరునకు పగలు. పరమేశ్వరుని రాత్రి కూడ ఇదే కాలపరిమాణములో నుండునని తెలియుడు (27). పరమేశ్వరుని పగలు సృష్టి. ఆయన రాత్రియే ప్రళయమని మహర్షులు చెప్పుచున్నారు. కాని, పరమేశ్వరునకు యథార్థముగా పగలు, రాత్రి ఉండవని తెలియవలెను (28). ప్రాణుల హితమును గోరి పరమేశ్వరుడు ఈ ప్రళయమును చేయును. ప్రజలు, ప్రజాపతులు, త్రిమూర్తులు, దేవతలు, రాక్షసులు (29), ఇంద్రియములు, ఇంద్రియములకు గోచరమగు విషయములు, పంచ మహాభూతములు, వాటి సూక్ష్మకారణములగు పంచ తన్మాత్రలు, మహత్తత్త్వము (పంచభూతములకు కారణము), దేవతలు (30) అను ఈ సర్వము చైతన్యస్వరూపుడగు పరమేశ్వరుని పగటి సమయములో ఉనికిని కలిగియున్నవి. పగలు పూర్తి కాగానే ఇవి అన్నీ ఆయనలో విలీనమగును. రాత్రి పూర్తి కాగానే మరల జగత్తు పుట్టును (31). ఆ ఈశ్వరుడు జగత్తుయొక్క రూపములో ప్రకటమై యున్నాడు. కర్మ కాలము, అవిద్య మొదలగు రూపములలో ప్రకటమయ్యే ఆ పరమేశ్వరుని శక్తిని ఎవ్వరైననూ ఉల్లంఘించలేరు. ఈ సకలజగత్తు ఆయన ఆజ్ఞకు వశవర్తియై యున్నది. అట్టి పరబ్రహ్మస్వరూపుడగు శంకరునకు నమస్కారము.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో యుగసంఖ్యావర్ణనము అనే ఎనిమిదవ అధ్యాయము ముగిసినది.

# 9 – సృష్టి స్థితి లయములు

**మునయ ఊచుః ।**

**కథం జగదిదం కృత్స్నం విధాయ చ నిధాయ చ ।**
**ఆజ్ఞయా పరమాం క్రీడాం కరోతి పరమేశ్వరః ॥**
**కింతత్ప్ర థమసంభూతం కేనేదమఖిలం తతమ్ ।**
**కేన వా పునరేవేదం గ్రస్యతే పృథుకుక్షిణా ॥**

మునులు ఇట్లు పలికిరి -

పరమేశ్వరుడు ఈ జగత్తునంతనూ సృష్టించి తన ఆజ్ఞచే పాలించి, మరల ఉపసం◌ంహరించి గొప్ప క్రీడను చేయుచున్నాడు. ఆ విధమెట్టిది? (1) మున్ముందుగా ఏది సృష్టించబడినది? ఈ సర్వము దేనిచే వ్యాప్తమై యున్నది? ఎవడు మరల దీనినంతనూ కబళించి వేయును? వాని పొట్ట చాల పెద్దది అయి ఉండును! (2)

**వాయురువాచః**

**శక్తిః ప్రథమసంభూతా శాంత్యతీతపదోత్తరా ।**
**తతో మాయా తతో ఽ వ్యక్తం శివాచ్ఛక్తిమతః ప్రభోః ॥**
**శాంత్యతీతపదం శక్తేస్తతశ్శాంతిపదం క్రమాత్ ।**
**తతో విద్యాపదం తస్మాత్ప్ర తిష్ఠాపదసంభవః ॥**
**నివృత్తిపదముత్పన్నం ప్రతిష్ఠాపదతః క్రమాత్ ।**
**ఏవముక్తా సమాసేన సృష్టిరీశ్వరచోదితా ॥**
**ఆనులోమ్యాత్తథైతేషాం ప్రాతిలోమ్యేన సంహృతిః ।**
**అస్మాత్పంచపదోద్దిష్టాత్పరస్స్రష్టా సమిష్యతే ॥**
**కలాభిః పంచభిర్వ్యాప్తం తస్మాద్విశ్వమిదం జగత్ ।**
**అవ్యక్తం కారణం యత్తదాత్మనా సమనుష్ఠితమ్ ॥**
**మహదాదివిశేషాంతం సృజతీత్యపి సంమతమ్ ।**
**కిం తు తత్రాపి కర్తృత్వం నావ్యక్తస్య న చాత్మనః ॥**
**అచేతనత్వాత్ప్ర కృతేరజ్ఞత్వాత్పురుషస్య చ ।**
**ప్రధానపరమాణ్వాది యావత్కించిదచేతనమ్ ॥**
**తత్కర్తృకం స్వయం దృష్టం బుద్ధిమత్కారణం వినా ।**
**జగచ్చ కర్తృసాపేక్షం కార్యం సావయవం యతః ॥**
**తస్మాచ్ఛక్తస్స్వతంత్రో యస్సర్వశక్తిశ్చ సర్వవిత్ ।**
**అనాదినిధనశ్చాయం మహదైశ్వర్యసంయుతః ॥**
**స ఏవ జగతః కర్తా మహాదేవో మహేశ్వరః ।**
**పాతా హర్తా చ సర్వస్య తతః పృథగనన్వయః ॥**

పరిణామః ప్రధానస్య ప్రవృత్తిః పురుషస్య చ ।
సర్వం సత్యవ్రతస్యైవ శాసనేన ప్రవర్తతే ॥

వాయువు ఇట్లు పలికెను -

ముందుగా శక్తి ఉద్భవించెను. ఆ తరువాత శాంత్యతీతపదము (శాంతికి అతీతముగా నుండే ధామము) ఉద్భవించెను. తరువాత శక్తితో కూడియున్న ఆ పరమేశ్వరునినుండి మాయ, ఆ తరువాత అవ్యక్తము (వివిధరూపములలో ప్రకటమైన జగత్తుయొక్క బీజరూపము) పుట్టినవి (3). శక్తినుండి శాంత్యతీతపదము, శాంతిపదము ఆ వరుసలో ప్రకటమైనవి. శాంతిపదమునుండి విద్యాపదము, దానినుండి ప్రతిష్ఠాపదము పుట్టినవి (4). అదే వరుసలో ప్రతిష్ఠాపదమునుండి నివృత్తిపదము పుట్టినది. ఈ విధముగా ఈశ్వరుని ప్రేరణచే జరిగిన సృష్టి పైనుండి క్రిందికి వరుసలో సంగ్రహముగా చెప్పబడినది. దీనికి విరుద్ధమగు క్రమములో ప్రళయము జరుగును. ఈ అయిదు పదములకంటే ఉత్కృష్టుడగు సృష్టికర్త వీటిచే సూచించబడుచున్నాడు (5,6). కావున, ఈ జగత్తు అంతయు ఈ అయిదు కళలచే వ్యాప్తమై యున్నది. సర్వకారణమగు ఆ అవ్యక్తము ఆయా రూపములలో తానే పరిణమించి ప్రకటమగుచున్నది (7). మాయాశక్తి మహత్తత్త్వమునుండి మొదలిడి పంచభూతములలోని విశేషగుణముల వరకు సృష్టించునని అంగీకారమే. కానీ ప్రకృతి జడమగుట వలన, పురుషుడు అజ్ఞాని యగుట వలన, వాటి సృష్టి విషయములో కర్తృత్వము అవ్యక్తము (ప్రకృతి) నకు గాని, ఆత్మకు గాని లేదు. ప్రధానము (ప్రకృతి) నుండి పరమాణువుల వరకు సర్వము జడము. చైతన్యరూపమగు కారణము లేనిదే వాటియందు స్వయముగా కర్తృత్వము పొసగదు. జగత్తు కార్యము (పుట్టుక గలది), మరియు అవయవములు గలది. కావున, దానికి కర్త ఒకడు అపేక్షించబడు చున్నాడు (8-10). కావున, శక్తితో కూడియున్నవాడు, స్వతంత్రుడు, సకలశక్తులు గలవాడు, సర్వము తెలిసినవాడు, ఆది-అంతములు లేనివాడు, గొప్ప ఈశ్వరభావము గలవాడు (11), మహాదేవుడు అగు ఆ మహేశ్వరుడే జగత్తును అంతనూ సృష్టించి, పాలించి, సంహరించుచున్నాడు. ఆయన జగత్తుకంటే విలక్షణుడై, కేవలము మిథ్యా రూపమగు జగత్తునకు అధిష్ఠానమై యున్నాడు (12). ప్రకృతి యొక్క పరిణామము, మరియు పురుషుని ప్రవృత్తి సత్యసంకల్పుడగు పరమేశ్వరుని శాసనము వలన మాత్రమే సంభవమగుచున్నవి.

ఇతీయం శాశ్వతీ నీష్ఠా సతాం మనసి వర్తతే ।
న చైనం పక్షమాశ్రిత్య వర్తతే స్వల్పచేతనః ॥
యావదాదిసమారంభో యావద్యః ప్రలయో మహాన్ ।
తావదప్యేతి సకలం బ్రహ్మణశ్శరదాం శతమ్ ॥
పరమిత్యాయుషో నామ బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
తత్పరాఖ్యం తదర్ధం చ పరార్ధమభిధీయతే ॥
పరార్ధద్వయకాలాంతే ప్రలయే సముపస్థితే ।
అవ్యక్తమాత్మనః కార్యమాదాయాత్మని తిష్ఠతి ॥
ఆత్మన్యవస్థితేఽవ్యక్తే వికారే ప్రతిసంహృతే ।
సాధర్మ్యేణాధితిష్ఠేతే ప్రధానపురుషావుభౌ ॥
తమస్సత్త్వగుణావేతౌ సమత్వేన వ్యవస్థితౌ ।
అనుద్రిక్తావనంతౌ తావోతప్రోతౌ పరస్పరమ్ ॥
గుణసామ్యే తదా తస్మిన్నవిభాగే తమోదయే ।
శాంతవాతైకనీరే చ న ప్రాజ్ఞాయత కించన ॥
అప్రజ్ఞాతే జగత్యస్మిన్ ఏక ఏవ మహేశ్వరః ।
ఉపాస్య రజనీం కృత్స్నాం పరాం మాహేశ్వరీం తతః ॥
ప్రభాతాయాం తు శర్వర్యాం ప్రధానపురుషావుభౌ ।
ప్రవిశ్య క్షోభయామాస మాయాయోగాన్మ హేశ్వరః ॥
తతః పునరశేషాణాం భూతానాం ప్రభవాప్యయాత్ ।
అవ్యక్తాదభవత్సృష్టిరాజ్ఞయా పరమేష్ఠినః ॥
విశ్వోత్తరోత్తరవిచిత్రమనోరథస్య యస్యైకశక్తిశకలే సకలస్సమాప్తః ।
ఆత్మానమధ్వపతిమధ్వవిదో వదంతి తస్మై నమస్సకలలోకవిలక్షణాయ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే సృష్టి
క్రమవర్ణనం నామ నవమోఽధ్యాయః ॥

సత్పురుషుల మనస్సులో ఈ రకమగు నిష్ఠ (జ్ఞానమునందు నిలకడ) స్థిరముగా నుండును. కాని అల్పమగు ప్రజ్ఞగల వ్యక్తి ఈ పక్షమునాశ్రయించి ఉండడు (14). సృష్టి ఆరంభమై, తరువాత గొప్ప ప్రలయము వచ్చుసరికి బ్రహ్మగారి వంద సంవత్సరముల ఆయుర్దాయము అంతయు గడచిపోవును (15). అవ్యక్తమునుండి జన్మించిన బ్రహ్మగారి ఆయుర్దాయమునకు పరము అని పేరు. ఆ పరములో సగము కాలమునకు పరార్ధము అని పేరు (16). రెండు పరార్ధముల కాలము గడచిన తరువాత ప్రలయము వచ్చును. అపుడు అవ్యక్తప్రకృతి తననుండి పుట్టిన జగత్తును తనలోనికి ఉపసంహరించుకొని యుండును (17). అవ్యక్తము తననుండి పుట్టిన జగత్తును ఉపసంహరించి తన రూపములో నిలిచియుండగా, ప్రధానపురుషులిద్దరు సమానధర్మము గలవారై యుందురు (18). తమస్సు, సత్త్వము అనే గుణములు గల వినాశము లేని వీరిద్దరు సంక్షోభము (గుణముల పాళ్లలో మార్పు) లేని సామ్యావస్థలో ఒకరితోనొకరు పడుగు పేకవలె పెనవేసుకొని యుందురు ( 19). గుణముల సామ్యావస్థ గలది, విభాగములు లేనిది, చీకటితో నిండియున్నది, ప్రవృత్తి అంతయు ఉపశమించియున్నది, జలముల (చైతన్యము) లో కదలిక లేనిది అగు ఆ సమయములో ఏదియు విశిష్టముగా తెలియబడదు (20). జగత్తు అవ్యక్తములో విలీనమై యున్న ఈ సమయములో మహేశ్వరుడొక్కడే రాత్రి అంతయు సర్వజగత్తుకంటే ఉత్కృష్టమగు మహేశ్వరశక్తిని ఉపాసించి, తరువాత (21) రాత్రి తెల్లవారిన తరువాత ప్రధానపురుషులిద్దరియందు ప్రవేశించి, ఆ మహేశ్వరుడు మాయాసంబంధముచే వాటియందు సంక్షోభమును కలిగించును (22). అప్పుడు మరల పరమేశ్వరుని అజ్ఞచే సృష్టిలయములకు నిధానమగు అవ్యక్తప్రకృతినుండి సకలప్రాణుల సృష్టి జరుగును (23). విశ్వమునకు అతీతమగు ప్రకృతికంటే అతీతుడు, విచిత్రమగు సంకల్పశక్తి గలవాడు. సకలజగత్తులకంటే విలక్షణమైనవాడు ( అధిష్టానమగుచున్ననూ జగద్ధర్మములతో సంపర్కము లేనివాడు) అగు ఆ పరమేశ్వరునకు నమస్కారము. ఆయనయొక్క శక్తిలోని చిన్న అంశములో సర్వజగత్తు సమాప్తమగుచున్నది. మోక్షమార్గమును గురించి తెలిసిన జ్ఞానులు మోక్షమార్గమునకు ప్రభువు అగు ఆ ఈశ్వరుని ఆత్మరూపునిగా వర్ణించుచున్నారు.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో సృష్టిస్థితిలయములను వర్ణించే తొమ్మిదవ అధ్యాయము ముగిసినది.

# 10 - బ్రహ్మాండ స్థితి వర్ణనము

వాయురువాచః

పురుషాధిష్ఠితాత్పూర్వమవ్యక్తాదీశ్వరాజ్ఞయా ।
బుద్ధ్యాదయో విశేషాంతా వికారాశ్చాభవన్ క్రమాత్ ॥
తతస్తేభ్యో వికారేభ్యో రుద్రో విష్ణుః పితామహః ।
కారణత్వేన సర్వేషాం త్రయో దేవాః ప్రజజ్ఞిరే ॥
సర్వతో భువనవ్యాప్తిం శక్తిమవ్యాహతాం క్వచిత్ ।
జ్ఞానమప్రతిమం శశ్వదైశ్వర్యం చాణిమాదికమ్ ॥
సృష్టిస్థితిలయాఖ్యేషు కర్మసు త్రిషు హేతుతామ్ ।
ప్రభుత్వేన సహైతేషాం ప్రసీదతి మహేశ్వరః ॥
కల్పాంతరే పునస్తేషామస్పర్ధాబుద్ధిమోహినామ్ ।
సర్గరక్షాలయాచారం ప్రత్యేకం ప్రదదౌ చ సః ॥
ఏతే పరస్పరోత్పన్నా ధారయంతి పరస్పరమ్ ।
పరస్పరేణ వర్ధంతే పరస్పరమనువ్రతాః ॥
క్వచిద్బ్రహ్మా క్వచిద్విష్ణుః క్వచిద్రుద్రః ప్రశస్యతే ।
నానేన తేషామాధిక్యమైశ్వర్యం చాతిరిచ్యతే ॥
మూర్ఖా నిందంతి తాన్వాగ్భిస్సంరంభాభినివేశినః ।
యాతుధానా భవంత్యేవ పిశాచాశ్చ న సంశయః ॥
దేవో గుణత్రయాతీతశ్చతుర్వ్యూహో మహేశ్వరః ।
సకలస్సకలాధారశ్శక్తేరుత్పత్తికారణమ్ ॥
సోఽయమాత్మా త్రయస్యాస్య ప్రకృతేః పురుషస్య చ ।
లీలాకృతజగత్సృష్టిరీశ్వరత్వే వ్యవస్థితః ॥

వాయువు ఇట్లు పలికెను -

సృష్ట్యాదియందు ఈశ్వరుని ఆజ్ఞచే, పురుషునిచే అధిష్ఠించబడిన అవ్యక్తప్రకృతినుండి మహత్తత్త్వముతో మొదలిడి పరమాణువిశేషముల వరకు గల వికారములు క్రమముగా ప్రకటమైనవి (1). తరువాత ఆ వికారములనుండి సర్వకారణులగు బ్రహ్మవిష్ణురుద్రులనే త్రిమూర్తులు ఉదయించిరి (2). మహేశ్వరుడు సకలభువనములను వ్యాపించియుండే సామర్థ్యమును, ఎక్కడనైననూ ఎదురు లేని శక్తిని, సాటిలేని జ్ఞానమును, శాశ్వతమగు ఐశ్వర్యమును, అణిమ మొదలగు సిద్ధులను, సృష్టిస్థితిలయములనే మూడు కర్మలకు కారణమయ్యే స్థాయిని, జగన్నాథులనే స్థాయితో సహా వారికి అనుగ్రహించెను (3,4). మరల ఆయన వారికి మరియొక కల్పములో ఒకరితో నొకరికి స్పర్ధ మరియు బుద్ధిలో మోహము లేకుండుట కొరకై సృష్టిస్థితిలయములనే కర్మలలో ఒక్కొక్కరికి ఒక్కొక్క కర్మను అప్పజెప్పెను (5). వీరు ఒకరినుండి మరియొకరు పుట్టినారు. వారు ఒకరిని మరియొకరు నిలబెట్టుకుంటూ, ఒకరితో కలిసి మరియొకరు వర్ధిల్లి, ఒకరిని

మరియొకరు అనుసరించి పని చేయుదురు (6). కొన్ని చోట్ల బ్రహ్మ, మరికొన్ని చోట్ల విష్ణువు, మరికొన్ని సందర్భములలో రుద్రుడు ప్రశంసింప బడెదరు. దీనిని బట్టి వారి ఈశ్వరభావములో హెచ్చుతగ్గులు ఉండుననుకోరాదు (7). హఠావుడి, మొండి పట్టుదల గల మూర్ఖులు వారిని వాక్కులతో నిందించెదరు. అట్టివారు రాక్షసులై, పిశాచములై జన్మించెదరనుటలో సందేహము లేదు (8). మూడు గుణములకు అతీతుడు, నాలుగు రూపములుగా ప్రకటమగువాడు, అంశములు గలవాడు, సకలమునకు ఆధారమైనవాడు అగు మహేశ్వరుడు శక్తి ఉదయించుటకు కారణమగుచున్నాడు (9). ఈ త్రిమూర్తులకు, ప్రకృతికి మరియు పురుషునకు కూడ ఆత్మరూపుడగు ఆ మహేశ్వరుడే లీలగా జగత్తులను సృష్టించి ఈశ్వరభావమును పొందియున్నాడు .

**యస్సర్వస్మాత్పరో నిత్యో నిష్కలః పరమేశ్వరః ।**
**స ఏవ చ తదాధారస్తదాత్మా తదధిష్ఠితః ॥**
**తస్మాన్మహేశ్వరశ్చైవ ప్రకృతిః పురుషస్తథా ।**
**సదాశివో భవో విష్ణుర్బ్రహ్మా సర్వం శివాత్మకమ్ ॥**
**ప్రధానాత్ప్రథమం జజ్ఞే వృద్ధిః ఖ్యాతిర్మతిర్మహాన్ ।**
**మహత్తత్త్వస్య సంక్షోభాదహంకారస్త్రి ధాఽ భవత్ ॥**
**అహంకారశ్చ భూతాని తన్మాత్రాణీంద్రియాణి చ ।**
**వైకారికాదహంకారాత్సత్త్వోద్రిక్తాత్తు సాత్త్వికః ॥**
**వైకారికస్స సర్గస్తు యుగపత్సంప్రవర్తతే ।**
**బుద్ధీంద్రియాణి పంచైవ పంచ కర్మేంద్రియాణి చ॥**
**ఏకాదశం మనస్తత్ర స్వగుణేనోభయాత్మకమ్ ।**
**తమోయుక్తాదహంకారాద్భూతతన్మాత్రసంభవః ॥**
**భూతానామాదిభూతత్వాద్భూతాదిః కథ్యతే తు సః ।**
**భూతాదేశ్శబ్దమాత్రం స్యాత్తత్ర చాకాశసంభవః ॥**
**ఆకాశాత్స్పర్శ ఉత్పన్నస్స్పర్శాద్వాయుసముద్భవః ।**
**వాయో రూపం తతస్తేజస్తేజసో రససంభవః ॥**
**రసాదాపస్సముత్పన్నాస్తాభ్యో గంధసముద్భవః ।**
**గంధాచ్చ పృథివీ జాతా భూతేభ్యోఽ న్యచ్చరాచరమ్ ॥**
**పురుషాధిష్ఠితత్వాచ్చ అవ్యక్తానుగ్రహేణ చ ।**
**మహదాదివిశేషాంతా హ్యండముత్పాదయంతి తే ॥**

సర్వజగత్తునకు అతీతుడు, నిత్యుడు, అంశములు లేనివాడు అగు ఆ పరమేశ్వరుడే జగత్తునకు ఆధారమై అధిష్ఠానమై ఆత్మయై ఉన్నాడు (11). కావున, ప్రకృతి, పురుషుడు, సదాశివుడు, శివుడు, విష్ణువు, బ్రహ్మ అనువారు మహేశ్వరుడే. సర్వము శివస్వరూపమై యున్నది ( 12). ముందుగా ప్రధానము ( ప్రకృతి) నుండి సమష్టిబుద్ధితత్త్వము అగు మహత్తు పుట్టెను. ఆ మహత్తత్త్వమునందు సంక్షోభము కలిగి మూడు రకముల అహంకారము ఉదయించెను ( 13). భూతములు,

తన్మాత్రలు, ఇంద్రియములు అను రూపములోనికి అహంకారము పరిణమించెను. మహత్తత్త్వవికారము, సత్త్వగుణప్రధానము అగు అహంకారమునుమడి సాత్త్వికసృష్టి బయలు దేరెను (14). మహత్తత్త్వవికారమగు అహంకారమునుండి అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు అనే పది, పదకొండవ మనస్సు పుట్టినవి. ఈ సృష్టి ఏకకాలములో జరిగినది. మనస్సు తనయందు గల గుణసంయోగముచే ఈ రెండు రకముల ఇంద్రియములను పర్యవేక్షించును. తమోగుణ ప్రధానమగు అహంకారమునుండి భూతతన్మాత్రలు (సూక్ష్మభూతములు) పుట్టినవి ( 15, 16). భూతములకు కారణమగుటచే అహంకారము (లేదా, మహత్తత్త్వము) భూతాది యనబడును. ఆ భూతాదినుండి శబ్దతన్మాత్ర, దానినుండి ఆకాశము పుట్టినవి . ఆకాశమునుండి స్పర్శతన్మాత్ర, స్పర్శనుండి వాయువు, వాయువునుండి రూపము, దానినుండి అగ్ని, అగ్నినుండి రసము పుట్టినవి. (18). రసతన్మాత్రనుండి జలములు, వాటినుండి గంధము, గంధమునుండి పృథివి పుట్టినవి. ఈ భూతములనుండి మిగిలిన చరాచరజగత్తు పుట్టినది ( 19), మహత్తునుండి పరమాణువిశేషముల వరకు గల ఈ తత్త్వములు పురుషునిచే అధిష్ఠించబడి యుండుట వలన, మాయాశక్తియొక్క అనుగ్రహము చేత బ్రహ్మాండమును సృష్టించుచున్నవి.

తత్ర కార్యం చ కరణం సంసిద్ధం బ్రహ్మణో యదా ।
తదండే సుప్రవృద్ధోఽ భూత్ క్షేత్రజ్ఞో బ్రహ్మసంజ్ఞితః ॥
స వై శరీరీ ప్రథమస్స వై పురుష ఉచ్యతే ।
ఆదికర్తా స భూతానాం బ్రహ్మాగ్రే సమవర్తత ॥
తస్యేశ్వరస్య ప్రతిమా జ్ఞానవైరాగ్యలక్షణా ।
ధర్మైశ్వర్యకరీ బుద్ధిర్బ్రాహ్మీ యజ్ఞే ఽభిమానినః ॥
అవ్యక్తాజ్జాయతే తస్య మనసా యద్యదీప్సితమ్ ।
వశీకృతత్వాత్త్రై గుణ్యాత్సాపేక్షత్వాత్స్వభావతః ॥
త్రిధా విభజ్య చాత్మానం త్రైలోక్యే సంప్రవర్తతే ।
సృజతే గ్రసతే చైవ వీక్షతే చ త్రిభిస్స్వయమ్ ॥
చతుర్ముఖస్తు బ్రహ్మత్వే కాలత్వే చాంతకస్స్మృతః ।
సహస్రమూర్ధా పురుషస్తిస్రోఽవస్థాస్స్వయంభువః ॥
సత్త్వం రజశ్చ బ్రహ్మా చ కాలత్వే చ తమో రజః ।
విష్ణుత్వే కేవలం సత్త్వం గుణవృద్ధిస్త్రి ధా విభౌ ॥
బ్రహ్మత్వే సృజతే లోకాన్ కాలత్వే సంక్షిపత్యపి ।
పురుషత్వేఽకత్యుదాసీనః కర్మ చ త్రివిధం విభోః ॥
ఏవం త్రిధా విభిన్నత్వాద్బ్రహ్మా త్రిగుణ ఉచ్యతే ।
చతుర్ధా ప్రవిభక్తత్వాచ్చతుర్వ్యూహః ప్రకీర్తితః ॥
ఆదిత్వాదాదిదేవోఽసావజాతత్వాదజస్స్మృతః ।
పాతి యస్మాత్ప్రజాస్సర్వాః ప్రజాపతిరితి స్మృతః ॥

ఈ విధముగా ఏ కాలములోనైతే బ్రహ్మయొక్క కార్యము మరియు సాధనములు సమకూరినవో, అపుడు ఆ బ్రహ్మాండమునందు పరంబ్రహ్మ అనే పేరు గల క్షేత్రజ్ఞుడు (క్షేత్రమును తెలియువాడు) చక్కగా వృద్ధిని చెందెను (21). ఆయనయే శరీరము గల మొదటి జీవుడు. ఆయనకే పురుషుడని పేరు. ఈ విధముగా ప్రాణులను సృష్ట్యాదిలో సృష్టించిన బ్రహ్మ మున్ముందుగా జన్మించెను (22). యజ్ఞమునకు అధిష్టానదేవతయగు ఆ ఈశ్వరునకు జ్ఞానవైరాగ్యములతో కూడినది, ధర్మమును మరియు ఐశ్వర్యమును కలిగించునది, బ్రహ్మనిష్ఠము అగు బుద్ధి ప్రతిమ (ఉపలబ్ధిస్థానము) అగుచున్నది. లేదా, అట్టి బుద్ధి (మహత్తత్త్వము) హిరణ్యగర్భునకు ఉపాధి అగును (23). పరమేశ్వరుని స్వభావమనదగినది, పరమేశ్వరుని వశములోనున్నది, పరమేశ్వరుని సత్త (ఉనికి) పై ఆధారపడిన సాపేక్షికమగు సత్త గలది, మూడు గుణములు ( సత్త్వరజస్తమస్సులు) గలది అగు మాయాశక్తినుండి పరమేశ్వరుడు దేనిని సంకల్పిస్తే అది పుట్టును (24). పరమేశ్వరుడు తనను మూడు రూపములుగా విభజించుకొని ముల్లోకములలో ప్రవర్తిల్లుచున్నవాడై, ఆ త్రిమూర్తుల ద్వారా సృష్టిస్థితిలయములనే కర్మలను తానే స్వయముగా చేయుచున్నాడు (25). స్వయముగా సత్తాస్వరూపుడగు ఆ పరమేశ్వరుడు చతుర్ముఖబ్రహ్మయై సృష్టిని, కాలస్వరూపుడై సంహారమును, అనంతశిరస్సులు గల పురుషుడై స్థితిని చేయుచూ మూడు అవస్థలను కలిగియున్నాడు (26). బ్రహ్మయందు సత్త్వరజోగుణములు, కాలపురుషునియందు రజస్తమోగుణములు, విష్ణువునందు కేవలము సత్త్వగుణము కలవు. ఈ విధముగా సర్వవ్యాపకుడగు ఆ పరమేశ్వరునియందు గుణముల మూడు రకముల వృద్ధి కలదు (27). సర్వవ్యాపకుడగు ఆ పరమేశ్వరుడు బ్రహ్మయై లోకములను సృష్టించుచున్నాడు; కాలరూపుడై ఉపసంహరించుచున్నాడు. స్థితితో కలిపి మూడు జగత్కార్యములను చేయుచున్ననూ పూర్ణస్వరూపుడగు పరమేశ్వరునియందు కర్తృత్వము లేనే లేదు (28). ఈ తీరున మూడు మూర్తులుగా విభాగమును చెందియుండుటచే త్రిగుణుడనియు, నాలుగు రూపములుగా విభాగమును చెందియుండుటచే చతుర్వ్యూహుడనియు వర్ణింపబడుచున్నాడు (29). జగత్తునకు కారణమగుటచే ఆయనకు ఆదిదేవుడనియు, పుట్టుక లేనివాడగుటచే అజుడనియు, ప్రజలనందరినీ రక్షించుటచే ప్రజాపతియనియు పేర్లు.

**హిరణ్మయస్తు యో మేరుస్తస్యోల్బం సుమహాత్మనః ।**

**గర్భోదకం సముద్రాశ్చ జరాయుశ్చాపి పర్వతాః ॥**

**తస్మిన్నండే త్విమే లోకా అంతర్విశ్వమిదం జగత్ ।**

**చంద్రాదిత్యౌ సనక్షత్రౌ సగ్రహౌ సహ వాయునా ॥**

**అద్భిర్దశగుణాభిస్తు బాహ్యతోఽండం సమావృతమ్ ।**

**ఆపో దశగుణేనైవ తేజసా బహిరావృతాః ॥**

**తేజో దశగుణేనైవ వాయునా బహిరావృతమ్ ।**

**ఆకాశేనావృతో వాయుః ఖం చ భూతాదినాఽవృతమ్ ॥**

**భూతాదిర్మహతా తద్వదవ్యక్తేనావృతో మహాన్ ।**

**ఏతైరావరణైరండం సప్తభిర్బహిరావృతమ్ ॥**

ఏతదావృత్య చాన్యోన్యమష్టౌ ప్రకృతయః స్థితాః ।
సృష్టిపాలనవిధ్వంసకర్మకర్త్ర్యో ద్విజోత్తమాః ॥
ఏవం పరస్పరోత్పన్నా ధారయంతి పరస్పరమ్ ।
ఆధారాధేయభావేన వికారాస్తు వికారిషు ॥
కూర్మోఽఙ్గాని యథా పూర్వం ప్రసార్య వినియచ్ఛతి ।
వికారాంశ్చ తథావ్యక్తం సృష్ట్వా భూయో నియచ్ఛతి ॥
అవ్యక్తప్రభవం సర్వమానులోమ్యేన జాయతే ।
ప్రాప్తే ప్రలయకాలే తు ప్రాతిలోమ్యేఽనులీయతే ॥
గుణాః కాలవశాదేవ భవంతి విషమాస్సమాః ।
గుణసామ్యే లయో జ్ఞేయో వైషమ్యే సృష్టిరుచ్యతే ॥

సర్వజగద్రూపముగా ప్రకటమైన స్వరూపము గల పరమేశ్వరునకు బంగరు పర్వతమగు మేరువు గర్భస్థపిండము వంటిది; సముద్రములు గర్భమునందలి నీరు కాగా, పర్వతములు జరాయువు (గర్భమును చుట్టియుండే చర్మ) అగుచున్నవి (31). ఆ అండము లోపల ఈ లోకములు, ఈ సమస్తజగత్తు, చంద్రసూర్యులు, నక్షత్రములు, గ్రహములు, వాయువు గలవు (32). ఆ అండమును పది రెట్లు నీరు చుట్టువారి యున్నది. ఆ నీటిని పది రెట్లు అగ్ని చుట్టువారి యున్నది (33). ఆ అగ్నిని పది రెట్లు వాయువు చుట్టువారి యున్నది. వాయువు ఆకాశము చేత, ఆకాశము అహంకారము చేత (34), అదే విధముగా అహంకారము మహత్తత్త్వము చేత, మహత్తత్త్వము అవ్యక్తము చేత చుట్టువారబడి యున్నవి. ఈ విధముగా బ్రహ్మాండమునకు బయట ఏడు ఆవరణలు గలవు (35). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ఈ ఎనిమిది ప్రకృతి వికారములు ఈ బ్రహ్మాండమును మరియు ఒకదానిని మరియొకటి ఆవరించి యున్నవై, సృష్టిస్థితిలయములనే కర్మలను చేయుచున్నవి (36). ఈ విధముగా ఈ ప్రకృతి వికారములు ఒక దానినుండి మరియొకటి పుట్టి, ఒక దానిని మరియొకటి ధరించి (అనగా స్థితిని కలిగిస్తూ) యున్నవి. వికారములు తమ ప్రకృతులయందు ఆధార- అధేయ ( ఆధారమునందు ఉండేది)- భావములో నున్నవి (37), తాబేలు ముందుగా తన అవయవములను బయటకు చాచి, తరువాత వాటిని తన లోనికి ఉపసంహరించును. అదే విధముగా, మాయాశక్తి వికారములను సృష్టించి, మరల తనలోనికి ఉపసంహరించును (38). ఈ విధముగా సర్వము పైన చెప్పిన వరుసలో అవ్యక్తమునుండి పుట్టినది. ప్రళయకాలము రాగానే, ఈ సర్వము తల్లక్రిందులు క్రమములో అవ్యక్తమునందు లీనమగును (39). సత్త్వరజస్తమోగుణములు కాలమునకు వశములో నున్నవై సామ్య (సమపాళ్లలో నుండుట), వైషమ్య (ఆ పాళ్లలో తేడా వచ్చుట) భావమును పొందుచుండును. వైషమ్యము వచ్చినప్పుడు సృష్టి సామ్యమునందు ప్రళయము కలుగునని తెలియవలెను.

తదిదం బ్రహ్మణో యోనిరేతదండం ఘనం మహత్ ।
బ్రహ్మణః క్షేత్రముద్దిష్టం బ్రహ్మా క్షేత్రజ్ఞ ఉచ్యతే ॥
ఇతీదృశానామండానాం కోట్యో జ్ఞేయాస్సహస్రశః ।
సర్వగత్వాత్ప్రధానస్య తిర్యగూర్ధ్వమధః స్థితాః ॥
తత్ర తత్ర చతుర్వక్త్రా బ్రహ్మాణో హరయో భవాః ।
సృష్టా ప్రధానేన తథా లబ్ధ్వా శంభోస్తు సన్నిధిమ్ ॥
మహేశ్వరః పరో ఽవ్యక్తాదండమవ్యక్తసంభవమ్ ।
అండాజ్జజ్ఞే విభుర్బ్రహ్మా లోకాస్తేన కృతాస్త్విమే ॥
అబుద్ధిపూర్వః కథితో మయైషః ప్రధానసర్గః ప్రథమః ప్రవృత్తః।
ఆత్యంతికశ్చ ప్రలయోఽతకాలే లీలాకృతః కేవలమీశ్వరస్య ॥
యత్తత్స్మృతం కారణమప్రమేయం బ్రహ్మా ప్రధానం ప్రకృతేః ప్రసూతిః ।
అనాదిమధ్యాంతమనంతవీర్యం శుక్లం సురక్తం పురుషేణ యుక్తమ్ ॥
ఉత్పాదకత్వాద్రజసో ఽ తిరేకాల్లోకస్య సంతానవివృద్ధిహేతూన్ ।
అష్టా వికారానపి చాదికాలే సృష్ట్వా సమశ్నాతి తథాంతకాలే ॥
ప్రకృత్యవస్థాపితకారణానాం యా చ స్థితిర్యా చ పునః ప్రవృత్తిః ।
తత్సర్వమప్రాకృతవైభవస్య సంకల్పమాత్రేణ మహేశ్వరస్య ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే బ్రహ్మాండస్థితి
వర్ణనం నామ దశమోఽ ధ్యాయః ॥

పెద్దది, దట్టమైనది అగు ఈ బ్రహ్మాండము పరంబ్రహ్మ ప్రకటమయ్యే స్థానము. కావున, ఇది ఆ పరంబ్రహ్మకు క్షేత్రము అనియు, బ్రహ్మ క్షేత్రజ్ఞుడనియు వర్ణించబడినది (41). మాయా శక్తి సర్వవ్యాపకము. కావున, క్రింద, సమానస్థాయిలో మరియు పైన ఇటువంటి వేల కోట్ల బ్రహ్మాండములు గలవని తెలియవలెను (42). ఆ మాయాశక్తి శంభుని సాన్నిధ్యమును పొంది, ఆయా బ్రహ్మాండములలో నాలు మోముల బ్రహ్మలను, విష్ణువులను మరియు రుద్రులను సృష్టించినది (43). ఆ మాయాశక్తికంటె అతీతుడు మహేశ్వరుడు. ఈ బ్రహ్మాండము మాయాశక్తినుండి పుట్టినది. ఆ అండమునుండి సర్వసమర్థుడగు బ్రహ్మ పుట్టెను. ఆయన ఈ లోకములను నిర్మించెను (44). మొట్టమొదటి మాయాశక్తియొక్క సృష్టియందు బుద్ధికి పాత్ర లేదు. అది కేవలము ఈశ్వరుని లీలచే మాత్రమే సృష్టించబడినది. ప్రళయకాలమందు వచ్చే అంతిమ ప్రళయము కూడ అట్టిదియే. ఈ విషయమును నేను చెప్పియుంటిని (45). ఆది మధ్యము మరియు అంతము లేనిది, అనంతమగు శక్తి గలది, తెల్లని వర్ణము గలది (సత్త్వగుణము), మిక్కిలి ఎర్రనైనది (రజోగుణము), పురుషునితో కూడియున్నది మరియు సర్వ ప్రమాణములకు గోచరము కానిది అగు మాయాశక్తి సర్వజగత్తునకు కారణము. ఆ శక్తి యొక్క సంతానమే బ్రహ్మ యని చెప్పబడినది (46). రజోగుణము అధికమైనప్పుడు ఆ మాయాశక్తి సృష్టిని చేయును. ఆ సమయములో ఆ శక్తి లోకముయొక్క సంతానము అధికమగుటకు కారణమగు ఎనిమిది వికారములను సృష్ట్యాదియందు సృష్టించి, ప్రళయకాలమునందు వాటిని తనలోనికి ఉపసంహరించును (47). ఈ జగత్తునకు హేతువులగు వికారములు ప్రకృతియందు విలీనమై యుండుట, మరల జగద్రూపముగా ప్రకటమగుట అనే కార్యము అంతయు దివ్యమగు వైభవము గల మహేశ్వరుని సంకల్పమాత్రముచే జరుగుచుండును.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో బ్రహ్మాండస్థితిని వర్ణించే పదవ అధ్యాయము ముగిసినది.

# 11 – వరాహావతార వర్ణనము

**మునయ ఊచుః ।**

**మన్వంతరాణి సర్వాణి కల్పభేదాంశ్చ సర్వశః ।**
**తేష్వేవాంతరసర్గంచ ప్రతిసర్గం చ నో వద ॥**

మునులు ఇట్లు పలికిరి –

మన్వంతరములను అన్నింటినీ, కల్పములలోని భేదములను అన్నింటినీ, మరియు వాటిలోననే గల అవాంతరసృష్టిని మరియు ప్రతిసృష్టిని గురించి మాకు చెప్పుము.

**కాలసంఖ్యావివృత్తస్య పరార్ధో బ్రహ్మణస్స్మృతః ।**
**తావాంశ్చైవాస్య కాలోఽ న్యస్తస్యాంతే ప్రతిసృజ్యతే ॥**
**దివసే దివసే తస్య బ్రహ్మణః పూర్వజన్మనః ।**
**చతుర్దశ మహాభాగా మనూనాం పరివృత్తయః ॥**
**అనాదిత్వాదనంతత్వాదజ్ఞేయత్వాచ్చ కృత్స్నశః ।**
**మన్వంతరాణి కల్పాశ్చ న శక్యా వచనాత్పృథక్ ॥**
**ఉక్తేష్వపి చ సర్వేషు శృణ్వతాం వో వచో మమ ।**
**కిమిహాస్తి ఫలం తస్మాన్న పృథగ్వక్తుముత్సహే ॥**
**య ఏవ ఖలు కల్పేషు కల్పస్సంప్రతి వర్తతే ।**
**తత్ర సంక్షిప్య వర్తంతే సృష్టయః ప్రతిసృష్టయః ॥**
**యస్స్వయం వర్తతే కల్పో వారాహో నామ నామతః ।**
**అస్మిన్నపి ద్విజశ్రేష్ఠా మనవస్తు చతుర్దశ ॥**
**స్వాయంభువాదయస్సప్త సప్త సావర్ణికాదయః ।**
**తేషు వైవస్వతో నామ సప్తమో వర్తతే మనుః ॥**
**మన్వంతరేషు సర్వేషు సర్గసంహారవృత్తయః ।**
**ప్రాయస్సమా భవంతీతి తర్కః కార్యో విజానతా ॥**
**పూర్వకల్పే పరావృత్తే ప్రవృత్తే కాలమారుతే ।**
**సమ్మూలితమూలేషు వృక్షేషు చ వనేషు చ ॥**
**జగంతి తృణవత్త్రీణి దేవే దహతి పావకే ।**
**వృష్ట్యా భువి నిషిక్తాయాం వివేలేష్వర్ణవేషు చ ॥**

కాలముయొక్క పరిమాణమును బట్టి వచ్చి పోయే బ్రహ్మగారి ఆయుష్షులో మొదటి భాగము పరార్ధమనియు, ద్వితీయ భాగము మరియొక పరార్ధమనియు చెప్పబడినది. ఆ తరువాత మరల సృష్టి ఆరంభమగును (2). సృష్టిలో మున్ముందు జన్మించిన ఆ బ్రహ్మయొక్క ప్రతీ పగలునందు పదునల్గురు మహాత్ములగు మనువులు మారిపోవుచుందురు (3). ఈ మన్వంతరములు మరియు కల్పములు ఆది– అంతములు లేనివి. కావున, వాటిని గురించి పూర్తిగా

తెలియుట సంభవము కాదు. కాబట్టి, వాటిని గురించి వేరుగా చెప్పుట శక్యము కాదు (4). ఒకచో నేను అన్నింటినీ చెప్పినను, వాటి గురించి నా వర్ణనలను వినుట వలన మీకు ప్రయోజనము ఏమి గలదు? కావున, వాటిని గురించి వేర్వేరుగా చెప్పే ఉత్సాహము నాకు లేదు (5). ఆ కల్పములన్నింటిలో ప్రస్తుతము ఏ కల్పము జరుగుచున్నదో, దానియందు ఏ సృష్టులు మరియు పునస్సృష్టులు గలవో, వాటిని గురించి సంక్షేపముగా చెప్పెదను (6). ఇప్పుడు గడుచుచున్న కల్పమునకు వారాహకల్పమని పేరు ప్రసిద్ధముగా నున్నది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! దీనియందు కూడా స్వాయంభువమనువుతో మొదలయ్యే ఏడుగురు, సావర్ణితో మొదలయ్యే ఏడుగురు వెరసి పదునల్గురు మనువులు గలరు. వారిలో ఏడవ వాడు వైవస్వత మనువు (7,8). మన్వంతరములన్నింటియందు సృష్టికార్యము మరియు సంహారకార్యము ఇంచుమించు సమానముగా నుండునని విద్వాంసుడు ఊహించవలెను (9). దీనికి ముందరి కల్పము గడచి పోయినది. ప్రళయకాలవాయువులు వీచుచుండెను. చెట్ల వేళ్లు పెకలించి వేయబడుచుండెను. అడవులు నేలమట్టము అగుచుండెను (10). ముల్లోకములను అగ్నిదేవుడు గడ్డిపోచను వలె కాల్చుచుండెను. వర్షముచే భూమి ముంచెత్తబడెను. సముద్రములు చెలియలి కట్టలను దాటి యుండెను.

దిక్షు సర్వాసు మగ్నాసు వారపూరే మహీయసి ।
తదబ్ధిశ్చటులాక్షేపైస్తరంగభుజమండలైః ॥
ప్రారబ్ధచండనృత్యేషు తతః ప్రలయవారిషు ।
బ్రహ్మా నారాయణో భూత్వా సుష్వాప సలిలే సుఖమ్ ॥
ఇమం చోదాహరన్మంత్రం శ్లోకం నారాయణం ప్రతి ।
తం శృణుధ్వం మునిశ్రేష్ఠాస్తదర్థం చాక్షరాశ్రయమ్ ॥
ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ।
అయనం తస్య తా యస్మాత్తేన నారాయణస్స్మృతః ॥
శివయోగమయీం నిద్రాం కుర్వంతం త్రిదశేశ్వరమ్ ।
బద్ధాంజలిపుటాస్సిద్ధా జనలోకనివాసినః ॥
స్తోత్రైః ప్రబోధయామాసుః ప్రభాతసమయే సురాః ।
యథా సృష్ట్యాదిసమయే ఈశ్వరం శ్రుతయః పురా ॥
తతః ప్రబుద్ధ ఉత్థాయ శయనాత్తోయమధ్యగాత్ ।
ఉదైక్షత దిశస్సర్వా యోగనిద్రాలసేక్షణః ॥
నాపశ్యత్స తదా కించిత్స్వాత్మనో వ్యతిరేకి యత్ ।
సవిస్మయ ఇవాసీనః పరాం చింతాముపాగమత్ ॥
క్వ సా భగవతీ యా తు మనోజ్ఞా మహతీ మహీ ।
నానావిధమహాశైలనదీనగరకాననా ॥
ఏవం సంచింతయన్ బ్రహ్మా బుబుధే నైవ భూస్థితిమ్ ।
తదా సస్మార పితరం భగవంతం త్రిలోచనమ్ ॥

దిక్కులన్నియు అతివిస్తృతమైన జలరాశిలో మునిగియుండెను. ఆ ప్రళయజలములు తరంగములనే గుండ్రని భుజములను దేనినీ లెక్క చేయకున్నవా యన్నట్లు తీవ్రముగా త్రిప్పుతూ నీటిని చిమ్ముతూ భయంకరమగు నాట్యమును ఆరంభించినవి. అపుడు బ్రహ్మ నారాయణరూపమును దాల్చి ఆ నీటిలో సుఖముగా నిద్రించెను (12, 13). మనము నారాయణుని ఉద్దేశించి ఈ మంత్రమును తెలుసుకొనవలెను. ఓ మహర్షులారా! దానిని వినుడు. దానిలోని పదముల అర్థమును తెలియుడు (14). జలములకు నారాః అని పేరు. జలములు అవినాశియగు పరంబ్రహ్మనుండి పుట్టినవి. అవి ఆ పరమేశ్వరునకు నివాసస్థానమైనవి. కావుననే, ఆయనకు నారాయణుడను పేరు వచ్చినది (15). పూర్వము సృష్టి జరిగిన సమయములో వేదములు ఈశ్వరుని స్తుతించిన విధముగా, జనలోకమునందు నివసించే సిద్ధులు మరియు దేవతలు ప్రాతః కాలమునందు చేతులను జోడించి శివయోగస్వరూపమైన నిద్రలో నున్న ఆ దేవాధిదేవుని స్తోత్రములతో మేలు కొలిపిరి ( 16, 17). అపుడు ఆయన నిద్ర మేల్కాంచి నీటిలోనికి వెళ్లెను. యోగనిద్ర వలన బరువుగానున్న కన్నులతో ఆయన దిక్కులనన్నింటినీ పరికించెను (18). అపుడాయనకు తనకంటే భిన్నముగా ఏదియు కానరాలేదు. అప్పుడాయన ఆశ్చర్యమును పొందినవానివలె కూర్చుండి దీర్ఘముగా ఆలోచించెను (19). పూజ్యురాలు, సుందరి, గొప్పది, అనేకవిధములగు పెద్ద పర్వతములతో నదులతో నగరములతో మరియు అడవులతో రాజిల్లునది అగు ఆ భూదేవి యెక్కడ? (20) ఈ విధముగా ఆలోచించుచున్న బ్రహ్మకు భూమియొక్క స్థితియైననూ తెలియలేదు. అపుడాయన తన తండ్రియగు ముక్కంటి దేవుని స్మరించెను.

**స్మరణాద్దేవదేవస్య భవస్యామితతేజసః ।**
**జ్ఞాతవాన్ సలిలే మగ్నాం ధరణీం ధరణీపతిః ॥**
**తతో భూమేస్సముద్ధారం కర్తుకామః ప్రజాపతిః ।**
**జలక్రీడోచితం దివ్యం వారాహం రూపమస్మరత్ ॥**
**మహాపర్వతవర్ష్మాణం మహాజలదనిస్వనమ్ ।**
**నీలమేఘప్రతీకాశం దీప్తశబ్దం భయానకమ్ ॥**
**పీనవృత్తఘనస్కంధపీనోన్నతకటీతటమ్ ।**
**హ్రస్వవృత్తోరుజంఘాగ్రం సుతీక్ష్ణఖురమండలమ్ ॥**
**పద్మరాగమణి ప్రఖ్యవృత్తభీషణలోచనమ్ ।**
**వృత్తదీర్ఘం మహాగాత్రం స్తబ్ధకర్ణస్థలోజ్జ్వలమ్ ॥**
**ఉదీర్ణోచ్ఛ్వాసనిశ్శ్వాసఘూర్ణితప్రలయార్ణవమ్ ।**
**వి స్ఫురత్సుసటాచ్ఛన్నకపోలస్కంధబంధురమ్ ॥**
**మణిభిర్భూషణైశ్చిత్రైర్మహారత్నైః పరిష్కృతమ్ ।**
**విరాజమానం విద్యుద్భిర్మేఘసంఘమివోన్నతమ్ ॥**
**ఆస్థాయ విపులం రూపం వారాహమమితం విధిః ।**
**పృథివ్యుద్ధరణార్థాయ ప్రవివేశ రసాతలమ్ ॥**

స తదా శుశుభేఽ తీవ సూకరో గిరిసంనిభః ।
లింగాకృతేర్మహేశస్య పాదమూలం గతో యథా ॥
తతస్స సలిలే మగ్నాం పృథివీం పృథివీధరః ।
ఉద్ధృత్యాలింగ్య దంష్ట్రాభ్యామున్మమజ్జ రసాతలాత్ ॥

పృథివికి ప్రభువు అగు ఆ విష్ణువు దేవదేవుడు, మహాతేజశ్శాలి యగు శివుని స్మమరించుట వలన పృథివి నీటిలో మునిగియున్నదని తెలుసుకొనెను (22). అపుడా విష్ణురూపములో నున్న బ్రహ్మ భూమిని పైకి ఎత్తగోరి, నీటిలో క్రీడించుటకు తగిన దివ్యమగు వరాహరూపమును స్మరించెను (23). పెద్ద పర్వతమువంటి దేహము గలది, గొప్ప మేఘముల వలె గర్జించునది, నల్లని మేఘములను పోలియున్నది, భయంకరమగు కాంతి మరియు శబ్దము గలది (24), బలిసిన గుండ్రని దట్టనైన భుజములు మరియు బలిసిన ఎత్తైన పృష్ఠభాగము గలది, సన్నని గుండ్రని పెద్ద పిక్కల అగ్రభాగములు గలది, మిక్కిలి వాడియైన గుండ్రని డెక్కలు గలది (25), పద్మరాగ మాణిక్యములను బోలిన గుండ్రని భయమును గొల్పే కన్నులు గలది, గుండ్రని పొడవైన పెద్ద దేహము గలది, నిక్కబొడుచుకొనియున్న చెవులు మరియు వాటి చుట్టూ ఉండే దేహభాగములతో గొప్పగా ప్రకాశించునది (26), వేగముతో కూడిన ఉచ్ఛ్వాసనిశ్వాసములచే కలచి వేయబడిన ప్రళయకాలమందలి సముద్రము గలది, విశేషముగా ప్రకాశించే చక్కని జూలుచే కప్పబడియున్న చెక్కిళ్లతో మరియు భుజస్కంధములతో ఒప్పారునది (27), మిక్కిలి విలువైన రంగు రంగుల మణులతో ఆభరణములతో అలంకరించబడి మెరుపులతో ప్రకాశించే ఎత్తైన మేఘసమూహము వలె ప్రకాశించునది (28), విశాలమైనది అగు అనంతవరాహరూపమును దాల్చి బ్రహ్మ పృథివిని పైకి లేవనెత్తుటకై పాతాళములోనికి ప్రవేశించెను (29). పర్వతమును బోలియున్న ఆ వరాహము ఆ సమయములో లింగాకారములోనున్న మహేశ్వరుని పాదమూలమును చేరిన దానివలె ప్రకాశించెను (30). అపుడు నీటిలో మునిగియున్న పృథివిని పైకి ఒడిసి పట్టి ఎత్తి కోరలతో పాతాళమునుండి పైకి లేపెను.

తం దృష్ట్వా మునయస్సిద్ధా జనలోకనివాసినః ।
ముముదుర్ననృతుర్మూర్ధ్ని తస్య పుష్పైరవాకిరన్ ॥
వపుర్మహావరాహస్య శుశుభే పుష్పసంవృతమ్ ।
పతద్భిరవ ఖద్యోతైః ప్రాంశురంజనపర్వతః ॥
తతస్సంస్థానమానీయ వరాహో మహతీం మహీమ్ ।
స్వమేవ రూపమాస్థాయ స్థాపయామాస వై విభుః ॥
పృథివీం చ సమీకృత్య పృథివ్యాం స్థాపయన్ గిరీన్ ।
భూరాద్యాంశ్చతురో లోకాన్ కల్పయామాస పూర్వవత్ ॥
ఇతి స హ మహతీం మహీం మహీధ్రైః ప్రలయమహాజలధేరధఃస్థమధ్యాత్ ।
ఉపరి చ వినివేశ్య విశ్వకర్మా చరమచరం చ జగత్ససర్జ భూయః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే వరాహావతార
వర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః ॥

మునులు, జనలోకమునందు నివసించే సిద్ధులు ఆయనను చూచి, సంతోషముతో నాట్యమును చేసి, ఆయన శిరస్సుపై పుష్పములను చల్లిరి (32). పుష్పములతో నిండియున్న ఆ మహావరాహముయొక్క దేహము, తన మీద ఎగురుచున్న మిణుగురు పురుగులతో కూడి యున్న కాటుక కొండ వలె ప్రకాశించెను (33). అపుడా సర్వసమర్థుడగు వరాహమూర్తి విశాలమగు ఆ భూమిని యథాస్థానమునకు తీసుకు వచ్చి, తన మామూలు రూపమును ధరించి, దానిని అచట నిలబెట్టెను (34). ఆయన భూమిని సమతలముగా చేసి, భూమిపై పర్వతములను స్థాపించి, భూలోకముతో మొదలిడి నాలుగు లోకములను పూర్వకల్పమునందు వలెనే నిర్మించెను (35). ఈ విధముగా ఆ సృష్టికర్త పర్వతములతో కూడియున్న విశాలమగు భూమిని ప్రళయకాలమునందలి మహాసముద్రముయొక్క మధ్యలో క్రిందనుండి పైకి తీసుకు వచ్చి, యథాస్థానములో నుంచి, చరాచరజగత్తును మరల సృష్టించెను.

శ్రీ శివమహాపురాణమునందలి వాయవీయసంహితయందు పూర్వభాగములో వరాహావతారమును వర్ణించే పదునొకండవ అధ్యాయము ముగిసినది.

# 12 - బ్రహ్మ జగత్తును సృష్టించుట

**వాయురువాచః**

**సర్గం చింతయతస్తస్య తదా వై బుద్ధిపూర్వకమ్ ।**
**ప్రధ్యానకాలే మోహస్తు ప్రాదుర్భూతస్తమోమయః ॥**
**తమోమోహో మహామోహస్తామిస్రశ్చాంధసంజ్ఞితః ।**
**అవిద్యా పంచమీ చైషా ప్రాదుర్భూతా మహాత్మనః ॥**
**పంచధాఽవస్థితస్సర్గో ధ్యాయతస్త్వభిమానినః ।**
**సర్వతస్తమసాఽతీవ బీజకుంభవదావృతః ॥**
**బహిరంతశ్చాప్రకాశః స్తబ్ధో నిస్సంజ్ఞ ఏవ చ ।**
**తస్మాత్తేషాం వృతా బుద్ధిర్ముఖాని కరణాని చ ॥**
**తస్మాత్తే సంవృతాత్మానో నగా ముఖ్యాః ప్రకీర్తితాః ।**
**తం దృష్ట్వాఽసాధకం బ్రహ్మా ప్రథమం సర్గమీదృశమ్ ॥**
**అప్రసన్నమనా భూత్వా ద్వితీయం సో ఽభ్యమన్యత ।**
**తస్యాభిధ్యాయతస్సర్గం తిర్యక్ స్రోతో ఽ భ్యవర్తత ॥**
**అంతఃప్రకాశాస్తిర్యంచ ఆవృతాశ్చ బహిః పునః ।**
**పశ్వాత్మానస్తతో జాతా ఉత్పథగ్రాహిణశ్చ తే ॥**
**తమప్యసాధకం జ్ఞాత్వా సర్గమన్యమమన్యత ।**
**తదోర్ధ్వస్రోతసో వృత్తో దేవసర్గస్తు సాత్త్వికః ॥**
**తే సుఖప్రీతిబహులా బహిరంతశ్చ నావృతాః ।**
**ప్రకాశా బహిరంతశ్చ స్వభావాదేవ సంజ్ఞితా ॥**
**తతోఽభిధ్యాయతోఽవ్యక్తాదర్వాక్ స్రోతస్తు సాధకః ।**
**మనుష్యనామా సంజాతస్సర్గో దుఃఖసముత్కటః ॥**

వాయువు ఇట్లు పలికెను -

అపుడు బ్రహ్మ తన బుద్ధిని ఉపయోగించి సృష్టిని గురించి ఆలోచించుచుండగా, ఆ ధ్యానసమయములో ఆయనయందు తమోగుణకార్యమగు మోహము ఉద్భవించెను (1). మహాత్ముడగు ఆ బ్రహ్మకు తమోమోహము (చీకటి వంటి మోహము), మహామోహము, తామిస్రము ( దట్టని చీకటి), అంధము ( గ్రుడ్డితనము) మరియు అవిద్య ( అజ్ఞానము) అనే ఆయిదు స్థితులు కలిగినవి (2}. నేను కర్తను అనే అభిమానము కలిగి ధ్యానము చేయుచున్న ఆయనకు అయిదు రకముల సృష్టి గోచరించెను. ఆ ధ్యానములో ఆయన బుద్ధి కుండలోని విత్తనము వలే అంతటా అతిశయించిన చీకటితో వ్యాప్తమై యుండెను (3). ఆయనకు బయట, లోపల చీకటితో, కదలిక మరియు జ్ఞానము లేని స్థితి ఉండెను. కావుననే, ఆయన ముఖమునుండి వచ్చిన ఆ సృష్టియందు బుద్ధి, ముఖములు మరియు ఇంద్రియములు కప్పివేయబడి యుండెను. ఈ విధముగా కప్పివేయబడిన బుద్ధి గల ఆ సృష్టియే పర్వతములు, చెట్లు అని చెప్పబడినది.

మొట్టమొదటి సృష్టి ఈ విధముగా ప్రయోజనకారి కాకపోవుటను గాంచి బ్రహ్మ ( 4, 5) వ్యాకులమైన మనస్సు గలవాడై రెండవ సారి ధ్యానమును చేసెను. ఈ విధముగా ఆయన ధ్యానించుచుండగా, పశుపక్ష్యాదుల సృష్టి ప్రకటమయ్యెను. పశుపక్ష్యాదులలో లోపల జ్ఞానము ఉన్ననూ, బాహ్యమునందు వాటి జ్ఞానము కప్పివేయబడి యుండును. అని సన్మార్గమును ఎన్నుకొని పాటించే సామర్థ్యము లేని ప్రాణులు అయినవి (6,7). ఆ సృష్టి కూడ ప్రయోజనకారి కాలేదని తలపోసి బ్రహ్మ మరల సృష్టిని గురించి ధ్యానించెను. అపుడు సత్త్వగుణ ప్రధానమైన దేవతా సృష్టి జరిగినది. ఈ సృష్టికి ఊర్ధ్వ స్రోతస్సు (ఊర్ధ్వదిశలోని ప్రవాహము) అని పేరు (8). దేవతలయందు సుఖము,ప్రీతి అధికముగా నుండును. వారికి బయట గాని, లోపల గాని అజ్ఞానావరణము లేదు. వారికి బయట, లోపల కూడ ప్రకాశము గలదు. వారు చైతన్యస్వరూపులు (9). తరువాత మరల బ్రహ్మ ధ్యానమును చేయగా, అవ్యక్తమునుండి అర్వాక్ స్రోతస్సు ( క్రిందికి ప్రవాహము) అనబడే ప్రయోజనకరమగు మనుష్యులనబడే ప్రాణుల సృష్టి జరిగినది. ఈ సృష్టి దుఃఖము అధికముగా గలది.

ప్రకాశా బహిరంతస్తే తమోద్రిక్తా రజోఽధికాః ।
పంచమోఽను గ్రహస్సర్గశ్చతుర్ధా సంవ్యవస్థితః ॥
విపర్యయేణ శక్త్యా చ తుష్ట్యా సిద్ధ్యా తథైవ చ ।
తేఽపరిగ్రాహిణస్సర్వే సంవిభాగరతాః పునః ॥
ఖాదనాశ్చాప్యశీలాశ్చ భూతాద్యాః పరికీర్తితాః ।
ప్రథమో మహతస్సర్గో బ్రహ్మణః పరమేష్ఠినః ॥
తన్మాత్రాణాం ద్వితీయస్తు భూతసర్గస్స ఉచ్యతే ।
వైకారికస్తృతీయస్తు సర్గ ఐంద్రియకస్స్మృతః ॥
ఇత్యేష ప్రకృతేస్సర్గసంభూతోఽ బుద్ధిపూర్వకః ।
ముఖ్యసర్గశ్చతుర్థస్తు ముఖ్యా వై స్థావరాస్స్మృతాః ॥
తిర్యక్ స్రోతస్తు యః ప్రోక్తస్తిర్యగ్యోనిస్స పంచమః ।
తదూర్ధ్వస్రోతసష్షష్ఠో దేవసర్గస్తు స స్మృతః ॥
తతో ఽ ర్వాక్ స్రోతసాం సర్గస్సప్తమస్స తు మానుషః ।
అష్టమోఽ ను గ్రహస్సర్గః కౌమారో నవమస్స్మృతః ॥
ప్రాకృతాశ్చ త్రయః పూర్వే సర్గాస్తే ఽబుద్ధిపూర్వకాః ।
బుద్ధిపూర్వం ప్రవర్తంతే ముఖ్యాద్యాః పంచ వైకృతాః ॥
అగ్రే ససర్జ వై బ్రహ్మా మానసానాత్మనస్సమాన్ ।
సనందం సనకం చైవ విద్వాంసం చ సనాతనమ్ ॥
ఋభుం సనత్కుమారం చ పూర్వమేవ ప్రజాపతిః ।
సర్వే తే యోగినో జ్ఞేయా వీతరాగా విమత్సరాః ॥

రజస్తమోగుణముల ఆధిక్యము గల మనుష్యులు లోపల, బయట కూడ ప్రకాశము గల వారు. ఈ అయిదవ సృష్టికి అనుగ్రహసర్గము అని పేరు. విపర్యయము (ఆహారము పై నుండి క్రిందకు ప్రవహించుట), శక్తి, తుష్టి, సిద్ధి అను నాలుగు రూపములలో ఈ సృష్టి చక్కని వ్యవస్థను కలిగియున్నది. ఆ మానవులందరు ఇతరుల నుండి దేనినైననూ అపేక్షించని వారై, తమవద్ద గల సంపదను నలుగురికి పంచుటయందు ప్రీతిని కలిగియుండిరి ( 11, 12). మానవులలో కొందరు శీలమునెరుంగక తిండియందు మాత్రమే ప్రీతిని కలిగియున్ననూ, మానవులు ప్రాణులలో అగ్రేసరులుగా పరిగణింపబడు చున్నారు. సర్వజగత్కర్తయగు బ్రహ్మయొక్క సృష్టిలో మొదటిది మహత్తత్త్వము (13). సూక్ష్మపంచభూతముల సృష్టి రెండవది. దానికే భూతసర్గము అని పేరు. మూడవది వైకారిక (అహంకారముయొక్క) సృష్టి. దీనికే ఇంద్రియక ( ఇంద్రియముల) సర్గము అని పేరు (14). ఇంతవరకు ప్రకృతినుండి బుద్ధి సంబంధము లేకుండగా జరిగిన సృష్టి. నాల్గవది ముఖ్యసర్గము. ముఖ్యములనగా చెట్టుచేమలు (15). తిర్యక్ స్రోతస్సు అనగా పశుపక్ష్యాదుల సృష్టి. ఇది అయిదవ సర్గము. ఊర్ధ్వస్రోతస్సు అనగా దేవతల సృష్టి. ఇది ఆరవది (16). తరువాతిది అర్వాక్ స్రోతస్సు. అనగా మనుష్యుల సృష్టి. ఇది ఏడవది. ఎనిమిదవది అనుగ్రహసర్గము. తొమ్మిదవది. కౌమారసర్గము (17). మొదటి మూడు సర్గములు ప్రకృతినుండి ఉద్భవించినవి. వాటికి బుద్ధిసంబంధము లేదు. ముఖ్యసర్గముతో మొదలయ్యే అయిదు వికారసర్గములు బుద్ధిపూర్వకముగా చేయబడినవి (18). ప్రజాపతియగు బ్రహ్మ మొట్టమొదటనే తనతో సమానమైన మానసపుత్రులను సనందుడు, సనకుడు, విద్వాంసుడగు సనాతనుడు, ఋభుడు, సనత్కుమారుడు అనువారిని సృష్టించెను. వీరందరు యోగులు, విరాగులు మరియు మాత్సర్యము లేనివారు అని తెలియదగును.

ఈశ్వరాసక్తమనసో న చక్రుస్సృష్టయే మతిమ్ ।
తేషు సృష్ట్యనపేక్షేషు గతేషు సనకాదిషు ॥
స్రష్టుకామః పునర్బ్రహ్మా తతాప పరమం తపః ।
తస్యైవం తప్యమానస్య న కించిత్సమవర్తత ॥
తతో దీర్ఘేణ కాలేన దుఃఖాత్క్రోధో వ్యజాయత ।
క్రోధావిష్టస్య నేత్రాభ్యాం ప్రాపతన్నశ్రుబిందవః ॥
తతస్తేభ్యోఽశ్రుబిందుభ్యో భూతాః ప్రేతాస్తదాభవన్ ।
సర్వాంస్తానశ్రుజాన్ దృష్ట్వా బ్రహ్మాత్మానమనిందత ॥
తస్య తీవ్రా ఽభవన్మూర్ఛా క్రోధామర్షసముద్భవా ।
మూర్ఛితస్తు జహౌ ప్రాణాన్ క్రోధావిష్టః ప్రజాపతిః ॥
తతః ప్రాణేశ్వరో రుద్రో భగవాన్నీలలోహితః ।
ప్రసాదమతులం కర్తుం ప్రాదురాసీత్ప్రభోర్ముఖాత్ ॥
దశధా చైకధా చక్రే స్వాత్మానం ప్రభురీశ్వరః।
తే తేనోక్తా మహాత్మానో దశధా చైకధా కృతాః ॥

యూయం సృష్టా మయా వత్సా లోకానుగ్రహకారణాత్ ।
తస్మాత్సర్వస్య లోకస్య స్థాపనాయ హితాయ చ ॥
ప్రజాసంతాన హేతోశ్చ ప్రయతధ్వమతంద్రితాః ।
ఏవముక్తాశ్చ రురుదుర్దుద్రువుశ్చ సమంతతః ॥
రోదనాత్ ద్రావణాచ్చైవ తే రుద్రా నామతస్స్మృతాః ।
యే రుద్రాస్తే ఖలు ప్రాణా యే ప్రాణాస్తే మహాత్మకాః ॥

వారు ఈశ్వరునియందు లగ్నమైన మనస్సు గలవారై సృష్టియందు శ్రద్ధను చూపకుండిరి. ఈ విధముగా సృష్టియందు ఉత్సాహము లేని ఆ సనకాదులు వెళ్లగానే (21), బ్రహ్మ మరల సృష్టిని చేయగోరి గొప్ప తపస్సును చేసెను. ఈ విధముగా ఆయన తపస్సును చేసిననూ, ప్రయోజనమేమియు లేకుండెను (22). ఈ విధముగా చాల కాలము గడచిన తరువాత ఆయనకు దుఃఖము, దానినుండి కోపము కలిగినవి. కోపముతో ఆవేశమును పొందిన బ్రహ్మయొక్క కన్నులనుండి నీటి బొట్టులు జారి పడెను (23). అపుడా నీటి బొట్లనుండి భూతప్రేతములు పుట్టినవి. కన్నీటి బిందువులనుండి పుట్టిన వాటినన్నింటినీ చూచి బ్రహ్మ తనను తాను నిందించుకొనెను (24). ఆయనకు కోపము, అసహనము కలిగి వాటి వలన తీవ్రమగు మూర్ఛ కలిగెను. ఆయన కోపముయొక్క ఆవేశములో మూర్ఛిల్లి ప్రాణములను విడిచెను (25), అపుడు ప్రాణములకు ప్రభువు, కంఠమునందు నీలవర్ణము ఇతరత్రా ఎర్రని రంగు గల రుద్ర భగవానుడు సాటిలేని అనుగ్రహమును చేయగోరి బ్రహ్మ ప్రభుని ముఖమునుండి ఆవిర్భవించెను (26). ఆ శివప్రభుడు తనను పదకొండు రూపములుగా విభజించుకొనెను. ఈ విధముగా పదకొండుగా చేయబడిన మహాత్ములగు ఆ మూర్తులనుద్దేశించి ఆయన ఇట్లు పలికెను (27). ఓ కుమారులారా! నేను మిమ్ములను లోకముల అనుగ్రహము కొరకై సృష్టించితిని. కావున, సకలలోకముల స్థితి మరియు హితముల కొరకు (28), ప్రజల సృష్టి కొరకు సోమరితనము లేనివారై యత్నించుడు. ఈ విధముగా ఆయన పలుకగా, వారు అంతటా పరుగులు తీస్తూ ఏడ్చిరి (29). ఏడుస్తూ పరుగులెత్తుట వలన వారికి రుద్రులు అను పేరు కలిగెను. ప్రాణులలోని ప్రాణములు మహాత్ములగు ఆ రుద్రులే.

తతో మృతస్య దేవస్య బ్రహ్మణః పరమేష్ఠినః ।
ఘృణీ దదౌ పునః ప్రాణాన్ బ్రహ్మపుత్రో మహేశ్వరః ॥
ప్రహృష్టవదనో రుద్రః ప్రాణప్రత్యాగమాద్విభోః ।
అభ్యభాషత విశ్వేశో బ్రహ్మాణం పరమం వచః ॥
మా భైర్మా భైర్మహాభాగ విరించే జగతాం గురో ।
మయా తే ప్రాణితాః ప్రాణాస్సుఖముత్తిష్ఠ సువ్రత ॥
స్వప్నానుభూతమివ తచ్ఛ్రుత్వా వాక్యం మనోహరమ్ ।
హరం నిరీక్ష్య శనకైర్నేత్రైః ఫుల్లాంబుజప్రభైః ॥
తథా ప్రత్యాగతప్రాణః స్నిగ్ధగంభీరయా గిరా ।
ఉవాచ వచనం బ్రహ్మా తముద్దిశ్య కృతాంజలిః ॥

త్వం హి దర్శనమాత్రేణ చానందయసి మే మనః ।
కో భవాన్ విశ్వమూర్త్యా వా స్థిత ఏకాదశాత్మకః ॥
తస్య తద్వచనం శ్రుత్వా వ్యాజహార మహేశ్వరః ।
స్పృశన్ కరాభ్యాం బ్రహ్మాణం సుసుఖాభ్యాం సురేశ్వరః ॥
మాం విద్ధి పరమాత్మానం తవ పుత్రత్వమాగతమ్ ।
ఏతే చైకాదశ రుద్రాస్త్వాం సురక్షితుమాగతాః ॥
తస్మాత్తీవ్రామిమాం మూర్ఛాం విధాయ మదనుగ్రహాత్ ।
ప్రబుద్ధస్వ యథాపూర్వం ప్రజా వై స్రష్టుమర్హసి ॥
ఏవం భగవతా ప్రోక్తో బ్రహ్మా ప్రీతమనా హ్యభూత్ ।
నామాష్టకేన విశ్వాత్మా తుష్టావ పరమేశ్వరమ్ ॥

సర్వజగత్కర్తయగు బ్రహ్మదేవుడు ఈ విధముగా మరణించగా, బ్రహ్మయొక్క పుత్రుడగు మహేశ్వరుడు దయ గలవాడై మరల ప్రాణములను ఇచ్చెను (31). అపుడు బ్రహ్మదేవుని ప్రాణములు తిరిగి రాగా, జగత్ప్రభువగు రుద్రుడు ఆనందముతో నిండిన ముఖము గలవాడై బ్రహ్మను ఉద్దేశించి శ్రేష్ఠమగు వచనమును పలికెను (32). ఓ మహాత్మా! భయపడకుము. భయ పడకుము. ఓ జగత్కర్తా! బ్రహ్మా! నేను నీ ప్రాణములను ఉజ్జీవింప జేసితిని. ఓ గొప్ప వ్రతము గలవాడా! సుఖముగా లెమ్ము (33). తిరిగి వచ్చిన ప్రాణములు గల బ్రహ్మా స్వప్నములో అనుభవింపబడినట్లు ఉన్న ఆ మనోహరమగు వచనమును విని, వికసించిన పద్మముల ప్రకాశమును కలిగియున్న కన్నులతో మెల్లగా శివుని పరికించి చూచి, చేతులను జోడించి, ఆ శివుని ఉద్దేశించి ప్రేమతో నిండినది మరియు గంభీరమైనది అగు వాక్కుతో నిట్లు పలికెను (34,35). నీవు కేవలము దర్శనము చేతనే నా మనస్సునకు ఆనందమును కలిగించుచున్నావు. పదకొండు రూపములలో జగత్తును వ్యాపించి జగద్రూపములోనున్న నీవు ఎవరు? (36) ఆ బ్రహ్మయొక్క ఆ మాటను విని దేవదేవుడగు మహేశ్వరుడు ఆయనను గొప్ప సుఖమును కలిగించే తన రెండు చేతులతో స్పృశిస్తూ ఇట్లు పలికెను (37). నేను నీ పుత్రుని రూపములో వచ్చియున్న పరమేశ్వరుడనని తెలియుము. ఈ పదకొండు రుద్రులు నిన్ను సంరక్షించుటకు వచ్చియున్నారు (38). కావున, నా అనుగ్రహముచే తీవ్రమగు ఈ మూర్ఛను పారద్రోలి తెలివిని తెచ్చుకొని పూర్వమునందు వలెనే ప్రజలను సృష్టించ తగుదువు (39). భగవానుడు ఇట్లు పలుకగా, జగత్స్వరూపుడగు బ్రహ్మ సంతోషముతో నిండిన మనస్సు గలవాడై, పరమేశ్వరుని ఎనిమిది నామములతో ఇట్లు స్తుతించెను.

బ్రహ్మోవాచః

నమస్తే భగవన్ రుద్ర భాస్కరామితతేజసే ।
నమో భవాయ దేవాయ రసాయాంబుమయాత్మనే ।
శర్వాయ క్షితిరూపాయ నందీసురభయే నమః ॥
ఈశాయ వసవే తుభ్యం నమస్స్పర్శమయాత్మనే ।
పశూనాం పతయే చైవ పావకాయాతతేజసే ।
భీమాయ వ్యోమరూపాయ శబ్దమాత్రాయ తే నమః ॥
ఉగ్రాయోగ్రస్వరూపాయ యజమానాత్మనే నమః ।
మహాదేవాయ సోమయ నమోఽస్త్వమృతమూర్తయే ॥
ఏవం స్తుత్వా మహాదేవం బ్రహ్మా లోకపితామహః ।
ప్రార్థయామాస విశ్వేశం గిరా ప్రణతిపూర్వయా ॥
భగవన్ భూతభవ్యేశ మమ పుత్ర మహేశ్వర ।
సృష్టి హేతోస్త్వముత్పన్నో మమాంగే ఒనంగనాశనః ॥
తస్మాన్మహతి కార్యేఽస్మిన్ వ్యాపృతస్య జగత్ప్రభో ।
సహాయం కురు సర్వత్ర స్రష్టుమర్హసి సుప్రజాః ॥
తేనైవం ప్రార్థితో దేవో రుద్రస్త్రిపురమర్దనః ।
బాఢమిత్యేవ తాం వాణీం ప్రతిజగ్రాహ శంకరః ॥
తతస్స భగవాన్ బ్రహ్మా హృష్టం తమభినంద్య చ ।
స్రష్టుం తేనాభ్యనుజ్ఞాతస్తథానాశ్వాస్సృజత్ప్రజాః ॥
మరీచిభృగ్వంగిరసః పులస్త్యం పులహం క్రతుమ్ ।
దక్షమత్రిం వసిష్ఠం చ సోఽస్సృజన్మనసైవ చ ।
పురస్తాదస్సృజద్బ్రహ్మా ధర్మం సంకల్పమేవ చ ॥
ఇత్యేతే బ్రహ్మణః పుత్రా ద్వాదశాదౌ ప్రకీర్తితాః ।
సహ రుద్రేణ సంభూతాః పురాణా గృహమేధినః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హే భగవన్! అనంతతేజస్సు గల సూర్యుని స్వరూపములోనున్న నీకు నమస్కారము. సత్తా (ఉనికి) స్వరూపుడు, నీరు అనే రూపములో రసస్వరూపుడు అగు శివునకు నమస్కారము. సంహారకాలములో హింసకుడు, భూమి రూపములో నున్నవాడు అగు రుద్రునకు, నందీశ్వరునకు, కామధేనువునకు నమస్కారము (41). ఈశ్వరుడవు, వసువుల రూపములో నున్నవాడవు, స్పర్శస్వరూపుడవు అగు నీకు నమస్కారము. జీవులకు ప్రభువు, గొప్ప తేజస్సు గల అగ్నిస్వరూపుడు, భయంకరుడు, ఆకాశరూపములో నున్నవాడు, శబ్దతన్మాత్రస్వరూపుడు అగునీకు నమస్కారము (42). సంహారకాలములో భయంకరమగు రూపమును దాల్చే ఉగ్రుడు, సోమయాగమును చేయు యజమానుని రూపములో నున్నవాడు, జగన్మాతతో కూడియున్నవాడు, అమృతస్వరూపుడు అగు మహాదేవునకు నమస్కారము (43), లోకములకు పితామహుడు అగు బ్రహ్మ విశ్వేశ్వరుడగు

మహాదేవుని ఈ విధముగా స్తుతించి, నమస్కారపూర్వకమగు వాక్కుతో ఇట్లు ప్రార్థించెను (44). ఓ భగవాన్! భూతభవిష్యద్వర్తమానములకు ప్రభువైన వాడా! నా పుత్రుడా! మహేశ్వరా! మన్మథుని సంహరించిన నీవు సృష్టి కొరకై నా దేహమునుండి ఉద్భవించినావు (45). ఓ జగత్ప్రభూ! ఈ గొప్ప కార్యములో నిమగ్నుడనై యున్న నాకు అన్ని కాలములలో సహకరించుము. నీవు చక్కని సంతానమును కనవలెను (46). త్రిపురాసురసంహారకుడు, మంగళకరుడు అగు రుద్రుడు ఆ బ్రహ్మచే ఈ విధముగా ప్రార్థించబడినవాడై, అటులనే యగుగాక! అని పలికి ఆ ప్రార్థనను స్వీకరించెను (47). తరువాత ఆ బ్రహ్మభగవానుడు సంతోషించియున్న ఆ రుద్రుని అభినందించి, సృష్టిని చేయుటకు ఆయన అనుమతిని పొంది, ఇతరులగు పుత్రులను సృష్టించెను (48). బ్రహ్మ ముందుగా మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు, ధర్ముడు, సంకల్పుడు అనువారిని మనస్సు చేతనే సృష్టించెను (49). ఈ విధముగా బ్రహ్మకు సృష్ట్యాదియందు రుద్రునితో కలిపి సనాతనులు, గృహస్థులు అగు ఈ పన్నెండు మంది పుత్రులు కలిగిరని కీర్తించబడినది.

తేషాం ద్వాదశ వంశాస్స్యుర్దివ్యా దేవగణాన్వితాః ।
ప్రజావంతః క్రియావంతో మహర్షిభిరలంకృతాః ॥
అథ దేవాసురపితౄన్ మనుష్యాంశ్చ చతుష్టయమ్ ।
సహ రుద్రేణ సిస్సృక్షురంభస్యేతాని వై విధిః ॥
స సృష్ట్యర్థం సమాధాయ బ్రహ్మాత్మానమయూయుజత్ ।
ముఖాదజనయద్దేవాన్ పితౄంశ్చైవోపపక్షతః ॥
జఘనాదసురాన్ సర్వాన్ ప్రజనాదపి మానుషాన్ ।
అవస్కరే క్షుధావిష్టా రాక్షసాస్తస్య జజ్ఞిరే ॥
పుత్రాస్తమోరజఃప్రాయా బలినస్తే నిశాచరాః ।
సర్పా యక్షాస్తథా భూతా గంధర్వాస్సంప్రజజ్ఞిరే ॥
వయాంసి వక్షతస్సృష్టాః పక్షిణో వక్షసోఽసృజత్ ।
ముఖతోఽజాంస్తథా పార్శ్వాదురగాంశ్చ వినిర్మమే ॥
పద్భ్యాం చాశ్వాన్ సమాతంగాన్ శరభాన్ గవయాన్ మృగాన్ ।
ఉష్ట్రానశ్వతరాంశ్చైవ న్యంకూనన్యాంశ్చ జాతయః ॥
ఔషధ్యః ఫలమూలాని రోమభ్యస్తస్య జజ్ఞిరే ।
గాయత్రీం చ ఋచం చైవ త్రివృత్సామ రథంతరమ్ ॥
అగ్నిష్టోమం చ యజ్ఞానాం నిర్మమే ప్రథమాన్ముఖాత్ ।
యజూంషి త్రైష్టుభం ఛందః స్తోమం పంచదశం తథా ॥
బృహత్సామ తథోక్థ్యం చ పశ్చిమాదసృజన్ముఖాత్ ।
సామాని జగతీఛందః స్తోమం సప్తదశం తథా ।
వైరూప్యమతిరాత్రం చ పశ్చిమాదసృజన్ముఖాత్ ।
ఏకవింశమథర్వాణమాప్తోర్యామాణమేవ చ ॥

**అనుష్టుభం స వైరాజముత్తరాదస్ృజన్ముఖాత్ ।**

**ఉచ్చావచాని భూతాని గాత్రేభ్యస్తస్య జజ్ఞిరే ॥**

వారు దేవగణములతో కూడినవి, సంతానము గలవి, వైదికకర్మలు గలవి, మహర్షులచే అలంకరింపబడినవి అగు పన్నెండు దివ్యవంశములకు మూలపురుషులు అగుదురు (51). తరువాత బ్రహ్మ రుద్రునితో కలిసి ప్రళయసముద్రమునందు దేవతలు, రాక్షసులు, పితరులు మరియు మనుష్యులు అనే నాలుగు సముదాయములను సృష్టించగోరెను (52). ఆ బ్రహ్మ మనస్సును ఏకాగ్రము చేసి సృష్టి కొరకే తన దేహమును తాను వినియోగములోనికి తెచ్చెను. ఆయన తన ముఖమునుండి దేవతలను, పార్శ్వములనుండి పితరులను, పొత్తికడుపు భాగము నుండి అసురులను, జననేంద్రియమునుండి మనుష్యులను సృష్టించెను. ఆయనయొక్క విసర్జనేంద్రియమునందు ఆకలితో అలమటించే రాక్షసులు జన్మించిరి (53, 54. రజస్తమోగుణములు ప్రధానముగా గలవారు, బలవంతులు అగు రాక్షసులు, నాగులు, యక్షులు, భూతములు మరియు గంధర్వులు ఆయనకు పుత్రులై జన్మించిరి (55). ఆయన ప్రక్కలనుండి కాకులను, వక్షఃస్థలమునుండి పక్షులను, ముఖమునుండి మేకలను, పార్శ్వములనుండి పాములను సృష్టించెను (56). పాదములనుండి గుర్రములను, ఏనుగులను, శరభమృగములను, గవయమృగములను, లేళ్లను, ఒంటెలను, గాడిదలను, దుప్పి అనే జంతువులను మరియు ఇతరజాతులను సృష్టించేను (57). పంట మొక్కలు, పళ్లు, దుంపలు ఆయన రోమములనుండి జన్మించినవి. తూర్పు ముఖమునుండి ఆయన గాయత్రీచ్ఛందస్సును, ఋగ్వేదమును, త్రివృత్ మరియు రథంతరము అనే సామలను, యజ్ఞములలో ప్రముఖమగు అగ్నిష్టోమమును నిర్మించెను. యజుర్వేదమును, త్రిష్టుప్ ఛందస్సును, పంచదశస్తోమము (స్తోత్రరూపమగు మంత్రసముదాయము) ను, బృహత్ అనే సామను మరియు ఉక్థము (స్తోత్రరూపమగు మంత్రము) ను ఆయన దక్షిణ ముఖమునుండి సృష్టించెను. వైరూప్యము మొదలగు. సామలను, జగతీఛందస్సును, సప్తదశస్తోమమును, మరియు అతిరాత్రమనే క్రతువును ఆయన పశ్చిమముఖమునుండి సృష్టించెను. ఏకవింశస్తోమమును, అథర్వవేదమును, ఆప్తోర్యామమనే క్రతువును, అనుష్టుప్ ఛందస్సును మరియు వైరాజసామను ఆయన ఉత్తరముఖమునుండి సృష్టించెను. చిన్న పెద్ద ప్రాణులు ఆయన అవయవములనుండి పుట్టినవి.

**యక్షాః పిశాచా గంధర్వాస్తథైవాప్సరసాం గణాః ।**

**నరకిన్నరరక్షాంసి వయఃపశుమృగోరగాః ॥**

**అవ్యయం చైవ యదిదం స్థాణు స్థావరజంగమమ్ ।**

**తేషాం వై యాని కర్మాణి ప్రాక్ సృష్టాని ప్రపేదిరే ॥**

**తాన్యేవ తే ప్రపద్యంతే సృజ్యమానాః పునః పునః ।**

**హింస్రాహింస్రే మృదుక్రూరే ధర్మాధర్మావృతానృతే ॥**

**తద్భావితాః ప్రపద్యంతే తస్మాత్తత్తస్య రోచతే ।**

**మహాభూతేషు నానాత్వమింద్రియార్థేషు ముక్తిషు ॥**

వినియోగం చ భూతానాం ధాతైవ వ్యదధాత్స్వయమ్ ।
నామ రూపం చ భూతానాం ప్రాకృతానాం ప్రపంచనమ్ ॥
వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే ऽసౌ పితామహః ।
ఆర్షాణి చైవ నామాని యాశ్చ వేదేషు వృత్తయః ॥
శర్వర్యంతే ప్రసూతానాం తాన్యేవైభ్యో దదావజః ।
యథర్త్వావృతులింగాని నానారూపాణి పర్యయే ॥
దృశ్యంతే తాని తాన్యేవ తథా భావా యుగాదిషు ।
ఇత్యేష కరణోద్భూతో లోకసర్గస్స్వయంభువః ॥
మహదాద్యో విశేషాంతో వికారః ప్రకృతేస్స్వయమ్ ।
చంద్రసూర్యప్రభాజుష్టో గ్రహనక్షత్రమండితః ॥
నదీభిశ్చ సముద్రైశ్చ పర్వతైశ్చ స మండితః ।
పురైశ్చ వివిధై రమ్యైస్స్ఫీతైర్జనపదైస్తథా ॥
తస్మిన్ బ్రహ్మవనే ऽవ్యక్తో బ్రహ్మా చరతి సర్వవిత్ ।
అవ్యక్తబీజప్రభవ ఈశ్వరానుగ్రహే స్థితః ॥

యక్షులు, పిశాచములు, గంధర్వులు, అప్సరసల గణములు, నరులు, కిన్నరులు, రాక్షసులు, పక్షులు, పశువులు, వన్యమృగములు, సర్పములు (63), వినాశములేని పదార్థములు, జడములు, కదిలే ప్రాణులు మరియు కదలని ప్రాణులు జన్మించినవి. ఆయా ప్రాణులు ఈ సృష్టికి ముందు ఏయే కర్మలను చేసియున్నవో, వాటికి తగిన జన్మలను మాత్రమే మరల మరల అవి పొందుచున్నవి. ధర్మ- అధర్మములు, సత్య- అసత్యములు అను పూర్వసంస్కారములను బట్టి హింసను చేయునవి, హింసను చేయనివి, మృదుస్వభావము గలవి, క్రూరస్వభావము గలవి అగు ప్రాణులు ఆయా దేహములను పొందుచున్నవి. ప్రాణులకు ఆయా పూర్వజన్మసంస్కారములను బట్టి ఆయా కర్మలు ప్రీతికరములగుచుండును. మహాభూతములయందు, ఇంద్రియ భోగములయందు, మరియు మోక్షములయందు అనేకత్వమును ఆ ప్రజాపతియే స్వయముగా నిర్మించెను. ఆ పితామహుడు సృష్ట్యాదియందు ప్రకృతివికారములగు పంచభూతములకు నామరూపముల వ్యాకరణమును అనగా విస్తారమును వేదశబ్దములను ఆధారముగా చేసుకొని మాత్రమే చేసెను. పుట్టుక లేని ఆ బ్రహ్మ ప్రళయము పూర్తి కాగానే, జన్మించిన జీవులకు వేదములయందు బోధింపబడియున్న ఋషుల నామములను, వారి జీవనవ్యాపారములను అందజేసెను. ప్రతిసంవత్సరములో ఒక ఋతువు తిరిగి వచ్చునాటికి అనేకవిధముల ఋతుధర్మములు సమానముగా తిరిగి ప్రకటమగుచుండును. యుగములు, కల్పములు మొదలగు వాటిలో ప్రాణుల పరిస్థితి కూడా అటులనే యుండును. ఈ విధముగా బ్రహ్మయొక్క అవయవములనుండి లోకములు సృష్టించబడినవి (64—70). మహత్తుతో మొదలిడి పరమాణువిశేషము వరకు గల వికారములు స్వయముగా ప్రకృతినుండి ప్రకటమైనవి. చంద్రసూర్యుల కాంతులతో ప్రకాశించునది, గ్రహములతో మరియు, నక్షత్రములతో అలంకరింప బడినది (71),

నదులతో సముద్రములతో పర్వతములతో నొప్పారునది, వివిధములగు సుందరనగరములతో మరియు సుందరమగు పల్లెసీమలతో కళకళలాడునది అగు (72) బ్రహ్మవనము (పరంబ్రహ్మయే అధిష్ఠానముగా గల జగత్తు) నందు సర్వజ్ఞుడు, మాయాశక్తి అనే బీజమునుండి పుట్టినవాడు, ఈశ్వరుని అనుగ్రహమునందు స్థిరముగా నున్నవాడు అగు హిరణ్యగర్భుడు కంటికి కానరాకుండగా సంచరించుచున్నాడు.

**బుద్ధిస్కంధమహాశాఖ ఇంద్రియాంతరకోటరః ।**

**మహాభూతప్రమాణశ్చ విశేషామలపల్లవః ॥**

**ధర్మాధర్మసుపుష్పాఢ్యస్సుఖదుఃఖఫలోదయః ।**

**ఆజీవ్యస్సర్వభూతానాం బ్రహ్మవృక్షస్సనాతనః ॥**

**ద్యాం మూర్ధానం తస్య విప్రా వదంతి ఖం వై నాభిం చంద్రసూర్యౌ చ నేత్రే ।**

**దిశః శ్రోత్రే చరణౌ చ క్షితిం చ సో ఽచింత్యాత్మా సర్వభూతప్రణేతా ॥**

**వక్త్రాత్తస్య బ్రాహ్మణాస్సంప్రసూతాస్తద్వక్షసః క్షత్రియాః పూర్వభాగాత్।**

**వైశ్యా ఊరుభ్యాం తస్య పద్భ్యాం చ శూద్రాస్సర్వే వర్ణా గాత్రతస్సంప్రసూతాః ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే జగత్సృష్టి వర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥**

బుద్ధియే మొదలు మరియు పెద్ద కొమ్మలుగా గలది, ఇంద్రియగోళకములే తొర్రలుగా గలది, మహాభూతములే నిడివిగా గలది, పరమాణువిశేషములే స్వచ్ఛమగు చిగుళ్లుగా గలది (74), ధర్మ-అధర్మములనే అందమైన పువ్వులతో ఒప్పారునది, సుఖదుఃఖములనే పళ్లను కాయునది, ప్రవాహరూపములో నిత్యమైనది అగు బ్రహ్మ అనే చెట్టు (జగద్రూపముగా ప్రకటమైన పరంబ్రహ్మము) ను సర్వప్రాణులు ఆశ్రయించి యున్నవి (75). ఊహింప శక్యము కాని స్వరూపము గలవాడు, సర్వప్రాణులను సృష్టించినవాడు అగు ఆ హిరణ్యగర్భునకు స్వర్గలోకము శిరస్సు అనియు, ఆకాశము నాభి యనియు, సూర్యచంద్రులు నేత్రములనియు, దిక్కులు చెవులనియు, పాదములు భూమి అనియు పండితులు వర్ణించుచున్నారు (76). ఆయన శరీరముయొక్క పై భాగములో నోటినుండి బ్రాహ్మణులు, వక్షఃస్థలమునుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు, ఈ విధముగా అన్ని వర్ణములు వారు ఆయన దేహమునుండియే పుట్టినారు.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో జగత్సృష్టిని వర్ణించే పన్నెండవ అధ్యాయము ముగిసినది.

# 13 - బ్రహ్మవిష్ణువులు సృష్టిని చేయుట

ఋషయ ఊచుః ।

భవతా కథితా సృష్టిర్భవస్య పరమాత్మనః ।
చతుర్ముఖముఖాత్తస్య సంశయో నః ప్రజాయతే ॥
దేవశ్రేష్ఠో విరూపాక్షో దీప్తశ్శూలధరో హరః ।
కాలాత్మా భగవాన్ రుద్రః కపర్దీ నీలలోహితః ॥
సబ్రహ్మకమిదం లోకం సవిష్ణుమపి పావకమ్ ।
యస్సంహరతి సంక్రుద్ధో యుగాంతే సముపస్థితే ॥
యస్య బ్రహ్మా చ విష్ణుశ్చ ప్రణామం కురుతే భయాత్ ।
లోకసంకోచకస్యాస్య యస్య తౌ వశవర్తినౌ ॥
యోఽయం దేవస్స్వకాదంగా ద్బ్రహ్మవిష్ణూ పురాస్సృజత్ ।
స ఏవ హి తయోర్నిత్యం యోగక్షేమకరః ప్రభుః ॥
స కథం భగవాన్ రుద్ర ఆదిదేవః పురాతనః ।
పుత్రత్వమగమచ్ఛంభుర్బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ॥
ప్రజాపతిశ్చ విష్ణుశ్చ రుద్రస్యైతౌ పరస్పరమ్ ।
సృష్టౌ పరస్పరస్యాంగాదితి ప్రాగపి శుశ్రుమ ॥
కథం పునరశేషాణాం భూతానాం హేతుభూతయోః ।
గుణప్రధానభావేన ప్రాదుర్భావః పరస్పరాత్ ॥
నాదృష్టం భవతా కించిన్నాశ్రుతం చ కథంచన ।
భగవచ్ఛిష్యభూతేన భవతా సకలం స్మృతమ్ ॥
తత్త్వం వద యథా బ్రహ్మా మునీనామవదద్విభుః ।
వయం శ్రద్ధాలవస్తాత శ్రోతుమీశ్వరసద్యశః ॥

ఋషులు ఇట్లు పలికిరి -

పరమాత్మయగు శివుడు నాల్గుమోముల వేల్పు (బ్రహ్మ) ద్వారా చేసిన సృష్టిని గురించి నీవు మాకు చెప్పియుంటివి. దాని విషయములో మాకు ఒక సందేహము కలుగుచున్నది (1). దేవతలలో శ్రేష్ఠుడు, ముక్కంటి, ప్రకాశస్వరూపుడు, శూలమును ధరించినవాడు, పాపములను పోగొట్టువాడు, కాలస్వరూపుడు, జటాజూటమును ధరించినవాడు, కంఠమునందు నీలవర్ణమును మిగిలిన దేహమునందు ఎర్రని రంగును కలిగియున్నవాడు అగు రుద్రభగవానుడు (2) ప్రళయకాలము సంప్రాప్తము కాగానే అతిశయించిన కోపము గలవాడై, బ్రహ్మవిష్ణువులతో మరియు అగ్నితో సహా ఈ లోకమును ఉపసంహరించును (3). ఆయనకు భయపడి బ్రహ్మవిష్ణువులు నమస్కారమును చేయుదురు. లోకములను ఉపసంహరించే ఈ శివునకు వారు వశవర్తులై యుందురు (4). అట్టి ఈ రుద్రదేవుడు తన శరీరమునుండి పూర్వము బ్రహ్మవిష్ణువులను సృష్టించెను. ఆ ప్రభువే నిత్యము వారిద్దరి యోగక్షేమములను (లేనిదానిని సంపాదించుట

యోగము, ఉన్నదానిని పరిరక్షించుట క్షేమము) చూచుచున్నాడు (5). ఆదిదేవుడు, సనాతనుడు, మంగళకరుడు అగు అట్టి ఆ రుద్రభగవానుడు అవ్యక్తమునుండి పుట్టిన బ్రహ్మకు పుత్రుడు అగుట ఎట్లు సంభవము? (6) బ్రహ్మావిష్ణువులు మరియు రుద్రుడు ఒకరినొకరు ఒకరి అంగమునుండి మరియొకరిని సృష్టించినారని కూడ పూర్వము వినియుంటిమి (7). సకలప్రాణులకు కారణములగు వీరిద్దరు ఒకరినుండి మరియొకరు పుట్టుట, అనగా ఒకరు పెద్ద మరియొకరు చిన్న అగుట ఎట్లు సంభవము? (8) నీవు చూడనిది, విననిది ఏదియు లేదు. భగవానుని శిష్యుడవగు నీకు సర్వము స్మృతియందు ఉండును (9). అట్టి నీవు బ్రహ్మదేవుడు మునులకు బోధించిన విధముగా మాకు కూడ చెప్పుము. ఓ తండ్రీ! శ్రద్ధావంతులమగు మేము ఈశ్వరుని పుణ్య కీర్తిని వినగోరుచున్నాము.

**వాయురువాచ।**

స్థానే పృష్టమిదం విప్రా భవద్భిః ప్రశ్నకోవిదైః ।
ఇదమేవ పురా పృష్టో మమ ప్రాహ పితామహః ॥
తదహం సంప్రవక్ష్యామి యథా రుద్రసముద్భవః।
యథా చ పునరుత్పత్తిర్బ్రహ్మవిష్ణోః పరస్పరమ్ ॥
త్రయస్తే కారణాత్మానో జాతాస్సాక్షాన్మహేశ్వరాత్।
చరాచరస్య విశ్వస్య సర్గస్థిత్యంతహేతవః ॥
పరమైశ్వర్యసంయుక్తాః పరమేశ్వరభావితాః ।
తచ్ఛక్త్యధిష్ఠితా నిత్యం తత్కార్యకరణక్షమాః ॥
పిత్రా నియమితాః పూర్వం త్రయోఽపి త్రిషు కర్మసు ।
బ్రహ్మా సర్గే హరిస్త్రాణే రుద్రస్సంహరణే తథా ॥
తథాప్యన్యోన్యమాత్సర్యాదన్యోన్యాతిశయాశినః ।
తపసా తోషయిత్వా స్వం పితరం పరమేశ్వరమ్ ॥
లబ్ధ్వా సర్వాత్మనా తస్య ప్రసాదాత్పరమేష్ఠినః ।
బ్రహ్మనారాయణౌ పూర్వం రుద్రః కల్పాంతరేఽసృజత్ ॥
కల్పాంతరే పునర్బ్రహ్మా రుద్రవిష్ణూ జగన్మయః ।
విష్ణుశ్చ భగవాన్ రుద్రం బ్రహ్మాణమసృజత్పునః ॥
నారాయణం పునర్బ్రహ్మా బ్రహ్మాణం చ పునర్భవః ।
ఏవం కల్పేషు కల్పేషు బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥
పరస్పరేణ జాయంతే పరస్పరహితైషిణః।
తత్తత్కల్పాంతవృత్తాంతమధికృత్య మహర్షిభిః ॥
ప్రభావః కథ్యతే తేషాం పరస్పరసముద్భవాత్।
శృణు తేషాం కథాం చిత్రం పుణ్యాం పాపప్రమోచనీమ్ ॥

వాయవు ఇట్లు పలికెను -

ఓ బ్రాహ్మణులారా! ప్రశ్నను వేయుటలో పండితులగు మీరు చాల చక్కని ప్రశ్నను వేసితిరి. పూర్వము ఇదే ప్రశ్నను నేను బ్రహ్మగారిని అడుగగా, ఆయన నాకు చెప్పియున్నాడు (11). దానిని మీకు చక్కగా చెప్పెదను. రుద్రుడు పుట్టిన విధమును, బ్రహ్మవిష్ణువులు ఒకరినుండి మరియొకరు మరల జన్మించిన విధమును చెప్పెదను (12). జగత్కారణ స్వరూపులగు ఈ ముగ్గురు సాక్షాత్తుగా మహేశ్వరునినుండి జన్మించినారు. వారు క్రమముగా చరాచరజగత్తు యొక్క సృష్టిస్థితిలయములకు కారణభూతులు (13). పరమేశ్వరునిచే అనుగ్రహించబడిన వీరు సర్వోత్కృష్టమగు ఐశ్వర్యముతో కూడియున్నారు. ఆ పరమేశ్వరుని శక్తితో నిండియున్న ఈ ముగ్గురు సర్వకాలములలో ఆ పరమేశ్వరుని కార్యమును చేయుటకు సమర్థులగుచున్నారు (14). వారి తండ్రియగు ఈశ్వరుడు పూర్వము వారిని ముగ్గురిని మూడు పనులయందు నియోగించినాడు. బ్రహ్మ సృష్టిని, విష్ణువు స్థితిని, రుద్రుడు సంహారమును చేయును (15). అయినప్పటికీ, వీరిలో ఒకరిపై నొకరికి ఈర్ష్య ఉండుట వలన, ఒకరిని మించి మరియొకరు ఉండవలెననే ఆశ ఉండుట వలన, వారు తమ తండ్రియగు పరమేశ్వరుని తపస్సుతో సంతోషపెట్టిరి (16). ఆ పరమేశ్వరుని అనుగ్రహమును పూర్ణముగా సంపాదించిన రుద్రుడు పూర్వము మరియొక కల్పములో బ్రహ్మను మరియు నారాయణుని సృష్టించెను (17). మరల ఇంకో కల్పములో జగత్స్వరూపుడగు బ్రహ్మ రుద్రవిష్ణువులను సృష్టించెను. మరల విష్ణుభగవానుడు బ్రహ్మను మరియు రుద్రుని సృష్టించెను (18). మరల బ్రహ్మ నారాయణుని, మరల రుద్రుడు బ్రహ్మను, ఈ విధముగా వివిధకల్పములలో బ్రహ్మవిష్ణుమహేశ్వరులు (19) ఒకరినుండి మరియొకరు పుట్టి, ఒకరి హితమును మరియొకరు చేయుచుందురు. మహర్షులు ఆయా కల్పముల మధ్యలో జరిగిన వృత్తాంతములను ఆధారముగా చేసుకొని, ఒకరినుండి మరియొకరు పుట్టే త్రిమూర్తుల ప్రభావమును చెప్పుచుందురు. విచిత్రమైనది, పవిత్రమైనది, పాపములను పోగొట్టునది అగు వారి గాథను వినుము.

కల్పే తత్పురుషే వృత్తాం బ్రహ్మణః పరమేష్ఠినః ।
పురా నారాయణో నామ కల్పే వై మేఘవాహనే ॥
దివ్యం వర్షసహస్రం తు మేఘో భూత్వా ఽ వహద్ధరామ్ ।
తస్య భావం సమాలక్ష్య విష్ణోర్విశ్వజగద్గురుః ॥
శర్వస్సర్వాత్మభావేన ప్రదదౌ శక్తిమవ్యయామ్ ।
శక్తిం లబ్ధ్వా తు సర్వాత్మా శివాత్సర్వేశ్వరాత్తదా ॥
ససర్జ భగవాన్ విష్ణుర్విశ్వం విశ్వసృజా సహ ।
విష్ణోస్తద్వైభవం దృష్ట్వా సృష్టస్తేన పితామహః ॥
ఈర్ష్యయా పరయా గ్రస్తః ప్రహసన్నిదమబ్రవీత్ ।
గచ్ఛ విష్ణో మయా జ్ఞాతం తవ సర్గస్య కారణమ్ ।
ఆవయోరధికశ్చాస్తి స రుద్రో నాత్ర సంశయః ॥

తస్య దేవాధిదేవస్య ప్రసాదాత్పరమేష్ఠినః ।
స్రష్టా త్వం భగవానద్య పాలకః పరమార్థతః ॥
అహం చ తపసా ఽఽ రాధ్య రుద్రం త్రిదశనాయకమ్ ।
త్వయా సహ జగత్సర్వం స్రక్ష్యామ్య త్ర న సంశయః ॥
ఏవం విష్ణుముపాలంభ్య భగవానబ్జసంభవః ।
ఏవం విజ్ఞాపయామాస తపసా ప్రాప్య శంకరమ్ ॥
భగవన్ దేవదేవేశ విశ్వేశ్వర మహేశ్వర।
తవ వామాంగజో విష్ణుర్దక్షిణాంగభవో హ్యహమ్ ॥
మయా సహ జగత్సర్వం తథాప్యసృజదచ్యుతః ।
స మత్సరాదుపాలబ్ధస్త్వదాశ్రయబలాన్మయా ॥
మద్భావాన్నాధికస్తే ఽతిభావస్త్వయి మహేశ్వరే ।
త్వత్త ఏవ సముత్పత్తిరావయోస్సదృశీ యతః ॥

తత్పురుషకల్పములో(?) సర్వజగత్కర్తయగు బ్రహ్మయొక్క వృత్తాంతమును వినుము. పూర్వము మేఘవాహనము అను పేరు గల కల్పములో నారాయణుడు (22) వేయి దివ్యసంవత్సరములు మేఘరూపమును దాల్చి భూమిపై వర్షించెను. ఆ విష్ణువుయొక్క అభిప్రాయమును గమనించి సమస్తజగత్తునకు తండ్రియగు (23) శివుడు సర్వము ఆత్మయనే భావముతో కూడియున్న వినాశములేని శక్తిని ఆయనకొసంగెను. అపుడు సర్వేశ్వరుడగు శివునినుండి శక్తిని పొందిన విష్ణుభగవానుడు సర్వమునకు ఆత్మభూతుడై, బ్రహ్మతో కలిసి జగత్తును సృష్టించెను. విష్ణువు యొక్క ఆ వైభవమును గాంచి ఆయన చేతనే సృష్టించబడిన బ్రహ్మ (24, 25) పట్టరాని ఈర్ష్యతో నిండియున్నవాడై బిగ్గరగా నవ్వుతూ ఇట్లు పలికెను. ఓ విష్ణూ! హామ్ము, నీవు సృష్టిని చేయుటకు గల కారణము నాకు తెలియును. ఆ రుద్రుడు మన ఇద్దరికంటే అధికుడనుటలో సందేహము లేదు (26). దేవతలకు అధీశ్వరుడు, సర్వజగత్కర్త యగు ఆ శివుని అనుగ్రహము వలన నీవీనాడు యథార్థముగా భగవానుడవై సర్వమును సృష్టించి పాలించుచున్నావు (27). నేను కూడా తపస్సుచే దేవదేవుడగు రుద్రుని ఆరాధించి, నీతో కూడి జగత్తును అంతనూ సృష్టించెదను. దీనిలో సందేహము లేదు (28). పద్మమునుండి పుట్టిన బ్రహ్మదేవుడు ఈ విధముగా విష్ణువును నిందించి, తపస్సుచే శంకరుని సాక్షాత్కరించుకొని, ఇట్లు విన్నవించెను (29). ఓ భగవాన్! దేవదేవా! ఈశ్వరా! విశ్వేశ్వరా!. మహేశ్వరా! విష్ణువు నీ ఎడమభాగమునుండి పుట్టగా, నేను నీ కుడి భాగమునుండి పుట్టితిని గదా! (30) అయిననూ, అచ్యుతుడు నాతో గూడి జగత్తునంతనూ సృష్టించినాడు. నిన్ను ఆశ్రయించగలననే ధైర్యముతో నేనాయనను ఈర్ష్యతో నిందించితిని (31). మహేశ్వరుడవగు నీయందు నాకు గల భక్తికంటే అధికమగు భక్తి అతనికి లేదు. కావున, మేమిద్దరము నీనుండియే ఉద్భవించియుండుటచే సమానమగు స్థాయిలో నున్నాము.

తస్య భక్త్యా యథా పూర్వం ప్రసాదం కృతవానసి ।
తథా మమాపి తత్సర్వం దాతుమర్హసి శంకర ॥
ఇతి విజ్ఞాపితస్తేన భగవాన్ భగనేత్రహా ।
న్యాయేన వై దదౌ సర్వం తస్యాపి స ఘృణానిధిః ॥
లబ్ధ్వైవమీశ్వరాదేవ బ్రహ్మా సర్వాత్మతాం క్షణాత్ ।
త్వరమాణోఽ థ సంగమ్య దదర్శ పురుషోత్తమమ్ ॥
క్షీరార్ణవాలయే శుభ్రే విమానే సూర్యసన్నిభే।
హేమరత్నాన్వితే దివ్యే మనసా తేన నిర్మితే ॥
అనంతభోగశయ్యాయాం శయానం పంకజేక్షణమ్ ।
చతుర్భుజముదారాంగం సర్వాభరణభూషితమ్ ॥
శంఖచక్రధరం సౌమ్యం చంద్రబింబసమాననమ్ ।
శ్రీవత్సవక్షసం దేవం ప్రసన్నమధురస్మితమ్ ॥
ధరామృదుకరాంభోజస్పర్శరక్తపదాంబుజమ్ ।
క్షీరార్ణవామృతమివ శయానం యోగనిద్రయా ॥
తమసా కాలరుద్రాఖ్యం రజసా కనకాండజమ్ ।
సత్త్వేన సర్వగం విష్ణుం నిర్గుణత్వే మహేశ్వరమ్ ॥
తం దృష్ట్వా పురుషం బ్రహ్మా ప్రగల్భమిదమబ్రవీత్ ।
గ్రసామి త్వామహం విష్ణో త్వమాత్మానం యథా పురా ॥

ఓ శంకరా! పూర్వము వాని భక్తి వలన ఎటువంటి అనుగ్రహమును చూపియున్నావో, అదే విధమగు అనుగ్రహమును నాయందు కూడ చూపి, నాకు కూడ సర్వమును ఈయదగును (33). భగుని నేత్రములను పెరికిన దయానిధి యగు ఆ శంకరభగవానుడు ఈ విధముగా ఆయనచే విజ్ఞాపన చేయబడినవాడై, న్యాయముననుసరించి ఆయనకు కూడ సర్వమును ఇచ్చెను (34). బ్రహ్మ ఈ విధముగా ఈశ్వరునినుండియే సర్వాత్మభావమును పొంది, వేగముగా పయనించి క్షణకాలములో పురుషోత్తముడగు విష్ణువును చూచెను (35). పాలసముద్రము అనే నివాసములో స్వచ్ఛమైనది, సూర్యుని వలె ప్రకాశించునది, బంగారముతో మరియు రత్నములతో కూడియున్నది, దివ్యమైనది, ఆ విష్ణువుచే సంకల్పశక్తిచే నిర్మించబడినది అగు విమానములో (36) అంతములేని భోగహేతువు అగు శయ్యపై నిద్రించుచున్నవాడు, పద్మములను పోలిన కన్నులు గలవాడు, నాలుగు చేతులు గలవాడు, పుష్టియైన అవయవములు గలవాడు, సమస్తములగు ఆభరణములతో అలంకరింపబడినవాడు (37), శంఖచక్రములను ధరించి యున్నవాడు, ప్రసన్నమగు చంద్రబింబమును పోలిన మోము గలవాడు, శ్రీవత్సము అనే చిహ్నముతో కూడిన వక్షఃస్థలము గలవాడు, ప్రకాశస్వరూపుడు, ప్రసన్నము మరియు మధురము అగు చిరునవ్వు గలవాడు. (38), భూదేవియొక్క సుస్నిగ్ధమైన పద్మములవంటి చేతుల స్పర్శచే ఎర్రనైన పద్మములవంటి పాదములు గలవాడు, అమృతమువంటి పాలయొక్క సముద్రములో యోగనిద్రయందు విశ్రమించుచున్నవాడు (39), తమోగుణముచే కాలరుద్రుడు అనే పేరును

పొందినవాడు, రజోగుణముచే హిరణ్యగర్భుడు అనబడువాడు, సత్త్వగుణముచే సర్వవ్యాపి, నిర్గుణస్థితిలో మహేశ్వరుడు, చైతన్యఘనుడు అగు ఆ విష్ణువును చూచి, బ్రహ్మ ప్రగల్భముగా నిట్లనెను. ఓ విష్ణూ! పూర్వము నీవు నాకు చేసిన విధముగనే, నిన్ను ఖ్రింగి వేసెదను.

**తస్య తద్వచనం శ్రుత్వా ప్రతిబుధ్య పితామహమ్ ।**
**ఉదైక్షత మహాబాహుస్స్మితమీషచ్చకార హ ॥**
**తస్మిన్నవసరే విష్ణుర్గ్ర స్తస్తేన మహాత్మనా ।**
**సృష్టశ్చ బ్రహ్మణా సద్యో భువోర్మధ్యాదయత్నతః ॥**
**తస్మిన్నవసరే సాక్షాద్భగవానిందుభూషణః ।**
**శక్తిం తయోరపి ద్రష్టుమరూపో రూపమాస్థితః ॥**
**ప్రసాదమతులం కర్తుం పురా దత్తవరస్తయోః ।**
**ఆగచ్ఛత్తత్ర యత్రేమౌ బ్రహ్మనారాయణౌ స్థితా ॥**
**అథ తుష్టువతుర్దేవం ప్రీతౌ భీతౌ చ కౌతుకాత్ ।**
**ప్రణేమతుశ్చ బహుశో బహుమానేన దూరతః ॥**
**భవోఽ పి భగవానేతావనుగృహ్య పినాకధృక్ ।**
**సాదరం పశ్యతోరేవ తయోరంతరధీయత ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే బ్రహ్మవిష్ణు సృష్టికథనం నామ త్రయోదశోఽధ్యాయః ॥**

ఆ పితామహుని ఆ మాటను విని గొప్ప బాహువులు గల విష్ణువు నిద్ర లేచి బ్ర్రహ్మను చూచి చిరునవ్వు నవ్వెను (42). ఆ సమయములో మహాత్ముడగు బ్రహ్మ విష్ణువును ఖ్రింగి ప్రయత్నము లేకుండగనే కనుబొమ్మల మధ్యనుండి వెంటనే మరల సృష్టించెను (43). అదే సమయములో రూపరహితుడు, పూర్వము వారిద్దరికి వరములనిచ్చినవాడు అగు భగవాన్ చంద్రశేఖరుడు వారిద్దరి శక్తిని చూచి సాటిలేని అనుగ్రహమును చేయుట కొరకై స్వయముగా రూపమును దాల్చి, బ్రహ్మవిష్ణువులు ఇద్దరు ఉన్న అచ్చోటికి విచ్చేసెను ( 44,45). తరువాత వారిద్దరు సంతోషించి, భయపడి ఆ దేవుని స్తుతించి, ఉత్కంఠతో మరియు ఆదరముతో దూరముగా నిలబడి పలుమార్లు నమస్కరించిరి (46), పినాకమనే ధనస్సును ధరించే శివభగవానుడు కూడ వారినిద్దరిని అనుగ్రహించి, వారిద్దరు సాదరముగా చూచుచుండగనే అంతర్ధానము చెందెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో బ్రహ్మవిష్ణువులు సృష్టిని చేయుటను వర్ణించే పదమూడవ అధ్యాయము ముగిసినది.

# 14 – రుద్రుల ఆవిర్భావము

వాయురువాచః

ప్రతికల్పం ప్రవక్ష్యామి రుద్రావిర్భావకారణమ్ ।
యతో విచ్ఛిన్నసంతానా బ్రహ్మసృష్టిః ప్రవర్తతే ॥
కల్పే కల్పే ప్రజాస్సృష్ట్వా బ్రహ్మా బ్రహ్మాండసంభవః ।
అవృద్ధిహేతోర్భూతానాం ముమోహ భృశదుఃఖితః ॥
తస్య దుఃఖప్రశాంత్యర్థం ప్రజానాం చ వివృద్ధయే ।
తత్తత్కల్పేషు కాలాత్మా రుద్రో రుద్రగణాధిపః ॥
నిర్దిష్టః పరమేశేన మహేశో నీలలోహితః ।
పుత్రో భూత్వా ఽ నుగృహ్ణాతి బ్రహ్మాణం బ్రహ్మణోఽనుజః ॥
స ఏవ భగవానీశస్తేజోరాశిరనామయః ।
అనాదినిధనో ధాతా భూతసంకోచకో విభుః ॥
పరమైశ్వర్యసంయుక్తః పరమేశ్వరభావితః ।
తచ్ఛక్త్యధిష్ఠితశ్చశ్వత్తచ్చిహ్నైరపి చిహ్నితః ॥
తన్నామనామా తద్రూపస్తత్కార్యకరణక్షమః ।
తత్తుల్యవ్యవహారశ్చ తదాజ్ఞాపరిపాలకః ॥
సహస్రాదిత్యసంకాశశ్చంద్రావయవభూషణః ।
భుజంగహారకేయూరవలయో ముంజమేఖలః ॥
జలంధరవిరించేంద్రకపాలశకలోజ్జ్వలః ।
గంగాతుంగతరంగాద్రిపింగళాననమూర్ధజః ॥
భగ్నదంష్ట్రాంకురాక్రాంత ప్రాంతకాంతిధరాధరః ।
సవ్య శ్రవణపార్శ్వాంతమండలీకృతకుండలః ॥
మహావృషభనిర్యాణో మహాజలదనిస్స్వనః ।
మహానలసమప్రఖ్యో మహాబలపరాక్రమః ॥
ఏవం ఘోరమహారూపో బ్రహ్మపుత్రో మహేశ్వరః ।
విజ్ఞానం బ్రహ్మణే దత్త్వా సర్గే సహకరోతి చ ॥

వాయువు ఇట్లు పలికెను –

ప్రతికల్పమునందు రుద్రుడు ఆవిర్భవించుటకు గల కారణములను గురించి చెప్పెదను. విచ్ఛిన్నమైన సంతానము గల బ్రహ్మయొక్క సృష్టి ముందుకు సాగుట కొరకై రుద్రుడు ఆవిర్భవించును (1). ప్రతి కల్పమునందు బ్రహ్మాండమునుండి పుట్టిన బ్రహ్మ ప్రజలను సృష్టించి, ప్రాణులు వృద్ధిని చెందక పోవుటచే మోహమును మరియు అధికమగు దుఃఖమును పొందెను (2). ప్రజలు వృద్ధి యగునట్లు చేసి ఆయన దుఃఖమును చల్లార్చుట కొరకై ఆయా కల్పములయందు కాలస్వరూపుడు, భయంకరమగు గణములకు అధిపతి, కంఠమునందు నీలవర్ణము మరియు ఇతరదేహమునందు ఎర్రని వర్ణము

గలవాడు, బ్రహ్మకు సోదరుడు అగు రుద్రుడు పరమేశ్వరుడగు మహేశ్వరునిచే ఆజ్ఞాపించబడినవాడై బ్రహ్మకు పుత్రుడై బ్రహ్మను అనుగ్రహించును (3,4). తేజస్సుయొక్క ముద్ద, దోషములు లేనివాడు, ఆది మరియు అంతము లేనివాడు, సృష్టికర్త, భూతములను ఉపసంహరించువాడు, సర్వవ్యాపి అగు ఆ శివభగవానుడే (5) సర్వశ్రేష్ఠమగు ఈశ్వరభావము గలవాడై, పరమేశ్వరునిచే అనుగ్రహించ బడినవాడై, ఆ పరమేశ్వరుని శక్తిచే అధిష్ఠించబడినవాడై, ఆ పరమేశ్వరుని చిహ్నములను కూడ శాశ్వతముగా ధరించి (6), ఆయా నామములను మరియు రూపములను దాల్చి, ఆయా కార్యములను చేయుటయందు సమర్థుడగుచున్నాడు. పరమేశ్వరుని ఆజ్ఞను పాలించు రుద్రుడు పరమేశ్వరునితో సమానమగు వ్యవహారము గలవాడు (7). లెక్కలేనన్ని సూర్యులను బోలియున్న వాడు, చంద్రవంకయే అలంకారముగా గలవాడు, పాములనే హారములుగా భుజకీర్తులుగా మరియు హస్తాభరణములుగా ధరించువాడు, ముంజగడ్డియొక్క మేఖలను ధరించినవాడు (8), జలంధరుడు బ్రహ్మ మరియు ఇంద్రుడు అను వారి కపాలముల ముక్కలతో గొప్పగా ప్రకాశించువాడు, గంగయొక్క ఎత్తైన కొండకొమ్ములవంటి తరంగములచే తడిసి బూడిద రంగును కలిగియున్న శిరోజములు మీసములు గెడ్డము గలవాడు (9), విరిగిన కోరల ముక్కలచే సమీపమునందు ఆక్రమింపబడి ప్రకాశించే క్రింది పెదవి గలవాడు, ఎడమచెవికి సమీపములో చెక్కిలి మధ్యలో కాంతిమండలమును సృష్టించుచున్న కుండలము గలవాడు (10), పెద్ద ఎద్దుపై పయనించువాడు, మేఘగర్జనవలె గంభీరమైన వాక్కు గలవాడు, ప్రళయకాలాగ్నివలె ప్రకాశించువాడు, గొప్ప బలపరాక్రమములు గలవాడు (11), భయంకరమగు పెద్ద ఆకారము గలవాడు, బ్రహ్మయొక్క పుత్రుడు అగు మహేశ్వరుడు ఈ విధముగా బ్రహ్మకు విజ్ఞానమునిచ్చి సృష్టియందు సహకరించుచున్నాడు.

**తస్మాద్రుద్రప్రసాదేన ప్రతికల్పం ప్రజాపతేః ।**
**ప్రవాహరూపతో నిత్యా ప్రజాసృష్టిః ప్రవర్తతే ॥**
**కదాచిత్ప్రార్థితస్సృష్టం బ్రహ్మణా నీలలోహితః ।**
**స్వాత్మనా సదృశాన్ సర్వాన్ ససర్జ మనసా విభుః ॥**
**కపర్దినో నిరాతంకాన్నీలగ్రీవాంస్త్రిలోచనాన్ ।**
**జరామరణనిర్ముక్తాన్ దీప్తశూలవరాయుధాన్ ॥**
**తైస్తు సంఛాదితం సర్వం చతుర్దశవిధం జగత్ ।**
**తాన్ దృష్ట్వా వివిధాన్ రుద్రాన్ రుద్రమాహ పితామహః ॥**
**నమస్తే దేవదేవేశ మా స్రాక్షీరీదృశీః ప్రజాః ।**
**అన్యాస్సృజ త్వం భద్రం తే ప్రజా మృత్యుసమన్వితాః ॥**
**ఇత్యుక్తః ప్రహసన్నాహ బ్రహ్మాణం పరమేశ్వరః ।**
**నాస్తి మే తాదృశస్సర్గస్సృజ త్వమశుభాః ప్రజాః ॥**

యే త్విమే మనసా సృష్టా మహాత్మానో మహాబలాః ।
చరిష్యంతి మయా సార్ధం సర్వ ఏవ హి యాజ్ఞికాః ॥
ఇత్యుక్త్వా విశ్వకర్మాణం విశ్వభూతేశ్వరో హరః ।
సహ రుద్రై ప్రజాసర్గాన్నివృత్తాత్మాఽభ్యతిష్ఠత ॥
తతః ప్రభృతి దేవోఽ సౌ న ప్రసూతే ప్రజాశ్శుభాః ।
ఊర్ధ్వరేతాః స్థితః స్థాణుర్యావదాభూతసంప్లవమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే రుద్రావిర్భావ
వర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥

కావున, ప్రతికల్పమునందు ప్రజాపతియొక్క ప్రవాహరూపములో నిత్యమగు ప్రజాసృష్టి రుద్రుని అనుగ్రహముచే కొనసాగుతున్నది (13). ఒకనాడు బ్రహ్మ సృష్టిని చేయుమని ప్రార్థించగా నీలలోహితుడు, సర్వవ్యాపి అగు రుద్రుడు సంకల్పముచే తనను పోలియున్న అసంఖ్యా కులగు రుద్రులను సృష్టించెను (14). జటాజూటధారులు, భయము లేనివారు, నల్లని కంఠము గలవారు, మూడు కన్నులు గలవారు, వృద్ధాప్యము మరియు మరణము లేనివారు అగు ఆ రుద్రులు ప్రకాశించే శూలమును మరియు శ్రేష్ఠమగు ఆయుధములను కలిగియుండిరి (15). పదునాల్గు భువనములతో కూడియున్న జగత్తు అంతయు వారిచే నిండిపోయెను. బ్రహ్మ ఆ అసంఖ్యాకులగు రుద్రులను చూచి రుద్రునితో నిట్లనెను (16). ఓ దేవదేవా! ఈశ్వరా! నీకు నమస్కారము. ఇటువంటి ప్రజలను సృష్టించవద్దు. నీవు వీరికంటే భిన్నముగా మరణించే స్వభావము గల ప్రజలను సృష్టించుము. నీకు మంగళమగుగాక! (17) బ్రహ్మ ఇట్లు పలుకగా, పరమేశ్వరుడు నవ్వుతూ ఇట్లనెను. నా వద్ద అట్టి సృష్టి లేదు. మరణించే సంతానమును నీవే సృష్టించుము (18). నేను సంకల్పముచే సృష్టించిన ఈ మహాత్ములు, మహాబలశాలురు అగు రుద్రులు నాతో కలిసి సంచరించెదరు. వీరందరు యజ్ఞభాగములకు అర్హులు (19). సమస్తజగత్తులోని ప్రాణులకు ప్రభువగు రుద్రుడు బ్రహ్మతోనిట్లు పలికి, ప్రజాసృష్టినుండి విరమించబడిన మనస్సు గలవాడై రుద్రులతో కలిసి యుండెను (20). అప్పటినుండియు ఆ శివుడు మరణము లేని ప్రజలను సృష్టించుట లేదు. ఆయన ప్రళయకాలములో సర్వప్రాణులు విలీనమగు వరకు ఊర్ధ్వరేతస్కుడై స్థిరమగు యోగసమాధిలో నుండెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో రుద్రుల ఆవిర్భావమును వర్ణించే పదునాల్గవ అధ్యాయము ముగిసినది.

# 15 – బ్రహ్మ పార్వతీపరమేశ్వరులను స్తుతించుట

వాయురువాచః

యదా పునః ప్రజాస్సృష్టాన వ్యవర్ధంత వేధసః ।
తథా మైథునజాం సృష్టిం బ్రహ్మా కర్తుమమన్యత ॥
న నిర్గతం పురా యస్మాన్నారీణాం కులమీశ్వరాత్ ।
తేన మైథునజాం సృష్టిం న శశాక పితామహః ॥
తతస్స విదధే బుద్ధిమర్థనిశ్చయగామినీమ్ ।
ప్రజానామేవ వృద్ధ్యర్థం ప్రష్టవ్యః పరమేశ్వరః ॥
ప్రసాదేన వినా తస్య న వర్ధేరన్నిమాః ప్రజాః ।
ఏవం సంచింత్య విశ్వాత్మా తపః కర్తుం ప్రచక్రమే ॥
తదాద్యా పరమా శక్తిరనంతా లోకపావనీ ।
ఆద్యా సూక్ష్మతరా శుద్ధా భావగమ్యా మనోహరా ॥
నిర్గుణా నిష్ప్రపంచా చ నిష్కళా నిరుపప్లవా ।
నిరంతరతరా నిత్యా నిత్యమీశ్వరపార్శ్వగా ॥
తయా పరమయా శక్త్యా భగవంతం త్రియంబకమ్ ।
సంచింత్య హృదయే బ్రహ్మా తతాప పరమం తపః ॥
తీవ్రేణ తపసా తస్య యుక్తస్య పరమేష్ఠినః ।
అచిరేణైవ కాలేన పితా సంప్రతుతోష హ ॥
తతః కేనచిదంశేన మూర్తిమావిశ్య కామపి ।
అర్ధనారీశ్వరో భూత్వా యయౌ దేవస్స్వయం హరః ॥

వాయువు ఇట్లు పలికెను –

బ్రహ్మ సృష్టించిన ప్రజలలో మరల వృద్ధి లేకుండెను. అపుడు బ్రహ్మ స్త్రీ పురుషసంగమము వలన కలిగే సృష్టిని కూడ చేయవలెననీ తలపోసెను (1). పూర్వము ఈశ్వరునినుండి స్త్రీ సమూహము ఉద్భవించి యుండలేదు. కావున, స్త్రీ పురుషసంగమము వలన కలిగే సృష్టిని పితామహుడు చేయలేక పోయెను (2). అపుడాయన ఆలోచించి విషయమును నిర్ణయించే బుద్ధిని వినియోగించి ఇట్లు తలంచెను. ప్రజల అభివృద్ధి కొరకై పరమేశ్వరుని అడుగవలెను (3). ఆయన అనుగ్రహము లేనిదే ఈ ప్రజలు వర్ధిల్లరు. జగత్స్వరూపుడగు బ్రహ్మ ఇట్లు తలపోసి, తపస్సును చేయుటకా రంభించెను (4) ఆ పరమేశ్వరుడే కారణముగా గలది, సర్వోత్కృష్టము, అనంతము, లోకములను సంకల్పరూపముగా నిర్మించునది, సర్వకారణము, మిక్కిలి సూక్ష్మమైనది, సంసారదోషములు లేనిది, భక్తిచే పొందదగినది, సుందరమైనది, గుణములు లేనిది, ప్రపంచకారణత్వము వాస్తవముగా లేనిది, అవయవములు లేనిది, దుఃఖసంపర్కము లేనిది, ఏకరసము (ద్వితీయము లేనిది), అవినాశి అగు శక్తి నిత్యము ఈశ్వరుని ప్రక్కన ఉండును (5,6). బ్రహ్మ ఆ పరమశక్తితో కూడియున్న ముక్కంటి దేవుని హృదయములో

ధ్యానించి గొప్ప తపస్సును చేసెను (7). ఆ పరమేష్ఠి ఈ విధముగా తీవ్రమగు తపస్సును చేయుచుండగా, కొద్ది కాలములోననే తండ్రియగు ఈశ్వరుడు సంతోషించెను (8). అపుడు ఒకానొక అంశముచే ఒకానొక విలక్షణమగు రూపమును దాల్చి, శివదేవుడు అర్ధనారీశ్వరుడై స్వయముగా వెళ్లెను.

తం దృష్ట్వా పరమం దేవం తమసః పరమవ్యయమ్ ।
అద్వితీయమనిర్దేశ్యమదృశ్యమకృతాత్మభిః ॥
సర్వలోకవిధాతారం సర్వలోకమహేశ్వరమ్ ।
సర్వలోకవిధాయిన్యా శక్త్యా పరమయా యుతమ్ ॥
అప్రతర్క్యమనాభాసమమేయమజరం ధ్రువమ్ ।
అచలం నిర్గుణం శాంతమనంతమహిమాస్పదమ్ ॥
సర్వగం సర్వదం సర్వసదసద్వ్యక్తివర్జితమ్ ।
సర్వోపమాననిర్ముక్తం శరణ్యం శాశ్వతం శివమ్ ॥
ప్రణమ్య దండవద్బ్రహ్మా సముత్థాయ కృతాంజలిః ।
శ్రద్ధావినయసంపన్నైః శ్రావ్యైస్సంస్కారసంయుతైః ॥
యథార్థయుక్తసర్వార్థైర్వేదార్థపరిబృంహితైః ।
తుష్టావ దేవం దేవీం చ సూక్తైస్సూక్ష్మార్థగోచరైః ॥

సర్వోత్కృష్టుడు, ప్రకాశస్వరూపుడు, అజ్ఞానమునకు ఆవలనుండువాడు, వినాశము లేని వాడు, రెండవ వస్తువు లేనివాడు, ఇదమిత్థముగ నిర్దేశింప శక్యము కానివాడు, మనోనిగ్రహము లేనివారికి కంటికి కానరానివాడు, సర్వలోకములను సృష్టించువాడు, సర్వలోకములకు రాజాధిరాజు, సర్వలోకములను నిర్మించే సర్వకారణశక్తితో కూడియున్నవాడు, ఊహకు అందనివాడు, మిథ్యాజగత్తుతో సంపర్కము. లేనివాడు, ప్రమాణములకు అందనివాడు, వృద్ధాప్యము లేనివాడు, నిత్యుడు, చలనము లేనివాడు, గుణములు లేనివాడు, సర్వప్రపంచోపశమమునకు అధిష్ఠానమైనవాడు, అనంతమగు మహిమకు నిధానమైనవాడు, సర్వవ్యాపి, సర్వమును ఇచ్చువాడు, మూర్తామూర్తపదార్థములన్నింటికీ అతీతమైనవాడు, సర్వవిధముల ఉపమానములకు అతీతుడు, శరణు పొంద దగినవాడు, శాశ్వతుడు అగు ఆ శివుని చూచి (10-13), బ్రహ్మ సాష్టాంగప్రణామమునాచరించి, లేచి చేతులను జోడించి నిలబడి, శ్రద్ధ మరియు వినయముతో నిండియున్నవి, వినుటకు సొంపైనవి, సంస్కారముతో నిండియున్నవి (14), సర్వవిషయములను గురించి సత్యమును ప్రకటించునవి, వేదార్థమును వర్ధిల్లజేయునవి, సూక్ష్మమగు అర్థమును ప్రకాశింప జేయునవి అగు సూక్తములతో ఆ దేవుని మరియు దేవిని కూడ స్తుతించెను.

బ్రహ్మోవాచః

జయ దేవ మహాదేవ జయేశ్వర మహేశ్వర ।
జయ సర్వగుణశ్రేష్ఠ జయ సర్వసురాధిప ॥
జయ ప్రకృతి కల్యాణి జయ ప్రకృతినాయికే ।
జయ ప్రకృతిదూరే త్వం జయ ప్రకృతిసుందరి ॥

జయామోఘమహామాయ జయామోఘమనోరథ ।
జయామోఘమహాలీల జయామోఘమహాబల ॥
జయ విశ్వజగన్మాతర్జయ విశ్వజగన్మయే ।
జయ విశ్వజగద్ధాత్రి జయ విశ్వజగత్సఖి ॥
జయ శాశ్వతికైశ్వర్యే జయ శాశ్వతికాలయ ।
జయ శాశ్వతికాకార జయ శాశ్వతికానుగ ॥
జయాత్మత్రయనిర్మాత్రి జయాత్మత్రయపాలిని ।
జయాత్మ త్రయసంహర్త్రి జయాత్మత్రయనాయికే ॥
జయావలోకనాయత్త జగత్కారణబృంహణ ।
జయోపేక్షాకటాక్షోత్థహుతభుగ్భుక్తభౌతిక ॥
జయ దేవాద్యవిజ్ఞేయే స్వాత్మసూక్ష్మదృశోజ్జ్వలే ।
జయ స్థూలాత్మశక్త్యేశే జయ వ్యాప్తచరాచరే ॥
జయ నానైకవిన్యస్తవిశ్వతత్త్వసముచ్చయ ।
జయాసురశిరోనిష్ఠ శ్రేష్ఠానుగకదంబక ॥
జయోపాశ్రితసంరక్షాసంవిధానపటీయసి ।
జయోన్మూలితసంసారవిషవృక్షాంకురోద్గమే ॥
జయ ప్రాదేశికైశ్వర్యవీర్యశౌర్యవిజృంభణ ।
జయ విశ్వబహిర్భూత నిరస్తపరవైభవ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ దేవా! మహాదేవా! నీకు జయమగుగాక! ఓ ఈశ్వరా! మహేశ్వరా! నీకు జయమగుగాక! సకలగుణాభిరామా! నీకు జయమగుగాక! సకలదేవతాధిరాజా! నీకు జయమగుగాక! (16) స్వభావము చేతనే మంగళములను చేయు ఓ ప్రకృతినాయికా! నీకు జయమగుగాక! ప్రకృతికి అతీతమైన ఓ సహజసౌందర్యనిధానమా! నీకు జయమగుగాక! (17) అమోఘమైన మహామాయ గలవాడా ! నీకు జయమగుగాక! అమోఘమైన మనోరథములు గలవాడా! నీకు జయమగుగాక! అమోఘమైన గొప్ప లీలలు గలవాడా! నీకు జయమగుగాక! అమోఘమైన గొప్ప బలము గలవాడా! నీకు జయమగుగాక! (18) ఓ సకలజగన్మాతా! నీకు జయమగుగాక! సకలజగత్స్వరూపిణీ! నీకు జయమగుగాక! సకలజగత్తును పెంచి పోషించు తల్లీ! నీకు జయమగుగాక! సకలప్రాణుల హితమును గోరు ఓ తల్లీ! నీకు జయమగుగాక! (19) శాశ్వతైశ్వర్యము గల ఓ శివా! నీకు జయమగుగాక! ఓ మోక్షనిధానమా! నీకు జయమగుగాక! ఓ శాశ్వతమైన రూపము గలవాడా! నీకు జయమగుగాక! శాశ్వతులైన అనుచరులు గల ఓ శివా! నీకు జయమగుగాక! (20) మూడు ఆత్మలను నిర్మించుదానా! నీక జయమగుగాక! మూడు ఆత్మలను ( ఆత్మ, అంతరాత్మ, పరమాత్మ) పాలించుదానా! నీకు జయమగుగాక! మూడు ఆత్మలను సంహరించుదానా! నీకు జయమగుగాక! మూడు ఆత్మల నాయకీ! నీకు జయమగుగాక! (21) ఓ శివా! జగత్కారణమగు ప్రకృతి జగద్రూపముగా ప్రకటమగుట నీ కంటి చూపుపై ఆధారపడియున్నది. నీకు

జయమగుగాక! నీ నిరసనదృష్టినుండి పుట్టిన అగ్ని జగత్తును భక్షించును. నీకు జయమగుగాక! (22) దేవతలు మొదలగు వారిచే తెలియబడజాలని స్వరూపము గల ఓ తల్లీ! నీకు జయమగుగాక! సూక్ష్మదృష్టిచే దర్శించబడే ప్రత్యగాత్మయందు చైతన్యరూపముగా ప్రకాశించే ఓ తల్లీ! స్థూలరూపముగా ప్రకటమైన ఆత్మశక్తిని నియంత్రించుదానా! నీకు జయమగుగాక! చరాచరజగత్తును వ్యాపించియున్న ఓ తల్లీ! నీకు జయమగుగాక! (23) ఓ శివా! జగత్తులోని తత్త్వములన్నియు కలిసిపోయి నీయందు విలీనమగుచున్నవి. నీకు జయమగుగాక! ఓ తండ్రీ! సర్వశ్రేష్ఠమగు నీ అనుచరబృందము రాక్షసుల శిరస్సులపై నాట్యమాడుచున్నది. నీకు జయమగుగాక! (24) ఆశ్రయించిన వారిని రక్షించే ఉపాయములను చేయుటలో సమర్థురాలైన ఓ తల్లీ! నీకు జయమగుగాక! సంసారమనే విషపు చెట్టును వ్రేళ్లతో సహా పెకలించి వేసే ఓ తల్లీ! నీకు జయమగుగాక! (25) హృదయాకాశము అనే స్థానములో ఉపలభ్యమయ్యే ఓ శివా! నీవు ఐశ్వర్యముతో శక్తితో మరియు పరాక్రమముతో అతిశయించి ప్రకాశించుచున్నావు. నీకు జయమగుగాక! జగత్తుతో సంపర్కములేని ఓ శివా! శత్రువుల వైభవమును నాశనము చేసినవాడా! నీకు జయమగుగాక !

జయ ప్రణీతపంచార్థప్రయోగపరమామృత ।
జయ పంచార్థవిజ్ఞానసుధాస్తోత్రస్వరూపిణి ॥
జయాతిఘోరసంసారమహారోగభిషగ్వర ।
జయానాదిమలజ్ఞానతమఃపటలచంద్రికే ॥
జయ త్రిపురకాలాగ్నే జయత్రిపురభైరవి ।
జయ త్రిపురనిర్ముక్తే జయ త్రిగుణమర్దిని ॥
జయ ప్రథమసర్వజ్ఞ జయ సర్వప్రబోధికే ।
జయ ప్రచురదివ్యాంగ జయ ప్రార్థితదాయిని ॥
క్వ దేవ తే పరం ధామ క్వ చ తుచ్ఛం చ నో వచః ।
తథాపి భగవన్ భక్త్యా ప్రలపంతం క్షమస్వ మామ్ ॥
విజ్ఞాప్యైవంవిధైస్సూక్తైర్విశ్వకర్మా చతుర్ముఖః ।
నమశ్చకార రుద్రాయ రుద్రాణ్యై చ ముహుర్ముహుః ॥
ఇదం స్తోత్రవరం పుణ్యం బ్రహ్మణా సముదీరితమ్ ।
అర్ధనారీశ్వరం నామ శివయోర్హర్షవర్ధనమ్ ॥
య ఇదం కీర్తయేద్భక్త్యా యస్య కస్యాపి శిక్షయా ।
స తత్ఫలమవాప్నోతి శివయోః ప్రీతికారణాత్ ॥
సకలభువనభూతభావనాభ్యాం జననవినాశవిహీనవిగ్రహాభ్యామ్ ।
నరవరయువతీవపుర్ధరాభ్యాం సతతమహం ప్రణతోఽస్మి శంకరాభ్యామ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే బ్రహ్మకృత శివాశివస్తుతివర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥

అయిదు రకముల మోక్షము అనే పురుషార్థమును అందజేసి పరమానందరూపమగు అమృతత్వమును అందజేయువాడా! నీకు జయమగుగాక! పంచార్థవిజ్ఞానము అనే అమృతము వంటి స్తోత్రము స్వరూపముగా గల ఓ తల్లీ! నీకు జయమగుగాక! (27) మిక్కిలి భయంకరమగు సంసారమనే మహారోగమును కుదిర్చే శ్రేష్ఠవైద్యా! నీకు జయమగుగాక! అనాదిదోషము అగు అజ్ఞానము అనే చీకటి గుంపులను చెల్లాచెదరు చేసే వెన్నెలవంటి ఓ తల్లీ! నీకు జయమగుగాక! (28) త్రిపురములకు ప్రళయకాలాగ్నివంటివాడా! నీకు జయమగుగాక! స్థూలసూక్ష్మకారణదేహములనే మూడు రకముల బంధమును నశింపజేయు ఓ భైరవీ! నీకు జయమగుగాక! త్రిగుణములకు అతీతురాలైన ఓ తల్లీ! నీకు జయమగుగాక! త్రిగుణాత్మకమగు సంసారమును నశింపజేయు ఓ తల్లీ! నీకు జయమగుగాక! (29) ప్రథమజీవుడు మరియు సర్వజ్ఞుడు అగు హిరణ్యగర్భుని రూపములో నున్నవాడా! నీకు జయమగుగాక! సర్వులకు జ్ఞానమునిచ్చు ఓ తల్లీ! నీకు జయమగుగాక! కోరిన కోరికలను తీర్చే తల్లీ! నీకు జయమగుగాక! (30) ఓ దేవా! నీ సర్వ శ్రేష్ఠమగు ధామము ఎక్కడ? తుచ్ఛములగు మా వాక్కులు ఎక్కడ? ఓ భగవాన్! అయిననూ, భక్తితో ప్రేలాపనను చేసే నన్ను క్షమించుము (31). జగత్తును సృష్టించిన నాల్గుమోముల బ్రహ్మ ఈ విధమగు సూక్తములచే విన్నవించి, శివపార్వతులకు పలుమార్లు ప్రణమిల్లెను (32). బ్రహ్మ చేసిన ఈ దివ్యమగు స్తోత్రరాజమునకు అర్ధనారీశ్వరము అని పేరు. ఇది పార్వతీపరమేశ్వరులకు ఆనందమును వర్ధిల్లజేయును (33). ఎవడైతే దీనిని భక్తితో కీర్తించునో, లేదా ఎవరికైననూ నేర్పునో వానికి పార్వతీపరమేశ్వరులకు ప్రీతిని కలిగించిన కారణముగా ఆ ఫలము లభించును (34). సకలభువనములలోని ప్రాణుల హృదయములో చైతన్యరూపముగా విలసిల్లువారు, చావు పుట్టుకలు లేని దేహములు గలవారు, యువతీయువకుల దేహములను దాల్చియున్నవారు అగు పార్వతీపరమేశ్వరులను నేను సర్వకాలములలో నమస్కరించుచున్నాను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో బ్రహ్మకృత శివాశివ స్తుతిని వర్ణించే పదనైదవ అధ్యాయము ముగిసినది.

# 16 - దేవీ శక్తి ఉద్భవించుట

**వాయురువాచ।**

**అథ దేవో మహాదేవో మహాజలదనాదయా ।**
**వాచా మధురగంభీరవిశదశ్లక్ ష్ణవర్ణయా ॥**
**అర్థసంపన్నపదయా రాజలక్షణయుక్తయా ।**
**అశేషవిషయారంభరక్షావిమలదక్షయా ॥**
**మనోహరతరోదారమధురస్మితపూర్వయా ।**
**సంబభాషే సుసంప్రీతో విశ్వకర్మాణమీశ్వరః ॥**

వాయువు ఇట్లు పలికెను -

అప్పుడు ప్రకాశస్వరూపుడు, దేవాధిదేవుడు, మిక్కిలి ప్రీతిని పొంది◌ినవాడు అగు ఈశ్వరుడు గొప్ప మేఘగర్జనను పోలియున్నది, మధురము గంభీరము సుస్పష్టము మరియు సున్నితము అగు వర్ణములు గలది, అర్థముతో నిండియున్న పదములు గలది, రాజఠీవి గలది, సకలములైన విషయములను ఆరంభించి వాటిని స్వచ్ఛముగా పోషించుటలో సమర్థమైనది, మిక్కిలి మనోహరము ఉదారము మధురము అగు చిరునవ్వుతో మొదలగునది అగు వాక్కుతో సృష్టికర్తయగు బ్రహ్మను ఉద్దేశించి ఇట్లు పలికెను.

**ఈశ్వర ఉవాచ।**

**వత్స వత్స మహాభాగ మమ పుత్ర పితామహ ।**
**జ్ఞాతమేవ మయా సర్వం తవ వాక్యస్య గౌరవమ్ ॥**
**ప్రజానామేవ వృద్ధ్యర్థం తపస్తప్తం త్వయాఽధునా ।**
**తపసాఽనేన తుష్టోఽస్మి దదామి చ తవేప్సితమ్ ॥**
**ఇత్యుక్త్వా పరమోదారం స్వభావమధురం వచః ।**
**ససర్జ వపుషో భాగాద్దేవీం దేవవరో హరః ॥**
**యామాహుర్బ్రహ్మవిద్వాంసో దేవీం దివ్యగుణాన్వితామ్ ।**
**పరస్య పరమాం శక్తిం భవస్య పరమాత్మనః ॥**
**యస్యాం న ఖలు విద్యంతే జన్మమృత్యుజరాదయః ।**
**యా భవానీ భవస్యాంగాత్సమావిరభవత్కిల ॥**
**యస్యా వాచో నివర్తంతే మనసా చేంద్రియైస్సహ ।**
**సా భర్తుర్వపుషో భాగాజ్జాతేవ సమదృశ్యత ॥**
**యా సా జగదిదం కృత్స్నం మహిమ్నా వ్యాప్య తిష్ఠతి ।**
**శరీరిణీవ సా దేవీ విచిత్రం సమలక్ష్యత ॥**
**సర్వం జగదిదం చైషా సంమోహయతి మాయయా ।**
**ఈశ్వరాత్సైవ జాతాఽభూదజాతా పరమార్థతః ॥**

న యస్యాః పరమో భావస్సురాణామపి గోచరః ।
విశ్వాఽమరేశ్వరీ చైవ విభక్తా భర్తురంగతః ॥
తాం దృష్ట్వా పరమేశానీం సర్వలోకమహేశ్వరీమ్ ।
సర్వజ్ఞాం సర్వగాం సూక్ష్మాం సదసద్వ్యక్తివర్జితామ్ ॥
పరమాం నిఖిలం భాసా భాసయంతీమిదం జగత్ ।
ప్రణిపత్య మహాదేవీం ప్రార్థయామాస వై విరాట్ ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓ కుమారా! కుమారా! మహాత్మా! నీవు నా పుత్రుడవు. ఓ పితామహా! నీ వాక్యములోని గాంభీర్యము అంతయు నాకు ఎరుకయే (4), నీవు ఇప్పుడు ప్రజల వృద్ధి కొరకు మాత్రమే తపస్సును చేసితివి. నీ తపస్సుచే నేను ప్రసన్నుడనైతిని. నీ కోరికను తీర్చెదను (5). ఈ విధముగా మిక్కిలి ఉదారమైనది, స్వభావము చేతనే మధురమైనది అగు వచనమును పలికి, దేవదేవుడగు శివుడు తన శరీరభాగమునుండి దేవిని సృష్టించెను (6). సర్వేశ్వరుడగు శివపరమాత్మయొక్క ఆ దివ్యగుణములతో కూడియున్న సర్వోత్కృష్టశక్తిని బ్రహ్మవేత్తలు దేవి అని వర్ణించుచున్నారు (7). ఆమెయందు పుట్టుక, మరణము, వృద్ధాప్యము మొదలగునవి లేవు. ఆమె భవుని శరీరమునుండి ఆవిర్భవించుటచే భవాని యనబడును (8). వాక్కులు, మనస్సు మరియు ఇంద్రియములు ఆమె యొక్క స్వరూపమును తెలియజాలక వెనుకకు మరలి వచ్చుచున్నవి. ఆమె భర్తయొక్క దేహభాగమునుండి పుట్టినదా యన్నట్లు కానవచ్చెను (9), ఆమె తన మహిమచే ఈ జగత్తునంతనూ వ్యాపించి యున్నది. ఆ దేవి శరీరము కలది వలె కానవచ్చుట విచిత్రము (10). ఆమె ఈ జగత్తునంతనూ మాయచే సమ్మోహ పరచుచున్నది. ఆమె ఈశ్వరునినుండి పుట్టిననూ, వాస్తవములో పుట్టనే లేదు (11). ఆమె యొక్క సర్వోత్కృష్టస్వరూపము దేవతలకైననూ తెలియదు. జగత్తునకు, దేవతలకు ప్రభ్వియగు ఆమె భర్తయొక్క దేహమునుండి విడివడినది (12). సర్వలోకములకు అధిరాజ్ఞి, సర్వజ్ఞురాలు, సర్వవ్యాపిని, సూక్ష్మమగు స్వరూపము గలది, కారణ కార్యభావమునకు అతీతురాలు, సర్వోత్కృష్టురాలు, ఈ జగత్తునంతనూ తన కాంతిచే ప్రకాశింప జేయుచున్నది, మహాదేవి అగు ఆ పరమేశ్వరిని చూచి, హిరణ్యగర్భుడు నమస్కరించి ప్రార్థించెను.

బ్రహ్మోవాచః

దేవి దేవేన సృష్టోఽహమాదౌ సర్వజగన్మయి ।
ప్రజాసర్గే నియుక్తశ్చ సృజామి సకలం జగత్ ॥
మనసా నిర్మితాస్సర్వే దేవి దేవాదయో మయా ।
న వృద్ధిముపగచ్ఛంతి సృజ్యమానాః పునః పునః ॥
మిథున ప్రభవామేవ కృత్వా సృష్టిమతః పరమ్ ।
సంవర్ధయితుమిచ్ఛామి సర్వా ఏవ మమ ప్రజాః ॥
న నిర్గతం పురా త్వత్తో నారీణాం కులమవ్యయమ్ ।
తేన నారీకులం స్రష్టుం శక్తిర్మమ న విద్యతే ॥
సర్వాసామేవ శక్తీనాం త్వత్తః ఖలు సముద్భవః ।
తస్మాత్సర్వత్ర సర్వేషాం సర్వశక్తిప్రదాయినీమ్ ॥
త్వామేవ వరదాం మాయాం ప్రార్థయామి సురేశ్వరీమ్ ।
చరాచరవివృద్ధ్యర్థమంశేనైకేన సర్వగే ॥
దక్షస్య మమ పుత్రస్య పుత్రీ భవ భవార్దిని ।
ఏవం సా యాచితా దేవీ బ్రహ్మణా బ్రహ్మయోనినా ॥
శక్తిమేకాం భ్రువోర్మధ్యాత్ససర్జాత్మసమప్రభామ్ ।
తామహ ప్రహసన్ ప్రేక్ష్య దేవదేవవరో హరః ॥
బ్రహ్మాణం తపసారాధ్య కురు తస్య యథేప్సితమ్ ।
తామాజ్ఞాం పరమేశస్య శిరసా ప్రతిగృహ్య సా ॥
బ్రహ్మణో వచనాద్దేవీ దక్షస్య దుహితాఽ భవత్ ।
దత్త్వైవమతులాం శక్తిం బ్రహ్మణే బ్రహ్మరూపిణీమ్ ॥
వివేశ దేహం దేవస్య దేవశ్చాంతరధీయత ।
తదా ప్రభృతి లోకే ఽ స్మిన్ స్త్రియాం భోగః ప్రతిష్ఠితః ॥
ప్రజాసృష్టిశ్చ విప్రేంద్రా మైథునేన్న ప్రవర్తతే ।
బ్రహ్మాపి ప్రాప సానందం సంతోషం మునిపుంగవాః ॥
ఏతద్వస్సర్వమాఖ్యాతం దేవ్యాశ్శక్తిసముద్భవమ్ ।
పుణ్యవృద్ధికరం శ్రావ్యం భూతసర్గానుషంగతః ॥
య ఇదం కీర్తయేన్నిత్యం దేవ్యాశ్శక్తిసముద్భవమ్ ।
పుణ్యం సర్వమవాప్నోతి పుత్రాంశ్చ లభతే శుభాన్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే దేవీశక్త్యుద్భవో నామ షోడశోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ దేవీ! సర్వజగత్స్వరూపిణీ! సృష్ట్యాదియందు శివుడు నన్ను సృష్టించి, ప్రజలను సృష్టించే కార్యమునందు నియోగించినాడు. నేను సకలజగత్తును సృష్టించుచున్నాను (15). ఓ దేవీ! నేను దేవతలు మొదలగు వారిని మనస్సుచే సృష్టించినాను. నేను వారిని మరల మరల సృష్టించుచున్ననూ, వారు వృద్ధి చెందుట లేదు (16). ఈ పైన నేను స్త్రీ పురుషసంయోగజన్యమగు సృష్టిని మాత్రమే చేసి నా సంతానమునందరినీ చక్కగా అభివృద్ధి చేయవలెనని కాంక్షించుచున్నాను (17). పూర్వము నీనుండి స్త్రీ సమూహము ఉదయించలేదు. కావున, స్త్రీ సమూహమును సృష్టించే శక్తి నాకు లేదు (18). శక్తులన్నియూ ఉద్భవించేది నీనుండియే గదా! కావున, సర్వకాలములలో సర్వులకు శక్తిని మరియు వరములను ఇచ్చే దేవేశ్వరివి మరియు మాయాస్వరూపిణివి అగు నిన్ను మాత్రమే నేను ప్రార్థించుచున్నాను. ఓ సర్వవ్యాపినీ! సంసారనాశినీ! నీవు స్థావరజంగమాత్మకమగు సృష్టి వృద్ధిని పొందుట కొరకై ఒక అంశచే నా పుత్రుడగు దక్షునకు కుమార్తెవు కమ్ము, పరబ్రహ్మనుండి పుట్టిన బ్రహ్మ ఈ విధముగా ప్రార్థించగా, ఆ దేవి తన కనుబొమల మధ్యనుండి తనతో సమానమగు కాంతి గల ఒక శక్తిని సృష్టించెను. దేవదేవోత్తముడగు శివుడు ఆమెను చూచి నవ్వి ఆమెతో నిట్లనెను (19-22). నీవు తపస్సుచే బ్రహ్మను ఆరాధించి, ఆతని కోరికను మన్నించుము. పరమేశ్వరుని ఆ ఆజ్ఞను ఆమె తలదాల్చి (23), బ్రహ్మ కోరిన విధముగా దక్షుని కుమార్తె ఆయెను. మరియు, ఆమె వేదము రూపములోనున్న సాటిలేని శక్తిని బ్రహ్మకు ఇచ్చి (24), శివుని దేహమును ప్రవేశించెను. శివుడు కూడ అంతర్ధానమాయెను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఆ నాటినుండియు ఈ లోకములో స్త్రీ ల భోగము స్థిరపడి, స్త్రీ పురుషసంయోగముచే సంతానము కలుగుచుండెను. ఓ మహర్షులారా! బ్రహ్మ కూడ సంతోషమును, ఆనందమును పొందెను (25, 26). ఈ విధముగా దేవినుండి శక్తి పుట్టిన తీరు అంతయు మీకు చెప్పబడినది. పుణ్యమును వర్ధిల్లజేయు ఈ వృత్తాంతమును సృష్టిప్రకరణముతో బాటు వినవలెను (27). దేవినుండి శక్తి పుట్టిన ఈ వృత్తాంతమును ఎవడైతే నిత్యము కీర్తించునో, ఆతడు సకలపుణ్యమును, పుత్రులను మరియు శుభములను పొందును.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో దేవీశక్తి ఉద్భవించుటను వర్ణించే పదనారవ అధ్యాయము ముగిసినది.

# 17 - సృష్టి వర్ణనము

వాయురువాచః

ఏవం లబ్ధ్వా పరాం శక్తిమీశ్వరాదేవ శాశ్వతీమ్ ।
మైథునప్రభవాం సృష్టిం కర్తుకామః ప్రజాపతిః ॥
స్వయమప్యద్భుతో నారీ చార్ధేన పురుషోఽభవత్ ।
యార్ధేన నారీ సా తస్మాచ్ఛతరూపా వ్యజాయత ॥
విరాజమసృజద్బ్రహ్మా సోఽర్ధేన పురుషోఽభవత్ ।
స వై స్వాయంభువః పూర్వం పురుషో మనురుచ్యతే ॥
సా దేవీ శతరూపా తు తపః కృత్వా సుదుశ్చరమ్ ।
భర్తారం దీప్తయశసం మనుమేవాన్వపద్యత ॥
తస్మాత్తు శతరూపా సా పుత్రద్వయమసూయత ।
ప్రియవ్రతోత్తానపాదౌ పుత్రౌ పుత్రవతాం వరౌ ॥
కన్యే ద్వే చ మహాభాగే యాభ్యాం జాతాస్త్విమాః ప్రజాః ।
ఆకూతిరేకా విజ్ఞేయా ప్రసూతిరపరా స్మృతా ॥
స్వాయంభువః ప్రసూతిం చ దదౌ దక్షాయ తాం ప్రభుః ।
రుచేః ప్రజాపతిశ్చైవ చాకూతిం సమపాదయత్ ॥
ఆకూత్యాం మిథునం జజ్ఞే మానసస్య రుచేశ్శుభమ్ ।
యజ్ఞశ్చ దక్షిణా చైవ యాభ్యాం సంవర్తితం జగత్ ॥
స్వాయంభువసుతాయాం తు ప్రసూత్యాం లోకమాతరః ।
చతస్రో వింశతిః కన్యా దక్షస్త్వజనయత్ప్రభుః ॥

వాయువు ఇట్లు పలికెను -

ఈ విధముగా ఈశ్వరునినుండి సర్వశ్రేష్ఠము, శాశ్వతము అగు శక్తిని పొంది, ప్రజాపతి స్త్రీ పురుషసమాగమము వలన కలిగే సృష్టిని చేయగోరెను (1). అద్భుతశక్తి గల ఆయన తానే స్వయముగా సగము పురుషుడు, సగము స్త్రీ ఆయెను. ఏ అర్ధభాగముచే ఆయన స్త్రీ ఆయెనో, ఆ భాగమునుండి శతరూప ఉద్భవించెను (2). ఆయన అర్ధభాగముచే పురుషుడై విరాట్ ను సృష్టించెను. సృష్ట్యాది యందలి ఆ పురుషుడే స్వాయంభువమనువు అని పిలువబడినాడు (3). ఆ శతరూపాదేవి మిక్కిలి కఠినమగు తపస్సును చేసి, ఉజ్జ్వలమగు కీర్తి గల మనువునే భర్తగా పొందెను (4). ఆయనకు శతరూపయందు పుత్రులు గలవారిలో శ్రేష్ఠులగు ఇద్దరు కొడుకులు కలిగిరి. ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనునవి వారి పేర్లు (5). వారికి మహాసాధ్వులు అగు ఇద్దరు కన్యలు కూడ కలిగిరి. ఒకామె పేరు ఆకూతి. రెండవ ఆమె పేరు ప్రసూతి. ఈ ప్రజలు వారిద్దరి నుండియే పుట్టిరి (6). స్వాయంభువమను మహారాజు ప్రసూతిని దక్షునకిచ్చెను. ఆ ప్రజాపతి ఆకూతిని. రుచికి ఇచ్చి వివాహము చేసెను (7). బ్రహ్మమానసపుత్రుడగు రుచికి ఆకూతి యందు యజ్ఞము, దక్షిణ అనే శుభకరమగు ఇద్దరు సంతానము కలిగిరి, వారిద్దరి

వలననే ఈ జగచ్చక్రము తిరుగుచున్నది (8). దక్షప్రజాపతి స్వాయంభువుని కుమార్తెయగు ప్రసూతియందు లోకములకు తల్లులగు ఇరవై నల్గురు కన్యలను కనెను.

శ్రద్ధా లక్ష్మీర్ధృతిః పుష్టిస్తుష్టిర్మేధా క్రియా తథా ।
బుద్ధిర్లజ్జా వపుశ్శాంతిస్సిద్ధిః కీర్తిస్త్రయోదశీ ॥
పత్న్యర్థం ప్రతిజగ్రాహ ధర్మో దాక్షాయణీః ప్రభుః ।
తాభ్యశ్శిష్టా యవీయస్య ఏకాదశ సులోచనాః ॥
ఖ్యాతిస్సత్యర్థసంభూతిస్స్మృతిః ప్రీతిః క్షమా తథా ।
సన్నతిశ్చానసూయా చ ఊర్జా స్వాహా స్వధా తథా ॥
భృగుశ్శర్వో మరీచిశ్చ అంగిరాః పులహః క్రతుః ।
పులస్త్యోఽత్రిర్వసిష్ఠశ్చ పావకః పితరస్తథా ॥
ఖ్యాత్యాద్యా జగృహుః కన్యా మునయో మునిసత్తమాః ।
కామాద్యాస్తు యశోఽతా యే తే త్రయోదశ సూనవః ॥
ధర్మస్య జజ్ఞిరే తాసు శ్రద్ధాద్యాస్సుసుఖోత్తరాః ।
దుఃఖోత్తరాశ్చ హింసాయామధర్మస్య చ సంతతౌ ॥
నికృత్యాదయ ఉత్పన్నాః పుత్రాశ్చాధర్మలక్షణాః ।
నైషాం భార్యాశ్చ పుత్రా వా సర్వే త్వనియమాస్స్మృతాః ॥
స ఏష తామసస్సర్గో జజ్ఞే ధర్మనియామకః ।
యా సా దక్షస్య దుహితా రుద్రస్య దయితో సతీ ॥
భర్తృనిందాప్రసంగేన త్యక్త్వా దాక్షాయణీం తనుమ్ ।
దక్షం చ దక్షభార్యాం చ వినింద్య సహ బంధుభిః ॥
సా మేనాయామావిరభూత్పుత్రీ హిమవతో గిరేః ।
రుద్రస్తు తాం సతీం దృష్ట్వా రుద్రాంస్స్వాత్మసమప్రభాన్ ॥
యథాఽసృజదసంఖ్యాతాంస్తథా కథితమేవ చ ।
భృగోః ఖ్యాత్యాం సముత్పన్నా లక్ష్మీర్నారాయణప్రియా ॥
దేవౌ ధాతృవిధాతారౌ మన్వంతరవిధారిణౌ ।
తయోర్వై పుత్రపౌత్రాద్యాశ్శతశోఽథ సహస్రశః ॥
స్వాయంభువే ఽ తరే నీతాస్సర్వే తే భార్గవా మతాః ।
మరీచేరపి సంభూతిః పౌర్ణమాసమసూయత ॥

శ్రద్ధ, లక్ష్మి ధృతి, తుష్టి మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి అనే పదముగ్గురు (10) దక్షపుత్రికలను ధర్మప్రభుడు భార్యలనుగా స్వీకరించెను. వారి తరువాత వారి చెల్లెళ్లు పదకొండు మంది సుందరయువతులు మిగిలియుండిరి (11). ఖ్యాతి, సతి, అర్థసంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సన్నతి, అనసూయ, ఊర్జ, స్వాహా, స్వధా అనునవి వారి పేర్లు (12). ఓ మహర్షులారా! భృగువు, శివుడు మరియు మరీచి, అంగిరసుడు, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, అత్రి, వసిష్ఠుడు అనే

ఏడ్గురు ఋషులు; అగ్ని, పితృదేవతలు అను వారలు ఆ ఖ్యాతి మొదలగు కన్యలను క్రమముగా వివాహమాడిరి. కామునితో మొదలిడి, యశస్సు వరకు గల పదముగ్గురు పుత్రులను ధర్ముడు శ్రద్ధ మొదలగు వారియందు కనెను. వీరు ఒకరికంటె అధికమగు సుఖమును మరియొకరు ఇచ్చెదరు. అధర్మునకు హింసయందు నికృతి మొదలగు అధర్మస్వభావము గల సంతానము కలిగిరి. వీరు ఒకరిని మించి మరియొకరు దుఃఖమును కలిగించెదరు. ఏ విధమైన నియమములు లేని వీరికి అందరికి భార్యలు గాని, పిల్లలు గాని లేరు (13-16). ఈ విధముగా ధర్మమును నియంత్రించే ఈ తామసస్సృష్టి జరిగినది. దక్షుని పుత్రి, 'రుద్రుని భార్య యగు సతి (17) భర్త నిందింపబడిన సందర్భములో బంధువులతో కూడియున్న దక్షుని మరియు ఆయన భార్యను నిందించి, తన దేహమును విడిచిపెట్టి (18), పర్వతరాజగు హిమవంతునకు మేనయందు పుత్రికయై అవతరించెను. రుద్రుడు ఆ సతీదేవియొక్క అవస్థను చూచుట, తనతో సమానమగు కాంతి గల భయంకరాకారులను (19) లెక్క లేనంతమందినీ సృష్టించుట మొదలైన వృత్తాంతము పూర్వమే చెప్పబడినది. భృగువునకు ఖ్యాతియందు నారాయణునకు ప్రియురాలగు లక్ష్మీదేవి, మరియు ధాత విధాత అనే ఇద్దరు దేవతలు జన్మించిరి. మన్వంతరమును నిలబెట్టిన వీరిద్దరికి వందల వేల సంఖ్యలో కొడుకులు మరియు మనుమలు కలిగిరి (20, 21). స్వాయంభువమన్వంతరములో నివసించిన వారందరికి భార్గవులు (భృగువంశమునందు పుట్టినవారు) అని పేరు. మరీచికి సంభూతియందు పౌర్ణమాసుడు జన్మించెను.

కన్యాచతుష్టయే చైవ మహీయాంసస్తదన్వయాః ।
యేషాం వంశే సముత్పన్నో బహుపుత్రస్య కశ్యపః ॥
స్మృతిశ్చాంగిరసః పత్నీ జనయామాస వై సుతౌ ।
ఆగ్నీధ్రం శరభం చైవ తథా కన్యాచతుష్టయమ్ ॥
తదీయాః పుత్రపౌత్రాశ్చ యేఽతీతాస్తే సహస్రశః ।
ప్రీత్యం పులస్త్యభార్యాయాం దంతోగ్నిరభవత్సుతః ।
పూర్వజన్మని యో ఽ గస్త్యస్మృతస్స్వాయంభువేఽతరే ॥
తత్సంతతీయా బహవః పౌలస్త్యా ఇతి విశ్రుతాః ।
క్షమా తు సుషువే పుత్రాన్ పులహస్య ప్రజాపతేః ॥
కర్దమశ్చాసురిశ్చైవ సహిష్ణుశ్చేతి తే త్రయః ।
త్రేతాగ్నివర్చసస్సర్వే యేషాం వంశః ప్రతిష్ఠితః ॥
క్రతోః క్రతుసమాన్ భార్యా సన్నతిస్సుషువే సుతాన్ ।
నైషాం భార్యాశ్చ పుత్రాశ్చ సర్వే తే హ్యూర్ధ్వరేతసః ॥
షష్టిస్తాని సహస్రాణి వాలఖిల్యా ఇతి స్మృతాః ।
అనూరోరగ్రతో యాంతి పరివార్య దివాకరమ్ ॥
అత్రేర్భార్యాఽనసూయా చ పంచాత్రేయానసూయత ।
కన్యకాం చ శ్రుతిం నామ మాతా శంఖపదస్య చ ॥

సత్యనేత్రశ్చ హవ్యశ్చ ఆపోమూర్తిశ్శనైశ్చరః ।
సోమశ్చ పంచమస్త్వేతే పంచాత్రేయాః ప్రకీర్తితాః ॥
తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ హ్యాత్రేయాణాం మహాత్మనామ్ ।
స్వాయంభువేఽతరే ఽతీతాశ్శతశోఽ థ సహస్రశః ॥
ఊర్జాయాం తు వసిష్ఠస్య పుత్రా వై సప్త జజ్ఞిరే ।
జ్యాయసీ చ స్వసా తేషాం పుండరీకా సుమధ్యమా ॥

ఆయనకు నల్గురు కుమార్తెలు కూడ గలరు. ఆ వంశమువారు చాల గొప్పవారు. వారి వంశములోననే అనేకపుత్రులు గల కశ్యపుడు జన్మించెను (23). అంగిరసుని భార్యయగు స్మృతికి ఆగ్నీధ్రుడు, శరభుడు అనే ఇద్దరు కొడుకులు మరియు నల్గురు కుమార్తెలు కలిగిరి (24). వారి కొడుకులు, మనుమలు వేల సంఖ్యలో గలరు. వారు కాలగర్భములో కలిసి పోయిరి. పులస్త్యుని భార్యయగు ప్రీతికి దంతోగ్ని అనే కొడుకు కలిగెను. ఆయన పూర్వజన్మలో స్వాయంభువమన్వంతరములో అగస్త్యుడని చెప్పబడినది (2 5). ఆయనకు పౌలస్త్యులు అని ప్రఖ్యాతిని గాంచిన అనేకులు సంతానము గలరు. పులహప్రజాపతికి భార్యయగు క్షమయందు కర్దముడు, ఆసురి, సహిష్ణుడు అనే ముగ్గురు కొడుకులు కలిగిరి. వారందరు యజ్ఞాగ్నితో సమానమగు కాంతి గలవారు. వారి వంశము ప్రతిష్ఠను పొందినది (26, 27). క్రతువుయొక్క భార్యయగు సన్నతి యజ్ఞమువలె పవిత్రులైన కొడుకులను కనెను. వారందరు నైష్ఠికబ్రహ్మచారులగుటచే, వారికి భార్యలు గాని పిల్లలు గాని లేరు (28). వాలఖిల్యులని చెప్పబడే ఆ మహాత్ముల సంఖ్య అరవై వేలు. వారు సూర్యుని ప్రదక్షిణము చేసి అనూరునకు (సూర్యుని సారథి) ముందు నడచెదరు (29). అత్రియొక్క భార్యయగు అనసూయ అయిదుగురు ఆత్రేయులనే పుత్రులను, శ్రుతి అనే కన్యను కనెను. శ్రుతియొక్క పుత్రుడు శంఖపదుడు (30), సత్యనేత్రుడు, హవ్యుడు, ఆపోమూర్తి, శనైశ్చరుడు, సోముడు అను అయిదుగురు ఆత్రేయులనీ కీర్తింపబడుచున్నారు (31). మహాత్ములగు ఆ ఆత్రేయులకు స్వాయంభువమన్వంతరములో వందల వేల సంఖ్యలో కొడుకులు, మనుమలు కలిగిరి. వారు కాలగర్భములో కలిసిపోయిరి (32). వసిష్ఠునకు ఊర్జయందు ఏడ్గురు కొడుకులు కలిగిరి, పుండరీక అనే సుందరి వారికి పెద్ద అక్కగారు.

రజోగాత్రోర్ధ్వబాహూ చ సవనశ్చానయశ్చ యః ।
సుతపాశ్శుక్ర ఇత్యేతే సప్త సప్తర్షయస్స్మృతాః ॥
గోత్రాణి నామభిస్తేషాం వాసిష్ఠానాం మహాత్మనామ్ ।
స్వాయంభువే ఽతరే ఽతీతాన్యర్బుదాని శతాని చ ॥
ఇత్యేష ఋషిసర్గస్తు సానుబంధః ప్రకీర్తితః ।
సమాసాద్విస్తరాద్వక్తుమశక్యోఽయమితి ద్విజాః ॥
యోఽసౌ రుద్రాత్మకో వహ్నిర్బ్రహ్మణో మానసస్స్మృతః ।
స్వాహా తస్య ప్రియా లేభే పుత్రాంస్త్రీ నమితౌజసః ॥

పావకః పవమానశ్చ శుచిరిత్యేష తే త్రయః ।
నిర్మథ్యః పవమానస్స్యాద్వైద్యుతః పావకస్స్మృతః ॥
సూర్యే తపతి యశ్చాసౌ శుచిస్సౌర ఉదాహృతః ।
హవ్యవాహః కవ్యవాహస్సహరక్షా ఇతి త్రయః ॥
త్రయాణాం క్రమశః పుత్రా దేవపిత్రసురాశ్చ తే ।
ఏతేషాం పుత్రపౌత్రాశ్చ చత్వారింశన్నవైవ తే ॥
కామ్యనైమిత్తికాజస్రకర్మసు త్రిషు సంస్థితాః ।
సర్వే తపస్వినో జ్ఞేయాస్సర్వే వ్రతభృతస్తథా ॥
సర్వే రుద్రాత్మకాశ్చైవ సర్వే రుద్రపరాయణాః ।
తస్మాదగ్నిముఖే యత్తద్హుతం స్యాదేవ కేనచిత్ ॥
తత్సర్వం రుద్రముద్దిశ్య దత్తం స్యాన్నాత్ర సంశయః ।
ఇత్యేవం నిశ్చయోఽగ్నీనామనుక్రాంతో యథాతథమ్ ॥

రజస్సు, గాత్రుడు, ఊర్ధ్వబాహుడు, సవనుడు, అనయుడు, సుతపసుడు, శుక్రుడు అనునవి ఆ ఏడ్గురు ఋషుల పేర్లు (34). మహాత్ములగు ఆ వసిష్ఠపుత్రులయొక్క గోత్రనామములు స్వాయంభువమన్వంతరములో వేల కోట్ల సంఖ్యలో ఉండెను. వారందరు కాలగర్భములో కలిసిరి (35). ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా వంశసంతతితో కూడియున్న ఋషిసర్గమును విస్తరముగా వర్ణించుట శక్యము కాదు. కావుననే, సంగ్రహముగా వర్ణించితిని (36). బ్రహ్మమానసపుత్రుడు మరియు రుద్రస్వరూపుడు అగు అగ్నికి ఆయనయొక్క ప్రియురాలగు స్వాహాదేవియందు సాటిలేని తేజస్సు గల ముగ్గురు కుమారులు కలిగిరి (37). పావకుడు, పవమానుడు, శుచి అనునవి ఆ ముగ్గురి పేర్లు, మంథనమునందు పుట్టే అగ్నికి పవమానుడని పేరు. మెరుపులో పుట్టే అగ్నికి పావకుడని పేరు (38). సూర్య ప్రకాశమునందు గల తేజస్సునకు శుచి అని పేరు. వీరి ముగ్గురికి క్రమముగా హవ్యవాహుడు, కవ్యవాహుడు, సహరక్షుడు అనే ముగ్గురు కొడుకులు కలిగిరి. వారు క్రమముగా దేవతలు, పితృదేవతలు, అసురులు అను వర్గములకు చెందినవారు. వారికి నలభై తొమ్మిదిమంది కొడుకులు, మనుమలు గలరు (39, 40). వీరు క్రమముగా కామ్య ( కోరిక సిద్ధించుటకై చేయబడునవి), నైమిత్తిక (ఒకానొక నిమిత్తము లేక సందర్భమును పురస్కరించుకొని చేయబడునవి), నిత్య ( తప్పని సరిగా చేయదగినవి) కర్మలు అనే మూడు రకముల కర్మలయందు ప్రతిష్ఠితులై యుందురు. వీరందరు తపశ్శాలులు మరియు వ్రతనిష్ఠ గలవారు అని తెలియదగును (41). రుద్రునియందు నిష్ఠ గల వీరు అందరు రుద్రస్వరూపులే. కావున, ఎవడైననూ అగ్నియొక్క నోటియందు ఏయే ఆహుతులను సమర్పించునో, ఆ సర్వము నిస్సందేహముగా రుద్రుని ఉద్దేశించి మాత్రమే సమర్పించినట్లగును. ఈ విధముగా అగ్నుల నిశ్చయము ఉన్నది ఉన్నట్లుగా క్రమములో చెప్పబడినది.

నాతివిస్తరతో విప్రాః పితౄన్ వక్ష్యామ్యతః పరమ్ ।
యస్మాత్ షడృతవస్తేషాం స్థానం స్థానాభిమానినామ్ ॥
ఋతవః పితరస్తస్మాదిత్యేషా వైదికీ శ్రుతిః ।
యస్మాదృతుషు సర్వే హి జాయంతే స్థాస్నుజంగమాః ॥
తస్మాదేతే హి పితర ఆర్తవా ఇతి చ శ్రుతమ్ ।
ఏవం పితౄణామేతేషామృతుకాలాభిమానినామ్ ॥
ఆత్మైశ్వర్యా మహాత్మానస్తిష్ఠంతీహాభ్రసంగమాత్ ।
అగ్నిష్వాత్తా బర్హిషదః పితరో ద్వివిధాస్స్మృతాః ॥
అయజ్వానశ్చ యజ్వానః క్రమాత్తే గృహమేధినః ।
స్వధాఽసూత పితృభ్యశ్చ ద్వే కన్యే లోకవిశ్రుతే ॥
మేనాం చ ధరణీం చైవ యాభ్యాం విశ్వమిదం ధృతమ్ ।
అగ్నిష్వాత్తసుతా మేనా ధరణీ బర్హిషత్సుతా ॥
మేనా హిమవతః పత్నీ మైనాకం క్రౌంచమేవ చ ।
గౌరీం గంగాం చ సుషువే భవాంగాశ్లేషపావనీమ్ ॥
మేరోస్తు ధరణీ పత్నీ దివ్యౌషధిసమన్వితమ్ ।
మందరం సుషువే పుత్రం చిత్రసుందరకంధరమ్ ॥
స ఏవ మందరః శ్రీమాన్ మేరుపుత్రస్తపోబలాత్ ।
సాక్షాచ్ఛ్రీకంఠనాథస్య శివస్యావసథం గతః ॥
సా ఽసూత ధరణీ భూయస్తి స్రః కన్యాశ్చ విశ్రుతాః ।
వేలాం చ నియతిం చైవ తృతీయమపి చాయతిమ్ ॥
ఆయతిర్నియతిశ్చైవ పత్న్యౌ ద్వే భృగుపుత్రయోః ।
స్వాయంభువేఽంతరే పూర్వం కథితస్తే తదన్వయః ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ పైన పితృదేవతలను గురించి ఎక్కువ విస్తారము కాకుండగా చెప్పెదను. పితృదేవతలకు స్థానము ఆరు ఋతువులు. ఈ ఋతువులు అనే స్థానమునందు వారికి అభిమానము (నాది అనే భావన) గలదు (44). కావున, ఋతువులే పితృదేవతలు అగుదురని వేదమంత్రములలో వినబడుచున్నది. చరాచరప్రాణులన్నియు ఋతువులయందు మాత్రమే జన్మించుచున్నవి (45), కావున, ఈ పితృదేవతలు ఆర్తవులు (ఋతువుల అభిమాని దేవతలు) అని వేదము చెప్పుచున్నది. ఈ విధముగా ఋతువులు అనే కాలాంశములకు అభిమాని దేవతలగు పితరులలో అగ్నిష్వాత్తులు, బర్హిషదులు అనే రెండు రకములు గలరని మహర్షులు చెప్పెదరు. మేఘములతో కలిసి ఉండే ఈ పితృదేవతలు ఆత్మజ్ఞానము అనే ఐశ్వర్యము గల మహాత్ములు ( 46, 47). గృహస్థులగు ఆ రెండు రకముల పితరులలో రెండవ వారు యజ్ఞయాగములను చేసినవారు కాగా, మొదటి వారు అట్లు కాదు. పితృదేవతలకు స్వధయందు లోకప్రఖ్యాతిని గాంచిన ఇద్దరు కుమార్తెలు కలిగిరి (48). మేన, ధరణి అనునవి వారి పేర్లు. వారిద్దరు ఈ జగత్తునంతనూ నిలబెట్టినారు. మేన అగ్నిష్వాత్తుల పుత్రిక కాగా, ధరణి బర్హిషదుల పుత్రిక (49). హిమవంతుని భార్యయగు మేన మైనాకుడు, క్రౌంచుడు అను పుత్రులను, గౌరి, గంగ అనే పుత్రికలను కనెను. శివుని శరీరమును ఆలింగనము చేయుటచే గంగ పావని యైనది (50). మేరువుయొక్క భార్యయగు ధరణి దివ్యమగు ఓషధులతో నిండియున్నవాడు, రంగు రంగుల అందమైన శిఖరములు గలవాడు అగు మందరుని పుత్రునిగా కనెను (51). శోభాయుక్తుడు, మేరుపుత్రుడు అగు ఆ మందరుడే తపస్సు యొక్క బలముచే కంఠమునందు విషముగల జగన్నాథుడగు శివునకు సాక్షాత్తుగా నివాసస్థానమైనాడు (52). ఆ ధరణి మరల వేల, నియతి మరియు ఆయతి అనే ముగ్గురు లోకప్రఖ్యాతిని గాంచిన కన్యలను కనెను (53). ఆయతి, నియతి అను వారిద్దరు భృగువుయొక్క పుత్రులకు ఇద్దరికి భార్యలు అయినారు. వారి వంశమును గురించి పూర్వము నేను స్వాయంభువ మన్వంతర ప్రసంగములో చెప్పియుంటిని.

సుషువే సాగరాద్వేలా కన్యామేకామనిందితామ్ ।
సవర్ణాం నామ సాముద్రీం పత్నీం ప్రాచీనబర్హిషః ॥
సాముద్రీ సుషువే పుత్రాన్ దశ ప్రాచీనబర్హిషః ।
సర్వే ప్రాచేతసా నామ ధనుర్వేదస్య పారగాః ॥
యేషాం స్వాయంభువే దక్షః పుత్రత్వమగమత్పురా ।
త్రియంబకస్య శాపేన చాక్షుషస్యాంతరే మనోః ॥
ఇత్యేతే బ్రహ్మపుత్రాణాం ధర్మాదీనాం మహాత్మనామ్ ।
నాతిసంక్షేపతో విప్రా నాతివిస్తరతః క్రమాత్ ॥
వర్ణితా వై మయా వంశా దివ్యా దేవగణాన్వితాః ।
క్రియావంతః ప్రజావంతో మహర్ధిభిరలంకృతాః ॥
ప్రజానాం సంనివేశోఽయం ప్రజాపతిసముద్భవః ।
న హి శక్యః ప్రసంఖ్యాతుం వర్షకోటిశతైరపి ॥
రాజ్ఞామపి చ యో వంశో ద్విధా సోఽపి ప్రవర్తత ।
సూర్యవంశస్సోమవంశ ఇతి పుణ్యతమః క్షితౌ ॥
ఇక్ష్వాకురంబరీషశ్చ యయాతిర్నాహుషాదయః ।
పుణ్యశ్లోకాః శ్రుతా యేఽత్ర తేఽపి తద్వంశసంభవాః ॥
అన్యే చ రాజఋషయో నానావీర్యసమన్వితాః ।
కిం తైః ఫలమనుత్క్రాంతై రుక్తపూర్వైః పురాతనైః ॥
కిం చేశ్వరకథావృత్తౌ యత్ర తత్రాన్యకీర్తనమ్ ।
న సద్భిస్సంమతం మత్వా నోత్సహే బహు భాషితుమ్ ॥
ప్రసంగాదీశ్వరస్యైవ ప్రభావద్యోతనాదపి ।
సర్గాదయోఽపి కథితా ఇత్యత్ర తత్సువిస్తరైః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే
సృష్టికథనం నామ సప్తదశోఽధ్యాయః ॥

వేల సాగరునితో కలిసి ఒక సుందరియగు కన్యను కనెను. సవర్ణ అనే పేరు గల ఆ సముద్రపుత్రి ప్రాచీనబర్హిషుని భార్య ఆయెను (55). ప్రాచీనబర్హిషునకు ఆ సముద్రపుత్రియందు పది మంది కొడుకులు కలిగిరి. వారికి ప్రాచేతసులు అని పేరు. వారు ధనుర్వేదములో దిట్టలు (56). స్వాయంభువమన్వంతరములోని దక్షుడు శివుని శాపము వలన పూర్వము చాక్షుషమన్వంతరములో వారికి పుత్రుడు ఆయెను (57). ఓ బ్రాహ్మణులారా! ఇంతవరకు మీకు ఈ ధర్ముడు మొదలగు మహాత్ములయొక్క వృత్తాంతమును మిక్కిలి సంక్షేపము కాకుండగా మరియు అతివిస్తారము కాకుండగా వరుసగా చెప్పితిని (58), దేవగణములతో కూడియున్నవి, వైదికకర్మానుష్ఠానముతో కూడినవి, సంతానవంతములు, గొప్ప భోగభాగ్యములతో తులదూగునవి అగు దివ్యవంశములను నేను వర్ణించి చెప్పితిని (59). ప్రజాపతినుండి పుట్టిన ఈ సంతానసమూహమును వందల కోట్ల సంవత్సరముల కాలములోనైననూ ఖచ్చితముగా లెక్కించుట సంభవము కాదు (60). భూలోకములో మిక్కిలి పవిత్రమైన రాజుల వంశము కూడ సూర్యవంశము, చంద్రవంశము అనే రెండు శాఖలను కలిగియున్నది (61), ఇక్ష్వాకువు, అంబరీషుడు, నహుషుని పుత్రుడగు యయాతి మొదలగు పవిత్రకీర్తి గల ఏ రాజులు లోకములో ప్రఖ్యాతిని గాంచియున్నారో, మరియు అనేకశక్తిసామర్థ్యములు గల ఏ ఇతరరాజర్షులు గలరో, వారు కూడ ఆ వంశములకు చెందినవారే. మరణరహితులగు ఆ పురాతనచక్రవర్తులను గురించి పూర్వములో చెప్పియుంటిని. మరల వారిని గురించి చెప్పుటలో ఫలమేమి గలదు? (62,63) ఇంతే గాక, ఈశ్వరుని కథను చెప్పే సందర్భములో అనేకములగు ఇతరవిషయములను గురించి అధిక ప్రసంగమును చేయుట సత్పురుషులకు సమ్మతము కాబోదని తలంచి నేను ఆ వివరములను ఉత్సాహముతో చెప్పుట లేదు (64). ఈశ్వరుని మహిమను కళ్లకు కట్టినట్లు వర్ణించే సందర్భమును పురస్కరించుకొని మాత్రమే నేను సృష్టి మొదలగు వాటిని గురించి చెప్పితిని. ఆ వివరములు కూడ ఇక చాలును.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో సృష్టిని వర్ణించే పదునేడవ అధ్యాయము ముగిసినది.

# 18- సతీ దేవి దేహమును త్యజించుట

ఋషయ ఊచుః ।

దేవీ దక్షస్య తనయా త్యక్త్వా దాక్షాయణీం తనుమ్ ।
కథం హిమవతః పుత్రీ మేనాయామభవత్పురా ॥
కథం చ నిందితో రుద్రో దక్షేణ చ మహాత్మనా ।
నిమిత్తమపి కిం తత్ర యేన స్యాన్నిందితో భవః ॥
ఉత్పన్నశ్చ కథం దక్షో హ్యాభిశాపాద్భవస్య తు ।
చాక్షుషస్యాంతరే పూర్వం మనోః ప్రబ్రూహి మారుత ॥

ఋషులు ఇట్లు పలికిరి -

పూర్వము దక్షుని కుమార్తె యగు సతీదేవి దక్షుని వలన సంప్రాప్తమైన దేహమును త్యజించి హిమవంతుని వలన మేనయందు జన్మించిన విధమెట్టిది? (1) మహాత్ముడగు దక్షుడు రుద్రుని నిందించిన విధమెట్టిది? జగన్నాథుడగు శివుని నిందించుటకు గల కారణమేమి? (2) పూర్వము దక్షుడు శివుని శాపముచే చాక్షుషమన్వంతరములో జన్మించిన విధమెట్టిది? ఓ వాయూ! ఈ విషయమును చెప్పుము.

వాయురువాచ।

శృణ్వంతు కథయిష్యామి దక్షస్య లఘుచేతసః ।
వృత్తం పాపాత్మమాదాచ్చ విశ్వామరవిదూషణమ్ ॥
పురా సురాసురాస్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః ।
కదాచిద్ద్రష్టుమీశానం హిమవచ్ఛిఖరం యయుః ॥
తదా దేవశ్చ దేవీ చ దివ్యాసనగతావుభౌ ।
దర్శనం న దదుస్తేషాం దేవాదీనాం ద్విజోత్తమాః ॥
తదానీమేవ దక్షోఽపి గతస్తత్ర సహామరైః ।
జామాతారం హరం ద్రష్టుం దేవీం చాత్మసుతాం సతీమ్ ॥
తదాత్మగౌరవాద్దేవో దేవ్యా దక్షే సమాగతే ।
దేవాదిభ్యో విశేషేణ న కదాచిదభూత్స్మృతిః ॥
తస్య తస్యాః పరం భావమజ్ఞాతుశ్చాపి కేవలమ్ ।
పుత్రీత్యేవం విమూఢస్య తస్యాం వైరమజాయత ॥
తతస్తేనైవ వైరేణ విధినా చ ప్రచోదితః ।
నాజుహావ భవం దక్షో దీక్షితస్తామపి ద్విషన్ ॥
అన్యాన్ జామాతరస్సర్వానాహూయ స యథాక్రమమ్ ।
శతశః పుష్కలామర్చాం చకార చ పృథక్ పృథక్ ॥
తథా తాన్ సంగతాన్ దృష్ట్వా నారదస్య ముఖాత్తదా ।
యయౌ రుద్రాయ రుద్రాణీ విజ్ఞాప్య భవనం పితుః ॥

వాయువు ఇట్లు పలికెను -

అల్పబుద్ధియగు దక్షుడు పాపప్రభావముచే మరియు నిర్లక్ష్యభావముచే సకలదేవతలకు నిందను కలిగించే పనిని చేసినాడు. ఆ వృత్తాంతమును చెప్పెదను. వినుడు {4}. పూర్వము దేవతలు, రాక్షసులు, సిద్ధులు, మహర్షులు అందరు కలిసి ఒకనాడు పరమేశ్వరుని దర్శించుటకై హిమవత్పర్వతశిఖరమునకు వెళ్లిరి (5). ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! అపుడు సతీపరమేశ్వరులు ఇద్దరు దివ్యమగు ఆసనమునందు కూర్చున్నవారై ఆ దేవతలు మొదలగు వారికి దర్శనమునిచ్చిరి (6). అదే సమయములో దక్షుడు కూడ దేవతలతో గూడి తన అల్లుడగు శివుని మరియు తన కుమార్తెయగు సతీదేవిని చూచుట కొరకై అచటకు వెళ్లెను (7). అపుడు దక్షుడు దేవిని కలుసుకొనెను. కాని, ఆత్మగౌరవము గలవాడగుటచే శివుడు దేవతలు మొదలగు వారి కంటె అధికముగా దక్షుని ఒక్కసారియైననూ స్మరించలేదు (8). సతీశివుల పరమాత్మతత్త్వమునెరుంగక కేవలము సతి తన కుమార్తె యని మాత్రమే తలపోయు ఆ పరమమూర్ఖునకు ఆమెయందు వైరబుద్ధి నెలకొనెను. (9). తరువాత ఆ వైరము కారణముగా మరియు దైవచోదితుడై దక్షుడు యజ్ఞదీక్షను స్వీకరించినప్పుడు ద్వేషము గలవాడగుటచే శివుని ఆహ్వానించలేదు (10). ఆతడు మిగిలిన అల్లుళ్లను వరుసగా ఆహ్వానించి, వారికి వేర్వేరుగా అసంఖ్యాకములగు ఉపచారములను చేసి పూజించెను (11). ఆ విధముగా వారందరు ఒకచోటకు చేరిన విషయమును నారదుని ముఖమునుండి విని రుద్రుని భార్యయగు సతీదేవి రుద్రునకు విన్నవించి తన తండ్రి ఇంటికి వెళ్లెను.

**అథ సంనిహితం దివ్యం విమానం విశ్వతోముఖమ్ ।**
**లక్షణాఢ్యం సుఖారోహమతిమాత్రం మనోహరమ్ ॥**
**తప్తజాంబూనదప్రఖ్యం చిత్రరత్నపరిష్కృతమ్ ।**
**ముక్తామయవితానాగ్ర్యం స్రగ్దామసమలంకృతమ్ ॥**
**తప్తకాంచననిర్వ్యూహం రత్నస్తంభశతావృతమ్ ।**
**వజ్రకల్పితసోపానం విద్రుమస్తంభతోరణమ్ ॥**
**పుష్పపట్టపరిస్తీర్ణం చిత్రరత్నమహాసనమ్ ।**
**వజ్రజాలకిరచ్ఛిద్రమచ్ఛిద్రమణికుట్టికమ్ ॥**
**మణిదండమనోజ్ఞేన మహావృషభలక్ష్మణా।**
**అలంకృతపురోభాగమభ్రశుభ్రేణ కేతునా ॥**
**రత్నకంచుకగుప్తాంగైశ్చిత్రవేత్రైకపాణిభిః ।**
**అధిష్ఠితమహాద్వారమప్రధృష్యైర్గణేశ్వరైః ॥**
**మృదంగతాలగీతాదివేణువీణావిశారదైః ।**
**విదగ్ధవేషభూషైశ్చ బహుభిః స్త్రీ జనైర్వృతమ్ ॥**
**ఆరురోహ మహాదేవీ సహ ప్రియసఖీజనైః ।**
**చామరవ్యజనే తస్యా వజ్రదండమనోహరే ॥**

గృహీత్వా రుద్రకన్యే ద్వే వివీజతురుభే శుభే ।
తదా చామరయోర్మధ్యే దేవ్యా వదనమాబభౌ ॥
అన్యోన్యం యుధ్యతోర్మధ్యే హంసయోరివ పంకజమ్ ।
ఛత్రం శశినిభం తస్యాశ్చూడోపరి సుమాలినీ ॥
ధృతముక్తాపరిక్షిప్తం బభార ప్రేమనిర్భరా ।
తచ్ఛత్రముజ్జ్వలం దేవ్యా రురుచే వదనోపరి ॥
ఉపర్యమృతభాండస్య మండలం శశినో యథా ।
అథ చాగ్రే సమాసీనా సుస్మితాస్యా శుభావతీ ॥

తరువాత, దగ్గరలో నున్నది, దివ్యమైనది, అన్ని దిక్కులయందు ద్వారములు గలది, మంచి లక్షణములు గలది, తేలికగా ఎక్కుటకు వీలైనది, చాల ఆహ్లాదకరమైనది, పుటము పెట్టిన బంగారము వలె ప్రకాశించునది, రంగురంగుల రత్నములతో అలంకరింప బడినది, పై భాగమునందు ముత్యములతో అలంకరింపబడిన చాందినీ గలది, పుష్పమాలలతో చక్కగా అలంకరింపబడి యున్నది, పుటము పెట్టిన బంగారముతో మెరుగు పెట్టబడినది, వందల సంఖ్యలో రత్నములు పొదిగిన స్తంభములు గలది, వజ్రములు పొదిగిన మెట్లు గలది, పగడములతో అలంకరింపబడిన వాసములు ఆర్చీలు గలది, పుష్పములతో నిండిన తివాచీలు పరిచియున్నది, రంగు రంగుల రత్నములు పొదిగిన పెద్ద కుర్చీలు గలది, చిన్న చిన్న రంధ్రములద్వారా సర్వత్రా వ్యాపించే వజ్రముల కాంతులు గలది, ఎగుడు దిగుడులు లేకుండగా మణులచే పొదగబడిన అరుగులు గలది; మణులు పొదిగిన దండముతో సుందరమైన, పెద్ద ఎద్దు చిహ్నముగా గల, శరత్కాలమేఘము వలె తెల్లనైన పతాకముతో అలంకరింపబడిన ముందుభాగము గలది; రత్నములు పొదిగిన కవచములచే రక్షింపబడిన దేహభాగములు గల, రంగు రంగుల బెత్తములను మాత్రమే చేతులయందు ధరించియున్న, ఎదిరించ శక్యము కానీ గణాధ్యక్షులచే పహరా కాయబడుచున్న పెద్ద ద్వారము గలది; మద్దెల తాలము గీతము వేణునాదము వీణావాదనము మొదలగు వాటియందు పాండిత్యముగల, విలువైన వేషములను ఆభరణములను ధరించియున్న, అనేకమంది స్త్రీ సమూహములతో కూడియున్నది అగు విమానమును (13-19) ఆ మహాదేవి తన ప్రియసఖురాండ్ర సమూహముతో గూడి ఆరోహించెను. ఇద్దరు శుభలక్షణములు గల రుద్రకన్యలు వజ్రములు పొదిగిన దండములతో మనస్సులను దోచివేసే రెండు వింజామరలను పట్టుకొని వీచుచుండిరి. అపుడు ఆ వింజామరల మధ్యలో నున్న దేవియొక్క ముఖము పోట్లాడుతున్న రెండు హంసల మధ్యలోనున్న పద్మము వలె ప్రకాశించెను. సుమాలిని అనునామె ప్రేమతో నిండిన హృదయము గలదై ఆ దేవియొక్క శిరస్సుపై చంద్రుని వలె ప్రకాశించే, చుట్టూ ముత్యాల హారములు గుచ్చబడిన గొడుగును పట్టుకొనెను. అధికముగా ప్రకాశించే ఆ గొడుగు ఆ దేవియొక్క ముఖముపై అమృతభాండముపై నున్న చంద్రమండలము వలె ప్రకాశించెను. చక్కని చిరునవ్వుతో ప్రకాశించే మోము గల శుభావతి యనునామె దేవికి ఎదురుగా కూర్చుండి యుండెను.

అక్షద్యూతవినోదేన రమయామాస వై సతీమ్ ।
సుయశాః పాదుకే దేవ్యాశ్శుభే రత్నపరిష్కృతే ॥
స్తనయోరంతరే కృత్వా తదా దేవీమసేవత ।
అన్యా కాంచనసర్వాంగీ దీప్తం జగ్రహ దర్పణమ్ ॥
అపరా తాలవృంతం చ పరా తాంబూలపేటికామ్ ।
కాచిత్క్రీడాశుకం చారు కరే ఒ కురుత భామినీ ॥
కాచిత్తు సుమనోజ్ఞాని పుష్పాణి సురభీణి చ ।
కాచిదాభరణాధారం బభార కమలేక్షణా ॥
కాచిచ్చ పునరాలేపం సుప్రసూనం శుభాంజనమ్ ।
అన్యాశ్చ సుదృశస్తాస్తా యథాస్వముచితక్రియాః ॥
ఆవృత్య తాం మహాదేవీమసేవంత సమంతతః ।
అతీవ శుశుభే తాసామంతరే పరమేశ్వరీ ॥
తారాపరిషదో మధ్యే చంద్రలేఖేవ శారదీ ।
తతశ్శంఖసముత్థస్య నాదస్య సమనంతరమ్ ॥
ప్రాస్థానికో మహానాదః పటహస్సమతాడయత్ ।
తతో మధురవాద్యాని సహ తాలోద్యతేస్స్వనైః ॥
అనాహతాని సన్నేదుః కాహలానాం శతాని చ ।
సాయుధానాం గణేశానాం మహేశసమతేజసామ్ ॥
సహస్రాణి శతాన్యష్టౌ తదానీం పురతో యయుః ।
తేషాం మధ్యే వృషారూఢో గజారూఢో యథా గురుః ॥
జగామ గణపః శ్రీమాన్ సోమనందీశ్వరార్చితః ।
దేవదుందుభయో నేదుర్దివి దివ్యసుఖా ఘనాః ॥

ఆమె పాచికలనాడుతూ సతీదేవికి వినోదమును సమకూర్చి ఉల్లాసమును కలిగించెను. సుయశస్సు అనునామె దేవియొక్క శుభకరములు, రత్నములు పొదిగినవి అగు పాదుకలను (25) ఆ సమయములో తన స్తనముల మధ్యలో నుంచుకొని దేవిని సేవించెను. బంగారము వలె మెరిసే సుందరమైన అవయవములు గల మరియొక యువతి ప్రకాశించే అద్దమును పట్టుకొని యుండెను (26). ఒకామే తాటియాకు విసిరే కర్రను, మరియొక యువతి తాంబూలపు పెట్టెను పట్టుకొని యుండిరి. మరియొక సుందరి విలాసము కొరకు పట్టుకొనే అందమైన చిలకను దేవియొక్క చేతిలో నుంచెను (27). ఒకామె మిక్కిలి సుందరమైన పరిమళముతో కూడియున్న పుష్పములను, ఇంకొక కలువ కన్నుల యువతి ఆభరణముల పెట్టెను పట్టుకొని నిలబడిరి (28). ఒక యువతి ముఖమునకు రాసుకొనే పరిమళద్రవ్యమును, మంచి పుష్పముల గుత్తిని, చక్కని కాటుకను పట్టుకొనెను. మిగిలిన యువతులు కూడ తమకు తగిన ఆయా సముచితమగు కార్యములను చేయుచూ, తమ తమ శక్తిననుసరించి ఆ మహాదేవి చుట్టూ నిలబడి ఆమెను అన్ని విధములుగా సేవించుచుండిరి. వాని మధ్యలో నున్న

ఆ పరమేశ్వరి, శరత్కాలమునందు నక్షత్రముల మధ్యలో నున్న చంద్రవంక వలె, అతిశయించి ప్రకాశించెను. తరువాత, ముందుగా శంఖనాదము చేయబడెను. ఆ తరువాత (29-31) ప్రయాణము ఆరంభమగునని సూచించే పెద్ద పటహధ్వని చేయబడెను. తరువాత చప్పట్లు తాళముతో కూడి విస్తారమును పొందే విధముగా మధురమగు వాద్యములు వాయించబడెను (32). వందల తప్పెట్లు వాయించకుండగనే మ్రోగుచుండెను. ఆ సమయములో మహేశ్వరునితో సమానమగు తేజస్సు గల ఎనిమిది వందల వేలమంది గణాధ్యక్షులు ఆయుధములను ధరించి ముందు నడిచిరి. వారి మధ్యలో గజమునధిష్ఠించిన బృహస్పతి వలె శోభాయుక్తుడగు గణాధ్యక్షుడు ఎద్దును ఎక్కి వెళ్లెను. చంద్రుడు మరియు నందీశ్వరుడు ఆయనను సేవించుచుండిరి. ఆకాశమునందు దేవదుందుభులు మ్రోగెను. మేఘములు దివ్యమగు సుఖమును కలిగించుచుండెను.

**ననృతుర్మునయస్సర్వే ముముదుస్సిద్ధయోగినః ।**

**ససృజుః పుష్పవృష్టిం చ వితానోపరి వారిదాః ॥**

**తదా దేవగణైశ్చాన్యైః పథి సర్వత్ర సంగతాః ।**

**క్షణాదివ పితుర్గేహం ప్రవివేశ మహేశ్వరీ ॥**

**తాం దృష్ట్వా కుపితో దక్షశ్చాత్మనః క్షయకారణాత్ ।**

**తస్యా యవీయసీభ్యో ఒ పి చక్రే పూజామసత్కృతామ్ ॥**

**తదా శివముఖీ దేవీ పితరం సదసి స్థితమ్ ।**

**అంబికా యుక్తమవ్యగ్రమువాచ కృపణం వచః ॥**

మునులందరు నాట్యమును చేసిరి. సిద్ధులు మరియు యోగులు ఆనందించిరి. అపుడు మేఘములు మార్గములో అంతటా దేవగణములతో కూడి చాందినీపై పుష్పముల వానను కురిపించెను. మహేశ్వరి క్షణకాలమా యన్నట్లు శీఘ్రముగా తండ్రియొక్క ఇంటిని చేరుకొనెను (36,37). దక్షుడు తనకు వినాశము సమీపించిన కారణముగా ఆమెను చూచి కోపించి ఆమెను సత్కరించకుండగనే ఆమె కంటె చిన్నవారికి కూడ పూజను చేసెను (38). అపుడు మంగళకరమగు ముఖము గలది, జగన్మాత అగు ఆ దేవి సభామధ్యమునందున్న తన తండ్రిని ఉద్దేశించి కంగారు లేకుండగా యోగ్యమైన మరియు దీనమైన వచనమును పలికెను.

**దేవ్యువాచః**

**బ్రహ్మాదయః పిశాచాంతా యస్యాజ్ఞావశవర్తినః ।**

**స దేవస్సాంప్రతం తాత విధినా నార్చితః కిల ॥**

**తదాస్తాం మమ జ్యాయస్యాః పుత్ర్యాః పూజాం కిమీదృశీమ్ ।**

**అసత్కృతామవజ్ఞాయ కృతవానసి గర్హితమ్ ॥**

**ఏవముక్తోఽ బ్రవీదేనాం దక్షః క్రోధాదమర్షితః ।**

**త్వత్తః శ్రేష్ఠా విశిష్టాశ్చ పూజ్యా బాలాస్సుతా మమ ॥**

తాసాం తు యే చ భర్తారస్తే మే బహుమతా ముదా ।
గుణైశ్చాప్యధికాస్సర్వే భర్తుస్తే త్ర్యంబకాదపి ॥
స్తబ్ధాత్మా తామసశ్శర్వస్త్వమిమం సముపాశ్రితా ।
తేన త్వామవమన్యే ఽహం ప్రతికూలో హి మే భవః ॥
తథోక్తా పితరం దక్షం క్రుద్ధా దేవీ తమబ్రవీత్ ।
శృణ్వతామేవ సర్వేషాం యే యజ్ఞసదసి స్థితాః ॥
అకస్మాన్మమ భర్తారమజాతాశేషదూషణమ్ ।
వాచా దూషయసే దక్ష సాక్షాల్లోకమహేశ్వరమ్ ॥
విద్యాచౌరో గురుద్రోహీ వేదేశ్వరవిదూషకః ।
త ఏతే బహుపాప్మానస్సర్వే దండ్యా ఇతి శ్రుతిః ॥
తస్మాదత్యుత్కటస్యాస్య పాపస్య సదృశో భృశమ్ ।
సహసా దారుణో దండస్తవ దైవాద్భవిష్యతి ॥
త్వయా న పూజితో యస్మాద్దేవదేవస్త్రియంబకః ।
తస్మాత్తవ కులం దుష్టం నష్టమిత్యవధారయ ॥
ఇత్యుక్త్వా పితరం రుష్టా సతీ సంత్యక్తసాధ్వసా ।
తదీయాం చ తనుం త్యక్త్వా హిమవంతం యయౌ గిరిమ్ ॥
స పర్వతవరః శ్రీమాన్ లబ్ధపుణ్యఫలోదయః ।
తదర్థమేవ కృతవాన్ సుచిరం దుశ్చరం తపః ॥

దేవి ఇట్లు పలికెను –

ఓ తండ్రీ! బ్రహ్మ మొదలుకొని పిశాచము వరకు గల సర్వప్రాణులు ఎవని ఆజ్ఞకు అధీనమై యున్నవో, ఆ దేవుని నీవిప్పుడు యథావిధిగా పూజించకుంటివి (40). ఆ విషయమునట్లుంచుము. నీవు పెద్ద కుమార్తెనగు నన్ను సత్కరించకుండగా అవమానించి ఈ విధముగా ఇతరులను పూజించుట అనే ఇటువంటి నిందార్హమైన పనిని చేసితివి. దీనికి కారణమేమి? (41) ఆమె ఇట్లు పలుకగా, దక్షుడు కోపముతో మండి పడినవాడై, ఆమెతో నిట్లనెను. నా చిన్న కూతుళ్లు నీకంటే గొప్పవారు, పవిత్రలు మరియు పూజింప దగినవారు (42). వారి భర్తలను కూడా నేను ఆనందముతో పూజించుచున్నాను. నీ భర్త ముక్కంటియే అయిననూ, వారు గుణములలో ఆతని కంటే శ్రేష్ఠమైనవారు (43). గర్వముతో నిండిన బుద్ధి గలవాడు, తమోగుణ ప్రధానుడు, లయకారకుడు అగు శివుని నీవు ఆశ్రయించితివి. కావుననే, నేను నిన్ను అవమానించినాను. నాకు శివుడు శత్రువు (44). ఆతడు ఇట్లు పలుకగా, దేవి కోపించి యజ్ఞసదస్సులో నున్నవారు అందరు వినుచుండగా, దక్షునితో నిట్లనెను (45). ఓ దక్షా! లేశమైననూ దోషము లేనివాడు, లోకములకు సాక్షాత్తుగా అధీశ్వరుడు అగు నా భర్తను నీవు హఠాత్తుగా వాక్కులతో దూషించుచుంటివి (46). విద్యను అపహరించినవాడు, గురువునకు ద్రోహమును చేయువాడు, వేదములను ఈశ్వరుని దూషించువాడు అనే ఈ వ్యక్తులు అందరు మహాపాపులు అగుటచే శిక్షకు తగినవారని వేదము చెప్పుచున్నది (47). కావున,

మిక్కిలి తీవ్రమగు ఈ పాపమునకు తగిన దారుణమగు తీవ్రశిక్ష నీకు దైవవశముచే తొందరలో నిశ్చయముగా పడగలదు (48). దేవదేవుడగు ముక్కంటిని నీవు పూజించలేదు. కావున, నీ కులము దుష్టమై నశించినదని నిశ్చయముగా తెలియుము (49). సతీదేవి కోపముతో తండ్రిని ఉద్దేశించి ఇట్లు పలికి, భయమును విడనాడి, దక్షుని వలన సంప్రాప్తమైన దేహమును విడిచిపెట్టి, హిమవత్పర్వతమును చేరుకొనెను (50). శోభాయుక్తుడు, పుణ్యఫలముయొక్క వికాసమును పొందినవాడు అగు ఆ పర్వతరాజు చిరకాలము ఆమె కోరకు మాత్రమే అతికఠినమగు తపస్సును చేసియుండెను.

తస్మాత్తమనుగృహ్ణాతి భూధరేశ్వరమీశ్వరీ ।
స్వేచ్ఛయా పితరం చక్రే స్వాత్మనో యోగమాయయా ॥
యదా గతా సతీ దక్షం వినింద్య భయవిహ్వలా ।
తదా తిరోహితా మంత్రా విహతశ్చ తతోఽధ్వరః ॥
తదుపశ్రుత్య గమనం దేవ్యాస్త్రిపురమర్దనః।
దక్షాయ చ ఋషిభ్యశ్చ చుకోప చ శశాప తాన్ ॥
యస్మాదవమతా దక్ష మత్కృతే ఽనాగసా సతీ ।
పూజితాశ్చేతరాస్సర్వాస్స్వసుతో భర్తృభిస్సహ ॥
వైవస్వతేఽంతరే తస్మాత్తవ జామాతరస్త్వమీ ।
ఉత్పత్స్యంతే సమం సర్వే బ్రహ్మయజ్ఞేష్వయోనిజాః ॥
భవితా మానుషో రాజా చాక్షుషస్య త్వమన్వయే ।
ప్రాచీనబర్హిషః పౌత్రః పుత్రశ్చాపి ప్రచేతసః ॥
అహం తత్రాపి తే విఘ్నమాచరిష్యామి దుర్మతే ।
ధర్మార్థకామయుక్తేషు కర్మస్వపి పునః పునః ॥
తేనైవం వ్యాహృతో దక్షో రుద్రేణామితతేజసా ।
స్వాయంభువీం తనుం త్యక్త్వా పపాత భువి దుఃఖితః ॥
తతః ప్రాచేతసో దక్షో జజ్ఞే వై చాక్షుషేంఽతరే ।
ప్రాచీనబర్హిషః పౌత్రః పుత్రశ్చైవ ప్రచేతసామ్ ॥
భృగ్వాదయోఽపి జాతా వై మనోర్వైవస్వతస్య తు ।
అంతరే బ్రహ్మణో యజ్ఞే వారుణీం బిభ్రతస్తనుమ్ ॥
తదా దక్షస్య ధర్మార్థం యజ్ఞే తస్య దురాత్మనః ।
మహేశః కృతవాన్ విఘ్నం మనౌ వైవస్వతే సతి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే సతీదేహత్యాగో నామ అష్టాదశోఽధ్యాయః ॥

కావుననే, ఆ ఈశ్వరి ఆ పర్వతరాజును అనుగ్రహించి తన ఇచ్చచే యోగమాయా ప్రభావముచే తనకు తండ్రిగా చేసుకొనెను (52). ఏ సమయములో సతి దక్షుని నిందించి భయముచే వ్యాకులపడి నిష్క్రమించినదో, అదే సమయములో మంత్రములు అంతర్ధానమై, ఆ తరువాత యజ్ఞము వినష్టమాయెను (53). దేవి నిష్క్రమించుటను గురించి విని త్రిపురాసురులను సంహరించిన శివుడు దక్షునిపై మరియు ఋషులపై కోపించి వారిని శపించెను (54). ఓ దక్షా! పాపమునెరుంగని సతిని నా కారణముగా అవమానించితివి. నీ ఇతరకుమార్తెలను వారి భర్తలతో సహా అందరినీ పూజించితివి (55). కావున, వైవస్వతమన్వంతరములో నీ ఈ అల్లుళ్లు అందరు ఏకకాలములో శ్రీ పురుషసంగమముతో సంబంధము లేకుండగా బ్రహ్మయొక్క యజ్ఞముల యందు జన్మించగలరు (5 6). నీవు చాక్షుషమనువుయొక్క వంశములో ప్రాచీనబర్హిషునకు మనుమడవై, ప్రచేతసులకు పుత్రుడవై, మనుష్యుడవై పుట్టి రాజువు కాగలవు (57). ఓ దుర్బుద్ధీ! నేను నీకు ఆ జన్మలో కూడ ధర్మార్థకామములనే పురుషార్థములతో కూడిన కర్మలయందు పదే పదే విఘ్నములను కలిగించెదను (58). సాటిలేని తేజస్సు గల రుద్రునిచే ఈ విధముగా శాపముచే శిక్షింపబడిన దక్షుడు దుఃఖితుడై, స్వయంభువుడగు బ్రహ్మనుండి లభించిన దేహమును విడిచిపెట్టి నేలపై పడెను (59). తరువాత దక్షుడు చాక్షుషమన్వంతరములో ప్రాచీనబర్హిషునకు మనుమడై, ప్రచేతసులకు పుత్రుడై పుట్టెను (60). వైవస్వతమన్వంతరములో భృగువు మొదలగు వారు కూడ బ్రహ్మయొక్క యజ్ఞమునందు వరుణునకు సంబంధించిన దేహములను దాల్చి జన్మించిరి (61). అపుడు వైవస్వతమన్వంతరము కొనసాగుచుండగా దుష్టబుద్ధియగు ఆ దక్షుడు ధర్మము కొరకై చేయుచున్న యజ్ఞములో మహేశ్వరుడు విఘ్నమును కలిగించెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో సతి దేహమును విడిచి పెట్టుటను వర్ణించే పద్దెనిమిదవ అధ్యాయము ముగిసినది.

# 19 – వీరభద్రుని పుట్టుక

**ఋషయ ఊచుః ।**

**కథం దక్షస్య ధర్మార్థం ప్రవృత్తస్య దురాత్మనః ।**
**మహేశః కృతవాన్ విఘ్నమేతదిచ్ఛామ వేదితుమ్ ॥**

ఋషులు ఇట్లు పలికిరి –

దుష్టబుద్ధియగు దక్షుడు ధర్మము కొరకై ప్రవర్తించుచుండగా, మహేశ్వరుడు విఘ్నమును చేసిన విధానమెట్టిది? మేమీ విషయమును తెలియగోరుచున్నాము.

**వాయురువాచః**

**విశ్వస్య జగతో మాతురపి దేవ్యాస్తపోబలాత్ ।**
**పితృభావముపాగత్య ముదితే హిమవద్గిరౌ ॥**
**దేవే ఽ పి తత్కృతోద్వాహే హిమవచ్ఛిఖరాలయే ।**
**సంక్రీడతి తయా సార్ధం కాలే బహుతరే గతే ॥**
**వైవస్వతేంఽతరే ప్రాప్తే దక్షః ప్రాచేతసస్స్వయమ్ ।**
**అశ్వమేధేన యజ్ఞేన యక్ష్యమాణోఽ న్వపద్యత ॥**
**తతో హిమవతః పృష్ఠే దక్షో వై యజ్ఞమాహరత్ ।**
**గంగాద్వారే శుభే దేశే ఋషిసిద్ధనిషేవితే ॥**
**తస్య తస్మిన్ మఖే దేవాస్సర్వే శక్రపురోగమాః ।**
**గమనాయ సమాగమ్య బుద్ధిమాపేదిరే తదా ॥**
**ఆదిత్యా వసవో రుద్రాస్సాధ్యాస్సహ మరుద్గణైః ।**
**ఉష్మపాస్సోమపాశ్చైవ ఆజ్యపా ధూమపాస్తథా ॥**
**అశ్వినౌ పితరశ్చైవ తథా చాన్యే మహర్షయః ।**
**విష్ణునా సహితాస్సర్వే స్వాగతా యజ్ఞభాగినః ॥**
**దృష్ట్వా దేవకులం సర్వమీశ్వరేణ వినా గతమ్ ।**
**దధీచో మన్యునాఽఽవిష్టో దక్షమేవమభాషత ॥**

వాయవు ఇట్లు పలికెను –

సకలజగత్తునకు తల్లియగు సతీదేవికి తపస్సుయొక్క బలముచే తండ్రి అనే స్థానమును పొంది హిమవత్పర్వతుడు ఆనందించుచుండెను (2). శివుడు కూడ ఆమెను వివాహమాడి హిమవంతుని శిఖరమును నివాసముగా చేసుకొని ఆమెతో కూడి విహరించుచుండగా చిరకాలము గడచి పోయెను (3). వైవస్వత మన్వంతరము ఆరంభమయ్యెను. ప్రచేతసుల పుత్రుడగు దక్షుడు స్వయముగా అశ్వమేధమనే యజ్ఞమును చేయగోరి అచటకు విచ్చేసెను (4). అపుడు దక్షుడు హిమవత్పర్వతముపై గంగాద్వారము (హరిద్వార్) వద్ద ఋషులచే మరియు సిద్ధులచే సేవించబడే శుభకరమగు స్థలములో యజ్ఞమును ఆరంభించెను (5).

అపుడు వాని ఆ యజ్ఞమునకు ఇంద్రుడు మొదలగు దేవతలు అందరు గుమిగూడి వెళ్లుటకు సంకల్పించిరి (6). ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, మరుద్గణములు, ఉష్మప - సోమప - ఆజ్యప - ధూమ్రపు అనే పితృదేవతలు (7), అశ్వినీ దేవతలు, ఇతర పితృదేవతలు, మహర్షులు కలిసి యజ్ఞభాగములను పొందుటకై చక్కగా వచ్చియుండిరి (8). ఈశ్వరుని మినహాయించి దేవతల సమూహమంతయు వచ్చియుండుటను గాంచి దధీచుడు కోపముతో నిండిన మనస్సు గలవాడై దక్షునితో నిట్లు పలికెను.

**దధీచ ఉవాచః**

**అపూజ్యపూజ్యే చైవ పూజా పూజ్యానాం చాప్యపూజనే ।**
**నరః పాపమవాప్నోతి మహద్వై నాత్ర సంశయః ॥**
**అసతాం సమ్మతిర్యత్ర సతామవమతిస్తథా ।**
**దండో దేవకృతస్తత్ర సద్యః పతతి దారుణః ॥**
**ఏవముక్త్వా తు విప్రర్షిః పునర్దక్షమభాషత ।**
**పూజ్యం తు పశుభర్తారం కస్మాన్నార్చయసే ప్రభుమ్ ॥**

దధీచుడు ఇట్లు పలికెను -

పూజింపదగని వారిని పూజించుటయందు, పూజింపదగిన వారిని పూజింపకుండుట యందు మానవుడు మహాపాపమును పొందును. ఈ విషయములో సందేహము లేదు (10). ఏ స్థానములో అయోగ్యులకు సన్మానము, సత్పురుషులకు అవమానము జరుగునో, అచట ఈశ్వరునిచే ఈయబడే దారుణమగు శిక్ష పడును (11). ఆ బ్రాహ్మణమహర్షి ఈ విధముగా పలికి మరల దక్షునితో నిట్లనెను. పూజనీయుడగు పశుపతి ప్రభుని నీవు ఏల పూజించుట లేదు?

**దక్ష ఉవాచః**

**సంతి మే బహవో రుద్రాశ్శూలహస్తాః కపర్దినః ।**
**ఏకాదశావస్థితా యే నాన్యం వేద్మి మహేశ్వరమ్ ॥**

దక్షుడు ఇట్లు పలికెను —

నా వద్ద శూలమును చేతియందు ధరించినవారు, జటాజూటధారులు అగు రుద్రులు పదకొండు మంది గలరు. మరియొక మహేశ్వరుని గురించి నాకు తెలియదు.

**దధీచ ఉవాచః**

**కిమేభిరమరైరన్యైః పూజితైరధ్వరే ఫలమ్ ।**
**రాజా చేదధ్వరస్యాస్య న రుద్రః పూజ్యతే త్వయా ॥**
**బ్రహ్మవిష్ణుమహేశానాం స్రష్టా యః ప్రభురవ్యయః ।**
**బ్రహ్మాదయః పిశాచాంతా యస్య కైంకర్యవాదినః ॥**
**ప్రకృతీనాం పరశ్చైవ పురుషస్య చ యః పరః ।**
**చింత్యతే యోగవిద్వద్భిర్ ఋషిభిస్తత్త్వదర్శిభిః ॥**

**అక్షరం పరమం బ్రహ్మ హ్యసచ్చ సదసచ్చ యత్ ।**

**అనాదిమధ్యనిధనమప్రతర్క్యం సనాతనమ్ ॥**

**యస్స్రష్టా చైవ సంహర్తా భర్తా చైవ మహేశ్వరః ।**

**తస్మాదన్యం న పశ్యామి శంకరాత్మానమధ్వరే ॥**

దధీచుడు ఇట్లు పలికెను –

ఈ యజ్ఞమునకు అధీశ్వరుడగు రుద్రుని నీవు పూజించనిచో, యజ్ఞాంశములో ఈ ఇతరదేవతలను పూజించుట వలన ఫలమేమున్నది? (14) ఏ ప్రభువు బ్రహ్మవిష్ణుమహేశ్వరులను సృష్టించినవాడో, వినాశము లేనివాడో, బ్రహ్మ మొదలుకొని పిశాచము వరకు ఎవని యెదుట, అయ్యా! ఏమి చేయవలెను? అని పలికెదరో (15), ఎవడు ప్రకృతిపురుషులకు అతీతుడో, యోగమునెరింగిన తత్త్వమును దర్శించిన ఋషులు ఎవనిని ధ్యానించెదరో (16), ఏ అక్షరపరబ్రహ్మ తన మాయాశక్తిచే కార్యకారణరూపమగు జగత్తుయొక్క రూపములో ప్రకటమగుచున్నాడో, ఎవనికి ఆది మధ్యము మరియు అంతము లేవో, ఏ శాశ్వతుడు ఊహకు అందడో (17), ఎవడు సృష్టిస్థితిలయములను చేయు సర్వేశ్వరుడో, అట్టి శంకరస్వరూపుడగు పరమాత్మను తప్ప మరియొకనిని యజ్ఞమునందు పూజింపదగిన వానిని నేను ఎరుంగను.

**దక్ష ఉవాచః**

**ఏతన్మఖేశస్య సువర్ణపాత్రే హవిస్సమస్తం విధిమంత్రపూతమ్ ।**

**విష్ణోర్నయామ్య ప్రతిమస్య భాగం ప్రభోర్విభజ్యాహవనీయమద్య ॥**

దక్షుడు ఇట్లు పలికెను –

యజ్ఞేశ్వరుడు, సాటి లేనివాడు అగు విష్ణు ప్రభుని హవిర్భాగమును అంతను విభాగము చేసి ఈ బంగరు పాత్రలో యథావిధిగా మంత్రములచే పవిత్రముగా చేసి ఇప్పుడే ఆహవనీయాగ్ని (హోమములు చేయబడే అగ్ని) వద్దకు తీసుకొని వెళ్లుచున్నాను.

**దధీచ ఉవాచః**

**యస్మాన్నారాధితో రుద్రస్సర్వదేవేశ్వరేశ్వరః ।**

**తస్మాద్దక్ష తవాశేషో యజ్ఞోఽయం న భవిష్యతి ॥**

**ఇత్యుక్త్వా వచనం క్రుద్ధో దధీచో మునిసత్తమః ।**

**నిర్గమ్య చ తతో దేశాజ్జగామ స్వకమాశ్రమమ్ ॥**

**నిర్గతేఽపి మునే తస్మిన్ దేవా దక్షం న తత్యజుః ।**

**అవశ్యమనుభావిత్వాదనర్థస్య తు భావినః ॥**

**ఏతస్మిన్నేవ కాలే తు జ్ఞాత్వైతత్సర్వమీశ్వరాత్ ।**

**దగ్ధుం దక్షాధ్వరం విప్రా దేవీ దేవమచోదయత్ ॥**

**దేవ్యా సంచోదితో దేవో దక్షాధ్వరజిఘాంసయా ।**

**ససర్జ సహసా వీరం వీరభద్రం గణేశ్వరమ్ ॥**

సహస్రవదనం దేవం సహస్రకమలేక్షణమ్ ।
సహస్రముద్గరధరం సహస్రశరపాణికమ్ ॥
శూలటంకగదాహస్తం దీప్తకార్ముకధారిణమ్ ।
చక్రవజ్రధరం ఘోరం చంద్రార్ధకృతశేఖరమ్ ॥
కులిశోద్ద్యోతితకరం తడిజ్జ్వలితమూర్ధజమ్ ।
దంష్ట్రాకరాలం బిభ్రాణం మహావక్త్రం మహోదరమ్ ॥
విద్యుజ్జిహ్వం ప్రలంబోష్ఠం మేఘసాగరనిస్స్వనమ్ ।
వసానం చర్మ వైయాఘ్రం మహద్రుధిరనిస్స్రవమ్ ॥
గండద్వితయసంస్పృష్టమండలీకృతకుండలమ్ ।
వరామరశిరోమాలావలీకలితశేఖరమ్ ॥
రణన్నూపురకేయూరమహాకనకభూషితమ్ ।
రత్నసంచయసందీప్తం తారహారవృతోరసమ్ ॥
మహాశరభశార్దూలసింహైస్సదృశవిక్రమమ్ ।
ప్రశస్తమత్తమాతంగసమానగమనాలసమ్॥
శంఖచామరకుందేందుమృణాలసదృశప్రభమ్ ।
సతుషారమివాద్రీంద్రం సాక్షాజ్జంగమతాం గతమ్ ॥
జ్వాలామాలాపరిక్షిప్తం దీప్తమౌక్తికభూషణమ్ ।
తేజసా చైవ దీప్యంతం యుగాంత ఇవ పావకమ్ ॥

దధీచుడు ఇట్లు పలికెను –

ఓ దక్షా! సర్వదేవతల ప్రభువులకు కూడ అధీశ్వరుడగు రుద్రుని నీవు ఆరాధించలేదు. కావున, నీ ఈ యజ్ఞము పూర్తిగా వినాశమును పొందగలదు (20). కోపించియున్న దధీచమహర్షి ఈ విధముగా పలికి, ఆ స్థానమునుండి బయటకు వచ్చి, తన ఆశ్రమమునకు వెళ్లెను (21). ఆ మహర్షి వెళ్లిపోయిననూ, రాబోయే అనర్థమును తప్పక అనుభవించ వలసి యుండుటచే, దేవతలు దక్షుని విడిచి పెట్టకుండిరి (22). ఓ బ్రాహ్మణులారా! ఇదే సమయములో ఈ విషయము నంతనూ ఈశ్వరునినుండి తెలుసుకొని, జగన్మాత దక్షయజ్ఞమును నాశనము చేయుమని శివుని ప్రేరేపించెను (23). ఆ దేవిచే ప్రేరేపించబడిన శివుడు దక్షయజ్ఞమును నాశనము చేయగోరి, వెంటనే వీరుడు, గణాధ్యక్షుడు అగు వీరభద్రుని సృష్టించెను (24). వేయి ముఖములు గలవాడు, ప్రకాశస్వరూపుడు, కలువల వంటి వేయి కన్నులు గలవాడు, వేయి ముద్గరము (ఇనుపరోకలి వంటి ఆయుధము) లను ధరించి యున్నవాడు, వేయి చేతులలో బాణములను పట్టుకొని యున్నవాడు (25), శూలము గొడ్డలి గద అను ఆయుధములను చేతులయందు ధరించినవాడు, ప్రకాశించే ధనస్సును ధరించినవాడు, చక్రమును వజ్రమును ధరించినవాడు, భయంకరుడు, చంద్రవంకను తలపై దాల్చినవాడు (26), మెరుపు (వజ్రాయుధము) తో అద్భుతముగా ప్రకాశించే చేయి గలవాడు, మెరుపుల వలె ప్రకాశించే జుట్టు గలవాడు, కోరలతో భయంకరముగా నున్నవాడు, పెద్ద నోరు

మరియు పెద్ద పొట్టను కలిగియున్నవాడు (27), మెరుపు వలె ప్రకాశించే నాలుక గలవాడు, క్రిందకు వ్రేలాడే పెదవులు గలవాడు, మేఘము వలె గర్జించి సముద్రము వలె ఘోషించువాడు, అధికముగా రక్తమును స్రవించుచున్న పెద్దపులి చర్మమును ధరించినవాడు (28), రెండు చెక్కిళ్లను స్పృశించుచున్న గుండ్రని కుండలములు గలవాడు, గొప్ప దేవతల తలలను మాలలుగా గుచ్చి వాటితో శిరస్సును చుట్టి అలంకరించుకున్నవాడు (29), ధ్వనిని చేయుచున్న పెద్ద బంగరు నూపురములు మరియు హస్తాభరణములతో అలంకరించుకున్నవాడు, గుట్టల గుట్టల రత్నములతో చక్కగా ప్రకాశించువాడు, స్వచ్ఛమైన (ధ్వనిని చేయుచున్న) హారములతో నిండియున్న వక్షఃస్థలము గలవాడు (30), పెద్ద శరభములు పులులు సింహములు అనువాటితో సమానమగు పరాక్రమము గలవాడు, ప్రశంసించబడే మదించిన ఏనుగుల వలె ఠీవిగా నడచు వాడు (31), శంఖము వింజామరలు మల్లెలు చంద్రుడు తామరతూడు అను వాటితో సమానమైన (తెల్లని) కాంతులు గలవాడు, మంచుతో నిండిన పెద్ద కొండ సాక్షాత్తుగా ప్రాణములతో నడచివచ్చినదా యన్నట్లు ఉన్నవాడు (32), అగ్నిజ్వాలల మాలలచే చుట్టువారబడి యున్నవాడు, ప్రకాశించే ముత్యముల భూషణములు గలవాడు, తేజస్సుచే ప్రళయకాలాగ్ని వలె ప్రకాశిస్తూ శత్రువులను జయించగోరువాడు అగు వీరభద్రుని శివుడు సృష్టించెను.

**స జానుభ్యాం మహీం గత్వా ప్రణతః ప్రాంజలిస్తతః ।**
**పార్శ్వతో దేవదేవస్య పర్యతిష్ఠద్గణేశ్వరః ॥**
**మన్యునా చాసృజద్భద్రాం భద్రకాళీం మహేశ్వరీమ్ ।**
**ఆత్మనః కర్మసాక్షిత్వే తేన గంతుం సహైవ తు ॥**
**తం దృష్ట్వా ఉపస్థితం వీరభద్రం కాలాగ్నిసన్నిభమ్ ।**
**భద్రయా సహితం ప్రాహ భద్రమస్త్వితి శంకరః ॥**
**స చ విజ్ఞాపయామాస సహ దేవ్యా మహేశ్వరమ్ ।**
**ఆజ్ఞాపయ మహాదేవ కిం కార్యం కరవాణ్యహమ్ ॥**
**తతస్త్రిపురహా ప్రాహ హైమవత్యాః ప్రియేచ్ఛయా ।**
**వీరభద్రం మహాబాహుం వాచా విపులనాదయా ॥**

ఆ గణాధ్యక్షుడు మోకాళ్లపై నిలబడి చేతులను జోడించి నమస్కరించి, తరు◌ువాత ఆ దేవదేవుని ప్రక్కన నిలబడియుండెను (34). శివుడు కోపముతో మంగళస్వరూపురాలు, మహేశ్వరియగు భద్రకాళిని తన కర్మకు సాక్షిగా మరియు వీరభద్రునితో కలిసి వెళ్లుట కొరకు సృష్టించెను (35). భద్రకాళితో కలిసి ప్రళయకాలాగ్నివలే నిలబడియున్న ఆ వీరభద్రుని గాంచి శంకరుడు, మంగళమగుగాక! అని పలికెను (36). ఆ వీరభద్రుడు భద్రకాళితో కలిసి మహేశ్వరునకు ఇట్లు విన్నవించెను: ఓ మహాదేవా! నేను ఏ కార్యమును చేయవలసి యున్నది? (37) అపుడు త్రిపురాసురులను సంహరించిన శంకరుడు పార్వతీదేవికి ప్రియమగు కోరికననుసరించి వ్యాపకమగు నాదముగల వాక్కుతో గొప్ప బాహువులు గల వీరభద్రుని ఉద్దేశించి ఇట్లు పలికెను.

దేవదేవ ఉవాచః

ప్రాచేతసస్య దక్షస్య యజ్ఞం సద్యో వినాశయ ।
భద్రకాల్యా సహాసి త్వమేతత్కృత్యం గణేశ్వర ॥
అహమప్యనయా సార్ధం రైభ్యాశ్రమసమీపతః ।
స్థిత్వా వీక్షే గణేశాన విక్రమం తవ దుస్సహమ్ ॥
వృక్షాః కనఖలే యే తు గంగాద్వారసమీపగాః ।
సువర్ణశృంగస్య గిరేర్మేరుమందరసన్నిభాః ॥
తస్మిన్ ప్రదేశే దక్షస్య యజ్ఞస్సంప్రతి వర్తతే ।
సహసా తస్య యజ్ఞస్య విఘాతం కురు మా చిరమ్ ॥
ఇత్యుక్తే సతి దేవేన దేవీ హిమగిరీంద్రజా ।
భద్రం భద్రాం చ సంప్రేక్ష్య వత్సం ధేనురివౌరసమ్ ॥
ఆలింగ్య చ సమాఘ్రాయ మూర్ధ్ని షణ్ముఖం యథా ।
సస్మితా వచనం ప్రాహ మధురం మధురం స్వయమ్ ॥

దేవదేవుడగు శంకరుడిట్లు పలికెను –

ఓ గణాధ్యక్షా! ప్రచేతసుల పుత్రుడగు దక్షుని యజ్ఞమును వెంటనే వినాశము చేయుము. నీవు భద్రకాళితో కలిసి ఈ పనిని పూర్తి చేయుము (39). ఓ గణాధ్యక్షా! నేను కూడా ఈమెతో కూడి రైభ్యుని ఆశ్రమమునకు దగ్గరలో నిలబడి సహింప శక్యము కాని నీ పరాక్రమమును చూచెదను (40). హరిద్వారమునకు సమీపములో బంగరు రంగులో ప్రకాశించే శిఖరములు గల పర్వతముపై మేరుమందరపర్వతముల వలె ఎత్తైన వృక్షములు గలవు (41). ఆ ప్రదేశమునందు దక్షుని యజ్ఞము ఇప్పుడు జరుగుచున్నది. నీవు వెంటనే విలంబము చేయకుండగా ఆ యజ్ఞమునకు విఘాతమును కలిగించుము (42). శివుడు ఇట్లు చెప్పగా, పార్వతీదేవి వీరభద్రుని భద్రకాళిని, గోవు తన దూడను వలే, చక్కగా చూచి (43), కుమారస్వామిని వలె కౌగలించుకొని లలాటముపై ముద్దిడి చిరునవ్వుతో మిక్కిలి మధురమగు వాక్కులతో స్వయముగా నిట్లనెను.

దేవ్యువాచః

వత్స భద్ర మహాభాగ మహాబలపరాక్రమ ।
మత్ప్రియార్థం త్వముత్పన్నో మమ మన్యుం ప్రమార్జయ ॥
యజ్ఞేశ్వరమనాహూయ యజ్ఞకర్మరతోఽభవత్ ।
దక్షో వైరేణ తం తస్మాచ్ఛింధి యజ్ఞం గణేశ్వర ॥
యజ్ఞలక్ష్మీమలక్ష్మీం త్వం భద్ర కృత్వా మమాజ్ఞయా ।
యజమానం చ తం హత్వా వత్స హింసయ భద్రయా ॥
అశేషామివ తామాజ్ఞాం శివయోశ్చిత్రకృత్యయోః ।
మూర్ధ్ని కృత్వా నమస్కృత్య భద్రో గంతుం ప్రచక్రమే ॥

అథైష భగవాన్ క్రుద్ధః ప్రేతావాసకృతాలయః ।
వీరభద్రో మహాదేవో దేవ్యా మన్యుప్రవర్తకః ॥
ససర్జ రోమకూపేభ్యో రోమజాఖ్యాన్ గణేశ్వరాన్ ।
దక్షిణాద్భుజదేశాత్తు శతకోటిగణేశ్వరాన్ ॥
పాదాత్తథోరుదేశాచ్చ పృష్ఠాత్పార్శ్వాన్ముఖాద్గలాత్ ।
గుహ్యాద్గుల్ఫాచ్ఛిరోమధ్యాత్కంఠాదాస్యాత్తథోదరాత్ ॥
తదా గణేశ్వరైర్భద్రై ర్భద్రతుల్యపరాక్రమైః ।
సంఛాదితమభూత్సర్వం సాకాశవివరం జగత్ ॥
సర్వే సహస్రహస్తాస్తే సహస్రాయుధపాణయః ।
రుద్రస్యానుచరాస్సర్వే సర్వే రుద్రసమప్రభాః ॥
శూలశక్తిగదాహస్తాష్టంకోపలశిలాధరాః ।
కాలాగ్నిరుద్రసదృశాస్త్రి నేత్రాశ్చ జటాధరాః ॥

దేవి ఇట్లు పలికెను –

కుమారా! వీరభద్రా! గొప్ప బలపరాక్రమములు గలవాడా! నీవు నా ప్రీతికొరకై జన్మించితివి. నా కోపమును చల్లార్చుము (45). దక్షుడు వైరముచే యజ్ఞాధిపతియగు శివుని పిలువకుండగా యజ్ఞకర్మను ఆరంభించినాడు. ఓ గణాధ్యక్షా! కావున, ఆ యజ్ఞమును భగ్నము చేయుము (46). ఓ వీరభద్రా! కుమారా! నీవు నా ఆజ్ఞచే ఆ యజ్ఞముయొక్క శోభను శోభ లేనిదిగా చేసి, ఆ యజ్ఞమును చేయుచున్నవానిని సంహరించి హింసించుము (47). చిత్రములగు కర్మలను చేయు పార్వతీపరమేశ్వరుల ఆ ఆజ్ఞను పూర్ణముగా తల దాల్చి వీరభద్రుడు వారికి నమస్కరించి బయలు దేరుటకు సంసిద్ధుడాయెను (48). అపుడు శ్మశానమే నివాసస్థానముగా గలవాడు, గొప్ప ప్రకాశము గలవాడు, పార్వతీదేవియొక్క కోపమును చల్లార్చువాడు అగు వీరభద్రభగవానుడు కోపించి (49), తన రోమకూపములనుండి రోమజులు అనే గణాధ్యక్షులను, కుడి భుజమునుండి వందకోట్ల గణనాయకులను సృష్టించేను (50). పాదము, తొడలు, వెన్ను, ప్రక్కలు, నోరు, కంఠముయొక్క లోపలి భాగము, గుహ్యము, మడమలు, శిరస్సు యొక్క మధ్య భాగము, కంఠము, ముఖము, పొట్ట అను స్థానములనుండి కూడ గణనాయకులను సృష్టించెను (51). అపుడు మంగళస్వరూపులు, వీరభద్రునితో సమానమగు పరాక్రమము గలవారు అగు గణనాయకులచే ఆకాశముతో మరియు రంధ్రములతో సహా జగత్తు అంతయు పూర్తిగా కప్పివేయబడెను (52). వారు అందరు వేయి చేతులు గలవారే. వారు వేయి చేతులలో ఆయుధములను ధరించి యుండిరి. వారందరు రుద్రుని సేవకులే. వారందరు రుద్రునితో సమానమగు కాంతి గలవారే (53). వారు శూలము, శక్తి, గదలను చేతులలో ధరించిరి. గొడ్డళ్లను, రాళ్లను, బండలను ధరించిన వారు, మూడు నేత్రములు గలవారు, జటలను దాల్చినవారు అగు ఆ గణనాయకులు ప్రళయకాలాగ్నిని మరియు రుద్రుని పోలి యుండిరి.

నిపేతుర్భృశమాకాశే శతశస్సింహవాహనాః ।
వినేదుశ్చ మహానాదాన్ జలదా ఇవ భద్రజాః ॥
తైర్భద్రై ర్భగవాన్ భద్రస్తథా పరివృతో బభౌ ।
కాలానలశతైర్యుక్తో యథా ఽ తే కాలభైరవః ॥
తేషాం మధ్యే సమారుహ్య వృషేంద్రం వృషభధ్వజః ।
జగామ భగవాన్ భద్రశ్శుభ్రశుభ్రం యథా భవః ॥
తస్మిన్ వృషభమారూఢే భద్రే తు భసితప్రభః ।
బభార మౌక్తికం ఛత్రం గృహీతసితచామరః ॥
స తదా శుశుభే పార్శ్వే భద్రస్య భసితప్రభః ।
భగవానివ శైలేంద్రః పార్శ్వే విశ్వజగద్గురోః ॥
సోఽపి తేన బభౌ భద్రశ్శ్వేతచామరపాణినా ।
బాలసోమేన సౌమ్యేన యథా శూలవరాయుధః ॥
దధ్మౌ శంఖం సితం భద్రం భద్రస్య పురతశ్శుభమ్ ।
భానుకంపో మహాతేజా హేమరత్నైరలంకృతః ॥
దేవదుందుభయో నేదుర్దివ్యసంకులనిస్స్వనాః ।
వవృషుశ్శతశో మూర్ధ్ని పుష్పవర్షం వలాహకాః ॥
ఫుల్లానాం మధుగర్భాణాం పుష్పాణాం గంధబంధవః ।
మార్గానుకూలసంవాహా వవుశ్చ పథి మారుతాః ॥
తతో గణేశ్వరాస్సర్వే మత్తా యుద్ధబలోద్ధతాః ।
ననృతుర్ముముదుర్నేదుర్జహసుర్జగదుర్జగుః ॥
తదా భద్రగణాంతఃస్థో బభౌ భద్రస్సుభద్రయా ।
యథా రుద్రగణాంతఃస్థస్త్ర్యంబకోఽంబికయా సహ ॥
తత్ క్షణాదేవ దక్షస్య యజ్ఞవాటం హిరణ్మయమ్ ।
ప్రవివేశ మహాబాహుర్వీరభద్రో మహానుగః ॥
తతస్తు దక్షప్రతిపాదితస్య క్రతుప్రధానస్య గణప్రధానః ।
ప్రయోగభూమిం ప్రవివేశ భద్రో రుద్రో యథాంతే భువనం దిధక్షుః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే వీరభద్ర
జన్మవర్ణనం నామ ఏకోనవింశో ఽధ్యాయః ॥

వీరభద్రునినుండి పుట్టిన గణములు సింహములు వాహనములుగా గలవారై వందల సంఖ్యలో ఆకాశమునందు వేగముగా విహరిస్తూ, మేఘముల వలె బిగ్గరగా గర్జించుచుండిరి (55). ఆ భద్రులతో చుట్టువారబడి యున్న వీరభద్రుడు ప్రళయకాలములో వందలాది ప్రళయకాలాగ్నులతో కూడియున్న కాలభైరవుని వలె ప్రకాశించెను (56). అతిస్వచ్ఛము మరియు శ్రేష్ఠము అగు వృషభమును అధిష్ఠించిన వీరభద్రుడు వారి మధ్యలో వృషభము చిహ్నముగా గల శివభగవానుని వలె పయనమయ్యెను (57). ఆ వీరభద్రుడు వృషభమునధిష్ఠించగానే భసితప్రభుడు తెల్లని వింజామరను చేతపట్టుకొని ముత్యాల గొడుగును పట్టెను (58). ఆ సమయములో వీరభద్రుని ప్రక్కనే యున్న భసితప్రభుడు జగత్తునకంతకు తండ్రియగు శివుని ప్రక్కన ఉన్న పర్వతరాజు మరియు పూజ్యుడు అగు హిమవంతుని వలె శోభిల్లెను (59). తెల్లని వింజామరను చేతిలో పట్టుకొనియున్న ఆ భసిత ప్రభునితో కూడియున్న ఆ వీరభద్రుడు కూడ, శ్రేష్ఠమగు శూలమును ఆయుధముగా ధరించి చల్లని కాంతులను వెదజల్లే చంద్రవంకతో కూడిన శివుని వలె ప్రకాశించెను (60). గొప్ప తేజశ్శాలి, రత్నములు పొదిగిన బంగరు ఆభరణములను అలంకరించుకున్నవాడు అగు భానుకంపుడు తెల్లని మంగళకరమగు శుభకరమగు శంఖమును వీరభద్రుని యెదుట పూరించెను (61). దేవదుందుభులు మ్రోగినవి. సంకులమగు దివ్యధ్వనులు చెలరేగినవి. మేఘములు శిరస్సుపై వందలాది పుష్పములను వర్షించినవి (62). పొట్టలో తేనెలను కలిగియున్న వికసించిన పుష్పముల గంధములు బంధువులై తోడురాగా వాయువులు మార్గము నందు ప్రయాణమునకు అనుకూలముగా మెల్లగా వీచినవి (63). అపుడు బలముచే గర్వించి యున్నవారు, యుద్ధము కొరకై మదించి యున్నవారు అగు గణాధ్యక్షులు అందరు నాట్యమును చేసి ఆనందించిరి; సింహనాదములను చేసిరి; బిగ్గరగా నవ్విరి; మాటలాడిరి; పాడిరి (64). అపుడు భద్రకాళితో గూడి ఆ భద్రగణముల మధ్యలో నున్న వీరభద్రుడు రుద్రగణముల మధ్యలో జగన్మాతతో కూడియున్న ముక్కంటి దేవుని వలె ప్రకాశించెను (65). గొప్ప అనుచరులు గలవాడు, గొప్ప బాహువులు గలవాడు అగు వీరభద్రుడు ఆ క్షణములోననే దక్షుని బంగరు యజ్ఞవాటికను ప్రవేశించెను ( 6 6). అపుడు దక్షుడు చేయదలబెట్టిన గొప్ప యజ్ఞముయొక్క ప్రయోగము జరుగవలసిన స్థలము లోనికి గణాధ్యక్షుడగు వీరభద్రుడు ప్రళయకాలమునందు లోకములను తగులబెట్ట గోరే రుద్రుని వలె ప్రవేశించెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వభాగములో వీరభద్రుని పుట్టుకను వర్ణించే పందొమ్మిదవ అధ్యాయము ముగిసినది.

# 20 - దక్ష యజ్ఞ విధ్వంసనము

వాయురువాచః

తతో విష్ణుప్రధానానాం సురాణామమితౌజసామ్ ।
దదర్శ చ మహత్సత్రం చిత్రధ్వజపరిచ్ఛదమ్ ॥
సుదర్భఋజుసంస్తీర్ణం సుసమిద్ధహుతాశనమ్ ।
కాంచనైర్యజ్ఞభాండైశ్చ భ్రాజిష్ణుభిరలంకృతమ్ ॥
ఋషిభిర్యజ్ఞపటుభిర్యథావత్కర్మకర్తృభిః ।
విధినా వేదదృష్టేన స్వనుష్ఠితబహుక్రమమ్ ॥
దేవాంగనాసహస్రాఢ్యమప్సరోగణ సేవితమ్ ।
వేణువీణారవైర్జుష్టం వేదఘోషైశ్చ బృంహితమ్ ॥
దృష్ట్వా దక్షాధ్వరే వీరో వీరభద్రః ప్రతాపవాన్ ।
సింహనాదం తదా చక్రే గంభీరో జలదో యథా ॥
తతః కిలకిలాశబ్ద ఆకాశం పూరయన్నివ ।
గణేశ్వరైః కృతో యజ్ఞే మహాన్న్యక్కృతసాగరః ॥
తేన శబ్దేన మహతా గ్రస్తాస్సర్వే దివౌకసః ।
దుద్రువుః పరితో భీతాస్స్రస్తవస్త్ర విభూషణాః ॥
కించిద్భగ్నో మహామేరుః కించిత్సందీర్యతే మహీ ।
కిమిదం కిమిదం వేతి జజల్పుస్త్రి దశా భృశమ్ ॥
మృగేంద్రాణాం యథా నాదం గజేంద్రా గహనే వనే ।
శ్రుత్వా తథావిధం కేచిత్తత్యజుర్జీవితం భయాత్ ॥

వాయువు ఇట్లు పలికెను -

అపుడు విష్ణువు మొదలగు సాటిలేని తేజస్సు గల దేవతలు పాల్గొనే, రంగు రంగుల ధ్వజములు మరియు సామగ్రి గల గొప్ప యజ్ఞమును వీరభద్రుడు చూచెను (1). చక్కని పొడవైన దర్భలచే పరచబడి యున్నది, చక్కగా ప్రజ్వరిల్లే అగ్నులు గలది, మెరిసే బంగరు యజ్ఞభాండములతో అలంకరింపబడినది (2), యజ్ఞమును చేయుటయందు సమర్థులు, యథావిధిగా యజ్ఞప్రయోగమును నిర్వహించువారు అగు ఋషులచే వేదమునందు చెప్పబడిన విధిని అనుసరించి చక్కగా అనుష్ఠించబడే అనేకయజ్ఞాంగముల క్రమము గలది (3), వేలాది దేవతాస్త్రీలతో శోభిల్లునది, అప్సరసల గణములచే సేవింపబడునది, వేణునాదముతో మరియు వీణావాదనముతో ఉల్లాసమును కలిగించునది, వేదఘోషలతో ఆకాశమును నింపుచున్నది (4) అగు యజ్ఞమును దక్షుని యజ్ఞశాలలో చూచి వీరుడు, ప్రతాపము గలవాడు అగు వీరభద్రుడు అపుడు దట్టని మేఘము వలె సింహనాదమును చేసెను (5). తరువాత గణాధ్యక్షులు యజ్ఞశాలయందు పెద్ద సముద్రఘోషను ధిక్కరిస్తూ ఆకాశమును

పూరించుచున్నవా యన్నట్లు కిలకిల శబ్దములను చేసిరి (6). ఆ పెద్ద శబ్దమును తాళలేక దేవతలందరు వస్త్రములు మరియు ఆభరణములు జారిపోవుచుండగా అన్నివైపులకు పరుగులెత్తిరి (7). గొప్ప మేరుపర్వతము విరిగి పడు చున్నదా యేమి? భూమి పగిలిపోవుచున్నదా యేమి? ఇది యేమి? అని దేవతలు కంగారుగా కేకలను వేయుచుండిరి (8). మానవులు ప్రవేశింప శక్యము కాని అడవిలో సింహముల నాదమును విన్న ఏనుగులు వలె కొందరు భయముతో ప్రాణములను విడచిరి.

**పర్వతాశ్చ వ్యశీర్యంత చకంపే చ వసుంధరా ।**
**మరుతశ్చ వ్యఘూర్ణంత చుక్షుభే మకరాలయః ॥**
**అగ్నయో నైవ దీప్యంతే న చ దీప్యతి భాస్కరః ।**
**గ్రహాశ్చ న ప్రకాశంతే నక్షత్రాణి చ తారకాః॥**
**ఏతస్మిన్నేవ కాలే తు యజ్ఞవాటం తదుజ్జ్వలమ్ ।**
**సంప్రాప భగవాన్ భద్రో భద్రైశ్చ సహ భద్రయా ॥**
**తం దృష్ట్వా భీతభీతో ఽ పి దక్షో దృఢ ఇవ స్థితః ।**
**క్రుద్ధవద్వచనం ప్రాహ కో భవాన్ కిమిహేచ్ఛసి ॥**
**తస్య తద్వచనం శ్రుత్వా దక్షస్య చ దురాత్మనః ।**
**వీరభద్రో మహాతేజా మేఘగంభీరనిస్స్వనః ॥**
**స్మయన్నివ తమాలోక్య దక్షం దేవాంశ్చ ఋత్విజః ।**
**అర్థగర్భమసంభ్రాంతమవోచదుచితం వచః ॥**

పర్వతములు పగిలెను. భూమి కంపించెను. గాలులు సర్వమును పెకలించి వేసెను. సముద్రము కల్లోలమాయెను (10). అగ్నులు మండుట మానివేసెను. సూర్యుడు ప్రకాశించుట ఆగిపోయెను. గ్రహములు, నక్షత్రములు, ఇతరములగు ప్రకాశించే గోళములు ప్రకాశించుట మానివేసెను (11). ఇదే సమయములో వీరభద్ర భగవానుడు భద్రగణములతో మరియు భద్రకాళితో కూడి ఆ ప్రకాశించే యజ్ఞవాటికను చేరుకొనెను (12). ఆయనను చూచి దక్షుడు చాల భయపడినను, దృఢముగా నున్నాడా యన్నట్లు నిలబడి, కోపముతో నిట్లు పలికెను. నీవెవరివి? నీకిచట పనీ యేమీ? (13) దుర్బుద్ధియగు దక్షుని ఆ మాటను విని, గొప్ప తేజశ్శాలి, మేఘగర్జనవలే గంభీరమగు స్వరము గలవాడు అగు వీరభద్రుడు చిరునవ్వు నవ్వుతున్నాడా యన్నట్లు ఆ దక్షుని, దేవతలను మరియు ఋత్విక్కులను చూచి, కంగారు పడకుండగా గంభీరమగు అర్థము గలది, మరియు సముచితమైనది అగు వచనమును పలికెను.

**వీరభద్ర ఉవాచః**

**వయం హ్యనుచరాస్సర్వే శర్వస్యామితతేజసః ।**
**భాగాభిలిప్సయా ప్రాప్తా భాగో నస్సంప్రదీయతామ్ ॥**
**అథ చేదధ్వరే ఽస్మాకం న భాగః పరికల్పితః ।**
**కథ్యతాం కారణం తత్ర యుధ్యతాం వా మయా ఽ మరైః ॥**

ఇత్యుక్తాస్తే గణేంద్రేణ దేవా దక్షపురోగమాః ।
ఊచుర్మంత్రాః ప్రమాణం నో న వయం ప్రభవన్త్వితి ॥
మంత్రా ఊచుస్సురా యూయం తమోఽపహతచేతసః ।
యేన ప్రథమభాగార్హం న యజధ్వం మహేశ్వరమ్ ॥
మంత్రోక్తా అపి తే దేవాస్సర్వే సంమూఢచేతసః ।
భద్రాయ న దదుర్భాగం తత్బహిణమభీప్సవః ॥
యదా తథ్యం చ పథ్యం చ స్వవాక్యం తద్వృథాఽ భవత్ ।
తదా తతో యయుర్మందా బ్రహ్మలోకం సనాతనమ్ ॥
అథోవాచ గణాధ్యక్షో దేవాన్ విష్ణుపురోగమాన్ ।
మంత్రాః ప్రమాణం న కృతా యుష్మాభిర్బలగర్వితైః ॥
యస్మాదస్మిన్ మఖే దేవైరిత్థ వయమసత్కృతాః ।
తస్మాద్వో జీవితైస్సార్ధమపనేష్యామి గర్వితమ్ ॥
ఇత్యుక్త్వా భగవాన్ క్రుద్ధో వ్యదహన్నేత్రవహ్నినా ।
యజ్ఞవాటం మహాకూటం యథా త్రిపురః పురో హరః ॥
తతో గణేశ్వరాస్సర్వే పర్వతోదగ్రవిగ్రహాః ।
యూపానుత్పాట్య హోతౄణాం కంఠేష్వాబధ్య రజ్జుభిః ॥
యజ్ఞపాత్రాణి చిత్రాణి భిత్త్వా సంచూర్ణ్య వారిణి ।
గృహీత్వా చైవ యజ్ఞాంగం గంగాస్రోతసి చిక్షిపుః ॥

వీరభద్రుడు ఇట్లు పలికెను -

మేము అందరము సాటిలేని తేజస్సు గల లయకారకుడగు శివుని అనుచరులము. మేము యజ్ఞములో భాగములను పొందగోరి వచ్చియుంటిమి. మాకు భాగములనిండు (16). అట్లు గాక, యజ్ఞములో మాకు భాగములనీయక పోయినచో, దానికి కారణమును చెప్పుడు. లేదా, దేవతలతో కలిసి యుద్ధమును చేయుడు (17). ఆ గణాధ్యక్షుడు ఇట్లు పలుకగా, దక్షుని ముందిడుకున్న దేవతలు ఇట్లు పలికిరి ఈ విషయములో మంత్రములు మాత్రమే ప్రమాణము. ఇది మా అధీనములో లేదు (18). మంత్రములు. ఇట్లు పలికినవి. ఓ దేవతలారా! మీ బుద్ధులు అజ్ఞానముచే కప్పివేయబడినవి. ఏలయనగా, యజ్ఞములో మొట్టమొదటి భాగమునకు అర్హుడగు మహేశ్వరుని మీరు పూజించకుంటిరి (19). మంత్రములీ విధముగా చెప్పిననూ, ఆ దేవతలందరు వ్యామోహముతో నిండిన బుద్ధి గలవారై, వీరభద్రుని త్రోసివేయగోరి, ఆయనకు యజ్ఞభాగమునీయలేదు (20). తాము పలికిన హితకరము మరియు సత్యము అగు వచనములు వృథాయగుటను గాంచి, అపుడు మంత్రములు ఆ స్థానమును విడిచిపెట్టి శాశ్వతమగు బ్రహ్మలోకమునకు మెల్లగా వెళ్లినవి (21). అపుడు గణాధ్యక్షుడగు వీరభద్రుడు విష్ణువు మొదలగు దేవతలనుద్దేశించి ఇట్లు పలికెను. బలముచే గర్వించియున్న మీరు మంత్రముల వచనములను ప్రమాణముగా స్వీకరించకుంటిరి (22). అందు వలననే, ఈ యజ్ఞములో మేము దేవతలచే ఈ విధముగా అవమానించ బడినాము. కావున, మీ

గర్వమును మరియు దానితో బాటు మీ ప్రాణములను నేను తొలగించి వేసెదను (23). వీరభద్ర భగవానుడు ఇట్లు పలికి కోపించి శివుడు త్రిపురములను వలె విశాలమగు భవనమువంటి ఆ యజ్ఞశాలను తన కంటినుండి పుట్టిన అగ్నితో దహించెను (24). తరువాత పర్వతముల వలె విశాలమైన దేహములు గల గణాధ్యక్షులు అందరు యూపస్తంభముల నూడబెరకి హోత (యజ్ఞములోని ఋత్విక్కు) ల కంఠములయందు త్రాళ్లతో కట్టి (25), రంగు రంగుల యజ్ఞపాత్రలను పగులగొట్టి, పొడి చేసి నీటిలో కలిగించి, యజ్ఞసాధనములన్నింటినీ తీసుకొని గంగా ప్రవాహములో పారవైచిరి.

తత్ర దివ్యాన్నపానానాం రాశయః పర్వతోపమాః ।
క్షీరనద్యో ఽ మృతస్రావాస్సుస్నిగ్ధదధికర్దమాః ॥
ఉచ్చావచాని మాంసాని భక్ష్యాణి సురభీణి చ ।
రసవంతి చ పానాని లేహ్యచోష్యాణి తాని వై ॥
వీరాస్తద్భుంజతే వక్త్రై ర్విలుంపంతి క్షిపంతి చ ।
వజ్రైశ్చక్రై ర్మహాశూలైశ్శక్తిభిః పాశపట్టిశైః ॥
ముసలైరసిభిష్టంకైర్భిందిపాలైః పరశ్వధైః ।
ఉద్ధతాంస్త్రి దశాన్ సర్వాన్ లోకపాలపురస్సరాన్ ॥
బిభిదుర్బలినో వీరా వీరభద్రాంగసంభవాః ।
ఛింధి భింధి క్షిప క్షిప్రం మార్యతాం దార్యతామితి ॥
హరస్వ ప్రహరస్వేతి పాటయోత్పాటయేతి చ ।
సంరంభప్రభవాః క్రూరాశ్శబ్దాః శ్రవణశంకవః ॥
తత్ర తత్ర గణేశానాం జజ్ఞిరే సమరోచితాః ।
వివృత్తనయనాః కేచిద్దష్టదంష్ట్రోష్ఠతాలవః ॥
ఆశ్రమస్థాన్ సమాకృష్య మారయంతి తపోధనాన్ ।
స్రువానపహరంతశ్చ క్షిపంతో ఽ గ్నిం జలేషు చ ॥
కలశానపి భిందంతశ్ఛిందంతో మణివేదికాః ।
గాయంతశ్చ నదంతశ్చ హసంతశ్చ ముహుర్ముహుః ॥
రక్తాసవం పిబంతశ్చ నన్నృతుర్గణపుంగవాః ॥

అచట పర్వతములవంటి దివ్యములగు అన్నముల రాశులు, మధురపానీయముల చెరువులు, అమృతప్రవాహములనదగిన పాల నదులు, బిత్తడి నేలలవలె విశాలమైన గెడ్డ పెరుగుల సముదాయములు (27), రుచికరములైన పరిమళభరితములైన మాంసముల చిన్న పెద్ద గుట్టలు, రసవంతములైన ఆసవములు, పచ్చళ్లు, హల్వాలు ఉండెను (28). వీరులు వాటిని నోటియందుంచుకొని నమిలి భక్షించి చెల్లాచెదరుగా పారవేయు చుండిరి. వీరభద్రుని దేహమునుండి పుట్టిన బలవంతులగు ఆ వీరులు వజ్రములు, చక్రములు, పెద్ద శూలములు, శక్తులు, పాశములు, పట్టిసములు (గదల వంటి ఆయుధములు), రోకళ్లు, కత్తులు, గొడ్డళ్లు, భిందిపాలములు ( ఒక రకమైన

ఆయుధములు), గండ్ర గొడ్డళ్లు అనే ఆయుధములతో, లోకపాలురనందరినీ ముందిడుకొని గర్వించియున్న దేవతలను చావగొట్టిరి. నరుకుము, పగులగొట్టుము, త్రోసివేయుము, వేగముగా చంపుము, చీల్చుము, లాగుము, దెబ్బ తీయుము, పీకి వేయుము, పెకిలించి వేయుము మొదలైన క్రూరములగు, కర్ణకఠోరములైన, యుద్ధమునకు తగియున్న, హడావుడినుండి పుట్టే శబ్దములను గణాధ్యక్షులు అక్కడక్కడ మహావేగముతో ఉచ్చరించుచుండిరి. కొందరు కోరల వంటి దంతములతో పెదవులను అంగుడులను కొరుకుతూ కన్నులను గిరగిర త్రిప్పుచుండిరి. (29-33). వారు తపస్సే ధనముగా గల, ఆశ్రమములయందు ఉన్న తపశ్శాలులను గట్టిగా లాగి కొట్టుచుండిరి. వారి స్రువము (హోమసాధనము) లను అపహరించి, వారి అగ్నిహోత్రములను నీళ్లలో పారవేసిరి (34), వారి కమండలములను పగులగొట్టి, మణులు పొదిగిన అరుగులను పగులగొట్టి, వారు పాడుతూ, గర్జిస్తు, అదే పనిగా నవ్వుచుండిరి (35). ఆ గణనాయకులు ఎర్రని ఆసవమును త్రాగుతూ నాట్యమును చేసిరి.

**నిర్మథ్య సేంద్రానమరాన్ గణేంద్రాన్ వృషేంద్రనాగేంద్రమృగేంద్రసారాః।**
**చక్రుర్బహూన్యప్రతిమప్రభావాస్సహర్షరోమాణి విచేష్టితాని ॥**
**నందంతి కేచిత్ప్ర హరంతి కోచిద్ధావంతి కేచిత్ప్ర లపంతి కేచిత్।**
**నృత్యంతి కేచిద్విహసంతి కేచిద్వల్గంతి కేచిత్ప్ర మథా బలేన ॥**
**కేచిజ్జిఘృక్షంతి ఘనాన్ సతోయాన్ కేచిద్గ్రహీతుం రవిముత్పతంతి ।**
**కేచిత్ప్ర సర్తుం పవనేన సార్ధమిచ్ఛంతి భీమాః ప్రమథా వియత్ స్థా ॥**
**ఆక్షిప్య కేచిచ్చ వరాయుధాని మహాభుజంగానివ వైనతేయాః ।**
**భ్రమంతి దేవానపి విద్రవంతః ఖమండలే పర్వతకూటకల్పాః ॥**
**ఉత్పాట్య చోత్పాట్య గృహాణి కేచిత్సజాలవాతాయనవేదికాని।**
**విక్షిప్య విక్షిప్య జలస్య మధ్యే కాలాంబుదాభాః ప్రమథా వినేదుః ॥**
**ఉద్వర్తితద్వారకపాటకుడ్యం విధ్వస్తశాలావలభీగవాక్షమ్ ।**
**అహో బతాభజ్యత యజ్ఞవాటమనాథవద్వాక్యమివాయథార్థమ్ ॥**
**హా నాథ తాతేతి పితస్సుతేతి భ్రాతర్మమాంబేతి చ మాతులేతి ।**
**ఉత్పాట్యమానేషు గృహేషు నార్యో హ్యనాథశబ్దాన్ బహుశః ప్రచక్రుః ॥**
**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే**
**దక్షయజ్ఞవిధ్వంసనం నామ వింశోఽధ్యాయః ॥**

గొప్ప ఎద్దుతో పెద్ద ఏనుగుతో మరియు సింహముతో సమానమగు బలము గలవారు, సాటిలేని ప్రభావము గలవారు అగు గణనాయకులు ఇంద్రునితో సహా దేవతలను చితకగొట్టి, శరీరమునకు గగుర్పాటును కలిగించే అనేకచేష్టలను చేసిరి (37). వారిలో కొందరు గణనాయకులు ఆనందించుచుండిరి; కొందరు కొట్టుచుండిరి; కొందరు పరుగెత్తుచుండిరి; కొందరు వాగుచుండిరి; కొందరు నాట్యమాడుచుండిరి; కొందరు అధికముగా నవ్వుచుండిరి; కొందరు బలముగా గెంతుచుండిరి (38). కొందరు వర్షజలముతో నిండియున్న మేఘములను పట్టుకొనుటకు యత్నించుచుండిరి; కొందరు సూర్యుని పట్టుకొనుటకై పైకి ఎగురుచుండిరి; కొందరు భయంకరాకారులగు గణనాయకులు ఆకాశమునందున్నవారై వాయువుతో సమానముగా వీచుటకు యత్నించుచుండిరి (39). గరుడ పక్షులు పెద్ద పాములను వలె కొందరు పర్వతశిఖరమును బోలియున్న గణనాయకులు శ్రేష్ఠమగు ఆయుధములను ఎత్తి పట్టుకొని దేవతలను కూడ తరుముచూ అంతరిక్షమునందు గిర గిర తిరుగుచుండిరి (40). నల్లని మేఘములను పోలియున్న కొందరు గణనాయకులు పై కప్పులతో కిటికీలతో మరియు అరుగులతో సహా ఇళ్లను పెకిలించి పెకిలించి నీటి మధ్యలో పారవేసి పారవేసి సింహనాదములను చేయుచుండిరి (41). ఆశ్చర్యము! ద్వారములను తలుపులను ఊడబెరకి, గోడలను పగులగొట్టి, శాలలను పై కప్పులకు ఆధారముగానుండే బల్లగొడుగులను మరియు కిటికీలను విధ్వంసము చేసి వారు, రక్షించే నాథుడు లేని ఆ యజ్ఞశాలను అసత్యవాక్యమును వలె భగ్నము చేసిరి (42). వారు ఇళ్లను పెకిలించుచుండగా, ఓ నాథా! తాతా! తండ్రీ! కుమారా! సోదరా! మా యమ్మా! మామయ్యా! మొదలైన, రక్షకులు లేనివారు చేసే పలువిధముల ఆక్రందనములను స్త్రీలు చేయుచుండిరి.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితలో పూర్వభాగమునందు దక్షయజ్ఞవిధ్వంసమును వర్ణించే ఇరువదియవ అధ్యాయము ముగిసినది.

# 21 – భద్రగణములు దక్షయజ్ఞములో బీభత్సమును సృష్టించుట

వాయురువాచ।

తతస్మిం దశముఖ్యాస్తే విష్ణుశక్రపురోగమాః ।
సర్వే భయపరిత్రస్తా దుద్రువుర్భయవిహ్వలాః ॥
నిజైరదూషితైరంగైర్దృష్ట్వా దేవానపద్రుతాన్ ।
దండ్యానదండితాన్మత్వా చుకోప గణపుంగవః ॥
తతస్మిం శూలమాదాయ శర్వశక్తినిబర్హణమ్ ।
ఊర్ధ్వదృష్టిర్మహాబాహుర్ముఖాజ్జ్వాలాస్సముత్సృజన్ ॥
అమరానపి దుద్రావ ద్విరదానివ కేసరీ ।
తానభిద్రవతస్తస్య గమనం సుమనోహరమ్ ॥
వారణస్యేవ మత్తస్య జగామ ప్రేక్షణీయతామ్ ।
తతస్తత్ క్షోభయామాస మహత్సురబలం బలీ ॥
మహాసరోవరం యద్వన్మత్తో వారణయూథపః ।
వికుర్వన్ బహుధా వర్ణాన్నీలపాండరలోహితాన్ ॥
బిభ్రద్వ్యాఘ్రాజినం వాసో హేమప్రవరతారకమ్ ।
ఛిందన్ భిందన్నుద క్లిందన్ దారయన్ ప్రమథన్నపి ॥
వ్యచరద్దేవసంఘేషు భద్రో ఽగ్నిరివ కక్షగః ।
తత్ర తత్ర మహావేగాచ్చరంతం శూలధారిణమ్ ॥
తమేకం త్రిదశాస్సర్వే సహస్రమివ మేనిరే ।
భద్రకాలీ చ సంక్రుద్ధా యుద్ధవృద్ధమదోద్ధతా ॥
ముక్తజ్వాలేన శూలేన నిర్బిభేద రణే సురాన్ ।
స తయా రురుచే భద్రో రుద్రకోపసముద్భవః ॥
ప్రభయేవ యుగాంతాగ్నిశ్చలయా ధూమధూమ్రయా ।
భద్రకాలీ తదా యుద్ధే విద్రుతత్రిదశా బభౌ ॥
కల్పే శేషానలజ్వాలాదగ్ధవిశ్వజగద్యథా ।
తదా సవాజినం సూర్యం రుద్రాన్ రుద్రగణాగ్రణీః ॥
భద్రో మూర్ధ్ని జఘానాశు వామపాదేన లీలయా ।
అసిభిః పావకం భద్రః పట్టిశైస్తు యమం యమీ ॥

వాయువు ఇట్లు పలికెను –

అపుడు విష్ణువు, ఇంద్రుడు మొదలైన ఆ దేవప్రముఖులు అందరు భయభీతులై ఒక్కసారిగా కంగారుపడి పారిపోయిరి (1). తమ అవయవములు ఏవియు చెక్కు చెదరకుండగనే దేవతలు పారిపోవుచుండుటను గాంచి, గణాధ్యక్షుడగు వీరభద్రుడు శిక్షార్హులకు శిక్ష పడుట లేదని భావించి, కోపించేను (2). అపుడు గొప్ప బాహువులు గల వీరభద్రుడు సర్వలయకరుడగు రుద్రుని శక్తిని ప్రతిఫలించే త్రిశూలమును తీసుకొని, పైకి చూస్తూ నోటినుండి నిప్పులను గ్రక్కుచూ (3), సింహము ఏనుగులను వలె దేవతలను తరిమి గొట్టెను. పారిపోవుచున్న వారి వెనుక పరుగెత్తుచున్న ఆ వీరభద్రుని పరుగు మదించిన ఏనుగుయొక్క పరుగు వలె చాల సుందరముగా, మనోహరముగా నుండెను. తరువాత బలశాలియగు నీలము బూడిద రంగు మరియు ఎరుపు రంగుల కాంతులను వెదజల్లుతూ, ఏనుగుల గుంపునకు నాయకుడగు మహాగజము పెద్ద సరస్సును వలే, ఆ విశాలమైన దేవసైన్యమును కల్లోలపరచెను. బంగారముతో మరియు ముత్యములతో ప్రకాశించే పెద్దపులి చర్మమును వస్త్రముగా ధరించియున్న వీరభద్రుడు దేవతల గుంపులయందు నరుకుతూ, పగులగొడుతూ, రక్తధారలతో తడుపుతూ, చీల్చుచూ, పచ్చడి చేయుచూ, ఎండుగడ్డిని తగులబెట్టే అగ్నిహోత్రము వలె సంచరించెను. శూలమును చేతబట్టి అక్కడక్కడ మహావేగముతో సంచరించుచున్న వీరభద్రుడు ఒక్కడే అయిననూ, దేవతలకు వేయిమంది వీరభద్రులు ఉన్నట్లుగా కన్పట్టెను. అతిశయించిన బలగర్వముచే యుద్ధము కొరకు ఉరుకులు పెట్టుచున్న భద్రకాళి కూడ నిప్పులు గ్రక్కే శూలముతో యుద్ధమునందు దేవతలను చీల్చి చెండాడెను. రుద్రుని కోపమునుండి పుట్టిన వీరభద్రుడు భద్రకాళితో గూడి, చంచలము మరియు పొగతో కప్పబడి బూడిద రంగును కలిగియున్నది అగు జ్వాలతో ప్రకాశించే ప్రళయకాలాగ్ని వలె శోభిల్లెను. ఆ సమయములో యుద్ధములో దేవతలను తరిమి కొట్టిన భద్రకాళి కల్పాంతమునందు జగత్తునంతనూ తగులబెట్టే ఆదిశేషుని విషాగ్నిజ్వాలవలె ప్రకాశించెను. రుద్రగణములలో అగ్రేసరుడగు వీరభద్రుడు ఆ సమయములో గుర్రములతో సహా సూర్యుని మరియు రుద్రులను శీఘ్రముగా ఎడమకాలితో అవలీలగా తన్నెను. జితేంద్రియుడగు వీరభద్రుడు కత్తులతో అగ్నిని, పట్టిశములతో యముని కొట్టెను.

**రుద్రాన్ దృఢేన శూలేన ముద్గరైర్వరుణం దృఢైః ।**

**పరిఘైర్నిరృతిం వాయుం టంకైష్టంకధరస్స్వయమ్ ॥**

**నిర్బిభేద రణే వీరో లీలయైవ గణేశ్వరః ।**

**సర్వాన్ దేవగణాన్ సద్యో మునీన్ శంభోర్విరోధినః ॥**

**తతో దేవస్సరస్వత్యా నాసికాగ్రం సుశోభనమ్ ।**

**చిచ్ఛేద కరజాగ్రేణ దేవమాతుస్తథైవ చ ॥**

**చిచ్ఛేద చ కుఠారేణ బాహుదండం విభావసోః ।**

**అగ్రతో ద్వ్యంగులాం జిహ్వాం మాతుర్దేవ్యా లులావ చ ॥**

స్వాహాదేవ్యాస్తథా దేవో దక్షిణం నాసికాపుటమ్ ।
చకర్త కరజాగ్రేణ వామం చ స్తనచూచుకమ్ ॥
భగస్య విపులేనేత్రే శతపత్రసమప్రభే।
ప్రసహ్యోత్పాటయామాస భద్రః పరమవేగవాన్ ॥
పూష్ణో దశనరేఖాం చ దీప్తాం ముక్తావలీమివ ।
జఘాన ధనుషః కోట్యా స తేనాస్పష్టవాగభూత్ ॥
తతశ్చంద్రమసం దేవః పాదాంగుష్ఠేన లీలయా ।
క్షణం కృమివదాక్రమ్య ఘర్షయామాస భూతలే ॥
శిరశ్చిచ్ఛేద దక్షస్య భద్రః పరమకోపతః।
క్రోశంత్యామేవ వీరిణ్యాం భద్రకాల్యై దదౌ చ తత్ ॥
తత్ప్రహృష్టా సమాదాయ శిరస్తాలఫలోపమమ్ ।
సా దేవీ కందుకక్రీడాం చకార సమరాంగణే ॥

ఆయన గట్టి శూలముతో రుద్రులను, గట్టి ముద్గరములతో వరుణుని, పరిఘలతో నిర్ఋతిని(?), స్వయముగా గొడ్డళ్లను చేతపట్టి వాటితో వరుణుని కొట్టెను (14). వీరుడగు ఆ గణాధ్యక్షుడు యుద్ధములో సమస్తదేవతాగణములను మరియు శంభునకు విరోధులగు మునులను వెనువెంటనే అవలీలగా దునుమాడెను (15). ఇంతేగాక, తరువాత ఆ వీరభద్రదేవుడు దేవతలకు తల్లియగు సరస్వతియొక్క మిక్కిలి అందమైన ముక్కు కొనను వ్రేలిగోటితో త్రుంచివేసెను (16). ఆతడు అగ్నియొక్క దండమువంటి చేతిని గొడ్డలితో నరికెను. దేవమాతయగు అదితియొక్క నాలుకను కొనలో రెండు అంగుళములను ఆతడు త్రుంచివేసెను (17). ఇంతేగాక, ఆ వీరభద్రదేవుడు స్వాహాదేవియొక్క కుడి ముక్కుపుటమును, ఎడమ స్తనాగ్రమును వ్రేలిగోటితో దునిమి వేసెను (18). మహావేగము గల వీరభద్రుడు భగుని విశాలమైన పద్మపత్రములవలె ప్రకాశించే కన్నులను బలాత్కారముగా పెరికి వేసెను (19). ఆయన పూషయొక్క ముత్యాల వరుస వలె ప్రకాశించే దంతముల వరుసను ధనస్సుయొక్క అగ్రభాగముతో పగులగొట్టగా, ఆ కారణముగా ఆతని పలుకులలో స్పష్టత లోపించెను (20). తరువాత వీరభద్రదేవుడు కాలి బొటన వేలితో అవలీలగా క్షణకాలములో చంద్రుని పురుగును వలె తొక్కి పెట్టి నేలపై రాపాడించెను (21). వీరిణి (దక్షుని భార్య) ఆక్రోశించుచుండగా, వీరభద్రుడు మహాకోపముతో దక్షుని తలను దునుమాడి, దానిని భద్రకాళికి ఇచ్చెను (22). ఆ దేవి మహానందముతో తాటిపండువంటి ఆ తలను తీసుకొని యుద్ధరంగములో బంతులాటను ఆడెను.

తతో దక్షస్య యజ్ఞస్త్రీ కుశీలా భర్తృభిర్యథా ।
పాదాభ్యాం చైవ హస్తాభ్యాం హన్యతే స్మ గణేశ్వరైః ॥
అరిష్టనేమినం సోమం ధర్మం చైవ ప్రజాపతిమ్ ।
బహుపుత్రం చాంగిరసం కృశాశ్వం కాశ్యపం తథా ॥
గలే ప్రగృహ్య బలినో గణపాశ్సింహవిక్రమాః ।
భర్త్సయంతో భృశం వాగ్భిర్నిజఘ్నుర్మూర్ధ్ని ముష్టిభిః ॥

ధర్షితా భూతవేతాలైర్దారాస్నుతపరిగ్రహాః ।
యథా కలియుగే జారైర్బలేన కులయోషితః ॥
తచ్చ విధ్వస్తకలశం భగ్నయూపం గతోత్సవమ్ ।
ప్రదీపితమహాశాలం ప్రభిన్నద్వారతోరణమ్ ॥
ఉత్పాటితసురానీకం హన్యమానతపోధనమ్ ।
ప్రశాంతబ్రహ్మనిర్ఘోషం ప్రక్షీణ జనసంచయమ్ ॥
క్రందమానాతురస్త్రీ కం హతాశేషపరిచ్ఛదమ్ ।
శూన్యారణ్యనిభం జజ్ఞే యజ్ఞవాటం తదా ఽ ర్దితమ్ ॥
శూలవేగప్రరుగ్ణాశ్చ భిన్నబాహూరువక్షసః ।
వినికృత్తోత్తమాంగాశ్చ పేతురుర్వ్యాం సురోత్తమాః ॥
హతేషు తేషు దేవేషు పతితేషు సహస్రశః ।
ప్రవివేశ గణేశానః క్షణాదాహవనీయకమ్ ॥

తరువాత దక్షుని భార్యయగు సోమిదేవమ్మను, దుష్టమగు శీలము గల భార్యలను భర్తలు వలే, గణాధ్యక్షులు కాళ్లతో మరియు చేతులతో కొట్టిరి (24). బలవంతులు, సింహము యొక్క పరాక్రమము గలవారు నగు గణాధ్యక్షులు అరిష్టనేమిని, చంద్రుని, ధర్మ ప్రజాపతిని, అనేకపుత్రులు గల అంగిరసుని, కృశాశ్వుని మరియు కాశ్యపుని కంఠముందు పట్టుకొని లాగి పరుషమగు వాక్కులతో భయపెడుతూ, తలపై పిడికిళ్లతో మోదిరి (25). కలియుగమునందు విటులు కులస్త్రీ లను బలాత్కరించు విధముగనే, భూతములు మరియు వేతాళములు భార్యలను మరియు కోడళ్లను బలాత్కరించిరి (26). పగులగొట్టబడిన కలశములు గలది, విరుగగొట్ట బడిన యూపములు గలది, నశించిన పండుగ వాతావరణము గలది, తగులబెట్టబడిన ప్రధానశాల గలది, విరుగగొట్టబడిన ద్వారములు ఆర్చీలు గలది, పెకిలించి వేయబడిన దేవబృందములు గలది, చితకగొట్టబడిన తపశ్శాలురు గలది, సద్దు మణిగిన వేదఘోషలు గలది, చల్లారిన జనసమ్మర్దము గలది, పీడింపబడుచున్న స్త్రీల ఆక్రందనలతో నిండినది, పాడుచేయబడిన సకలసామగ్రి గలది అగు ఆ యజ్ఞవాటిక పీడకు గురియై అరణ్యము వలె శూన్యముగా నుండెను (27-30). శూలముచే వేగముగా పొడువబడిన నరుకబడిన చేతులు మరియు వక్షఃస్థలములు గలవారు, పెరికివేయబడిన తలలు గలవారు అగు దేవశ్రేష్ఠులు నేలపై పడియుండిరి (31). ఆ దేవతలు వేల సంఖ్యలో సంహరించబడి నేలపై బడియుండగా, క్షణకాలములో గణాధ్యక్షుడగు వీరభద్రుడు ఆహవనీయాగ్ని (హోమములను ప్రధానముగా చేసే అగ్ని; మూడు అగ్నులలో ఒకటి) వద్దకు వచ్చెను.

ప్రవిష్టమథ తం దృష్ట్వా భద్రం కాలాగ్నిసన్నిభమ్ ।
దుద్రావ మరణాద్భీతో యజ్ఞో మృగవపుర్ధరః ॥
స విస్ఫార్య మహచ్చాపం దృఢజ్యాఘోషభీషణమ్ ।
భద్రస్తమభిదుద్రావ విక్షిపన్నేవ సాయకాన్ ॥

ఆకర్ణపూర్ణమాకృష్టం ధనురంబుదసన్నిభమ్ ।
నాదయామాస చ జ్యాం ద్యాం ఖం చ భూమిం చ సర్వశః ॥
తముపశ్రుత్య సన్నాదం హతోఽస్మీత్యేవ విహ్వలమ్ ।
శరేణార్ధేన వక్రేణ స వీరో ఽ ధ్వరపూరుషమ్ ॥
మహాభయస్ఖలత్పాదం వేపంతం విగతత్విషమ్ ।
మృగరూపేణ ధావంతం విశిరస్కం తదా ఽ కరోత్ ॥
తమీదృశమవజ్ఞాతం దృష్ట్వా వై సూర్యసంభవమ్ ।
విష్ణుః పరమసంక్రుద్ధో యుద్ధాయాభవదుద్యతః ॥
తమువాహ మహావేగాత్ స్కంధేన నతసంధినా ।
సర్వేషాం వయసాం రాజా గరుడః పన్నగాశనః ॥
దేవాశ్చ హతశిష్టా యే దేవరాజపురోగమాః ।
ప్రచక్రుస్తస్య సాహాయ్యం ప్రాణాంస్త్యక్తుమివోద్యతాః ॥
విష్ణునా సహితాన్ దేవాన్ మృగేంద్రః క్రోష్టుకానివ ।
దృష్ట్వా జహాస భూతేంద్రో మృగేంద్ర ఇవ విస్మయః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే
దేవదండవర్ణనం నామ ఏకవింశోఽ ధ్యాయః.॥

యజ్ఞశాలలో ప్రవేశించిన ప్రళయకాలాగ్నిని బోలియున్న ఆ వీరభద్రుని చూచి మరణము వలన భయపడిన యజ్ఞపురుషుడు మృగదేహమును ధరించి పరుగెత్తెను (33). ఆ వీరభద్రుడు దృఢమైన నారిత్రాటియొక్క ధ్వనిచే భయమును కలిగించుచున్న పెద్ద ధనస్సును టంకారము చేయుచూ, పారిపోవుచున్న ఆ యజ్ఞపురుషుని వెనుక బాణములను ప్రయోగిస్తూనే పరుగెత్తెను (34). చెవి వరకు పూర్తిగా నారిత్రాటిని లాగి విడిచినప్పుడు ఆ ధనస్సు చేయు ధ్వని మేఘగర్జనను పోలియున్నది. నారిత్రాడు స్వర్గలోకము ఆకాశము మరియు భూమి అంతటా కంపించునట్లు చేయుచుండెను (35). ఆ పెద్ద ధ్వనిని విని తాను మరణించినానని యే నిశ్చయించుకొని భయకల్లోలితుడైన యజ్ఞపురుషుని ఆ వీరుడు ఒక అర్ధచంద్రాకారబాణముతో కొట్టెను (36). మహాభయముచే తొట్రుపాటు పడుచున్న పాదములు గలవాడై వణికి పోతూ, కాంతిని కోల్పోయి లేడి రూపములో పరుగిడుతున్న ఆ యజ్ఞపురుషుని తలను వీరభద్రుడు నరికివేసెను (37). సూర్యునినుండి పుట్టిన యజ్ఞపురుషుడు ఈ విధముగా అవమానింబడుటను గాంచిన విష్ణువు మహాకోపమును పొందినవాడై యుద్ధమునకు సన్నద్ధుడాయెను (38). సకలపక్షులకు రాజు, పాములను భక్షించువాడు అగు గరుడుడు వంగిన సంధి గల భుజముతో విష్ణువును మహావేగముగా మోయుచుండెను (39). దేవతలలో మరణించగా మిగిలిన వారు ఇంద్రుని ముందిడుకొని ప్రాణములను వీడుటకు సంసిద్ధులైనారా యన్నట్లు ఆ విష్ణువునకు సహాయపడుచుండిరి (40). రుద్రగణములకు అధిపతి, సింహము వంటివాడు అగు వీరభద్రుడు విష్ణువుతో కూడియున్న దేవతలను చూచి, నక్కలను చూచిన సింహము వలె భయము లేనివాడై, నవ్వెను.

# 22 - వీరభద్రుడు దేవతలతో యుద్ధమును చేయుట

వాయురువాచః

తస్మిన్నవసరే వ్యోమ్ని సమాప్రభవద్రథః ।
సహస్రసూర్యసంకాశశ్చారుచీరవృషధ్వజః ॥
అశ్వరత్నద్వయోదారో రథచక్రచతుష్టయః ।
సంచితానేకదివ్యాస్త్ర శస్త్ర రత్నపరిష్కృతః ॥
తస్యాపి రథవర్యస్యాసీత్స ఏవ హి సారథిః ।
యశ్చైవ త్రైపురే యుద్ధే పూర్వం శార్వరథే స్థితః ॥
స తం రథవరం బ్రహ్మా శాసనాదేవ శూలినః ।
హరేస్సమీపమానీయ కృతాంజలిరభాషత ॥
భగవన్ భద్ర భద్రాంగ భగవానిందుభూషణః ।
ఆజ్ఞాపయతి వీరస్త్వాం రథమారోఢుమవ్యయః ॥
రైభ్యాశ్రమసమీపస్థస్త్వంబికో ఽ బికయా సహ ।
సంపశ్యతే మహాబాహో దుస్సహం తే పరాక్రమమ్ ॥
తస్య తద్వచనం శ్రుత్వా స వీరో గణకుంజరః ।
ఆరురోహ రథం దివ్యమనుగృహ్య పితామహమ్ ॥
తథా రథవరే తస్మిన్ స్థితే బ్రహ్మణి సారథౌ ।
భద్రస్య వవృధే లక్ష్మీ రుద్రస్యేవ పురద్విషః ॥
తతశ్శంఖవరం దీప్తం పూర్ణచంద్రసమప్రభమ్ ।
ప్రదధ్మౌ వదనే కృత్వా భానుకంపో మహాబలః ॥
తస్య శంఖస్య తం నాదం భిన్నసాగరసన్నిభమ్ ।
శ్రుత్వా భయేన దేవానాం జజ్వాల జఠరానలః ॥

వాయువు ఇట్లు పలికెను -

ఆ సమయములో ఆకాశమునందు వేయి సూర్యుల కాంతి గలది, వృషభము చిహ్ననముగా గల అందమైన పతాకము గలది, రెండు శ్రేష్ఠమైన గుర్రములతో అద్భుతముగా నున్నది, నాలుగు రథచక్రములు గలది, అనేక దివ్యములైన శస్త్రాస్త్ర ముల గుట్టలు గలది, రత్నములతో అలంకరింప బడినది అగు రథము ఆవిర్భవించెను (1,2). పూర్వము త్రిపురాసురయుద్ధములో శివుని రథముపై ఎవరు సారథిగా కూర్చుండిరో, వారే ఇప్పుడు కూడ ఆ శ్రేష్ఠమగు రథములో సారథి స్థానములో నుండెను (3). శూలధారియగు శివుని శాసనముచేతనే బ్రహ్మ ఆ గొప్ప రథమును వీరభద్రుని వద్దకు తీసుకొని వచ్చి చేతులను జోడించి ఇట్లు పలికెను (4). ఓ భగవాన్! వీరభద్రా! మంగళకరమగు అవయవములు గలవాడా! వీరుడు, వినాశము లేనివాడు అగు చంద్రశేఖరభగవానుడు నిన్ను రథమునెక్కుమని

ఆదేశించుచున్నాడు (5). ఓ గొప్ప బాహువులు గలవాడా! ఆ ముక్కంటి రైభ్యుని ఆశ్రమమునకు దగ్గరలో జగన్మాతతో గూడి ఉన్నవాడై సహింప శక్యము కానీ నీ పరాక్రమమును చక్కగా చూచుచున్నాడు (6). వీరుడగు ఆ గణాధ్యక్షుడు బ్రహ్మయొక్క ఆ మాటలను విని ఆయనను అనుగ్రహించి ఆ దివ్యమగు రథమునధిష్ఠించెను (7). ఆ తీరున బ్రహ్మ సారథిగా గల ఆ శ్రేష్ఠమగు రథములో కూర్చున్న ఆ వీరభద్రుని శోభ త్రిపురాసురసంహారకుడగు రుద్రుని శోభవలె వర్ధిల్లెను (8). తరువాత మహాబలశాలి యగు భానుకంపుడు పూర్ణచంద్రునితో సమానముగా ప్రకాశించే గొప్ప శంఖమును నోటివద్ద నుంచి పూరించెను (9). దగ్గరకు చేరి కూర్చున్న సారసపక్షిని బోలియున్న ఆ శంఖముయొక్క ఆ నాదమును విని దేవతల జఠరములలోని అగ్ని భయముతో మండెను.

యక్షవిద్యాధరాహీంద్రైః సిద్ధైర్యుద్ధదిదృక్షుభిః ।
క్షణేన నిబిడీభూతాస్సాకాశవివరా దిశః ॥
తతశ్శార్ జ్గేణ చాపాంకాత్స నారాయణనీరదః ।
మహతా బాణవర్షేణ తుతోద గణగోవృషమ్ ॥
తం దృష్ట్వా విష్ణుమాయాంతం శతధా బాణవర్షిణమ్ ।
స చాదదే ధనుర్జైత్రం భద్రో బాణసహస్రముక్ ॥
తమాదాయ చ తద్దివ్యం ధనుస్సమరభైరవమ్ ।
శనైర్విస్ఫారయామాస మేరుం ధనురివేశ్వరః ॥
తస్య విస్ఫార్యమాణస్య ధనుషోఽ భూన్మహాస్వనః।
తేన స్వనేన మహతా పృథివీం సమకంపయత్ ॥
తతశ్శరవరం ఘోరం దీప్తమాశీవిషోపమమ్ ।
జగ్రాహ గణపః శ్రీమాన్స్వయముగ్రపరాక్రమః ॥
బాణోద్ధారే భుజో హ్యస్య తూణీవదనసంగతః।
ప్రత్యదృశ్యత వల్మీకం వివేక్షురివ పన్నగః ॥
సముద్ధృతః కరే తస్య తత్ క్షణం రురుచే శరః ।
మహాభుజంగసందష్టో యథా బాలభుజంగమః ॥
శరేణ ఘనతీవ్రేణ భద్రో రుద్రపరాక్రమః ।
వివ్యాధ కుపితో గాఢం లలాటే విష్ణుమవ్యయమ్ ॥
లలాటే ఽభిహతో విష్ణుః పూర్వమేవావమానితః ।
చుకోప గణపేంద్రాయ మృగేంద్రాయేవ గోవృషః ॥

యుద్ధమును చూడగోరే యక్షులతో, విద్యాధరులతో, నాగరాజులతో మరియు(?) సిద్ధులతో క్షణకాలములో దిక్కులయందలి ఆకాశభాగము మరియు సందులు గొందులు అన్నియు దట్టముగా నిండిపోయెను (11). అపుడు నారాయణుడు అనే మేఘము తన శార్జ్గము అనే ధనస్సు మధ్యనుండి విడువ బడిన పెద్ద బాణముల వర్షముచే గణములు అనే ఆవుల మరియు ఎద్దుల మందను ముంచెత్తి పీడించెను (12). వందల సంఖ్యలో బాణములను వర్షిస్తూ

వచ్చుచున్న ఆ విష్ణువును చూచి ఆ వీరభద్రుడు జయమును కలిగించే తన ధనస్సును స్వీకరించి వేల సంఖ్యలో బాణములను వర్షించెను (13). ఆతడు యుద్ధమునందు శత్రువులకు భయమును కలిగించే ఆ దివ్యధనస్సును తీసుకొని, ఈశ్వరుడు మేరుపర్వతమును ధనస్సుగా చేసుకొని దానిని టంకారము (నారిత్రాడును లాగి విడిచి పెట్టుట) చేసిన విధముగా, మెల్లగా టంకారము చేయజొచ్చెను (14). ఆ ధనస్సును టంకారము చేయుచుండగా పెద్ద ధ్వని బయలు దేరెను. ఆ పెద్ద ధ్వనిచే భూమి కంపించెను (15). శోభాయుక్తుడు, భయంకరమగు పరాక్రమము గలవాడు అగు ఆ గణాధ్యక్షుడు నాగుపామును బోలియున్న భయంకరముగా ప్రకాశించే శ్రేష్ఠమగు బాణమును చేతిలోనికి తీసుకొనెను (16). బాణమును చేతిలోనికి తీసుకొనుటకై అంబుల పొదిలోనికి చొరబడిన వీరభద్రుని భుజము కలుగులోనికి చొరబడ గోరుచున్న పాము వలే కానవచ్చెను (17). ఆతని చేతిలోనికి తీసుకొనబడిన బాణము అదే క్షణములో పెద్ద పాముచే కరవబడిన చిన్న పాము వలె ప్రకాశించెను (18). భయంకరమగు పరాక్రమము గల వీరభద్రుడు కోపించి బరువైన వాడి బాణముతో వినాశము లేని విష్ణువును లలాటమునందు గట్టిగా కొట్టెను (19). పూర్వములో అవమానింపబడియున్న విష్ణువు ఇప్పుడు లలాటమునందు కొట్టబడినవాడై, సింహముపై కోపించిన వృషభమువలె, ఆ గణాధ్యక్షునిపై కోపించెను.

తతస్స్వశనికల్పేన క్రూరాస్యేన మహేషుణా ।
వివ్యాధ గణరాజస్య భుజే భుజగసన్నిభే ॥
సోఽపి తస్య భుజే భూయస్సూర్యాయుతసమప్రభమ్ ।
వీససర్జ శరం వేగాద్వీరభద్రో మహాబలః ॥
స చ విష్ణుః పునర్భద్రం భద్రో విష్ణుం తథా పునః ।
స చ తం స చ తం విప్రాశ్శరైస్తావనుజఘ్నతుః ॥
తయోః పరస్పరం వేగాచ్ఛరానాశు విముంచతోః? ।
ద్వయోస్సమభవద్యుద్ధం తుములం రోమహర్షణమ్ ॥
తద్దృష్ట్వా తుములం యుద్ధం తయోరేవ పరస్పరమ్ ।
హాహాకారో మహానాసీదాకాశే ఖేచరేరితః ॥
తతస్స్వనలతుండేన శరేణాదిత్యవర్చసా ।
వివ్యాధ సుదృఢం భద్రో విష్ణోర్భహాతి వక్షసి ॥
స తు తీవ్రప్రపాతేన శరేణ దృఢమాహతః ।
మహతీం రుజమాసాద్య నిపపాత విమోహితః ॥
పునః క్షణాదివోత్థాయ లబ్ధసంజ్ఞస్తదా హరిః ।
సర్వాణ్యపి చ దివ్యాస్త్రాణ్యథైనం ప్రత్యవాసృజత్ ॥
స చ విష్ణుధనుర్ముక్తాన్ సర్వాన్ శర్వచమూపతిః ।
సహసా వారయామాస ఘోరైః ప్రతిశరైశ్శరాన్ ॥



తరువాత విష్ణువు వాడికొన గల పిడుగువంటి పెద్ద బాణముతో ఆ గణాధ్యక్షుని పామువంటి భుజమునందు కొట్టెను (21). మహాబలుడగు ఆ వీరభద్రుడు కూడ పదివేల సూర్యులతో సమానమగు కాంతి గల బాణముతో మరల వేగముగా ఆ విష్ణువుయొక్క భుజమునందు కొట్టెను (22). ఓ బ్రాహ్మణులారా! ఆ విష్ణువు మరల వీరభద్రుని, అదే విధముగా వీరభద్రుడు మరల విష్ణువును, ఈ విధముగా వారిద్దరు ఒకరినొకరు బాణములతో కొట్టుకొనిరి (23). ఒకరిపైనొకరు వేగముగా శీఘ్రముగా బాణములను ప్రయోగించుచున్న వారిద్దరికి శరీరములో గగుర్పాటును కలిగించే సంకులయుద్ధము కొనసాగెను (24). వారిద్దరు ఒకరితోనొకరు ఈ విధముగా ద్వంద్వయుద్ధమును సంకులముగా చేయుచుండగా, ఆకాశమునందు దేవతలు మొదలగు వారు బిగ్గరగా హాహాకారములను చేసిరి (25). తరువాత వీరభద్రుడు విష్ణువుయొక్క విశాలమగు వక్షఃస్థలమునందు కొననుండి నిప్పులను గ్రక్కే, సూర్యుని వలె ప్రకాశించే బాణముతో చాల గట్టిగా కొట్టెను (26). మహావేగముతో వచ్చి కొట్టిన ఆ బాణముచే గట్టిగా పీడింపబడిన ఆ విష్ణువు తీవ్రమగు నొప్పిని పొంది మూర్ఛిల్లి క్రింద పడెను (27). అపుడు విష్ణువు క్షణకాలములోనా యన్నట్లు శీఘ్రముగా మరల సంజ్ఞను పొంది లేచి నిలబడి, తరువాత ఈ వీరభద్రుని ఉద్దేశించి దివ్యములగు అస్త్రములను అన్నింటినీ ప్రయోగించెను (28). శివుని సేనలకు అధ్యక్షుడగు ఆ వీరభద్రుడు కూడ విష్ణువుయొక్క ధనస్సునుండి విడువబడిన బాణములనన్నింటినీ భయంకరమగు ఎదురు బాణములతో వెంటనే వారించెను.

**తతో విష్ణుస్స్వనామాంకం బాణమవ్యాహతం క్వచిత్ ।**
**ససర్జ క్రోధరక్తాక్షస్తముద్దిశ్య గణేశ్వరమ్ ।**
**తం బాణం బాణవర్షేణ భద్రో భద్రాహ్వయేన తు ॥**
**అప్రాప్తమేవ భగవాన్ చిచ్ఛేద శతధా పథి ।**
**అథైకేనేషుణా శార్ఙ్గం ద్వాభ్యాం పక్షౌ గరుత్మతః ॥**
**నిమేషాదేవ చిచ్ఛేద తదద్భుతమివాభవత్ ।**
**తతో యోగబలాద్విష్ణుర్దేహాద్దేవాన్ సుదారుణాన్ ॥**
**శంఖచక్రగదాహస్తాన్ విససర్జ సహస్రశః ।**
**సర్వాంస్తాన్ క్షణమాత్రేణ త్రైపురానివ శంకరః ॥**
**నిర్దదాహ మహాబాహుర్నేత్రసృష్టేన వహ్నినా ।**
**తతః క్రుద్ధతరో విష్ణుశ్చక్రముద్యమ్య సత్వరః ॥**
**తస్మిన్ వీరే సముత్స్రష్టుం తదానీముద్యతోఽభవత్ ।**
**తం దృష్ట్వా చక్రముద్యమ్య పురతస్సముపస్థితమ్ ॥**
**స్మయన్నివ గణేశానో వ్యష్టంభయదయత్నతః ।**
**స్తంభితాంగస్తు తచ్చక్రం ఘోరమప్రతిమం క్వచిత్ ॥**
**ఇచ్ఛన్నపి సముత్స్రష్టుం న విష్ణురభవత్ క్షమః ।**
**శ్వసన్నివైకముద్ధృత్య బాహుం చక్రసమన్వితమ్ ॥**

అతిష్ఠదలసో భూత్వా పాషాణమివ నిశ్చలః ।
నిశరీరో యథా జీవో నిశ్శృంగో వా యథా వృషః ॥
నిదంష్ట్ర శ్చ యథా సింహస్తథా విష్ణురవస్థితః ।
తం దృష్ట్వా దుర్దశాపన్నం విష్ణుమింద్రాదయస్సురాః ।
సమున్నద్ధా గణేంద్రేణ మృగేంద్రేణేవ గోవృషాః ॥
ప్రగృహీతాయుధా యోద్ధుం క్రుద్ధాస్సముపతస్థిరే।
తాన్ దృష్ట్వా సమరే భద్రః క్షుద్రానివ హరిర్మృగాన్ ॥

తరువాత కోపముతో ఎరుపెక్కిన కన్నులు గల విష్ణువు తన పేరు చెక్కబడియున్నది, ఎక్కడనైననూ ఇంతవరకు వ్యర్థము కానిది అగు బాణమును ఆ గణాధ్యక్షుని ఉద్దేశించి ప్రయోగించెను. వీరభద్ర భగవానుడు భద్రనామముతో చిహ్నితములైన బాణములను వర్షముగా కురిపించి ఆ బాణము తన వరకు వచ్చుటకు ముందే మార్గమునందు వంద ముక్కలుగా విరుగగొట్టెను. తరువాత, ఆయన ఒక బాణముతో శార్ఙ్గధనస్సును, రెండు బాణములతో గరుత్మంతుని రెక్కలను క్షణకాలములోననే నరికెను. అది అత్యద్భుత దృశ్యము ఆయెను. తరువాత విష్ణువు యోగబలముచే తన దేహమునుండి మిక్కిలి భయంకరాకారులు, చేతులలో శంఖమును చక్రమును గదను ధరించినవారు అగు దేవతలను వేల సంఖ్యలో సృష్టించెను. శంకరుడు త్రిపురాసురులను వలె గొప్ప బాహువులు గల వీరభద్రుడు తన కంటినుండి పుట్టిన అగ్నితో వారి నందరినీ క్షణకాలములో మాత్రమే పూర్తిగా దహించివేసెను. తరువాత విష్ణువు మరింత కోపించి వేగముగా చక్రమును పైకెత్తి అపుడా వీరునిపై ప్రయోగించుటకు సంసిద్ధుడాయెను. చక్రమును పైకెత్తి ఎదురుగా నిలబడియున్న ఆ విష్ణువును గాంచి, ఆ గణాధ్యక్షుడు చిరునవ్వు నవ్వుచున్న వాని వలె ప్రయత్నము లేకుండగనే విష్ణువు స్తంభించునట్లు చేసెను. స్తంభించబడిన అవయవములు గల విష్ణువు సాటి లేని ఆ భయంకరచక్రముతో ఎక్కడనైననూ కొట్టవలెనని తలపోసి, అట్లు చేయలేకపోయెను. చక్రముతో కూడియున్న ఒక చేతిని పైకి ఎత్తి ఉంచినవాడై విష్ణువు రొప్పుతున్నాడా యన్నట్లు కనబడెను. ఆయన నీరసముగా రాయి వలె కదలిక లేనివాడై నిలబడెను. ఆ విష్ణువు శరీరము లేని జీవుని వలే, కొమ్ములు లేని ఎద్దు వలె, కోరలు లేని సింహము వలె నిలబడి యుండెను. ఈ విధముగా దుర్దశను పొందియున్న ఆ విష్ణువును చూచి ఇంద్రుడు మొదలగు దేవతలు, వృషభములు సింహముతో వలె, గణాధ్యక్షుడగు వీరభద్రునితో పోరునకు తలపడిరి (30-39). వారు కోపించి ఆయుధములను చేతబట్టి ముందుకు వచ్చిరి. వీరభద్రుడు ఆ యుద్ధములో వారిని, సింహము చిన్న చిన్న లేళ్లను చూచినట్లు చూచెను.

సాక్షాద్రుద్రతనుర్వీరో వరవీరగణావృతః ।
అట్టహాసేన ఘోరేణ వ్యష్టంభయదనిందితః ॥
తథా శతమఖస్యాపి సవజ్రో దక్షిణః కరః ।
సిస్సృక్షోరేవ ఉద్యమ్యం చిత్రీకృత ఇవాభవత్ ॥

అన్యేషామపి సర్వేషాం సరక్తా అపి బాహవః।
అలసానామివారంభాస్తాదృశాః ప్రతియాంత్యుత ॥
ఏవం భగవతా తేన వ్యాహతాశేషవైభవాత్ ।
అమరాస్సమరే తస్య పురతః స్థాతుమక్షమాః ॥
స్తబ్ధైరవయవైరేవ దుద్రువుర్భయవిహ్వలాః ।
స్థితిం న చక్రిరే యుద్ధే వీరతేజోభయాకులాః ॥
విద్రుతాంస్త్రి దశాన్ వీరాన్ వీరభద్రో మహాభుజః ।
వివ్యాధ నిశితైర్బాణైర్మేఘో వర్షైరివాచలాన్ ॥
బహవస్తస్య వీరస్య బాహవః పరిఘోపమాః ।
శస్త్రై ః చకాశిరే దీప్తైస్సాగ్నిజ్వాలా ఇవోరగాః ॥
అస్త్ర శస్త్రా ణ్యనేకాని స వీరో విసృజన్ బభౌ ।
విసృజన్ సర్వభూతాని యథాదౌ విశ్వసంభవః ॥
యథా రశ్మిభిరాదిత్యః ప్రచ్ఛాదయతి మేదినీమ్ ।
తథా వీరః క్షణాదేవ శరైః ప్రాచ్ఛాదయద్దిశః ॥
ఖమండలే గణేంద్రస్య శరాః కనకభూషితాః ।
ఉత్పతంతస్తడిద్రూపైరుపమానపదం యయుః ॥
మహాంతస్తే సురగణాన్ మండూకానివ డుండుభాః ।
ప్రాణైర్వియోజయామాసుః పపుశ్చ రుధిరాసవాన్ ॥

సాక్షాత్తుగా రుద్రస్వరూపుడు, శ్రేష్టుడు మరియు వీరులు అగు గణములచే చుట్టువారబడి యున్నవాడు, దోషములు లేనివాడు అగు ఆ వీరుడు భయంకరమగు అట్టహాసమును చేసి వారిని స్తంభింపజేసెను (41). అదే విధముగా ఇంద్రుడు కుడి చేతిలో వజ్రమును పట్టుకొని దానిని ప్రయోగించుటకు సంసిద్ధుడగుచుండగనే, చిత్రపటమునందలి బొమ్మ వలె కదలిక లేనివాడై నిలబడెను (42). ఇంతేగాక, ఇతరులందరి చేతులు రక్తమాంసములు కలవియే అయిననూ, సోమరిపోతుల కార్యక్రమముల వలె, కదలిక లేనివి ఆయెను (43). ఈ విధముగా ఆ వీరభద్ర భగవానునిచే కొట్టివేయబడిన సమస్తవైభవములు గలవారగుటచే దేవతలు యుద్ధమునందు ఆయన యెదుట నిలబడ లేకపోయిరి (44). వారు భయముతో కంగారు పడి స్తంభించియున్న అవయవములతోనే పరుగిడిరి; వీరుని తేజస్సునకు భయపడి కంగారుతో వారు యుద్ధమునందు నిలబడ లేదు (45). గొప్ప భుజములు గల వీరభద్రుడు పారిపోవుచున్న వీరులగు దేవతలను వాడి బాణములతో, మేఘము పర్వతములను వర్షజలములతో వలె, కొట్టెను (46). ఆ వీరుని పరిఘలవంటి అనేకములగు బాహువులు ప్రకాశించే ఆయుధములతో అగ్నిజ్వాలలను గ్రక్కే పాములవలె ప్రకాశించినవి (47). ఆ వీరుడు అనేకములగు అస్త్రములను, శస్త్రములను విడిచి పెడుతూ, సృష్ట్యాదియందు సకలప్రాణులను సృజించుచున్న బ్రహ్మవలె ప్రకాశించెను (48). సూర్యుడు భూమిని కిరణములతో కప్పి వేయు విధముగా, వీరభద్రుడు కేవలము క్షణకాలములో దిక్కులను బాణములతో కప్పి వేసెను (49). బంగారముతో అలంకరింపబడిన

వీరభద్రుని బాణములు ఆకాశమండలములో ఎగురుచున్నవై మెరుపులను బోలియుండెను (50). ఆ గొప్ప బాణములు, నీటిపాములు కప్పలను వలే, దేవతాగణముల ప్రాణములనపహరించి, వారి రక్తము అనే ఆసవమును త్రాగెను.

నికృత్తబాహవః కేచిత్కేచిల్లూనవరాననాః ।
పార్శ్వే విదారితాః కేచిన్నిపేతురమరా భువి ॥
విశిఖోన్మథితైర్గాత్రై ర్వ్యాహుఖశ్ఛిన్నసంధిభిః ।
వివృత్తనయనాః కేచిన్ని పేతుర్భూతలే మృతాః ।
గాం ప్రవేష్టుమివేచ్ఛంతః ఖం గంతుమివ లిప్సవః ॥
అలబ్ధాత్మనిరో ధానాం వ్యలీయంతః పరస్పరమ్ ।
భూమౌ కేచిత్ప్ర వివిశుః పర్వతానాం గుహాః పరే ॥
అపరే జగ్మురాకాశం పరే చ వివిశుర్జలమ్ ।
తథా సంఛిన్నసర్వాంగైస్స వీరస్తి దశైర్బభౌ ॥
పరిగ్రస్తప్రజావర్గో భగవానివ భైరవః ।
దగ్ధత్రిపురసంపృ్యహస్తి పురారిర్యథాభవత్ ॥
ఏవం దేవబలం సర్వం దీనం బీభత్సదర్శనమ్ ।
గణేశ్వరసముత్పన్నం కృపణం వపురాదదే ॥
తదా త్రిదశవీరాణామసృక్కులిలవాహినీ ।
ప్రావర్తత నదీ ఘోరా ప్రాణినాం భయశంసినీ ॥
రుధిరేణ పరిక్లిన్నా యజ్ఞభూమిస్తదా బభౌ ।
రక్తార్ద్ర వసనా శ్యామా హతశుంభేవ కౌశికీ ॥
తస్మిన్ మహతి సంవృత్తే సమరే భృశదారుణే ।
భయేనేవ పరిత్రస్తా ప్రచచాల వసుంధరా ॥
మహోర్మికలిలావర్తశ్చుక్షుభే చ మహోదధిః ।
పేతుశ్చోల్కా మహోత్పాతాశ్శాఖాశ్చ ముముచుర్ద్రు మాః ॥
అప్రసన్నా దిశస్సర్వాః పవనశ్చాశివో వవౌ ।
అహో విధివిపర్యాసస్త్వశ్వమేధోయమధ్వరః ।
యజమానస్స్వయం దక్షో బ్రహ్మపుత్రః ప్రజాపతిః ॥

కొందరి చేతులు తెగినవి. కొందరి అందమగు ముఖములు చీలి పోయినవి, కొం◌ొందరు దేవతలు చీల్చబడిన ప్రక్క భాగములు కలవారై నేల గూలిరి (52), బాణములచే పొడిచి వేయ బడిన అవయవములు, తెగ కొట్టబడిన బాహువుల కీళ్లు గల అనేకులు నేల గూలిరి. కొందరు పెరికి వేయబడిన కన్నులు గలవారై మరణించి నేల గూలిరి. కొందరు భూమి లోనికి చొచ్చుకు పోవ గోరుచున్నవారు వలే, మరికొందరు ఆకాశమును స్పృశించ గోరుచున్నవారు వలె నుండిరి (53). ప్రాణములు పోయి ఉండుటచే ఒక దేహము మరియొక దేహమునకు ఆటంకము అగుట లేదు. దేహములు ఒక దానితో మరియొకటి

కలిసి యున్నవి. కొందరు భూమియందు ప్రవేశించగా, మరి కొందరు పర్వతగుహలలో దాగిరి (54). కొందరు ఆకాశమునకు ఎగురగా, మరికొందరు జలములో ప్రవేశించిరి. ఆ విధముగా ఆ వీరుడు చీల్చబడిన సర్వావయవములు గల దేవతలతో గూడి ప్రకాశించెను (55). ఆతడు జనసమూహమును తన గుప్పెటలో పెట్టుకున్న భైరవుని వలె, త్రిపురముల చక్కని వ్యూహమును తగులబెట్టిన శివుని వలె ఉండెను (56). ఈ విధముగా దేవసైన్యము అంతయు దీనముగా, బీభత్సముగా కానవచ్చెను. ఆ సైన్యము గణాధ్యక్షుడగు వీరభద్రునిచే చేయబడిన దీనమైన రూపమును కలిగి యుండెను (57). అపుడు దేవవీరుల ఘోరమగు రక్తపు నది ప్రాణులకు భయమును సూచించుచున్నదై ప్రవహించెను (58). అపుడు యజ్ఞవాటిక అంతటా రక్తముతో తడిసి, శుంభుని సంహరించి రక్తముతో తడిసిన వస్త్రముతో నల్లని దేహవర్ణముతో నున్న కౌశిక వలె ప్రకాశించెను (59). మిక్కిలి దారుణమైన ఆ గొప్ప యుద్ధము జరుగుచుండగా, భూమి భయపడుచున్నదా యన్నట్లు కంపించెను (60). సముద్రము పెద్ద తరంగములతో నురగలతో సుడి గుండములతో అల్లకల్లోలముగా నుండెను. పెద్ద ఆపదను సూచిస్తూ ఉల్కలు పడినవి. చెట్లు కొమ్మలను రాల్చినవి (61). దిక్కులు అన్నియు ధూళితో నిండినవి. వాయువు అమంగళకరముగా వీచెను. ఆహా! విధి పరిస్థితిని తారుమారు చేసినది. ఇది అశ్వమేధ యాగము. బ్రహ్మపుత్రుడు, ప్రజాపతి అగు దక్షుడు స్వయముగా యజమానుడు.

ధర్మాదయస్స్వదస్యాశ్చ రక్షితా గరుడధ్వజః ।

భాగాంశ్చ ప్రతిగృహ్ణంతి సాక్షాదింద్రాదయస్సురాః ॥

తథాపి యజమానస్య యజ్ఞస్య చ సహర్త్విజః ।

సద్య ఏవ శిరశ్ఛేదస్సాధు సంపద్యతే ఫలమ్ ॥

తస్మాన్నావేదనిర్దిష్టం న చేశ్వరబహిష్కృతమ్ ।

నాసత్పరిగృహీతం చ కర్మ కుర్యాత్కదాచన ॥

కృత్వాపి సుమహత్పుణ్యమిష్ట్వా యజ్ఞశతైరపి ।

న తత్ఫలమవాప్నోతి భక్తిహీనో మహేశ్వరే ॥

కృత్వాపి సుమహత్పాపం భక్త్యా యజతి యశ్శివమ్ ।

ముచ్యతే పాతకైస్సర్వైర్నాత్ర కార్యా విచారణా ॥

బహునాత్ర కిముక్తేన వృథా దానం వృథా తపః ।

వృథా యజ్ఞో వృథా హోమశ్శివనిందారతస్య తు ॥

తతస్సనారాయణకాస్సురు ద్రాస్సలో కపాలాస్సమరే సురౌఘాః ।

గణేంద్రచాపచ్యుతబాణవిద్ధాః ప్రదుద్రువుర్గాఢరుజాభిభూతాః ॥

చేలుః క్వచిత్కేచన శీర్ణకేశాస్స్వేదుః క్వచిత్కేచన దీర్ఘగాత్రాః ।

పేతుః క్వచిత్కేచన భిన్నవక్త్రా నేశుః క్వచిత్కేచన దేవవీరాః ॥

కేచిచ్చ తత్ర త్రిదశా విపన్నా విస్రస్తవస్త్రా భరణాస్త్ర శస్త్రాః ।
నిపేతురుద్ధాసితదీనముద్రా మదం చ దర్పం చ బలం చ హిత్వా ॥
సముత్పథప్రస్థితమప్రధృష్యో విక్షిప్య దక్షాధ్వరమక్షతాస్త్రః ।
బభౌ గణేశస్స గణేశ్వరాణాం మధ్యే స్థితస్సింహ ఇవర్షభాణామ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే దక్షయజ్ఞ
విధ్వంసవర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥

ధర్ముడు మొదలగు వారు సభాసదులు. గరుడవాహనుడగు విష్ణువు రక్షకుడు. ఇంద్రుడు మొదలగు దేవతలు ప్రత్యక్షముగా హవిర్భాగములను స్వీకరించు వారు (63). అయినప్పటికీ యజమానునకు, యజ్ఞమునకు, ఋత్విక్కులకు వెను వెంటనే తల నరకబడుట అనే ఫలము లభించు చున్నది. బాగున్నది! (64) కావున, వేదముచే విధింపబడనిది, ఈశ్వరునిచే బహిష్కరించబడినది, పాపాత్ములచే స్వీకరించ బడినది అగు కర్మను ఏ కాలమునందైననూ చేయరాదు (65). మహాపుణ్యమును చేసిననూ, వందలాది యజ్ఞములను చేసిననూ, మహేశ్వరుని యందు భక్తి లేనివానికి ఆ ఫలము లభించదు (66). మహాపాపమును చేసిననూ ఎవడైతే భక్తితో శివుని పూజించునో, వాడు సకలపాపములనుండి విముక్తుడగును. ఈ విషయములో శంకకు అవకాశము లేదు (67). అధికప్రసంగమేల? శివుని నిందించుటయందు ప్రీతి గల వ్యక్తి చేసే దానము, తపస్సు, యజ్ఞము మరియు హోమము వ్యర్థము (68). తరువాత నారాయణుడు, రుద్రులు, లోకపాలకులు అను వారితో కూడియున్న దేవసంఘములు యుద్ధములో గణాధ్యక్షుడగు వీరభద్రుని ధనస్సునుండి విడువబడిన బాణములచే కొట్టబడినవారై తీవ్రమగు బాధకు తాళజాలక పారిపోయిరి (69). కొందరు కొన్ని చోట్ల చెల్లాచెదరైన జుట్టు గలవారై వణుకుచుండిరి, పెద్ద దేహములు గల కొందరు కొన్ని చోట్ల కూలబడిరి. దీనిన ముఖములు గల కొందరు కొన్ని చోట్ల పడి పోయిరి. దేవవీరులగు కొందరు కొన్ని చోట్ల మరణించిరి (70). జారిపోయిన వస్త్రములు, ఆభరణములు, అస్త్రములు మరియు శస్త్రములు గల కొందరు దేవతలు అచట గొప్ప ఆపదను పొంది దైన్యముతో నిండిన ముఖకవళికలు కొట్టవచ్చినట్లు కానవచ్చుచుండగా, గర్వమును స్వాభిమానమును బలమును పరిత్యజించి అచట పడియుండిరి (71). పరాజయమునెరుంగని ఆ గణాధ్యక్షుడగు వీరభద్రుడు తప్పు దారిలో ఆరంభమైన దక్షయజ్ఞమును మొక్కవోని అస్త్రములతో ధ్వంసము చేసి, ఇతరగణాధ్యక్షుల మధ్యలో వృషభముల మధ్యలోని సింహము వలె ప్రకాశించెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో దక్షయజ్ఞవిధ్వంసమును వర్ణించే ఇరువది రెండవ అధ్యాయము ముగిసినది.

# 23 - దేవతలు శివుని అనునయించుట

వాయురువాచ ।

ఇతి సంభిన్నభిన్నాంగా దేవా విష్ణుపురోగమాః ।
క్షణాత్కష్టాం దశామేత్య త్రేసుః స్తోకావశేషితాః ॥
త్రస్తాంస్తాన్ సమరే వీరాన్ దేవానన్యాంశ్చ వై గణాః ।
ప్రమథాః పరమక్రుద్ధా వీరభద్రప్రణోదితాః ॥
ప్రగృహ్య చ తథా దోషం నిగడైరాయసైర్దృఢైః ।
బబంధుః పాణిపాదేషు కంధరేషూదరేషు చ ॥
తస్మిన్నవసరే బ్రహ్మా భద్రమద్రీంద్రజాసుతమ్ ।
సారథ్యాల్లబ్ధవాత్సల్యః ప్రార్థయన్ ప్రణతోఽబ్రవీత్ ॥
అలం క్రోధేన భగవన్నష్టాశ్చైతే దివౌకసః ।
ప్రసీద క్షమ్యతాం సర్వం రోమజైస్సహ సువ్రత ॥
ఏవం విజ్ఞాపితస్తేన బ్రహ్మణా పరమేష్ఠినా ।
శమం జగామ సంప్రీతో గణపస్తస్య గౌరవాత్ ॥
దేవాశ్చ లబ్ధా వసరా దేవదేవస్య మంత్రిణః।
ధారయంతోఽంజలీన్మూర్ధ్ని తుష్టువుర్వివిధైః స్తవైః ॥

వాయువు ఇట్లు పలికెను –

ఈ విధముగా విష్ణువు మొదలగు దేవతలు ఛిన్నాభిన్నము గావింపబడిన అవయవములు గలవారై క్షణకాలములో కష్టస్థితిని పొంది భయపడుచుండిరి. వారు కొద్ది మంది మాత్రమే మిగిలి యుండిరి (1). వీరభద్రునిచే ప్రోత్సహించబడి మిక్కిలి కోపమును పొంది యున్న ప్రమథగణములు యుద్ధములో భయపడియున్న ఆ దేవవీరులను మరియు ఇతరులను (2) బలాత్కారముగా పట్టుకొని, దోషమును చేసియున్న ఆ దేవతల చేతులను, కాళ్లను, భుజములను, ఉదరములను దృఢమైన ఇనుప సంకెళ్లతో బంధించిరి (3). ఆ సమయములో సారథి కార్యమును చేసి ప్రేమను సంపాదించి యున్న బ్రహ్మ పార్వతీపుత్రుడగు వీరభద్రునకు నమస్కరించి ప్రార్థిస్తూ ఇట్లు పలికెను (4). ఓ పూజ్యా! కోపమును చాలించుము. ఈ దేవతలు నశించి యున్నారు. ఓ గొప్ప వ్రతము గలవాడా! ప్రసన్నుడవు కమ్ము, రోమములనుండి పుట్టిన గణములతో కూడియున్న నీవు అందరినీ క్షమించుము (5). పరమేష్ఠియగు బ్రహ్మ ఈ విధముగా విన్నవించగా, మిక్కిలి ప్రీతిని పొందిన ఆ గణాధ్యక్షుడు ఆయనయందలి గౌరవముచే శాంతించెను (6). దేవదేవుడగు వీరభద్రునకు సలహాను ఇచ్చిన బ్రహ్మ ద్వారా ఈ అవకాశమును పొందియున్న దేవతలు దోసిళ్లను శిరస్సులపై దాల్చి వివిధస్తోత్రములతో స్తుతించిరి.

దేవా ఊచుః ।

నమశ్శివాయ శాంతాయ యజ్ఞహంత్రే త్రిశూలినే ।
రుద్రభద్రాయ రుద్రాణాం పతయే రుద్రభూతయే ॥
కాలాగ్నిరుద్రరూపాయ కాలకామాంగహారిణే ।
దేవతానాం శిరోహంత్రే దక్షస్య చ దురాత్మనః ॥
సంసర్గాదస్య పాపస్య దక్షస్యాక్లిష్టకర్మణః ।
శాసితాస్సమరే వీర త్వయా వయ మనిందితాః ॥
దగ్ధాశ్చామీ వయాం సర్వే త్వత్తో భీతాశ్చ భో ప్రభో ।
త్వమేవ గతిరస్మాకం త్రాహి నశ్శరణాగతాన్ ॥

దేవతలు ఇట్లు పలికిరి -

శాంతమూర్తియగు శివునకు నమస్కారము. త్రిశూలమును చేతబట్టి యజ్ఞమును వినాశము చేసినవాడు, రుద్రునకు ఆనందమును, కలిగించువాడు, రుద్రులకు ప్రభువు, రుద్రుని మహిమతో కూడినవాడు, ప్రళయకాలమునందలి అగ్నియొక్క రూపము గలవాడు, కాలమునకు అతీతుడై కాముని సంహరించిన శివుని స్వరూపమైన వాడు, దేవతల శిరస్సులను మరియు దక్షుని శిరస్సును నరికినవాడు అగు వీరభద్రునకు నమస్కారము (8, 9). ఓ వీరా! మేము దోషము లేనివారమే అయిననూ, అయోగ్యమగు పనులను చేసే పాపాత్ముడగు ఈ దక్షుని సహవాసము వలన నీచే యుద్ధములో శిక్షించ బడితిమి (10). మమ్ములనందరినీ నీవు దహించి వేసితివి. ఓ ప్రభూ! మేము నీ వలన భయపడుచున్నాము. నీవే మాకు గతి. శరణు పొందిన మమ్ములను రక్షించుము.

వాయురువాచః

తుష్టస్త్వేవం స్తుతో దేవాన్ విసృజ్య నిగడాత్ప్రభుః ।
ఆనయద్దేవదేవస్య సమీపమమరానిహ ॥
దేవోఽపి తత్ర భగవానంతరిక్షే స్థితః ప్రభుః ।
సగణస్సర్వగశ్శర్వస్సర్వలోకమహేశ్వరః ॥
తం దృష్ట్వా పరమేశానం దేవా విష్ణుపురోగమాః।
ప్రీతా అపి చ భీతాశ్చ నమశ్చక్రుర్మహేశ్వరమ్ ॥
దృష్ట్వా తానమరాన్ భీతాన్ ప్రణతార్తిహరో హరః ।
ఇదమాహ మహాదేవః ప్రహసన్ ప్రేక్ష్య పార్వతీమ్ ॥

వాయువు ఇట్లు పలికెను -

ఈ విధముగా దేవతలు స్తుతించగా ఆ వీరభద్రప్రభుడు సంతసించి వా[illegible]రిని సంకెళ్లనుండి విడిపించి కైలాసములో దేవదేవుడగు శివుని వద్దకు తీసుకొని వచ్చెను (12). ప్రకాశస్వరూపుడు, దేవతలకు ప్రభువు, గణములతో కూడి యున్నవాడు, సర్వవ్యాపకుడు, సర్వలోకములకు గొప్ప శాసకుడు అగు ఆ శివభగవానుడు కూడ అచట అంతరిక్షమునందు ఉండెను (13). విష్ణువు మొదలగు

దేవతలు ఆ పరమేశ్వరుడగు మహేశ్వరుని చూచి ప్రీతిని పొందినవారే అయిననూ భయపడినవారై నమస్కరించిరి (14). నమస్కరించిన వారి కష్టములను పోగొట్టే మహాదేవుడగు ఆ శివుడు భయపడియున్న ఆ దేవతలను చూచి చిరునవ్వుతో పార్వతిని చూచి ఇట్లు పలికెను.

**మహాదేవ ఉవాచః**

**మా భైష్ట త్రిదశాస్సర్వే యూయం వై మామికాః ప్రజాః ।**
**అనుగ్రహార్థమేవేహ ధృతో దండః కృపాలునా ॥**
**భవతాం నిర్జరాణాం హి క్షాంతోఽస్మాభిర్వ్యతిక్రమః ।**
**క్రుద్ధేష్వస్మాసు యుష్మాకం న స్థితిర్న చ జీవితమ్ ॥**

మహాదేవుడు ఇట్లు పలికెను -

ఓ దేవతలారా! మీరు భయపడకుడు. మీరందరు నా సంతానమే. దయామయుడనగు నేను(ు) మిమ్ములను అనుగ్రహించుట కొరకు మాత్రమే శిక్షను వేసితిని (16). దేవతలగు మీరు చేసిన తప్పిదమును మేము క్షమించితిమి. మేము కోపించినచో మీరు నిలబడ లేరు. మీకు బ్రతుకులు ఉండవు.

**వాయురువాచః**

**ఇత్యుక్తాస్త్రి దశాస్సర్వే శర్వేణామితతేజసా ।**
**సద్యో విగతసందేహా నన్నృతుర్విబుధా ముదా ॥**
**ప్రసన్నమనసో భూత్వానందవిహ్వలమానసాః ।**
**స్తుతిమారేభిరే కర్తుం శంకరస్య దివౌకసః ॥**

వాయువు ఇట్లు పలికెను -

సాటిలేని తేజస్సు గల శివుడు ఇట్లు పలుకగా నిత్యయౌవనులగు దేవతలందరు వెనువెంటనే తొలగిన సందేహములు గలవారై ఆనందముతో నాట్యమాడిరి (18). ఆనందముతో నిండిపోయి కంగారు పడుతున్న మనస్సులు గల ఆ దేవతలు మనస్సులలో ప్రసన్నతను నింపుకొని శంకరుని స్తుతించుటకు ఆరంభించిరి.

**దేవా ఊచుః ।**

**త్వమేవ దేవాఖిలలోకకర్తా పాతా చ హర్తా పరమేశ్వరోఽసి ।**
**కవిష్ణురుద్రాఖ్యస్వరూపభేదై రజస్తమస్సత్త్వధృతాత్మమూర్తే ॥**
**సర్వమూర్తే నమస్తేస్తు విశ్వభావన పావన ।**
**అమూర్తే భక్త హేతోర్హి గృహీతాకృతిసౌఖ్యద ॥**
**చంద్రోఽగదో హి దేవేశ కృపాతస్తవ శంకర ।**
**నిమజ్జనాన్మృతః ప్రాప సుఖం మిహిరజాజలే ॥**
**సీమంతినీ హతధవా తవ పూజనతః ప్రభో ।**
**సౌభాగ్యమతులం ప్రాప సోమవారవ్రతాత్సుతాన్ ॥**

శ్రీకరాయ దదౌ దేవస్స్వీయం పదమనుత్తమమ్ ।
సుదర్శనమరక్షస్త్వం నృపమండలభీతితః ॥
మేదురం తారయామాస సదారం చ ఘృణానిధిః ।
శారదాం విధవాం చక్రే సధవాం క్రియయా భవాన్ ॥
భద్రాయుషో విపత్తిం చ విచ్ఛిద్య త్వమదాస్సుఖమ్ ।
సామినీ భవబంధాద్వై ముక్తాఽభూత్తవ సేవనాత్ ॥

దేవతలు ఇట్లు పలికిరి –

ఓ దేవా! లోకములనన్నింటినీ సృష్టించి పాలించి సంహరించే పరమేశ్వరుడవు నీవే. ఆత్మస్వరూపుడవగు ఓ దేవా! నీవు రజస్సత్త్వతమోగుణములను స్వీకరించి క్రమముగా బ్రహ్మ విష్ణురుద్రరూపములను దాల్చితివి (20). విశ్వమును సృష్టించే ఓ దేవా! సర్వము నీ స్వరూపమే. పావనుడవగు నీకు నమస్కారమగుగాక! రూపము లేని నీవు భక్తుల కొరకై రూపములను దాల్చి సౌఖ్యముల నొసంగెదవు (21). ఓ దేవదేవా! శంకరా! నీ దయచే చంద్రుడు రోగవిముక్తుడైనాడు. మరణించ బోయే చంద్రుడు యమునానదిలో స్నానమును చేసి సుఖమును పొందెను (22). ఓ ప్రభూ! భర్తను పోగొట్టుకున్న సీమంతిని సోమవారవ్రతమును చేసి నిన్ను పూజించి సాటిలేని సౌభాగ్యమును పుత్రులను పొందెను (23). శివప్రభుడు శ్రీకరునకు తన సర్వోత్కృష్టమగు స్థానమును ఇచ్చెను. రాజుల సమూహము వలన భయమును పొందియున్న సుదర్శనుని నీవు రక్షించితివి (24). దయానిధివగు నీవు మేదురుని భార్యతో సహా గట్టెక్కించితివి. నీవు నీ కర్మచే శారదయొక్క భర్తకు ప్రాణభిక్షను పెట్టి ఆమె మాంగల్యమును కాపాడితివి (25). నీవు భద్రాయుషుని ఆపదను పోగొట్టి సుఖము నిచ్చితివి. సామిని నిన్ను సేవించి సంసారబంధమునుండి విముక్తిని పొందెను.

విష్ణు రువాచః

త్వం శంభో కపాలీశాశ్చ రజస్సత్త్వతమోగుణైః ।
కర్తా పాతా తథా హర్తా జనానుగ్రహకాంక్షయా ॥
సర్వగర్వాపహారీ చ సర్వతేజో విలాసకః ।
సర్వవిద్యాదిగూఢశ్చ సర్వానుగ్రహకారకః ॥
త్వత్తస్సర్వం చ త్వం సర్వం త్వయి సర్వం గిరీశ్వర ।
త్రాహి త్రాహి పునస్త్రాహి కృపాం కురు మమోపరి ॥
అథాస్మిన్నంతరే బ్రహ్మా ప్రణిపత్య కృతాంజలిః ।
ఏవం త్వవసరం ప్రాప్య వ్యజ్ఞాపయత శూలినే ॥

విష్ణువు ఇట్లు పలికెను –

ఓ శంభూ! నీవు జనులను అనుగ్రహించ గోరి రజస్సత్త్వతమోగుణముల ద్వారా బ్రహ్మ వి(ష్ణు)ష్ణురుద్రరూపుడవై సృష్టించి పాలించి ఉపసంహరించు చున్నావు (27). అందరి గర్వమును పోగొట్టువాడవు, సర్వవిధముల తేజస్సుల విలాసములు

గలవాడవు, సర్వవిద్యలు మొదలగు వాటికి నిగూఢమగు నిధానమైనవాడవు అగు నీవు అందరినీ అనుగ్రహించు చున్నావు (28). ఓ కైలాసపతీ! సర్వము నీనుండి పుట్టినది. సర్వము నీ స్వరూపమై యున్నది. సర్వము నీయందు ఉన్నది. నీవు నాపై దయను చూపి ముమ్మాటికీ రక్షించుము (29). ఇదే సమయములో ఇట్టి అవకాశమును పొందిన బ్రహ్మ చేతులను జోడించి నమస్కరించి శూలధారియగు శివునకు ఇట్లు విన్నవించు కొనెను.

బ్రహ్మోవాచః

జయ దేవ మహాదేవ ప్రణతార్తివిభంజన ।
ఈదృశేష్వపరాధేషు కోఽన్యస్త్వత్తః ప్రసీదతి ॥
లబ్ధాత్మానో భవిష్యంతి యే పురా నిహతా మృధే ।
ప్రత్యాపత్తిర్న కస్య స్యాత్త్వసన్నే పరమేశ్వరే ॥
యదిదం దేవ దేవానాం కృతమంతుషు దూషణమ్ ।
తదిదం భూషణం మన్యే త అంగీకారగౌరవాత్ ॥
ఇతి విజ్ఞాప్యమానస్తు బ్రహ్మణా పరమేష్ఠినా ।
విలోక్య వదనం దేవ్యా దేవదేవస్స్మయన్నివ ॥
పుత్రభూతస్య వాత్సల్యాద్ధ్రు హ్మణః పద్మజన్మనః ।
దేవాదీనాం యథాపూర్వమంగాని ప్రదదౌ ప్రభుః ॥
ప్రమథాద్యైశ్చ యా దేవ్యో దండితా దేవమాతరః ।
తాసామపి యథాపూర్వాణ్యంగాని గిరిశో దదౌ ॥
దక్షస్య భగవానేవ స్వయం బ్రహ్మే పితామహః ।
తత్పాపానుగుణం చక్రే జరచ్ఛాగముఖం ముఖమ్ ॥
సోఽపి సంజ్ఞాం తతో లబ్ధ్వా స దృష్ట్వా జీవితస్సుధీః ।
భీతః కృతాంజలిశ్శంభుం తుష్టావ ప్రలపన్ బహు ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ దేవా! మహాదేవా! నీకు జయమగుగాక! నమస్కరించిన వారి కష్టములను పోగొట్టువాడా! ఇట్టి అపరాధములయందు నీవు తప్ప మరి యెవరు ప్రసన్నులు కాగలరు? (31) పూర్వము యుద్ధములో ప్రాణములను పోగొట్టుకున్న వారు మరల జీవించ గలరు. పరమేశ్వరుడే ప్రసన్నుడు కాగా, ఎవనికి మరల ప్రాణములు దక్కవు? (32) ఓ దేవా! దేవతలు చేసిన పనిలోని ఈ దోషము యేది గలదో, అది నీ అంగీకారము యొక్క మహిమచే భూషణముగా మారినదని నేను తలపోయుచున్నాను (33). పరమేష్ఠియగు బ్రహ్మ ఇట్లు విన్నవించు కొనగా, ఆ దేవదేవుడు పార్వతీదేవియొక్క ముఖమును చూచి చిరునవ్వు నవ్వినాడా యన్నట్లు ఉండెను (34). పద్మమునుండి జన్మించిన బ్రహ్మయందు ఆయనకు పుత్రవాత్సల్యము ఉండుటచే ఆ ప్రభుడు దేవతలు మొదలగు వారికి పూర్వమునందు ఉన్న విధముగా అవయవములను ఇచ్చెను (35). ప్రమథగణములు మొదలగు వారిచే దండించబడి యున్న దేవతల తల్లులకు కూడ

కైలాసపతి పూర్వమునందు ఉన్న విధముగనే అవయవములను ఇచ్చెను (36). పితామహుడగు బ్రహ్మభగవానుడే స్వయముగా దక్షునకు వాని పాపములకు తగినట్లుగా ముసలి మేకయొక్క ముఖమునే ముఖముగా చేసెను (37). అపుడు ఆ దక్షుడు కూడా మరల జీవించి సంజ్ఞను పొంది బుద్ధిమంతుడై భయముతో చేతులను జోడించి అనేకవాక్యములను పలుకుతూ శంభుని స్తుతించెను.

**దక్ష ఉవాచ ।**

**జయ దేవ జగన్నాథ లోకానుగ్రహకారక ।**
**కృపాం కురు మహేశానాపరాధం మే క్షమస్వ హ ॥**
**కర్తా భర్తా చ హర్తా చ త్వమేవ జగతాం ప్రభో ।**
**మయా జ్ఞాతం విశేషేణ విష్ణ్వాదిసకలేశ్వరః ॥**
**త్వయైవ వితతం సర్వం వ్యాప్తం సృష్టం న నాశితమ్ ।**
**న హి త్వదధికాః కేచిదీశాస్తేఽచ్యుతకాదయః ॥**

దక్షుడు ఇట్లు పలికెను -

ఓ దేవా! జగన్నాథా! లోకములను అనుగ్రహించు వాడా! మహేశ్వరా! దయను చూపుము. నా తప్పును క్షమించుము (39). ఓ ప్రభూ! నీవే లోకములను సృష్టించి పోషించి సంహరించు చున్నావు. విష్ణువు మొదలగు వారందరికీ నీవే ఈశ్వరుడవని నేను విశేషముగా తెలుసుకొంటిని (40). సర్వమును నీవే వ్యాపించి యున్నావు. ఈ సృష్టిని నీవు ఇంకనూ నశింప చేయలేదు. విష్ణువు మొదలగు వారు ఎవ్వరైననూ నీ కంటే గొప్ప ప్రభువులు కారు.

**వాయురువాచః**

**తం తథా వ్యాకులం భీతం ప్రలపంతం కృతాగసమ్ ।**
**స్మయన్నివావదత్ప్రేక్ష్య మా భైరితి ఘృణానిధిః ॥**
**తథోక్త్వా బ్రహ్మణస్తస్య పితుః ప్రియచికీర్షయా ।**
**గాణపత్యం దదౌ తస్మై దక్షాయాక్షయమీశ్వరః ॥**
**తతో బ్రహ్మాదయో దేవా అభివంద్య కృతాంజలిః ।**
**తుష్టువుః ప్రశ్రయా వాచా శంకరం గిరిజాధిపమ్ ॥**

వాయువు ఇట్లు పలికెను -

ఆ విధముగా తప్పును చేసి భయపడుతూ కంగారుతో అధికముగా మాటలాడుచున్న ఆ దక్షుని చూచి దయానిధియగు శివుడు చిరునవ్వు నవ్వుతున్నాడా యన్నట్లు చూచి భయపడవద్దని పలికెను (42). ఆ విధముగా పలికి వాని తండ్రియగు బ్రహ్మకు ప్రీతిని కలిగించ గోరి ఈశ్వరుడు ఆ దక్షునకు వినాశము లేని గణాధ్యక్షస్థానమును ఇచ్చెను (43). తరువాత బ్రహ్మ మొదలగు దేవతలు వినయము గలవారై చేతులను జోడించి నమస్కరించి పార్వతీపతియగు శంకరుని స్తుతించిరి.

**బ్రహ్మాదయ ఊచుః ।**

**జయ శంకర దేవేశ దీనానాథ మహాప్రభో ।**

**కృపాం కురు మహేశానాపరాధం నో క్షమస్వ వై ॥**

**మఖపాల,మఖాధీశ మఖవిధ్వంసకారక ।**

**కృపాం కురు మహేశానాపరాధం నః క్షమస్వ వై ॥**

**దేవదేవ పరేశాన భక్తప్రాణప్రపోషక ।**

**దుష్టదండప్రద స్వామిన్ కృపాం కురు నమోఽస్తు తే ॥**

**త్వం ప్రభో గర్వహర్తా వై దుష్టానాం త్వామజానతామ్ ।**

**రక్షకో హి విశేషేణ సతాం త్వత్సక్తచేతసామ్ ॥**

**అద్భుతం చరితం తే హి నిశ్చితం కృపయా తవ ।**

**సర్వాపరాధః క్షంతవ్యో విభవో, దీనవత్సలాః ॥**

బ్రహ్మ మొదలగు వారు ఇట్లు పలికిరి –

ఓ శంకరా! దేవదేవా! నీకు జయమగుగాక! దీనులకు ప్రభువైన వాడా! ఓ మహాప్రభూ! దయను చూపుము. ఓ మహేశ్వరా! మా అపరాధమును నిశ్చయముగా క్షమింపుము (45). యజ్ఞమును రక్షించువాడా! యజ్ఞప్రభూ! దక్షయజ్ఞమును ధ్వంసము చేసినవాడా! ఓ మహేశ్వరా! దయను చూపుము. మా అపరాధమును నిశ్చయముగా క్షమించుము (46). ఓ దేవదేవా! సర్వమునకు కారణమగు ప్రకృతిని నియంత్రించు వాడా! భక్తుల ప్రాణములను నిలబెట్టువాడా! దుష్టులను శిక్షించే స్వామీ! దయను చూపుము. నీకు నమస్కారమగుగాక! (47) ఓ ప్రభూ! నిన్ను తెలియజాలని దుష్టుల గర్వమును నీవు అడంచెదవు. నీయందు లగ్నమైన మనస్సు గల సత్పురుషులను నీవు ప్రత్యేకముగా రక్షించెదవు (48). నీ చరిత్రము అద్భుతమని నీ దయచేతనే నిశ్చయించు కొంటిమి. మా అపరాధముల నన్నింటినీ క్షమించ వలెను. ప్రభువులు దీనులపై దయను కలిగి యుందురు గదా.

**వాయురువాచః**

**ఇతి స్తుతో మహాదేవో బ్రహ్మాద్యైరమరైః ప్రభుః ।**

**స భక్తవత్సలస్స్వామీ తుతోష కరుణోదధిః ॥**

**చకారానుగ్రహం తేషాం బ్రహ్మాదీనాం దివౌకసామ్ ।**

**దదౌ వరాంశ్చ సుప్రీత్యా శంకరో దీనవత్సలః ।**

**స చ తతస్తి దశాన్ శరణాగతాన్ పరమకారుణికః పరమేశ్వరః ।**

**అనుగతస్మితలక్షణయా గిరా శమితసర్వభయస్సమభాషత ॥**

వాయువు ఇట్లు పలికెను –

ఈ విధముగా బ్రహ్మ మొదలగు దేవతలచే స్తోత్రము చేయబడిన ఆ మహాదేవప్రభుడు సంతోషించెను. భక్తవత్సలుడగు ఆ స్వామి కరుణాసముద్రుడు (50). దీనులపై ప్రేమ గల ఆ శంకరుడు బ్రహ్మ మొదలగు దేవతలపై అనుగ్రహమును చూపి వారికి మిక్కిలి ప్రీతితో వరముల నిచ్చెను (51). తరువాత

అతిశయించిన దయ గల పరమేశ్వరుడు చిరునవ్వుతో గూడిన వచనముతో శరణు జొచ్చిన దేవతల భయములనన్నింటినీ పోగొట్టుతూ ఇట్లు పలికెను.

**శివ ఉవాచః**

**యదిదమాగ ఇహాచరితం సురైర్విధినియోగవశాదివ యంత్రితైః ।**
**శరణమేవ గతానవలోక్య వస్తదఖిలం కిల విస్మృతమేవ నః ॥**
**తదిహ యూయమపి ప్రకృతం మనస్సవిగణయ్య విమర్దమపత్రపాః ।**
**హరివిరించిసురేంద్రముఖాస్సుఖం వ్రజత దేవపురం ప్రతి సంప్రతి ॥**
**ఇతి సురానభిధాయ సురేశ్వరో నికృతదక్షక్రతురక్రతుః ।**
**సగిరిజానుచరస్సపరిచ్ఛదః స్థిత ఇవాంబరతోంతరధాద్ధరః ॥**
**అథ సురా అపి తే విగతవ్యథాః కథితభద్రసుభద్రపరాక్రమాః ।**
**సపది ఖేన సుఖేన యథాసుఖం యయులనేకముఖా మఘవన్ముఖాః ॥**
**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయ సంహితాయాం పూర్వభాగే**
**గిరిశానునయో నామ త్రయోవింశోఽ ధ్యాయః ॥**

శివుడు ఇట్లు పలికెను -

దేవతలు విధివిధానమునకు వశులై దానిచే నియంత్రింప బడినారా యన్నట్లు ఇచట పాపమును చేసియున్నారు. కానీ అట్టి మీరు నన్ను శరణు పొందినారు. మిమ్ములను ఈ విధముగా చూచి మేము ఆ పాపమునంతనూ మరచిపోయినాము (5,3), విష్ణువు బ్రహ్మ ఇంద్రుడు మొదలైన ఓ దేవతలారా! కావున, మీరు కూడ ఇక్కడ మీకు జరిగిన దేహశుద్ధిని మనస్సులో పెట్టుకొనకుండగా, బిడియమును విడిచినవారై, సుఖముగా ఇప్పుడు స్వర్గమునకు వెళ్లుడు (54). దేవతలకు ప్రభువు, దక్షయజ్ఞమును విధ్వంసము చేసినవాడు, సంకల్పరహితుడు, పార్వతీదేవితో, గణములతో మరియు అనుచరులతో కూడియున్నవాడు అగు శివుడు, ఆకాశములో నిలబడి యున్నాడు అనుకుంటూ ఉండగనే అంతర్ధానమును చెందినాడు (55). తరువాత ఇంద్రుడు మొదలగు ఆ దేవతలు కూడా భయము తొలగిన వారై వీరభద్రుని మిక్కిలి మంగళకరమగు పరాక్రమమును గురించి ముచ్చటించుకొని, వెనువెంటనే సుఖముగా నుండే ఆకాశమార్గములో వివిధదిక్కులలో సుఖముగా వెళ్లిరి.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో దేవతలు శివుని అనునయించుటను వర్ణించే ఇరువది మూడవ అధ్యాయము ముగిసినది.

## 24 – శివుడు పార్వతితో పరిహాసవచనమును పలుకుట

**ఋషయ ఊచుః ।**

**అంతర్ధానగతో దేవ్యా సహ సానుచరో హరః ।**
**క్వ యాతః కుత్ర వా వాసః కిం కృత్వా విరరామ హ ॥**

ఋషులు ఇట్లు పలికిరి –

దేవితో మరియు అనుచరులతో గూడి అంతర్ధానమును జెందిన శివుడు ఎక్కడకు వెళ్లినాడు? ఎక్కడ నివసించినాడు? ఏయే కార్యములను చేసి విరమించినాడు?

**వాయురువాచః**

**మహీధరవరః శ్రీమాన్ మందరశ్చిత్రకందరః।**
**దయితో దేవదేవస్య నివాసస్తపసోఽభవత్ ॥**
**తపో మహత్కృతం తేన వోఢుం స్వశిరసా శివౌ ।**
**చిరేణ లబ్ధం తత్పాదపంకజస్పర్శజం సుఖమ్ ॥**
**తస్య శైలస్య సౌందర్యం సహస్రవదనైరపి ।**
**న శక్యం విస్తరాద్వక్తుం వర్షకోటిశతైరపి ॥**
**శక్యమప్యస్య సౌందర్యం న వర్ణయితుముత్సహే ।**
**పర్వతాంతరసౌందర్యం సాధారణవిధారణాత్ ॥**
**ఇదం తు శక్యతే వక్తుమస్మిన్ పర్వతసుందరే ।**
**బుద్ధ్వా కయాపి సౌందర్యమీశ్వరావాసయోగ్యతా ॥**
**అత ఏవ హి దేవేన దేవ్యాః ప్రియచికీర్షయా ।**
**అతీవ రమణీయోఽయం గిరిరంతఃపురీకృతః ॥**
**మేఖలాభూమయస్తస్య విమలోపలపాదపాః ।**
**శివయోర్నిత్యసాన్నిధ్యాన్న్యకుర్వంత్యఖిలం జగత్ ॥**
**పితృభ్యాం జగతో నిత్యం స్నానపానోపయోగతః ।**
**అవాప్త పుణ్యసంస్కారైః ప్రసరద్భిరితస్తతః ॥**
**లఘుశీతలసంస్పర్శైరచ్ఛాచ్ఛైర్నిర్ఝ రాంబుభిః ।**
**అధిరాజ్యేన చాద్రీణామద్రిరేషోఽభిషిచ్యతే ॥**
**నిశాసు శిఖరప్రాంతర్వర్తినా స శిలోచ్చయః ।**
**చంద్రేణాచలసామ్రాజ్యచ్ఛత్రేణేవ విరాజతే ॥**

వాయువు ఇట్లు పలికెను -

శోభాయుక్తమైనది, రంగు రంగుల గుహలు గలది, పర్వతములలో శ్రేష్ఠమైనది అగు మందరపర్వతము దేవదేవుడగు శివునకు తపస్సును చేసుకొనే నివాసస్థానముగా నుండెను (2). ఆ పర్వతము తన శిఖరముపై పార్వతీపరమేశ్వరులను దాల్చ గోరి గొప్ప తపస్సును చేసి చిరకాలము తరువాత వారి పద్మముల వంటి పాదముల స్పర్శ వలన కలిగే సుఖమును పొందెను (3). వేయి ముఖములు గలవారైననూ వంద కోటి సంవత్సరములు ప్రయత్నించిననూ ఆ పర్వతము యొక్క సౌందర్యమును వివరముగా చెప్పజాలరు (4). ఆ పర్వతసౌందర్యమును నేను వర్ణించగలను. కాని, నాకు వర్ణించే ఉత్సాహము లేదు. ఏలయనగా, ఈ పర్వతము కూడా ఇతర పర్వతముల వలెనే సామాన్యమగు సౌందర్యమును కలిగియుండుననే అభిప్రాయము కలుగువచ్చును (5). కాని ఆ పర్వత శోభను గురించి ఒక మాటను చెప్ప వచ్చును. ఒక విలక్షణమైన సౌభాగ్యము కారణముగా ఈ పర్వతమునందు ఈశ్వరుడు నివసించుటకు యోగ్యమగు సౌందర్యము గలదు (6). ఇందు వలననే శివుడు పార్వతికి ప్రీతిని కలిగించ గోరి మిక్కిలి సుందరమగు ఈ పర్వతమును తన అంతఃపురముగా చేసుకొనినాడు (7). స్వచ్ఛమగు శిలలతో మరియు వృక్షములతో కూడి ఆ పర్వతమునకు మేఖలలవలె నున్న సానువులు (కొండ చరియలు) పార్వతీపరమేశ్వరుల నిత్యనివాసముచే జగత్తునంతనూ తృణీకరించు చున్నవి (8). ముల్లోకములకు తల్లిదండ్రులగు పార్వతీపరమేశ్వరులు నిత్యము స్నానమును చేసి త్రాగుటకు ఉపయోగించుట వలన పొందబడిన పుణ్యసంస్కారము గలవి, ఇటునుండి అటునుండి ప్రవహించునవి (9), చల్లని తేలిక (పలచని) స్పర్శ గలవి, మిక్కిలి స్వచ్ఛమైనవి అగు కొండ కాలువల జలములచే ఈ పర్వతుడు పర్వతములకు చక్రవర్తి అనే పదవినందు అభిషేకించబడు చున్నాడు (10). రాత్రులయందు శిఖరములకు దగ్గరలో నుండే చంద్రుడు ఆ పర్వతముయొక్క పర్వతసామ్రాజ్యాధిపతిత్వమునకు చిహ్నము అగు గొడుగు వలె నున్నాడు.

**స శైలశ్చంచలీభూతైర్వాలైశ్చామరయోషితామ్ ।**

**సర్వపర్వతసామ్రాజ్యచామరైరివ వీజ్యతే ॥**

**ప్రాతరభ్యుదితే భానౌ భూధరో రత్నభూషితః ।**

**దర్పణే దేహసౌభాగ్యం ద్రష్టుకామ ఇవ స్థితః ॥**

**కూజద్విహంగవాచాలైర్వాతోద్ధృతలతాభుజైః ।**

**విముక్తపుష్పైస్సతతం వ్యాలంబిమృదుపల్లవైః ॥**

**లతా ప్రతానజటిలైస్తరుభిస్తాపసైరివ ।**

**జయాశిషా సహాభ్యర్చ్య నిషేవ్యత ఇవాద్రిరాట్ ॥**

**అధోముఖైరూర్ధ్వముఖైశ్శృంగైస్తిర్యఙ్ముఖైస్తథా ।**

**ప్రపతన్నివ పాతాలే భూపృష్ఠాదుత్పతన్నివ ॥**

**పరీతస్సర్వతో దిక్షు భ్రమన్నివ విహాయసి ।**

**పశ్యన్నివ జగత్సర్వం నృత్యన్నివ నిరంతరమ్ ॥**

గుహాముఖైః ప్రతిదినం వ్యాత్తాస్యో విపులోదరైః ।
అజీర్ణలావణ్యతయా జృంభమాణ ఇవాచలః ॥
గ్రసన్నివ జగత్సర్వం పిబన్నివ పయోనిధిమ్ ।
వమన్నివ తమోంతఃస్థం మాద్యన్నివ ఖమంబుదైః ॥
నివాస భూమయస్తాస్తా దర్పణప్రతిమోదరాః ।
తిరస్కృతాతపాస్స్నిగ్ధాశ్రమచ్ఛాయామహీరుహాః ॥
సరిత్సరస్తడాగాదిసంపర్కశిశిరానిలాః ।
తత్ర తత్ర నిషణ్ణాభ్యాం శివాభ్యాం సఫలీకృతాః ॥

ఆడు-చామరమృగముల పిల్లలు ఇటునటు పరుగులెత్తుచుండగా, పర్వతములన్నింటి సామ్రాజ్యమునందు అభిషిక్తుడైన ఆ పర్వతమునకు అవి వింజామరలను వీచుచున్నట్లుండెను (12). ఉదయము సూర్యుడు ఉదయించినప్పుడు రత్నములచే అలంకరింపబడి యున్న ఆ పర్వతము అద్దములో తన దేహముయొక్క సౌభాగ్యమును చూడ గోరుచున్నదా యన్నట్లు ఉండెను (13). పక్షి కూతలే మంత్రపఠనములుగా కలిగినట్టియు, గాలికి పైకి యెత్తబడిన లతలే భుజములుగా కలిగినట్టియు, పరస్పరము చిక్కువడియున్న తీగలు అనే జటాజూటములను కలిగియున్న చెట్లు అనే తపశ్శాలురు ఎల్లవేళలా పుష్పములను జార్చుచూ వ్రేలాడే కొమ్మలకు సుకుమారమగు చిగుళ్లను కలిగియుండి జయాశీస్సులను పలుకుతూ ఆ పర్వతరాజును పూజించి సేవించుచున్నవా యన్నట్లుండెను ( 14, 15). కొన్ని శిఖరములు పైకి, మరికొన్ని క్రిందకు, ఇంకొన్ని అడ్డముగా వ్యాపించి యుండ ఆ పర్వతము పాతాళములోనికి దుముకుచున్నదా యన్నట్లు, భూతలమునుండి పైకి లేచుచున్నదా యన్నట్లు (16), ఆకాశములో అంతటా అన్ని దిక్కుల యందు తిరుగాడుతూ జగత్తునంతనూ చూచుచున్నదా యన్నట్లు, ఎడతెరపి లేకుండగా నాట్యమాడుచున్నదా యన్నట్లు ఉండెను (17). శిథిలము కాని సౌందర్యము గల ఆ పర్వతము ప్రతిదినము విశాలమగు లోపలి భాగములు గల గుహలు అనే ముఖములతో నోటిని తెరచి ఆవలించు చున్నదా యన్నట్లు ఉండెను (18). ఆ పర్వతము జగత్తునంతనూ మ్రింగుచున్నదానివలె, సముద్రమును త్రాగుచున్న దానివలె, తన లోపలనున్న చీకటిని గ్రక్కుచున్న దాని వలె, ఆకాశమును మేఘములతో కప్పుచున్నదాని వలె నుండెను (19). ఆయా నివాసస్థానములు అద్దము వలె స్వచ్ఛముగా నుండెను. ఆశ్రమమునందు నీడనిచ్చే దట్టని చెట్లు ఎండను తిరస్కరించుచుండెను (20). నదులు, సరస్సులు, చెరువులు మొదలగు వాటితోడి సంపర్కము వలన చల్లనైన వాయువులు అక్కడక్కడ కూర్చుండిన పార్వతీపరమేశ్వరులచే సఫలము చేయబడినవి.

తమిమం సర్వతః శ్రేష్ఠం స్మృత్వా సాంబస్త్రి యంబకః।
రైభ్యాశ్రమసమీపస్థశ్చాంతర్ధానం గతో యయౌ ॥
తత్రోద్యానమను ప్రాప్య దేవ్యా సహ మహేశ్వరః ।
రరామ రమణీయాసు దివ్యాంతఃపురభూమిషు ॥
తథా గతేషు కాలేషు వర్ధితాసు ప్రజాసు చ ।
దైత్యౌ శుంభనిశుంభాఖ్యౌ భ్రాతరౌ సంబభూవతుః ॥

తాభ్యాం తపోబలాద్దత్తం బ్రహ్మణా పరమేష్ఠినా।
అవధ్యత్వం జగత్యస్మిన్ పురుషైరఖిలైరపి॥
అయోనిజా తు యా కన్యా హ్యంబికాంశసముద్భవా ।
అజాతపుంస్పర్శరతిరవిలంఘ్యపరాక్రమా ॥
తయా తు నౌ వధస్సంఖ్యే తస్యాం కామాభిభూతయోః ।
ఇతి చాభ్యర్థితో బ్రహ్మా తాభ్యాం ప్రాహ తథాస్త్వితి ॥
తతః ప్రభృతి శక్రాదీన్ విజిత్య సమరే సురాన్ ।
నిస్స్వాధ్యాయవషట్కారం జగచ్చక్రతురక్రమాత్ ॥
తయోర్వధాయ దేవేశం బ్రహ్మాభ్యర్థితవాన్ పునః ।
వినిన్ద్యాపి రహస్యం వాం క్రోధయిత్వా యథా తథా ॥
తద్వర్ణకోశజాం శక్తిమకామాం కన్యకాత్మికామ్ ।
నిశుంభశుంభయోర్హంత్రీం సురేభ్యో దాతుమర్హసి ॥
ఏవమభ్యర్థితో ధాత్రా భగవాన్నీలలోహితః ।
కాలీత్యాహ రహస్యం వాం నిందయన్నివ సస్మితః ॥
తతః క్రుద్ధా తదా దేవీ సువర్ణా వర్ణకారణాత్।
స్మయంతీ చాహ భర్తారమసమాధేయయా గిరా ॥

రైభ్యుని ఆశ్రమమునకు సమీపమునందున్న ముక్కంటి యగు శివుడు అట్టి ఈ సర్వోత్కృకృష్టమైన పర్వతమును గుర్తుకు దెచ్చుకొని పార్వతితో గూడి అంతర్ధానమును చేంది అచటకు వెళ్లెను (22), మహేశ్వరుడు పార్వతీదేవితో గూడి అచట ఉండే ఉద్యానవనము వద్దకు వెళ్లి సుందరమగు అంతఃపురస్థానముల యందు రమించెను (23). ఆ విధముగా కాలము గడచుచుండగా సృష్టిలో ప్రజల సంఖ్య పెరిగెను. శుంభనిశుంభులు అనే సోదరులగు ఇద్దరు రాక్షసులు ఉదయించిరి (24). వారి తపోబలము వలన వారికి ఈ జగత్తులో సర్వపురుషుల చేతిలో మరణము లేకుండునట్లు ,పరమేష్టియగు బ్రహ్మ వరమునిచ్చెను (25), అయోనిజ, పార్వతీదేవి యొక్క అంశనుండి జన్మించినది, పురుషునితో స్పర్శ మరియు రతి లేనిది, ఉల్లంఘింప శక్యము కాని పరాక్రమము గలది అగు ఏ కన్య గలదో (26), ఆమె చేతిలో మాత్రమే కామముచే పరాజితులమై యున్న మేమిద్దరము యుద్ధములో వధింప బడెదము గాక! అని వారు ప్రార్థించగా, బ్రహ్మ అటులనే యగుగాక! అనెను (27). అప్పటి నుండియు వారు ఇంద్రుడు మొదలగు దేవతలను యుద్ధములో జయించి, జగత్తులో స్వాధ్యాయము గాని, యజ్ఞములు గాని లేని విధముగా అక్రమముగా చేసిరి (28). బ్రహ్మ వారి వధ కొరకై దేవదేవుడగు శివుని మరల ప్రార్థించెను. పార్వతిని నిందించి గాని, లేక ఏదో విధముగా రహస్యముగా కోపమును తెప్పించుము (29). ఆమె రూపమునుండి రంగునుండి పుట్టినది, కామము లేనిది, కన్య రూపములో నున్నది, శుంభనిశుంభులను సంహరించునది అగు శక్తిని దేవతలకు నీవు ఈయ దగుదువు (30), నీలలోహితుడగు శివభగవానుని బ్రహ్మ ఈ విధముగా ప్రార్థించగా, ఆయన ఏకాంతమునందు పార్వతిని నిందించు చున్న వానివలె చిరునవ్వుతో "నీవు నల్లని

దానవు' అనెను (31). అపుడు చక్కని దేహవర్ణము గల ఆ దేవి వర్ణమును గురించి శివుడు చేసిన వ్యాఖ్యకు కోపించి వెటకారముగా నవ్వి సమాధాన పరచుటకు వీలు లేని విధముగా కఠినమగు వాక్కుతో భర్తను ఉద్దేశించి ఇట్లు పలికెను.

**దేవ్యువాచః**

**ఈదృశే మమ వర్ణేఽస్మిన్నరతిర్భవతో ఽ స్తి చేత్ ।**
**ఏతావంతం చిరం కాలం కథమేషా నియమ్యతే ॥**
**అరత్యా వర్తమానోఽ పి కథం చ రమసే మయా ।**
**న హ్యశక్యం జగత్యస్మిన్నీశ్వరస్య జగత్ప్రభోః ॥**
**స్వాత్మారామస్య భవతో రతిర్న సుఖసాధనమ్ ।**
**ఇతి హేతోస్స్మరో యస్మాత్త్వ సఖం భస్మసాత్కృతః ॥**
**యా చ నాభిమతా భర్తురపి సర్వాంగసుందరీ ।**
**సా వృథైవ హి జాయేత సర్వైరపి గుణాంతరైః ॥**
**భర్తుర్భోగైకశేషో హి సర్గ ఏవైష యోషితామ్ ।**
**తథా సత్యన్యథా భూతా నారీ కుత్రోపయుజ్యతే ॥**
**తస్మాద్వర్ణమిమం త్యక్త్వా త్వయా రహసి నిందితమ్ ।**
**వర్ణాంతరం భజిష్యే వా న భజిష్యామి వా స్వయమ్ ॥**
**ఇత్యుక్త్వోత్థాయ శయనాద్దేవీ సాచష్ట గద్గదమ్ ।**
**యయాచేఽ నుమతిం భర్తుస్తపసే కృతనిశ్చయా ॥**
**తథా ప్రణయభంగేన భీతో భూతపతిస్స్వయమ్ ।**
**పాదయోః ప్రణమన్నేవ భవానీం ప్రత్యభాషత ॥**

దేవి ఇట్లు పలికెను –

నా ఇట్టి ఈ రంగునందు మీకు ప్రీతి లేని పక్షములో, ఇంత దీర్ఘకాలము మీరు ఈ అరుచిని ఎట్లు దాచి పెట్ట గల్గితిరి? (33) ప్రేమ లేకున్ననూ మీరు నాతో ఎట్లు రమించితిరి? జగత్తులకు ప్రభువగు ఈశ్వరునకు ఈ జగత్తులో శక్యము కానిది ఏది లేదు (34). తన ఆత్మస్వరూపములోని ఆనందమునందు రమించే మీకు స్త్రీ సహవాసము సుఖమునకు సాధనము కాదు. ఈ కారణము చేతనే మీరు మన్మథుని బలాత్కారముగా బూడిదగా మార్చి వేసితిరి (35). స్త్రీ సర్వావయవములయందు సుందరియే అయిననూ ఆ సౌందర్యము భర్తకు అభిమతము కానిచో, ఆమెకు సమస్తసద్గుణములు ఉన్ననూ, ఆమె జన్మ వ్యర్థమే (36). భర్తయొక్క ఆనందము మాత్రమే స్త్రీ యొక్క సృష్టికి ఏకైక ప్రయోజనము. స్థితి ఇట్లుండగా దానికి విరుద్ధముగా నుండే స్త్రీకి మరియొక్క ప్రయోజనమేమి గలదు? (37) కావున, నేను నీచే ఏకాంతములో నిందించబడిన ఈ వర్ణమును విడిచి పెట్టి మరియొక్క రంగును పొందెదను. లేదా, స్వయముగా ప్రాణములను విడిచెదను (38). ఆ దేవి ఈ విధముగా పలికి శయనమునుండి లేచి తపస్సును చేయవలెననే నిశ్చయమునకు వచ్చి గద్గదమగు వచనముతో భర్తను అనుమతిని కోరెను (39). సకలప్రాణులకు ప్రభువగు ఆ శివుడు ఆ విధముగా తన ప్రేమకు భంగము

కలుగునని భయపడిన వాడై స్వయముగా ఆ భవానియొక్క పాదములకు ప్రణమిల్లి ఇట్లు చెప్పెను.

**ఈశ్వర ఉవాచః**

**అజానతీ చ క్రీడోక్తిం ప్రియే కిం కుపితాసి మే ।**
**రతిః కుతో వా జాయేత త్వత్తశ్చేదరతిర్మమ ॥**
**మాతా త్వమస్య జగతః పితాహమధిపస్తథా ।**
**కథం తదుపపద్యేత త్వత్తో నాభిరతిర్మమ ॥**
**ఆవయోరభికామోఽపి కిమసౌ కామకారితః ।**
**యతః కామసముత్పత్తిః ప్రాగేవ జగదుద్భవః ॥**
**పృథగ్జనానాం రతయే కామాత్మా కల్పితో మయా ।**
**తతః కథముపాలబ్ధ కామదాహాదహం త్వయా ॥**
**మాం వై త్రిదశసామాన్యం మన్యమానో మనోభవః ।**
**మనాక్పరిభవం కుర్వన్మయా వై భస్మసాత్కృతః ॥**
**విహారోప్యావయోరస్య జగతస్త్రాణకారణమ్ ।**
**తతస్తదర్థం త్వయ్యద్య క్రీడోక్తిం కృతవానహమ్ ॥**
**స చాయమచిరాదర్థస్తవైవావిష్కరిష్యతే ।**
**క్రోధస్య జనకం వాక్యం హృది కృత్వేదమబ్రవీత్ ॥**

ఈశ్వరుడిట్లు పలికెను –

ఓ ప్రియురాలా! నేను పలికిన పలుకులోని పరిహాసమును తెలియజాలక నాపై కోపించుచున్నావా? నాకు నీపై ప్రేమ లేనిచో, నాకు ఇతరము దేనిపై ప్రేమ ఉండగల్గును? (41) నీవు ఈ జగత్తునకు తల్లివి. నేను ఈ జగత్తునకు ప్రభువు మాత్రమే గాక, తండ్రిని కూడా. నాకు నీపై ప్రేమ లేనిచో, ఈ స్థితి ఎట్లు పొసగును? (42) మన మధ్య గల పరస్పరప్రేమకు ఈ మన్మథుడు కారణమా యేమి? కాదు. ఏలయనగా, మన్మథుడు పుట్టుటకు పూర్వమే జగత్తు పుట్టినది (43). స్త్రీ పురుషుల పరస్పరప్రేమ కొరకై నేను కాముడను వానిని కల్పించితిని. ఇట్టి స్థితిలో నేను కాముని దహించి వేసితినని నీవు నన్ను ఎట్లు నిందించితివి? (44) నన్ను ఒక సామాన్యదేవతగా భావించిన మన్మథుడు నన్ను కొద్దిగా అవమానించ బోగా, నేను వానిని భస్మము చేసితిని (45). మన యిద్దరి ఈ విహారము కూడా జగత్తును రక్షించుట కొరకు మాత్రమే ఉద్దేశించబడినది. కావుననే, నేను ఆ ప్రయోజనము కొరకు మాత్రమే ఈ నాడు నీతో పరిహాస వాక్యమును పలికితిని (46). ఈ ప్రయోజనము నీకు తొందరలోననే స్పష్టము కాగలదు. తనకు కోపమును కలిగించిన శివుని మాటను మనస్సులో నుంచుకొని దేవి ఇట్లు పలికెను.

**దేవ్యువాచః**

**శ్రుతపూర్వం హి భగవంస్తవ చాటు వచో మయా ।**

**యేనైవమతిధీరాహమపి ప్రాగభివంచితా ॥**

**ప్రాణానప్య ప్రియా భర్తుర్నారీ యా న పరిత్యజేత్ ।**

**కులాంగనా శుభా సద్భిః కుత్సితైవ హి గమ్యతే ॥**

**భూయసీ చ తవాప్రీతిరగౌరమితి మే వపుః ।**

**క్రీడోక్తిరపి కాలీతి ఘటతే కథమన్యథా ॥**

**సద్భిర్విగర్హితం తస్మాత్తవ కార్ ష్ణ్య మసమ్మతమ్ ।**

**అనుత్సృజ్య తపోయోగాత్ స్థాతుమేవేహ నోత్సహే ॥**

దేవి ఇట్లు పలికెను –

ఓ భగవాన్! నేను నీ పరిహాసోక్తులను ఇదివరలో విని యుంటిని. నేను అతిధీరురాలనే అయిననూ, నీవు అట్టి వచనములతో నన్ను పూర్వములో మోసగించి యుంటివి (48), మంగళ స్వరూపురాలగు ఏ కులస్త్రీ భర్త యొక్క ప్రీతిని పొందలేనిదైననూ ప్రాణములను విడువకుండునో, ఆమెను సత్పురుషులు దుష్టురాలనియే భావించెదరు (49). నా దేహము పచ్చగా లేదని నీకు నాపై అరుచి అధికముగా గలదు. అట్లు గానిచో, పరిహాసమునకైననూ నీవు నల్లనిది అనుట ఎట్లు సంభవమగును? (50) కావున, సత్పురుషులు ఏవగించుకొనే ఈ నల్లదనము నీకు నచ్చుబాటు కాదు. తపస్సుయొక్క ప్రభావముచే దానిని తొలగించు కొన కుండగా ఇక్కడ నిలిచి యుండుటలో నాకు ఉత్సాహము లేదు.

**శివ ఉ వాచః**

**స యద్యేవంవిధతాపస్తే తపసా కిం ప్రయోజనమ్ ।**

**మమేచ్ఛయా స్వేచ్ఛయా వా వర్ణాంతరవతీ భవ ॥**

శివుడు ఇట్లు పలికెను –

నీకు ఈ విధమగు మనోవేదన ఉన్నచో, తపస్సుతో పని యేమి? నా సంకల్పముచే గాని, లేదా నీ ఇచ్ఛచే గాని మరియొక వర్ణమును పొందుము.

**దేవ్యువాచ।**

**నేచ్ఛామి భవతో వర్ణం స్వయం వా కర్తుమన్యథా ।**

**బ్రహ్మాణం తపసారాధ్య క్షిప్రం గౌరీ భవామ్యహమ్ ॥**

దేవి ఇట్లు పలికెను –

నేను మరియొక దేహవర్ణమును నీనుండి పొంద గోరుట లేదు. స్వయముగా దేహవర్ణమును మార్చుకొనుట యైననూ నాకు సమ్మతము కాదు. నేను తపస్సును చేసి బ్రహ్మను ఆరాధించి శీఘ్రముగా పచ్చని రంగు గలదానను కాగలను.

**ఈశ్వర ఉవాచః**

**మత్ప్రసాదాత్పురా బ్రహ్మా బ్రహ్మత్వం ప్రాప్తవాన్ పురా ।**

**తమాహూయ మహాదేవి తపసా కిం కరిష్యసి ॥**

ఈశ్వరుడు ఇట్లు పలికెను -

పూర్వము బ్రహ్మ నా అనుగ్రహముచే బ్రహ్మ పదవిని పొందినాడు. ఓ మహాదేవీ! ఆతనిని పిలిపించెదము. నీవు తపస్సును చేయుట యేల?

**దేవ్యువాచః**

**త్వత్తో లబ్ధపదా ఏవ సర్వే బ్రహ్మాదయస్సురా ।**

**తథాప్యారాధ్య తపసా బ్రహ్మాణం త్వన్నియోగతః ॥**

**పురా కిల సతీ నామ్నా దక్షస్య దుహితాఽ భవమ్ ।**

**జగతాం పతిమేవం త్వాం పతిం ప్రాప్తవతీ తథా ॥**

**ఏవమద్యాపి తపసా తోషయిత్వా ద్విజం విధిమ్ ।**

**గౌరీ భవితుమిచ్ఛామి కో దోషః కథ్యతామిహ ॥**

**ఏవముక్తో మహాదేవ్యా వామదేవస్స్మయన్నివ ।**

**న తాం నిర్బంధయామాస దేవకార్యచికీర్షయా ॥**

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వభాగే శివక్రీడోక్తివర్ణనం నామ చతుర్వింశోఽ ధ్యాయః ॥

దేవి ఇట్లు పలికెను -

బ్రహ్మ మొదలగు దేవతలు అందరు నీనుండి పదవులను పొందిన వారే. అయినప్పటికీ, నీ అనుమతిని పొంది నేను పూర్వము తపస్సుచే బ్రహ్మను ఆరాధించి, సతి అను పేరుతో దక్షుని కుమార్తెకై జన్మించి, జగత్తులకు ప్రభువగు నిన్ను ఈ విధముగా భర్తగా పొందితిని (55, 56), అదే విధముగా ఈ నాడు కూడా వేదవేత్తయగు బ్రహ్మను తపస్సుచే సంతోషపెట్టి, గౌరి (పచ్చని వర్ణము గలది) ని కావలెనని కోరుచున్నాను. దీనిలో దోషమేమియో చెప్పుడు (57). మహాదేవి ఇట్లు పలుకగా, ఆ వామదేవుడు చిరునవ్వు నవ్వుచున్న వాని వలె నుండి, దేవకార్యమును చేయగోరుటచే ఆమెను వద్దని నిర్బంధించ లేదు.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితలో పూర్వభాగమునందు శివుడు పార్వతిని పరిహాసము చేయుట అనే ఇరువది నాల్గవ అధ్యాయము ముగిసినది.

# 25 - పార్వతి గౌరి యగుట

వాయురువాచః

తతః ప్రదక్షిణీకృత్య పతిమంబా పతివ్రతా ।
నియమ్య చ వియోగార్తిం జగామ హిమవద్గిరిమ్॥
తపః కృతవతీ పూర్వం దేశే యస్మిన్ సఖీజనైః।
తమేవ దేశమవృణోత్తపసే ప్రణయాత్మనః ॥
తతస్స్వపితరం దృష్ట్వా మాతరం చ తయోర్గృహే ।
ప్రణమ్య వృత్తం విజ్ఞాప్య తాభ్యాం చానుమతా సతీ ॥
పునస్తపోవనం గత్వా భూషణాని విసృజ్య చ ।
స్నాత్వా తపస్వినో వేషం కృత్వా పరమపావనమ్ ॥
సంకల్ప్య చ మహాతీవ్రం తపః పరమదుశ్చరమ్।
సదా మనసి సంధాయ భర్తుశ్చరణపంకజమ్ ॥
తమేవ క్షణికే లింగే ధ్యాత్వా బాహ్యవిధానతః।
త్రిసంధ్యమభ్యర్చయంతీ వన్యైః పుష్పైః ఫలాదిభిః ॥
స ఏవ బ్రహ్మణో మూర్తిమాస్థాయ తపసః ఫలమ్ ।
ప్రదాస్యతి మమేత్యేవం నిత్యం కృత్వాऽకరోత్తపః ॥
తథా తపశ్చరంతీం తాం కాలే బహుతిథే గతే ।
దృష్టః కశ్చిన్మహావ్యాఘ్రో దుష్టభావాదుపాగమత్ ॥
తథైవోపగతస్యాపి తస్యాతీవ దురాత్మనః।
గాత్రం చిత్రార్పితమివ స్తబ్ధం తస్యాస్సకాశతః ॥
తం దృష్ట్వాపి తథా వ్యాఘ్రం దుష్టభావాదుపాగతమ్।
న పృథగ్జనవద్దేవీ స్వభావేన వివిచ్యతే ॥

వాయువు ఇట్లు పలికెను -

తరువాత పతివ్రతయగు ఆ జగన్మాత భర్తకు ప్రదక్షిణమును చేసి వియోగదుఃఖమును అణిచి పెట్టుకొని హిమవత్పర్వతమునకు వెళ్లెను (1). ఆమె పూర్వము సఖీజనులతో గూడి. ఏ స్థానములో తపస్సును చేసియుండెనో, మరల తపస్సు కొరకై ఆమె అదే స్థానమును ప్రేమ పూర్వకముగా ఎన్నుకొనెను (2). తరువాత ఆ పార్వతీ దేవి తన తల్లిదండ్రులను వారి గృహమునందు దర్శించి వారికి నమస్కరించి, జరిగిన వృత్తాంతమును విన్నవించి, వారి అనుమతిని పొంది (3), మరల తపోవనమునకు వెళ్లి, ఆభరణములను విడిచి పెట్టి, స్నానమును చేసి, తపశ్శాలురు. ధరించే మిక్కిలి పవిత్రమగు వేషమును ధరించి (4), సర్వకాలములలో భర్తయొక్క పాదపద్మములను మనస్సులో నిలిపి, మిక్కిలి తీవ్రమైనది మరియు చేయుటకు చాల కష్టమైనది అగు తపస్సును చేయ సంకల్పించెను (5). ఆ శివుని ఉత్సవలింగమునందు ధ్యానిస్తూ మూడు సంధ్యలలో బాహ్యపూజావిధానముతో అడవిలో దొరికే పువ్వులతో పండ్లతో ఆరాధించెను (6). ఆ శివుడే బ్రహ్మ

రూపమును దాల్చి వచ్చి నాకు తపస్సుయొక్క ఫలమును ఈయగలడని నిత్యము భావిస్తూ ఆమె తపస్సును చేసెను. (7). ఈ విధముగా ఆమె తపస్సును చేయుచుండగా చాల కాలము గడిచేను. ఒకనాడు ఒక పెద్ద పులి హింసించ వలెననే తలపుతో ఆమె మీదకు వచ్చెను ( 8). మిక్కిలి చెడ్డ సంకల్పముతో ఆమె మీద మీదకు వచ్చిన ఆ పులి, బొమ్మ పులి వలె స్తంభించి. పోయి నిలబడెను (9). ఆ విధముగా చెడు తలంపుతో మీదకు వచ్చిన పెద్దపులిని చూచి కూడా ఆ దేవి సామాన్య జనుని వలె తన ధ్యానమునుండి చలించ లేదు.

**స తు విష్టబ్ధ సర్వాంగో బుభుక్షాపరిపీడితః ।**
**మమామిషం తతో నాన్య దితి మత్వా నిరంతరమ్ ॥**
**నిరీక్ష్యమాణస్సతతం దేవీమేవ తదాఽనిశమ్ ।**
**అతిష్ఠదగ్రతస్తస్యా ఉపాసనమివాచరత్ ॥**
**దేవ్యాశ్చ హృదయే నిత్యం మమైవాయముపాసకః।**
**త్రాతా చ దుష్టసత్త్వేభ్య ఇతి ప్రవవృతే కృపా ॥**
**తస్యా ఏవ కృపాయోగాత్సద్యో నష్టమలత్రయః ।**
**బభూవ సహసా వ్యాఘ్రో దేవీం చ బుబుధే తదా ॥**
**న్యవర్తత బుభుక్షా చ తస్యాంగస్తంభనం తథా ।**
**దౌరాత్మ్యం జన్మసిద్ధం చ తృప్తిశ్చ సమజాయత ॥**
**తదా పరమభావేన జ్ఞాత్వా కార్తార్థ్యమాత్మనః ।**
**సద్యోపాసక ఏవైష సిషేవే పరమేశ్వరీమ్ ॥**
**దుష్టానామపి సత్త్వానాం తథాన్యేషాం దురాత్మనామ్ ।**
**స ఏవ ద్రావకో భూత్వా విచచార తపోవనే ॥**
**తపశ్చ వవృధే దేవ్యా తీవ్రం తీవ్రతరాత్మకమ్ ।**
**దేవాశ్చ దైత్యనిర్బంధాద్బ్రహ్మాణం శరణం గతాః ॥**
**చక్రుర్నివేదనం దేవాస్స్వదుఃఖస్యాలిపీడనాత్।**
**యథా చ దదతుశ్శుంభనిశుంభౌ వరసమ్మదాత్॥**
**సోఽపి శ్రుత్వా విధిర్దుఃఖం సురాణాం కృపయాన్వితః।**
**ఆసీద్దైత్యవధాయైవ స్మృత్వా హేత్వాశ్రయాం కథామ్ ॥**

అకలిచే నిరంతరముగా పీడింపబడి స్తంభించిన సకలావయవములు గల ఆ పులి ఈమే తప్ప నాకు మరియొక ఆహారము లేదని భావించెను. అపుడు ఆ పులి ఎడతెరపి లేకుండగా సర్వకాలములలో ఆమె వైపునకు చూచుచూ ఆమెను ఉపాసించు చున్నదా యన్నట్లు యెదురుగా నిలబడి యుండెను ( 11, 12). ఇది నిత్యము నన్నే ఉపాసించు చున్నది; నన్ను క్రూరమృగముల బారి నుండి ఇది కాపాడగలదు అని దేవియొక్క హృదయములో కూడ దయ పుట్టెను (13), అపుడు ఆమె యొక్క దయాసంబంధముచే వెంటనే ఆ పులియొక్క మనోవాక్కాయముల యందలి దోషములు తొలగి పోయి, అది దేవిని తెలియగల్గెను (14). ఇంతే గాక, దాని శరీరావయవముల స్తంభనము తొలగి పోయి, దాని ఆకలి కూడ తీరెను.

దానికి పుట్టుకనుండి వచ్చిన దుష్టబుద్ధి తొలగి పోయి తృప్తి కలిగెను (15). వెను వెంటనే అది పరమభక్తి భావముతో తన కృతార్థతను గుర్తించి ఉపాసకుని భావమును పొంది ఆ పరమేశ్వరిని సేవించెను (16). ఆ పులి క్రూరమృగములను, దుష్టబుద్ధి గల ఇతర ప్రాణులను తరిమి గొట్టుచూ ఆ తపోవనమునందు తిరుగాడెను (17). దేవియొక్క తీవ్రమగు తపస్సు మరింత తీవ్రముగా వర్ధిల్లెను. రాక్షసుల బాధల వలన దేవతలు బ్రహ్మను శరణు పొందిరి (18). తమకు శత్రువుల పీడ వలన కలిగిన దుఃఖమును, వరములను పొంది మిక్కిలి గర్వించియున్న శుంభనిశుంభులు తమకు కలిగించే ఇబ్బందులను ఆ దేవతలు బ్రహ్మకు విన్నవించు కొనిరి(19). ఆ బ్రహ్మ కూడా దేవతల దుఃఖమును గురించి విని దయతో కూడిన వాడై, తనకు శంకరునితో హేతుయుక్తముగా జరిగిన సంభాషణమును స్మరించి, రాక్షసుల వధ కొరకు ఆకాంక్ష గలవాడాయెను.

**సామరః ప్రార్థితో బ్రహ్మా యయౌ దేవ్యాస్తపోవనమ్।**

**సంస్మరన్మనసా దేవదుఃఖమోక్షం స్వయత్నతః ॥**

**దదర్శ చ సురశ్రేష్ఠః శ్రేష్ఠే తపసి నిష్ఠితామ్ ।**

**ప్రతిష్ఠామివ విశ్వస్య భవానీం పరమేశ్వరీమ్ ॥**

**ననామ చాస్య జగతో మాతరం స్వస్య వై హరేః ।**

**రుద్రస్య చ పితుర్భార్యామార్యామద్రీశ్వరాత్మజామ్ ॥**

**బ్రహ్మాణమాగతం దృష్ట్వా దేవీ దేవగణైస్సహ ।**

**అర్ఘ్యం తదర్హం దత్త్వాఽస్మై స్వాగతాద్యైరుపాచరత్ ॥**

**తాం చ ప్రత్యుపచారోక్తిం పురస్కృత్యాభినంద్య చ ।**

**పప్రచ్ఛ తపసో హేతుమజానన్నివ పద్మజః॥**

ఈ విధముగా ప్రార్థింపబడిన బ్రహ్మ దేవతలతో గూడినవాడై, దేవతలకు తన ప్రయత్నముచే కలుగవలసిన దుఃఖనివృత్తిని గురించి మనస్సులో తలపోస్తూ పార్వతీదేవియొక్క తపోవనమునకు వెళ్లెను (21). ఆయన గొప్ప తపస్సును దృఢముగా చేయుచున్నట్టియు, జగత్తునకు ఆధారము వలెనున్నట్టియు, పరమేశ్వరియగు భవానిని చూచెను (22). జగత్తునకు, తనకు, విష్ణువునకు మరియు రుద్రునకు కూడ తండ్రియగు శివుని భార్య, సర్వశ్రేష్ఠురాలు, పర్వతరాజు పుత్రిక యగు ఆ దేవికి ఆయన నమస్కరించెను (23). దేవగణములతో గూడి వచ్చియున్న బ్రహ్మను చూచి ఆ దేవి ఆయనకు తగిన విధముగా అర్ఘ్యమును ఇచ్చి స్వాగతమును పలికి ఉపచారములను సమర్పించెను (24). పద్మసంభవుడగు బ్రహ్మ ఆ ఉపచారములకు తగిన రీతిలో బదులు చెప్పి ఆమెను సత్కరించి అభినందించి తెలియని వాడు వలె ఆమె తపస్సును చేయుటకు గల కారణమును గురించి ప్రశ్నించెను.

బ్రహ్మో వాచః

తీవ్రేణ తపసానేన దేవ్యా కిమిహ సాధ్యతే।
తపఃఫలానాం సర్వేషాం త్వదధీనా హి సిద్ధయః ॥
యస్యైవ జగతాం భర్తా తమేవ పరమేశ్వరమ్ ।
భర్తారమాత్మనా ప్రాప్య ప్రాప్తం చ తపసః ఫలమ్ ॥
అథవా సర్వమేవైతత్క్రీడావిలసితం తవ ।
ఇదం తు చిత్రం దేవస్య విరహం సహసే కథమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవి ఇచట ఈ విధముగా తీవ్రమగు తపస్సును చేసి దేనిని సాధించ గోరుచు న్నది? తపఃఫలములకు సంబంధించిన సిద్ధులన్నియు నీ అధీనములో నున్నవే గదా! (26) జగత్ప్రభువగు ఆ పరమేశ్వరునే భర్తగా పొందిన నీవు తపస్సు యొక్క ఫలమును పొందియే యున్నావు (27). లేదా, ఇదంతా నీ వినోదము కొరకు చేయబడే విలాసము మాత్రమే. కాని ఇది యొక చిత్రము గలదు. శివుని విరహమును నీవు. ఎట్లు సహించు చున్నావు?

దేవ్యువాచః

సర్గాదౌ భవతో దేవాదుత్పత్తిః శ్రూయతే యదా ।
తదా ప్రజానాం ప్రథమస్త్వం మే ప్రథమజస్సుతః ॥
యదా పునః ప్రజావృద్ధ్యై లలాటోద్భవతో భవః।
ఉత్పన్నోఽభూత్తదా త్వం మే గురుః శ్వశురభావతః ॥
యదా భవద్గిరీంద్రస్తే పుత్రో మమ పితా స్వయమ్ ।
తదా పితామహస్త్వం మే జాతో లో కపితామహ ॥
తదీదృశస్య భవతో లోకయాత్రావిధాయినః ।
వృత్తమంతఃపురే భర్త్రా కథయిష్యే కథం పునః॥
కిమత్ర బహునా దేహే యశ్చాయం మమ కాలిమా।
త్యక్త్వా సత్త్వవిధానేన గౌరీ భవితుముత్సహే ॥

దేవి ఇట్లు పలికెను -

సృష్ట్యాదియందు నీవు పరమేశ్వరునినుండి జన్మించినావని వేదములు చెప్పు చున్నవి. ఆ ప్రసంగములో నీవు నా సంతానములో మొదటి కుమారుడవు (29). మరల సంతానము వర్ధిల్లుట కొరకై శివుడు నీ లలాటమునుండి పుట్టిన సందర్భములో నీవు నాకు మామగారు అగుటచే తండ్రితో సమానము అగుచున్నావు (30). ఓ సర్వలోకపితామహా! మరల, నాకు స్వయముగా తండ్రియగు పర్వతరాజు నీకు పుత్రుడైన సందర్భములో నీవు నాకు పితామహుడ వగుచున్నావు (31). లోకములను సృష్టించే ఇట్టి నీకు అంతఃపురములో నాకు భర్తతో జరిగిన వృత్తాంతమును ఎట్లు చెప్పగలను? (32) ఇన్ని మాటలేల? నా దేహమునకు గల ఈ నల్లదనమును సాత్త్వికమగు విధానములో విడిచి పెట్టి, నేను పచ్చని దానను కాగోరుచున్నాను.

బ్రహ్మోవాచః

ఏతావతా కిమర్థేన తీవ్రం దేవి తపః కృతమ్ ।
స్వేచ్ఛైవ కిమపర్యాప్తా క్రీడేయం హి తవేదృశీ ॥
క్రీడాఽపి చ జగన్మాతస్తవ లో కహితాయ వై ।
అతో మమేష్టమనయా ఫలం కిమపి సాధ్యతామ్ ॥
నిశుంభశుంభనామానౌ దైత్యౌ దత్తవరౌ మయా ।
దృష్ట్వా దేవాన్ ప్రబాధేతే త్వత్తో లబ్ధస్తయోర్వధః ॥
అలం విలంబనేనాత్ర త్వం క్షణేన స్థిరా భవ ।
శక్తిర్విసృజ్యమానాఽద్య తయోర్మృత్యుర్భవిష్యతి ॥
బ్రహ్మణా భ్యర్థితా చైవ దేవీ గిరివరాత్మజా ।
త్వక్కోశం సహసోత్సృజ్య గౌరీ సా సమజాయత ॥
సా త్వక్కోశాత్మనోత్సృష్టా కౌశికీ నామ నామతః ।
కాలీ కాలాంబుదప్రఖ్యా కన్యకా సమపద్యత ॥
సా తు మాయాత్మికా శక్తిర్యోగనిద్రా చ వైష్ణవీ ।
శంఖచక్రత్రిశూలాదిసాయుధాష్టమహాభుజా ॥
సౌమ్యా ఘోరా చ మిశ్రా చ త్రినేత్రా చంద్రశేఖరా ।
అజాతపుంస్పర్శరతిరధృష్యా చాతిసుందరీ ॥
దత్తా చ బ్రహ్మణే దేవ్యా శక్తి రేషా సనాతనీ ।
నిశుంభస్య చ శుంభస్య నిహంత్రీ దైత్యసింహయోః ॥
బ్రహ్మణాపి ప్రహృష్టేన తస్మై పరమశక్తయే ।
ప్రబలః కేసరీ దత్తో వాహనత్వే సమాగతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ దేవీ! ఇంతటి చిన్న ప్రయోజనము కొరకై తీవ్రమగు తపస్సును ఏల చేసితివి? దీని కొరకే నీ సంకల్పమాత్రము చాలదా? ఇట్టి తపస్సు నీకు క్రీడయే సుమా! (34) ఓ జగన్మాతా! నీ క్రీడ కూడ లోకములకు హితమును చేకూర్చును. కావున, నీవు ఈ తపస్సుచే నాకు అభీష్టమగు ఫలమును దేనినైననూ సంపాదించుము (35). నిశుంభశుంభులనే ఇద్దరు రాక్షసులకు నీ చేతిలో మరణము కలుగునట్లు నేను వరముల నిచ్చితిని. వారు గర్వించి దేవతలను బాధించు చున్నారు (36). ఈ విషయములో విలంబము వలన ప్రయోజనము లేదు. నీవు క్షణకాలము స్థిరముగా నుండుము. ఇప్పుడు విడువబడ బోయే శక్తి వారిద్దరిని సంహరించ గలదు (37). ఈ విధముగా బ్రహ్మ ప్రార్థించగా, పర్వతరాజపుత్రిక యగు ఆ దేవి వెంటనే శరీరముయొక్క పై చర్మమును విడిచి పెట్టి పచ్చని దేహవర్ణము గలది ఆయెను (38). తాను విడిచి పెట్టిన ఆ పై చర్మము నల్లని మేఘము వలె ప్రకాశించే కౌశికి అనే కన్యకరూపమును దాల్చెను (39). మాయ (పార్వతి) యొక్క స్వరూపమగు ఆ శక్తి విష్ణువుయొక్క యోగనిద్ర అయినది. ఆమె శంఖము, చక్రము, త్రిశూలము మొదలగు ఆయుధములతో కూడిన ఎనిమిది

పెద్ద భుజములను కలిగి యుండెను (40). మూడు కన్నులు గలది, చంద్రవంకను శిరస్సుపై దాల్చినది, పురుషస్పర్శను మరియు రతిని యెరుంగనిది, గొప్ప సౌందర్యము గలది అగు ఆమెకు సౌమ్య ( ప్రసన్నము), ఘోర (భయంకరము), మరియు మిశ్ర (రెండింటి కలయిక) అనే మూడు రూపములు గలవు (41). నిశుంభశుంభులనే రాక్షసశ్రేష్ఠులను సంహరించే అనాది యగు శక్తిని బ్రహ్మ ఆ దేవికి ఇచ్చెను మరియు బ్రహ్మ చాల సంతోషించి మహాశక్తిస్వరూపిణి యగు ఆమెకు వాహనముగా నుండుట కొరకై అచటకు వచ్చియున్న గొప్ప బలము గల సింహమును ఇచ్చెను.

**వింధ్యే చ వసతిం తస్యాః పూజామాసవపూర్వకైః ।**
**మాంసైర్మత్స్యైరపూపైశ్చ నిర్వర్త్యాసౌ సమాదిశత్ ॥**
**సా చైవ సంమతో శక్తిర్బ్ర హ్మణో విశ్వకర్మణః।**
**ప్రణమ్య మాతరం గౌరీం బ్రహ్మాణం చానుపూర్వశః ॥**
**శక్తిభిశ్చాపి తుల్యాభిస్స్వాత్మజాభిరనేకశః ।**
**పరీతా ప్రయయౌ వింధ్యం దైత్యేంద్రౌ హంతుముద్యతా ॥**
**నిహతౌ చ తయా తత్ర సమరే దైత్యపుంగవౌ।**
**తద్బాణై కామబాణైశ్చ ఛిన్నభిన్నాంగమానసౌ ॥**
**తద్యుద్ధవిస్తరశ్చాత్ర న కృతోఽన్యత్ర వర్ణనాత్ ।**
**ఊహనీయం పరస్మాచ్చ ప్రస్తుతం వర్ణయామి వః ॥**
**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే**
**దేవీగౌరత్వభవనం నామ పంచవింశోఽ ధ్యాయః ॥**

ఆయన ఆమెను మద్యము, మాంసములు, చేపలు, అప్పములు అను వాటితో పూజించి విం◌ిధ్య పర్వతముపై నివాసమును నిర్దేశించెను (44). ఈ విధముగా సన్మానించబడిన ఆ శక్తి తల్లియగు గౌరికి, జగత్తును సృష్టించే బ్రహ్మకు వరుసగా నమస్కరించెను (45). తననుండి పుట్టి తనతో సమానమైన అనేకులగు శక్తులతో ఆమె చుట్టువార బడినదై, ఆ రాక్షసవీరులను సంహరించుటకు సిద్ధపడి వింధ్య పర్వతమునకు వెళ్లెను (46). ఆమె అచట ఆ రాక్షసవీరులను యుద్ధములో సంహరించెను. మన్మథుని బాణములచే కొట్ట బడిన మనస్సులు గల ఆ రాక్షసుల దేహములను ఆమె తన బాణములతో కొట్టి సంహరించెను (47). ఆ యుద్ధము మరియొక చోట వర్ణించబడి యుండుటచే ఇచట వర్ణించ బడుట లేదు. మరియొక స్థానమునుండి ఆ వివరములను తెలియవలెను. నేను మీకు ప్రస్తుతవృత్తాంతమును వర్ణించెదను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండములో పార్వతి గౌరి యగుటను వర్ణించే ఇరువది అయిదవ అధ్యాయము ముగిసినది.

# 26 - వ్యాఘ్రమునకు ఉత్తమగతి లభించుట

**వాయురువాచః**

**ఉత్పాద్య కౌశికీం గౌరీ బ్రహ్మణే ప్రతిపాద్య తామ్ ।**
**తస్య ప్రత్యుపకారాయ పితామహమథాబ్రవీత్ ॥**

వాయువు ఇట్లు పలికెను -

గౌరి కౌశికి కి జన్మనిచ్చి ఆమెను బ్రహ్మకు అప్పజెప్పి, తరువాత దానికి ప్రత్యుపకారమును గోరి ఆమె పితామహునితో నిట్లు పలికెను.

**దేవ్యువాచః**

**దృష్టః కిమేష భవతా శార్దూలో మదుపాశ్రయః ।**
**అనేన దుష్టసత్త్వేభ్యో రక్షితం మత్తపోవనమ్ ॥**
**మయ్యర్పితమనా ఏష భజతే మామనన్య ధీః ।**
**అస్య సంరక్షణాదన్యత్ప్రియం మమ న విద్యతే ॥**
**భవితవ్యమనేనాతో మమాంతఃపురచారిణా ।**
**గణేశ్వరపదం చాస్మై ప్రీత్యా దాస్యతి శంకరః ॥**
**ఏనమగ్రేసరం కృత్వా సఖీభిర్గంతుముత్సహే ।**
**ప్రదీయతామనుజ్ఞా మే ప్రజానాం పతినా త్వయా ॥**
**ఇత్యుక్తః ప్రహసన్ బ్రహ్మా దేవీం ముగ్ధామివ స్మయన్ ।**
**తస్య తీవ్రై ః పురావృత్తైర్దౌరాత్మ్యం సమవర్ణయత్ ॥**

దేవి ఇట్లు పలికెను -

నన్ను ఆశ్రయించుకొని యున్న ఈ పెద్దపులిని నీవు చూచితివా? ఇది నా తపోవనమును దుష్టమృగముల బారినుండి కాపాడినది (2). ఇది మరియొక విషయము వైపునకు బుద్ధిని మళ్లించకుండగా, నాపై అర్పించబడిన మనస్సు గలదై నన్ను సేవించుచున్నది. నాకు దీనిని సంరక్షించుట కంటే మరియొక ప్రీతికరమైన విషయము లేదు (3). కావున, ఇది నా అంతఃపురములో సంచరించునది. కావలెను. శంకరుడు దీనికి ప్రీతితో గణాధ్యక్ష పదవిని ఈయగలడు (4). ఇది ముందు నడచుచుండగా నేను సఖురాండ్రతో గూడి నడువవలెనని కోరుచున్నాను. ప్రజాపతివగు నీవు నాకు అనుమతిని ఈయవలెను (5), ఆమె ఇట్లు పలుకగా బ్రహ్మ నవ్వి, దేవికి తెలియదా యన్నట్లు ఆ పెద్దపులి పూర్వములో చేసిన చెడు పనులతో కూడిన దుష్టస్వభావమును గురించి చక్కగా వర్ణించెను.

బ్రహ్మోవాచ।

పశౌ దేవి మృగాః క్రూరాః క్వ చ తేఽనుగ్రహాశ్శుభః।
ఆశీవిషముఖే సాక్షాదమృతం కిం నిషిచ్యతే ॥
వ్యాఘ్రమాత్రేణ సన్నేష దుష్టః కోఽపి నిశాచరః।
అనేన భక్షితా గావో బ్రాహ్మణాశ్చ తపోధనాః ॥
తర్పయంస్తాన్ యథాకామం కామరూపీ చరత్యసౌ।
అవశ్యం ఖలు భోక్తవ్యం ఫలం పాపస్య కర్మణః ॥
అతః కిం కృపయా కృత్యమీదృశేషు దురాత్మసు।
అనేన దేవ్యాః కిం కృత్యం ప్రకృత్యా కలుషాత్మనా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పశుజాతికి చెందిన ఈ మృగములు క్రూరమైనవి. ఓ దేవీ! శుభకరమగు నీ అనుగ్రహము ఎక్కడ ప్రసరించు చున్నది? సాక్షాత్తుగా పాముయొక్క నోటిలో అమృతమును పోయుచున్నావా యేమి? ఇది కేవలము పెద్దపులి రూపములోనున్న ఎవరో ఒక దుష్టుడగు రాక్షసుడై యుండును. ఇది గోవులను, తపోధనులగు బ్రాహ్మణులను భక్షించినది (8). కామరూపియగు ఈ రాక్షసుడు తనకు నచ్చిన రూపమును దాల్చి, ఆ రూపమునకు తృప్తిని కలిగించుచూ సంచరించుచున్నాడు. ఈతడు పాపకర్మయొక్క ఫలమును తప్పక అనుభవించ వలెను (9). కావున, ఇట్టి దుష్టులయందు దయను చూపుట వలన ఏమి ప్రయోజనము? స్వభావముచే దుష్టబుద్ధియగు ఈ పులితో దేవికి పని యేమి?

దేవ్యువాచ।

యదుక్తం భవతా సర్వం తథ్యమస్త్వయమీదృశః।
తథాపి మాం ప్రపన్నోఽభూన్న త్యాజ్యో మాముపాశ్రితః ॥

దేవి ఇట్లు పలికెను -

నీవు చెప్పిన విషయము అంతయు సత్యమే యగుగాక! ఈ పులి అట్టిదియే. అయిననూ, నన్ను ఆశ్రయించి శరణు పొందినది గనుక, దానిని విడిచి పెట్టుట నాకు తగదు.

బ్రహ్మోవాచః

అస్య భక్తిమవిజ్ఞాయ ప్రాగ్వృత్తం తే నివేదితమ్।
భక్తిశ్చేదస్య కిం పాపైర్న తే భక్తః ప్రణశ్యతి ॥
పుణ్యకర్మాపి కిం కుర్యాత్త్వదీయాజ్ఞానపేక్షయా।
అజా ప్రజ్ఞా పురాణీ చ త్వమేవ పరమేశ్వరీ ॥
త్వదధీనా హి సర్వేషాం బంధమోక్షవ్యవస్థితిః।
త్వద్భృతే పరమా శక్తిస్సంసిద్ధిః కస్య కర్మణా ॥

త్వమేవ వివిధా శక్తిః భవానామథ వా స్వయమ్।
అశక్తః కర్మకరణే కర్తా వా కిం కరిష్యతి ॥
విష్ణోశ్చ మమ చాన్యేషాం దేవదానవరక్షసామ్।
తత్తదైశ్వర్యసంప్రాప్త్యై తవైవాజ్ఞా హి కారణమ్ ॥
అతీతా ఖల్వసంఖ్యాతా బ్రహ్మేణో హరయో భవాః ।
అనాగతాస్త్వసంఖ్యాతాస్త్వదాజ్ఞానువిధాయినః ॥
త్వామనారాధ్య దేవేశి పురుషార్థచతుష్టయమ్ ।
లబ్ధుం న శక్యమస్మాభిరపి సర్వైస్సురోత్తమైః ॥
వ్యత్యాసోఽపి భవేత్సద్యో బ్రహ్మత్వస్థావరత్వయోః ।
సుకృతం దుష్కృతం చాపి త్వయైవ స్థాపితం యతః ॥
త్వం హి సర్వజగద్భర్తుశ్శివస్య పరమాత్మనః ।
అనాదిమధ్యనిధనా శక్తిరాద్యా సనాతనీ ॥
సమస్తలోకయాత్రార్థం మూర్తిమావిశ్య కామపి।
క్రీడసే వివిధైర్భావైః కస్త్వాం జానాతి తత్త్వతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దీని భక్తిని గురించి నాకు తెలియక పోవుటచే, నేను దీని పూర్వవృత్తాంతమును ు చెప్పియుంటిని. దీనికి భక్తి యున్నచో, పాపములతో పని యేమి? నీ భక్తునకు వినాశము లేదు (12). పుణ్యాత్ముడైననూ నీ యాజ్ఞను అపేక్షించ కుండగా ఏమి చేయగలడు? పుట్టుక లేని సనాతనమగు ప్రజ్ఞ పరమేశ్వరి యగు నీ స్వరూపమే (13). సర్వప్రాణుల బంధమోక్షవ్యవస్థ నీ అధీనములో నున్నది. పరమశక్తిస్వరూపిణివి అగు నీవు లేనిచో, కర్మ వలన ఎవనికి సిద్ధి లభించును? (14) ప్రాణులలో వివిధరూపములలోనుండే శక్తివి నీవే. స్వయముగా కర్మలను చేయుటలో అసమర్థుడగు కేవల కర్త (శక్తి లేనిదే) ఏమి చేయగలడు? (15) విష్ణువు, నేను, ఇతరులగు దేవతలు, దానవులు, రాక్షసులు ఆయా ఐశ్వర్యములను పొందుటకు నీ ఆజ్ఞయే కారణము (16). నీ ఆజ్ఞను పాటించే బ్రహ్మవిష్ణురుద్రులు లెక్క లేనంత మంది గడచి పోయినారు; ఇంకనూ లెక్క లేనంత మంది రానున్నారు (17). ఓ దేవదేవీ! దేవతలలో శ్రేష్ఠులమగు మేమందరము కూడా నిన్ను ఆరాధించనిదే చతుర్విధ పురుషార్థములను పొంద శక్యము కాదు (18). నీవు బ్రహ్మను చెట్టుగను, చెట్టును బ్రహ్మగను మార్చి వేయగలవు. ఏలయనగా, పుణ్యపాపములను స్థాపించునది నీవు మాత్రమే ( 19). సర్వజగత్తులకు ప్రభువగు శివపరమాత్మయొక్క ఆదిమధ్యాంతములు లేని శక్తివి నీవే. సనాతనురాలవగు నీవే సర్వమునకు కారణమగుచున్నావు (20). నీవు ఏదో ఒక రూపమును దాల్చి వివిధప్రాణులతో క్రీడిస్తూ సమస్తలోకములను నడిపించు చున్నావు. నిన్ను యథార్థముగా ఎవడు తెలియగలడు?

అతో దుష్కృతికర్మాపి వ్యాఘ్రోఽయం త్వదనుగ్రహాత్ ।
ప్రాప్నోతు పరమాం సిద్ధిమత్ర కః ప్రతిబంధకః ॥
ఇత్యాత్మనః పరం భావం స్మారయిత్వానురూపతః ।
బ్రహ్మణాభ్యర్థితా గౌరీ తపసోఽపి న్యవర్తత ॥
తతో దేవీమనుజ్ఞాప్య బ్రహ్మణ్యంతర్హితే సతి ।
దేవీ చ మాతరం దృష్ట్వా మేనాం హిమవతా సహ ॥
ప్రణమ్యాశ్వాస్య బహుధా పితరౌ విరహాసహౌ ।
తపః ప్రణయినో దేవీ తపోవనమహీరుహాన్ ॥
విప్రయోగశుచేవాగ్రే పుష్పబాష్పం విముంచతః ।
తత్తు చ్ఛాఖాసమారూఢవిహగోదీరితై రుతైః ॥
వ్యాకులం బహుధా దీనం విలాపమివ కుర్వతః।
సఖీభ్యః కథయంత్యేవం సత్వరా భర్తృదర్శనే ॥
పురస్కృత్య చ తం వ్యాఘ్రం స్నేహాత్పుత్రమివౌరసమ్ ।
దేహస్య ప్రభయా చైవ దీపయంతీ దిశో దశ ॥
ప్రయయౌ మందరం గౌరీ యత్ర భర్తా మహేశ్వరః ।
సర్వేషాం జగతాం ధాతా కర్తా పాతి వినాశకృత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే వ్యాఘ్రస్య ఉత్తమ గతివర్ణనం నామ షడ్వింశోఽ ధ్యాయః ॥

కావున, ఈ పెద్దపులి చెడ్డ పనులను చేసినదే అయినప్పటికీ నీ అనుగ్రహముచే సర్వోత్కృష్టమగు సిద్ధిని బడయుగాక! దీనిలో ప్రతిబంధకమేమున్నది? (22) ఈ విధముగా యథోచితముగా బ్రహ్మ తనకు గల గొప్ప భక్తిని గుర్తు చేసి ప్రార్థించగా, పార్వతి తపస్సును కూడ విరమించెను (23). తరువాత దేవియొక్క అనుమతిని పొంది బ్రహ్మ అంతర్ధానమును చెందగానే, ఆ దేవి తల్లియగు మేనను మరియు తండ్రియగు హిమవంతుని దర్శించి (24), నమస్కరించి, విరహమును సహించ లేకున్న తల్లిదండ్రులను పలువిధములుగా ఓదార్చెను. తపోవనము నందు దేవి తపస్సు చేయుచుండగా ఆమెకు అచటి వృక్షములపై ప్రేమ ఉండెను (25). అవి ఆమె వియోగముయొక్క దుఃఖము కలవా యన్నట్లు పుష్పములనే బాష్పములను విడిచిపెట్టి, కొమ్మలను ఆశ్రయించి యున్న పక్షుల కిలకిల ధ్వనులచే పరి పరి విధములుగా దీనముగా విలపించు చున్నవా యన్నట్లు ఉన్న దృశ్యమును ఆమె చెలికత్తెలకు వర్ణించి చెప్పెను. ఆమె భర్తను దర్శించుటకే తొందర పడుచుండెను (26, 27). ఆ గౌరి కన్న కొడుకును వలె ప్రేమించే పెద్ద పులిని ఎదుట నుంచుకొని, తన దేహముయొక్క కాంతిచే పది దిక్కులను ప్రకాశింపజేయుచూ, సర్వలోకములను సృష్టించి పాలించి పోషించి వినాశము చేసే తన భర్తయగు మహేశ్వరుడు ఉన్న మందిరమునకు పయనమయ్యెను.

# 27 – శివపార్వతుల పునస్సమాగమము

**ఋషయ ఊచుః ।**

**కృత్వా గౌరం వపుర్దివ్యం దేవీ గిరివరాత్మజా ।**
**కథం దదర్శ భర్తారం ప్రవిష్టా మందిరం సతీ ॥**
**ప్రవేశసమయే తస్యా భవనద్వారగోచరైః ।**
**గణేశైః కిం కృతం దేవస్తాన్ దృష్ట్వా కిం తదాఽకరోత్ ॥**

ఋషులు ఇట్లు పలికిరి –

పార్వతీదేవి పచ్చని దివ్యదేహమును పొంది మందిరములో ప్రవేశించినదై భర్తను దర్శించిన విధమెట్టిది? (1) ఆమె భవనములో ప్రవేశించిన సమయములో ద్వారము వద్దనుండే గణాధ్యక్షులు ఏమి చేసిరి? శివుడు వారిని చూచి అపుడేమి చేసెను? **వాయురువాచః**

**ప్రవక్తుమంజసాఽశక్యస్తా దృశః పరమో రసః ।**
**యేన ప్రణయగర్భేణ భావో భావవతాం హృతః ॥**
**ద్వాఃస్థైస్ససంభ్రమై రేవ దేవో దేవ్యాగమోత్సుకః ।**
**శంకమానా ప్రవిష్టాంతస్తం చ సా సమపశ్యత ॥**
**తైస్తైః ప్రణయభావైశ్చ భవనాంతరవర్తిభిః ।**
**గణేంద్రై ర్వందితా వాచా ప్రణనామ త్రియంబకమ్ ॥**
**ప్రణమ్య నోత్థితా యావత్తావత్తాం పరమేశ్వరః ।**
**ప్రగృహ్య దోర్భ్యామశ్లిష్య పరితః పరయా ముదా ॥**
**స్వాంకే ధర్తుం ప్రవృత్తోఽపి సా పర్యంకే న్యషీదత ।**
**పర్యంకతో బలాద్దేవీం సోంకమారోప్య సుస్మితామ్ ॥**
**సస్మితో వివృతైర్నేత్రై స్తద్వక్త్రం ప్రపిబన్నివ ।**
**తయా సంభాషణాయేశః పూర్వభాషితమబ్రవీత్ ॥**

వాయువు ఇట్లు పలికెను –

సర్వోత్కృష్టమగు ఆ ప్రేమరసమును సంపూర్ణముగా వర్ణించుట సంభవము కాదు. ఆ ప్రేమ సహృదయుల హృదయములను చూరగొన్నది. ద్వారపాలకులు కంగారు పడుచుండగనే ఆమె సందేహిస్తూ లోపలికి ప్రవేశించెను. అచట ఆమె యొక్క రాక కొరకు ఉత్కంఠతో ఎదురు చూచుచున్న శివుని ఆమె చూచెను. భవనము లోపలనుండే గణాధ్యక్షులు ఆయా ప్రేమపూర్వకమగు భావములతో ఆమెకు నమస్కరించిరి. ఆమె ఆ ముక్కంటికి నమస్కారమును చెప్పెను. ఆమె నమస్కరించి లేవబోవునంతలో పరమేశ్వరుడు మహానందముతో ఆమెను పట్టుకొని రెండు చేతులతో పూర్ణముగా కౌగిలించు కొనెను. ఆయన ఆమెను తన అంకముపై కూర్చుండ బెట్టుటకు యత్నించిననూ ఆమె పర్యంకముపైననే కూర్చుండెను. అపుడు ఆమె చిరునవ్వు నవ్వుచుండగా ఆయన

బలముగా ఆ దేవిని పర్యంకమునుండి తన అంకముపై కూర్చుండ బెట్టు కొనెను . ఆయన చిరునవ్వుతో కళ్లను పెద్దవి చేసి ఆమె ముఖమును చూపులతో పానము చేయుచున్నాడా యన్నట్లు ఉండెను. ఆమెతో కబుర్లాడ గోరిన శివుడు తానే ముందుగా ఇట్లు పలికెను.

**దేవదేవ ఉవాచః**

**సా దశా చ వ్యతీతా కిం తవ సర్వాంగసుందరి ।**
**యస్యామనునయోపాయః కోఽపి కోపాన్న లభ్యతే ॥**
**స్వేచ్ఛయాపి న కాలీతి నాన్యవర్ణవతీతి చ ।**
**త్వత్స్వభావాహృతం చిత్తం సుభ్రు చింతావహం మమ ॥**
**విస్మృతః పరమో భావః కథం స్వేచ్ఛాంగయోగతః ।**
**న సంభవంతి యే తత్ర చిత్తకాలుష్య హేతవః ॥**
**పృథగ్జనవదన్యోన్యం విప్రియస్యాపి కారణమ్ ।**
**ఆవయోరపి యద్యస్తి నాస్త్యేవైతచ్చరాచరమ్ ॥**
**అహమగ్నిశిరో నిష్ఠస్త్వం సోమశిరసి స్థితా ।**
**అగ్నీషోమాత్మకం విశ్వమావాభ్యాం సమధిష్ఠితమ్ ॥**
**జగద్ధితాయ చరతో స్వేచ్ఛాధృతశరీరయోః ।**
**ఆవయోర్వి ప్రయోగే హి స్యాన్నిరాలంబనం జగత్ ॥**
**అస్తి హేత్వంతరం చాత్ర శాస్త్ర యుక్తవినిశ్చితమ్ ।**
**వాగర్థమయ మే వైతజ్జగత్ స్థావరజంగమమ్ ॥**
**త్వం హి వాగమృతం సాక్షాదహమర్థామృతం పరమ్ ।**
**ద్వయమప్యమృతం కస్మాద్వియుక్తముపపద్యతే ॥**
**విద్యా ప్రత్యాయికా త్వం మే వేద్యోఽహం ప్రత్యయాత్తవ ।**
**విద్యావేద్యాత్మనోరేవ విశ్లేషః కథమావయోః ॥**
**న కర్మణా సృజామీదం జగత్ప్రతిసృజామ్ చ ।**
**సర్వస్యా జ్ఞైకలభ్యత్వాదాజ్ఞా త్వం హి గరీయసీ ॥**

దేవదేవుడుగు శివుడు ఇట్లు పలికెను -

ఓ సర్వావయవసుందరీ! ఒకప్పుడు నీవు కోపించగా నాకు నిన్ను ఓదార్చే ఉపాయమే ్రకరువయ్యెను. అట్టి కోపావస్థ ఇప్పుడు నీకు తొలగిపోయినదా? నీవు నల్లగా గానీ, మరియొక రంగులో గానీ ఉండవలెననే ఇచ్ఛ నాకు లేదు. నా మనస్సు నీ స్వభావముచే మాత్రమే ఆకర్షించ బడినది. కాని నాకు ఈ విషయము దుఃఖమును కలిగించు చున్నది. నీవా పరమ ప్రేమను ఎట్లు మరువ గల్గితివి? మనము మన ఇచ్ఛచే మాత్రమే దేహములను ధరించితిమి. కావున, మనస్సులకు కాలుష్యమును కలిగించే పరిస్థితులు మన మధ్య సంభవము కావు. సామాన్యజనులకు వలెనే మన ఇద్దరికి కూడా వైమనస్యము కలిగే కారణములు ఉండే పక్షములో, ఈ చరాచరజగత్తు ఉండనే ఉండదు. నేను అగ్నియొక్క శిరస్సుపై

నుండగా, నీవు చంద్రుని శిరస్సుపై నున్నావు. అగ్ని మరియు చంద్రుడు (భోక్తృ-భోగ్యములు) అను తత్త్వములతో నిండియున్న జగత్తునకు మనమిద్దరమే అధిష్ఠానమై యున్నాము. లో కముల శ్రేయస్సు కొరకై స్వేచ్ఛగా శరీరములను ధరించి సంచరించే మనమిద్దరము విడి పోయినచో, జగత్తునకు ఆశ్రయము ఉండదు. ఈ సందర్భములో శాస్త్రముచే మరియు యుక్తులచే నిర్ధారింప బడిన మరియొక కారణము కూడ గలదు. చరచరాత్మకమగు ఈ జగత్తు కేవలము నామ (వాక్కు) రూపాత్మకము (అర్థము) మాత్రమే. అమృతమగు వాక్కు నీవే. పరమామృతమగు అర్థము సాక్షాత్తుగా నేనే. అమృతములగు ఈ రెండింటికీ వియోగము ఎట్లు సంభవమగును? నా స్వరూపజ్ఞానమును కలిగించే మనోవృత్తి నీవే. అఖండార్థబోధను కలిగించే నీ స్వరూపమగు వృత్తికే తెలియబడే తత్త్వము నేనే. ఈ విధముగా జ్ఞానజ్ఞేయరూపములలో నుండే మన యిద్దరి వియోగము ఎట్లు సంభవము? నేను కేవలము నా ప్రయత్నముచే మాత్రమే ఈ జగత్తును సృష్టించి నశింప జేయుట లేదు. సర్వము అజ్ఞచే మాత్రమే లభించుచున్నది. అట్టి సర్వోత్కృష్టమగు ఆజ్ఞ నీవే.

ఆజ్ఞైకసారమైశ్వర్యం యస్మాత్స్వాతంత్ర్యలక్షణమ్ ।
ఆజ్ఞయా విప్రయుక్తస్య చైశ్వర్యం మమ కీదృశమ్ ॥
న కదాచిదవస్థానమావయోర్విప్రయుక్తయోః ।
దేవానాం కార్యముద్దిశ్య లీలోక్తిం కృతవానహమ్ ॥
త్వయాప్యవిదితం నాస్తి కథం కుపితవత్యసి ।
తతస్త్రిలోకరక్షార్థే కోపో మయ్యపి తే కృతః ॥
యదనర్థాయ భూతానాం న తదస్తి ఖలు త్వయి ।
ఇతి ప్రియంవదే సాక్షాదీశ్వరే పరమేశ్వరే ॥
శృంగారభావసారాణాం జన్మభూమిరకృత్రిమా ।
స్వభర్త్రా లలితం తథ్యముక్తం మత్వా స్మితోత్తరమ్ ॥
లజ్జయా న కిమప్యూచే కౌశికీ వర్ణనాత్పరమ్ ।
తదేవ వర్ణమామ్యద్య శృణు దేవ్యాశ్చ వర్ణనమ్ ॥

ఈశ్వరత్వము యొక్క సారభూతమైన తత్త్వము ఆజ్ఞయే. ఏలయనగా, స్వాతంత్ర్యము యొక్క లక్షణము అదియే. ఆజ్ఞతో వియోగము కలిగినచో, నా ఈశ్వరత్వము ఏ పాటిది? మనిద్దరి మధ్యలో వియోగము ఎప్పటికైననూ జరిగేది కాదు. దేవతల కార్యమునుద్దేశించి నేను పరిహాసవచనమును పలికితిని. నీకు కూడ తెలియనిది లేదు. నీకు కోపము ఎట్లు వచ్చినది? నీవు కూడ మూడు లోకముల రక్షణ కొరకు మాత్రమే నాపై కోపించితివి. ప్రాణులకు హానిని కలిగించేది ఏదైనా అది నీయందు లేదు. ఈ విధముగా పరమేశ్వరుడగు శివుడే సాక్షాత్తుగా ప్రియవచనములను పలుకుచుండగా, సారభూతమైన శృంగారభావములకు అతిసహజమగు జన్మస్థానమైన ఆ దేవి తన భర్త సత్యమును మధురముగా పలికినాడని తల పోసి చిరునవ్వు నవ్వి, కౌశికిని వర్ణించుటను మినహాయించి సిగ్గుతో ఇతరమగు సమాధానమును చెప్పలేదు. దేవి చేసిన ఆ వర్ణనమునే నేను కూడ చెప్పెదను. వినుము.

దేవ్యువాచః

కిం దేవేన న సా దృష్టా యా సృష్టా కౌశికీ మయా ।
తాదృశీ కన్యకా లోకే న భూతా న భవిష్యతి ॥
తస్యా వీర్యం బలం వింధ్య నిలయం విజయం తథా ।
శుంభస్య చ నిశుంభస్య మారణే చ రణే తయోః ॥
ప్రత్యక్షఫలదానం చ లోకాయ భజతే సదా ।
లోకానాం రక్షణం శశ్వద్బ్రహ్మా విజ్ఞాపయిష్యతి ॥
ఇతి సంభాషమాణాయా దేవ్యా ఏవాజ్ఞయా తదా ।
వ్యాఘ్రస్సఖ్యా సమానీయ పురోఽవస్థాపితస్తదా ॥
తం ప్రేక్ష్యాహ పునర్దేవీ దేవానీతముపాయనమ్ ।
వ్యాఘ్రం పశ్య న చానేన సదృశో మదుపాసకః ॥
అనేన దుష్టసంఘేభ్యో రక్షితం మత్తపోవనమ్ ।
అతీవ మమ భక్తశ్చ విశ్రబ్ధశ్చ స్వరక్షణాత్ ॥
స్వదేశం చ పరిత్యజ్య ప్రసాదార్థం సమాగతః ।
యది ప్రీతిరభూన్మత్తః పరాం ప్రీతిం కరోషి మే ॥
నిత్యమంతః పురద్వారి నియోగాన్నందినస్స్వయమ్ ।
రక్షిభిస్సహ తచ్చిహ్నైర్వర్తతామయమీశ్వర ॥

దేవి ఇట్లు పలికెను -

నేను సృష్టించిన కౌశికి దేవునిచే (నీచే) చూడబడినదా యేమి? లోకములో అట్టి కన్య ఇంతవరకు పుట్టలేదు; ఈ పైన పుట్టబోదు. వింధ్యపర్వతమునందు శుంభనిశుంభులతోటి యుద్ధమునందు ఆమె ప్రదర్శించిన బలపరాక్రమములను, ఆమె వారిని సంహరించి విజయమును పొందిన విధమును, ఆమెను సేవించు జనులకు ఆమె ప్రత్యక్షఫలమునిచ్చు విషయమును, ఆమె లోకములను రక్షించే విషయమును గురించి బ్రహ్మ మీకు నిశ్చయముగా చెప్పగలడు. ఈ విధముగా సంభాషించుచున్న ఆ దేవి ఆజ్ఞాపించగా, అపుడు చెలికత్తె పెద్దపులిని తీసుకువచ్చి యెదుట నిలిపెను. దానిని చూచి దేవి మరల ఇట్లు చెప్పెను. దేవా! నేను ఒక బహుమానమును తెచ్చితిని. ఈ పెద్ద పులిని చూడుడు. నన్ను ఉపాసించు వారిలో దీనితో సమానమైన వారు లేరు. ఇది నా తపోవనమును దుష్టమృగముల సముదాయమునుండి రక్షించినది. దీనికి నాయందు భక్తి మెండు. నన్ను రక్షించిన ఈ పులి నమ్మదగినది. ఇది తాను పుట్టిన స్థానమును విడిచిపెట్టి నీ అనుగ్రహము కొరకై వచ్చినది. ఓ ఈశ్వరా! నీకు నా వలన ప్రీతి కలిగినచో, నీకు నాపై ప్రేమ ఉన్నచో, ఇది నందీశ్వరుని ఆజ్ఞచే రక్షకభటుల గుర్తులను దాల్చి వారితో కలిసి నిత్యము అంతఃపురద్వారము వద్ద స్వయముగా నిలబడుగాక!

వాయురువాచః

మధురం ప్రణయోదర్కం శ్రుత్వా దేవ్యాశ్శుభం వచః ।
ప్రీతోఽస్మీత్యాహ తం దేవస్స చాదృశ్యత తత్క్షణాత్ ॥
బిభ్రద్వేత్రలతాం హైమీం రత్నచిత్రం చ కంచుకమ్ ।
ఛురికామురగప్రఖ్యాం గణేశో రక్షవేషధృక్ ॥
యస్మాత్సోమో మహాదేవో నందీ చానేన నందితః ।
సోమనందీతి విఖ్యాతస్తస్మాదేష సమాఖ్యయా ॥
ఇత్థం దేవ్యాః ప్రియం కృత్వా దేవశ్చార్ధేందు భూషణః ।
భూషయామాస తం దివ్యైర్భూషణై రత్నభూషితైః ॥
తతస్స గౌరీం గిరిశో గిరీంద్రజాం సగౌరవం సర్వమనోహరాం హరః ।
పర్యంకమారోప్య వరాంగభూషణైర్విభూషయామాస శశాంకభూషణః ॥
ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే శివపార్వతీ
పునస్సమాగమవర్ణనం నామ సప్తవింశోఽధ్యాయః ॥

వాయువు ఇట్లు పలికెను -

మధురమైనది, ప్రేమను వర్ధిల్ల జేయునది, శుభకరమైనది అగు దేవియొక్క వచనమును విని ఆ శివుడు ఆ పెద్ద పులిని ఉద్దేశించి, నేను సంతసించితిని అని పలికెను. వెనువెంటనే దాని రూపములో మార్పు కానవచ్చెను. అది బంగరు బెత్తమును చేతబట్టెను. రత్నములతో రంగురంగుల కాంతులను విరజిమ్మే అంగీని ధరించెను. అది గణాధ్యక్షుడై రక్షకుని వేషమును ధరించి పాము వలె ప్రకాశించే కత్తిని చేత బట్టెను. అది పార్వతీసమేతుడగు మహాదేవునకు మరియు నందీశ్వరునకు ప్రీతిని కలిగించినది గనుక, అది సోమనంది అను పేరుతో ప్రసిద్ధిని గాంచెను. చంద్రవంకను శిరోభూషణముగా ధరించే శివుడు ఈ విధముగా దేవికి ప్రీతిని కలిగించి, దివ్యములగు రత్నాలంకారములతో ఆ సోమనందిని అలంకరించెను. తరువాత కైలాసపర్వతముపై నివసించువాడు, చంద్రవంకను అనిశగించుకున్నవాడు అగు హరుడు జగదేకసుందరి, పర్వతరాజపుత్రిక అగు గౌరిని సగౌరవముగా తల్పముపై కూర్చుండబెట్టి శ్రేష్ఠమగు ఆభరణములతో అలంకరించెను.

శ్రీశివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో శివపార్వతుల పునస్సమాగమమును వర్ణించే ఇరువది యేడవ అధ్యాయము ముగిసినది.

# 28 – జగత్తు అగ్నీషోమాత్మకము

ఋషయ ఊచుః ।

దేవీం సమాదధానేన దేవేనేదం కిమీరితమ్ ।
అగ్నీషోమాత్మకం విశ్వం వాగర్థాత్మకమిత్యపి ॥
ఆజ్ఞైకసారమైశ్వర్యమాజ్ఞా త్వమితి చోదితమ్ ।
తదిదం శ్రోతుమిచ్ఛామో యథావదనుపూర్వశః ॥

ఋషులు ఇట్లు పలికిరి –

దేవికి సమాధానమును చెప్తూ శివుడు చెప్పిన మాటలకు అర్థమేమి? జగత్తు అగ్ని మరియు సోముని స్వరూపమేననియు, జగత్తు కేవలము నామరూపాత్మకము మాత్రమే ననియు, ఆజ్ఞాపించే సామర్థ్యమే ఈశ్వరత్వము యొక్క సారభూతమైన లక్షణము కాగా అట్టి ఆజ్ఞ నీవేననియు శివుడు చెప్పియున్నాడు. వీటి యర్థమును మేము యథాతథముగా అదే వరుసలో వినగోరుచున్నాము.

అగ్నిరిత్యుచ్యతే రౌద్రీ ఘోరా యా తైజసీ తనుః ।
సోమశ్శాక్తోఽమృతమయశ్శక్తేశ్శాంతికరీ తనుః ॥
అమృతం యత్ప్రతిష్ఠా సా తేజో విద్యాకలా స్వయమ్ ।
భూతసూక్ష్మేషు సర్వేషు త ఏవ రసతేజసీ ॥
ద్వివిధా తేజసో వృత్తిస్సూర్యాత్మా చానలాత్మికా ।
తథైవ రసవృత్తిశ్చ సోమాత్మా చ జలాత్మికా ॥
విద్యుదాదిమయం తేజో మధురాదిమయో రసః ।
తేజో రసవిభేదైస్తు ధృతమేతచ్చరాచరమ్ ॥
అగ్నేరమృతనిష్పత్తిరమృతేనాగ్నిరేధతే ।
అత ఏవ హి విక్రాంతమగ్నీషోమం జగద్ధితమ్ ॥
హవిషే సస్యసంపత్తిర్వృష్టిస్సస్యాభివృద్ధయే ।
వృష్టేరేవ హవిస్తస్మాదగ్నీషోమధృతం జగత్ ॥
అగ్నిరూర్ధ్వం జ్వలత్యేష యావత్సౌమ్యం పరామృతమ్ ।
యావదగ్న్యాస్పదం సౌమ్యమమృతం చ స్రవత్యధః ॥
అత ఏవ హి కాలాగ్నిరధస్తాచ్ఛక్తిరూర్ధ్వతః ।
యావదాదహనం చోర్ధ్వమధశ్చాప్లావనం భవేత్ ॥
ఆధారశక్త్యైవ ధృతః కాలాగ్నిరయమూర్ధ్వగః ।
తథైవ నిమ్నగస్సోమశ్శివశక్తిపదాస్పదః ॥
శివశ్చోర్ధ్వమధశ్శక్తిరూర్ధ్వం శక్తిరధశ్శివః ।
తదిత్థం శివశక్తిభ్యాం నావ్యాప్తమిహ కించన ॥

వాయువు ఇట్లు పలికెను -

రుద్రుని తేజోమయమైన దేహమునకు అగ్నియని పేరు. శక్తియొక్క అమృతమయము మరియు శాంతికరము అగు దేహమే సోముడు. ప్రతిష్ఠాకళయే అమృతము. విద్యాకళ స్వయముగా తేజస్సే. భూతసూక్ష్మములన్నింటిలో గల రసము మరియు తేజస్సు క్రమముగా అవియే. సూర్యుడు, అగ్ని అనే రెండు రూపములలో తేజస్సు ప్రకటమగుచున్నది. అదే విధముగా రసము కూడా చంద్రుడు, నీరు అనే రెండు రూపములలో ప్రకటమగుచున్నది, తేజస్సు మెరుపు మొదలగు రూపములలో నుండగా, రసము తీపి మొదలగు రూపములలో నున్నది. ఈ చరాచరజగత్తు అంతయు ఈ తేజస్సు, రసము అను వాటిలో గల విభిన్నరూపములచే మాత్రమే ధరించబడి యున్నది. అగ్నినుండి అమృతము పుట్టును. అమృతము వలన అగ్ని వర్ధిల్లును. కావున, ఈ విధముగా విస్తరించియున్న అగ్ని మరియు సోములే జగత్తునకు హితమును చేయుచున్నారు. పంటలు బాగుగా పండినచో, హవిస్సు లభించును. వర్షముల వలన పంటలు వర్ధిల్లును. అనగా, వర్షమునుండియే హవిస్సు పుట్టుచున్నది. ఈ విధముగా జగత్తును అగ్ని మరియు సోముడు మాత్రమే ధరించియున్నారు. ఈ అగ్ని పైన సోముని సర్వోత్కృష్టమగు అమృతస్థానము వరకు ప్రజ్వరిల్లును. సోముని అమృతము అగ్నికి ఆధారమగు పృథివీ లో కము వరకు క్రిందకు స్రవించును. అందువలననే, కాలాగ్ని క్రింద, శక్తి పైన గలవు. అగ్నియొక్క గతి పైకీ, జలము యొక్క గతి క్రిందకు ఉండును. పైకి జ్వలించే ఈ కాలాగ్నిని మూలాధారమునందలి శక్తి ధరించి యున్నది. అదే విధముగా, శివశక్తిస్థానమగు సహస్రారమునుండి సోమునీ కిరణములు క్రిందకు ప్రవహించును. శివుడు పైన ఉండగా, శక్తి క్రింద ఉన్నది. శక్తి పైన ఉండగా, శివుడు క్రింద ఉన్నాడు. ఈ విధముగా ఈ జగత్తులో శివశక్తులచే వ్యాప్తము కానిది ఏది లేదు.

**అసకృచ్చాగ్నినా దగ్ధం జగద్యద్భస్మసాత్కృతమ్ ।**
**అగ్నేర్వీర్యమిదం చాహుస్తద్వీర్యం భస్మ యత్తతః ॥**
**యశ్చేత్థం భస్మసద్భావం జ్ఞాత్వా స్నాతి చ భస్మనా ।**
**అగ్నిరిత్యాదిభిర్మంత్రై ర్బద్ధః పాశాత్ప్ర ముచ్యతే ॥**
**అగ్నేర్వీర్యం తు యద్భస్మ సామేనాప్లావితం పునః ।**
**అయోగయుక్త్యా ప్రకృతేరధికారాయ కల్పతే ॥**
**యోగయుక్త్యా తు తద్భస్మ ప్లావ్యమానం సమంతతః ।**
**శాక్తేనామృతవర్షేణ చాధికారాన్నివర్తయేత్ ॥**
**అతో మృత్యుంజయాయేత్థమమృతప్లావనం సదా ।**
**శివశక్త్యమృతస్పర్శే లబ్ధం యేన కుతో మృతిః ॥**

యో వేద దహనం గుహ్యం ప్లావనం చ యథోదితమ్ ।
అగ్నీషోమపదం హిత్వా న స భూయోఽభిజాయతే ॥
శివాగ్నినా తనుం దగ్ధ్వా శక్తిసౌమ్యామృతేన యః ।
ప్లావయేద్యోగమార్గేణ సోఽమృతత్వాయ కల్పతే ॥
హృది కృత్వేమమర్థం వై దేవేన సముదాహృతమ్ ।
అగ్నీషోమాత్మకం విశ్వం జగదిత్యనురూపతః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే
అగ్నీషోమాత్మక జగద్వర్ణనం నామ అష్టావింశోఽధ్యాయః ॥

జగత్తులో సాధారణముగా అగ్నిచే అధికముగా తగులబెట్టబడిన వస్తువు భస్మమగును. కావున, భస్మ అగ్నియొక్క శక్తి గనుక, దానికి అగ్నివీర్యమని పేరు గలదని చెప్పెదరు. ఎవడైతే ఈ విధముగా భస్మయొక్క మహిమను యెరింగి, అగ్నిరితి భస్మ మొదలగు మంత్రములతో భస్మస్నానమును చేయునో, అనగా దేహమంతయు భస్మను ధరించునో, అట్టివాడు బంధములో నున్నచో, ఆ పాశమునుండి విముక్తుడగును. అగ్నియొక్క శక్తియగు భస్మ సోమునిచే తడుపబడినచో, అనగా వెన్నెల తగిలినచో, అది అష్టాంగయోగ సాధనలు లేకుండగనే ప్రకృతిశక్తులపై అధికారమును సాధకునకు ఈయగలదు, శక్తిమయమగు అమృతవర్షముచే పూర్ణముగా తడుపబడిన ఆ భస్మ యోగసాధనలతో గూడి సాధకుని ప్రకృతిశక్తుల అధికారమునకు అతీతుని చేయును. కావున, సర్వకాలములలో ఈ విధముగా అమృతస్పర్శను పొందిన భస్మ మరణముపై విజయమును సంపాదించి పెట్టగలదు. శివశక్తుల అమృతమయమగు స్పర్శను పొందిన వానికి మృత్యువు ఎక్కడిది? ఎవడైతే పైన చెప్పబడిన విధముగా రహస్యమగు అగ్నివీర్య- అమృతస్పర్శలను గురించి తెలుసుకొనునో, అట్టివానికి అగ్నీషోమాత్మకమగు జగత్తునుండి విముక్తి కలుగును. వానికి, పునర్జన్మ గాని ఉండదు. ఎవడైతే శివస్వరూపమగు అగ్నితో శరీరమును దహించి, అనగా భస్మను ధరించి, శక్తిమయమగు సోముని అమృతముతో దానిని యోగమార్గములో తడుపునో, అనగా శక్తిస్వరూపమగు ఆజ్ఞాచక్రమునందలి చంద్రునినుండి స్రవించే అమృతమును సేవించునో, అట్టివాడు మోక్షమునకు అర్హుడగును. ఈ విషయమును మనసులో నిడుకొనియే, జగత్తు అంతయు అగ్ని మరియు సోముల స్వరూపమేనని శివుడు యుక్తియుక్తముగా చెప్పియున్నాడు.

శ్రీశివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండములో జగత్తుయొక్క అగ్నీ‌శ్రీషోమాత్మకస్వరూపమును వర్ణించే ఇరువది యెనిమిదవ అధ్యాయము ముగిసినది.

# 29 – శివ శక్తుల స్వరూపము

వాయురువాచః

నివేదయామి జగతో వాగర్థాత్మ్యం కృతం యథా ।
షడధ్వవేదనం సమ్యక్ సమాసాన్న తు విస్తరాత్ ॥
నాస్తి కశ్చిదశబ్దోర్థో నాపి శబ్దో నిరర్థకః ।
తతో హి సమయే శబ్దస్సర్వస్సర్వార్థబోధకః ॥
ప్రకృతేః పరిణామోఽయం ద్విధా శబ్దార్థభావనా ।
తామహుః ప్రాకృతీం మూర్తిం శివయోః పరమాత్మనోః ॥
శబ్దాత్మికా విభూతిర్యా సా త్రిధా కథ్యతే బుధైః ।
స్థూలా సూక్ష్మా పరా చేతి స్థూలా యా శ్రుతిగోచరా ॥
సూక్ష్మా చింతామయీ ప్రోక్తా చింతయా రహితా పరా ।
యా శక్తిస్సా పరా శక్తిశ్శివతత్త్వసమాశ్రయా ॥
జ్ఞానశక్తిసమాయోగాదిచ్ఛోపోద్బలికా తథా ।
సర్వశక్తిసమష్ట్యాత్మా శక్తితత్త్వసమాఖ్యయా ॥
సమస్తకార్యజాతస్య మూలప్రకృతితాం గతా ।
సైవ కుండలినీ మాయా శుద్ధాధ్వపరమా సతీ ॥
సా విభాగస్వరూపైవ షడధ్వాత్మా విజృంభతే ।
తత్ర శబ్దాస్త యోఽధ్వానస్త యశ్చార్థాస్సమీరితాః ॥
సర్వేషామపి వై పుంసాం నైజశుద్ధ్యనురూపతః ।
లయభోగాధికారాస్స్యుస్సర్వతత్త్వవిభాగతః ॥
కలాభిస్తాని తత్త్వాని వ్యాప్తాన్యేవ యథాతథమ్ ।
పరస్యాః ప్రకృతేరాదౌ పంచధా పరిణామతః ॥

వాయువు ఇట్లు పలికెను –

జగత్తు వాగర్థముల స్వరూపము గలదిగా చేయబడిన విధానమును, దానిని ఆరు తెరంగులుగా తెలిసే విధానమును విస్తారముగా గాక, సంగ్రహముగా చెప్పెదను. శబ్దము లేని అర్థము గాని, అర్థము లేని శబ్దము గాని లేవు, కావున, సమయమును బట్టి సర్వ శబ్దములు సర్వములగు అర్థములను బోధించును. ఈ శబ్దము మరియు అర్థము అనే రెండు రూపములలోనికి ప్రకృతియే పరిణామమును చెందినది. ఈ శబ్దార్థసముదాయము పరమాత్మలగు పార్వతీపరమేశ్వరుల స్వరూపమని చెప్పెదరు. శబ్దరూపములోనున్న పరమేశ్వర విభూతి స్థూల, సూక్ష్మ మరియు పర అను మూడు రకములుగా నున్నదని విద్వాంసులు చెప్పుచున్నారు. చెవికి వినబడే శబ్దము స్థూలము. ఆలోచన రూపములోనున్న శబ్దము సూక్ష్మము. ఆలోచనలకు అతీతమైనది పరాశబ్దము. శివతత్త్వమును ఆశ్రయించి ఉన్న శక్తికి పరాశక్తి అని పేరు. ఈ శక్తి జ్ఞానశక్తితో గూడి ఇచ్ఛకు బలమునిచ్చును. శక్తితత్త్వము అను పేరు గల ఈ శక్తి

శక్తులన్నింటియొక్క సమాహార స్వరూపము. ఆ శక్తి తత్త్వమే కార్యములన్నింటియొక్క మూలప్రకృతి అయినది. ఆ మాయయే కుండలినీ రూపములోనుండి పరిశుద్ధమగు సుషుమ్నామార్గముగుండా ప్రవహించి పరాశక్తితో కలియును. ఆ శక్తియే విభాగమును చెందిన స్వరూపము గలదై, ఆరు మార్గములలో విజృంభించుచున్నది. వాటిలో మూడు శబ్దమునకు, మూడు అర్థమునకు సంబంధించినవని చెప్పుచున్నారు. మానవులందరికీ తమ శుద్ధికి అనురూపముగా తత్త్వముల నన్నింటినీ విభాగము. చేసి లయము చేయుటకు మరియు అనుభవించుటకు అధికారములు గలవు. సృష్ట్యారంభములో పరాప్రకృతి అయిదు కళల రూపములో పరిణమించి యున్నది. ఆ తత్త్వములు ఈ కళలచే ఉన్నవి ఉన్నట్లుగా నిశ్చయముగా వ్యాపించ బడి యున్నవి.

**కలాశ్చ తా నివృత్త్యాద్యాః పర్యాప్తా ఇతి నిశ్చయః ।**
**మంత్రాధ్వా చ పదాధ్వా చ వర్ణాధ్వా చేతి శబ్దతః ॥**
**భువనాధ్వా చ తత్త్వాధ్వా కలాధ్వా చార్థతః క్రమాత్ ।**
**అత్రాన్యోన్యం చ సర్వేషాం వ్యాప్యవ్యాపకతోచ్యతే ॥**
**మంత్రాస్సర్వాః పదైర్వ్యాప్తా వాక్యభావాత్పదాని చ ।**
**వర్ణైర్వర్ణసమూహం హి పదమాహుర్విపశ్చితః ॥**
**వర్ణాస్తు భువనైర్వ్యాప్తాస్తేషాం తేషూపలంభనాత్ ।**
**భువనాన్యపి తత్త్వౌఘైరుత్పత్త్యాంతర్భహిః క్రమాత్ ॥**
**వ్యాప్తాని కారణైస్తత్త్వైరారబ్ధత్వాదనేకశః ।**
**అంతరాదుత్థితానీహ భువనాని తు కానిచిత్ ॥**
**పౌరాణికాని చాన్యాని విజ్ఞేయాని శివాగమే ।**
**సాంఖ్య యోగప్రసిద్ధాని తత్త్వాన్యపి చ కానిచిత్ ॥**
**శివశాస్త్ర ప్రసిద్ధాని తతోన్యాన్యపి కృత్స్నశః ।**
**కలాభిస్తాని తత్త్వాని వ్యాప్తాన్యేవ యథాతథమ్ ॥**
**పరస్యాః ప్రకృతేరాదౌ పంచధా పరిణామతః ।**
**కలాశ్చ తా నివృత్త్యాద్యా వ్యాప్తాః పంచ యథోత్తరమ్ ॥**
**వ్యాపికాతః పరా శక్తిరవిభక్తా షడధ్వనామ్ ।**
**పరప్రకృతిభావస్య తత్త్వత్వాచ్ఛివతత్త్వతః ॥**
**శక్త్యాది చ పృథివ్యంతం శివతత్త్వసముద్భవమ్ ।**
**వ్యాప్తమేకేన తేనైవ మృదా కుంభాదికం యథా ॥**

నివృత్తి మొదలగు ఆ అయిదు కళలు వీటిని వ్యాపించుటకు తగిన వ్యాపకశక్తిని గలవి యనునది నిశ్చయము. మంత్రము, పదము, వర్ణము అనునవి శబ్దమునకు చెందిన మార్గములు కాగా, భువనము, తత్త్వము, కళ అనునవి అర్థమునకు చెందిన మార్గములు. వీటన్నింటిలో పరస్పరము వ్యాప్యవ్యాపకభావము గలదని చెప్పబడినది. మంత్రములన్నియు వాక్యరూపములో కూర్చబడియున్న పదములచే వ్యాప్తములై యున్నవి. పదములు వర్ణములచే వ్యాపించ బడియున్నవి.

వర్ణముల సమూహామే పదమని విద్వాంసులు చెప్పుచున్నారు. వర్ణములు భువనములచే వ్యాపించబడి యున్నవి. ఏలయనగా, భువనములు వర్ణములయందు ఉపలభ్యమగుచున్నవి. తత్త్వముల సమూహాములనుండి ఆరంభమై పుట్టినవి యగుటచే భువనములు లోపల మరియు బయట తమకు కారణమగు ఆ తత్త్వములచే వ్యాపించబడి యున్నవి. అనేకములగు భువనములు తత్త్వముల లోపలనుండియే పుట్టినవి. వాటిలో కొన్ని పురాణములలో ప్రసిద్ధములై యుండగా, మరికొన్ని శైవాగమములో నిరూపించబడి యున్నవి. వాటికంటే అధికములగు తత్త్వములతో కలిపి తత్త్వములన్నియు పూర్ణముగా శివశాస్త్ర ములో ప్రసిద్ధములై యున్నవి. ఆ తత్త్వములు యథాతథముగా కళలచే నిశ్చయముగా వ్యాపించబడి యున్నవి. సృష్టికి ఆరంభములో పరా ప్రకృతి అయిదు విధములుగా పరిణామమును చెందుట వలన నివృత్తి మొదలగు అయిదు కళలు పుట్టినవి. వీటిలో ముందున్న కళ తరువాతి కళలచే వ్యాపించబడి యుండును. కావున, పరాశక్తి సర్వమును వ్యాపించి యున్నది. ఆమె స్వయముగా విభాగము లేకుండగనే ఆరు మార్గములయందు వ్యాపించి యున్నది. ఈ పరా ప్రకృతి శివతత్త్వమునందు ఉనికిని కలిగి యుండుటచే, దానిచే వ్యాపించబడి యున్నది. శక్తితో మొదలిడి పృథివీతత్త్వము వరకు గల సర్వము శివతత్త్వమునుండి పుట్టినవి. ఈ సర్వము ఆ అద్వితీయుడగు శివునిచే, కుండ మొదలగునవి మట్టి చేతను వలె, వ్యాపించబడి యున్నవి.

శైవం తత్పరమం ధామ యత్ప్రా ప్యం షడ్భిరధ్వభిః ।
వ్యాపికాఽ వ్యాపికా శక్తిః పంచతత్త్వవిశోధనాత్ ॥
నివృత్త్యా రుద్రపర్యంతం స్థితిరండస్య శోధ్యతే ।
ప్రతిష్ఠయా తదూర్ధ్వం తు యావదవ్యక్తగోచరమ్ ॥
తదూర్ధ్వం విద్యయా మధ్యే యావద్విశ్వేశ్వరావధి ।
శాంత్యా తదూర్ధ్వమధ్యాంతే విశుద్ధిశ్శాంత్యతీతయా ॥
యామాహుః పరమం వ్యోమ పరప్రకృతియోగతః ।
ఏతాని పంచ తత్త్వాని యైర్వ్యాప్తమఖిలం జగత్ ॥
తత్రైవ సర్వమేవేదం ద్రష్టవ్యం ఖలు సాధకైః ।
అధ్వవ్యాప్తమవిజ్ఞాయ శుద్ధిం యః కర్తుమిచ్ఛతి ॥
స విప్రలంభకశ్శుద్ధేర్నాలం ప్రాపయితుం ఫలమ్ ।
వృథా పరిశ్రమస్తస్య నిరయాయైవ కేవలమ్ ॥
శక్తిపాతసమాయోగాదృతే తత్త్వాని తత్త్వతః ।
తద్వ్యాప్తిస్తద్విశుద్ధిశ్చ జ్ఞాతుమేవం న శక్యతే ॥
శక్తిరాజ్ఞా పరా శైవీ చిద్రూపా పరమేశ్వరీ ।
శివోఽధితిష్ఠత్య ఖిలం యయా కారణభూతయా ॥
నాత్మనో నైవ మాయైషా న వికారో విచారతః ।
న బంధో నాపి ముక్తిశ్చ బంధముక్తివిధాయినీ ॥

**సర్వైశ్వర్యపరాకాష్ఠా శివస్యాఽవ్యభిచారిణీ ।**

**సమానధర్మిణీ తస్య తైస్తైర్భావైర్విశేషతః ॥**

శివుని ధామము సర్వోత్కృష్టమైనది. దానిని ఈ ఆరు మార్గములచే పొందదగు◌ును. పృథివి మొదలగు అయిదు తత్త్వములను విశేషముగా శోధించుట వలన వ్యాపకశీలము గలది మరియు వ్యాపనశీలము లేనిది అగు శక్తి తెలియబడును. రుద్రుని వరకు గల బ్రహ్మాండము యొక్క స్థితి నివృత్తి కళచే శోధింపబడును. ఆపైన అవ్యక్తము వరకు గల స్థితి ప్రతిష్టి కళచే శుద్ధి చేయబడును. ఆ పైన విశ్వేశ్వరుని వరకు గల స్థితిని మధ్యలో నుండే విద్యా కళచే, ఆ పైన శాంతి కళచే, మార్గము అంతము వరకు శాంత్యతీతకళచే శోధన చేయబడును. దానికే పరమవ్యోమ అని పేరు. పరబ్రహ్మకు ప్రకృతితోడి సంయోగముచే ఈ అయిదు తత్త్వములు పుట్టినవి. వాటిచే జగత్తు అంతయు వ్యాపించబడి యున్నది. సాధకులు ఈ సర్వమును ఆ పరమాణాశమునందు అధిష్ఠితమై యున్నదానినీగా దర్శించ వలెను. ఎవడైతే మార్గములందు గల ఈ వ్యాప్తిని గురించి తెలియకుండగా శుద్ధిని చేయగోరు, అట్టివాడు శుద్ధనుండి వంచితుడగును. ఆ శుద్ధి ఆతనికి ఫలమునీయ జాలదు. వానీ శ్రమ అంతయు వ్యర్థము. అది వానికి కేవలము నరకమును మాత్రమే పొందింప జేయును. శక్తిపాతముతో సంయోగము (జీవునకు శక్తితో కలయిక) లేకుండగా ఈ తత్త్వములను గాని, వాటి వ్యాప్తిని గాని, వాటి వృద్ధిని గాని యథార్థముగా తెలియుట సంభవము కాదు, చైతన్యస్వరూపురాలు, పరమేశ్వరి అగు శక్తియే శివుని ఆజ్ఞ రూపముగా నున్నది. సర్వజగత్కారణమగు ఆ శక్తియే సర్వజగద్రూపముగా ప్రకటము కాగా, శివుడు ఆ జగత్తునకు అధిష్టానమగుచున్నాడు. విచారించి చూచినచో, ఆత్మకు వికారములు గాని, మాయాసంబంధము గాని, బంధము గాని, ముక్తి గాని యథార్థముగా లేవు. ఆ మాయయే బంధముక్త్యవస్థకు మూలము. శివునితో అభిన్నమగు ఆ మాయాశక్తి శివుని సకలైశ్వర్యముల పరాకాష్ఠ ఆ మాయ శివునితో సమానమగు ధర్మములను కలిగియున్నది. మునులు శివతత్త్వమును గురించి ప్రశ్నించుట శివుని ఆయా విశిష్టభావములు మాయాశక్తియందు గలవు.

స తయైవ గృహీ సాపి తేనైవ గృహిణీ సదా ।
తయోరపత్యం యత్కార్యం పరప్రకృతిజం జగత్ ॥
స కర్తా కరణం సేతి తయోర్భేదో వ్యవస్థితః ।
ఏక ఏవ శివస్సాక్షాద్ద్విధాఽసౌ సమవస్థితః ॥
స్త్రీ పుంసభావేన తయోర్భేద ఇత్యపి కేచన ।
అపరే తు పరా శక్తిశ్శివస్య సమవాయినీ ॥
ప్రభేవ భానోశ్చి ద్రూపాఽ భిన్నైవేతి వ్యవస్థితిః ।
తస్మాచ్ఛివః పరో హేతుస్తస్యాజ్ఞా పరమేశ్వరీ ॥
తయైవ ప్రేరితా శైవీ మూలప్రకృతిరవ్యయా ।
మహామాయా చ మాయా చ ప్రకృతిస్త్రి గుణేతి చ ॥
త్రివిధ కార్యభేదేన సా ప్రసూతే షడధ్వనః ।
స వాగర్థమయశ్చాధ్వా షడ్విధో నిఖిలం జగత్ ॥
అస్యైవ విస్తరం ప్రాహుశ్శాస్త్రజాతమశేషతః ॥
ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే వాగర్థ
తత్త్వవర్ణనం నామ ఏకోనత్రింశోఽ ధ్యాయః ॥

ఆయన ఆమెచే మాత్రమే గృహస్థుడగుచున్నాడు. ఆమె కూడా సర్వకాలములలో ఆయనచే మాత్రమే గృహిణి యగుచున్నది. పరా ప్రకృతినుండి పుట్టిన ఈ కార్యజగత్తు ఏది గలదో, అది వారి సంతానము మాత్రమే. ఆయన కర్త కాగా, ఆమె కారణము అగుచున్నది. ఈ తీరున వారిద్దరి మధ్య ఈ భేదము మాత్రమే నిశ్చయించ బడినది. ఒకే శివుడు సాక్షాత్తుగా ఈ రెండు రూపములలో నిలిచి యున్నాడు. వారిద్దరి మధ్యలో స్త్రీ పురుష భేదము కూడ గలదని కొందరు చెప్పుచున్నారు. పరాశక్తికి శివునితో సమవాయ (విడదీయరాని) సంబంధము గలదని చెప్పుచున్నారు. సూర్యునకు ప్రకాశముతో భేదము లేని విధముగా, చైతన్యస్వరూపిణియగు శక్తికి శివునితో భేదము లేదని సిద్ధాంతము. కావున, శివుడు పరమకారణము కాగా, పరమేశ్వరి ఆయనయొక్క ఆజ్ఞయే అగుచున్నది. ఆ ఆజ్ఞ చేతనే ప్రేరేపించబడి శివుని వినాశము లేని మూలప్రకృతి మహామాయ, మాయ, త్రిగుణాత్మకమగు ప్రకృతి అనే మూడు విధములుగా పరిణమించి కార్యములయందలి భేదమును బట్టి కలిగిన స్పందనచే ఆరు మార్గములను సృజించు చున్నది. ఈ జగత్తు అంతయు వాక్కు మరియు అర్థము స్వరూపముగా గల ఆ ఆరు మార్గముల వికారము మాత్రమే అగుచున్నది. శాస్త్రములన్నియు ఈ ఆరు మార్గముల విస్తారమును మాత్రమే బోధించు చున్నవి.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో జగత్తుయొక్క వాగర్థాత్మకమగు స్వరూపమును వర్ణించే ఇరువదితొమ్మిదవ అధ్యాయము ముగిసినది.

# 30 – మునులు శివతత్త్వమును గురించి ప్రశ్నించుట

ఋషయ ఊచుః ।

చరితాని విచిత్రాణి గుహ్యాని గహనాని చ ।
దుర్విజ్ఞేయాని దేవైశ్చ మోహయంతి మనాంసి చ ॥
శివయోస్తత్త్వసంబంధే న దోష ఉపలభ్యతే ।
చరితైః ప్రాకృతో భావస్తయోరపి విభావ్యతే ॥
బ్రహ్మాదయోఽపి లోకానాం సృష్టిస్థిత్యంతహేతవః ।
నిగ్రహానుగ్రహౌ ప్రాప్య శివస్య వశవర్తినః ॥
శివః పునర్న కస్యాపి నిగ్రహానుగ్రహాస్పదమ్ ।
అతోఽనాయత్తమైశ్వర్యం తస్యైవేతి వినిశ్చితమ్ ॥
యద్యేవమీదృశైశ్వర్యం తత్తు స్వాతంత్ర్య లక్షణమ్ ।
స్వభావసిద్ధం చైతన్య మూర్తిమత్తాస్పదం భవేత్ ॥
న మూర్తిశ్చ స్వతంత్రస్య ఘటతే మూలహేతునా ।
మూర్తేరపి చ కార్యత్వాత్తత్సిద్ధిస్స్యాదహైతుకీ ॥
సర్వత్ర పరమో భావోఽపరమశ్చాన్య ఉచ్యతే ।
పరమాపరమౌ భావౌ కథమేకత్ర సంగతౌ ॥
నిష్కలో హి స్వభావోఽస్య పరమః పరమాత్మనః ।
స ఏవ సకలః కస్మాత్స్వభావో హ్యవిపర్యయః ॥
స్వభావో విపరీతశ్చేత్స్వతంత్రస్స్వేచ్ఛయా యది ।
స కరోతి కిమీశానో నిత్యానిత్యవిపర్యయమ్ ॥
మూర్తాత్మా సకలః కశ్చిత్తు చాన్యో నిష్కలశ్శివః ।
శివేనాధిష్ఠితశ్చేతి సర్వత్ర లఘు కథ్యతే ॥

ఋషులు ఇట్లు పలికిరి –

శివుని గృహస్థజీవనమునకు చెందిన చరిత్రలు విచిత్రమైనవి, లోతైనవి, దేవతలకైననూ తెలియుట కష్టము అయినవి. అవి మా మనస్సులకు మోహమును కలిగించుచున్నవి. పార్వతీపరమేశ్వరుల తత్త్వముల సంబంధము విషయములో దోషము కానవచ్చుట లేదు. కానీ, వారి లీలలను బట్టి చూచినచో, వారు కూడ సాధారణ జీవులేనాయను ఊహ కలుగవచ్చును. లోకముల సృష్టిస్థితిలయములకు కారణభూతులైన బ్రహ్మ మొదలగు వారు కూడా శివుని వశములోనుండి ఆయనయొక్క నిగ్రహానుగ్రహములను (దండించుట మరియు వరముల నిచ్చుట) పొందినారు. కాని, శివుడు మరియొకని నిగ్రహానుగ్రహములకు విషయము అగుట లేదు. కావున, ఆయనయొక్క ఈశ్వరభావము నిరాటంకమైనదని

నిశ్చయించబడినది. శివుని ఈశ్వరభావము ఈ విధముగా స్వతంత్రమైనదైనచో, అది ఆయనకు స్వతస్సిద్ధము గావలెను. మరియు అది ఆయన సగుణరూపమును ఆశ్రయించి యుండవలెను, కాని ఈశ్వరుడు స్వతంత్రుడు మరియు మూలకారణుడు అగుటచే, ఆయనకు రూపము ఉండుట పొసగదు. రూపము కూడ కార్యమే (పుట్టునది) అగుటచే, ఈశ్వరుడు మూలకారణుడగుటచే, ఆ రూపము కారణము లేకుండగనే సిద్ధించవలసి యుండును. సర్వసందర్భములలో ఒక సద్వస్తువు, దానిపై భాసించే మరియొక మిథ్యాపదార్థము ఉండునని చెప్పబడినది. కాని, సత్యము మరియు మిథ్య ఒకే తత్త్వమునందు కలిసి సమగూడుట యెట్లు? పరమాత్మయొక్క పరమార్థస్వరూపము నిర్గుణము. అట్టి పరమేశ్వరుడే రూపము గలవాడు ఎట్లు అయినాడు? స్వరూపము మార్పులకు లోను కాదు గదా! ఈశ్వరుడు స్వతంత్రుడు గనుక, ఆయన తన ఇచ్ఛచే తన స్వరూపములో కూడ మార్పులను పొందవచ్చునని చెప్పే పక్షములో, ఆయన నిత్యములను అనిత్యములుగను, అనిత్యములను నిత్యములుగను ఏల చేయుట లేదు? సగుణసాకారుడగు ఈశ్వరుడు ఒకడు. నిర్గుణుడగు శివుడు మరియొకడు. సగుణతత్త్వమునకు అధిష్ఠానము నిర్గుణము అని సర్వత్రా తేలికగా చెప్పబడుచున్నది.

మూర్త్యాత్మైవ తదా మూర్తిశ్శివస్యాస్య భవేదితి ।
తస్య మూర్తౌ మూర్తిమతోః పారతంత్ర్యం హి నిశ్చితమ్ ॥
అన్యథా నిరపేక్షేణ మూర్తిస్స్వీక్రియతే కథమ్ ।
మూర్తిస్వీకరణం తస్మాన్మూర్తౌ సాధ్యఫలేప్సయా ॥
న హి స్వేచ్ఛాశరీరత్వం స్వాతంత్ర్యాయోపపద్యతే ।
స్వేచ్ఛైవ తాదృశీ పుంసాం యస్మాత్కర్మానుసారిణీ ॥
స్వీకర్తుం స్వేచ్ఛయా దేహం హాతుం చ ప్రభవంత్యుత ।
బ్రహ్మాదయః పిశాచాంతాః కిం తే కర్మాతివర్తినః ॥
ఇచ్ఛయా దేహనిర్మాణమింద్రజాలోపమం విదుః ।
అణిమాదిగుణైశ్వర్యవశీకారానతిక్రమాత్ ॥
విశ్వరూపం దధద్విష్ణుర్దధీచేన మహర్షిణా ।
యుధ్యతా సముపాలబ్ధస్తద్రూపం దధతా స్వయమ్ ॥
సర్వస్మాదధికస్యాపి శివస్య పరమాత్మనః ।
శరీరవత్తయాన్యాత్మసాధర్మ్యం ప్రతిభాతి నః ॥
సర్వానుగ్రాహకం ప్రాహుశ్శివం పరమకారణమ్ ।
స నిగృహ్ణాతి దేవానాం సర్వానుగ్రాహకః కథమ్ ॥
చిచ్ఛేద బహుశో దేవో బ్రహ్మణః పంచమం శిరః ।
శివనిందాం ప్రకుర్వంతం పుత్రేతి కుమతేర్హఠాత్ ॥
విష్ణోరపి నృసింహస్య రభసా శరభాకృతిః ।
బిభేద పద్భ్యామాక్రమ్య హృదయం నఖరైః ఖరైః ॥

అట్లైనచో, శివుడు సగుణరూపుడే యగుగాక! అని చెప్పినచో, మూర్తిని కలిగియున్న శివపార్వతులకు పరాధీనత తప్పని సరి యగును. అట్లు గానిచో, పరాపేక్ష లేని తత్త్వము సగుణరూపమునేల స్వీకరించ వలెను? మూర్తిచే పొందదగిన ఫలములయందు అపేక్ష ఉన్నప్పుడు మాత్రమే సగుణరూపమును స్వీకరించుట పొసగును. తన ఇచ్ఛచే శరీరమును స్వీకరించినాడు అని చెప్పుట ఈశ్వరుడు స్వతంత్రుడు అను సత్యమునకు అనురూపముగా లేదు. ఏలయనగా, పురుషులకు శరీరమును స్వీకరించుటలో గల అట్టి స్వేచ్ఛ కర్మను అనుసరించియే యుండును. బ్రహ్మతో మొదలిడి పిశాచము వరకు గల ప్రాణులు తమ ఇచ్ఛచేతనే దేహమును స్వీకరించి పరిత్యజించ గల్గుచున్నారు. వారందరు కర్మను దాటిన వారేనా యేమి? ఇచ్ఛను అనుసరించి దేహమును ధరించుట ఇంద్రజాలము వంటిదని పెద్దలు చెప్పుచున్నారు. స్వేచ్ఛచే రూపమును స్వీకరించుట, అణిమాదిగుణములచే సంప్రాప్తమయ్యే ఈశ్వరభావము మరియు వశీకరణశక్తి కంటే అధికమైనదీ కాదు. దధీచమహర్షితో యుద్ధమును చేయు సమయములో విష్ణువు విశ్వరూపమును ధరించగా, దధీచుడు కూడ స్వయముగా విశ్వరూపమును దాల్చి విష్ణువును నిందించినాడు. శివుడు అందరికంటే అధికుడగు పరమాత్మయే అయిననూ, శరీరము గలవాడైనచో, ఇతరజీవులను పోలియున్నవాడే అగునని మాకు తోచుచున్నది. శివుడు సర్వకారణకారణుడనియు, సర్వులను అనుగ్రహించువాడనియు చెప్పెదరు. కాని, ఆయన దేవతలను దండించుచున్నాడు. అట్టి స్థితిలో సర్వులను అనుగ్రహించువాడు ఎట్లైనాడు? పుత్రా! అని పిలుస్తూ హితమును చేస్తూ శివనిందను చేసే దుర్బుద్ధియగు బ్రహ్మయొక్క తలను పలుమార్లు ఆ దేవుడు ఖండించినాడు. ఆయన శరభరూపమును దాల్చి నృసింహరూపములోనున్న విష్ణువును బలాత్కారముగా కాళ్లతో తొక్కి పెట్టి పదునైన గోళ్లతో ఆయన హృదయమును చీల్చినాడు.

దేవస్త్రీ షు చ దేవేషు దక్షస్యాధ్వరకాణాత్ ।
వీరేణ వీరభద్రేణ న హి కశ్చిదవండితః ॥
పురత్రయం చ సస్త్రీ కం సదైత్యం సహ బాలకైః ।
క్షణేనైకేన దేవేన నేత్రాగ్నేరింధనీకృతమ్ ॥
ప్రజానాం రతిహేతుశ్చ కామో రతిపతిస్స్వయమ్ ।
క్రోశతామేవ దేవానాం హుతో నేత్రహుతాశనే ॥
గావశ్చ కాశ్చిద్దుగ్ధౌఘం ప్రవంత్యో మూర్ధ్ని ఖేచరాః ।
సరుషా ప్రేక్ష్య దేవేన తత్క్షణే భస్మసాత్కృతాః ॥
జలంధరాసురో దీర్ఘశ్చ క్రీకృత్య జలం పదా ।
బద్ధ్వానంతేన యో విష్ణుం చిక్షేప శతయోజనమ్ ॥
తమేవ జలసంధాయీ శూలేనైవ జఘాన సః ।
తచ్చక్రం తపసా లబ్ధ్వా లబ్ధవీర్యో హరిస్సదా ॥



**జిఘాంసతాం సురారీణాం కులం నిర్ఘృణచేతసామ్ ।**

**త్రిశూలేనాంధకస్యోరశ్శిఖినైవోపతాపితమ్ ॥**

**కంఠాత్కాలాంగనాం సృష్ట్వా దారకోఽపి నిపాతితః ।**

**కౌశికీం జనయిత్వా తు గౌర్యాస్త్వక్కోశగోచరామ్ ॥**

**శుంభస్సహ నిశుంభేన ప్రాపితో మరణం రణే ।**

**శ్రుతం చ మహదాఖ్యానం స్కాందే స్కందసమాశ్రయమ్ ॥**

దక్షయజ్ఞము కారణముగా దేవతలలో గానీ, దేవతల స్త్రీ లలో గానీ, వీరుడగు వీరభద్రుడునిచే దండింపబడనివారు ఒక్కరైననూ లేరు. స్త్రీలతో, పిల్లలతో మరియు రాక్షసులతో కూడియున్న మూడు పురములను ఆ దేవుడు ఒక్క క్షణములో తన నేత్రములోని అగ్నికి ఇంధనముగా చేసినాడు. స్త్రీ పురుషుల మధ్యలో ప్రేమకు కారణమైనవాడు, రతీదేవికి భర్త అగు మన్మథుని దేవతలు ఆక్రోశించుచుండగనే ఆయన స్వయముగా నేత్రాగ్నియందు హోమము చేసినాడు. కొన్ని ఆవులు ఆకసములో సంచరిస్తూ పాల ధారను శిరస్సుపై స్రవింప జేయగా, ఆ దేవుడు కోపముతో చూచి వెంటనే వాటిని బూడద చేసినాడు. విష్ణువును అనంతునితో బంధించి వంద యోజనముల దూరము వరకు విసిరి వేసిన జలంధరాసురుని ఆయన కాలితో నీటిపై చక్రముగా చేసి పొడిచినాడు, ఆయన ఆ రాక్షసుని నీటిలో పారవైచి శూలముతో చంపినాడు. ఆ చక్రమును తపస్సు చేసి సంపాదించి విష్ణువు సర్వదా పరాక్రమమును కలిగి యున్నాడు. తనను చంపబోయిన నిర్దయులగు రాక్షసుల సమూహమును అగ్నితో కాల్చివేసి, ఆయన అంధకుని వక్షస్థలమును త్రిశూలముతో పొడిచినాడు. ఆయన కంఠమునుండి నల్లని యువతిని సృష్టించి, దారకుని సంహరించినాడు. గౌరీదేవియొక్క చర్మకోశమునుండి కౌశికిని సృష్టింపజేసి, యుద్ధములో శుంభనిశుంభులను సంహరింప జేసినాడు. స్కందుని మహిమను వర్ణించే గాథను స్కాందపురాణములో వినియుంటిమి.

**వధార్థే తారకాఖ్యస్య దైత్యేంద్రస్యేంద్రవిద్విషః ।**

**బ్రహ్మణాభ్యర్థితో దేవో మందరాంతఃపురం గతః ॥**

**విహృత్య సుచిరం దేవ్యా విహారాతిప్రసంగతః ।**

**రసాం రసాతలం నీతామివ కృత్వాఖిధాం తతః ॥**

**దేవీం చ వంచయంస్తస్యాం స్వవీర్యమతిదుర్వహమ్ ।**

**అవిసృజ్య విసృజ్యాగ్నౌ హవిః పూతమివామృతమ్ ॥**

**గంగాదిష్వపి నిక్షిప్య వహ్నిద్వారా తదంశతః ।**

**తత్సమాహృత్య శనకైః స్తోకం స్తోకమితస్తతః ॥**

**స్వాహయా కృత్తికారూపాత్స్వభర్త్రా రమమాణయా ।**

**సువర్ణీభూతయా న్యస్తం మేరౌ శరవణే క్వచిత్ ॥**

**సందీపయిత్వా కాలేన తస్య భాసా దిశో దశ ।**

**రంజయిత్వా గిరీన్ సర్వాన్ కాంచనీకృత్య మేరుణా ॥**

తతశ్చిరేణ కాలేన సంజాతే తత్ర తేజసి ।
కుమారే సుకుమారాంగే కుమారాణాం నిదర్శనే ॥
తచ్ఛైశవం స్వరూపం చ తస్య దృష్ట్వా మనోహరమ్ ।
సహ దేవాసురైర్లోకైర్విస్మితే చ విమోహితే ॥
దేవోఽపి స్వయమాయాతః పుత్రదర్శనలాలసః ।
సహ దేవ్యాంకమారోప్య తతోఽఘ్య్ర స్మేరమాననమ్ ॥
పీతామృతమివ స్నేహవివశేనాంతరాత్మనా ।
దేవేష్వపి చ పశ్యత్సు వీతరాగైస్తపస్విభిః ॥
స్వస్య వక్షఃస్థలే స్వైరం నర్తయిత్వా కుమారకమ్ ।
అనుభూయ చ తత్క్రీడాం సంభావ్య చ పరస్పరమ్ ॥

ఇంద్రుని ద్వేషించే వీరుడగు తారకాసురుని వధించుట కొరకై బ్రహ్మచే అభ్యర్థించ బడిన ఆ దేవుడు మందరపర్వతమునందు అంతఃపురము లోనికి వెళ్లి, చాల కాలము దేవితో గూడి విహరించి, ఆ విహారముయొక్క ఆధిక్యముచే భూమి పాతాళము లోనికి క్రుంగి పోవునా యన్నట్లు చేసి, తరువాత దేవిని మోసగించి, మిక్కిలి సహింప శక్యము కాని తన తేజస్సును ఆమెయందు నిక్షేపించకుండగా, పవిత్రమగు హవిస్సును వలె ఆ అమృతరూపమగు తేజస్సును అగ్నియందు నిక్షేపించి, ఆ అగ్ని ద్వారా అగ్నియొక్క అంశతో గంగ మొదలగు వాటియందు నిక్షేపింప జేసి, దానిని గంగలో మెల్లమెల్లగా ఇటు నటు ప్రవహింప జేసి తీసుకు వచ్చెను. కృత్తికల రూపములో తన భర్తతో రమిస్తూ గొప్ప తేజస్సును పొంది బంగరు రంగుతో ప్రకాశించే స్వాహాదేవి దానిని మేరుపర్వతమునందు ఒకచోట రెల్లుగడ్డియందు ఉంచెను. ఆ తేజస్సు యొక్క కాంతిచే కొంత కాలము తరువాత పది దిక్కులు ప్రకాశించునట్లు చేసి, పర్వతములకు శోభను జేగూర్చి, మేరువునకు కూడ బంగారముయొక్క ప్రకాశము వచ్చునట్లు చేసెను. తరువాత చాల కాలము గడచిన పిదప అక్కడ ఆ తేజస్సునుండి బాలురందరికీ నిదర్శనమనదగిన సుకుమారమగు అవయవములు గల కుమారుడు పుట్టగా, ఆ బాలుని మనోహరమగు రూపమును గాంచి దేవతలు, రాక్షసులు, సకలప్రాణులు విస్మయమును విశేషమగు మోహమును చెందగా, పుత్రుని దర్శించ వలెననే ఉత్సాహము గల శివుడు స్వయముగా దేవితో గూడి వచ్చి ఒడిలో కూర్చుండ బెట్టుకుని, చిరునవ్వుతో కూడిన ఆ బాలుని ముఖమును ముద్దాడి, అమృతపానము చేసినాడా యన్నట్లు ఆనందించి, ప్రేమతో నిండి వశము తప్పిన అంతఃకరణము గలవాడై, దేవతలు మరియు విరాగులగు తపశ్శాలురు చూచుచుండగా, ఆ కుమారుని తన వక్షఃస్థలముపై యథేచ్ఛగా నాట్యమాడునట్లు చేసి, ఆ ఆటలోని ఆనందమును అనుభవించెను. శివపార్వతులు ఒకరినొకరు అభినందించు కొనిరి.

స్తన్యమాజ్ఞాపయన్ దేవ్యాః పాయయిత్వామృతోపమమ్ ।
తవావతారో జగతాం హితాయేత్యనుశాస్య చ ॥
స్వయం దేవశ్చ దేవీ చ న తృప్తిముపజగ్మతుః ।
తతశ్శక్రేణ సంధాయ బిభ్యతా తారకాసురాత్ ॥
కారయిత్వాభిషేకం చ సేనాపత్యే దివౌకసామ్ ।
పుత్రమంతరతః కృత్వా దేవేన త్రిపురద్విషా ॥
స్వయమంతర్హితేనైవ స్కందమింద్రాదిరక్షితమ్ ।
తచ్ఛక్త్యా క్రౌంచభేదిన్యా యుధి కాలాగ్నికల్పయా ॥
ఛేదితం తారకస్యాపి శిరశ్శక్రబియా సహ ।
స్తుతిం చక్రుర్విశేషేణ హరిధాతృముఖాస్సురాః ॥
తథా రక్షో ధిపస్సాక్షా ద్రావణో బలగర్వితః ।
ఉద్ధరన్ స్వభుజైర్దీర్ఘైః కైలాసం గిరిమాత్మనః ॥
తదాగోఽసహమానస్య దేవదేవస్య శూలినః ।
పదాంగుష్ఠపరిస్పందాన్నమజ్జ మృదితో భువి ॥
బటోః కేనచిదర్థేన స్వాశ్రితస్య గతాయుషః ।
త్వరణాగత్య దేవేన పాదాంతం గమితోంతకః ॥
స్వవాహనమవిజ్ఞాయ వృషేంద్రం బడబానలః ।
సగలగ్రహమానీతస్తతోఽస్త్యేకోదకం జగత్ ॥
ఆలోకవిదితైస్తైస్తైర్నృత్తైరానందసుందరైః ।
అంగహారస్వసేనేదమసకృచ్చాలితం జగత్ ॥
శాంత ఏవ సదా సర్వమనుగృహ్ణాతి చేచ్ఛివః ।
సర్వాణి పూరయేదేవ కథం శక్తేన మోచయేత్ ॥
అనాదికర్మ వైచిత్ర్యమపి నాత్ర నియామకమ్ ।
కారణం ఖలు కర్మాపి భవేదీశ్వరకారితమ్ ॥
కిమత్ర బహునోక్తేన నాస్తిక్యం హేతుకారకమ్ ।
యథా హ్యేశు నివర్తేత తథా కథయ మారుత ॥
ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే శివతత్త్వ ప్రశ్నో
నామ త్రింశోఽధ్యాయః ॥

ఆయన అపుడు దేవిని ఆజ్ఞాపించి పిల్లవానికి అమృతముతో సమానమగు ఁ పాలను ఇప్పించి, నీ అవతారము జగత్తులకు క్షేమమును చేకూర్చగలదని ఆశీర్వదించెను. శివునకు, పార్వతికి తృప్తి కలుగ లేదు. తరువాత తారకాసురుని వలన భయపడుచున్న ఇంద్రుని ఆ పిల్లవానితో కలిపించి, దేవసేనల అధ్యక్షపదవియందు అభిషేకమును చేయించి, ఆ బాలకుని దేవతల మధ్యలో విడిచి పెట్టి, త్రిపురాసురసంహారకుడగు ఆ శివుడు స్వయముగా అంతర్ధానమును చెందెను. ఇంద్రాదులు స్కందుని చుట్టు వారి రక్షించు చుండిరి. స్కందుడు క్రౌంచపర్వతమును భేదించినట్టియు, ప్రళయకాలాగ్నిని బోలియున్న శక్తితో యుద్ధమునందు తారకుని శిరస్సును, ఇంద్రుని భయమును ఏకకాలములో ఛేదించేను. విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలు స్కందుని అధికముగా స్తుతించిరి. అదే విధముగా బలముచే గర్వించియున్న రాక్షసరాజగు రావణుడు పొడవైన తన బాహువులతో కైలాసపర్వతమును పైకి ఎత్తగా, ఆ దోషమును తాళజాలక దేవదేవుడు, త్రిశూలధారి యగు శివుడు కాలిబొటన వ్రేలిని కదిలించగా అణచి వేయబడిన రావణుడు భూమిలోనికి కూరుకొని పోయెను, అయుర్ద్దాయము ముగిడియున్న ఒక బ్రహ్మచారి ఏదో ఒక కారణముతో తనను ఆశ్రయించగా, ఆ దేవుడు తొందరగా వచ్చి, యముడు పాదములపై పడునట్లు చేసెను. తన వాహనమగు గొప్ప ఎద్దును గుర్తు పట్ట లేక బడబాగ్ని ఖ్రింగి వేసెను. అపుడాయన ఆ వృషభమును విడిపించి మెడ పట్టుకొని తీసుకొని వచ్చెను. అపుడు జగత్తు అంతయు నీటితో నిండి పోయెను. జనులకు తెలియని ఇట్టి ఎన్నో సుర మునిచ్చు చరితములను ఆయన చేసినాడు. శివుడు తన శరీరమునకు ఆభరణమగు ఆదిశేషుని ద్వారా పలుమార్లు బ్రహ్మాండమును కుదిపివేసినాడు. శివుడు సర్వదా శాంతస్వరూపుడై సర్వమును అనుగ్రహించే పక్షములో, కోరికలన్నింటినీ తీర్చి యుండెడివాడు. సమర్థుడగు శివుడు అందరికీ ఏల మోక్షమునిచ్చుట లేదు? అనాదికాలమునుండి వచ్చుచున్న జీవుల కర్మలలో తేడాలు ఉండుటచే అట్లు జరుగుట లేదని చెప్పుట పొసగదు. సుఖదుఃఖములకు కారణమగు కర్మ కూడ ఈశ్వరుని అధీనములో ననే యున్నది. ఈ విషయములో ఇన్ని మాటలేల? ఓ వాయూ! హేతువాదముపై ఆధారపడిన నాస్తిక్యము తొందరగా దూరమయ్యే విధముగా సమాధానమును చెప్పుము.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో ఋషులు శివతత్త్వ ఁ్వమును గురించి వేసిన ప్రశ్నలను వర్ణించే ముప్పదియవ అధ్యాయము ముగిసినది.

# 31 – వాయుకృత జ్ఞానోపదేశము

వాయురువాచః

స్థానే సంశయితం విప్రా భవద్భిర్హేతుచోదితైః ।
జిజ్ఞాసా హి న నాస్తిక్యం సాధయేత్సాధుబుద్ధిషు ॥
ప్రమాణమత్ర వక్ష్యామి సతాం మోహనివర్తకమ్ ।
అసతాం త్వన్యథా భావః ప్రసాదేన వినా ప్రభోః ॥
శివస్య పరిపూర్ణస్య పరానుగ్రహమంతరా ।
న కించదపి కర్తవ్యమితి సాధు వినిశ్చితమ్ ॥
స్వభావ ఏవ పర్యాప్తః పరానుగ్రహకర్మణి ।
అన్యథా నిస్స్వభావేన న కిమప్యనుగృహ్యతే ॥
పరం సర్వమను గ్రాహ్యం పశుపాశాత్మకం జగత్ ।
పరస్యానుగ్రహార్థం తు పత్యురాజ్ఞాసమన్వయః ॥
పతిరాజ్ఞాపకస్సర్వమనుగృహ్ణాతి సర్వదా ।
తదర్థమర్థస్వీకారే పరతంత్రః కథం శివః ॥
అనుగ్రాహ్యానపేక్షోఽస్తి న హి కశ్చిదను గ్రహః ।
అతస్స్వాతంత్ర్యశబ్దార్థానన పేక్షత్వలక్షణః ॥
ఏతత్పునరను గ్రాహ్యం పరతంత్రం తదిష్యతే ।
అనుగ్రహోద్యతే తస్య భుక్తి ముక్త్యోరనన్వయాత్ ॥
మూర్త్యాత్మనోఽప్యనుగ్రాహ్యే శివాజ్ఞాన నివర్తనాత్ ।
ఆజ్ఞా నాధిష్ఠితం శంభోర్న కించిదిహ విద్యతే ॥
యేనోపలభ్యతేఽస్మిన్సకలేనాపి నిష్కలః ।
స మూర్త్యాత్మా శివస్యైవమూర్తిరిత్యుపచర్యతే ॥

వాయువు ఇట్లు పలికెను ః

ఓ బ్రాహ్మణులారా! విమర్శాత్మకమగు దృష్టిచే ప్రేరేపించ బడినవారై మీరు వెలిబుచ్చిన సందేహము యోగ్యముగా నున్నది. సద్బుద్ధి గలవారియందు ఉండే తెలియాలనే కోరిక నాస్తికతకు నిదర్శనము కాబోదు. ఈ విషయములో సత్పురుషుల అజ్ఞానమును నివారించే జ్ఞానసాధనమును చెప్పెదను. పరమేశ్వరుని అనుగ్రహము లేకపోవుటచేతనే దుష్టులయందు అయోగ్యమగు ప్రవృత్తి కలుగుచున్నది. పరిపూర్ణుడగు శివుని గొప్ప అనుగ్రహము లేనిదే ఎవ్వరైననూ దేనినైననూ చేయజాలరని చక్కగా నిర్ధారించ బడినది. శివుడు జగత్తు (పరము) పై పూర్ణమగు అనుగ్రహమును చూపించే కర్మయందు మాయోపాధి సమర్థమగుచున్నది. అట్లు గానిచో, అనగా మాయాసంబంధము లేనిచో నిర్గుణ పరంబ్రహ్మము దేనినైననూ అనుగ్రహించుట పొసగదు. జీవులు, వారి బంధములతో కూడియుండే జగత్తు పరము (అన్యము) అనబడును. దీనిని పరమేశ్వరుడు అనుగ్రహించ వలసి యున్నది. ఈ విధముగా జగత్తును

అనుగ్రహించుట కొరకై ఆ ప్రభునకు దేవి (ఆజ్ఞా) తో సంబంధము ఆవశ్యకమగుచున్నది, ఆజ్ఞయే స్వభావముగా గల ఆ ప్రభుడు సర్వజగత్తును సర్వకాలములలో అనుగ్రహించును. దాని కొరకై ఆజ్ఞ అనే అర్థము(శక్తి) ను స్వీకరించుటలో శివుడు అస్వతంత్రుడు ఎట్లు అగును? అనుగ్రహించే వాని అపేక్ష లేని అనుగ్రహమేదియూ లేదు. కావున, స్వాతంత్ర్యము అనే శబ్దముయొక్క అర్థముతో అపేక్ష లేకుండుట అనుగ్రహముయొక్క లక్షణము అగుచున్నది. ఈ జీవునకు పరమేశ్వరుని అనుగ్రహము లేనిదే భుక్తి గాని, ముక్తి గాని సిద్ధించదు. కావున, అనుగ్రహమును నిశ్చితముగా అపేక్షించే ఈ జగత్తు పరతంత్రము (అన్యముపై ఆధారపడునది) అని చెప్పబడుచున్నది. శివుని సగుణరూపములు కూడ శివుని ఆజ్ఞయొక్క పరిధిలోని వారే గనుక, వారు కూడ అనుగ్రహింప దగిన వారే, ఈ జగత్తులో శివుని ఆజ్ఞయొక్క పరిధిలోనికి రానిది ఏదీ లేదు. సాకారుడగు శివుని పూజించియు మనము నిర్గుణశివతత్త్వమును పొందుచున్నాము. అట్టి సగుణరూపములో నున్న శివుడు శైవమూర్తి (శివునికి సంబంధించిన మూర్తి) అనే గౌణ (శివునకు మూర్తికి భేదము లేకున్ననూ భేదమును సూచించే) ప్రయోగముతో వ్యవహరించుచున్నాము.

న హ్యసౌ నిష్కలస్సాక్షాచ్ఛివః పరమకారణమ్ ।
సాకారేణానుభావేన కేనాప్యనుపలక్షితః ॥
ప్రమాణాగమ్యతామాత్రం తత్స్వభావోపపాదకమ్ ।
న తావతాత్రోపేక్షాధీరుపలక్షణమంతరా ॥
ఆత్మోపమోల్బణం సాక్షాన్మూర్తిరేవ హి కాచన ।
శివస్య మూర్తిమూర్త్యాత్మా పరస్తస్యోపలక్షణమ్ ॥
యథా కాష్ఠేష్వనారూఢో న వహ్నిరుపలభ్యతే ।
ఏవం శివోఽపి మూర్త్యాత్మన్యనారూఢ ఇతి స్థితిః ॥
యథాగ్నిమానయేత్యుక్తే జ్వలత్కాష్ఠాదృతే స్వయమ్ ।
నాగ్నిరానీయతే తద్వత్పూజ్యో మూర్త్యాత్మనా శివః ॥
అత ఏవ హి పూజాదౌ మూర్త్యాత్మ పరికల్పనమ్ ।
మూర్త్యాత్మని కృతం సాక్షాచ్ఛివ ఏవ కృతం యతః ॥
లింగాదావపి తత్కృత్యమర్చాయాం చ విశేషతః ।
తత్తన్మూర్త్యాత్మ భావేన శివోఽస్మాభిరుపాస్యతే ॥
యథానుగృహ్యతే సోఽపి మూర్త్యాత్మా పారమేష్ఠినా ।
తథా మూర్త్యాత్మనిష్ఠేన శివేన పశవో వయమ్ ॥
లోకానుగ్రహణాయైవ శివేన పరమేష్ఠినా ।
సదాశివాదయస్సర్వే మూర్త్యాత్మానోఽప్యధిష్ఠితాః ॥
ఆత్మనామేవ భోగాయ మోక్షాయ చ విశేషతః ।
తత్త్వతత్త్వస్వరూపేషు మూర్త్యాత్మసు శివాన్వయః ॥

సర్వకారణకారణుడగు ఈ శివుడు ఏ రకమైన సాకారమగు అనుభూతిచేనైననూ తెలియ శక్యము కాని కేవలనిర్గుణస్వరూపుడు కాదు. శివుని స్వరూపము ప్రత్యక్షాదిప్రమాణములకు ఉపలభ్యము కాదు అని మాత్రమే తాత్పర్యము. అంత మాత్రముచే శివుని సగుణరూపమును ఉపేక్షించుటయందు తాత్పర్యము లేదు. శివుని సగుణరూపము నిర్గుణపరంబ్రహ్మకు ఉపలక్షకము అని చెప్పుట తప్ప మరియొకటి కాదు, తన స్వరూపముతో చాల దగ్గర పోలిక గల ఏదో ఒక మూర్తి మాత్రమే సాక్షాత్తుగా శివుని మూర్తి అగుచున్నది. అనగా ఆ పరబ్రహ్మయే మూర్తి రూపములో నున్నాడు. మూర్తి పరబ్రహ్మకు ఉపలక్షకము (దగ్గరగా చూపించేది) అగును. కట్టెను ఆశ్రయించ కుండగా నిప్పు మనకు లభించుట లేదు. అదే విధముగా ఒక మూర్తిని అధిష్ఠించకుండగా శివుడు కూడ మనకు లభించుట లేదు. వస్తుస్థితి అట్లున్నది. నిప్పును తీసుకు రమ్ము అని చెప్పినచో, మండే పుల్లను కాకుండగా సాక్షాత్తుగా అగ్నిని మాత్రమే తీసుకు వచ్చుట సంభవము కాదు. అదే విధముగా శివుని మూర్తి రూపములో పూజించ వలెను. ఈ కారణము చేతనే పూజ మొదలగు వాటియందు సగుణరూపము కల్పించ బడుచున్నది. ఏలయనగా, సగుణరూపమునకు పూజను చేసినచో, అది శివునకు చేసిన పూజయే యగుచున్నది. కావున, లింగము మొదలగు వాటిని మాత్రమే గాక, అర్చామూర్తులను కూడ విశేషముగా పూజించ వలెను. మనము శివుని ఆయా మూర్తుల రూపములో ఉపాసించు చున్నాము. నిర్గుణపరంబ్రహ్మ సగుణసాకారరూపమును అనుగ్రహించు విధముగానే, అదే విధముగా సగుణరూపమునందు పరినిష్ఠితుడై యున్న శివుడు అజ్ఞానులమగు మనలను అనుగ్రహించును, పరంబ్రహ్మయగు శివుడు లోకములను అనుగ్రహించుట కొరకు మాత్రమే సదాశివుడు మొదలగు మూర్తిరూపములను అన్నింటినీ అధిష్ఠించి యున్నాడు. శివుడు భోగమోక్షముల కొరకై క్రమముగా సగుణ నిర్గుణ రూపములలో భేదమును కల్పించి తనను ప్రకటించినాడు. సగుణరూపములలో ఆ శివుడు అనువృత్తుడగుచున్నాడు.

**భోగః కర్మవిపాకాత్మా సుఖదుఃఖాత్మకో మతః ।**
**న చ కర్మ శివేఽస్తీతి తస్య భోగః కిమాత్మకః ॥**
**సర్వం శివోఽనుగృహ్ణాతి న నిగృహ్ణాతి కించన ।**
**నిగృహ్ణతాం తు యే దోషాశ్శివే తేషామసంభవాత్ ॥**
**యే పునర్నిగ్రహాః కేచిద్బ్రహ్మాదిషు నిదర్శితాః ।**
**తేఽపి లోకహితాయైవ కృతాః శ్రీకంఠమూర్తినా ॥**
**బ్రహ్మాండస్యాధిపత్యం హి శ్రీకంఠస్య న సంశయః ।**
**శ్రీకంఠాఖ్యాం శివో మూర్తిం క్రీడతీమధితిష్ఠతి ॥**
**సదోషా ఏవ దేవాద్యా నిగృహీతా యథోదితమ్ ।**
**తతస్తేపి విపాప్మానః ప్రజాశ్చాపి గతజ్వరాః ॥**
**నిగ్రహోఽపి స్వరూపేణ విదుషాం న జుగుప్సితః ।**
**అత ఏవ హి దండ్యేషు దండో రాజ్ఞాం ప్రశస్యతే ॥**

యత్కిఞ్చిదీశ్వరత్వేన కార్యవర్గస్య కృత్స్నశః ।
న స చేదీశతాం కుర్యాజ్జగతః కథమీశ్వరః ॥
ఈశేచ్ఛా చ విధాతృత్వం విధేరాజ్ఞాపనం పరమ్ ।
ఆజ్ఞావశ్యమిదం కుర్యాన్న కుర్యాదితి శాసనమ్ ॥
తచ్ఛాసనానువర్తిత్వం సాధుభావస్య లక్షణమ్ ।
విపరీతమసాధోస్స్యాన్న సర్వం తత్తు దృశ్యతే ॥
సాధు సంరక్షణీయం చేద్వినివర్త్యమసాధు యత్ ।
నివర్తతే చ సామాదేరంతే దండో హి సాధనమ్ ॥

భోగము కర్మఫలము పరిపక్వమై లభించే సుఖదుఃఖముల రూపములో నుండును. కాని శివునియందు కర్మ లేదు. కావున, ఆయనకు భోగమనగా నేమి? శివుడు సర్వులను అనుగ్రహించును; ఎవ్వరినైననూ శిక్షించడు. ఏలయనగా, శిక్షించే వారిలో ఉండే దోషములేమియు శివునిలో లేవు. కాని, బ్రహ్మ మొదలగు వారి విషయములో కొన్ని సందర్భములలో శివుడు శిక్షించి యున్నాడు. విషమును కంఠమునందు ధరించే శివుడు వాటిని లోకముల హితము కొరకు మాత్రమే చేసినాడు. బ్రహ్మాండముయొక్క ఆధిపత్యము కాలకంఠునిదే యనుటలో సందేహము లేదు. ఆ శివుడు లీల కొరకై కాలకంఠుడు అనే మూర్తిని ధరించి యున్నాడు. దోషము గల దేవతలు మొదలగు వారు మాత్రమే శిక్షించ బడినారని పూర్వములో చెప్పడమైనది. అట్లు చేయుట వలన వారికి పాపములు తొలగి పోవుట మాత్రమే గాక, ప్రజలకు పీడ తొలగును. శిక్షించుటయైననూ స్వరూపముచే నిందావిషయము కాదని పండితులు చెప్పుచున్నారు. కావుననే, శిక్షార్హులకు రాజులు విధించే శిక్షలు కొనియాడ బడుచున్నవి. ఈ సకలకార్యజగత్తు ఈశ్వరుని అధ్యక్షతచే మాత్రమే స్థితిని కలిగియున్నది. జగత్తులోని జీవులను నియంత్రించనిచో, ఆయన ఈశ్వరుడు ఎట్లు అగును? ఈశ్వరుని సంకల్పము మాత్రమే సృష్టికర్తయొక్క సృష్టి కార్యమునకు ఆధారము. ఆయనయొక్క ఉల్లంఘింప శక్యము కాని ఆజ్ఞ చేతనే ఈ సృష్టి జరుగుచున్నది. ఈ జగత్తు శివుని ఆజ్ఞకు లోబడి యున్నది. ఇట్లు చేయవలెను, ఇట్లు చేయరాదు అనే విధినిషేధముల రూపములో శివుని శాసనము గలదు. ఆ శాసనమునకు అనురూపముగా నడుచు కొనుట మంచివారి లక్షణము. దానికి విరుద్ధముగా నడచుట చెడ్డతనము అగును. కానీ, సర్వులు సాధుభావమును కలిగియుండుట లేదు. సాధుత్వమును సంరక్షించుటకై అసాధుత్వమును నివారించ వలెను. అసాధుత్వము సామదానభేదోపాయములచే తొలగి పోనిచో, దండము మాత్రమే సాధనమగును.

హితార్థలక్షణం చేదం దండాంతమనుశాసనమ్ ।
అతో యద్విపరీతం తదహితం సంప్రచక్షతే ॥
హితే సదా నిషణ్ణానామీశ్వరస్య నిదర్శనమ్ ।
స కథం దుష్యతే సద్భిరసతామేవ నిగ్రహాత్ ॥
అయుక్తకారిణో లోకే గర్హణీయావివేకితా ।
యదుద్వేజయతే లోకం తదయుక్తం ప్రచక్షతే ॥

సర్వోఽపి నిగ్రహో లోకే న చ విద్వేషపూర్వకః ।
న హి ద్వేష్టి పితా పుత్రం యో నిగృహ్యాతి శిక్షయేత్ ॥
మాధ్యస్థేనాపి నిగ్రాహ్యాన్యో నిగృహ్ణాతి మార్గతః ।
తస్యాప్యవశ్యం యత్కించిన్నైర్ఘృణ్యమనువర్తతే ॥
అన్యథా న హినస్త్యేవ సదోషానప్యసౌ పరాన్ ।
హినస్తి చాయమవ్యజ్ఞాన్ పరం మాధ్యస్థ్యమాచరన్ ॥
తస్మాద్దుఃఖాత్మికాం హింసాం కుర్వాణో యస్స నిర్ఘృణః ।
ఇతి నిర్బంధయంత్యేకే నియమో నేతి చాపరే ॥
నిదానజ్ఞస్య భిషజో రుగ్ణే హింసాం ప్రయుంజతః ।
న కించిదపి నైర్ఘృణ్యం ఘృణైవాత్ర ప్రయోజికా ॥
ఘృణాపి న గుణాయైవ హింస్రేషు ప్రతియోగిషు ।
తాదృశేషు ఘృణీ భ్రాంత్యా ఘృణాంతరితనిర్ఘృణః ॥
ఉపేక్షాపీహ దోషాయ రక్ష్యేషు ప్రతియోగిషు ।
శక్తౌ సత్యాముపేక్షాతో రక్ష్యస్సద్యో విపద్యతే ॥

దండము వరకు గల ఈ అనుశాసనము వ్యక్తి యొక్క హితము కొరకు ప్రవర్తిల్లు చున్నది. దీనికి విరుద్ధముగా నేరమును చేసిన వానిని శిక్షించనిచో, అది వానికి అపకారమే యగును. సర్వకాలములలో హితమును కోరువారికి ఈశ్వరుడే నిదర్శనమగుచున్నాడు. సత్పురుషులు ఈశ్వరుని ఏల నిందింతురు? ఈశ్వరుడు దుష్టులను మాత్రమే శిక్షించును. లోకములో అయోగ్యమగు పనిని చేయువాని అవివేకము నిందించ దగినది. ఏ పని చేసినచో జనులకు ఉద్వేగము కలుగునో, అది అయోగ్యమగు పని అని పెద్దలు చెప్పుచున్నారు. లోకములో శిక్ష వేసిన సందర్భములన్నింటిలో అది ద్వేషపూర్వకముగా వేసిన శిక్ష కాదు. తండ్రి కొడుకును శాసించి విద్యను గరపును. అట్టి తండ్రికీ వానిపై ద్వేషము ఉండదు. తాను కేవలము మధ్యస్థునిగా మాత్రమే ఉంటూ శిక్షార్హులకు శిక్షను శాస్త్ర మార్గము ననుసరించి విధించే వ్యక్తి యందు కూడ ఏదో కొంత కాఠిన్యము తప్పక ఉండి తీరును. అట్లు గానిచో, ఆ పరమేశ్వరుడు దోషులైననూ ఇతరులగు జీవులను హింసకు గురి చేయజాలడు. కానీ, ఆయన తాను ఖచ్చితముగా అసంగుడుగా నుండి అజ్ఞానులను శిక్షించు చున్నాడు. దుఃఖరూపమగు ,హింసను చేయు వ్యక్తి నిర్దయుడే నని కొందరు గట్టిగా వాదించు చున్నారు. కాని, అట్టి నియమము లేదని కొందరు చెప్పుచున్నారు, రోగియొక్క రోగమును గుర్తించి, వానిపై శస్త్ర చికిత్స మొదలైన హింసను చేసే వైద్యునియందు నిర్దయ లేశమైననూ లేదు. ఆతడు చేయు హింసకు ప్రేరణ దయయే యగుచున్నది. హింసను ఆచరించే శత్రువుల విషయములో దయను చూపుట మంచిది కానే కాదు. వారియందు భ్రాంతిచే చూపబడే దయ కూడ ఆ రూపములో నున్న నిర్దయయే యగును. రక్షింప దగిన శత్రువులనైననూ ఉపేక్షించినచో, అది దోషమే యగును. శక్తి ఉండి కూడా రక్షింప దగిన వానిని ఉపేక్షించినచో, ఆతడు వెను వెంటనే ఆపదకు లోనగును.

సర్పస్యాఽఽస్యగతం పశ్యన్ యస్తు రక్ష్యముపేక్షతే ।
దోషాభాసాన్ సముత్ప్రేక్ష్య ఫలతస్సోఽపి నిర్ఘృణః ॥
తస్మాద్ఘృణా గుణాయైవ సర్వథేతి న సంమతమ్ ।
సంమతం ప్రాప్తకారిత్వం సర్వం త్వన్యదసంమతమ్ ॥
మూర్త్యాత్మస్వపి రాగాద్యా దోషాస్సంత్యేవ వస్తుతః ।
తథాపి తేషామేవైతే న శివస్య తు సర్వథా ।
అగ్నావపి సమావిష్టం తామ్రం ఖలు సకాలికమ్ ॥
ఇతి నాగ్నిరసౌ దుష్యేత్తామ్ర సంసర్గకారణాత్ ।
నాగ్నేరశుచిసంసర్గా దశుచిత్వమపేక్షతే ॥
అశుచేస్త్వగ్నిసంయోగాచ్ఛుచిత్వమపి జాయతే ।
ఏవం శోధ్యాత్మసంసర్గాన్న హ్యశుద్ధశ్శివో భవేత్ ॥
శివసంసర్గతస్త్వేష శోధ్యాత్మైవ హి శుధ్యతి ।
అయస్యగ్నౌ సహావిష్టే దాహోఽగ్నేరేవ నాయసః ॥
మూర్త్యాత్మన్యేవమైశ్వర్యమీశ్వరస్యైవ నాత్మనామ్ ।
న హి కాష్ఠం జ్వలత్యూర్ధ్వమగ్నిరేవ జ్వలత్యసౌ ॥
కాష్ఠస్యాంగారతా నాగ్నేరేవమత్రాపి యోజ్యతామ్ ।
అత ఏవ జగత్యస్మిన్ కాష్ఠపాషాణమృత్స్వపి ॥
శివావేశవశాదేవ శివత్వముపచర్యతే ।
మైత్ర్యాదయో గుణా గౌణాస్తస్మాత్తే భిన్నవృత్తయః ॥
తైర్గుణైరుపరక్తానాం దోషాయ చ గుణాయ చ ।
యత్తు గౌణమగౌణం చ తత్సర్వమనుగృహ్ణతః ॥
న గుణాయ న దోషాయ శివస్య గుణవృత్తయః ॥

పాము నోటిలో పడబోతూ ఉన్న రక్షించుటకు అర్హుడైన వ్యక్తిని చూస్తూ, ఆతని యందు కానవచ్చిన దోషములను అధికముగా ఊహించు కొని ఎవడైతే ఉపేక్షించునో, వాడు కూడ దాని ఫలరూపముగా నిర్దయుడే అగుచున్నాడు. కావున, సకల పరిస్థితులలో దయ మంచియే అను మాట అంగీకారము కాదు. సందర్భమును బట్టి దయను చూపవలెనను మాట అంగీకారమే. అంతకు మించి చెప్పినా, అది అంగీకారము కాదు. వాస్తవములో పరమేశ్వరుని సగుణరూపములయందు కూడ రాగము మొదలగు దోషములు నిశ్చితముగా నున్నవి. అయిననూ, ఆ దోషములు ఆ మూర్తులకు మాత్రమే చెందును గాని, ఏ విధముగా నైననూ శివునకు అంటవు. అగ్నియందు కాల్చబడే రాగిలో కత్తి ఉండవచ్చును. అట్లు కత్తి రాగితో కలిసిన కారణముగా ఈ అగ్నికి దోషము అంటదు. అపవిత్రములగు పదార్థముల తోడి కలయిక వలన అగ్ని అపవిత్రము కాదు. పైగా, ఆ అపవిత్రపదార్థమే అగ్నితోడి కలయిక వలన పవిత్రమగును. ఇదే విధముగా పవిత్రము చేయదగిన ఆత్మ తోడి కలయికచే శివుడు అపవిత్రుడు కాబోడు. ఈ పవిత్రము చేయదగిన ఆత్మయే శివునితో కలయిక వలన

పవిత్రమగును. నిప్పులో కాలిన ఇనుప గుండు పదార్థములను కాల్చును. కాని, ఆ దాహకశక్తి నిప్పుదే కానీ, ఇనుముదీ కాదు. ఇదే విధముగా సగుణమూర్తులయందు ఉండే ఐశ్వర్యము ఈశ్వరునిదే గాని, ఆయా ఆత్మలది కాదు. పైకి జ్వాలలను చిమ్ముతూ మండేది కట్టికాదు. అగ్నియే అట్లు మండుచున్నది. కాని, నల్లని బొగ్గు కట్టెది మాత్రమే. అది అగ్నికి చెందినది కాదు. ప్రస్తుతములో కూడ వస్తుస్థితిని అటులనే తెలియవలెను. ఇందు వలననే, ఈ జగత్తులో కట్టె, రాయి, మట్టి అనువాటియందు కూడ శివుడు ఆవేశించి యుండుట చేతనే వాటి యందు శివుడు గౌణ (అప్రధాన) వృత్తిచే భావన చేయబడు చున్నాడు. మైత్రి (స్నేహభావము) మొదలైన గుణములు సత్త్వరజస్తమోగుణాత్మకమగు అంతఃకరణముయొక్క ధర్మములు మాత్రమే. కావుననే, అవి విభిన్నసమయములలో విభిన్నముగా వ్యక్తమగుచుండును. ఆయా గుణములచే సంసర్గమును పొంది వాటిచే ప్రభావితులైన వారికి వాటి గుణదోషములు సంక్రమించును. త్రిగుణాత్మకమగు ప్రకృతి కార్యములను గాని, వాటియందు చైతన్యము అభివ్యక్తమై సంప్రాప్తించే జీవులను గాని, ఈ సర్వమును అనుగ్రహించే శివునకు ఈ సత్త్వరజస్తమోగుణముల వ్యాపారములు గుణమును గాని, దోషమును గాని కలిగించవు.

న చాను గ్రహశబ్దార్థం గౌణమాహుర్విపశ్చితః ।
సంసారమోచనం కిం తు శైవమాజ్ఞామయం హితమ్ ॥
పాతం తదాజ్ఞాకరణం యద్ధితం తదనుగ్రహః ।
సర్వం హితే నియుంజానస్సర్వాను గ్రహకారకః ॥
యస్తూపకారశబ్దార్థస్తమప్యాహురను గ్రహమ్ ।
తస్యాపి హితరూపత్వాచ్ఛివ స్సర్వోపకారకః ॥
హితే సదా నియుక్తం తు సర్వం చిదచిదాత్మకమ్ ।
స్వభావ ప్రతిబంధం తత్సమం న లభతే హితమ్ ॥
యథ వికాసయత్యేవ రవిః పద్మాని భానుభిః ।
సమం న వికసంత్యేవ స్వస్వభావానురోధతః ॥
స్వభావో ఒపి హి భావానాం భావినోఽ ర్థస్య కారణమ్ ।
న హి స్వభావో నశ్యంతమర్థం కర్తృషు సాధయేత్ ॥
సువర్ణమేవ నాంగారం ద్రావయత్యగ్ని సంగమః ।
ఏవం పక్వమలానేవ మోచయేన్న శివః పరాన్ ॥
యద్య థా భావితుం యోగ్యం తత్తథా న భవేత్స్వయమ్ ।
వినా భావనయా కర్తా స్వతంత్రస్సంతతో భవేత్ ॥
స్వభావవిమలో యద్వత్సర్వాను గ్రాహకశ్శివః ।
స్వభావమలినాస్తద్వదాత్మానో జీవసంజ్ఞితాః ॥
అన్యథా సంసరంత్యేతే నియమాన్న శివః కథమ్ ।
కర్మమాయానుబంధోస్య సంసారః కథ్యతే బుధైః ॥

అనుగ్రహము అనే శబ్దమునకు చెప్పబడే అర్థము ముఖ్యార్థమే గాని, గౌణము (అప్రధానము) కాదని పండితులు చెప్పుచున్నారు. కాని, శివుని ఆజ్ఞను పాలించుటచే సంసారవిముక్తి అనే హితము కలుగును. శివుని ఆజ్ఞను పాలించుటయే హితము. ఏది హితమో, అదియే అనుగ్రహము. సర్వులను హితమునందు నియోగించే శివుడు సర్వులకు అనుగ్రహమును చేయుచున్నాడు. ఉపకారము అనే శబ్దమునకు అర్థము కూడ అనుగ్రహమే అనీ పండితులు చెప్పు చున్నారు. ఉపకారము కూడ పాతరూపములోననే యుండును. కావున, శివుడు సర్వులకు ఉపకారమును చేయువాడు. జడచేతనాత్మకమగు ఈ ప్రపంచమంతయు సర్వకాలములలో హితమునందు నియోగించ బడి యున్నది. కానీ, వ్యక్తుల స్వభావము ఆటంకమగుటచే అందరికీ సమానమగు హితము లభించుట లేదు. అది యెట్లనగా, సూర్యుడు తన కిరణములతో పద్మములను ప్రకాశింప జేయుచున్నాడు. కానీ పద్మములన్నియు తమ తమ స్వభావమునకు అనురూపముగా వికసించునే గాని, అన్నీ సమానముగా వికసించుట లేదు. జీవుల స్వభావము కూడా వారికి భవిష్యత్తులో లభించ బోయే స్థితికి కారణమగును. కాని, కర్మలను చేయు జీవులకు నశించి పోవుచున్న పదార్థమును స్వభావము సంపాదించి పెట్టలేదు. అగ్నితో కలిసినప్పుడు కరిగేది బంగారమే గానీ బొగ్గు కాదు. అదే విధముగా శివుడు పక్వమైన, అనగా రాలిపోయిన దోషములు గల జీవులకు మాత్రమే మోక్షమునిచ్చును; ఇతురులకు కాదు. ఏ వస్తువు ఏ విధముగా కాదగి యున్నదో, ఆ విధముగా స్వయముగా కర్తయొక్క భావన లేకుండగా కాలేదు. సర్వకాలములలో కర్త మాత్రమే స్వతంత్రుడై యుండును. ఏ విధముగా నైతే సర్వులను అనుగ్రహించే శివుడు స్వభావము చేతనే దోషరహితుడై యున్నాడో, అదే విధముగా జీవులు అనే పేరుతో వ్యవహరింపబడే ఆత్మలు స్వభావము చేతనే దోషము కలవి ఉన్నవి. అట్లు గానిచో, ఈ జీవులు నిశ్చయముగా సంసారములో పరిభ్రమించుటకు శివుడు కాకుండుటకు కారణమేమున్నది? జీవునకు కర్మతో మరియు మాయతో గల రోగపూర్వకమైన సంబంధమే సంసారమని పండితులు చెప్పుచున్నారు.

**అనుబంధోఽయమస్యైవ న శివస్యేతి హేతుమాన్ ।**
**స హేతురాత్మనామేవ నిజో నాగంతుకో మలః ॥**
**ఆగంతుకత్వే కస్యాపి భావ్యం కేనాపి హేతునా ।**
**యోఽయం హేతురసాపేక్షస్స్వవిచిత్ర స్వభావతః ॥**
**ఆత్మతాయాస్సమత్వే ఽపి బద్ధా ముక్తాః పరే యతః ।**
**బద్ధేష్వేవ పునః కేచిల్లయభోగాధికారతః ॥**
**జ్ఞానైశ్వర్యా దివైషమ్యం భజంతే సోత్తరాధరాః ।**
**కేచిన్మూర్త్యాత్మతాం యాంతి కేచిదాసన్నగోచరాః ॥**
**మూర్త్యాత్మసు శివాః కేచిదధ్వనాం మూర్ధసు స్థితాః ।**
**మధ్యే మహేశ్వరా రుద్రస్సర్వాటీనపదే స్థితాః ॥**
**ఆసన్నే ఽపి చ మాయాయాః పరస్మాత్కారణ త్రయమ్ ।**
**తత్రాప్యాత్మా స్థితో ఽధస్తాదంతరాత్మా చ మధ్యతః ॥**

పరస్తాత్పరమాత్మేతి బ్రహ్మవిష్ణు మహేశ్వరాః ।
వర్తంతే వసవః కేచిత్పరమాత్మ పదాశ్రయాః ॥
అంతరాత్మపదే కేచిత్కే చిదాత్మపదే తథా ।
శాంత్యతీతపదే శైవాశ్శాంతే మాహేశ్వరే తతః ॥
విద్యాయాం తు యథా రౌద్రాః ప్రతిష్ఠాయాం తు వైష్ణవాః ।
నివృత్తౌ చ తథాత్మానో బ్రహ్మ బ్రహ్మాంగయోనయః ॥
దేవయోన్యష్టకం ముఖ్యం మానుష్యమథ మధ్యమమ్ ।
పక్ష్యాదయో ఒధమాః పంచ యోనయస్తాశ్చతుర్దశ ॥

ఇట్టి రాగము అనే హేతువు గల సంసారబంధము జీవులకు మాత్రమే గలదు. ఈ సంసారము శివునకు లేదు. దీనికి కారణమేమనగా, జీవునియందు దోషము సహజముగా నుండుటయే. ఆ దోషము బయటనుండి వచ్చినది కాదు. జీవదోషము ఆగంతుకము అన్నచో, ఎవ్వనికైననూ ఏ కారణము చేతనైననూ బంధము కలుగవలెను. కాని, అట్లు కాదు. ఈ బంధ హేతువు ఒకే ఒకటి గలదు. ఏల యనగా, జీవుల స్వభావములలో భేదము లేదు. ఏలయనగా, అందరిలో ఆత్మస్వరూపము సమానముగనే యున్ననూ, కొందరు బద్ధులుగను, మరికొందరు ముక్తులుగను ఉంటున్నారు. బద్ధులలో గూడ మరల లయము మరియు భోగము అను వాటియందు గల అధికారసంపదను బట్టి కొందరు ఉత్తములుగను, మరికొందరు అధములుగను ఉంటూ, జ్ఞానము, ఐశ్వర్యము మొదలగు ధర్మములలో హెచ్చుతగ్గులను అనుభవించు చున్నారు. కొందరు మూర్తిస్వరూపులు అగుచుండగా, మరికొందరు శివునకు సమీపములో సంచరించుచున్నారు. మూర్తిరూపములో నుండు వారిలో కూడ కొందరు శివస్వరూపులైయుండగా, మరికొందరు ఆరు విధముల మార్గముల ఊర్ధ్వస్థానమునందు ఉంటున్నారు. కొందరు ఈ మార్గముల మధ్యలో మహేశ్వరరూపులై యుండగా, మరికొందరు క్రింది భాగములో రుద్రరూపులై ఉంటున్నారు. శివునకు సమీపములో నుండు స్వరూపములో కూడ సర్వకారణమగు మాయకు అతీతమగు స్థానములో మూడు భేదములు గలవు. అచట క్రింది స్థానములో ఆత్మ, మధ్యలో అంతరాత్మ , ఊర్ధ్వస్థానములో పరమాత్మ ఉన్నారు. వారే క్రతువుగా బ్రహ్మవిష్ణుమహేశ్వరులనబడు చున్నారు. పరమాత్మపదమును ఆశ్రయించిన శ్రేష్ఠ జీవులు కొందరు గలరు. కొందరు అంతరాత్మపదమునందు, మరికొందరు ఆత్మపదమునందు ఉంటున్నారు. తరువాత మహేశ్వరునిచే అధిష్ఠించ బడిన శాంతిపదమునందు కూడ కొందరు గలరు. రుద్రభక్తులు విద్యా అనే కళాస్థానమునందు, విష్ణుభక్తులు ప్రతిష్టాకళయొక్క స్థానమునందు ఉంటున్నారు. అదే విధముగా బ్రహ్మ, మరియు ఆయన దేహమునుండి పుట్టిన జీవులు నివృత్తి కళయొక్క స్థానమునందు ఉండెదరు. ఎనిమిది దేవయోనులు ముఖ్యమైనవి గలవు. మనుష్య జాతి మధ్యమము. పక్షులు మొదలైన అయిదు అధమయోనులు గలవు. ఈ విధముగా వెరసి పదునాలు యోనులు గలవు .

ఉత్తరాధరభావోఽపి జ్ఞేయస్సంసారిణో మలః ।
యథామభావో భుక్తస్య పూర్వం పశ్చాత్తు పక్వతా ॥
మలో ఒప్యామశ్చ పక్వశ్చ భవేత్సంసార కారణమ్ ।
ఆమే త్వధరతా పుంసాం పక్వే తూత్తరతా క్రమాత్ ॥
పశ్చాత్మానస్త్రిధా భిన్నా ఏకద్విత్రిమలాః క్రమాత్ ।
అత్రోత్తరా ఏకమలా ద్విమలా మధ్యమా తతః ।
త్రిమలాస్త్వధమా జ్ఞేఅయా యథోత్తరమధిష్ఠితాః ॥
త్రిమలానధితిష్ఠంతి ద్విమలైకమలాః క్రమాత్ ।
ఇత్థమౌపాధికో భేదో విశ్వస్య పరికల్పితః ॥
ఏకద్విత్రిమలాన్ సర్వాన్ శివ ఏకో ఒధితిష్ఠతి ।
అశివాత్మకమప్యేతచ్ఛివేనాధిష్ఠితం యథా ॥
అరుద్రాత్మకమిత్యేవం రుద్రైర్జగదధిష్ఠితమ్ ।
అండాంతా హి మహాభూమిశ్శతరుద్రాద్యధిష్ఠితా ॥
మాయాంతమంతరిక్షం తు హ్యమరేశాదిభిః క్రమాత్ ।
అంగుష్ఠమాత్రపర్యంతైస్సమంతాత్సంతతం తతమ్ ॥
మహామాయావసానా ద్యౌర్వాయ్వాద్యైర్భువనాధిపైః ।
అనాశ్రితాంతైరధ్వాంతర్వర్తిభిస్సమధిష్ఠితా ॥
తే హి సాక్షార్ద్దివిషదస్త్వంతరిక్షసదస్తథా ।
పృథివీషద ఇత్యేవం దేవా దేవవ్రతైః స్తుతాః ॥
ఏవం త్రిభిర్మలైరామైః పక్వైరేవ పృథక్ పృథక్ ।
నిదానభూతైస్సంసారరోగః పుంసాం ప్రవర్తతే ॥

సంసారియగు జీవునకు ఉండే ఉత్తమము లేక అధమము అగు స్థితి కూడ మాలిన్యములో భాగమే యగుచున్నది. ఉదాహరణకు, మనము తిన్న ఆహారము ముందుగా అపక్వముగ నున్ననూ, తరువాత పక్వమగును. మాలిన్యము అపక్వమైనా, పక్వమైనా, సంసారమునకు హేతువు అగును. మాలిన్యము అపక్వముగా నున్న జీవులు అధమస్థానమును, క్రమముగా పక్వమైన జీవులు ఉత్తమస్థానమును పొందెదరు. సంసారములో బద్ధులై యుండే జీవులు. క్రమముగా ఒక మాలిన్యము గలవారు, రెండు మాలిన్యములు గలవారు, మూడు మాలిన్యములు గలవారు అని మూడు విధములుగా నున్నారు. వీరిలో ఒక మాలిన్యము గలవారు ఉత్తములు, రెండు మాలిన్యములు గలవారు మధ్యములు, మూడు మాలిన్యములు గలవారు అధములు అని తెలియవలెను. వీరు సంసారములోని స్థానములను క్రమముగా ఒకరిపై నొకరు అధిష్ఠించెదరు. ఈ మూడు మాలిన్యములు గలవారి పైన ఉండే స్థానమును రెండు మాలిన్యములు గలవారు, వారిపై స్థానమును ఒక మాలిన్యము గలవారు క్రమముగా అధిష్ఠించెదరు. ఈ విధముగా జగత్తులో అంతటా ఉపాధిని బట్టి భేదములు కల్పించ బడినవి. ఒకటి, రెండు మరియు మూడు మాలిన్యములు గలవారందరిపై

శివుడు ఒక్కడు మాత్రమే అధ్యక్షుడై యున్నాడు. ఏ విధముగానైతే ఈ జగత్తు అశివ (అమంగళ స్వరూపమే అయిననూ, శివునిచే అధిష్టించబడి యున్నదో, అదే విధముగా, రుద్రస్వరూపముతో సంబంధము లేని జగత్తు రుద్రులచే అధిష్టించబడి యున్నది. మహాభూతమగు భూమితో మొదలయ్యే బ్రహ్మాండమంతయు అసంఖ్యాకులగు రుద్రులు మొదలగు వారిచే అధిష్టించబడి యున్నది, ఆకాశముతో మొదలిడి మాయాతత్త్వము వరకు గల విశ్వమంతయు ఇంద్రుడు మొదలగు వారిచే క్రమముగా పూర్ణముగా వ్యాప్తమై యున్నది. వీరి జీవపరిమాణము బొటనవేలంత మాత్రమే యుండును. స్వర్గలోకముతో మొదలిడి మహామాయతో అంతమయ్యే విశ్వమును ఆరు మార్గముల లోపల ఉండే లోకపాలకులు చక్కగా అధిష్టించి యున్నారు. జీవులు ఈ లోకపాలకులను పరమపదరూపములో ఆశ్రయించుట లేదు. ఆ దేవతలలో కొందరు సాక్షాత్తుగా స్వర్గమునందు, మరికొందరు అంతరిక్షమునందు, ఇంకొందరు భూమియందు నివసించెదరు. దేవతలను శ్రద్ధతో ఆరాధించే జనులచే వారు స్తుతించబడు చున్నారు. ఈ విధముగా పక్వము కానివి మరియు పక్వమైనవి అగు మూడు మాలిన్యములు మాత్రమే జీవులలోని విభేదములకు కారణములగుచున్నవి. జీవుల సంసారము అనే రోగము ఈ విధముగా ప్రవర్తిల్లుచున్నది.

**అస్య రోగస్య భైషజ్యం జ్ఞానమేవ న చాపరమ్ ।**
**భిషగాజ్ఞాపకశ్శంభుశ్శివః పరమకారణమ్ ॥**
**అదుఃఖేనాఽపి శక్తోఽసౌ పశూన్మోచయితుం శివః ।**
**కథం దుఃఖం కరోతీతి నాత్ర కార్యా విచారణా ॥**
**దుఃఖమేవ హి సర్వో ఽపి సంసార ఇతి నిశ్చితమ్ ।**
**కథం దుఃఖమదుఃఖం స్యాత్స్వభావో హ్యవిపర్యయః ॥**
**న హి రోగో హ్యరోగస్స్యాద్భిషగ్భైషజ్యకారణాత్ ।**
**రోగార్తం తు భిషగ్రోగాద్భైషజైస్సుఖముద్ధరేత్ ॥**
**ఏవం స్వభావమలినాన్ స్వభావాద్దుఃఖినః పశూన్ ।**
**స్వాజ్ఞౌషధవిధానేన దుఃఖాన్మోచయతే శివః ॥**
**న భిషక్కారణం రోగే శివస్సంసారకరణమ్ ।**
**ఇత్యేతదపి వైషమ్యం న దోషాయాస్య కల్పతే ॥**
**దుఃఖే స్వభావసంసిద్ధే కథం తత్కారణం శివః ।**
**స్వాభావికో మలః పుంసాం స హి సంసారయత్యమూన్ ॥**
**సంసారకారణం యత్తు మలం మాయాద్యచేతనమ్ ।**
**తత్స్వయం న ప్రవర్తేత శివసాన్నిధ్యమంతరా ॥**
**యథా మణిరయస్కాంతస్సాన్నిధ్యాదుపకారకః ।**
**అయసశ్చలతస్తద్వచ్ఛివో ఽప్యస్యేతి సూరయః ॥**
**న నివర్తయితుం శక్యం సాన్నిధ్యం సదకారణమ్ ।**
**అధిష్ఠాతా తతో నిత్యమజ్ఞాతో జగతశ్శివః ॥**

ఈ రోగమునకు జ్ఞానము ఒక్కటి మాత్రమే మందు; మరియొక మందు లేదు. ఆజ్ఞా తత్త్వముతో గూడినవాడై సర్వకారణకారణుడగు మంగళస్వరూపుడైన శంభుడే వైద్యుడు. ఈ శివుడు క్లేశము లేకుండగనే జీవులను విముక్తులను చేయుటకు సమర్థుడు. కాని, దుఃఖమునేల ఇచ్చుచున్నాడు? ఈ విషయములో విచారింప దగినది లేదు. ఈ సంసారమంతయు దుఃఖమే అను విషయము నిశ్చితము. అట్టి దుఃఖస్వభావము గల సంసారములో దుఃఖము లేకుండుట ఎట్లు సంభవము? స్వభావమును మార్చ శక్యము కాదు గదా! వైద్యుని చికిత్స కారణముగా రోగము రోగము కాకుండగా పోదు. వైద్యుడు రోగముతో బాధపడుచున్న వ్యక్తికి తన మందులతో సుఖమునిచ్చి ఉద్ధరించును. అదే విధముగా స్వభావము చేతనే మాలిన్యము గలవారు, స్వభావము చేతనే దుఃఖము గలవారు అగు జీవులను శివుడు తన ఆజ్ఞ అనే మందును విధించి దుఃఖమునుండి విముక్తిని కలిగించును, రోగమునకు వైద్యుడు కారణమగుట లేదు. కాని శివుడు సంసారమునకు కారణమగుచున్నాడు. పై దృష్టాంతములో ఈ తేడా ఉన్నది. కానీ, అది శివునకు దోషమును ఆరోపించుట లేదు. దుఃఖము స్వభావము చేతనే సిద్ధించుచుండగా, దానికి శివుడు కారణమెట్లగును? జీవులయందు స్వభావసిద్ధముగానున్న మాలిన్యము వారికి సంసారమును కలిగించుచున్నది. సంసారమునకు కారణమగు మాలిన్యము ఏది గలదో, అది మాయ మొదలగు జడతత్త్వము మాత్రమే. అది శివుని సన్నిధి లేనిదే స్వయముగా ప్రవర్తించ లేదు. అయస్కాంతమణి తన సన్నిధిచే ఇనుము కదలుటలో సహకరించును. అదే విధముగా, శివుని సన్నిధియే మాయ ప్రవర్తించుటకు కారణమగుచున్నదని పండితులు చెప్పుచున్నారు. సన్నిధియందు కారణత్వము లేదు. కావున, దానిని నివారించుట సంభవము కాదు. కావున, నిత్యము జగత్తునకు అధిష్ఠానమగు శివుడు తెలియబడుట లేదు.

**న శివేన వినా కించిత్ప్రవృత్తమిహ విద్యతే ।**
**తత్ప్రేరితమిదం సర్వం తథాపి న స ముహ్యతి ॥**
**శక్తిరాజ్ఞాత్మికా తస్య నియంత్రీ విశ్వతోముఖీ ।**
**తయా తతమిదం శశ్వత్తథాపి స న దుష్యతి ॥**
**అనిదం ప్రథమం సర్వమీశితవ్యం స ఈశ్వరః ।**
**ఈశనాచ్చ తదీయాజ్ఞా తథాపి స న దుష్యతి ॥**
**యో ఽన్యథా మన్యతే మోహాత్స వినశ్యతి దుర్మతిః ।**
**తచ్ఛక్తివైభవాదేవ తథాపి స న దుష్యతి ॥**
**ఏతస్మిన్నంతరే వ్యోమ్నః శ్రుతా వాగశరీరిణీ ।**
**సత్యమోమమృతం సౌమ్యమిత్యావిరభవత్ స్ఫుటమ్ ॥**
**తతో హృష్టతరాస్సర్వే వినష్టాశేష సంశయాః ।**
**మునయో విస్మయావిష్టాః ప్రణేముః పవనం ప్రభుమ్ ॥**
**తథా విగతసందేహాన్ కృత్వాపి పవనో మునీన్ ।**
**నైతే ప్రతిష్ఠితజ్ఞానా ఇతి మత్వైవ మబ్రవీత్ ॥**

పరోక్షమపరోక్షం చ ద్వివిధం జ్ఞానమిష్యతే ।
పరోక్షమస్థిరం ప్రాహురపరోక్షం తు సుస్థిరమ్ ॥
హేతూపదేశగమ్యం యత్తత్పరోక్షం ప్రచక్షతే ।
అపరోక్షం పునః శ్రేష్ఠాదనుష్ఠానాద్భవిష్యతి ॥
నాపరోక్షాదృతే మోక్ష ఇతి కృత్వా వినిశ్చయమ్ ।
శ్రేష్ఠానుష్ఠానసిద్ధ్యర్థం ప్రయతధ్వమతంద్రితాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే వాయుకృత
జ్ఞానోపదేశో నామ ఏకత్రింశోఽధ్యాయః ॥

ఈ లోకములో శివుడు లేకుండగా ప్రవర్తిల్లేది ఏదీ లేదు. ఈ సర్వము ఆయనచే ప్రేరేపించబడుచున్నది. అయినప్పటికీ, ఆయనకు మోహము లేదు. ఆయనయొక్క ఆజ్ఞా రూపములోనుండే శక్తి సమస్తరూపములను దాల్చి సర్వమును నియంత్రించును. ఆ శక్తియే ఈ సర్వమును పూర్ణముగా వ్యాపించి యున్నది. అయిననూ, ఆయనకు దోషము తగలదు. ఈ సర్వజగత్తు సృష్ట్యాదియందు ఈ రూపములో నుండెడిది కాదు. పాలించ దగిన ఈ జగత్తును పాలించుట చేతనే ఆయన ఈశ్వరుడైనాడు. ఈ సృష్టి ఆయన ఆజ్ఞమే. అయిననూ, ఆయనకు దోషము లేదు, ఎవడైతే అజ్ఞానముచే దీనికి భిన్నముగా భావించునో, అట్టి దుర్బుద్ధీ ఆ శక్తి యొక్క వైభవముచే మాత్రమే నాశమునకు గురి యగును. అయిననూ, శివునకు దోషము తగలదు. ఇది సత్యము; ఓమ్ (నేను అంగీకరించు చున్నాను) అనే మధురమైన మాట ఇంతలో ఆకాశమునుండి అశరీరవాణి రూపములో స్పష్టముగా చెవులకు వినవచ్చెను. అపుడు ఆ మునులందరు సకలసందేహములు తొలగుటచే చాల సంతోషించిన వారై, ఆశ్చర్యచకితులై వాయు ప్రభువునకు నమస్కరించిరి. ఆ విధముగా మునుల సందేహమును పోగొట్టిన తరువాత కూడా వాయుదేవుడు వీరియందు ఇంకనూ జ్ఞానము నిలదొక్కు కొనలేదనీ భావించి ఇట్లు పలికెను. పరో క్షము మరియు అపరోక్షము అని జ్ఞానము రెండు రకములుగా నున్నది. ఇంకనూ స్థిరము కాని జ్ఞానము పరోక్షమనియు, స్థిరపడిన జ్ఞానము అపరోక్షమనియు పెద్దలు చెప్పుచున్నారు. హేతువుల ఉపదేశముచే పొందబడే జ్ఞానము పరోక్షజ్ఞానమని చెప్పబడును. కాని, అది ఉత్కృష్టమగు అనుష్ఠానముచే అపరోక్షజ్ఞానమగును. అపరోక్షజ్ఞానము లేనిదే మోక్షము లేదు అని నిశ్చయించుకొని, ఉత్కృష్టమగు అనుష్టానము సిద్ధించుట కొరకై సోమరితనము లేకుండగా ప్రయత్నమును చేయుడు.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో వాయువు మహర్షులకు బోధించిన జ్ఞానమును వర్ణించే ముప్పది ఒకటవ అధ్యాయము ముగిసినది.

# 32 – పరమశైవ ధర్మములు

**ఋషయ ఊచుః ।**

**కిం తచ్ఛ్రేష్ఠమనుష్ఠానం మోక్ష యేనాపరోక్షితః ।**

**తత్తస్య సాధనం వాద్య వక్తుమర్హసి మారుత ॥**

ఋషులు ఇట్లు పలికిరి –

ఆ పరోక్షజ్ఞానరూపమగు మోక్షమును ఇచ్చే ఆ శ్రేష్ఠమగు అనుష్ఠానము ఏది? ఓ వాయుదేవా! దానిని గాని, దాని సాధనమును గాని ఇప్పుడు చెప్ప దగుదువు.

**వాయురువాచః**

**శైవో హి పరమో ధర్మః శ్రేష్ఠానుష్ఠానశబ్దితః ।**

**యత్రాపరోక్షో లక్ష్యేత సాక్షాన్మోక్షప్రదశ్శివః ॥**

**స తు పంచవిధో జ్ఞేయః పంచభిః పర్వభిః క్రమాత్ ।**

**క్రియాతపోజపధ్యానజ్ఞానాత్మభిరనుత్తరైః ॥**

**తైరేవ సోత్తరైస్సిద్ధో ధర్మస్తు పరమో మతః ।**

**పరోక్షమపరోక్షం చ జ్ఞానం యత్ర చ మోక్షదమ్ ॥**

**పరమోఽపరమశ్చోభౌ ధర్మౌ హి శ్రుతిచోదితౌ ।**

**ధర్మశబ్దాభిధేయేర్థే ప్రమాణం శ్రుతిరేవ నః ॥**

**పరమో యోగపర్యంతో ధర్మః శ్రుతిశిరో గతః ।**

**ధర్మస్త్వపరమస్తద్వదధః శ్రుతిముఖోత్థితః ॥**

**అపశ్వాత్మాధికారత్వాద్యో ధర్మః పరమో మతః ।**

**సాధారణస్తతోఽన్యస్తు సర్వేషామధికారతః ॥**

**స చాయమపరో ధర్మః పరధర్మస్య సాధనమ్ ।**

**ధర్మశాస్త్రాదిభిస్సమ్యక్ సాంగ ఏవోపబృంహితః ॥**

**శైవో యః పరమో ధర్మః శ్రేష్ఠానుష్ఠానశబ్దితః ।**

**ఇతిహాసపురాణాభ్యాం కథంచిదుపబృంహితః ॥**

**శైవాగమైస్తు సంపన్నస్సహాంగోపాంగవిస్తరః ।**

**తత్సంస్కారాధికారైశ్చ సమ్యగేవోపబృంహితః ॥**

**శైవాగమో హి ద్వివిధః శ్రౌతోఽ శ్రౌతశ్చ సంస్కృతః ।**

**శ్రుతిసారమయః శ్రౌతస్స్వతంత్ర ఇతరో మతః ॥**

వాయువు ఇట్లు పలికెను –

శ్రేష్ఠమగు అనుష్ఠానము అని బోధించబడిన పరమధర్మము శైవధర్మమే. దాని యందు సాధకుడు మోక్షమునిచ్చే శివుని సాక్షాత్తుగా అపరోక్షజ్ఞానరూపముగా దర్శించును, దానియందు క్రియ, తపస్సు, జపము, ధ్యానము మరియు జ్ఞానము అనే సర్వోత్కృష్టములగు అయిదు ప్రకారములు

గలవని తెలియవలెను. వాటిలో ముందున్న దానికంటే తరువాతిది శ్రేష్ఠమైనది. వాటి వలన సిద్ధించే ధర్మము శ్రేష్ఠమైనది. వీటిని అనుష్ఠించుట వలన పరోక్షజ్ఞానము అపరోక్షమై మోక్షమునిచ్చును. పర (సర్వోత్కృష్టమైన) ధర్మము, అపర (రెండవ స్థాయికి చెందిన) ధర్మము అని రెండు విధములుగా ధర్మమును వేదము విధించుచున్నది. ధర్మము అనే శబ్దముచే చెప్పబడే వస్తువు విషయములో మనకు ప్రమాణము వేదము మాత్రమే, యోగము వరకు గల ధర్మము పరధర్మము. దీనిని ఉపనిషత్తులు వర్ణించుచున్నవి. దాని క్రింది స్థాయికి చెందిన అపరధర్మమును వేదములోని ఆదిమకాండ బోధించుచున్నది. పరధర్మమునందు అజ్ఞానులగు జీవులకు అధికారము లేదు. అందువలననే, అది పరధర్మమని చెప్పబడినది. దానికంటే భిన్నమైన అపరధర్మమునందు సాధారణముగా అందరికీ అధికారము గలదు. అపరధర్మము పరధర్మమునకు సాధనమగును ఈ పరధర్మమును, దానిని పొందే సాధనమును వాటి అంగములతో సహా ధర్మశాస్త్రము మొదలైనవి విస్తారముగా నిరూపించి యున్నవి, శ్రేష్ఠమగు అనుష్ఠానము అని వర్ణించబడిన సర్వోత్కృష్టమగు ఏ శైవధర్మము గలదో, దానిని ఇతిహాసములు మరియు పురాణములు చాల కష్టపడి విస్తారముగా నిరూపించినవి. అంగములు, ఉపాంగములు, సంస్కారములు మరియు అధికారము అను వాటితో కూడియున్న సుసంపన్నమగు ఆ ధర్మమును శైవాగమములు చాల చక్కగనే విస్తారముగా నిరూపించి యున్నవి. శైవాగమములు శ్రౌతము మరియు అశ్రౌతము అని రెండు విధములుగా నున్నవి. వేదముల సారముతో గూడియున్నది శ్రౌతము. స్వతంత్రము మరియు సంస్కారములతో కూడినది అగు రెండవది అశ్రౌతము.

స్వతంత్రో దశధా పూర్వం తథాష్టాదశధా పునః ।
కామికాదిసమాఖ్యాభిస్సిద్ధస్సిద్ధాంతసంజ్ఞితః ॥
శ్రుతిసారమయో యస్తు శతకోటి ప్రవిస్తరః ।
పరం పాశుపతం యత్ర వ్రతం జ్ఞానం చ కథ్యతే ॥
యుగావర్తేషు శిష్యేత యోగాచార్య స్వరూపిణా ।
తత్ర తత్రావతీర్ణేన శివేనైవ ప్రవర్తతే ॥
సంక్షిప్యాస్య ప్రవక్తారశ్చత్వారః పరమర్షయః ।
రురుర్దధీచోఽ గస్త్యశ్చ ఉపమన్యు ర్మహాయశాః ॥
తే చ పాశుపతా జ్ఞేయాస్సంహితానాం ప్రవర్తకాః ।
తత్సంతతీయా గురవశ్శతశోఽథ సహస్రశః ॥
తత్రోక్తః పరమో ధర్మశ్చర్యా ద్యాత్మా చతుర్విధః ।
తేషు పాశుపతో యోగశ్శివం ప్రత్యక్షయేద్దృఢమ్ ॥
తస్మాచ్ఛ్రేష్ఠమనుష్ఠానం యోగః పాశుపతో మతః ।
తత్రాప్యుపాయో యః ప్రోక్తో బ్రహ్మణా స తు కథ్యతే ॥
నామాష్టకమయో యోగశ్శివేన పరికల్పితః ।
తేన యోగేన సహసా శైవీ ప్రజ్ఞా ప్రజాయతే ॥

ప్రజ్ఞయా పరమం జ్ఞానమచిరాల్లభతే స్థిరమ్ ।
ప్రసీదతి శివస్తస్య యస్య జ్ఞానం ప్రతిష్ఠితమ్ ॥
ప్రసాదాత్పరమో యోగో యశ్శివం చాపరోక్షయేత్ ।
శివాపరోక్షాత్సంసారకరణేన వియుజ్యతే ॥

స్వతంత్రమగు శైవధర్మము ముందుగా పది రూపములుగను, తరువాత పద్దెనిమిది రూపములుగను ఉన్నది. కామికా మొదలగు పేర్లతో లభించే ఆ శాస్త్రమునకు సిద్ధాంతము అని పేరు వేదముల సారముతో నిండి యున్న శైవ ధర్మము వంద కోట్ల శ్లోకములలో విస్తారముగా నిరూపించ బడియున్నది. దానియందు సర్వోత్కృష్టమగు పాశుపత వ్రతము మరియు జ్ఞానము చెప్పబడును. నాలుగు యుగముల కాలచక్రము తిరుగుచుండగా ఆయా సమయములలో యోగాచార్యరూపములో శివుడే అవతరించి దానిని జనులకు నేర్పుచున్నాడు. దీనిని సంక్షేపించి బోధించిన ఋషులు నలుగురు గలరు. గురువు, దధీచుడు, అగస్త్యుడు మరియు ఉపమన్యుడు అనునవి వారి పేర్లు. ఉపమన్యునకు గొప్ప కీర్తి గలదు. సంహితలను ప్రవర్తిల్ల జేసిన ఆ ఋషులు పాశుపతులని తెలియవలెను. వారి సంతతికి చెందిన గురువులు వందల వేల సంఖ్యలో గలరు. ఆ సంహితలలో చర్య మొదలగు రూపములలో నున్న నాలుగు రకముల (చర్య, విద్య, క్రియా, యోగము) పరమధర్మము చెప్పబడినది. వాటిలోని పాశుపతయోగము శివుని దృఢముగా సాక్షాత్కరింప జేయును. కావున, శ్రేష్ఠమగు అనుష్ఠానమనగా పాశుపతయోగమే. ఆ ధర్మము విషయములో బ్రహ్మచే చెప్పబడిన ఉపాయము చెప్పబడుచున్నది. శివుడు నామాష్టకమయము (ఎనిమిదినామములతో గూడియున్నది) అనే యోగమును నిర్మించినాడు. ఆ యోగము వలన వెంటనే శివునకు సంబంధించిన ప్రజ్ఞ కలుగును. ఆ ప్రజ్ఞచే సాధకుడు తొందరలో స్థిరమగు పరమజ్ఞానమును పొందును. ఆ జ్ఞానమునందు స్థిరముగ నున్నవారియందు శివుడు ప్రసన్నుడగును. శివుని అనుగ్రహము వలన వానికి పరమయోగము సిద్ధించును. దాని వలన ఆతడు శివుని సాక్షాత్కరించు కొనును. శివుని సాక్షాత్కారము వలన సంసారకారణమగు అజ్ఞానము ఆతనికి తొలగి పోవును.

తతస్స్యాన్ముక్తసంసారో ముక్తశ్శివసమో భవేత్ ।
బ్రహ్మ ప్రోక్త ఇత్యుపాయస్స ఏవ పృథగుచ్యతే ॥
శివో మహేశ్వరశ్చైవ రుద్రో విష్ణుః పితామహః ।
సంసారవైద్యస్సర్వజ్ఞః పరమాత్మేతి ముఖ్య తః ॥
నామాష్టకమిదం ముఖ్యం శివస్య ప్రతిపాదకమ్ ।
ఆద్యం తు పంచకం జ్ఞేయం శాంత్యతీతాద్యను క్రమాత్ ॥
సంజ్ఞా సదాశివాదీనాం పంచోపాధిపరిగ్రహాత్ ।
ఉపాధివినివృత్తౌ తు యథాస్వం వినివర్తతే ॥
పదమేవ హి తన్నిత్యమనిత్యాః పదినస్స్మృతాః ।
పదానాం ప్రతివృత్తౌ తు ముచ్యంతే పదినో యతః ॥

పరివృత్త్యంతరే భూయస్తత్పద ప్రాప్తిరుచ్యతే ।
ఆత్మాంతరాభిధానం స్యాద్యదాద్యం నామపంచకమ్ ॥
అన్యత్తు త్రితయం నామ్నాముపాదానాదియోగతః ।
త్రివిధోపాధివచనాచ్ఛివ ఏవానువర్తతే ॥
అనాదిమలసంశ్లేషః ప్రాగభావాత్స్వభావతః ।
అత్యంతం పరిశుద్ధాత్మేత్యతోఽయం శివ ఉచ్యతే ॥
అథవాశేషకల్యాణగుణైకఘన ఈశ్వరః ।
శివ ఇత్యుచ్యతే సద్భిశ్శివతత్త్వార్థవాదిభిః ॥
త్రయోవింశతితత్త్వేభ్యః ప్రకృతిర్హి పరా మతా ।
ప్రకృతేస్తు పరం ప్రాహుః పురుషం పంచవింశకమ్ ॥

తరువాత సంసారమునుండి విముక్తిని పొందిన ఆ ముక్తుడు శివునితో సముడగును. బ్రహ్మ చెప్పిన ఉపాయము ఇదియే. దీనిని మరల వేరుగా చెప్పుచున్నాను, శివుడు, మహేశ్వరుడు, రుద్రుడు, విష్ణువు, పితామహుడు, సంసారవైద్యుడు, సర్వజ్ఞుడు మరియు పరమాత్మ అనునవి ముఖ్యములైన పేర్లు, ఈ ఎనిమిది నామములు ప్రధానముగా శివుని ప్రతిపాదించు చున్నవి. శాంత్యతీత మొదలగు కళల క్రమములో శివుడు సదాశివుడు మొదలగు అయిదు ఉపాధులను స్వీకరించి యున్నాడు. ఆ ఉపాధులు ఉపసంహరింప బడగానే ఆయన తన స్వరూపము లోనికి మరలి వెళ్లును. పైన చెప్పిన వాటిలో మొదటి అయిదు నామములు ఆ ఉపాధులను నిర్దేశించును. ఆ ఆధికారికపదములు మాత్రమే నిత్యము. ఆ పదములయందుండే ఆధికారిక పురుషులు నిత్యులు కాదు. ఏలయనగా, కాలచక్రములో ఆ పదములు తిరుగుచున్నప్పుడు ఆయా ఆధికారిక పురుషులకు మోక్షము కలుగును. కాలచక్రము తిరిగి ఇంకో మహాయుగము ఆరంభమైనప్పుడు మరల ఆ పదములు ఇతరములగు ఆత్మలకు లభించును. మొదటి అయిదు పేర్లు ఆ ఆత్మలను నిర్దేశించును. ఉపాదానము (జగత్కారణము) మొదలగు వాటితో శివునకు గల సంబంధమును బట్టి ఆయనకు మూడు రకముల ఉపాధులు గలవు. ఆ ఉపాధులను నిర్దేశించే మిగిలిన మూడు నామములు శివునియందు మాత్రమే అనువర్తించు చున్నవి. అనాదియగు అజ్ఞానముతో సంపర్కము శివునియందు గడచిన ఏ కాలమునందైననూ లేదు. ఆయన స్వభావస్వరూపములచే అత్యంతపరిశుద్ధుడు. కావుననే, ఆయనకు శివుడని పేరు. లేదా, ఆ ఈశ్వరుడు సమస్తకల్యాణగుణములు ఘనీభవించిన మూర్తియగుటచే, శివతత్త్వముయొక్క సారమునెరింగిన సత్పురుషులు ఆయనను శివుడు అని పిలుచుచున్నారు, ఇరువది మూడు తత్త్వములకు అతీతముగా ప్రకృతి ఉండగా, ఇరువది అయిదవ తత్త్వమగు పురుషుడు ప్రకృతికంటే కూడా అతీతుడని పెద్దలు చెప్పుచున్నారు.

యం వేదాదౌ స్వరం ప్రాహురాచ్యవాచకభావతః ।
వేదైకవేద్యయాథాత్మ్యాద్వేదాంతే చ ప్రతిష్ఠితః ॥
తస్య ప్రకృతిలీనస్య యః పరస్స మహేశ్వరః ।
తదధీన ప్రవృత్తిత్వాత్ప్రకృతేః పురుషస్య చ ॥
అథవా త్రిగుణం తత్త్వముపేయమిదమవ్యయమ్ ।
మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్ ॥
మాయావిక్షోభకోఽనంతో మహేశ్వరసమన్వయాత్ ।
కాలాత్మా పరమాత్మాదిః స్థూలస్సూక్ష్మః ప్రకీర్తితః ॥
రుద్దుఃఖం దుఃఖ హేతుర్వా తద్ద్రావయతి నః ప్రభుః ।
రుద్ర ఇత్యుచ్యతే సద్భిశ్శివః పరమకారణమ్ ॥
తత్త్వాదిభూతపర్యంతం శరీరాదిష్వతంద్రితః ।
వ్యాప్యాధితిష్ఠతి శివస్తతో రుద్ర ఇతస్తతః ॥
జగతః పితృభూతానాం శివో మూర్త్యాత్మనామపి ।
పితృభావేన సర్వేషాం పితామహ ఉదీరితః ॥
నిదానజ్ఞో యథా వైద్యో రోగస్య వినివర్తకః ।
ఉపాయైర్భేషజైస్తద్వల్లయభోగాధికారతః ॥
సంసారస్యేశ్వరో నిత్యం సమూలస్య నివర్తకః ।
సంసారవైద్య ఇత్యుక్తస్సర్వతత్త్వార్థవేదిభిః ॥

ఆ శివుని యథార్థతత్త్వమును వేదము ద్వారా మాత్రమే తెలియదగును. వేదమునకు ఆదిలో చెప్పబడే ఓంకారము అనే శబ్దము ఆ శివుని నిర్దేశించును. అనగా, ఆ శబ్దమునకు శివునితో వాచ్య (నిర్దేశించ బడువాడు) - వాచక (నిర్దేశించే పదము) సంబంధము గలదు. ఆ శివుడు వేదాంతములయందు ప్రతిష్ఠితుడై యున్నాడు; అనగా ఉపనిషత్తులు శివుని దృఢముగా ప్రతిపాదించు చున్నవి. ఆ ఓంకారము ప్రకృతిలో లీనమగును. ప్రకృతి మరియు పురుషుడు ఆ శివునకు వశవర్తులై ప్రవర్తించు చున్నారు. కావున, ఆ పరమేశ్వరుడు ప్రకృతికి కూడ అతీతుడు, లేదా, ఈ జగత్తు వినాశము లేని సత్త్వరజస్తమోగుణాత్మకమగు ప్రకృతియొక్క పరిణామమే. ఆ ప్రకృతి మిథ్యారూపమగుటచే మాయ అనబడును. మహేశ్వరుడు మాయను వశము చేసుకున్నవాడని తెలియవలెను, మహేశ్వరునితో సంబంధమును కలిగియున్న అనంతుడు (విష్ణువు) ఈ మాయాశక్తియందు క్షోభ (జగత్తు ఉదయించుటకు హేతువు అగు కదలిక) ను కలిగించును. ఆయనకే కాలాత్మ (కాలస్వరూపుడు), పరమాత్మ (పరమార్థమగు చైతన్యమే స్వరూపముగా గలవాడు), ఆది (కారణస్వరూపుడు), స్థూలుడు (జగద్రూపముగా వ్యక్తమైనవాడు), సూక్ష్ముడు (జగత్తునకు కారణమైనవాడు) అని పేర్లు, రుత్ అనగా దుఃఖము; లేదా దుఃఖహేతువు. మనకు వాటిని లేకుండా ఆ ప్రభుడు తరిమి కొట్టుటచే సర్వకారణకారణుడగు ఆ శివుని సత్పురుషులు రుద్రుడని పిలుచు చున్నారు. కళ, కాలము మొదలగు తత్త్వములతో మొదలిడి ఈ పంచభూతముల వరకు మరియు ప్రాణుల శరీరము మొదలగు వాటియందు దేనినీ విడువకుండగా అధిష్ఠాన

రూపముగా శక్తి రూపములో వ్యాపించి యుండుటచే శివునకు రుద్రుడని పేరు వచ్చినది. సదాశివుడు మొదలగు మూర్తిస్వరూపములు జగత్తునకు తండ్రులగుచుండగా, వారందరికీ శివుడు తండ్రి యగుటచే, ఆయనకు పితామహుడనీ పేరు. రోగమును ఖచ్చితముగా గుర్తించిన వైద్యుడు మందులు అనే ఉపాయములతో దానిని పోగొట్టును. అదే విధముగా, ఈశ్వరుడు లయము మరియు భోగము అనే అధికారమును బట్టి సర్వదా సంసారమును మూలకారణమగు అజ్ఞానముతో సహా తొలగించుచున్నాడు. కావుననే, సకలతత్త్వముల సారమునెరింగిన పండితులు ఆయనకు సంసారవైద్యుడని పేరు పెట్టినారు.

దశార్థజ్ఞానసిద్ధ్యర్థమింద్రియేష్వేషు సత్స్వపి ।
త్రికాలభావినో భావాన్ స్థూలాన్ సూక్ష్మానశేషతః ॥
అణవో నైవ జానంతి మాయయైవ మలావృతాః ।
అసత్స్వపి చ సర్వేషు సర్వార్థజ్ఞానహేతుషు ॥
యద్యథావస్థితం వస్తు తత్తథైవ సదాశివః ।
అయత్నేనైవ జానాతి తస్మాత్సర్వజ్ఞ ఉచ్యతే ॥
సర్వాత్మా పరమైరేభిర్గుణైర్నిత్య సమన్వయాత్ ।
స్వస్మాత్పరాత్మవిరహాత్పరమాత్మా శివస్స్వయమ్ ॥
నామాష్టకమిదం చైవ లబ్ధ్వాచార్య ప్రసాదతః ।
నివృత్త్యాదికలాగ్రంథిం శివాద్యైః పంచనామభిః ॥
యథాస్వం క్రమశశ్ఛిత్త్వా శోధయిత్వా యథాగుణమ్ ।
గుణితైరేవ సోద్ఘాతైరనిరుద్ధైరథాపి వా ॥
హృత్కంఠతాలుభ్రూమధ్య బ్రహ్మరంధ్రసమన్వితామ్ ।
ఛిత్త్వా పుర్యష్టకాకారం స్వాత్మానం చ సుషుమ్నయా ॥
ద్వాదశాంతః స్థితస్యేందోర్నీత్వోపరి శివౌజసి ।
సంహృత్య వదనం పశ్చాద్యథా సంస్కరణం లయాత్ ॥
శాక్తేనామృతవర్షేణ సంసిక్తాయాం తనౌ పునః ।
అవతార్య స్వమాత్మానమమృతాత్మాకృతిం హృది ॥
ద్వాదశాంతః స్థితస్యేందోః పరస్తాచ్ఛ్వేతపంకజే ।
సమాసీనం మహాదేవం శంకరం భక్తవత్సలమ్ ॥
అర్ధనారీశ్వరం దేవం నిర్మలం మధురాకృతిమ్ ।
శుద్ధస్ఫటికసంకాశం ప్రసన్నం శీతలద్యుతిమ్ ॥
ధ్యాత్వా హి మానసే దేవం స్వస్థచిత్తోఽథ మానవః ।
శివనామాష్టకేనైవ భావపుష్పైస్సమర్చయేత్ ॥

పది విషయముల జ్ఞానము కొరకై ఈ ఇంద్రియములు (అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు) ఉన్ననూ, అల్పులగు జీవులు అవిద్యా దోషముచే కప్పివేయబడిన వారు గనుక, మూడు కాలములలో ఉండే స్థూలములు మరియు సూక్ష్మములు అగు పదార్థములను పూర్ణముగా తెలుసుకొనజాలరనుటలో సందేహము లేదు. కాని, సకల పదార్థముల జ్ఞానమునకు హేతువులగు ఇంద్రియములు ఏమియూ లేకున్ననూ, ఏ వస్తువు ఏ విధముగా నున్నదో, దానిని అదే విధముగా ఖచ్చితముగా ప్రయత్నము లేకుండగనే సదాశివుడు తెలియగలుచున్నాడు. కావుననే, ఆయన సర్వజ్ఞుడన బడుచున్నాడు. సర్వుల ఆత్మ శివుడే. ఆయనయందు ఈ శ్రేష్ఠగుణములు నిత్యము నివసించి యుండును. ఆయన కంటే భిన్నముగా మరియొక ఆత్మ లేదు. కావుననే, ఆయనకు స్వయముగా పరమాత్మ అని పేరు. ఈ ఎనిమిది నామములు ఆచార్యుని అనుగ్రహము వలన పొంది శివుడు మొదలైన అయిదు నామములతో నివృత్తి మొదలగు కళలు అనే గ్రంథులను (సంసారకారణమగు అజ్ఞానధారణలను) క్రమముగా ఛేదించి, వాటిని గుణములకు మరియు స్వరూపమునకు అనురూపముగా శోధించి (యథాతథముగా తెలుసుకొని), ఉద్ఘాతము (పైకి వేగముగా త్రోయుట) తో కూడినవి లేదా నిరుద్ధములు (గాలిని నిలిపి ఉంచుట) కానివి అగు గుణితములైన (మరల మరల చేయబడిన) ఉచ్ఛ్వాసనిశ్వాసములతో (ఇది ప్రాణాయమము,) హృదయము, కంఠము, తాలువు, కనుబొమల మధ్య భాగము మరియ బ్రహ్మరంధ్రములతో కూడిన పుర్యష్టకము (ఎనిమిది చక్రములతో కూడియున్న దేహము) ను భేదించి, తన ఆత్మను సుషుమ్నానాడీ మార్గము గుండా పన్నెండు దళముల హృదయపద్మమునందలి దహరాకాశమునకు, ఆజ్ఞాచక్రమునందలి చంద్రునకు పైన ఉండే శివతేజస్సు లోనికి తీసుకొని వెళ్లవలెను. తరువాత శాస్త్రీయమైన సంస్కారములను అతిక్రమించకుండగా ముఖవ్యాపారములను (మాటలాడుట మరియు భుజించుట) ఆపివేయవలెను. ఈ విధమగు లయము వలన కలిగిన శక్తిస్వరూపమగు అమృతముయొక్క వర్షముచే శరీరము పలుమార్లు చక్కగా తడుపబడును. తరువాత సాధకుడు అమృతమగు ఆత్మయొక్క ఆకారముతో కూడియున్న తన ఆత్మను క్రింద హృదయములోనికి తీసుకు రావలెను. పన్నెండు దళముల హృదయపద్మములో నున్న (?) చంద్రునకు పైన తెల్లని పద్మమునందు కూర్చున్నవాడు, దేవతలలో శ్రేష్ఠుడు, భక్తులపై ప్రేమ గలవాడు, శరీరములో సగభాము స్త్రీ రూపము గల ఈశ్వరుడు, దోషరహితుడు, మధురమగు ఆకారము గలవాడు, స్వచ్ఛమగు స్ఫటికమువలె ప్రకాశించువాడు, ప్రసన్నుడు, చల్లని కాంతులు గలవాడు అగు శంకర దేవుని మనస్సులో ధ్యానించవలెను. తరువాత ఆ సాధకుడు స్వస్థమగు మనస్సు గలవాడై శివుని ఎనిమిది నామములను స్మరిస్తూ ఆ దేవుని భావాత్మకమగు పుష్పములతో చక్కగా పూజించవలెను.

**అభ్యర్చనాంతే తు పునః ప్రాణానాయమ్య మానవః ।**

**సమ్యక్కృత్తం సమాధాయ శార్వం నామాష్టకం జపేత్ ॥**

**నా భౌ చాష్టాహుతీర్హుత్వా పూర్ణాహుత్యా నమస్తతః ।**

**అష్టపుష్ప ప్రదానేన కృత్వాభ్యర్చన మంతిమమ్ ॥**

**నివేదయేత్స్వమాత్మానం చులుకో దకవర్త్మనా ।**

**ఏవం కృత్వా చిరాదేవ జ్ఞానం పాశుపతం శుభమ్ ॥**

**లభతే తత్ప్రతిష్ఠాం చ వృత్తం చానుత్తమం తథా ।**

**యోగం చ పరమం లబ్ధ్వా ముచ్యతే నాత్ర సంశయః ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే పరమశైవధర్మ వర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥**

ఈ విధమగు మానసికపూజ చక్కగా పూర్తి అయిన తరువాత ఆ సాధకుడు మరల ప్రా◌ాణాయామమును చేసి మనస్సును చక్కగా ఏకాగ్రము చేసి, శివుని ఎనిమిది నామములను జపించవలేను. నాభిదేశము (మణిపూరము) నందు ఎనిమిది ఆహుతులను (మానసికముగా) హోమము చేసి, పూర్ణాహుతిని చేసి, నమస్కరించి, తరువాత ఎనిమిది పుష్పములతో (మానసికముగా) ఆఖరి పూజను చేసి, అరచేతిలో నీళ్లను తీసుకొని విడిచి పెడుతూ తన ఆత్మను నివేదించ వలెను. ఈ విధముగా చిరకాలము చేసిన సాధకుడు శుభకరమగు పాశుపతజ్ఞానమును పొందును. ఇంతేగాక, ఆ జ్ఞానము స్థిరపడును. ఆతడు సర్వోత్కృష్టమగు శీలమును మరియు శ్రేష్ఠమగు యోగమును పొంది ముక్తుడగును. దీనిలో సందేహము లేదు.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో పరమ శైవధర్మములను వర్ణించే ముప్పది రెండవ అధ్యాయము ముగిసినది.

# 33 – పాశుపత వ్రత విధానము

**ఋషయ ఊచుః ।**

**భగవన్ శ్రోతుమిచ్ఛామో వ్రతం పాశుపతం పరమ్ ।**
**బ్రహ్మాదయోఽపి యత్కృత్వా సర్వే పాశుపతాస్స్మృతాః ॥**

ఋషులు ఇట్లు పలికిరి –

ఓ పూజ్యా! బ్రహ్మ మొదలగు వారుకూడ దేనిని చేసి పాశుపతులైనారని చెప్పబడినదో, అట్టి శ్రేష్ఠమగు పాశుపతవ్రతమును గురించి వినగోరు చున్నాము.

**వాయురువాచః**

**రహస్యం వః ప్రవక్ష్యామి సర్వపాపనికృంతనమ్ ।**
**వ్రతం పాశుపతం శ్రౌతమథర్వశిరసి శ్రుతమ్ ॥**
**కాలశ్చైత్రీ పౌర్ణమాసీ దేశశ్శివ పరిగ్రహః ।**
**క్షేత్రారామాద్యరణ్యం వా ప్రశస్తశ్శుభ లక్షణః ॥**
**తత్ర పూర్వ త్రయోదశ్యాం సుస్నాతస్సు కృతాహ్నికః ।**
**అనుజ్ఞాప్య స్వమాచార్యం సంపూజ్య ప్రణిపత్య చ ॥**
**పూజాం వైశేషికీం కృత్వా శుక్లాంబరధరస్స్వయమ్ ।**
**శుక్లయజ్ఞోపవీతీ చ శుక్లమాల్యానులేపనః ॥**
**దర్భాసనే సమాసీనో దర్భముష్టిం ప్రగృహ్య చ ।**
**ప్రాణాయామత్రయం కృత్వా ప్రాఙ్ముఖో వాప్యుదఙ్ముఖః ।**
**ధ్యాత్వా దేవం చ దేవీం చ తద్విజ్ఞాపనవర్త్మనా ॥**
**వ్రతమేతత్కరోమీతి భవేత్సంకల్ప్య దీక్షితః ।**
**యావచ్ఛరీరపాతం వా ద్వాదశాబ్దమథాపి వా ॥**
**తదర్ధం వా తదర్ధం వా మాసద్వాదశకం తు వా ।**
**తదర్ధం వా తదర్ధం వా మాసమేకమథాపి వా ॥**
**దినద్వాదశకం వాఽథ దినషట్కమథాపి వా ।**
**తదర్ధం దినమేకం వా వ్రతసంకల్పనావధి ॥**
**అగ్నిమాధాయ విధివద్విరజాహోమ కారణాత్ ।**
**హుత్వాజ్యేన సమిద్భిశ్చ చరుణా చ యథాక్రమమ్ ॥**
**పూర్ణమాపూర్య తాం భూయస్తత్త్వానాం శుద్ధిముద్దిశన్ ।**
**జుహుయాన్మూలమంత్రేణ తైరేవ సమిదాదిభిః ॥**

రహస్యమైనది, పాపములనన్నింటినీ పోగొట్టునది, అథర్వవేదమునకు చెందిన ఉపనిషత్తునందు చెప్పబడినది అగు పాశుపతము అనే శ్రౌతవ్రతమును మీకు చెప్పెదను. చైత్రమాసపూర్ణిమ దీనికి కాలము. శివుని అనుగ్రహించ బడిన స్థానమే దీనికి దేశము. లేదా, శుభకరమగు లక్షణములు గల క్షేత్రము, ఆరామము మొదలైనవి వాటిలో గాని, అరణ్యములో గాని చేయవచ్చును. అచట మొదటి

త్రయోదశి నాడు చక్కగా స్నానమును చేసి, నిత్య కర్మలను చక్కగా చేసుకొని, తన ఆచార్యుని చక్కగా పూజించి, ఆయనకు నమస్కరించి, అనుమతిని తీసుకొని, విశేషపూజను చేసి, తాను స్వయముగా తెల్లని వస్త్రములను, తెల్లని యజ్ఞోపవీతమును, తెల్లని పుష్పమాలను మరియు జెల్లని అనులేపనము (శరీరముపై పూసుకొనే ద్రవ్యము) ను ధరించి, దర్భాసనమునందు చక్కగా కూర్చుండి, గుప్పెటలో దర్భలను పట్టుకొని, మూడుసార్లు ప్రాణాయామమును చేసి, తూర్పునకు గాని ఉత్తరమునకు గాని అభిముఖముగా కూర్చుండి, పార్వతీ పరమేశ్వరులను ధ్యానించి, శివుడు బోధించిన విధముగా ఈ వ్రతమును చేయుచున్నాను అని సంకల్పమును చెప్పి, దీక్షను స్వీకరించ వలెను. బ్రతికి ఉన్నంత కాలము, లేదా పన్నెండు సంవత్సరములు, లేదా ఆరు, లేదా మూడు సంవత్సరములు, లేదా ఒక సంవత్సరము, లేదా ఆరు, లేదా మూడు మాసములు, లేదో ఒక మాసము (8), లేదా పన్నెండు రోజులు, లేదా మూడు రోజులు, లేదా ఒక రోజు ఈ వ్రతమునకు అవధి. ఆ విధముగా సంకల్పించి, విరజాహోమమమును చేయుట కొరకై యథావిధిగా అగ్నిని ఆధానము చేసి, క్రమమును తప్పకుండగా నేతితో, సమిధలతో మరియు వండిన అన్నముతో హోమమును చేసి, మరల పూర్ణాహుతిని చేసి, తత్త్వముల శుద్ధి కొరకై మూలమంత్రముతో ఆ సమిధలు మొదలగు ద్రవ్యములనే హోమము చేయవలెను.

తత్త్వాన్యేతాని మద్దేహే శుద్ధ్యంతామిత్యనుస్మరన్ ।
పంచ భూతాని తన్మాత్రాః పంచ కర్మేంద్రియాణి చ ॥
జ్ఞానకర్మవిభేదేన పంచకర్మవిభాగశః ।
త్వగాదిధాతవస్సప్త పంచ ప్రాణా దివాయవః ॥
మనో బుద్ధిరహంఖ్యాతిర్గుణాః ప్రకృతిపూరుషౌ ।
రాగో విద్యాకలే చైవ నియతిః కాల ఏవ చ ॥
మాయా చ శుద్ధవిద్యా చ మహేశ్వరసదాశివౌ ।
శక్తిశ్చ శివతత్త్వం చ తత్త్వాని క్రమశో విదుః ॥
మంత్రైస్తు విరజైర్హుత్వా హో తాసా విరజా భవేత్ ।
శివానుగ్రహమాసాద్య జ్ఞానవాన్ స హి జాయతే ॥
అథ గోమయమాదాయ పిండీకృత్యాభిమంత్ర్య చ ।
విన్యస్యాగ్నౌ చ సంప్రోక్ష్య దినే తస్మిన్ హవిష్య భుక్ ॥
ప్రభాతే తు చతుర్దశ్యాం కృత్వా సర్వం పురోదితమ్ ।
దినే తస్మిన్నిరాహారః కాలం శేషం సమాపయేత్ ॥
ప్రాతః పర్వణి చాప్యేవం కృత్వా హోమావసానతః ।
ఉపసంహృత్య రుద్రాగ్నిం గృహ్ణీయాద్భస్మ యత్నతః ॥
తతశ్చ జటిలో ముండీ శిఖైకజట ఏవ వా ।
భూత్వా స్నాత్వా తతో వీతలజ్జశ్చేత్స్యాద్ది గంబరః ॥
అపి కాషాయవసనశ్చర్మచీరాంబరోఽథ వా ।
ఏకాంబరో వల్కలీ వా భవేద్దండీ చ మేఖలీ ॥

నా దేహమునందు ఈ తత్త్వములు శుద్ధమగును గాక! అని స్మరిస్తూ హోమమును చేయవలెను. అయిదు భూతములు, వాటి తన్మాత్రలు (సూక్ష్మభూతములు), అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు, చర్మము మొదలగు ఏడు ధాతువులు, ప్రాణము మొదలగు అయిదు వాయువులు, మనస్సు, బుద్ధి, అహంకారము, మూడు గుణములు, ప్రకృతి, పురుషుడు, రాగము, విద్య, కళ నియతి, కాలము, మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు, శక్తి, శివుడు అనునవి క్రమముగా తత్త్వములని చెప్పబడినవి. ఈ హోమమును చేయు వ్యక్తి విరజామంత్రములతో హోమమును చేసి దోషములు లేనివాడు అగును. ఆతడు శివుని అనుగ్రహమును పొంది జ్ఞాని యగును. తరువాత ఆతడు గోమయమును తీసుకొని, పిండముగా చేసి, అభిమంత్రించి, అగ్నిలో నుంచి, సంప్రోక్షించ వలేను. ఆతడు ఆ నాడు హవిస్సును మాత్రమే భుజించ వలెను. మరునాడు చతుర్దశి నాడు ఉదయము పైన చెప్పబడిన కర్మను అంతనూ చేసి, ఆ రోజు మిగిలిన కాలమును నిరాహారముగా గడుప వలెను. పూర్ణిమ నాడు ఉదయము కూడ ఇదే విధముగా చేసి, హోమము పూర్తి అయిన పిదప రుద్రాగ్నిని ఉపసంహరించి, శ్రద్ధతో భస్మను సంగ్రహించ వలెను. తరువాత జటలను ధరించవలెను; లేదా, ముండనము చేయించు కొనవలెను; లేదా, ఒక జటను పిలకగా నుంచు కొనవలెను. ఆతడు తరువాత స్నానమును చేసి, సిగ్గును విడిచిన వాడైనచో దిగంబరుడుగా నుండవలెను. లేదా, కాషాయవస్త్రములను గాని, చర్మమును గాని, నారబట్టలను గాని ధరించవలెను. ఆతడు ఒకే ఒక వస్త్రమును గాని, లేదా చెట్టు బెరడును గాని ధరించి, మేఖల (నడుము చుట్టూ త్రాడు) ను కట్టుకొని, దండమును పట్టుకొన వలెను.

**ప్రక్షాల్య చరణౌ పశ్చాద్ద్విరాచమ్యాత్మనస్తనుమ్ ।**
**సంకులీకృత్య తద్భస్మ విరజానల సంభవమ్ ॥**
**అగ్నిరిత్యాదిభిర్మంత్రైః షడ్భిరాథర్వణైః క్రమాత్ ।**
**విమృజ్యాంగాని మూర్ధాదిచరణాంతాని తైస్పృశేత్ ॥**
**తతస్తేన క్రమేణైవ సముద్ధృత్య చ భస్మనా ।**
**సర్వాంగో ద్ధూలనం కుర్యాత్ప్రణవేన శివేన వా ॥**
**తతస్త్రి పుండ్రం రచయేత్ త్రియాయుష సమాహ్వయమ్ ।**
**శివభావం సమాగమ్య శివయోగ మథాచరేత్ ॥**
**కుర్యాత్త్రి సంధ్యమప్యేవమేతత్పాశుపతం వ్రతమ్ ।**
**భుక్తిముక్తి ప్రదం చైతత్పశుత్వం వినివర్తయేత్ ॥**
**తత్పశుత్వం పరిత్యజ్య కృత్వా పాశుపతం వ్రతమ్ ।**
**పూజనీయో మహాదేవో లింగమూర్తి స్సనాతనః ॥**
**పద్మమష్టదలం హైమం నవరత్నైరలంకృతమ్ ।**
**కర్ణికాకేశరో పేతమాసనం పరికల్పయేత్ ॥**
**విభవే తదభావే తు రక్తం సితమథాపి వా ।**
**పద్మం తస్యాప్య భావే తు కేవలం భావనామయమ్ ॥**

తత్పద్మకర్ణికామధ్యే కృత్వా లింగం కనీయసమ్ ।
స్ఫాటికం పీఠికో పేతం పూజయేద్విధివత్క్ర మాత్ ॥
ప్రతిష్టాప్య విధానేన తల్లింగం కృతశో ధనమ్ ।
పరికల్ప్యాసనం మూర్తిం పంచవక్త్ర ప్రకారతః ॥
పంచగవ్యాదిభిః పూర్ణైర్యథావిభవ సంభృతైః ।
స్నాపయేత్కలశైః పూర్ణైరష్టాపదసముద్భవైః ॥

తరువాత కాళ్లను కడుగుకొని, రెండుసార్లు ఆచమనమును చేసి, విరజాహోమమును చేసిన అగ్నికుం కుండములో తయారైన భస్మను ప్రోగు చేసుకొని, అగ్నిరితి భస్మ అని మొదలయ్యే అథర్వణవేదమునందలి ఆరు మంత్రములను వరుసగా పలిస్తూ తలతో మొదలిడి పాదముల వరకు గల అవయవములను స్పృశిస్తూ భస్మను రాసుకొని తన దేహమును పవిత్రము చేసుకొన వలెను. తరువాత అదే క్రమములో మంత్రములతో గాని, ఓంకారముతో గాని, శివమంత్రముతో గాని భస్మను శరీరములోని అవయవములన్నింటిపై జల్లు కొన వలెను. తరువాత త్రియాయుషం అనే మంత్రమును చెప్పి, త్రిపుండ్రమును ధరించి, శివభావమును ఆపాదించుకొని, తరువాత శివయోగమును ఆచరించవలెను. మూడు సంధ్యలలో ఇదే విధముగా పాశుపత వ్రతమును చేయవలెను. ఇది సాధకునకు భుక్తిని, ముక్తిని ఇచ్చి, అజ్ఞానమును విశేషముగా తొలగించును. పాశుపతవ్రతమును చేసి పశుభావమును విడిచి పెట్టి, లింగరూపములోనున్న సనాతనుడగు మహాదేవుని పూజించ వలెను. సంపద గలవాడైనచో, ఎనిమిది దళములు తొడిమ మరియు దుద్దు గల బంగరు పద్మమను తొమ్మిది రత్నములతో నలంకరించి, దానిని శివునకు ఆసనముగా నీయవలెను. సంపద లేనిచో, ఎర్రని లేదా తెల్లని పద్మమును ఈయవలెను. అది కూడా లేనిచో, కేవలము భావసారూపమగు పద్మమును సమర్పించ వలెను. ఆ పద్మము యొక్క దుదునకు మధ్యలో పీఠముతో కూడియున్న ఆ చిన్న స్ఫటిక లింగమును యథావిధిగా క్రమముగా పూజించ వలెను. శోధనము చేయబడిన ఆ లింగమును యథావిధిగా ప్రతిష్ఠించి, ఆ విధముగా ఆసనమును కల్పించి, తన వైభవమునకు తగ్గట్లుగా సమకూర్చుకున్న పంచగవ్యములు మొదలగు ద్రవ్యములతో నిండియున్న బంగరు పూర్ణకలశములతో ఆ లింగమూర్తికి అయిదు ముఖములకు వరుసగా అభిషేకమును చేయవలెను.

గంధద్రవ్యైస్స కర్పూరైశ్చందనాద్యైస్స కుంకుమైః ।
సవేదికం సమాలిప్య లింగం భూషణభూషితమ్ ॥
బిల్వపత్రైశ్చ పద్మైశ్చ రక్తైః శ్వేతైస్తథోత్పలైః ।
నీలోత్పలైస్తథాన్యైశ్చ పుష్పైస్తైస్తైసుగంధిభిః ॥
పుణ్యైః ప్రశస్తైః పత్రైశ్చ చిత్రై ర్దూర్వాక్షతాదిభిః ।
సమభ్యర్చ్య యథాలాభం మహాపూజా విధానతః ॥
ధూపం దీపం తథా చాపి నైవేద్యం చ సమాదిశేత్ ।
నివేదయిత్వా విభవే కల్యాణం చ సమాచరేత్ ॥

ఇష్టాని చ విశిష్టాని న్యాయేనోపార్జితాని చ ।
సర్వద్రవ్యాణి దేయాని వ్రతే తస్మిన్ విశేషతః ॥
శ్రీపత్రోత్పల పద్మానాం సంఖ్యా సాహస్రికీ మతా ।
ప్రత్యేకమపరా సంఖ్యా శతమష్టోత్తరం ద్విజాః ॥
తత్రాపి చ విశేషేణ న త్యజేద్బిల్వ పత్రకమ్ ।
హైమమేకం పరం ప్రాహుః పద్మం పద్మసహస్రకాత్ ॥
నీలోత్పలాదిష్వప్యేతత్సమానం బిల్వపత్రకైః ।
పుష్పాంతరే న నియమో యథాలాభం నివేదయేత్ ॥
అష్టాంగమర్ఘ్యముత్కృష్టం ధూపాలేపౌ విశేషతః ।
చందనం వామదేవాఖ్యే హరితాలం చ పౌరుషే ॥
ఈశానే భసితం కేచిదాలేపనమితీదృశమ్ ।
న ధూపమితి మన్యంతే ధూపాంతర విధానతః ।
సితాగురుమఘోరాఖ్యే ముఖే కృష్ణాగురుం పునః ॥
పౌరుషే గుగ్గులుం సవ్యే సౌమ్యే సౌగంధికం ముఖే ।
ఈశానేఽపి హ్యుశీరాది దేయాద్ధూపం విశేషతః ॥

వేదితో సహా లింగమునకు కర్పూరము, చందనము మొదలగు సుగంధద్రవ్యములను చక్కగా లేపనము చేసి, భూషణములతో అలంకరించవలెను. మారేడు పత్రములతో, ఎర్రని పద్మములతో, తెల్లని మరియు నల్లని కలువలతో, మరియు ఇతరములగు ఆయా సుగంధపుష్పములతో, పవిత్రము మరియు శ్రేష్ఠము అగు పత్రములతో, రంగు రంగుల దూర్వలతో, అక్షతలతో, లభించిన దానిని బట్టి మహాపూజావిధానము ననుసరించి చక్కగా పూజించవలెను. ధూప, దీప, నైవేద్యములను సమర్పించ వలెను. సర్వవ్యాపకుడగు ఆ ఈశ్వరునకు విన్నవించి, కల్యాణమును కూడ జరుప వలెను. ఆ వ్రతమునందు ప్రియమైనవి, విలువైనవి, న్యాయముగా సంపాదించినవి అగు సకలద్రవ్యములను విశేషముగా సమర్పించ వలెను. మారేడు పత్రములు, కలువలు, పద్మములు ఒక్కొక్కటి వెయ్యి చొప్పున ఉండవలెను. ఓ బ్రాహ్మణులారా! ఇతరపుష్పముల సంఖ్య ఒక్కొక్కటి నూట యెనిమిది చొప్పున ఉండవలెను. వాటిలో కూడ ప్రత్యేకించి మారేడు పత్రములను విడువరాదు. వేయి పద్మముల కంటే ఒక్క బంగరు పద్మము శ్రేష్ఠమని చెప్పెదరు. నల్ల కలువలు మొదలగు వాటికి కూడ ఇది వర్తించును. నల్ల కలువలు మారేడుపత్రములతో సమానమైనవి. మిగిలిన పుష్పముల విషయములో నియమము లేదు. దొరికే దానిని బట్టి వాటిని సమర్పించ వలెను. ఎనిమిది అంగములు గల అర్ఘ్యము విశిష్టమైనది. ధూపము, మరియు అంగరాగముల విషయములో ఈ క్రింది విశేషము గలదు. వామదేవ ముఖమునకు చందనమును, తత్పురుష ముఖమునకు హరిదళమును, ఈశానముఖమునకు భస్మను ఆలేపనముగా నీయవలెను. మరియొక ధూపవిధి యుండుటచే ఈ సామాన్యమగు ధూపము నిషిద్ధమని కొందరు చెప్పుచున్నారు. అఘోరముఖమునకు తెల్ల అగరును, తత్పురుషముఖమునకు నల్ల అగరును, వామదేవముఖమునకు

గుగ్గిలమును, సద్యోజాతముఖమునకు గంధకమును, ఈశానముఖమునకు వట్టివేళ్లను విశేషముగా ధూపము వేయవలెను.

శర్కారామధుకర్పూర కపిలాఘృత సంయుతమ్ ।
చందనాగురుకాష్ఠాద్యం సామాన్యం సంప్రచక్షతే ॥
కర్పూరవర్తిరాజ్యాఢ్యా దేయా దీపావలిస్తతః ।
అర్ఘ్యమాచమనం దేయం ప్రతివక్త్ర మతః పరమ్ ॥
ప్రథమావరణే పూజ్యౌ క్రమాద్ధేరంబషణ్ముఖౌ ।
బాహ్యేంగాని తతశ్చైవ ప్రథమావరణేర్చితే ॥
ద్వితీయావరణే పూజ్యా విఘ్నేశాశ్చక్ర వర్తినః ।
తృతీయావరణే పూజ్యా భవాద్యా అష్టమూర్తయః ॥
మహాదేవాదయస్తత్ర తథైకాదశమూర్తయః ।
చతుర్థావరణే పూజ్యాస్సర్వ ఏవ గణేశ్వరాః ॥
బహిరేవ తు పద్మస్య పంచమావరణే క్రమాత్ ।
దశ దిక్పతయః పూజ్యాస్సాస్త్రా స్సానుచరాస్తథా ॥
బ్రహ్మణో మానసాః పుత్రాస్సర్వేఽపి జ్యోతిషాం గణాః ।
సర్వా దేవ్యశ్చ దేవాశ్చ సర్వే సర్వే చ ఖేచరాః ॥
పాతాలవాసినశ్చాన్యే సర్వే మునిగణా అపి ।
యోగినో హి మఖాస్సర్వే పతంగా మాతరస్తథా ॥
క్షేత్రపాలాశ్చ సగణాస్సర్వం చైతచ్చరాచరమ్ ।
పూజనీయం శివప్రీత్యై మత్వా శంభువిభూతిమత్ ॥
అథావరణపూజాంతే సంపూజ్య పరమేశ్వరమ్ ।
సాజ్యం సవ్యంజనం హృద్యం హవిర్భక్త్యా నివేదయేత్ ॥

పంచదార, తేనె, కర్పూరము, కపిలగోవు నేయి, చందనము, అగరు చెక్క మొదలగు పదార్థములతో చేసిన ధూపమును ముఖములన్నింటికీ సమానముగా వాడవచ్చునని పెద్దలు చెప్పుచున్నారు. తరువాత నేతిలో నానబెట్టిన కర్పూరపు వత్తులతో దీపపంక్తిని సమర్పించవలెను. తరువాత ప్రతి ముఖమునకు అర్ఘ్యమును మరియు ఆచమనమును ఈయవలెను. మొదటి ఆవరణలో విఘ్నేశ్వరుని, కుమారస్వామిని, యంత్రముయొక్క బాహ్యమునందు ఉండే అంగములను వరుసగా పూజించ వలెను. మొదటి ఆవరణలో పూజ అయిన తరువాత, రెండవ ఆవరణయందు విఘ్నేశ్వరులను మరియు చక్రవర్తులను, మూడవ ఆవరణయందు భవుడు మొదలగు అష్టమూర్తులను మరియు మహాదేవుడు మొదలగు ఏకాదశరుద్రులను కూడ పూజించవలెను. నాల్గవ ఆవరణలో గణాధ్యక్షులను అందరినీ పూజించ వలెను. అయిదవ ఆవరణలో పద్మమునకు బయట మాత్రమే వరుసగా అస్త్రములతో మరియు అనుచరులతో కూడియున్న పది దిక్పాలకులను పూజించ వలెను. బ్రహ్మయొక్క మానసపుత్రులను, నక్షత్రగణములను అన్నింటినీ, ఆకాశమునందు సంచరించు దేవతలను మరియు దేవీమూర్తులను అందరినీ,

పాతాళమునందు నివసించు ఇతరులను, మునిగణముల నందరినీ, యోగులను, సకలయజ్ఞముల (అధిష్ఠాన దేవతల) ను, పక్షులను, మాతృమూర్తులను మరియు గణములతో కూడియున్న క్షేత్రపాలకులను పూజించ వలెను. ఈ చరాచరజగత్తు అంతయు శివుని విభూతిని కలిగియున్నదని తెలుసుకొని, శివప్రీతి కొరకై పూజించ వలెను. ఆవరణ పూజ అయిన తరువాత పరమేశ్వరుని పూజించి, నేతితో మరియు వ్యంజనములతో (కూర, పచ్చడి మొదలగునవి) కూడిన, మనస్సునకు ఆహ్లాదమును కలిగించే హవిస్సును భక్తితో నివేదన చేయవలెను.

**ముఖవాసాదికం దత్త్వా తాంబూలం సోపదంశకమ్ ।**
**అలంకృత్య చ భూయోఽపి నానాపుష్పవిభూషణైః ॥**
**నీరాజనాంతే విస్తీర్య పూజాశేషం సమాపయేత్ ।**
**చషకం సోపకారం చ శయనం చ సమర్పయేత్ ॥**
**చంద్రసంకాశహారం చ శయనీయం సమర్పయేత్ ।**
**ఆద్యం నృపోచితం హృద్యం తత్సర్వమనురూపతః ॥**
**కృత్వా చ కారయిత్వా చ హుత్వా చ ప్రతిపూజనమ్ ।**
**స్తోత్రం వ్యపోహనం జప్త్వా విద్యాం పంచాక్షరీం జపేత్ ॥**
**ప్రదక్షిణాం ప్రణామం చ కృత్వాత్మానం సమర్పయేత్ ।**
**తతః పురస్తాద్దేవస్య గురువిప్రౌ చ పూజయేత్ ॥**
**దత్త్వార్ఘ్యమష్టౌ పుష్పాణి దేవముద్వాస్య లింగతః ।**
**అగ్నేశ్చాగ్నిం సుసంయమ్య హ్యుద్వాస్య చ తమప్యథ ॥**
**ప్రత్యహం చ జగస్త్యేవం కుర్యాత్తేవం పురోదితామ్ ।**
**తతస్తత్సాంబుజం లింగం సర్వోపకరణాన్వితమ్ ॥**
**సమర్పయేత్స్వగురవే స్థాపయేద్వా శివాలయే ।**
**సంపూజ్య చ గురూన్ విప్రాన్ ప్రతినశ్చ విశేషతః ॥**
**భక్తాన్ ద్విజాంశ్చ శక్తశ్చేద్దీనానాథాంశ్చ తోషయేత్ ।**
**స్వయం చానశనే శక్తః ఫలమూలాశనేఽథవా ॥**

నోటిని సుగంధపూర్ణము చేయుటకై వక్కపొడితో కూడిన తాంబూలమును ఇచ్చి, మరల వివిధరకముల పుష్పములతో మరియు ఆభరణములతో అలంకరించి, విస్తారమగు పూజను నీరాజనముతో పూర్తి చేసి, మిగిలిన పూజను సమాప్తి చేయవలెను. నీటిని త్రాగే పాత్రను, సౌకర్యమును కలిగించే ఇతరములగు వస్తువులను, శయ్యను సమర్పించ వలెను. చంద్రుని పోలిన హారమును శయ్యపై నుంచ వలెను. మహారాజు స్థాయికి తగ్గట్లుగా మనోహరమైన తినుబండారములను, వాటికి అనురూపమైన ఇతరములగు సకలవస్తువులను స్వయముగా ఏర్పాటు చేసి, ఇతరులచే కూడ చేయించ వలెను. ప్రతి పూజయందు హోమమును చేయవలెను. అమంగళములను పోనాడే స్తోత్రమును పఠించి, పంచాక్షరీ మంత్రమును జపించ వలెను. తరువాత ఆతడు ప్రదక్షిణమును చేసి, నమస్కరించి, తనను సమర్పించు కొనవలెను. తరువాత

దేవుని యెదుట గురువును, బ్రాహ్మణుని పూజించ వలెను. అర్ఘ్యమును, ఎనిమిది పుష్పములను ఇచ్చి, లింగమునుండి శివునకు ఉద్వాసనను చెప్పి, ఏకాగ్రమగు చిత్తము గలవాడై అగ్నిహోత్రమునుండి అగ్నికి కూడ ఉద్వాసనను చెప్పవలెను. మానవుడు ప్రతి దినము ఇంతవరకు చెప్పిన విధముగా సేవను చేసి, తరువాత పద్మము మరియు ఇతరములగు ఉపకరణములన్నింటితో కూడియున్న ఆ లింగమును తన గురువునకు సమర్పించ వలెను; లేదా, శివాలయమునందు స్థాపించ వలెను. గురువులను, బ్రాహ్మణులను, విశేషించి ఇట్టి వ్రతమును చేయువారిని చక్కగా పూజించి, భక్తులను, బ్రాహ్మణులను, శక్తి ఉన్నచో దీనులను అనాథులను సంతోషపెట్ట వలెను. తాను శక్తి ఉన్నచో ఉపవాసమును చేయవలెను; లేదా, పళ్లను దుంపలను తినవలెను.

పయోవ్రతో వా భిక్షాశీ భవేదేకాశనస్తథా ।
నక్తం యుక్తాశనో నిత్యం భూశయ్యానిరతశ్శుచిః ॥
భస్మశాయీ తృణేశాయీ చీరాజినధృతోఽథవా ।
బ్రహ్మ చర్య వ్రతో నిత్యం వ్రతమేతత్సమాచరేత్ ॥
అర్కవారే తథార్ద్రాయాం పంచదశ్యాం చ పక్షయోః ।
అష్టమ్యాం చ చతుర్దశ్యాం శక్తస్తూపవసేదపి ॥
పాఖండిపతితోదక్యాసూతకాంత్య జపూర్వకాన్ ।
వర్జయేత్సర్వయత్నేన మనసా కర్మణా గిరా ॥
క్షమాదానదయాసత్యాహింసాశీలస్సదా భవేత్ ।
సంతుష్టశ్చ ప్రశాంతశ్చ జపధ్యాన రతస్సదా ॥
కుర్యాత్త్రి షవణస్నానం భస్మస్నానమథాపి వా ।
పూజాం వైశేషికీం చైవ మనసా వచసా గిరా ॥
బహునాత్ర కిముక్తేన నాచరేదశివం వ్రతీ ।
ప్రమాదాత్తు తథాచారే నిరూప్య గురులాఘవే ॥
ఉచితాం నిష్కృతం కుర్యాత్పూజాహో మజపాదిభిః ।
అసమాప్తేర్వ్ర తస్యైవమాచరేన్న ప్రమాదతః ॥
గోదానం చ వృషోత్సర్గం కుర్యాత్పూజాం చ సంపదా ।
భక్తశ్చ శివ ప్రీత్యర్థం సర్వకామవివర్జితః ॥
సామాన్యమేతత్కథితం వ్రతస్యాస్య సమాసతః ।
ప్రతిమాసం విశేషం చ ప్రవదామి యథాశ్రుతమ్ ॥

పాలను త్రాగి ఉండవలెను; లేదా, భిక్షాన్నమును భుజించ వలెను. మరియు ఒక పూట మాత్రమే భుజించ వలెను. రాత్రి యథోచితముగా తినవలెను. నిత్యము పరిశుద్ధుడుగా నుంటూ నేలపై పరుండుటయందు ప్రీతిపీ కలిగి యుండవలెను. భస్మయందు గాని, గడ్డిపై గాని పరుండ వలెను. నారబట్టలను గాని, చర్మమును గాని ధరించ వలెను. నిత్యము బ్రహ్మచర్య దీక్షను పాటిస్తూ ఈ వ్రతమును కొనసాగించ వలెను. శక్తి ఉన్నచో ఆది వారము, ఆర్ద్ర నక్షత్రము, పూర్ణిమ, అమావాస్య, రెండు పక్షములలో అష్టమి మరియు చతుర్దశిల యందు

ఉపవాసమును చేయవలెను. పాఖండులు, పతితులు, రజస్వలా స్త్రీలు, ఆశౌచము గలవారు మరియు పశుఘాతకులు అను వారితో మనోవాక్కాయములతో సంపర్కము కలుగకుండునట్లు సకలప్రయత్నములను చేయవలెను. సాధకుడు సర్వకాలములలో ఓర్పు, దానము, దయ, సత్యము, అహింస, సంతృప్తి, మనఃప్రసన్నత మరియు జపమునందు ధ్యానమునందు ప్రీతి అను లక్షణములను కలిగి యుండవలెను. మూడు పూటలా స్నానమును చేయవలెను; భస్మస్నానమునైననూ చేయవలెను. మనస్సుతో మరియు వాక్కులతో విశేషమగు పూజను చేయవలెను. ఇన్ని మాటలేల? ఈ వ్రతమును చేయు వ్యక్తి పొరపాటు చేతనైననూ అమంగళమగు పనిని చేయరాదు. అట్లు చేసినచో, అది చిన్నదా లేక పెద్దదా అను విషయమును విచారించి, తగిన విధముగా పూజ, జపము మరియు హోమము మొదలగు వాటితో ప్రాయశ్చిత్తమును చేయవలెను. వ్రతము పూర్తి యగునంత వరకు పొరపాటు జరుగని విధముగా ఈ విధముగా ఆచరించ వలెను. భక్తుడు సకలములగు కామనలను విడిచి పెట్టి శివుని ప్రీతి కొరకై సంపదను బట్టి గోదానము, ఆంబోతును విడుచుట మరియు పూజ అను కర్మలను చేయ వలెను. ఈ వ్రతముయొక్క సామాన్యనియమములను సంగ్రహముగా చెప్పితిని. ప్రతి నెలకు కొన్ని విశేషములు గలవు. నేను విన్నదానిని బట్టి వాటిని చెప్పెదను.

వైశాఖే వజ్రలింగం తు జ్యేష్ఠే మారకతం శుభమ్ ।
ఆషాఢే మౌక్తికం విద్యా చ్ఛ్రావణే నీలనిర్మితమ్ ॥
మాసే భాద్రపదే చైవ పద్మరాగమయం పరమ్ ।
ఆశ్వినే మాసి విద్యాద్వై లింగం గోమేధకం వరమ్ ॥
కార్త్తిక్యం వైద్రుమం లింగం వైదూర్యం మార్గశీర్షకే ।
పుష్పరాగమయం పౌషే మాఘే ద్యుమణిజం తథా ॥
ఫాల్గునే చంద్రకాంతోత్థం చైత్రే తద్వ్యత్యయోఽథ వా ।
సర్వమాసేషు రత్నానామలాభే హైమమేవ వా ॥
హైమాభావే రాజతం వా తామ్రజం శైలజం తథా ।
మృన్మయం వా యథాలాభం జాతుషం చాన్యదేవ వా ॥
సర్వగంధమయం వాథ లింగం కుర్యాద్యథారుచి ।
వ్రతావసానసమయే సమాచరితనిత్యకః ॥
కృత్వా వైశేషికీం పూజాం హుత్వా చైవ యథా పురా ।
సంపూజ్య చ తథాచారం ప్రతిసశ్చ విశేషతః ॥
దేశికేనాప్యనుజ్ఞాతః ప్రాఙ్ముఖో వాప్యుదఙ్ముఖః ।
దర్భాసనో దర్భపాణిః ప్రాణాపానౌ నియమ్య చ ॥
జపిత్వా శక్తితో మూలం ధ్యాత్వా సాంబం త్ర్యంబకమ్ ।
అనుజ్ఞాప్య యథాపూర్వం నమస్కృత్య కృతాంజలిః ॥
సముత్సృజామి భగవన్ వ్రతమేతత్త్వదాజ్ఞయా ।
ఇత్యుక్త్వా లింగమూలస్థాన్ దర్భానుత్తర తస్సృజేత్ ॥

వైశాఖమాసములో వజ్రలింగము, జ్యేష్ఠమాసములో మరకతలింగము, ఆషాఢములో ముత్యముతో చేసిన లింగము, శ్రావణమాసములో ఇంద్రనీలమణితో చేసిన లింగము, భాద్రపద మాసములో పద్మరాగమణితో చేసిన లింగము, ఆశ్వయుజ మాసములో గోమేధకముతో చేసిన లింగము శ్రేష్ఠము. కార్తీకమాసములో పగడముతో చేసిన లింగము, మార్గశీర్షములో వైడూర్యముతో చేసిన లింగము, పుష్యములో పుష్పరాగముతో చేసినది, మాఘములో సూర్యకాంతలింగము, ఫాల్గునములో చంద్రకాంతలింగము, చైత్రములో సూర్యకాంతలింగము శ్రేష్ఠము. రత్నములు దొరకని పక్షములో మాసములన్నింటిలో బంగరు లింగము శ్రేష్ఠము. బంగారము లేనిచో వెండి, రాగి, రాయి, మట్టి, లక్క, లేక లభించిన మరే పదార్థముతో నైననూ, లేదా తన రుచికి తగ్గట్లుగా సకలసుగంధపదార్థములతో లింగమును చేయవలెను. వ్రతము పూర్తి అయిన సమయములో నిత్యకర్మలను చేసుకొని, విశేషపూజను చేసి, పూర్వమునందు వలెనే హోమమును చేసి, ఆచార్యుని వ్రతమును చేసిన వారిని విశేషముగా చక్కగా పూజించి, ఆచార్యుని అనుమతిని తీసుకొని, తూర్పు లేక ఉత్తరమునకు అభిముఖముగా దర్భాసనముపై కూర్చుండి, చేతిలో దర్భలను పట్టుకొని, ప్రాణాయామమును చేసి, శక్తిననుసరించి మూలమంత్రమును జపించి, జగన్మాతతో గూడియున్న ఆ ముక్కంటిని ధ్యానించి, పూర్వమునందు వలెనే విన్నవించుకొని, చేతులను జోడించి నమస్కరించి, ఓ భగవంతుడా! నీ అనుమతితో ఈ వ్రతమును ముగించు చున్నాను అని పలికి, లింగముయొక్క మూలమునందున్న దర్భలను ఉత్తరదిక్కునందు పారవేయ వలెను.

**తతో దండజటాచీరమేఖలా అపి చోత్సృజేత్ ।**
**పునరాచమ్య విధివత్పంచాక్షరముదీరయేత్ ॥**
**యః కృత్వాత్యంతికీం దీక్షామాదేహాంత మనాకులః ।**
**వ్రతమేతత్ప్ర కుర్వీత స తు వై నైష్ఠికస్స్మృతః ॥**
**సోఽత్యా శ్రమీ చ విజ్ఞేయో మహాపాశుపతస్తథా ।**
**స ఏవ తపతాం శ్రేష్ఠస్స ఏవ చ మహావ్రతీ ॥**
**న తేన సదృశః కశ్చిత్కృతకృత్యో ముముక్షుషు ।**
**యో యతిర్నైష్ఠికో జాతస్తమాహుర్నైష్ఠికోత్తమమ్ ॥**
**యోఽన్వహం ద్వాదశాహం వా వ్రతమేతత్సమాచరేత్ ।**
**సోఽపి నైష్ఠికతుల్యస్స్యాత్తీ వ్రవ్రతసమన్వయాత్ ॥**
**ఘృతాక్తో యశ్చరేదేతద్వ్రతం వ్రతపరాయణః ।**
**ద్విత్రై కదివసం వాపి స చ కశ్చన నైష్ఠికః ॥**
**కృత్యమిత్యేవ నిష్కామో యశ్చరేద్వ్రత ముత్తమమ్ ।**
**శివార్పితాత్మా సతతం న తేన సదృశః క్వచిత్ ॥**
**భస్మచ్ఛన్నో ద్విజో విద్వాన్మహాపాతక సంభవైః ।**
**పాపైస్సు దారుణైస్సద్యో ముచ్యతే నాత్ర సంశయః ॥**

**రుద్రాగ్నేర్యత్పరం వీర్యం తద్భస్మ పరికీర్తితమ్ ।**

**తస్మాత్సర్వేషు కాలేషు వీర్యవాన్ భస్మసంయుతః ॥**

**భస్మనిష్ఠస్య నశ్యంతి దోషా భస్మాగ్నిసంగమత్ ।**

**భస్మస్నానవిశుద్ధాత్మా భస్మనిష్ఠ ఇతి స్మృతః ॥**

తరువాత దండము, జటలు, నారబట్టలు, మేఖల అనువాటిని కూడ విడిచి పెట్టవలేను. ఆతడు యథావిధిగా మరల ఆచమనమును చేసి పంచాక్షరమంత్రమును ఉచ్చరించవలెను. ఎవడైతే ఆజీవనదీక్షను గైకొని ఆందోళనలు లేనివాడై జీవించి యున్నంతవరకు ఈ వ్రతమును చేయునో, ఆతడు నైష్ఠికుడని చెప్పబడినాడు. అట్టి మహాపాశుపతుడు ఆశ్రమములన్నింటికీ అతీతుడని తెలియవలెను. ఆతడు మాత్రమే తపశ్శాలులలో శ్రేష్ఠుడు. ఆతడు మాత్రమే మహావ్రతము గలవాడు, మోక్షమును గోరువారిలో ఆతనితో సమానముగా కృతార్థుడైన వాడు మరియొకడు లేడు. ఏ సన్న్యాసి నైష్ఠికుడగునో, ఆతడు నైష్ఠికోత్తముడని చెప్పబడును. ఎవడైతే పన్నెండు రోజుల వరకు ప్రతిదినము ఈ వ్రతమును చేయునో, ఆతడు తీవ్రమగు వ్రతమను అనుష్ఠించిన వాడగుటచే నైష్ఠికునితో సమానుడే యగును. వ్రతమునందు నిష్ఠ గల ఏ వ్యక్తి కనీసము రెండు మూడు రోజులైననూ శరీరమంతటా నేయిని పట్టించుకొని ఈ వ్రతమును చేయునో, వాడు కూడ ఒక రకమగు నైష్ఠికుడే యగును. చేయదగినది గనుక చేయుచున్నాను అనే భావన గలవాడై కామనలు లేకుండగా ఎవడైతే మనస్సును శివునియందు అర్పించి ఈ ఉత్తమమగు వ్రతమును ఆచరించునో, వానితో సమానమగు వాడు మరియొకడు లేడు. విద్వాంసుడగు బ్రాహ్మణుడు భస్మను శరీరమంతటా పూసుకున్నచో, మహాపాపముల వలన కలిగే మిక్కిలి భయంకరమగు దుఃఖములనుండి విముక్తుడగుననుటలో సందేహము లేదు. రుద్రాగ్ని యొక్క శ్రేష్ఠమగు వీర్యమే భస్మయని కీర్తించ బడినది. కావున, సర్వకాలములలో భస్మను ధరించువాడు వీర్యవంతుడగును. భస్మయందు నిష్ఠ గలవానికి భస్మ అనే అగ్నితో సంయోగము వలన దోషములు నశించును. భస్మస్నానముచే పరిశుద్ధమైన అంతఃకరణము గల వ్యక్తి భస్మనిష్ఠుడు అని చెప్పబడు చున్నాడు.

భస్మనా దిగ్ధసర్వాంగో భస్మదీప్త త్రిపుండ్రకః ।
భస్మస్నాయీ చ పురుషో భస్మనిష్ఠ ఇతి స్మృతః ॥
భూతప్రేత పిశాచాశ్చ రోగాశ్చాతీవ దుస్సహాః ।
భస్మనిష్ఠస్య సాన్నిధ్యాద్విద్రవంతి న సంశయః ॥
భాసనాద్భసితం ప్రోక్తం భస్మ కల్మషభక్షణాత్ ।
భూతిర్భూతికరీ చైవ రక్షా రక్షాకరీ పరమ్ ॥
కిమన్యదిహ వక్తవ్యం భస్మమాహాత్మ్య కారణమ్ ।
వ్రతీ చ భస్మనా స్నాతస్స్వయం దేవో మహేశ్వరః ॥
పరమాస్త్రం చ శైవానాం భస్మైతత్పారమేశ్వరమ్ ।
ధౌమ్యాగ్రజస్య తపసి వ్యాపదో యన్నివారితాః ॥
తస్మాత్సర్వ ప్రయత్నేన కృత్వా పాశుపత వ్రతమ్ ।
ధనవద్భస్మ సంగృహ్య భస్మస్నానరతో భవేత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే పాశుపత వ్రత విధానవర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥

భస్మను వంటినిండా పూసుకొని, భస్మచే దిద్దబడిన త్రిపుండ్రముతో ప్రకాశిస్తూ, భస్మతో స్నానమును చేయు పురుషుడు భస్మనిష్టుడగునని చెప్పెదరు. భూతములు, ప్రేతములు, పిశాచములు, మిక్కిలి సహింప శక్యము కాని రోగములు భస్మనిష్ఠుని సన్నిధినుండి పారిపోవుననుటలో సందేహము లేదు. ప్రకాశించునది అగుటచే దానికి భసితము అని పేరు వచ్చినది. పాపములను భక్షించి వేయుటచే దానికి భస్మ అని పేరు వచ్చినది. సంపదలను ఇచ్చుటచే అది భూతి అనబడును. భస్మ గొప్పగా రక్షించును గనుక, దానికి రక్ష అను పేరు వచ్చినది. భస్మ మహిమ గలది అని చెప్పుటకు ఇంకనూ ఏమి కారణమును చెప్ప వలయును? వ్రతమును చేసి భస్మతో స్నానమును చేసిన వ్యక్తి స్వయముగా మహేశ్వరదేవుడే యగును. ఈ పరమేశ్వరునకు చెందిన భస్మయే శివభక్తులకు గొప్ప అస్త్రము. ఎందువలననగా, ధౌమ్యుని అన్నగారగు ఉపమన్యుని తపస్సులో ఆపదలను భస్మయే పోగొట్టినది. కావున, మానవుడు సకలప్రయత్నములను చేసి పాశుపత వ్రతమును చేసి ధనమును వలె భస్మను ప్రోగు చేసుకొని భస్మస్నానమునందు ప్రీతి గలవాడు కావలెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో పాశుపత వ్రతమును వర్ణించే ముప్పది మూడవ అధ్యాయము ముగిసినది.

# 34 – ఉపమన్యుని తపస్సు

ఋషయ ఊచుః ।

ధౌమ్యా గ్రజేన శిశునా క్షీరార్థం హి తపః కృతమ్ ।
తస్మాత్ క్షీరార్ణవో దత్తస్తస్మై దేవేన శూలినా ॥
స కథం శిశుకో లేభే శివశాస్త్ర ప్రవక్తృతామ్ ।
కథం వా శివసద్భావం జ్ఞాత్వా తపసి నిష్ఠితః ॥
కథం చ లబ్ధవిజ్ఞానస్తపశ్చరణ పర్వణి ।
రుద్రాగ్నేర్యత్పరం వీర్యం లేభే భస్మ స్వరక్షకమ్ ॥

ఋషులు ఇట్లు పలికెను –

ధౌమ్యుని అన్నగారగు ఉపమన్యుడు పిల్లవాడుగా నున్నపుడు పాల కొరకు తపస్సు(్స్సును చేసెను. ఆ తపస్సు వలన త్రిశూలియగు శివభగవానుడు పాల సముద్రమును ఆతనికి ఇచ్చినాడు. ఆ పిల్లవాడు శివశాస్త్రమును బోధించే సామర్థ్యమును ఎట్లు పొందినాడు? ఆతడు శివుని సత్స్వరూపమును తెలుసుకొని తపస్సు నందు నిష్ఠను పొందిన విధమెట్టిది? ఆతడు తపస్సును చేయు కాలములో విజ్ఞానమును పొందిన విధానమెట్టిది? అగ్ని రూపములోనున్న రుద్రుని సర్వోత్కృష్టమగు శక్తి యగు భస్మను ఆతడు పొంది తనను తాను రక్షించుకున్న విధమెట్టిది?

వాయురువాచః

న హ్యేష శిశుకః కశ్చిత్ప్రాకృతః కృతవాంస్తపః ।
మునివర్యస్య తనయో వ్యాఘ్రపాదస్య ధీమతః ॥
జన్మాంతరేణ సంసిద్ధః కేనాపి ఖలు హేతునా ।
స్వపదప్రచ్యుతో దిష్ట్యా ప్రాప్తో మునికుమారతామ్ ॥
మహాదేవ ప్రసాదస్య భాగ్యాపన్నస్య భావనః ।
దుగ్ధాభిలాష ప్రభవం ద్వారతామగమత్తపః ॥
అతస్సర్వ గణేశత్వం కుమారత్వం చ శాశ్వతమ్ ।
సహ దుగ్ధాబ్దినా తస్మై ప్రదదౌ శంకరస్స్వయమ్ ॥
తస్య జ్ఞానాగమోప్యస్య ప్రసాదాదేవ శాంకరాత్ ।
కౌమారం హి పరం సాక్షాత్ జ్ఞానం శక్తిమయం విదుః ॥
శివశాస్త్ర ప్రవక్తృత్వమపి తస్య హి తత్కృతమ్ ।
కుమారో మునితో లబ్ధజ్ఞానాబ్ధిరివ నందనః ॥
దృష్టం తు కారణం తస్య శివజ్ఞానసమన్వయే ।
స్వమాతృవచనం సాక్షాచ్ఛోకజం క్షీరకారణాత్ ॥
కదాచిత్ క్షీరమత్యల్పం పీతవాన్ మాతులాశ్రమే ।
ఈర్ష్యయా మాతులసుతం సంతృప్తక్షీర ముత్తమమ్ ॥

పీత్వా స్థితం యథాకామం దృష్ట్వా వై మాతులాత్మజమ్ ।
ఉపమన్యుర్వ్యాఘ్రపాదిః ప్రీత్యా ప్రోవాచ మాతరమ్ ॥

వాయువు ఇట్లు పలికెను -

తపస్సును చేసిన ఈ బాలుడు ఏదో ఒక సామాన్య బాలకుడు కాడు. ఆతడు బుద్ధి శాలియగు వ్యాఘ్రపాదుడు అను మహర్షియొక్క కొడుకు. ఆతడు పూర్వజన్మలో సిద్ధిని పొందిన వాడే అయిననూ ఏదో ఒక కారణముచే దైవవశముచే తన స్థానమునుండి జారినవాడై మునికుమారుడై జన్మించెను. భాగ్యవశముచే లభించబోయే మహాదేవుని అనుగ్రహమునకు, పాలయందలి కోరికతో చేయబడిన తపస్సు ద్వారము ఆయెను, ఆ తపస్సు వలన శంకరుడు ఆతనికి పాల సముద్రముతో బాటు గణములన్నింటిపై అధ్యక్షత్వమును, శాశ్వతమగు కుమారపదవిని స్వయముగా ఇచ్చెను. ఆతనికి శంకరుని అనుగ్రహముచే జ్ఞానము కూడ కలిగెను. కుమారుడగు ఆ ఉపమన్యుని జ్ఞానము సర్వోత్కృష్టమైనదనియు, శక్తితో కూడినదనియు పెద్దలు చెప్పుదురు. ఆతనికి శివశాస్త్రమును చెప్పే సామర్థ్యమును కూడ శివుడే ఇచ్చేను. ఆ కుమారుడు తన తండ్రియగు వ్యాఘ్రపాదునినుండి పొందబడిన జ్ఞానము గలవానివలె సంతోషించేను. ఆతడు శివజ్ఞానమును స్వంతము చేసుకొనుటకు కంటికి కనబడే కారణము సాక్షాత్తుగా తన తల్లియొక్క వచనమే. ఆమె పాలు కారణముగా పలికిన వచనము శోకమును కలిగించును. ఒకనాడు ఆతడు మేనమామయొక్క ఆశ్రమములో చాల తక్కువ పాలను త్రాగెను. యథేచ్ఛగా తృప్తి కలుగునంతవరకు మంచి పాలను త్రాగి నిలబడి యున్న మేనమామయొక్క పుత్రుని చూచి, వ్యాఘ్రపాదుని కుమారుడగు ఉపమన్యుడు ఈర్ష్యపడి, ప్రేమతో తల్లిని ఉద్దేశించి ఇట్లు పలికెను.

**ఉపమన్యు రువాచ:**

మాతర్మాతర్మహాభాగే మమ దేహి తపస్విని ।
గవ్యం క్షీరమతిస్వాదు నాల్పముష్ణం పిబామ్యహమ్ ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను -

అమ్మా! అమ్మా! నీవు మహాత్మురాలవు; గొప్ప తపశ్శాలినివి. నాకు మిక్కిలి మధురమైన ఆవుపాలను ఇమ్ము. వేడిగానుండే కొద్ది పాలను నేను త్రాగను.

**వాయురువాచ:**

**తచ్ఛ్రుత్వా పుత్రవచనం తన్మాతా చ తపస్వినీ ।**
**వ్యాఘ్రపాదస్య మహిషీ దుఃఖమాపత్తదా చ సా ॥**
**ఉపలాల్యాథ సుప్రీత్యా పుత్రమాలింగ్య సాదరమ్ ।**
**దుఃఖితా విలలాపాథ స్మృత్వా నైర్ధన్యమాత్మనః ॥**
**స్మృత్వా స్మృత్వా పునః క్షీరముపమన్యుస్స బాలకః ।**
**దేహి దేహీతి తామహ రుదన్ భూయో మహాద్యుతిః ॥**

తద్ధతం సా పరిజ్ఞాయ ద్విజపత్నీ తపస్వినీ ।
శాంతయే తద్ధఠస్యాథ శుభోపాయమరీరచత్ ॥
ఉంఛవృత్త్యార్జితాన్ బీజాన్ స్వయం దృష్ట్వా చ సా తదా ।
బీజపిష్టమథాలోడ్య తోయేన కలభాషిణీ ॥
ఏహ్యేహి మమ పుత్రేతి సామపూర్వం తతస్సుతమ్ ।
ఆలింగ్యాదాయ దుఃఖార్తా ప్రదదౌ కృత్రిమం పయః ॥
పీత్వా చ కృత్రిమం క్షీరం మాత్రా దత్తం స బాలకః ।
నైతత్ క్షీరమితి ప్రాహ మాతరం చాతివిహ్వలః ॥
దుఃఖితా సా తదా ప్రాహ సంప్రేక్ష్యాఘ్రాయ మూర్ధని ।
సంమార్జ్య నేత్రే పుత్రస్య కరాభ్యాం కమలాయతే ॥

వాయువు ఇట్లు పలికెను –

అపుడు పుత్రుని ఆ మాటను విని, తపశ్శాలిని, వ్యాఘ్రపాదుని భార్య అగు వాని ఆ తల్లి దుఃఖమును పొందెను. అపుడు దుఃఖితురాలైన ఆమె అతిశయించిన ప్రీతితో పుత్రుని దగ్గరకు తీసుకొని ఆదరముతో కౌగిలించుకొని లాలించి తన వద్ద ధనము లేదని గుర్తు చేసుకొని రోదించెను. గొప్ప కాంతి గలవాడు, బాలకుడు అగు ఆ ఉపమన్యుడు మరల మరల ఆ పాలనే గుర్తు చేసుకొనుచూ మరల ఏడ్చుచూ ఆమెతో ఇమ్ము, ఇమ్ము అని పలికెను. అపుడు తపశ్శాలినియగు ఆ బ్రాహ్మణపత్ని వాని మొండి పట్టును గుర్తించి ఆ పట్టును శాంతింప జేయుట కొరకై చక్కని ఉపాయమును చేసెను. అపుడు మధురముగా సంభాషించే ఆ తల్లి తాను స్వయముగా ఉంఛవృత్తి (పొలములో రాలి పడిన గింజలను ఏరుకొనుట) చే సంపాదించిన గింజలను చూచి, వాటిని విసిరి పిండి చేసి నీటిలో కలిపి, తరుపోత పుత్రా! రమ్ము, రమ్ము అని ప్రేమపూర్వకముగా పుత్రుని దగ్గరకు తీసుకొని ఆలింగనము చేసుకొని, దుఃఖముచే పీడింపబడుతూ ఆ పాలు కాని పాలను ఇచ్చెను. తల్లి ఇచ్చిన ఆ పాలు కానీ పాలను త్రాగి ఆ బాలుడు మిక్కిలి దుఃఖించిన వాడై, ఇవి పాలు కావు అనీ తల్లితో పలికెను. అపుడామె దుఃఖితురాలై పుత్రుని చూచి నుదుటిపై ముద్దాడి, పద్మము వలె విశాలమైన పుత్రుని కన్నులను చేతులతో తుడిచి ఇట్లు పలికెను.

జనన్యువాచః

తటినీ రత్నపూర్ణాస్తాస్స్వర్గపాతాలగోచరాః ।
భాగ్యహీనా న పశ్యంతి భక్తిహీనాశ్చ యే శివే ॥
రాజ్యం స్వర్గం చ మోక్షం చ భోజనం క్షీరసంభవమ్ ।
న లభంతే ప్రియాణ్యేషాం న తుష్యతి యదా శివః ॥
భవ ప్రసాదజం సర్వం నాన్యదేవ ప్రసాదజమ్ ।
అన్యదేవేషు నిరతా దుఃఖార్తా విభ్రమంతి చ ॥
క్షీరం తత్ర కుతోఽస్మాకం వనే నివసతాం సదా ।
క్వ దుగ్ధసాధనం వత్స క్వ వయం వనవాసినః ॥

కృత్స్నభావేన దారిద్ర్యాన్మయా తే భాగ్యహీనయా ।
మిథ్యాదుగ్ధమిదం దత్తం పిష్టమాలోడ్య వారిణా ॥
త్వం మాతులగృహే స్వల్పం పీత్వా స్వాదు పయః శృతమ్ ।
జ్ఞాత్వా స్వాదు త్వయా పీతం తజ్జాతీయమనుస్మరన్ ॥
దత్తం న పయ ఇత్యుక్త్వా రుదన్ దుఃఖీకరోషి మామ్ ।
ప్రసాదేన వినా శంభోః పయస్తవ న విద్యతే ॥
పాదపంకజయోస్తస్య సాంబస్య సగణస్య చ ।
భక్త్యా సమర్పితం యత్తత్కారణం సర్వసంపదామ్ ॥
అధునా వసుదోస్మాభిర్మహాదేవో న పూజితః ।
సకామానాం యథాకామం యథోక్తఫలదాయకః ॥
ధనాన్యుద్దిశ్య నాస్మాభిరితః ప్రాగర్చితశ్శివః ।
అతో దరిద్రాస్సంజాతా వయం తస్మాన్న తే పయః ॥
పూర్వజన్మని యద్దత్తం శివముద్దిశ్య వై సుత ।
తదేవ లభ్యతే నాన్య ద్విష్ణుముద్దిశ్య వా ప్రభుమ్ ॥

స్వర్గమునందు పాతాళమునందు కానవచ్చునవి, రత్నములతో నిండి యుండునవి అగు నదులను భాగ్యము లేనివారు, శివునియందు భక్తి లేనివారు కూడ చూడజాలరు. శివుడు ప్రసన్నుడు కాని వీరికి రాజ్యము, స్వర్గము, మోక్షము మరియు పాలతో కూడిన ఆహారము అను ప్రీతికరమైన వస్తువులు లభించవు. సర్వము శివుని అనుగ్రహముచే లభించునదే గాని, ఇతరదేవతల అనుగ్రహముచే లభించేది కాదు. ఇతర దేవతలయందు నిష్ఠ గలవారు దుఃఖముచే పీడింపబడి పరిభ్రమించెదరు. సర్వదా అడవిలో నివసించే మనకు ఇచట పాలు ఎక్కడనుండి వచ్చును? ఓ వత్సా! పాలు దొరికే ఉపాయము ఎక్కడ? అడవిలో బ్రతికే మనము ఎక్కడ? భాగ్యహీనురాలగు నేను దారిద్ర్యము వలన ఏమియు లేకుండుటచే పిండిని నీటిలో కలిపి పాలు కానీ ఈ పాలను నీకు ఇచ్చితిని. నీవు మావయ్య గారి ఇంట్లో కాచిన తియ్యని పాలను కొద్దిగా త్రాగి యున్నావు. దాని వలన నీరు పాల రుచి తెలిసినది. ఆ రుచిని గుర్తు చేసుకొని, పాలను ఈయలేదని పలికి ఏడుస్తూ నాకు దుఃఖమును కలిగించు చున్నావు. శంభుని అనుగ్రహము లేనిదే నీకు పాలు లభించవు. జగన్మాతతో మరియు గణములతో కూడియున్న ఆ శివుని పాదపద్మముల యందు భక్తితో దేనిని సమర్పిస్తే, అదియే సకలసంపదలకు కారణమగును. పైన చెప్పిన విధముగా కోరికలు గలవారి కోలికలనన్నింటినీ తీర్చి ఫలములను సంపదలను ఇచ్చే మహాదేవుని మనమీనాడు పూజించ లేదు. మనము ఇంతకు ముందు ధనమును ఉద్దేశించి పూజించి యుండలేదు. కావుననే, మనము దరిద్రులమైతిమి, కావున, నీకు పాలు లేవు. ఓ పుత్రా! పూర్వజన్మలో శివుని గాని, విష్ణు ప్రభుని గాని ఉద్దేశించి దేనిని ఇస్తామో అదియే లభించును గాని, మరియొకటి లభించదు.

**వాయురువాచః**

**ఇతి మాతృవచః శ్రుత్వా తథ్యం శోకాదిసూచకమ్ ।**
**బాలోఽప్యనుతపన్నంతః ప్రగల్భమిదమబ్రవీత్ ॥**

వాయువు ఇట్లు పలికెను –

శోకము మొదలగు వాటిని సూచించే యథార్థమగు ఈ తల్లి మాటలను విని ఆతడు బాలకుడే అయిననూ మనస్సు లోపల బాధపడుతూ గంభీరముగా నిట్లనెను.

**ఉపమన్యురువాచః**

**శోకేనాలమితో మాతస్సాంబో యద్యస్తి శంకరః।**
**త్యజ శోకం మహాభాగే సర్వం భద్రం భవిష్యతి ॥**
**శృణు మాతర్వచో మేఽద్య మహాదేవోఽస్తి చేత్క్వచిత్ ।**
**చిరాద్వా హ్యచిరా ద్వాపి క్షీరోదం సాధయామ్యహమ్॥**

ఉపమన్యువు ఇట్లు పలికెను –

అమ్మా! శోకము చాలును. మంగళకరుడగు సాంబుడు ఉన్నచో, సర్వము మంగళము కాగలదు. ఓ మహాత్మురాలా! శోకమును విడిచి పెట్టుము. అమ్మా! ఇప్పుడు నా మాటను వినుము. మహాదేవుడు ఎక్కడైననూ ఉన్నచో, తొందరలో గానీ, ఆలస్యముగా గాని, నేను పాల సముద్రమును సాధించెదను.

**వాయురువాచః**

**ఇతి శ్రుత్వా వచస్తస్య బాలకస్య మహామతేః ।**
**ప్రత్యువాచ తదా మాతా సుప్రసన్నా మనస్వినీ ॥**

వాయువు ఇట్లు పలికెను –

మహాబుద్ధిశాలియగు ఆ బాలకుని మాటలను విని అపుడు అభిమానవతి యగు ఆ తల్లి మిక్కిలి ప్రసన్నురాలై ఇట్లు బదులు చెప్పెను.

**మాతోవాచ।**

**శుభం విచారితం తాత త్వయా మత్ప్రీతివర్ధనమ్ ।**
**విలంబం మా కృథాస్త్వం హి భజ సాంబ సదాశివమ్ ॥**
**సర్వస్మాదధికోఽస్త్యేవ శివః పరమకారణమ్ ।**
**తత్కృతం హి జగత్సర్వం బ్రహ్మాద్యాస్తస్య కింకరాః ॥**
**తత్రసాధకృతైశ్వర్య దాసాస్తస్య వయం ప్రభో ।**
**తం వినాన్యం న జానీమశ్శంకరం లోకశంకరమ్ ॥**
**అన్యాన్ దేవాన్ పరిత్యజ్య కర్మణా మనసా గిరా ।**
**తమేవ సాంబం సగణం భజ భావపురస్సరమ్ ॥**
**తస్య దేవాధిదేవస్య శివస్య వరదాయినః ।**
**సాక్షాన్నమశ్శివాయేతి మంత్రోఽయం వాచకస్స్మృతః ॥**



సప్తకోటిమహామంత్రాస్సర్వే సప్రణవాః పరే ।
తస్మిన్నేవ విలీయంతే పునస్తస్మాద్వినిర్గతాః ॥
సప్రసాదాశ్చ తే మంత్రాస్స్వాధికారాద్యపేక్షయా ।
సర్వాధికారస్త్వేకోఽయం మంత్ర ఏవేశ్వరాజ్ఞయా ॥
యథా నికృష్టానుత్కృష్టాన్ సర్వానప్యాత్మనశ్శివః ।
క్షమతే రక్షితుం తద్వన్మంత్రోఽయమపి సర్వదా ॥
ప్రబలశ్చ తథా హ్యేష మంత్రో మంత్రాంతరాదపి ।
సర్వరక్షాక్షమోఽ ప్యేష నాపరః కశ్చిదిష్యతే ॥
తస్మాన్మంత్రాంతరాం స్త్యక్త్వా పంచాక్షరపరో భవ ।
తస్మిన్ జిహ్వాంతరగతే న కించిదిహ దుర్లభమ్ ॥
అఘోరాస్త్రం చ శైవానాం రక్షాహేతురనుత్తమమ్ ।
తచ్చ తత్ప్రభవం మత్వా తత్పరో భవ నాన్యథా ॥
భస్మేదం తు మయా లబ్ధం పితురేవ తపోత్తమమ్ ।
విరజానలసంసిద్ధం మహావ్యాపన్నివారణమ్ ॥
మంత్రం చ తే మయా దత్తం గృహాణ మదనుజ్ఞయా ।
అనేనైవాశు జప్తేన రక్షా తవ భవిష్యతి ॥

తల్లి ఇట్లు పలికెను –

ఓ పుత్రా! నీవు నాకు ప్రీతిని వర్ధిల్లజేసే విధముగా శుభకరమగు ఆలోచనను చేసితివి. ఆలస్యమును చేయకుము. నీవు జగన్మాతతో కూడియున్న సదాశివునీ నిశ్చయముగా సేవించుము. సర్వకారణకారణుడగు శివుడు అందరికంటే అధికుడు. ఆయనయే జగత్తునంతనూ సృష్టించినాడు. బ్రహ్మ మొదలగు వారు ఆయనకు కింకరులు. మేము ఆ ప్రభుని అనుగ్రహముచే లభించిన ఐశ్వర్యము గలవారము; ఆ ప్రభుని దాసులము. లోకములకు మంగళములను చేయు ఆ శంకరుని విడిచి మేము మరియొకనిని యెరుగము అని వారు చెప్పుదురు. ఇతరదేవతలను విడిచిపెట్టి, గణములతో మరియు. జగన్మాతతో గూడియున్న ఆ శివుని మాత్రమే మనోవాక్కాయ కర్మలతో భక్తిపూర్వకముగా సేవించుము, దేవాధిదేవుడు, వరముల నిచ్చువాడు అగు ఆ శివుని నమశ్శివాయ అను ఈ మంత్రము సాక్షాత్తుగా నిర్దేశించునని చెప్పబడినది, ఇతరములగు ఏడు కోట్ల మహామంత్రములు ఓంకారముతో సహా దానీయందు మాత్రమే విలీనమై మరల దానినుండి ఉద్భవించు చున్నవి. ఆయా మంత్రములు అధికారసంపద మొదలగు అంశములను ఆధారముగా చేసుకొని సాధకులను అనుగ్రహించును. కాని, ఈశ్వరుని ఆజ్ఞచే ఈ ఒక్క మంత్రమునందు మాత్రమే అందరికీ అధికారము గలదు. ఏ విధముగా నైతే ఉత్తములు మరియు అధములు అగు జీవులను అందరినీ కూడ శివుడు రక్షించుటకు సమర్థుడై యున్నాడో, అదే విధముగా ఈ మంత్రము కూడ సర్వకాలములలో సమర్థమగు చున్నది. ఈ మంత్రము ఇతరమంత్రముల కంటే కూడా బలము గలది. అందరినీ రక్షించే సామర్థ్యము గల మంత్రము ఇది తప్ప మరియొకటి అంగీకరింప బడుట లేదు.

కావున, నీవు ఇతరమంత్రములను విడిచి పెట్టి పంచాక్షరమంత్రమునందు నిష్ఠ గలవాడవు కమ్ము. ఆ మంత్రము నాలుక లోపల మెదులుచున్నచో, ఈ లోకములో లభింప శక్యము కానిది ఏదీ ఉండదు. శివభక్తులకు రక్షణనిచ్చే సర్వశ్రేష్ఠమగు సాధనమైన అఘోరాస్త్రము కూడ దానినుండియే పుట్టినదని తెలుసుకొని, దానియందు తత్పరుడవు కమ్ము, మరియొక విధముగా చేయకుము. ఉత్తమమైనది, విరజాహోమముయొక్క అగ్నియందు చక్కగా తయారైనది, గొప్ప ఆపదలను నివారించునది అగు ఈ భస్మను నేను నీ తండ్రి వద్దనుండియే పొందితిని. నేను నీకు మంత్రమును కూడ ఇచ్చితిని. నేను అనుమతి నిచ్చు చున్నాను. దీనిని తీసుకొనుము. దీనిని జపించుట చేతనే నీకు వెంటనే రక్షణ లభించగలదు.

వాయురువాచః

ఏవం మాత్రా సమాదిశ్య శివమస్త్విత్యు దీర్య చ ।
విసృష్టస్తద్వచో మూర్ధ్ని కుర్వన్నేవ తదా మునిః ॥
తాం ప్రణమ్యైవముక్త్వా చ తపః కర్తుం ప్రచక్రమే ।
తమాహ చ తదా మాతా శుభం కుర్వంతు తే సురాః ॥
అనుజ్ఞాతస్తయా తత్ర తపస్తేపే స దుశ్చరమ్ ।
హిమవత్పర్వతం ప్రాప్య వాయుభక్షస్సమాహితః ॥
అష్టేష్టకాభిః ప్రాసాదం కృత్వా లింగం చ మృన్మయమ్ ।
తత్రావాహ్య మహాదేవం సాంబం సగణమవ్యయమ్ ॥
భక్త్యా పంచాక్షరేణైవ పత్రైః పుష్పైర్వనోద్భవైః ।
సమభ్యర్చ్య చిరం కాలం చచార పరమం తపః ॥
తతస్తపశ్చరంతం తం బాలమేకాకినం కృశమ్ ।
ఉపమన్యుం ద్విజవరం శివసంసక్తమానసమ్ ॥
పురా మరీచినా శప్తాః కేచిన్మునిపిశాచకాః।
సంపీడ్య రాక్షసైర్భావైస్తపసో విఘ్నమాచరన్ ॥
స చ తైః పీడ్యమానోఽపి తపః కుర్వన్ కథంచన ।
సదా నమశ్శివాయేతి క్రోశతి స్మార్తనాదవత్ ॥
తన్నాదశ్రవణాదేవ తపసో విఘ్న కారిణః ।
తే తం బాలం సముత్సృజ్య మునయస్సముపాచరన్ ॥
తపసా తస్య విప్రస్య చోపమన్యోర్మహాత్మనః ।
చరాచరం చ మునయః ప్రదీపితమభూజ్జగత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే ఉపమన్యు తపోవర్ణనం నామ చతుస్త్రింశోఽధ్యాయః॥

వాయువు ఇట్లు పలికెను -

తల్లి ఈ విధముగా చక్కగా బోధించి, నీకు మంగళమగుగాక! అని పలికి పంపించేను. అపుడు ఉపమన్యుమహర్షి ఆ మాటను తలపై దాల్చి, ఆమెకు నమస్కరించి, అటులనే యని పలికి తపస్సును చేయుటకు సంసిద్ధుడాయెను. అపుడా తల్లి ఆతనితో, నీకు దేవతలు శుభమును చేయుదురు గాక! అని పలికెను. ఈ విధముగా ఆమె అనుమతిని పొంది ఆతడు హిమవత్పర్వతమునకు వెళ్లి అచట గాలిని భక్షిస్తూ ఏకాగ్రమైన మనస్సుతో చేయ శక్యము కాని తపస్సును చేసెను. ఆతడు ఎనిమిది ఇటుకలతో మందిరమును నిర్మించి మట్టితో లింగమును చేసి దానియందు జగన్మాతతో మరియు గణములతో కూడియున్న అవినాశుడగు మహాదేవుని ఆవాహన చేసి, పంచాక్షరమంత్రమును ఉచ్చరిస్తూ, అడవిలో ఉండే పత్రములతో మరియు పుష్పములతో భక్తిపూర్వకముగా చక్కగా పూజించి చిరకాలము గొప్ప తపస్సును చేసెను. బాలుడు, ఒంటరివాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు అగు ఆ ఉపమన్యుడు శివుని యందు లగ్నమైన మనస్సు గలవాడై తపస్సును చేయుచుండగా, పూర్వములో మరీచిచే శపించబడి పిశాచములై యున్న కొందరు మునులు రాక్షసరూపములతో ఆతనికి చాల బాధను కలిగించి, తపస్సునకు విఘ్నమును చేసిరి. వారు పీడించుచున్ననూ ఆతడు ఏదో విధముగా తపస్సును చేయుచుండెను. ఆతడు అన్ని సమయములలో నమశ్శివాయ అని ఆర్తనాదమును చేయుచున్నవాని వలె ఏడ్చుచుండెను. ఆ నాదమును వింటూనే తపస్సునకు విఘ్నమును చేసే ఆ మునులు ఆ బాలకుని విడిచి పెట్టి వెళ్లిపోయిరి. ఓ మునులారా! మహాత్ముడు, బ్రాహ్మణుడు అగు ఆ ఉపమన్యుని తపస్సుచే చరాచర జగత్తు గొప్ప కాంతితో నిండెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో ఉపమన్యుని తపస్సును వర్ణించే ముప్పది నాల్గవ అధ్యాయము ముగిసినది.

# 35 – ఉపమన్యుడు శివుని వద్దనుండి వరములను పొందుట

వాయురువాచః

అథ సర్వే ప్రదీప్తాంగా వైకుంఠం ప్రయయుర్ద్రుతమ్ ।
ప్రణమ్యాహుశ్చ తత్సర్వం హరయే దేవసత్తమాః ॥
శ్రుత్వా తేషాం తదా వాక్యం భగవాన్ పురుషోత్తమః ।
కిమిదం త్వితి సంచింత్య జ్ఞాత్వా తత్కారణం చ సః ॥
జగామ మందరం తూర్ణం మహేశ్వరదిదృక్షయా ।
దృష్ట్వా దేవం ప్రణమ్యైవం ప్రోవాచ సుకృతాంజలిః ॥

వాయువు ఇట్లు పలికెను –

అపుడు బాగా మండుచున్న అవయవములు గలవారై దేవనాయకులు అందరు వెంటనే వైకుంఠమునకు వెళ్లి విష్ణువునకు నమస్కరించి ఆ వృత్తాంతమునంతనూ చెప్పిరి. పురుషోత్తముడగు ఆ విష్ణుభగవానుడు అపుడు వారి వాక్యమును విని, ఇది ఏమై ఉండును? అని బాగా ఆలోచించి దానికి కారణమును తెలుసుకొని, వెంటనే మహేశ్వరుని చూడాలనే కోరికతో మందరపర్వతమునకు వెళ్లి ఆ దేవుని చూచి చక్కగా చేతులను జోడించి నమస్కరించి ఇట్లు పలికెను.

విష్ణురువాచః

భగవాన్ బ్రాహ్మణః కశ్చిదుపమన్యురితి శ్రుతః ।
క్షీరార్థమదహత్సర్వం తపసా తన్నివారయ ॥

విష్ణువు ఇట్లు పలికెను –

ఓ భగవన్! ఉపమన్యుడను పేరు గల ఒక బ్రాహ్మణుడు పాల కొరకై తపస్సుతో సర్వమును దహించు చున్నాడు. దానిని ఆపుము.

వాయురువాచః

ఇతి శ్రుత్వా వచో విష్ణోః ప్రాహ దేవో మహేశ్వరః ।
శిశుం నివారయిష్యామి తత్త్వం గచ్ఛ స్వమాశ్రమమ్ ॥
తచ్ఛ్రుత్వా శంభువచనం స విష్ణుర్దేవవల్లభః ।
జగామాశ్వాస్య తాన్ సర్వాన్ స్వలోకమమరాదికాన్ ॥
ఏతస్మిన్నంతరే దేవః పినాకీ పరమేశ్వరః ।
శక్రస్య రూపమాస్థాయ గంతుం చక్రే మతిం తతః ॥
అథ జగామ మునేస్తు తపోవనం గజవరేణ సితేన సదాశివః ।
సహ సురాసురసిద్ధ మహోరగైర మరరాజతనుం స్వయమాస్థితః ॥

స వారణశ్చారు తదా విభుం తం నిరీక్ష్య వాలవ్యజనేన దివ్యమ్ ।
దధార శచ్యా సహితం సురేంద్రం కరేణ వామేన సితాతపత్రమ్ ॥
రరాజ భగవాన్ సోమశ్శక్రరూపీ సదాశివః ।
తేనాతపత్రేన యథా చంద్రబింబేన మందరః ॥
ఆస్థాయైవం హి శక్రస్య స్వరూపం పరమేశ్వరః ।
జగామానుగ్రహం కర్తుముపమన్యోస్తదా శ్రమమ్ ॥
తం దృష్ట్వా పరమేశానం శక్రరూపధరం శివమ్ ।
ప్రణమ్య శిరసా ప్రాహ మహామునివరస్స్వయమ్ ॥

వాయువు ఇట్లు పలికెను –

విష్ణువుయొక్క ఈ మాటను విని మహేశ్వరదేవుడు ఇట్లు పలికెను. నేను ఆ బాలకుని ఆపెదను. కావున, నీవు నీ ఆశ్రమమునకు వెళ్లుము. శంభుని ఆ మాటను విని దేవనాయకుడగు ఆ విష్ణువు దేవతలు మొదలగు వారినందరినీ ఓదార్చి తన లోకమునకు వెళ్లాను. ఇంతలో ప్రకాశస్వరూపుడు, పినాకమును ధరించినవాడు అగు పరమేశ్వరుడు అపుడు ఇంద్రుని రూపమును దాల్చి వెళ్లుటకు నిశ్చయించెను. అపుడు సదాశివుడు స్వయముగా దేవేంద్రుని రూపమును ధరించి దేవతలు, రాక్షసులు, సిద్ధులు, గొప్ప నాగులు అను వారితో గూడి తెల్లని గొప్ప ఏనుగుపై ఆ మునియొక్క తపోవనమునకు వెళ్లెను. అపుడు ఆ ఏనుగు శచీదేవితో గూడి చక్కగా ప్రకాశించే ఆ దేవేంద్రప్రభుని అందముగా వింజామరలతో వీచుచూ, సుందరమగు తుండముతో తెల్లని గొడుగును పట్టెను. ఉమాదేవితో గూడియున్న సదాశివభగవానుడు ఇంద్రుని రూపమును దాల్చినవాడై ఆ గొడుగుతో చంద్రబింబముతో కూడియున్న మందరపర్వతము వలె ప్రకాశించెను. పరమేశ్వరుడు ఈ విధముగా ఇంద్రుని రూపమును దాల్చి ఉపమన్యుని అనుగ్రహించుటకై ఆయన ఆశ్రమమునకు వెళ్లెను. పరమేశ్వరుడు, ఇంద్రరూపమును దాల్చి యున్నవాడు అగు ఆ శివుని చూచి, ఆ మహర్షి తలను వంచి నమస్కరించి స్వయమ గా ఇట్లు పలికెను.

**ఉపమన్యురువాచః**

పావితశ్చా శ్రమస్సోఽయం మమ దేవేశ్వర స్వయమ్ ।
ప్రాప్తో యత్త్వం జగన్నాథ భగవన్ దేవసత్తమ ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

ఓ దేవేంద్రా! నీవు స్వయముగా వచ్చుటచే నా ఈ ఆశ్రమము పవిత్రమైనది. ఓ జగన్నాథా! భగవాన్! నీవు దేవతలలో శ్రేష్ఠుడవు.

వాయురువాచః

ఏవముక్త్వా స్థితం ప్రేక్ష్య కృతాంజలిపుటం ద్విజమ్ ।
ప్రాహ గంభీరయా వాచా శక్రరూపధరో హరః ॥

వాయువు ఇట్లు పలికెను -

ఈ విధముగా పలికి చేతులను జోడించి నిలబడియున్న బ్రాహ్మణుని చూచి ఇంద్రుని రూపములోనున్న శివుడు గంభీరమగు వాక్కుతో నిట్లనెను.

శక్ర ఉవాచః

తుష్టోఽస్మి తే వరం బ్రూహి తపసానేన సువ్రత ।
దదామి చేప్సితాన్ సర్వాన్ ధౌమ్యాగ్రజ మహామునే ॥

ఇంద్రుడు ఇట్లు పలికెను -

ఓ గొప్ప వ్రతము గల మహర్షీ! నీవు ధౌమ్యుని అన్నగారివి. నీ ఈ తపస్సునకు నేను సంతసించితిని. నీ కోరికలను అన్నింటినీ ఇచ్చెదను. వరమును కోరుకొనుము.

వాయురువాచః

ఏవముక్తస్తదా తేన శక్రేణ మునిపుంగవః ।
వరయామి శివే భక్తిమిత్యువాచ కృతాంజలిః ॥
తన్నిశమ్య హరిః ప్రాహ మాం న జానాసి లేఖపమ్ ।
త్రైలోక్యాధిపతిం శక్రం సర్వదేవనమస్కృతమ్ ॥
మద్భక్తో భవ విప్రర్షే మామేవార్చయ సర్వదా ।
దదామి సర్వం భద్రం తే త్యజ రుద్రం చ నిర్గుణమ్ ॥
రుద్రేణ నిర్గుణేనాపి కిం తే కార్యం భవిష్యతి ।
దేవపంక్తిబహిర్భూతో యః పిశాచత్వమాగతః ॥
తచ్ఛ్రుత్వా ప్రాహ స మునిర్జపన్ పంచాక్షరం మనుమ్ ।
మన్యమానో ధర్మవిఘ్నం ప్రాహ తం కర్తుమాగతమ్ ॥

వాయువు ఇట్లు పలికెను -

ఆ ఇంద్రుడు ఇట్లు పలుకగా అపుడు మహర్షి చేతులను జోడించి, నేను శివునియందు భక్తిని కోరుచున్నాను అని పలికెను. ఆ మాటను విని ఇంద్రుడు ఇట్లనెను. నీవు నన్ను యెరుగవు. నేను దేవప్రభుడనగు ఇంద్రుడను; ముల్లోకములకు అధిపతిని. దేవతలు అందరు నన్ను నమస్కరించెదరు. ఓ బ్రాహ్మణ- ఋషీ! నా భక్తుడవు కమ్ము. సర్వకాలములలో నన్నే పూజించుము. నేను సర్వమును ఇచ్చెదను. నీకు మంగళమగు గాక! నిర్గుణుడగు రుద్రుని విడిచి పెట్టుము. నిర్గుణుడు, దేవతల పంక్తినుండి బహిష్కరించ బడినవాడు, పిశాచత్వమును పొందినవాడు అగు రుద్రునితో కూడ నీకు పని యేముండును? ఆ మాటను విని ఆ ముని పంచాక్షరమంత్రమును జపిస్తూ ఆతడు ధర్మమునకు విఘ్నమును చేయుటకు వచ్చిన వాడని తలంచి వానితో నిట్లనెను.

ఉపమన్యురువాచః

త్వయైవం కథితం సర్వం భవనందారతేన వై।
ప్రసంగాదేవ దేవస్య నిర్గుణత్వం మహాత్మనః ॥
త్వం న జానాసి వై రుద్రం సర్వదేవేశ్వరేశ్వరమ్ ।
బ్రహ్మవిష్ణుమహేశానాం జనకం ప్రకృతేః పరమ్ ॥
సదసద్వ్యక్తమవ్యక్తం యమాహుర్బ్రహ్మవాదినః ।
నిత్యమేకమనేకం చ పరం తస్మాద్వృణే మ్యహమ్ ॥
హేతువాదవినిర్ముక్తం సాంఖ్యయోగార్థదం పరమ్ ।
ఉపాసతే తం తత్త్వజ్ఞా వరం తస్మాద్వృణోమ్యహమ్ ॥
నాస్తి శంభోః పరం తత్త్వం సర్వకారణకారణాత్ ।
బ్రహ్మవిష్ణ్వాదిదేవానాం స్రష్టుర్గుణపరాద్విభోః ॥
బహునాత్ర కిముక్తేన మయాద్యానుమితం మహత్ ।
భవాంతరే కృతం పాపం శ్రుతా నిందా భవస్య చేత్ ॥
శ్రుత్వా నిందాం భవస్యాథ తత్క్షణాదేవ సంత్యజేత్।
స్వదేహం తన్నిహత్యాశు శివలోకం స గచ్ఛతి ॥
ఆస్తాం తావన్మమేచ్ఛేయం క్షీరం ప్రతి సురాధమ ।
నిహత్య త్వాం శివాస్త్రేణ త్యజామ్యేతం కలేవరమ్ ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను -

శివుని నిందించుటయందు ప్రీతి గల నీవు ఈ విధముగా అంతనూ చెప్పియుంటివి. ప్రసంగవశముననే నీవు మహాత్ముడగు ఆ దేవుని నిర్గుణత్వమును కూడ చెప్పితివి. దేవనాయకులకు అందరికీ నియంత, బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు తండ్రి, ప్రకృతికి అతీతమైనవాడు అగు రుద్రుని గురించి నీవు యేరుంగవు. కారణరూపములో అవ్యక్తుడైన ఏ శివుడు కార్య జగద్రూపములో వ్యక్తమైనాడో, బ్రహ్మవేత్తలు ఎవనిని నిత్యుడు, ఒక్కడు, అనేకుడు అని వర్ణించు చున్నారో, అట్లే శివునినుండి నేను వరమును కోరెదను. హేతువాదమునకు అతీతుడు, జ్ఞానయోగ కర్మయోగముల ఫలమునిచ్చువాడు, సర్వోత్కృష్టుడు అగు ఏ శివుని తత్త్వవేత్తలు ఉపాసించు చున్నారో, ఆయననుండియే నేను వరమును కోరుచున్నాను. సర్వకారణకారణుడు, బ్రహ్మ విష్ణువు మొదలగు దేవతలను సృష్టించినవాడు, సత్త్వరజస్తమోగుణములకు అతీతుడు, సర్వవ్యాపకుడు అగు శంభుని కంటే గొప్ప తత్త్వము మరియొకటి లేదు. ఈ విషయములో ఇన్ని మాటలను పలుకనేల? నేనీ నాడు శివుని నిందను వినినాను గనుక పూర్వజన్మలో మహాపాపమును చేసియుందునని ఊహించుచున్నాను. ఎవడైతే శివుని నిందను విని వెనువెంటనే ఆ నిందించినవానిని సంహరించి, తాను ప్రాణములను విడుచునో, వాడు వెంటనే శివలోకమును పొందును. ఓ దేవతాధమా! నాకు పాలపై గల ఈ కోరిక అటులనే ఉండుగాక! నేను నిన్ను శివాస్త్రముతో సంహరించి ఈ దేహమును విడిచెదను.

వాయురువాచః

ఏవముక్త్వోపమన్యుస్తం మర్తుం వ్యవసితస్స్వయమ్ ।
క్షీరే వాంఛమపి త్యక్త్వా నిహంతుం శక్రముద్యతః ॥
భస్మాదాయ తదా ఘోరమ ఘోరాస్త్రా భిమంత్రితమ్ ।
విసృజ్య శక్రముద్దిశ్య ననాద స మునిస్తదా ॥
స్మృత్వా శంభుపదద్వంద్వం స్వదేహం దగ్ధుముద్యతః ।
ఆగ్నేయీం ధారణాం బిభ్రదుపమన్యురవస్థితః ॥
ఏవం వ్యవసితే విప్రే భగవాన్ భగనేత్రహా ।
వారయామాస సౌమ్యేన ధారణాం తస్య యోగినః ॥
తద్విసృష్టమఘోరాస్త్రం నందీశ్వరనియోగతః ।
జగృహే మధ్యతః క్షిప్రం నందీ శంకరవల్లభః ॥
స్వం రూపమేవ భగవానాస్థాయ పరమేశ్వరః ।
దర్శయామాస విప్రాయ బాలేందుకృతశేఖరమ్ ॥
క్షీరార్ణవసహస్రం చ పీయూషార్ణవమేవ వా ।
దధ్యాదేరర్ణవాంశ్చైవ ఘృతో దార్ణవమేవ చ ॥
ఫలార్ణవం చ బాలస్య భక్ష్యభోజ్యార్ణవం తథా ।
అపూపానాం గిరిం చైవ దర్శయామాస స ప్రభుః ॥
ఏవం స దదృశే దేవో దేవ్యా సార్ధం వృషోపరి ।
గణేశ్వరైస్త్రి శూల్యాద్యైర్దివ్యాస్త్రై రపి సంవృతః ॥
దివి దుందుభయో నేదుః పుష్పవృష్టిః పపాత చ ।
విష్ణు బ్రహ్మేంద్రప్రముఖైర్దేవైశ్ఛన్నా దిశో దశ ॥
అథోపమన్యురానంద సముద్రోర్మిభిరావృతః ।
పాత దండవద్భూమౌ భక్తినమ్రేణ చేతసా ॥
ఏతస్మిన్ సమయే తత్ర సస్మితో భగవాన్ భవః ।
ఏహ్యేహీతి తమాహూయ మూర్ధ్న్యుపాఘ్రాయ దదౌ వరాన్॥

వాయువు ఇట్లు పలికెను --

ఉపమన్యువు ఈ విధముగా పలికి స్వయముగా తాను మరణించుటకు నిశ్చయించుకొని, పాలయందు కోరికను కూడ విడిచి పెట్టి, ఇంద్రుని సంహరించుటకు ఉద్యుక్తుడయ్యెను. అపుడు ఆ ముని భయంకరమగు భస్మను తీసుకొని అఘోరాస్త్రముతో అభిమంత్రించి ఇంద్రుని ఉద్దేశించి దానిని విడిచిపెట్టి తరువాత నాదమును చేసెను, ఉపమన్యుడు శివుని పాదములను రెండింటినీ స్మరించి అగ్నిని మనస్సులో ధ్యానించి దానితో తన దేహమును దహించుటకు సంసిద్ధుడుగా నుండెను. ఆ బ్రాహ్మణుడు ఇట్లు సిద్ధపడుచుండగా, భగుని నేత్రములను ఊడబెరకిన ఆ భగవానుడు ఆ యోగియొక్క మానసికధారణను తన సౌమ్యదృష్టితో నివారించేను. వానిచే విడువబడిన అఘోరాస్త్రమును నందీశ్వరుని

ఆజ్ఞచే శంకరునకు ప్రియుడగు నంది వెంటనే మధ్యలో పట్టుకొనెను. పరమేశ్వర భగవానుడు చంద్రవంకతో అలంకరింపబడిన శిరస్సు గల తన రూపమును స్వీకరించి ఆ బ్రాహ్మణునకు ఆ రూపమును చూపించెను. ఆ ప్రభుడు ఆ బాలకునకు వేయి పాల సముద్రములను, అమృతసముద్రమును, పెరుగు సముద్రములను, నేతి సముద్రమును, నీటి సముద్రమును, ఫలరస సముద్రమును, భక్ష్యభోజ్యముల సముద్రమును, అప్పముల పర్వతమును కూడ చూపించెను. ఈ విధముగా దేవితో కూడియున్న ఆ దేవుడు గణాధ్యక్షులచే మరియు త్రిశూలము మొదలగు దివ్యాస్త్రములతో చుట్టు వారబడి యున్నవాడై నందీశ్వరునిపై కానవచ్చెను. దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము కురిసెను. విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలతో పది దిక్కులు నిండి పోయినవి. అపుడు ఉపమన్యుడు ఆనందసముద్రములో నోలలాడుచున్నవాడై భక్తితో నమ్రమైన మనస్సుతో భూమిపై దండము వలె పడి నమస్కరించెను. అదే సమయములో అచట శివ భగవానుడు చిరునవ్వుతో రమ్ము, రమ్ము అని వానిని పిలిచి నుదుటిపై ముద్దిడి వరముల నీచ్చెను.

**శివ ఉవాచః**

**భక్ష్యభోజ్యాన్ యథాకామం బాంధవైర్భుంక్ష్వ సర్వదా ।**
**సుఖీ భవ సదా దుఃఖాన్నిర్ముక్తో భక్తిమాన్మమ ॥**
**ఉపమన్యో మహాభాగ తవాంబైషా హి పార్వతీ ।**
**మయా పుత్రీకృతో హ్యద్య దత్తః క్షీరోదకార్ణవః ॥**
**మధునశ్చార్ణవశ్చైవ దధ్యన్నార్ణవ ఏవ చ ।**
**ఆజ్యోదనార్ణవశ్చైవ ఫలాద్యర్ణవ ఏవ చ ॥**
**అపూపగిరయశ్చైవ భక్ష్యభోజ్యార్ణవస్తథా ।**
**ఏతే దత్తా మయా తే హి త్వం గృహ్ణీష్వ మహామునే ॥**
**పితా తవ మహాదేవో మాతా వై జగదంబికా ।**
**అమరత్వం మయా దత్తం గాణపత్యం చ శాశ్వతమ్ ॥**
**వరాన్ వరయ సుప్రీత్యా మనోఽభిలషితాన్ పరాన్ ।**
**ప్రసన్నోఽహం ప్రదాస్యామి నాత్ర కార్యా విచారణా ॥**

శివుడు ఇట్లు పలికెను –

భక్ష్యములను, భోజ్యములను యథేచ్ఛగా సర్వకాలములలో బంధువులతో కలిసి భుజించుము. సర్వదా నాయందు భక్తి గలవాడవై దుఃఖమునుండి విముక్తుడవై సుఖమును పొందుము. ఓ ఉపమన్యూ! మహాత్మా! ఈ పార్వతి నీకు తల్లి. ఈనాడు నేను నిన్ను పుత్రునిగా స్వీకరించు చున్నాను. నేను నీకు పాలు, నీరు, తేనె, పెరుగు అన్నము, నేయి, అన్నము, పండ్ల రసములు మొదలగు వాటి సముద్రములను, అప్పముల పర్వతములను, భక్ష్యభోజ్యముల సముద్రమును ఇచ్చినాను. ఓ మహర్షీ! నీవు వీటిని తీసుకొనుము. నీకు మహాదేవుడు తండ్రి; జగదంబ తల్లి. నేను నీకు అమృతత్వమును, శాశ్వతమగు గణాధ్యక్ష పదమును ఇచ్చినాను. ఇంకనూ నీ మనస్సునకు నచ్చిన వరములను

మిక్కిలి ప్రీతితో కోరుకొనుము. ప్రసన్నుడనైన నేను ఇచ్చెదను. ఈ విషయములో నీవు ఆలోచించకుము.

**వాయురువాచః**

**ఏవముక్త్వా మహాదేవః కరాభ్యాముప గృహ్య తమ్ ।**
**మూర్ధ్న్యాఘ్రాయ సుతస్తేయమితి దేవ్యై న్యవేదయత్ ॥**
**దేవీ చ గుహవత్ప్రీత్యా మూర్ధ్ని తస్య కరాంబుజమ్ ।**
**విన్యస్య ప్రదదౌ తస్మై కుమారపదమవ్యయమ్ ॥**
**క్షీరాబ్ధిరపి సాకారః క్షీరం స్వాదు కరే దధత్ ।**
**ఉపస్థాయ దదౌ పిండీభూతం క్షీరమనశ్వరమ్ ॥**
**యోగైశ్వర్యం సదా తుష్టిం బ్రహ్మవిద్యామనశ్వరామ్ ।**
**సమృద్ధిం పరమాం తస్మై దదౌ సంతుష్టమానసః ॥**
**అథ శంభుః ప్రసన్నాత్మా దృష్ట్వా తస్య తపోమహః ।**
**పునర్దదౌ వరం దివ్యం మునయే హ్యుపమన్యవే ॥**
**వ్రతం పాశుపతం జ్ఞానం వ్రతయోగం చ తత్త్వతః ।**
**దదౌ తస్మై ప్రవక్తృత్వపాటవం సుచిరం పరమ్ ॥**
**సోఽపి లబ్ధ్వా వరాన్ దివ్యాన్ కుమారత్వం చ సర్వదా ।**
**తస్మాచ్ఛివాచ్చ తస్యాశ్చ శివాయా ముదితోఽభవత్ ॥**
**తతః ప్రసన్నచేతస్కస్సు ప్రణమ్య కృతాంజలిః ।**
**యయాచే స వరం విప్రో దేవదేవాన్మహేశ్వరాత్ ॥**

వాయువు ఇట్లు పలికెను –

మహాదేవుడు ఇట్లు పలికి, వానిని చేతులతో దగ్గరకు తీసుకొని, నుదుటిపై ముద్దిడి, ఈతడు నీకు పుత్రుడు అని దేవికి విన్నవించెను. దేవి కూడ కుమారస్వామిని వలెనే ప్రేమతో వాని తలపై పద్మమువంటి తన చేతిని ఉంచి వానికి శాశ్వతమగు కుమారపదమును ఇచ్చెను. పాల సముద్రము కూడ రూపమును దాల్చి తియ్యని పాలను చేతిలో పట్టుకొని దగ్గరకు వచ్చి, చెడిపోని విధముగా ముద్ద చేయబడిన పాలను ఇచ్చెను. సంతోషముతో నిండిన మనస్సు గల శివుడు అతనికి యోగసిద్ధిని, నిత్యమగు ఆనందమును, శాశ్వతమగు బ్రహ్మవిద్యను, సర్వోత్కృష్టమగు సంపదను ఇచ్చెను. తరువాత ప్రసన్నమగు మనస్సుగల శంభుడు వాని తపస్సుయొక్క తేజస్సును చూచి, మరల ఆ ఉపమన్యుమహర్షికి దివ్యమగు వరమునిచ్చెను. పాశుపత వ్రతమును, దాని జ్ఞానమును, తత్త్వ దృష్టిలో వ్రతము యొక్క జ్ఞానమును, చాలకాలము ప్రవచనము చెప్పగలిగే గొప్ప పాటవమును ఇచ్చెను. ఆ ఉపమన్యుడు కూడా ఆ పార్వతీపరమేశ్వరుల నుండి దివ్యములగు వరములను, శాశ్వతమగు కుమారపదమును పొంది ఆనందించెను. తరువాత ప్రసన్నమగు మనస్సు గల ఆ బ్రాహ్మణుడు చేతులను జోడించి చక్కగా నమస్కరించి దేవదేవుడగు మహేశ్వరునినుండి వరమును కోరెను.

**ఉపమన్యురువాచః**

**ప్రసీద దేవదేవేశ ప్రసీద పరమేశ్వర ।**

**స్వభక్తిం దేహి పరమాం దివ్యామవ్యభిచారిణీమ్ ॥**

**శ్రద్ధాం దేహి మహాదేవ స్వసంబంధిషు మే సదా ।**

**స్వదాస్యం పరమం స్నేహం సాన్నిధ్యం చైవ సర్వదా ॥**

**ఏవముక్త్వా ప్రసన్నాత్మా హర్షగద్గదయా గిరా ।**

**స తుష్టావ మహాదేవముపమన్యుర్ద్విజోత్తమః ॥**

**దేవదేవ మహాదేవ శరణాగతవత్సల।**

**ప్రసీద కరుణాసింధో సాంబ శంకర సర్వదా ॥**

ఉపమన్యువు ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! ఈశా! పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము. సర్వోత్కృష్టమైనది, దివ్యమైనది, అచంచలమైనది అగు నీయందలి భక్తిని ఇమ్ము. ఓ మహాదేవా! సర్వకాలములలో నీకు సంబంధించిన వారియందు నాకు శ్రద్ధను ఇమ్ము నీయందు దాస్య భావమును, సర్వోత్కృష్టమగు ప్రేమను, శాశ్వతమగు సన్నిధిని కూడ ఇమ్ము. బ్రాహ్మణశ్రేష్ఠుడగు ఆ ఉపమన్యుడు ఇట్లు పలికి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆనందముతో బొంగురు పోయిన కంఠముతో మహాదేవుని స్తుతించెను. ఓ దేవదేవా! మహాదేవా! శరణు జొచ్చిన వారియందు ప్రేమ గల వాడా! దయాసముద్రా! జగన్మాతతో కూడి యున్నవాడా! శంకరా! సర్వదా ప్రసన్నుడవు కమ్ము.

**వాయురువాచః**

**ఏవముక్తో మహాదేవస్సర్వేషాం చ వరప్రదః ।**

**ప్రత్యువాచ ప్రసన్నాత్మోపమన్యుం మునిసత్తమమ్ ॥**

వాయువు ఇట్లు పలికెను -

అందరికీ వరములనిచ్చే మహాదేవుడు ఇట్లు పలుకబడిన వాడై ప్రసన్నమగు మనస్సు గలవాడై ఉపమన్యుమహర్షికి ఇట్లు బదులిడెను.

శివ ఉవాచః

వత్సోపమన్యో తుష్టోఽస్మి సర్వం దత్తం మయా హాతే।
దృఢభక్తోఽసి విప్రర్షే మయా జిజ్ఞాసితో హ్యసి ॥
అజరశ్చామరశ్చైవ భవ త్వం దుఃఖవర్జితః ।
యశస్వీ తేజసా యుక్తో దివ్యజ్ఞాన సమన్వితః ॥
అక్షయా బాంధవాశ్చైవ కులం గోత్రం చ తే సదా ।
భవిష్యతి ద్విజశ్రేష్ఠ మయి భక్తిశ్చ శాశ్వతీ ॥
సాన్నిధ్యం చాశ్రమే నిత్యం కరిష్యామి ద్విజోత్తమ ।
ఉపకంఠం మమ త్వం వై సానందం విహరిష్యసి ॥
ఏవముక్త్వా స భగవాన్ సూర్యకోటిసమప్రభః ।
ఈశానస్స వరాన్ దత్త్వా తత్రై వాంతర్దధే హరః ॥
ఉపమన్యుః ప్రసన్నాత్మా ప్రాప్య తస్మాద్వరాద్వరాన్ ।
జగామ జననీస్థానం సుఖం ప్రాపాధికం చ సః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పూర్వఖండే ఉపమన్యు చరితవర్ణనం నామ పంచత్రింశోఽధ్యాయః॥

॥ సమాప్తోఽయం సప్తమ్యాం వాయవీయసంహితాయాం పూర్వఖండః ॥

శివుడు ఇట్లు పలికెను –

ఓ వత్సా! ఉపమన్యూ! నేను సంతోషించితి నీకు సర్వమును ఇచ్చితిని. ఓ బ్రాహ్మణ – ఋషీ ! నీవు దృఢమగు భక్తి గలవాడవు. నేను నిన్ను పరీక్షించ గోరితిని. నీవు జరామరణములు లేనివాడవు, దుఃఖవిముక్తుడవు, యశశ్శాలివి, తేజశ్శాలివి, దివ్యజ్ఞానముతో కూడియుండు వాడవు కమ్ము. నీ బంధువులు వినాశమును పొందరు. నీ కులము, గోత్రము శాశ్వతముగా అక్షయముగా నుండగలదు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీకు నాయందు శాశ్వతమగు భక్తి ఉండగలదు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీ ఆశ్రమములో నేను నిత్యము సన్నిహితుడనై ఉండగలను. నీవు నా సన్నిధిలో ఆనందముగా విహరించ గలవు (63). ఇట్లు పలికి కోటి సూర్యులు కాంతి గలవాడు, సర్వమును శాసించువాడు అగు ఆ హరభగవానుడు వరములనిచ్చి అచటనే అంతర్ధానమును చెందెను. ఆ ఉపమన్యుడు ఆ గొప్ప దైవమునుండి వరములను పొంది ప్రసన్నమగు మనస్సు గలవాడై తల్లి ఉన్న స్థానమునకు వెళ్లి అధికమగు సుఖమును పొందెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు పూర్వఖండలో ఉపమన్యుని వృత్తాంతమును వర్ణించే ముప్పది అయిదవ అధ్యాయము ముగిసినది.

ఏడవదియగు వాయవీయసంహితలో పూర్వఖండము ముగిసినది.

॥ శ్రీకృష్ణార్పణమస్తు ॥

॥ శ్రీ సాంబ సదా శివార్పణమస్తు ॥

# వాయవీయసంహితా – ఉత్తరఖండః

## 1 – శ్రీకృష్ణునకు శివుడు వరమునిచ్చుట

|| అథ సప్తమ్యాం వాయవీయసంహితాయాముత్తరఖండః ప్రారభ్యతే ||

ఓం నమస్సమస్తసంసారచక్రభ్రమణ హేతవే ।
గౌరీకుచతటద్వంద్వకుంకుమాంకిత వక్షసే ॥

ఇపుడు ఏడవదియగు వాయవీయసంహితయందు ఉత్తరఖండము ఆరంభింప బడు(చు)చున్నది. సకలసంసారము అనే చక్రము తిరుగుటకు కారణమైనవాడు, పార్వతీదేవి యొక్క స్తనద్వంద్వమునందలి కుంకుమచే చిహ్నితమైన వక్షఃస్థలము గలవాడు అగు పరమేశ్వరునకు నమస్కారము.

**సూత ఉవాచః**

ఉక్త్వా భగవతో లబ్ధప్రసాదాదుపమన్యునా ।
నియమాదుత్థితో వాయుర్మధ్యే ప్రాప్తే దివాకరే ॥
ఋషయశ్చాపి తే సర్వే నైమిషారణ్యవాసినః ।
అథాయమర్థః ప్రష్టవ్య ఇతి కృత్వా వినిశ్చయమ్ ॥
కృత్వా యథా స్వకం కృత్యం ప్రత్యహం తే యథా పురా ।
భగవంతముపాయాంతం సమీక్ష్య సముపావిశన్ ॥
అథాసౌ నియమస్యాంతే భగవానంబరోద్భవః ।
మధ్యే మునిసభాయాస్తు భేజే క్లుప్తం వరాసనమ్ ॥
సుఖాసనోపవిష్టశ్చ వాయుర్లోక నమస్కృతః ।
శ్రీమద్విభూతిమీశస్య హృది కృత్వేదమబ్రవీత్ ॥
తం ప్రపద్యే మహాదేవం సర్వజ్ఞమ పరాజితమ్ ।
విభూతిస్సకలం యస్య చరాచరమిదం జగత్ ॥
ఇత్యాకర్ణ్య శుభాం వాణీమృషయః క్షీణకల్మషాః ।
విభూతివిస్తరం శ్రోతుమూచుస్తే పరమం వచః ॥

సూతుడు ఇట్లు పలికెను –

పరమేశ్వరుని అనుగ్రహమును పొందిన ఉపమన్యుని వృత్తాంతమును చెప్పిన తరువాత, సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చియున్న మధ్యాహ్న సమయములో నియమానుష్ఠానము కారణముగా వాయు దేవుడు అక్కడనుండి లేచెను. నైమిషారణ్యమునందు నివసించే ఆ ఋషులు అందరు కూడా, ఈ పైన మనమీ విషయమును ప్రశ్నించవలెను అని నిశ్చయించుకొని, పూర్వములో ప్రతిదినము తాము ఏయే కృత్యములను చేసుకొనెడి వారో యదరో, ఆ పనులను పూర్తిచేసుకొని, దగ్గరకు వచ్చుచున్న వాయుభగవానుని గాంచి కూర్చుండిరి. ఈ వాయుభగవానుడు తన నిత్యానుష్ఠానమును పూర్తి చేసుకున్న పిదప మునుల

సభలో మధ్యలో ఏర్పాటు చేయబడిన గొప్ప ఆసనమునందు కూర్చుండెను. లోకములలో పూజలనందుకొనే వాయువు సుఖకరమగు ఆసనమునందు కూర్చుండి పరమేశ్వరుని శోభాయుక్తమగు విభూతి (మహిమ ప్రకటనము) ని మనస్సులో భావన చేసి ఇట్లు పలికెను. సర్వము తెలిసిన వాడు, పరాజయమునెరుంగని వాడు అగు ఆ మహాదేవుని శరణు పొందుచున్నాను. ఈ చరాచరజగత్తు అంతయు ఆయన విభూతియే, నశించిన పాపములు గల ఋషులు ఈ శుభకరమగు మాటను విని ఆ విభూతియొక్క వివరములను వినుట కొరకే శ్రేష్ఠమగు వచనమును ఇట్లు పలికిరి.

ఋషయ ఊచుః ।

ఉక్తం భగవతా వృత్తముపమన్యోర్మహాత్మనః ।
క్షీరార్థేనాదీ తపసా యత్ప్రాప్తం పరమేశ్వరాత్ ॥
దృష్టో ఒసౌ వాసుదేవేన కృష్ణనాక్లిష్టకర్మణా ।
ధౌమ్యా గ్రజస్తతస్తేన కృత్వా పాశుపతం వ్రతమ్ ॥
ప్రాప్తం చ పరమం జ్ఞానమతి ప్రాగేవ శుశ్రుమ ।
కథం స లబ్ధవాన్ కృష్ణో జ్ఞానం పాశుపతం పరమ్ ॥

పూజ్యుడవగు నీవు మహాత్ముడగు ఉపమన్యుని వృత్తాంతమును, అతడు పాల కొరకై తపస్సును చేసి పరమేశ్వరుని నుండి పొందిన వివిధ వరములను గురించి చెప్పియుంటివి, వసుదేవుని కుమారుడు, కఠినకార్యములను కూడా అనాయాసముగా చేయువాడు అగు శ్రీకృష్ణుడు ధౌమ్యుని అన్నగారగు ఈ ఉపమన్యుని దర్శించినాడనియు, ఆ కారణముగా తరు వాత ఆయన పాశుపత వ్రతమును చేసి, పరమజ్ఞానమును పొందినాడనియు ఇదివరకే వినియుంటిమి. ఆ శ్రీకృష్ణుడు సర్వోత్కృష్టమగు పాశుపత జ్ఞానమును పొందిన విధమెట్టిది?

వాయురువాచః

స్వేచ్ఛయా హ్యవతీర్ణోపి వాసుదేవస్సనాతనః ।
నిందయన్నివ మనుష్యం దేహశుద్ధిం చకార సః ॥
పుత్రార్థం హి తపస్తప్తుం గతస్తస్య మహామునేః ।
ఆశ్రమం మునిభిర్దృష్టం దృష్టవాంస్తత్ర వై మునీమ్ ॥
భస్మావదాత సర్వాంగం త్రిపుండ్రాంకిత మస్తకమ్ ।
రుద్రాక్షమాలాభరణం జటామండల మండితమ్ ॥
తచ్ఛిష్య భూతైర్మునిభిశ్శాస్త్రైర్వేద మివావృతమ్ ।
శివధ్యానరతం శాంతముపమన్యుం మహాద్యుతిమ్ ॥
నమశ్చకార తం దృష్ట్వా హృష్టసర్వతనూరుహః ।
బహుమానేన కృష్ణో ఒసౌ త్రిః కృత్వా తు ప్రదక్షిణమ్ ।
స్తుతిం చకార సుప్రీత్యా నతస్కంధః కృతాంజలిః ॥
తస్యావలోకనాదేవ మునేః కృష్ణస్య ధీమతః ।
నష్టమాసీన్మలం సర్వం మాయాజం కార్మమేవ చ ॥

తతః క్షీణమలం కృష్ణముపమన్యుర్యథావిధి ।
భస్మనోద్ధూల్య తం మంత్రైరగ్నిరిత్యాదిభిః క్రమాత్ ॥
అథ పాశుపతం సాక్షా ద్వ్రతం ద్వాదశమాసికమ్ ।
కారయిత్వా మునిస్తస్మై ప్రదదౌ జ్ఞానముత్తమమ్ ॥
తదా ప్రభృతి తం కృష్ణం మునయశ్శంసిత వ్రతాః ।
దివ్యాః పాశుపతాస్సర్వే పరివృత్యో పతస్థిరే ॥
తతో గురునియోగాద్వై కృష్ణః పరమశక్తిమాన్ ।
తపశ్చకార పుత్రార్థం సాంబముద్దిశ్య శంకరమ్ ॥

వాయువు ఇట్లు పలికెను –

సనాతనుడగు ఆ వాసుదేవుడు తన ఇచ్ఛచేతనే అవతరించిన వాడైననూ మనుష్య జన్మను నిం◌ందించుచున్నాడా యన్నట్లు దేహమునకు శుద్ధిని చేసుకొనేను, ఆయన పుత్రుల కొరకు తపస్సును చేయుటకై మహర్షులచే దర్శింపబడే ఆ మహాముని యొక్క ఆశ్రమమునకు వెళ్లి, అక్కడ ఆ మునిని చూచెను. భస్మముచే తెల్లగా ప్రకాశించే సకలావయవములు గలవాడు, త్రిపుండ్రము దిద్దబడిన లలాటము, గలవాడు, రుద్రాక్షమాలలే ఆభరణములుగా గలవాడు, జటామండలముచే ప్రకాశించువాడు, శాస్త్రములచే వేదము వలె తన శిష్యులగు మునులచే చుట్టువారబడి యుండువాడు, శివుని ధ్యానించుటయందు ప్రీతి గలవాడు, శాంతస్వభావము గలవాడు, గొప్ప కాంతి గలవాడు అగు ఆ ఉపమన్యుని దర్శించి నమస్కరించి, ఆనందముతో దేహమంతయు గగుర్పాటు గలవాడై, ఈ శ్రీకృష్ణుడు ఆదరముతో మూడు సార్లు ప్రదక్షిణమును చేసి, నడుమును వంచి చేతులను జోడించి పరమప్రీతితో స్తోత్రమును చేసెను. ఆ మహర్షి యొక్క దర్శనమాత్రముచే బుద్ధిశాలియగు శ్రీకృష్ణుని దోషమంతయు, మాయనుండి మరియు కర్మనుండి పుట్టిన దోషము, నశించెను. తరువాత నశించిన దోషములు గల ఆ శ్రీకృష్ణునకు ఉపమన్యుమహర్షి యథావిధిగా, అగ్నిరితి భస్మ మొదలైన మంత్రములను వరుసగా పఠిస్తూ భస్మను శరీరమంతటా పూసి, తరువాత సాక్షాత్తుగా పాశుపత వ్రతమును పన్నెండు మాసములు చేయించి, అతనికి ఉత్తమమగు జ్ఞానమును ఇచ్చెను. ఆ నాటినుండియు కొనియాడదగిన వ్రతములు గలవారు, దివ్యులు, పాశుపతులు అగు మునులందరు ఆ శ్రీకృష్ణుని చుట్టువారి స్తుతించిరి. తరువాత గొప్ప శక్తి గల శ్రీకృష్ణుడు గురువు యొక్క ఆజ్ఞచే పుత్రుని కొరకై జగన్మాతతో గూడియున్న శంకరుని ఉద్దేశించి తపస్సును చేసెను.

తపసా తేన వర్షాంతే దృష్టోఽసౌ పరమేశ్వరః ।
శ్రియా పరమయా యుక్తస్సాంబశ్చ సగణశ్శివః ॥
వరార్థమావిర్భూతస్య హరస్య సుభగాకృతేః ।
స్తుతిం చకార నత్వాసౌ కృష్ణస్సమ్యక్ కృతాంజలిః ॥
సాంబం సగుణమవ్యగ్రో లబ్ధవాన్ పుత్రమాత్మనః ।
తపసా తుష్టచిత్తేన దత్తం విష్ణోశ్శివేన వై ॥
యస్మాత్సాంబో మహాదేవః ప్రదదౌ పుత్రమాత్మనః ।
తస్మాజ్జాంబవతీసూనుం సాంబం చక్రే స నామతః ॥
తదేతత్కథితం సర్వం కృష్ణస్యామితకర్మణః ।
మహర్షేః జ్ఞానలాభశ్చ పుత్రలాభశ్చ శంకరాత్ ॥
య ఇదం కీర్తయేన్నిత్యం శృణుయాచ్ఛ్రావయేత్తథా ।
స విష్ణోః జ్ఞానమాసాద్య తేనైవ సహ మోదతే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాముత్తరఖండే కృష్ణపుత్రప్రాప్తి వర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥

ఆ తపస్సుచే సంవత్సరము తరువాత గొప్ప శోభ గలవాడు, జగన్మాతతో మరియు సు ణములతో కూడియున్నవాడు, మంగళస్వరూపుడు అగు ఈ పరమేశ్వరుడు దర్శనమిచ్చెను. వరములనిచ్చుటకై దర్శనమిచ్చిన సుందరాకారుడగు శివుని ఈ శ్రీ కృష్ణుడు చేతులను జోడించి చక్కగా నమస్కరించి స్తుతించెను, తపస్సుచే సంతోషించిన మనస్సు గల శివునిచే ఈయబడిన సాంబుడను వానిని విష్ణుని అవతారమగు శ్రీకృష్ణుడు తన పుత్రునిగా పొంది ప్రసన్నుడాయెను. సాంబుడు (జగన్మాతతో గూడియున్నవాడు) అగు మహాదేవుడు తనకు పుత్రుని అనుగ్రహించుటచే, ఆయన జాంబవతియొక్క పుత్రునకు సాంబుడని పేరు పెట్టెను. ఈ విధముగా అనంతమగు కర్మలను చేసిన శ్రీకృష్ణుడు మహర్షి వద్దనుండి జ్ఞానమును పొందుట, శంకరుని నుండి పుత్రుని పొందుట అనే వృత్తాంతమునంతనూ చెప్పి యుంటిని. దీనిని ఎవడైతే నిత్యము కీర్తించునో, వినునో మరియు వినిపించునో, వాడు విష్ణువునుండి జ్ఞానమును పొంది ఆయనతో కలిసి ఆనందించును.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శ్రీకృష్ణునకు పుత్రుడు లభించుటను వర్ణించే మొదటి అధ్యాయము ముగిసినది.

# 2 – శివుని ఆజ్ఞయొక్క మహిమ

**ఋషయ ఊచుః ।**

**కిం తత్పశుపతం జ్ఞానం కథం పశుపతిశ్శివః ।**
**కథం ధౌమ్యాగ్రజః పృష్టః కృష్ణేనా క్లిష్టకర్మణా ॥**
**ఏతత్సర్వం సమాచక్ష్వ వాయో శంకరవిగ్రహ ।**
**త్వత్సమో న హి వక్తాస్తి త్రైలోక్యేష్వపరః ప్రభుః ॥**

ఋషులు ఇట్లు పలికిరి–

ఆ పాశుపతజ్ఞానము ఎట్టిది? శివుడు పశుపతి ఎట్లు అయినాడు? క్లేశము లేకుండగా గొప్ప పనులను చేయు శ్రీకృష్ణుడు ధౌమ్యుని అన్నగారగు ఉపమన్యుని ప్రశ్నించిన విధమెట్టిది? ఓ వాయూ! నీవు శంకరస్వరూపుడవు. ఈ విషయమునంతనూ చెప్పుము. ముల్లోకములలో నీతో సమానముగా చెప్పగలిగే మరియొక ప్రభుడు లేడు,

**సూత ఉవాచః**

**ఇత్యా కర్ణ్య వచస్తేషాం మహర్షీణాం ప్రభంజనః ।**
**సంస్మృత్య శివమీశానం ప్రవక్తుముపచక్రమే ॥**

సూతుడు ఇట్లు పలికెను –

వాయువు ఆ మహర్షుల ఈ వచనమును విని, మంగళస్వరూపుడగు ఈశ్వరుని సంస్మరించి చెప్పుటకు ఆరంభించెను.

**వాయురువాచః**

**పురా సాక్షాన్మహేశేన శ్రీకంఠాఖ్యేన మందరే ।**
**దేవ్యై దేవేన కథితం జ్ఞానం పాశుపతం పరమ్ ॥**
**తదేవ పృష్టం కృష్ణేన విష్ణునా విశ్వయోనినా ।**
**పశుత్వం చ సురాదీనాం పతిత్వం చ శివస్య చ ॥**
**యథోపదిష్టం కృష్ణాయ మునినా హ్యుపమన్యునా ।**
**తథా సమాసతో వక్ష్యే తచ్ఛృణుధ్వ మతంద్రితాః ॥**
**పురోపమన్యుమాసీనం విష్ణుః కృష్ణవపుర్ధరః ।**
**ప్రణిపత్య యథాన్యాయమిదం వచనమబ్రవీత్ ॥**

వాయువు ఇట్లు పలికెను –

పూర్వము శ్రీకంఠుడు అను పేరు గల మహేశ్వరదేవుడు సాక్షాత్తుగా పార్వతికి సర్వో◌్వోత్కృష్టమగు పాశుపతజ్ఞానమును చెప్పెను. జగత్తునకు కారణమగు విష్ణువు శ్రీకృష్ణ రూపములో నున్నవాడై ఆ జ్ఞానమును గురించి, దేవతలు మొదలగు వారి పశుత్వమును గురించి, మరియు శివుడు పశుపతి అను విషయమును గురించి ప్రశ్నించెను, ఉపమన్యుమహర్షి శ్రీకృష్ణునకు ఉపదేశించిన విధముగనే సంగ్రహముగా చెప్పెదను. ఆ విషయమును సావధానముగా వినుడు.

పూర్వము శ్రీకృష్ణరూపములోనున్న విష్ణువు, కూర్చుండియున్న ఉపమన్యునకు యథావిధిగా నమస్కరించి ఇట్లు పలికెను.

**శ్రీకృష్ణ ఉవాచః**

**భగవన్ శ్రోతుమిచ్ఛామి దేవ్యై దేవేన భాషితమ్ ।**
**దివ్యం పాశుపతం జ్ఞానం విభూతిం వాస్య కృత్స్నశః ॥**
**కథం పశుపతిర్దేవః పశవః కే ప్రకీర్తితాః ।**
**కైః పాశైస్తే నిబధ్యంతే విముచ్యంతే చ తే కథమ్ ॥**
**ఇతి సంచోదితః శ్రీమానుపమన్యుర్మహాత్మనా ।**
**ప్రణమ్య దేవం దేవీం చ ప్రాహ పృష్టో యథా తథా ॥**

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ పూజ్యా! దేవుడు దేవికి చెప్పిన దివ్యమగు పాశుపతజ్ఞానమును, ఈ శివుని మహిమను సంపూర్ణముగా వినగోరుచున్నాను. ఆ దేవుడు పశుపతి ఎట్లైనాడు? పశువులని చెప్పబడిన వారెవరు? వారు ఏ పాశములచే బంధింప బడినారు? వారికి విముక్తి కలుగు విధమెయ్యది? ఆ మహాత్ముడు ఇట్లు ప్రశ్నించగా, శ్రీమాన్ ఉపమన్యుడు పార్వతీపరమేశ్వరులకు నమస్కరించి ప్రశ్నకు తగ్గట్లుగా ఇట్లు చెప్పెను.

**ఉపమన్యురువాచః**

**బ్రహ్మాద్యాః స్థావరాంతాశ్చ దేవదేవస్య శూలినః ।**
**పశవః పరికీర్త్యంతే సంసారవశవర్తినః ॥**
**తేషాం పతిత్వాద్దేవేశశ్శివః పశుపతిస్స్మృతః ।**
**మలమాయాదిభిః పాశైస్స బధ్నాతి పశూన్ పతిః ॥**
**స ఏవ మోచకస్తేషాం భక్త్యా సమ్యగుపాసితః।**
**చతుర్వింశతితత్త్వాని మాయాకర్మగుణా అమీ ॥**
**విషయా ఇతి కథ్యంతే పాశా జీవనిబంధనాః।**
**బ్రహ్మాదిస్తంబపర్యంతాన్ పశూన్ బద్ధ్వా మహేశ్వరః ॥**
**పాశైరేతైః పతిర్దేవః కార్యం కారయతి స్వకమ్ ।**
**తస్యాజ్ఞయా మహేశస్య ప్రకృతిః పురుషోచితామ్ ॥**
**బుద్ధిం ప్రసూతే సా బుద్ధిరహంకార మహంకృతిః ।**
**ఇంద్రియాణి దశైకం చ తన్మాత్రాపంచకం తథా ॥**
**శాసనాద్దేవదేవస్య శివస్య శివదాయినః ।**
**తన్మాత్రాణ్యపి తస్యైవ శాసనేన మహీయసా ॥**
**మహాభూతాన్యశేషాణి భావయంత్యనుపూర్వశః ।**
**బ్రహ్మాదీనాం తృణాంతానాం దేహినాం దేహసంగతిమ్ ॥**
**మహాభూతాన్యశేషాణి జనయంతి శివాజ్ఞయా ।**
**అధ్యవస్యతి వై బుద్ధిరహంకారోఽభిమన్యతే ॥**

చిత్తం చేతయతే చాపి మనస్సంకల్పయత్యపి ।
శ్రోత్రాదీని చ గృహ్ణంతి శబ్దాదీన్ విషయాన్ పృథక్ ॥
స్వామేవ నాన్యాన్ దేవస్య దివ్యేనాజ్ఞాబలేన వై ।
వాగాదీన్యపి యాన్యాసంస్తాని కర్మేంద్రియాణి చ ॥
యథా స్వం కర్మ కుర్వంతి నాన్యత్కించిచ్ఛివాజ్ఞయా ।
శబ్దాదయోపి గృహ్యంతే క్రియంతే వచనాదయః ॥

ఉపమన్యువు ఇట్లు చెప్పెను -

బ్రహ్మ మొదలుకొని కీటకము వరకు గలవి, సంసారము యొక్క వశములో నుండునవి ి అగు ప్రాణులు దేవదేవుడు, త్రిశూలధారియగు శివునకు పశువులు అని చెప్పబడుచున్నవి. దేవదేవుడగు శివుడు వాటికి ప్రభువు అగుటచే పశుపతి దోషము మాయ మొదలగు పాశములతో పశువులనబడే జీవులను బంధించుచున్నాడు. భక్తితో చక్కగా ఉపాసించినచో, ఆ పరమేశ్వరుడే వారికి మోక్షమునిచ్చును. ఈ ఇరువది నాలుగు తత్త్వములు మాయయొక్క కార్యములు మరియు గుణములు అగుచున్నవి. వీటికి విషయములు అని పేరు. జీవులను బంధించు పాశములు అవియే. బ్రహ్మతో మొదలిడి కీటకము వరకు గల జీవులను పశుపతి యగు మహేశ్వరదేవుడు బంధించి, వారిచే తన కార్యమును చేయించు చున్నాడు. ఆ మహేశ్వరుని ఆజ్ఞచే ప్రకృతి పురుషునకు అనురూపమైన బుద్ధిని సృష్టించును. దేవదేవుడు, మంగళములనిచ్చువాడు అగు శివుని శాసనము వలన ఆ బుద్ధి అహంకారమును, అహంకారము పదకొండు ఇంద్రియములను మరియు అయిదు సూక్ష్మభూతములను సృష్టించు చున్నది. ఆ శివుని గొప్ప శాసనము చేతనే సూక్ష్మభూతములు కూడా సకలమహాభూతములను ఒక విశిష్టక్రమములో సృష్టించు చున్నవి. సకలమహాభూతములు శివుని ఆజ్ఞచే బ్రహ్మతో మొదలిడి గడ్డిపోచ వరకు గల ప్రాణులకు దేహముతో సంయోగమును కలిగించు చున్నవి. నిశ్చయాత్మకమైనది బుద్ధి కాగా, అహంకారము అభిమానమునకు కేంద్రమగుచున్నది. చిత్తము స్మృతికి కారణమగుచున్నది. మనస్సు సంకల్పించు చున్నది. ఆ దేవుని దివ్యమగు ఆజ్ఞ యొక్క బలముచే చెవి మొదలగు ఇంద్రియములు శబ్దము మొదలగు విషయములను తమకు సంబంధించిన వాటిని మాత్రమే వేర్వేరుగా గ్రహించు చున్నవి. అవి తమకు సంబంధించని విషయములను గ్రహించుట లేదు. వాక్కు మొదలగు కర్మేంద్రియములు శివుని ఆజ్ఞచే తమకు నిర్దేశించ బడిన కర్మను మాత్రమే చేయుచున్నవి; మరియొక కర్మను చేయుట లేదు. శబ్దము మొదలగు విషయములు జ్ఞానేంద్రియములచే గ్రహించబడుచున్నవి. మాటలాడుట మొదలగు కర్మలు కర్మేంద్రియములచే చేయబడు చున్నవి.

అవలంఘ్యా సా సర్వేషామాజ్ఞా శంభోర్గరీయసీ ।
అవకాశమశేషాణాం భూతానాం సంప్రయచ్ఛతి ॥
ఆకాశః పరమేశస్య శాసనాదేవ సర్వగః ।
ప్రాణాద్యైశ్చ తథా నామ భేదైరంతర్బహిర్జగత్ ॥

బిభర్తి సర్వం శర్వస్య శాసనేన ప్రభంజనః ।
హవ్యం వహతి దేవానాం కవ్యం కవ్యాశినామపి ॥
పాకాద్యం చ కరోత్యగ్నిః పరమేశ్వర శాసనాత్ ।
సంజీవనాద్యం సర్వస్య కుర్వంత్యాప స్తదాజ్ఞయా ॥
విశ్వంభరా జగన్నిత్యం ధత్తే విశ్వేశ్వరాజ్ఞయా ।
దేవాన్ పాత్యసురాన్ హంతి త్రిలోకమభిరక్షతి ॥
ఆజ్ఞయా తస్య దేవేంద్రస్సర్వైర్దేవైరలంఘ్యయా ।
ఆధిపత్యమహం నిత్యం కురుతే వరుణస్సదా ॥
పాశైర్బధ్నాతి చ యథా దండ్యాంస్తస్యైవ శాసనాత్ ।
దధాతి నిత్యం యక్షేంద్రో ద్రవిణం ద్రవిణేశ్వరః ॥
పుణ్యానురూపం భూతేభ్యః పురుషస్యానుశాసనాత్ ।
కరోతి సంపదశ్శశ్వత్ జ్ఞానం చాపి సుమేధసామ్ ॥
నిగ్రహం చాప్యసాధూనామీశాన శ్శివశాసనాత్ ।
ధత్తే తు ధరణీం మూర్ధ్నా శేషశ్శివ నియోగతః ॥
యామాహుస్తామసీం రౌద్రీం మూర్తిమంతకరీం హరేః ।
సృజత్య శేషమీశస్య శాసనాచ్చతురాననః ॥

శంభుని శ్రేష్ఠమగు ఆజ్ఞను ఎవ్వరైననూ జవదాటలేరు. పరమేశ్వరుని ఆజ్ఞ చేతనే సర్వవ్యాపకమగు ఆకాశము సకలభూతములకు అవకాశమునిచ్చు చున్నది. ఆ సంహారకుని శాసనముచే వాయువు ప్రాణాపానాది నామభేదముచే జగత్తును అంతనూ లోపల మరియు బయట నిలబెట్టు చున్నది. పరమేశ్వరుని శాసనముచే అగ్ని దేవతలకు హోమద్రవ్యములను; పితృదేవతలకు కవ్యము (పితరులకు అర్పించే ఆహారము) ను మోసుకొని వెళ్లుచుండుటయే గాక, వంట మొదలగు కార్యములను కూడా చేయుచున్నది. జలములు ఆ శివుని ఆజ్ఞచే సర్వుల ప్రాణములను నిలబెట్టుచున్నవి. విశ్వేశ్వరుని ఆజ్ఞచే భూమి నిత్యము ప్రాణులను మోయుచున్నది. సకలదేవతలకు జవదాట శక్యము కాని ఆ శివుని ఆజ్ఞచే దేవేంద్రుడు దేవతలను రక్షించి రాక్షసులను సంహరించి ముల్లోకములను కాపాడు చున్నాడు. ఆ శివుని శాసనము చేతనే వరుణుడు సర్వకాలములలో జలములపై శాశ్వతమగు ఆధిపత్యమును చేయుచూ, శిక్షార్హులను పాశములతో బంధించు చున్నాడు. ధనాధిపతి, యక్షరాజు అగు కుబేరుడు ఆ పరమపురుషుని శాసనముచే నిత్యము ప్రాణులకు వారి పుణ్యమునకు తగినట్లుగా ధనమును ఇచ్చుచున్నాడు. శివుని శాసనముచే ఈశానుడు మంచి బుద్ధి గలవారికి శాశ్వతమగు సంపదలను మరియు జ్ఞానమును కూడా ఇచ్చి, దుష్టులను శిక్షించు చున్నాడు. శివుని ఆదేశముచే శేషుడు భూమిని తలపై మోయుచున్నాడు. ఆ శేషుడే విష్ణువు యొక్క తమోగుణ ప్రధానమైన భయంకరమగు శక్తిస్వరూపమని చెప్పుచున్నారు. ఆ శేషుడే జగత్తునకు ప్రళయమును కలుగ జేయును. ఈశ్వరుని శాసనముచే బ్రహ్మగారు సకలజగత్తును సృష్టించు చున్నాడు.

అన్యాభిర్మూర్తిభిస్స్వాభిః పాతి చాంతే నిహంతి చ ।
విష్ణుః పాలయతే విశ్వం కాలకాలస్య శాసనాత్ ॥
సృజతే గ్రసతే చాపి స్వకాభిస్తనుభిస్త్రిభిః ।
హరత్యంతే జగత్సర్వం హరస్తస్యైవ శాసనాత్ ॥
సృజత్యపి చ విశ్వాత్మా త్రిధా భిన్నస్తు రక్షతి ।
కాలః కరోతి సకలం కాలస్సంహరతి ప్రజాః ॥
కాలః పాలయతే విశ్వం కాలకాలస్య శాసనాత్ ।
త్రిభిరం శైర్జగద్బిభ్రత్తేజో భిర్వృష్టిమాదిశన్ ॥
దివి వర్తత్యసౌ భానుర్దేవదేవస్య శాసనాత్ ।
పుష్ణాత్యోషధిజాతాని భూతాన్యాహ్లాదయత్యపి ॥
దేవైశ్చ పీయతే చంద్రశ్చంద్రభూషణ శాసనాత్ ।
ఆదిత్యా వసవో రుద్రా అశ్వినౌ మరుతస్తథా ॥
ఖేచరా ఋషయస్సిద్ధా భోగినో మనుజా మృగాః ।
పశవః పక్షిణశ్చైవ కీటాద్యాః స్థావరాణి చ ॥
నద్యస్సముద్రా గిరయః కాననాని సరాంసి చ ।
వేదాస్సాంగాశ్చ శాస్త్రాణి మంత్రస్తోమమఖాదయః ॥
కాలాగ్న్యాదిశివాంతాని భువనాని సహాధిపైః ।
బ్రహ్మాండాన్యప్యసంఖ్యాని తేషామావరణాని చ ॥
వర్తమానాన్యతీతాని భవిష్యంత్యపి కృత్స్నశః ।
దిశశ్చ విదిశశ్చైవ కాలభేదాః కలాదయః ॥
యచ్చ కించిజ్జగత్యస్మిన్ దృశ్యతే శ్రూయతేఽపి వా ।
తత్సర్వం శంకరస్యాజ్ఞా బలేన సమధిష్ఠితమ్ ॥

ఆ బ్రహ్మ తన ఇతరములగు మూర్తులచే జగత్తును రక్షించి, ప్రళయకాలమునందు సంహరించుచున్నాడు. మృత్యువునకు మృత్యువు అగు శివుని శాసనముచే విష్ణువు తన మూడు రూపములచే జగత్తును సృష్టించి పాలించి సంహరించుచున్నాడు. ఆ శివుని శాసనముచే మాత్రమే జగత్స్వరూపుడగు హరుడు కూడ మూడు రూపములను దాల్చి సృష్టించి రక్షించి ప్రళయకాలమునందు జగత్తును అంతనూ సంహరించు చున్నాడు. మృత్యువునకు మృత్యువు అగు శివుని శాసనముచే కాలము కూడ మూడు అంశలతో (భూతభవ్యవర్తమానములు) జగత్తును ధరించుచున్నది; ప్రజలను సంహరించుచున్నది; జగత్తును పాలించు చున్నది; సర్వమును చేయుచున్నది. దేవదేవుడగు శివుని శాసనముచే ఈ ద్యులోకమునందలి సూర్యుడు తన వేడి కిరణములచే నీటిని స్వీకరించి వర్షించుచున్నాడు. చంద్రుని శిరస్సుపై అలంకారముగా ధరించిన శివుని శాసనము వలన చంద్రుడు పంట మొక్కలకు పుష్టిని చేకూర్చి ప్రాణులకు ఆహ్లాదమును కలిగించి, దేవతలచే పానము చేయబడు చున్నాడు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినీ దేవతలు, మరుత్తులు , ఆకాశమునందు సంచరించే

దేవయోనులు, ఋషులు, సిద్ధులు, వాగులు, మానవులు, అడవులలోని మృగములు, గ్రామములలోని పశువులు, పక్షులు, కీటకములు మొదలైనవి, చెట్టుచేమలు, నదులు, సముద్రములు, పర్వతములు, అడవులు, సరస్సులు, అంగములతో కూడిన వేదములు, శాస్త్రములు, మంత్రములు, వేదముల యందలి స్తోత్రములు, యజ్ఞములు మొదలైనవి, కాలాగ్నితో మొదలిడి శివుని వరకు గల భువనములు, వాటి అధిపతులు, లెక్కలేనన్ని బ్రహ్మాండములు, వాటి ఆవరణలు , గడచిన జరుగుచున్న మరియు రాబోయే సకలఘటనలు, దిక్కులు, విదిక్కులు, కళ మొదలగు కాలభేదములు, ఈ విధముగా ఈ జగత్తులో ఏది ఏది కనబడుచున్నదో, లేదా వినవచ్చు చున్నదో, ఆ సర్వము శంకరుని ఆజ్ఞయొక్క బలముచే అధిష్ఠించబడి యున్నది.

**ఆజ్ఞా బలాత్తస్య ధరా స్థితేహ ధరాధరా వారిధరాస్సముద్రాః ।**
**జ్యోతిర్గణాశ్శక్రముఖాశ్చ దేవాః స్థిరం చరం వా చిదచిద్యదస్తి ॥**
**అత్యాశ్చర్యమిదం కృష్ణ శంభోరమితకర్మణః ।**
**ఆజ్ఞా కృతం శృణుష్వైతచ్ఛ్రుతం శ్రుతిముఖే మయా ॥**
**పురా కిల సురాస్సేంద్రా వివదంతః పరస్పరమ్ ।**
**అసురాన్ సమరే జిత్వా జేతాహమహమిత్యుత ॥**
**తదా మహేశ్వరస్తేషాం మధ్యతో వరవేషధృక్ ।**
**స్వలక్షణైర్వి హీనాంగస్స్వయం యక్ష ఇవాభవత్ ॥**
**స తానాహ సురానేకం తృణమాదాయ భూతలే ।**
**య ఏతద్వికృతం కర్తుం క్షమతే స తు దైత్యజిత్ ॥**
**యక్షస్య వచనం శ్రుత్వా వజ్రపాణిశ్శచీపతిః ।**
**కించిత్క్రుద్ధో విహస్యైనం తృణమాదాతుముద్యతః ॥**
**న తత్తృణముపాదాతుం మనసాపి చ శక్యతే ।**
**యథా తథాపి తచ్ఛేత్తుం వజ్రం వజ్రధరోఽసృజత్ ॥**
**తద్వజం నిజవ జ్రేణ సంసృష్టమేవ సర్వతః ।**
**తృణేనాభిహతం తేన తిర్యగగ్రం పపాత హ ॥**
**తతశ్చాన్యే సుసంరబ్ధా లోకపాలా మహాబలాః ।**
**ససృజుస్తృణముద్దిశ్య స్వాయుధాని సహస్రశః ॥**
**ప్రజజ్వాల మహావహ్నిః ప్రచండః పవనో వవౌ ।**
**ప్రవృద్ధోఽపాం పతిర్యద్వత్ప్రలయే సముపస్థితే ॥**

ఆ శివుని ఆజ్ఞయొక్క బలముచే భూమి, పర్వతములు, మేఘములు, సముద్రములు, నక్షత్రగణములు, ఇంద్రాది దేవతలు, కదిలేది గాని, కదలనిది గాని, చేతనము గాని, జడము గాని సర్వము ఉనికిని కలిగి యున్నవి . ఓ కృష్ణా! అంతము లేని కర్మలు గల శంభుని ఆజ్ఞచేత చేయబడిన ఈ మిక్కిలి ఆశ్చర్యకరమగు సంఘటనను వినుము. దీనిని నేను వేదములో వినియున్నాను. పూర్వము ఇంద్రునితో కూడియున్న దేవతలు రాక్షసులను యుద్ధములో జయించి, విజేతను నేనంటే నేనే అంటూ ఒకరితో నొకరు తగవు లాడుచుండిరి. అపుడు మహేశ్వరుడు తనవైన చిహ్నములు లేని గొప్ప వేషమును ధరించి స్వయముగా యక్ష రూపముతో వారి మధ్యకు వచ్చెను. ఆయన నేలపైనుండి ఒక గడ్డిపోచను తీసుకొని, ఎవడైతే దీనియందు వికారమును కలిగించుటకు సమర్థుడగునో వాడే రాక్షస విజేత అని వారితో పలికెను. యక్షుని ఆ మాటను వినీ శచీపతియగు ఇంద్రుడు వజ్రమును చేతబట్టి, కొద్దిగా కోపించి, చిరునవ్వు నవ్వి, ఆ గడ్డిపోచను తీసుకొనుటకు యత్నించేను. అది ఊహకు అందని విషయము. వజ్రధరుడగు ఆ ఇంద్రుడు దానిని పైకి లేప లేక పోయిన వాడై, దానిని ఛేదించుటకు వజ్రమును దానిపై ప్రయోగించెను. ఆ వజ్రము తనకు జన్మను ఇచ్చిన వజ్రమును ఢీకొన్నదా యన్నట్లు ఆ గడ్డిపోచచే భాగములన్నింటి యందు గట్టిగా కొట్టబడినదే అడ్డముగా పడి పోయెను, దాని మొన మొక్కవోయెను. తరువాత మహాబలవంతులగు మిగిలిన లోకపాలకులు పెద్ద కంగారుతో ఆ గడ్డిపోచను ఉద్దేశించి తమ ఆయుధములను వేల సంఖ్యలో ప్రయోగించిరి. పెద్ద అగ్ని మండజొచ్చెను. ప్రచండమగు వాయువు వీచెను. ప్రళయకాలమునందు వలె సముద్రము హద్దులు దాటి పెరిగెను .

ఏవం దేవైస్సమారబ్ధం తృణముద్దిశ్య యత్నతః ।
వ్యర్థమాసీదహో కృష్ణ యక్షస్యాత్మబలేన వై ॥
తదాహ యక్షం దేవేంద్రః కో భవానిత్యమర్షితః।
తతస్స పశ్య తామేవ తేషామంతరధాదథ ॥
తదంతరే హైమవతీ దేవీ దివ్యవిభూషణా ।
ఆవిరాసీన్నభోరంగే శోభమానా శుచిస్మితా ॥
తాం దృష్ట్వా విస్మయావిష్టా దేవాశ్శక్ర పురోగమాః ।
ప్రణమ్య యక్షం పప్రచ్ఛుః కోఽ సౌ యక్షో విలక్షణః ॥
సాఽ బ్రవీత్సస్మితం దేవీ స యుష్మాకమగోచరః ।
తేనేదం భ్రామ్యతే చక్రం సంసారాఖ్యం చరాచరమ్ ॥
తేనాదౌ క్రియతే విశ్వం తేన సంహ్రియతే పునః ।
న తన్నియంతా కశ్చిత్స్యాత్తేన సర్వం నియమ్యతే ॥
ఇత్యుక్త్వా సా మహాదేవీ తత్రైవాంతరధత్త వై।
దేవాశ్చ విస్మితాస్సర్వే తాం ప్రణమ్య దివం యయుః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివాజ్ఞా
ప్రభావ వర్ణనం నామ ద్వితీయోఽ ధ్యాయః ॥

ఓ కృష్ణా! ఈ విధముగా దేవతలు గడ్డిపోచను లక్ష్యముగా పెట్టుకొని చేసిన ప్రయత్నమంతయు యక్షుని ఆత్మబలము ముందు వ్యర్థమయ్యెను. ఆశ్చర్యము! అపుడు క్రోధమును పొందిన దేవేంద్రుడు యక్షుని, నీవెవరివి? అని ప్రశ్నించెను. అపుడు ఆ యక్షుడు వారు చూచుచుండగనే అంతర్ధానమును చెందెను. ఇంతలో దివ్యమగు ఆభరణములను ధరించి స్వచ్ఛమగు చిరునవ్వుతో ప్రకాశించుచున్న పార్వతీదేవి ఆకాశస్థానమునందు ఆవిర్భవించెను (56). ఇంద్రుడు మొదలగు దేవతలు ఆమెను చూచి ఆశ్చర్యపడిన వారై, ఆ యక్షునకు మనస్సులో నమస్కరించి, విడ్డూరముగా నున్న ఈ యక్షుడు ఎవరు? అని ప్రశ్నించిరి (57). ఆ దేవి చిరునవ్వుతో ఇట్లు పలికెను. ఆయన మీచే తెలియబడడు. చరాచరజగత్తు అనే ఈ సంసారచక్రమును త్రిప్పేది ఆయనయే. ఆయనయే ముందుగా జగత్తును సృష్టించి, అంతములో దానిని ఉపసంహరించును. ఆయనయే సర్వమును నియంత్రించును. కాని, ఆయనను నియంత్రించువారు మరెవ్వరూ లేరు. ఆ మహాదేవి ఇట్లు పలికి అక్కడనే అంతర్ధానమును చెందెను. ఆశ్చర్యమును పొందియున్న దేవతలు అందరు ఆమెకు నమస్కరించి స్వర్గమునకు వెళ్లిరి.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివుని ఆజ్ఞయొక్క మహిమను వర్ణించే రెండవ అధ్యాయము ముగిసినది.

# 3 – శివుడు అష్టమూర్తి

ఉపమన్యురువాచః

శృణు కృష్ణ మహేశస్య శివస్య పరమాత్మనః ।
మూర్త్యాత్మభిస్తతం కృత్స్నం జగదేతచ్చరాచరమ్ ॥
స శివస్సర్వమేవేదం స్వకీయాభిశ్చ మూర్తిభిః ।
అధితిష్ఠత్యమేయాత్మా హ్యేతత్సర్వమనుస్మృతమ్ ॥
బ్రహ్మా విష్ణుస్తథా రుద్రో మహేశానస్సదాశివః ।
మూర్తయస్తస్య విజ్ఞేయా యాభిర్విశ్వమిదం తతమ్ ॥
అథాన్యాశ్చాపి తనవః పంచ బ్రహ్మసమాహ్వయాః ।
తనూభిస్తాభిరవ్యాప్తమిహ కించిన్న విద్యతే ॥
ఈశానః పురుషోఽఘోరో వామస్సద్యస్తథైవ చ ।
బ్రహ్మాణ్యేతాని దేవస్య మూర్తయః పంచ విశ్రుతాః ॥
ఈశానాఖ్యా తు యా తస్య మూర్తిరాద్యా గరీయసీ ।
భోక్తారం ప్రకృతేస్సాక్షాత్ క్షేత్రజ్ఞమధితిష్ఠతి ॥
స్థాణోస్తత్పురుషాఖ్యా యా మూర్తిర్మూర్తిమతః ప్రభోః ।
గుణాశ్రయాత్మకం భోగ్యమవ్యక్తమధితిష్ఠతి ॥
ధర్మాద్యష్టాంగ సంయుక్తం బుద్ధితత్త్వం పినాకినః ।
అధితిష్ఠత్య ఘోరాఖ్యా మూర్తిరత్యంతపూజితా ॥
వామదేవాహ్వయాం మూర్తిం మహాదేవస్య వేధసః ।
అహంకృతేరధిష్ఠాత్రీమాహురాగమ వేదినః ॥
సద్యోజాతాహ్వయాం మూర్తిం శంభోరమితవర్చసః ।
మనసస్సమధిష్ఠాత్రీం మతిమంతః ప్రచక్షతే ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

ఓ కృష్ణా! వినుము. మహేశ్వరుడగు శివపరమాత్మయొక్క సగుణసాకార రూపములచే◌ే ఈ చరాచరజగత్తు అంతయు వ్యాపించబడి యున్నది. ప్రత్యక్షాది ప్రమాణములకు గోచరము కాని స్వరూపము గల ఆ శివుడు ఈ సకలజగత్తును తన మూర్తులచే అధిష్ఠించి యున్నాడు. ఈ విషయమునంతనూ మహర్షులు చెప్పియున్నారు. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశానుడు, సదాశివుడు ఆ శివుని మూర్తులని తెలియవలెను. వీరిచే ఈ జగత్తు అంతయు వ్యాపించబడి యున్నది. ఇంతే గాక, పంచబ్రహ్మలు అను పేరు గల ఇతరదేహములు కూడ గలవు. ఈ జగత్తులో ఆ దేహములచే వ్యాప్తము కానిది ఏదీ లేదు. ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, వామదేవుడు, సద్యోజాతుడు అనే ఆ దేవుని ఈ మూర్తులు పంచబ్రహ్మలు అని ప్రఖ్యాతిని గాంచి యున్నవి. మొదటిది, శ్రేష్ఠమైనది అగు ఈశాన అనే ఆయన మూర్తి సాక్షాత్తుగా ప్రకృతికి భోక్తయగు క్షేత్రజ్ఞుని అధిష్ఠించి యున్నది. చలనము లేనివాడే అయిననూ మూర్తులను స్వీకరించియున్న ఆ ప్రభుని

తత్పురుషమూర్తి సత్త్వరజస్తమోగుణములకు ఆశ్రయమై ఆ గుణములే స్వరూపముగా గల అవ్యక్తము (ప్రకృతి) ను అధిష్ఠించి యున్నది. పినాకధారియగు శివుని అతిశయించి పూజింపబడే అఘోరమూర్తి, ధర్మము మొదలగు ఎనిమిది అంగములతో కూడియున్న సమష్టిబుద్ధితత్త్వమును అధిష్ఠించి యున్నది. సృష్టికర్త యగు మహాదేవుని వామదేవమూర్తి అహంకారమునకు అధిష్ఠానమని ఆగమవేత్తలు చెప్పుచున్నారు. అనంతమగు తేజస్సు గల శంభుని సద్యోజాతమూర్తి మనస్సునకు అధిష్ఠానమని బుద్ధిమంతులు చెప్పుచున్నారు.

**శ్రోత్రస్య వాచశ్శబ్దస్య విభోర్వ్యోమ్న స్తథైవ చ ।**
**ఈశ్వరీమీశ్వరస్యేమామీశాఖ్యాం హి విదుర్బుధాః ॥**
**త్వక్పాణిస్పర్శవాయూ నామీశ్వరీం మూర్తిమైశ్వరీమ్ ।**
**పురుషాఖ్యాం విదుస్సర్వే పురాణార్థ విశారదాః ॥**
**చక్షుషశ్చరణస్యాపి రూపస్యాగ్నే స్తథైవ చ ।**
**అఘోరాఖ్యా మధిష్ఠాత్రీం మూర్తిమాహుర్మనీషిణః ॥**
**రసనాయాశ్చ పాయోశ్చ రసస్యాపాం తథైవ చ।**
**ఈశ్వరీం వామదేవాఖ్యాం మూర్తిం తన్నిరతా విదుః ।**
**ఘ్రాణస్య చైవోపస్థస్య గంధస్య చ భువస్తథా ।**
**సద్యోజాతాహ్వయాం మూర్తిమీశ్వరీం సంప్రచక్షతే ॥**
**మూర్తయః పంచ దేవస్య వందనీయాః ప్రయత్నతః ।**
**శ్రేయోర్థిభిర్నరైర్నిత్యం శ్రేయసామేకహేతవః ॥**
**తస్య దేవాధిదేవస్య మూర్త్యష్టకమయం జగత్ ।**
**తస్మిన్ వ్యాప్యం స్థితం విశ్వం సూత్రే మణిగణా ఇవ ॥**
**శర్వో భవస్తథా రుద్ర ఉగ్రోఅ భీమః పశోః పతిః ।**
**ఈశానశ్చ మహాదేవో మూర్తయశ్చాష్ట విశ్రుతాః ॥**
**భూమ్యంభోగ్నిమరుద్వ్యోమ క్షేత్రజ్ఞార్క నిశాకరాః ।**
**అధిష్ఠితా మహేశస్య శర్వాద్యైరష్టమూర్తిభిః ॥**
**చరాచరాత్మకం విశ్వం ధత్తే విశ్వంభరాత్మికా ।**
**శార్వీ శివాహ్వయా మూర్తిరితి శాస్త్రస్య నిశ్చయః ॥**

చెవి, ముక్కు, శబ్దము, సర్వవ్యాపకమగు ఆకాశము అను వాటికి ఈశ్వరుని ఈ ఈశానమూర్తి అధిష్ఠానదైవమని పండితులు చెప్పుచున్నారు. చర్మము, చేయి, స్పర్శ, వాయువు అను వాటికి ఈశ్వరుని తత్పురుషమూర్తి అధిష్ఠానదైవమని పురాణతాత్పర్యమునందు నిష్ణాతులగు వారు అందరు చెప్పుచున్నారు. కన్ను, కాళ్లు, రూపము, అగ్ని అను వాటికి అఘోరమూర్తి అధిష్ఠానమని విద్వాంసులు చెప్పుచున్నారు. నాలుక, విసర్జనేంద్రియము, రసము, నీరు అను వాటికి ఈశ్వరుని వామదేవమూర్తి అధిష్ఠానమని ఆ ఈశ్వరభక్తులు చెప్పుచున్నారు. ముక్కు, జననేంద్రియము, గంధము, భూమి అను వాటికి ఈశ్వరుని సద్యోజాతమూర్తి అధిష్ఠానమని పెద్దలు చెప్పుచున్నారు. శ్రేయస్సులకు

ఏకైకహేతువులు అగు ఆ దేవుని అయిదు మూర్తులను శ్రేయస్సులను గోరు మానవులు నిత్యము ప్రయత్నపూర్వకముగా నమస్కరించ వలెను. జగత్తు ఆ దేవాధిదేవుని ఎనిమిది మూర్తులతో నిండి యున్నది. ఆయనచే వ్యాపించబడియున్న జగత్తు సూత్రము నందు మణిగణములు వలె ఆయనయందు స్థితిని కలిగి యున్నది. శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు, మహాదేవుడు అనే ఎనిమిది మూర్తులు ప్రసిద్ధముగా నున్నవి. శర్వుడు మొదలుగా గల మహేశ్వరుని ఈ ఎనిమిది మూర్తులచే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, క్షేత్రజ్ఞుడు, సూర్యుడు, చంద్రుడు అనునవి అధిష్ఠించబడి యున్నవి. శర్వుడు అను పేరు గల శివుని మూర్తి భూమి అను రూపములో నున్నదై చరాచరజగత్తును ధరించుచున్నదని శాస్త్రము నిర్ధారించినది. కావుననే భూమి అనే శివమూర్తికి శార్వీ అని పేరు.

సంజీవనం సమస్తస్య జగతస్సలిలాత్మికా ।
భావీతి గీయతే మూర్తిర్భవస్య పరమాత్మనః ॥
బహిరంతర్గతా విశ్వం వ్యాప్య తేజోమయీ శుభా ।
రౌద్రీ రుద్రాఖ్యయా మూర్తిరాస్థితా ఘోరరూపిణీ ॥
స్పందయత్యనిలాత్మేదం బిభర్తి స్పందతే స్వయమ్ ।
ఔగ్రీతి కథ్యతే సద్భిర్మూర్తిరు గ్రస్య వేధసః ॥
సర్వావకాశదా సర్వవ్యాపికా గగనాత్మికా ।
మూర్తిర్భీమస్య భీమాఖ్యా భూతబృందస్య భేదికా ॥
సర్వాత్మనామధిష్ఠాత్రీ సర్వక్షేత్ర నివాసినీ ।
మూర్తిః పశుపతేః జ్ఞేయా పశుపాశనికృంతనీ ॥
దీపయంతీ జగత్సర్వం దివాకర సమాహ్వయా ।
ఈశానాఖ్యా మహేశస్య మూర్తిర్దివి విసర్పతి ॥
ఆప్యాయయతి యో విశ్వమమృతాంశుర్నిశాకరః ।
మహాదేవస్య సా మూర్తిర్మహాదేవ సమాహ్వయా ॥
ఆత్మా తస్యాష్టమీ మూర్తిశ్శివస్య పరమాత్మనః ।
వ్యాపికేతర మూర్తీనాం విశ్వం తస్మాచ్ఛివాత్మకమ్ ॥
వృక్షస్య మూలసేకేన శాఖాః పుష్యంతి వై యథా ।
శివస్య పూజయా తద్వత్పుష్యత్యస్య వపుర్జగత్ ॥
సర్వాభయ ప్రదానం చ సర్వానుగ్రహణం తథా ।
సర్వోపకారకరణం శివస్యారాధనం విదుః ॥
యథేహ పుత్రపౌత్రాదేః ప్రీత్యా ప్రీతో భవేత్పితా ।
తథా సర్వస్య సంప్రీత్యా ప్రీతో భవతి శంకరః ॥
దేహినో యస్య కస్యాపి క్రియతే యది నిగ్రహః ।
అనిష్టమష్టమూర్తేస్తత్కృతమేవ న సంశయః ॥

**అష్టమూర్త్యాత్మనా విశ్వమధిష్ఠాయ స్థితం శివమ్ ।**

**భజస్వ సర్వభావేన రుద్రః పరమకారణమ్ ॥**

సకలప్రాణుల ప్రాణములను నిలబెట్టే నీరు అనే పరమాత్మయగు భవుని మూర్తి భావీ అని కీర్తించబడుచున్నది. జగత్తును లోపల మరియు బయట వ్యాపించియున్న ఘోరమగు రూపము గల శుభకరమగు అగ్ని రుద్రుడు అనే మూర్తిచే అధిష్ఠించబడి రౌద్రీ అనబడుచున్నది. శివుడు తాను స్వయముగా స్పందిస్తూ వాయువును స్పందింపజేయును. సృష్టికర్తయగు శివుని ఉగ్రుడనే మూర్తి వాయురూపములో నుండి జగత్తును నిలబెట్టుచున్నది. కావుననే, సత్పురుషులు వాయువును ఔగ్రీ అను మూర్తిగా వర్ణించుచున్నారు. సర్వమునకు అవకాశమునిచ్చునది, సర్వమును వ్యాపించునది, పదార్థసముదాయములో ఒకదానినుండి మరియొక దాని భేదమునకు ఆలంబనమైనది అగు అకాశము భీమా అనబడే భీముని మూర్తి. ఆత్మలన్నింటికీ అధిష్ఠానమగు పశుపతియొక్క చైతన్య స్వరూపము దేహములన్నింటి యందు నివసించు చున్నది. ఆ మూర్తి జీవుల బంధమును పోగొట్టును. దివాకరుడు అను పేరుతో జగత్తునంతనూ ప్రకాశింప జేయుచూ ఆకాశమునందు సంచరించే సూర్యుడు మహేశ్వరుని ఈశానమూర్తియొక్క రూపమే. జగత్తునకు రసముచే తృప్తినిచ్చువాడు, రాత్రిని చేయువాడు, అమృతకిరణుడు అగు చంద్రుడు మహాదేవుడగు శివునీ మహాదేవుడు అను పేరు గల మూర్తియే. ఆ శివపరమాత్మ యొక్క ఎనిమిదవ మూర్తి ఆత్మ. అది ఇతరమూర్తులను వ్యాపించి యున్నది. కావున, జగత్తునకు ఆత్మ శివుడే. చెట్టుయొక్క వ్రేళ్లకు నీళ్లు పోసినచో, కొమ్మలు బలపడును. అదే విధముగా, శివుని పూజించినచో, శివుని దేహమగు జగత్తు బలపడును. శివుని పూజ సర్వులకు అభయమునిచ్చుననియు, సర్వులను అనుగ్రహించుననియు, సర్వులకు ఉపకారమును చేయుననియు పెద్దలు చెప్పుచున్నారు. ఈ లోకములో పుత్రులు పౌత్రులు మొదలగు వారు సంతోషముగా నున్నచో, తండ్రి సంతోషించును. అదే విధముగా, సర్వప్రాణులు సుఖముగా నున్నచో, శంకరుడు సంతోషించును. ఏ ప్రాణినైననూ బంధించి అపకారమును చేసినచో, అది అష్టమూర్తియగు శివునకు చేసినట్లే యగును. సందేహము లేదు, అష్టమూర్తి రూపములో జగత్తును అధిష్ఠించి యున్న శివుని, సర్వము బ్రహ్మయే నను భావముతో సేవించుము. సర్వకారణకారణుడు రుద్రుడే.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివుని అష్టమూర్తి స్వరూపమును వర్ణించే మూడవ అధ్యాయము ముగిసినది.

# 4 – గౌరీ శంకరుల విభూతి యోగము

**శ్రీకృష్ణ ఉవాచః**

**భగవన్ పరమేశస్య శర్వస్యామితతేజసః ।**
**మూర్తిభిర్విశ్వమేవేదం యథా వ్యాప్తం తథా శ్రుతమ్ ॥**
**అథైతత్ జ్ఞాతుమిచ్ఛామి యాథాత్మ్యం పరమేశయోః ।**
**స్త్రీపుంభావాత్మకం చేదం తాభ్యాం కథమధిష్ఠితమ్ ॥**

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను –

ఓ పూజ్యా! జగత్సంహారకుడు, అనంతమగు తేజస్సు గలవాడు అగు పరమేశ్వరుని మూర్తులచే ఈ జగత్తు ఏ విధముగా నిశ్చయముగా వ్యాపించబడి యున్నదో, ఆ వివరములను వింటిని. తరువాత పార్వతీపరమేశ్వరుల స్వరూపమును గురించి నేను తెలియగోరుచున్నాను. స్త్రీపురుషాత్మకమగు ఈ జగత్తును వారిద్దరు ఎట్లు అధిష్ఠించి యున్నారు?

**ఉపమన్యురువాచః**

**శ్రీమద్విభూతం శివయోర్యాథాత్మ్యం చ సమాసతః ।**
**వక్ష్యే తద్విస్తరాద్వక్తుం భవేనాపి న శక్యతే ॥**
**శక్తిస్సాక్షాన్మహాదేవీ మహాదేవశ్చ శక్తిమాన్।**
**తయోర్విభూతిలేశో వై సర్వమేతచ్చరాచరమ్ ॥**
**వస్తు కించిదచిద్రూపం కించిద్వస్తు చిదాత్మకమ్ ।**
**ద్వయం శుద్ధమశుద్ధం చ పరం చాపరమేవ చ ॥**
**యత్సంహసరతి చిచ్చ క్రమచిచ్చక్ర సమనిత్యమ్ ।**
**తదేవాశుద్ధమ పరమితరం తు పరం శుభమ్ ॥**
**అపరం చ పరం చైవ ద్వయం చిదచిదాత్మకమ్ ।**
**శివస్య చ శివాయాశ్చ స్వామ్యం చైతత్స్వభావతః ॥**
**శివయోర్వై వశే విశ్వం న విశ్వస్య వశే శివౌ ।**
**ఈశితవ్యమిదం యస్మాత్తస్మాద్విశ్వేశ్వరౌ శివౌ ॥**
**యథా శివస్తథా దేవీ యథా దేవీ తథా శివః ।**
**నానయోరంతరం విద్యాచ్చంద్రచంద్రికయోరివ ॥**
**చంద్రో న ఖలు భాత్యేష యథా చంద్రిక వినా ।**
**న భాతి విద్యమానోఽపి తథా శక్త్యా వినా శివః ॥**
**ప్రభయా హి వినా యద్వద్భానురేష న విద్యతే ।**
**ప్రభా చ భానునా తేన సుతరాం తదుపాశ్రయా ॥**
**ఏవం పరస్పరాపేక్షా శక్తిశక్తిమతోః స్థితా ।**
**న శివేన వినా శక్తిర్న శక్త్యా చ వినా శివః ॥**

ఉపమన్యుడు ఇట్లు పలికెను -

పార్వతీపరమేశ్వరుల శోభాయుక్తమైన విభూతి (మహిమ) ని మరియు వారి స్వరూపము(ు)ను సంగ్రహముగా చెప్పగలను. దానిని విస్తరముగా చెప్పుటకు భవునకైననూ శక్యము కాదు. మహాదేవి సాక్షాత్తుగా శక్తి కాగా, మహాదేవుడు ఆ శక్తి గలవాడు. ఈ చరాచరజగత్తు అంతా వారి విభూతియొక్క లేశము మాత్రమే. కొన్ని వస్తువులు జడములు కాగా, మరికొన్ని చేతనస్వరూపములై యున్నవి. ఈ రెండు శుద్ధము- అశుద్ధము అనియు, పరము- అపరము అనియు విభాగమును కలిగియున్నవి, జడముల సముదాయముతో గూడి సంసారమునను భవించు చేతనుడే అశుద్ధుడు మరియు అపరుడు కాగా, దీనికి భిన్నమైనది (జడము నుండి సంసారమునుండి విముక్తిని పొందిన చేతనుడు) శుద్ధము మరియు పరము అగును, అపరము మరియు పరము అనే రెండు స్వయముగా చేతన- జడస్వరూపములై యున్నవి. వీటిపై పార్వతీపరమేశ్వరులకు సహజముగనే ప్రభుత్వము గలదు. జగత్తు పార్వతీ పరమేశ్వరుల వశములో నున్నదియే గాని, పార్వతీపరమేశ్వరులు జగత్తునకు వశములో లేరు. ఏలయన, ఈ జగత్తును నియమించ వలసి యున్నది. కావున, పార్వతీపరమేశ్వరులు జగత్తునకు శాసకులగుచున్నారు. శివుడు ఎట్లో దేవి అట్లే. దేవి ఎట్లో శివుడు అట్లే. చంద్రునకు వెన్నెలకు వలె వీరిద్దరికి మధ్యలో భేదము లేదు, వెన్నెల లేనిదే ఈ చంద్రుడు ప్రకాశించడు. అదే విధముగా శివుడు ఉనికి గలవాడే అయిననూ, శక్తి లేనిదే ప్రకాశించడు. కాంతి లేనిదే ఈ సూర్యుడే లేడు. సూర్యుడు లేనిదే కాంతి మనజాలదు. కాంతి పూర్తిగా సూర్యుని ఆశ్రయించి యున్నది. ఇదే విధముగా శక్తికి శక్తిమంతునకు అన్యోన్యమగు అపేక్ష గలదు. శివుడు లేనిదే శక్తి లేదు. శక్తి లేనిదే శివుడు లేడు.

శక్తో యయా శివో నిత్యం భుక్తౌ ముక్తౌ చ దేహినామ్ ।
ఆద్యా సైకా పరా శక్తిశ్చిన్మయీ శివసంశ్రయా ॥
యామాహురఖిలేశస్య తైస్తైరనుగుణైర్గుణైః ।
సమానధర్మిణీమేవ శివస్య పరమాత్మనః ॥
సైకా పరా చ చిద్రూపా శక్తిః ప్రసవధర్మిణీ ।
విభజ్య బహుధా విశ్వం విదధాతి శివేచ్ఛయా ॥
సా మూలప్రకృతిర్మాయా త్రిగుణా చ త్రిధా స్మృతా ।
శివయా చ విపర్యస్తం యయా తతమిదం జగత్ ॥
ఏకధా చ ద్విధా చైవ తథా శతసహస్రధా ।
శక్తయః ఖలు భిద్యంతే బహుధా వ్యవహారతః ॥
శివేచ్ఛయా పరా శక్తిశ్శివతత్త్వైకతాం గతా ।
తతః పరిస్ఫురత్యాదౌ సర్గే తైలం తిలాదివ ॥
తతః క్రియాఖ్యయా శక్త్యా శక్తౌ శక్తిమదుత్థయా ।
తస్యాం విక్షోభ్యమాణాయామాదౌ నాదస్సముద్బభౌ ॥

నాదాద్బిన్దుస్తతో బిందుర్బిందోర్దేవస్సదాశివః ।
తస్మాన్మహేశ్వరో జాతశ్శుద్ధవిద్యా మహేశ్వరాత్ ॥
సా వాచామీశ్వరీ శక్తిర్వాగీశాఖ్యా హి శూలినః ।
యా సా వర్ణస్వరూపేణ మాతృకేతి విజృంభతే ॥
అథానంతసమావేశాన్మాయా కాలమవాసృజత్ ।
నియతిం చ కలాం విద్యాం కలాతో రాగపూరుషౌ ॥

ఏ శక్తిచే శివుడు నిత్యము ప్రాణులకు భుక్తిని ముక్తిని ఇచ్చుటకు సమర్థుడగుచున్నాడో, ఆ అద్వితీయ-చిన్మయ-పరాశక్తియే శివుని ఆశ్రయించి జగత్కారణమగుచున్నది. ఆమె ఆ సర్వజగదీశ్వరునకు అనురూపమైన ఆయా గుణములతో కూడియున్నదై, ఆ శివపరమాత్మతో సమానమగు ధర్మములను మాత్రమే కలిగియున్నదని పెద్దలు చెప్పుచున్నారు. అద్వితీయము, సర్వోత్కృష్టము, చైతన్య స్వరూపము, సృష్టి స్వీయధర్మముగా గలది అగు ఆ శక్తి శివుని ఇచ్ఛచే అనేకరూపములుగా విభాగమును చెంది జగత్తును నిర్మించుచున్నది. మూలప్రకృతి, మాయ, త్రిగుణ అను మూడు పేర్లతో ఆ శక్తి మూడు విధములుగా నున్నదని చెప్పబడినది. ఆ పార్వతి తననుండి ఈ జగత్తును ప్రకటించినది. ఈ జగత్తు ఆమె చేతనే వ్యాపించబడి యున్నది. వ్యవహారమును బట్టి ఒకటి, రెండు, వంద, వేయి, అనేకము మొదలైన విధముగా శక్తులలో భేదము కానవచ్చును. శివుని ఇచ్ఛచే ఆ పరాశక్తి శివతత్త్వములో ఐక్యమును చెందినది. సృష్ట్యాదియందు ఆ శక్తి ఆ శివుని నుండి నువ్వుగింజనుండీ నూనె వలె జగద్రూపములో ప్రకటమగుచుండును. తరువాత సృష్ట్యాదియందు శక్తిమంతుడగు పరమేశ్వరునినుండి పుట్టిన క్రియాశక్తి ఆ శక్తియందు తీవ్రమగు కదలికను తీసుకు రాగా, నాదము పుట్టెను, నాదమునుండి బిందువు బయల్వెడలెను. బిందువునుండి ప్రకాశస్వరూపుడగు సదాశివుడు పుట్టెను. ఆయననుండి మహేశ్వరుడు, మహేశ్వరునినుండి శుద్ధవిద్య పుట్టెను. ఆ శుద్ధవిద్య వాక్కులకు అధీశ్వరియగు శక్తి. త్రిశూలధారియగు శివుని ఆ శక్తికి వాగీశా అని పేరు. ఆమెయే అక్షరముల రూపములో విస్తారమును చెంది మాతృక అనబడుచున్నది. తరువాత అనంతుని (చైతన్య రూపుడగు ఈశ్వరుని) సమావేశముచే మాయ కాలమును, నియతిని, కళను మరియు విద్యను సృష్టించెను. కళనుండి రాగము, పురుషుడు పుట్టినవి.

మాయాతః పునరేవాభూదవ్యక్తం త్రిగుణాత్మకమ్ ।
త్రిగుణాచ్చ తతో వ్యక్తాద్విభక్తాస్స్యుస్త్రయో గుణాః ॥
సత్త్వం రజస్తమశ్చేతి యైర్వ్యాప్తమఖిలం జగత్ ।
గుణేభ్యః క్షోభ్యమాణేభ్యో గుణేశాఖ్యాస్త్రిమూర్తయః ॥
అభవన్మహదాదీని తత్త్వాని చ యథాక్రమమ్ ।
తేభ్యస్స్యురండపిండాని త్వసంఖ్యాని శివాజ్ఞయా ।
అధిష్ఠితాన్యనంతాద్యైర్విద్యే శైశ్చ క్రవర్తిభిః ॥
శరీరాంతరభేదేన శక్తేర్భేదాః ప్రకీర్తితాః ।
నానారూపాస్తు విజ్ఞేయాః స్థూలసూక్ష్మ విభేదతః ॥

రుద్రస్య రౌద్రీ సా శక్తిర్విష్ణోర్వై వైష్ణవీ మతా ।
బ్రహ్మాణీ బ్రహ్మణః ప్రోక్తా చేంద్రస్యైంద్రీతి కథ్యతే ॥
కిమత్ర బహునోక్తేన యద్విశ్వమితి కీర్తితమ్ ।
శక్త్యాత్మనైవ తద్వ్యాప్తం యథా దేహోఽంతరాత్మనా ॥
తస్మాచ్ఛక్తిమయం సర్వం జగత్ స్థావరజంగమమ్ ।
కలా యా పరమా శక్తిః కథతా పరమాత్మనః ॥
ఏవమేషా పరా శక్తిరీశ్వరేచ్ఛానుయాయినీ ।
స్థిరం చరం చ యద్విశ్వం సృజతీతి వినిశ్చయః ॥
జ్ఞాన క్రియా చికీర్షాభిస్తిసృభిస్స్వా త్మశక్తిభిః ।
శక్తిమానీశ్వరశ్శశ్వద్విశ్వం వ్యాప్యాధితిష్ఠతి ॥
ఇదమిత్థమిదం నేత్థం భవేదిత్యేవమాత్మికా ।
ఇచ్ఛాశక్తిర్మ హేశస్య నిత్యా కార్యనియామికా ॥

మరల మాయనుండి మూడు గుణములే స్వరూపముగా గల అవ్యక్తము పుట్టెను. ఆ త్రిగుణాత్మకమగు అవ్యక్తము తరువాత వ్యక్తమైనప్పుడు ఆ మూడు గుణములు వేర్వేరుగా ప్రకటమగును. సత్త్వము, రజస్సు, తమస్సు అను పేర్లు గల ఆ గుణములచే జగత్తు అంతయు వ్యాపించబడి యున్నది. సంక్షోభమును పొందియున్న గుణములనుండి గుణేశులు (ఆయా గుణములు ప్రధానముగా గలవారు) అగు త్రిమూర్తులు పుట్టిరి. క్రమముగా మహత్తు (సమష్టిబుద్ధిశక్తి) మొదలైన తత్త్వములు పుట్టినవి. వాటినుండి శివుని ఆజ్ఞచే సకలబ్రహ్మాండములు మరియు లెక్క లేనన్ని దేహములు పుట్టినవి. అనంతుడు మొదలగు విద్యేశ్వరులైన చక్రవర్తులచే ఆ బ్రహ్మాండములు అధిష్ఠించ బడినవి. (24, 25). శరీరములలో భేదమును బట్టి శక్తిలో భేదములు చెప్పబడినవి. స్థూలసూక్ష్మవిభాగముచే శక్తులు అనేకరూపములలో నున్నవని తెలియవలెను. రుద్రుని శక్తి రౌద్రీ అనియు, విష్ణువుయొక్క శక్తి వైష్ణవి అనియు, బ్రహ్మయొక్క శక్తి బ్రహ్మాణి అనియు, ఇంద్రుని శక్తి ఐంద్రి అనియు చెప్పబడును. ఈ విషయములో ఇన్ని మాటలేల? విశ్వము అను పేరుతో ఏదైతే కీర్తింప బడుచున్నదో అది, దేహము అంతరాత్మ చేతను వలె, శక్తి స్వరూపముచేతనే వ్యాపించబడి యున్నది. కావున, స్థావరజంగమాత్మకమగు జగత్తు అంతయు శక్తితో నిండి యున్నది. ఈ పరాశక్తి పరమాత్మయొక్క కళ అని చెప్పబడినది. ఈ విధముగా ఈ పరాశక్తి ఈశ్వరుని ఇచ్ఛను అనుసరించి ప్రవర్తిల్లి, చరాచరమగు జగత్తు ఏది గలదో దానిని సృష్టించు చున్నదని సిద్ధాంతము. శక్తిమంతుడగు ఈశ్వరుడు జ్ఞానశక్తి, క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి అను మూడు ఆత్మశక్తులచే శాశ్వతకాలము జగత్తును వ్యాపించి అధిష్ఠించి యున్నాడు. మహేశ్వరుని ఇచ్ఛాశక్తి నిత్యము. ఇది ఇట్లుండవలెను; ఇది ఇట్లుండరాదు అను విధముగా కార్యములను అదియే నియమించుచున్నది.

జ్ఞానశక్తిస్తు తత్కార్యం కరణం కారణం తథా ।
ప్రయోజనం చ తత్త్వేన బుద్ధిరూపాధ్యవస్యతి ॥
యథేప్సితం క్రియాశక్తిర్యథాధ్యవసితం జగత్ ।
కల్పయత్యఖిలం కార్యం క్షణాత్సం కల్పరూపిణీ ॥
యథా శక్తిత్రయోత్థానం శక్తిః ప్రసవధర్మిణీ ।
శక్త్యా పరమయా నున్నా ప్రసూతే సకలం జగత్ ॥
ఏవం శక్తిసమాయోగాచ్ఛక్తిమానుచ్యతే శివః ।
శక్తిశక్తిమదుత్థం తు శాక్తం శైవమిదం జగత్ ॥
యథా న జాయతే పుత్రః పితరం మాతరం వినా ।
తథా భవం భవానీం చ వినా నైతచ్చరాచరమ్ ।
స్త్రీపుంసప్రభవం విశ్వం స్త్రీపుంసాత్మకమేవ చ ॥
స్త్రీపుంసయోర్విభూతిశ్చ స్త్రీపుంసాభ్యామధిష్ఠితమ్ ।
పరమాత్మా శివః ప్రోక్తశ్శివా సా చ ప్రకీర్తితా ॥
శివస్సదాశివః ప్రోక్తశ్శివా సా చ మనోన్మనీ ।
శివో మహేశ్వరో జ్ఞేయశ్శివా మాయేతి కథ్యతే ॥
పురుషః పరమేశానః ప్రకృతిః పరమేశ్వరీ ।
రుద్రో మహేశ్వరస్సాక్షాద్రుద్రాణీ రుద్రవల్లభా ॥
విష్ణుర్విశ్వేశ్వరో దేవో లక్ష్మీర్విశ్వేశ్వరప్రియా ।
బ్రహ్మ శివో యదా స్రష్టా బ్రహ్మాణీ బ్రహ్మణః ప్రియా ॥
భాస్కరో భగవాన్ శంభుః ప్రభా భగవతీ శివా ।
మహేంద్రో మన్మథారాతిశ్శచీ శైలేంద్రకన్యకా ॥

జ్ఞానశక్తి బుద్ధిరూపములో ఆ ప్రకృతి యొక్క కార్యమును, కరణము (సాధనము) ను, కారణమును మరియు ప్రయోజనమును యథాతథముగ నిశ్చయించు చుండును. క్రియాశక్తి సంకల్పరూపములో నుదయించి శివుని ఇచ్ఛను మరియు నిశ్చయమును అతిక్రమించకుండగా క్షణకాలములో సమస్తకార్యజగత్తును సృష్టించును. ఈ విధముగా మూడు శక్తుల కలయికచే జగత్తు పుట్టుచున్నది. ప్రసవించుట ధర్మముగా గల శక్తి పరాశక్తిచే ప్రేరితమై సకలజగత్తును సృష్టించుచున్నది. ఈ విధముగా శక్తులతో సమావేశముచే శివునకు శక్తిమాన్ అను పేరు వచ్చినది. శక్తి మరియు శక్తిమంతుల సంయోగముచే ఉదయించిన ఈ శివమయమగు జగత్తు శక్తితో నిండియున్నది. తల్లిదండ్రులు లేనిదే పుత్రుడు ఉదయించడు. అటులనే, పార్వతీపరమేశ్వరులు లేనిదే ఈ చరాచరజగత్తు లేదు. స్త్రీ పురుషుల (ఆదిదంపతుల) నుండి పుట్టిన జగత్తు స్త్రీ పురుషుల రూపములో మాత్రమే ఉన్నది. స్త్రీ పురుషులు క్రమముగా పార్వతీ పరమేశ్వరుల విభూతులు. కావుననే, జగత్తు స్త్రీ పురుషులచే అధిష్ఠించబడి యున్నది. పురుషుడు శివపరమాత్మ అనియు, శక్తి శివాదేవి అనియు కీర్తించబడుచున్నారు. స్త్రీపురుషులగు ఆదిదంపతుల విభూతి యైన ఈ జగత్తు ఆ

స్త్రీ పురుషుల చేతనే అధిష్ఠింపబడి యున్నది. పురుషుడగు శివుడు పరమాత్మ అనియు, పార్వతీదేవి ఆయన శక్తి అనియు కీర్తించబడుచున్నారు. శివుడు సదాశివుడనియు, పార్వతి మనోన్మని అనియు పిలువ బడుచున్నారు. శివుడే మహేశ్వరుడనియు, పార్వతీ మాయ యనియు తెలియవలెను. పురుషుడే పరమేశ్వరుడు కాగా, ప్రకృతి పరమేశ్వరి యగుచున్నది. రుద్రుడు సాక్షాత్తుగా మహేశ్వరుడే. ఆయన ప్రియురాలగు పార్వతి రుద్రాణి. జగత్తునకు ప్రభువు అగు దేవుడు విష్ణువు కాగా, ఆ విశ్వేశ్వరుని ప్రియురాలు లక్ష్మి శివుడు సృష్టికార్యమును చేసే బ్రహ్మ కాగా, బ్రహ్మ యొక్క ప్రియురాలు బ్రహ్మాణి అనబడుచున్నది. సూర్యుడు శంభుభగవానుడే. సూర్యకాంతి భగవతియగు పార్వతి. మహేంద్రుడు మన్మథనాశకుడగు శివుడే, శచియే పార్వతి.

జాతవేదా మహాదేవస్స్వాహా శర్వార్ధదేహినీ ।
యమస్త్రియంబకో దేవస్తత్ప్రియా గిరికన్యకా ॥
నిర్ఋతిర్భగవానీశో నైర్ఋతీ నగనందినీ ।
వరుణో భగవాన్ రుద్రో వారుణీ భూధరాత్మజా ॥
బాలేందుశేఖరో వాయుశ్శివా శివమనోహరా ।
యక్షో యజ్ఞశిరోహర్తా ఋద్ధిర్హిమగిరీంద్రజా ॥
చంద్రార్ధశేఖరశ్చంద్రో రోహిణీ రుద్రవల్లభా ।
ఈశానః పరమేశానస్తదార్యా పరమేశ్వరీ ॥
అనంతవలయోఽనంతో హ్యనంతానంత వల్లభా।
కాలాగ్నిరుద్రః కాలారిః కాలీ కాలాంతకప్రియా ॥
పురుషాఖ్యో మనుశ్శంభుశ్శతరూపా శివప్రియా ।
దక్షస్సాక్షాన్మహాదేవః ప్రసూతిః పరమేశ్వరీ ॥
రుచిర్భవో భవానీ చ బుధైరాకూతిరుచ్యతే ।
భృగుర్భగాక్షిహా దేవః ఖ్యాతిస్త్రినయన ప్రియా ॥
మరీచిర్భగవాన్ రుద్రస్సంభూతిశ్శర్వ వల్లభా ।
గంగాధరోఽగిరా జ్ఞేయస్స్మృతిస్సాక్షాదుమా స్మృతా ॥
పులస్త్యశశభృన్మౌలిః ప్రీతిః కాంతా పినాకినః ।
పులహస్త్రిపురధ్వంసీ తత్ప్రియా తు శివప్రియా ॥
క్రతుధ్వంసీ క్రతుః ప్రోక్తస్సంనతిర్దయితా విభోః ।
త్రినేత్రోఽ త్రిరుమా సాక్షాదనసూయా స్మృతా బుధైః ॥

మహాదేవుడు అగ్ని, శివుని అర్ధాంగియగు పార్వతియే స్వాహాదేవి. ముక్కంటి దేవుడే యముడు. పార్వతియే యముని ప్రియురాలు. ఈశ్వరభగవానుడే నిర్ఋతి. పార్వతి నిర్ఋతి ప్రియురాలు. రుద్రభగవానుడే వరుణుడు. పార్వతియే వరుణుని ప్రియురాలు. బాలచంద్రుని శిరముపై ధరించిన శివుడే వాయువు, పార్వతియే వాయువుయొక్క ప్రియురాలు. యజ్ఞదేవత యొక్క తలను నరికిన శివుడే కుబేరుడు. పార్వతియే బుద్ధి సంపద. చంద్రవంకను

శిరోభూషణముగా ధరించిన శివుడే చంద్రుడు, రుద్రుని ప్రియురాలగు పార్వతియే రోహిణి. పరమేశ్వరుడే ఈశానుడు. ఆ పరమేశ్వరియే ఈశానుని పత్ని. ఆదిశేషుడు కంఠాభరణముగా గల శివుడే ఆదిశేషుడు. అనంతురాలగు పార్వతియే శేషుని పత్ని. కాలమునకు శత్రువు (అతీతుడు) అగు శివుడే కాలాగ్ని రూపములోనున్న రుద్రుడు. ఆ కాలాంతకుడగు శివుని ప్రియురాలే కాళి. పురుషుడని వర్ణించబడిన శివుడే మనువు. శివుని ప్రియురాలగు పార్వతియే శతరూప. సాక్షాత్తుగా మహాదేవుడే దక్షుడు. ఆ పరమేశ్వరియే ప్రసూతి. శివుడే రుచి. భవానియే ఆకూతి అని పండితులచే చెప్పబడుచున్నది. భగుని నేత్రములను ఊడబెరికిన శివుడే భృగుడు. ఆ ముక్కంటియొక్క ప్రియురాలగు పార్వతియే ఖ్యాతి. రుద్రభగవానుడే మరీచి, శివుని ప్రియురాలగు పార్వతియే సంభూతి. ఆ గంగాధరుడే అంగీరసుడని తెలియదగును. సాక్షాత్తు ఉమాదేవియే స్మృతి యని ఋషులు చెప్పుచున్నారు. చంద్రుని శిరముపై దాల్చిన శివుడే పులస్త్యుడు. పినాకధారియగు శివుని ప్రియురాలగు పార్వతీయే ప్రీతి. త్రిపురములను ధ్వంసము చేసిన శివుడే పులహుడు. శివుని ప్రియురాలగు పార్వతియే పులహునీ ప్రియురాలు. దక్షయజ్ఞమును నాశనము చేసిన శివుడే క్రతువు అని చెప్పబడినాడు. ఆ విభుని ప్రియురాలగు పార్వతియే సంగతి. ఆ ముక్కంటియే అత్రి. ఉమాదేవియే సాక్షాత్తుగా అనసూయ అని పండితులు చెప్పుచున్నారు.

కశ్యపః కాలహా దేవో దేవమాతా మహేశ్వరీ ।
వసిష్ఠో మన్మథారాతిర్దేవీ సాక్షాదరుంధతీ ॥
శంకరః పురుషాస్సర్వే స్త్రియస్సర్వా మహేశ్వరీ ।
సర్వే స్త్రీపురుషాస్తస్మాత్తయోరేవ విభూతయః ॥
విషయీ భగవానీశో విషయః పరమేశ్వరీ ।
శ్రావ్యం సర్వముమారూపం శ్రోతా శూలవరాయుధః ॥
ప్రష్టవ్యం వస్తుజాతం తు ధత్తే శంకరవల్లభా।
ప్రష్టా స ఏవ విశ్వాత్మా బాలచంద్రావతంసకః ॥
ద్రష్టవ్యం వస్తురూపం తు బిభర్తి భవవల్లభా ।
ద్రష్టా విశ్వేశ్వరో దేవశ్శశిఖండ శిఖామణిః ॥
రసజాతం మహాదేవీ దేవో రసయితా శివః ।
ప్రేయజాతం చ గిరిజా ప్రేయాంశ్చైవ గరాశనః ॥
మంతవ్యవస్తుతాం ధత్తే సదా దేవీ మహేశ్వరీ ।
మంతా స ఏవ విశ్వాత్మా మహాదేవో మహేశ్వరః ॥
బోద్ధవ్యవస్తురూపం తు బిభర్తి భవవల్లభా ।
దేవస్స ఏవ భగవాన్ బోద్ధా ముగ్ధేందుశేఖరః ॥
ప్రాణః పినాకీ సర్వేషాం ప్రాణినాం భగవాన్ ప్రభుః ।
ప్రాణస్థితిస్తు సర్వేషామంబికా చాంబురూపిణీ ॥
బిభర్తి క్షేత్రతాం దేవీ త్రిపురాంతకవల్లభా।
క్షేత్రజ్ఞత్వం తదా ధత్తే భగవానంతకాంతకః ॥

కాలాంతకుడగు ఆ శివదేవుడే కశ్యపుడు. ఆ మహేశ్వరియే దేవమాత యగు అదితి. మన్మథశత్రువగు శివుడే వసిష్ఠుడు. పార్వతీదేవియే సాక్షాత్తుగా అరుంధతి. పురుషులందరు శంకరస్వరూపులే. స్త్రీలందరు మహేశ్వరియొక్క స్వరూపము వారే. కావున, స్త్రీపురుషులు అందరు వారిద్దరి విభూతులే. విషయములను గ్రహించే ద్రష్ట ఈశభగవానుడే. విషయములు పరమేశ్వరియే. వినుటకు ఇంపైన శబ్దములన్నియు ఉమారూపమే. గొప్ప శూలము ఆయుధముగా గల శివుడే వినువాడు, ప్రశ్నించదగిన (దేని విషయములో జిజ్ఞాస పుట్టునో అట్టి) వస్తుసముదాయమంతనూ శంకరుని ప్రియురాలగు పార్వతియే ధరించి యున్నది. జగత్తునకు ఆత్మ అయినవాడు, బాలచంద్రుని శిరో భూషణముగా ధరించినవాడు అగు ఆ శివుడే ప్రశ్నించువాడు (జిజ్ఞాసువు). చూడదగిన వస్తుసముదాయము నంతనూ శివుని ప్రియురాలగు పార్వతియే ధరించు చున్నది. చంద్రవంకను శిరోమణిగా దాల్చిన జగదీశ్వరుడగు ఆ దేవుడే చూచేవాడు. రసముల సముదాయము ఆ మహాదేవియే. రసములను ఆస్వాదించువాడు శివుడే ప్రీతికరమైన వస్తువుల సముదాయము పార్వతియే. వాటియందు ప్రీతి గలవాడు విషమును మ్రింగిన శివుడే, మననము చేయదగిన వస్తువుయొక్క స్వరూపమును సర్వకాలములలో మహేశ్వరియగు ఆ దేవియే ధరించి యున్నది. జగత్తునకు ఆత్మ అయినవాడు, మహేశ్వరుడు అగు ఆ మహాదేవుడే మననము చేయువాడు. శివుని ప్రియురాలగు పార్వతియే తెలియదగిన వస్తువుల స్వరూపమును ధరించి యున్నది. చంద్రవంకను శిరముపై దాల్చిన, ప్రకాశస్వరూపుడగు ఆ శివభగవానుడే తెలుసుకొనువాడు. ప్రాణులందరిలోని ప్రాణము పినాకమనే ధనస్సును ధరించిన జగన్నాథుడగు శివభగవానుడే. నీరు రూపములో సర్వప్రాణుల ప్రాణములను నిలబెట్టునది ఆ జగన్మాతయే. త్రిపురములను నశింపజేసిన శివునకు ప్రియురాలగు పార్వతీదేవి క్షేత్రము (సమష్టి మరియు వ్యష్టి దేహేంద్రియమనస్సంఘాతము) ను ధరించగా, అపుడు మృత్యువునకు మృత్యువు అగు శివభగవానుడు క్షేత్రజ్ఞస్వరూపమును ధరించి యున్నాడు.

**అహశ్శూలాయుధో దేవశ్శూలపాణి ప్రియా నిశా ।**

**ఆకాశశ్శంకరో దేవః పృథివీ శంకర ప్రియా ॥**

**సముద్రో భగవానీశో వేలా శైలేంద్రకన్యకా ।**

**వృక్షో వృషధ్వజో దేవో లతా విశ్వేశ్వరప్రియా ॥**

**పుంలింగమఖిలం ధత్తే భగవాన్ పురశాసనః ।**

**స్త్రీలింగం చాఖిలం ధత్తే దేవీ దేవమనోరమా ॥**

**శబ్దజాలమశేషం తు ధత్తే శర్వస్య వల్లభా ।**

**అర్థస్వరూపమఖిలం ధత్తే ముగ్ధేందుశేఖరః ॥**

**యస్య యస్య పదార్థస్య యా యా శక్తిరుదాహృతా ।**

**సా సా విశ్వేశ్వరీ దేవీ స స సర్వో మహేశ్వరః ॥**

**యత్పరం యత్పవిత్రం చ యత్పుణ్యం యచ్చ మంగలమ్ ।**

**తత్తదాహ మహాభాగస్తయోస్తేజో విజృంభితమ్ ॥**

యథా దీప్తస్య దీపస్య శిఖా దీపయతే గృహమ్ ।
తథా తేజస్తయోరేతద్వ్యాప్య దీపయతే జగత్ ॥
తృణాది శివమూర్త్యంతం విశ్వస్యాతిశయక్రమః ।
సన్నికర్షక్రమవశాత్తయోరితి పరా శ్రుతిః ॥
సర్వాకారాత్మకావేతౌ సర్వశ్రేయో విధాయినౌ ।
పూజనీయౌ నమస్కార్యౌ చింతనీయౌ చ సర్వదా ॥
యథా ప్రజ్ఞమిదం కృష్ణ యాథాత్మ్యం పరమేశయోః ।
కథితం హి మయా తేఽద్య న తు తావదియత్తయా ॥

శూలమును ఆయుధముగా ధరించిన శివదేవుడు పగలు కాగా, ఆయనకు ప్రియురాలగు పా◌ార్వతి రాత్రి అయినది. శంకరదేవుడే ఆకాశము కాగా, శంకరుని ప్రియురాలగు పార్వతి భూమి అయినది. ఈశభగవానుడు సముద్రము కాగా, పార్వతి చెలియలి కట్ట అయినది. వృషభము ధ్వజమునందు చిహ్నముగా గల శివదేవుడు చెట్టు కాగా, ఆ విశ్వేశ్వరుని ప్రియురాలగు పార్వతి తీగ అయినది. త్రిపురాసురులను సంహరించిన శివభగవానుడు పుంలింగమునకు అంతకు స్థితిని కల్పించగా, ఆ దేవుని మనస్సును రమింపజేయు పార్వతీదేవి స్త్రీలింగమునకంతకూ స్థితిని కలిగించు చున్నది. శివుని ప్రియురాలగు పార్వతి శబ్దసముదాయమునంతను ధరించియుండగా, బాలచంద్రుని శిరముపై దాల్చిన శివుడు అర్థ స్వరూపమునంతనూ ధరించి యున్నాడు. ఏయే పదార్థములకు ఏయే శక్తులు వర్ణించబడినవో, అవి అన్నియు ఆ విశ్వేశ్వరీ దేవియే; ఆ సర్వము మహేశ్వరుడే. ఓ మహాత్ములారా! శ్రేష్టమైనది ఏది గలదో, పవిత్రమైనది ఏది గలదో, పుణ్యమైనది ఏది గలదో, మంగళకరమైనది ఏది గలదో, అవి అన్నియు వారిద్దరి తేజస్సు యొక్క విస్తారము మాత్రమే. దీపమును వెలిగించిన చో దాని జ్వాల ఇంటికి వెలుతురునిచ్చును. అదే విధముగా, వారిద్దరి తేజస్సు ఈ జగత్తును వ్యాపించి ప్రకాశింపజేయుచున్నది. గడ్డిపోచతో మొదలిడి శివమూర్తి వరకు జగత్తులో ఉన్న క్రమవికాసము వారిద్దరి సంయోగముయొక్క క్రమమునకు వశమై యున్నదని సర్వోత్కృష్టమగు వేదవచనము చెప్పుచున్నది. ఆకారములన్నింటియొక్క ఆత్మ వీరిద్దరే. వీరిద్దరు సర్వులకు శ్రేయస్సును సమగూర్చెదరు. జనులు సర్వకాలములలో వీరిద్దరిని పూజించి నమస్కరించి ధ్యానించ వలెను. ఓ శ్రీకృష్ణా! నేను నాకు గల ప్రజ్ఞకు లోబడి పార్వతీపరమేశ్వరుల తత్త్వమును నీకీనాడు. చేప్పితిని. అంతేగానీ, వారి విభూతి ఇంత మాత్రమే అని కాదు.

తత్కథం శక్యతే వక్తుం యాథాత్మ్యం పరమేశయోః ।
మహతామపి సర్వేషాం మనసోఽపి బహిర్గతమ్ ॥
అంతర్గతమనన్యానామీశ్వరార్పిత చేతసామ్ ।
అన్యేషాం బుద్ధ్యనారూఢమారూఢం చ యథైవ తత్ ॥
యేయముక్తా విభూతిర్వై ప్రాకృతీ సాఽ పరా మతా ।
అప్రాకృతాం పరామన్యం గుహ్యం గుహ్యవిదో విదుః ॥

యతో వాచో నివర్తంతే మనసా చేంద్రియైస్సహ ।
అప్రాకృతీ పరా చైషా విభూతిః పారమేశ్వరీ ॥
సైవేహ పరమం ధామ సైవేహ పరమాగతిః ।
సైవేహ పరమా కాష్ఠా విభూతిః పరమేష్ఠినః ॥
తాం ప్రాప్తుం ప్రయతంతేఽ త్ర జితశ్వాసా జితేంద్రియాః ।
గర్భకారా గృహద్వారం నిశ్ఛిద్రం ఘటితుం యథా ॥
సంసారాశీ విషాలీఢమృత సంజీవనౌషధమ్ ।
విభూతిం శివయోర్విద్వాన్న బిభేతి కుతశ్చన ॥
యః పరామపరాం చైవ విభూతిం వేత్తి తత్త్వతః।
సోఽ పరాం భూతిముల్లంఘ్య పరాం భూతిం సమశ్నుతే ॥
ఏతత్తే కథితం కృష్ణ యాథాత్మ్యం పరమాత్మనోః ।
రహస్యమపి యోగ్యోఽసి భర్గభక్తో భవానితి ॥
నాశిష్యేభ్యోఽప్యశైవేభ్యో నాభక్తేభ్యః కదాచన ।
వ్యాహరేదీశయోర్భూతిమితి వేదానుశాసనమ్ ॥

పార్వతీపరమేశ్వరుల అట్టి మనస్సునకు కూడా గోచరము కాని యథార్థస్వరూపమును మహాత్ములందరు సమగూడియైననూ చెప్పుట ఎట్లు శక్యమగును? ఈశ్వరుని యందు అనన్య (భేదము లేని) బుద్ధితో మనస్సును అర్పించిన వారలకు మాత్రమే బుద్ధియందు ఆరూఢమై అంతరంగమునందు విరాజిల్లే ఈ తత్త్వము ఇతరుల బుద్ధికి అందదు. ఇంతవరకు చెప్పబడిన ఈ విభూతి ప్రకృతికి సంబంధించినది గనుక అపరా (రెండవ స్థాయికి చెందినది) అని చెప్పబడును. దీనికంటే విలక్షణమైనది, ప్రకృతికి అతీతమైనది, రహస్యమైనది అగు పరావిభూతిని రహస్యవేత్తలగు ఋషులు తెలియుచున్నారు. పరమేశ్వరుని ఈ ప్రకృతికి అతీతమైన పరావిభూతిని వర్ణించలేక వాక్కులు మనస్సుతో మరియు ఇంద్రియములతో సహా వెనుక ముఖము పట్టుచున్నవి. ఈ జగత్తులో అదియే సర్వోత్కృష్టమగు తేజస్సు; అదియే సర్వోత్కృష్టమగు మోక్షము; అదియే పరమేశ్వరుని విభూతి యొక్క చరమసీమ. ఈ లోకములో యోగులు ఇంద్రియములను, శ్వాసను జయించి దానిని పొంది, తల్లి గర్భము అనే కారాగారముయొక్క ద్వారమును బంధించుటకు అనగా, మరల జన్మను పొందకుండుటకు యత్నించుచున్నారు. సంసారము అనే పాముచే కరువబడి మరణించినవారిని బ్రతికించే ఔషధము అగు పార్వతీపరమేశ్వరుల విభూతిని తెలుసుకున్నవాడు దేని వలనైననూ భయపడడు. ఎవడైతే పరాపర విభూతుల తత్త్వమునెరుంగునో, వాడు అపరావిభూతిని అతిక్రమించి పరావిభూతిని పొందును. ఓ శ్రీకృష్ణా! ఈ విధముగా పార్వతీపరమేశ్వరుల యథార్థతత్త్వము రహస్యమే అయిననూ, నీవు యోగ్యుడవు మరియు శివభక్తుడవు గనుక, నేను నీకు చెప్పితిని. పార్వతీపరమేశ్వరుల విభూతిని శిష్యులు కాని వారికి, శివభక్తులు కాని వారికి చెప్పరాదని వేదము శాసించు చున్నది.

**తస్మాత్త్వమతికల్యాణ పరేభ్యః కథయేన్న హి ।**

**త్వాదృశేభ్యోఽనురూపేభ్యః కథయైతన్న చాన్యథా ॥**

**విభూతిమేతాం శివయోర్యోగ్యేభ్యో యః ప్రదాపయేత్ ।**

**సంసారసాగరాన్ముక్తశ్శివ సాయుజ్యమాప్నుయాత్ ॥**

**కీర్తనాదస్య నశ్యంతి మహాంత్యః పాపకోటయః ।**

**త్రిశ్చతుర్ధా సమభ్యస్తైర్వినశ్యంతి తతోఽ ధికాః ॥**

**నశ్యంత్యనిష్టరిపవో వర్ధంతే సుహృదస్తథా ।**

**విద్యా చ వర్ధతే శైవీ మతిస్సత్యే ప్రవర్తతే ॥**

**భక్తిః పరా శివే సాంబే సానుగే సపరిచ్ఛదే ।**

**యద్యదిష్టతమం చాన్యత్తత్తదాప్నోత్య సంశయమ్ ॥**

**అంతశ్శుచిశ్శివే భక్తో విస్రబ్ధః కీర్తయేద్యది ।**

**ప్రబలైః కర్మభిః పూర్వైః ఫలం చేత్ప్రతిబధ్యతే ॥**

**పునః పునస్సమభ్యస్యేత్తస్య నాస్తీహ దుర్లభమ్ ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే గౌరీశంకర విభూతియోగో నామ చతుర్థోఽధ్యాయః ॥**

ఓయీ పరమమంగళస్వరూపా! కావున, నీవు దీనిని ఇతరులకు చెప్పకుము. నీవలె యోగ్యులైన వారికి దీనిని చెప్పుము. మరియొక విధముగా చేయకుము (83). పార్వతీపరమేశ్వరుల ఈ విభూతిని ఎవడైతే యోగ్యులకు ఇచ్చునో, వాడు సంసారసముద్రమునుండి విముక్తుడై శివుని సాయుజ్యమును పొందును. దీనిని కీర్తించుట వలన కోట్లాది మహాపాపములు నశించును. మూడు నాలుగు సార్లు అభ్యాసమును చేసినచో, అంత కంటే అధికములగు పాపములు నశించును. ఇష్టులు కాని శత్రువులు నశించి మిత్రులు వర్ధిల్లెదరు. శివవిద్య వర్ధిల్లును. బుద్ధి సత్యమునందు ప్రవర్తిల్లును. అతడు జగన్మాతతో, అనుచరులతో మరియు ప్రమథగణములతో కూడియున్న శివునియందు పరాభక్తిని, మరియు తనకు ఏవేవి ఇష్టమో వాటిని నిస్సందేహముగా పొందును. అంతరంగములో శుచియగు శివభక్తుడు దీనిని విశ్వాసముతో కీర్తించ వలెను. బలీయమైన పూర్వకర్మలచే ఫలము అడ్డుకొనబడినచో, దీనిని మరల మరల అభ్యసించ వలెను. అట్లు చేయు వానికి లభింప శక్యము కానిది లేదు.

శ్రీ శివమహాపురాణములోని వాయువీయసంహితయందు ఉత్తరఖండలో గౌరీశంకరుల విభూతిని వర్ణించే నాల్గవ అధ్యాయము ముగిసినది.

# 5 – శివ తత్త్వ నిరూపణము

ఉపమన్యురువాచః

విగ్రహం దేవదేవస్య విశ్వమేతచ్చరాచరమ్ ।
తదేవం న విజానంతి పశవః పాశగౌరవాత్ ॥
తమేకమేవ బహుధా వదంతి యదునందన ।
అజానంతః పరం భావమవికల్పం మహర్షయః ॥
అపరం బ్రహ్మరూపం చ పరం బ్రహ్మాత్మకం తథా ।
కేచిదాహుర్మహా దేవమనాదినిధనం పరమ్ ॥
భూతేంద్రియాంతః కరణ ప్రధానవిషయాత్మకమ్ ।
అపరం బ్రహ్మ నిర్దిష్టం పరం బ్రహ్మ చిదాత్మకమ్ ॥
బృహత్త్వాద్బృంహణత్వాద్వా బ్రహ్మ చేత్యభిధీయతే ।
ఉభే తే బ్రహ్మణో రూపే బ్రహ్మణోఽ ధిపతేః ప్రభోః ।
విద్యాఽ విద్యాస్వరూపీతి కైశ్చిదీశో నిగద్యతే ॥
విద్యాం తు చేతనాం ప్రాహుస్తథాఽ విద్యామచేతనామ్ ।
విద్యాఽవిద్యాత్మకం చైవ విశ్వం విశ్వగురోర్విభోః ॥
రూపమేవ న సందేహో విశ్వం తస్య వశే యతః ।
భ్రాంతిర్విద్యా పరా చేతి శార్వం రూపం పరం విదుః ॥
అయథా బుద్ధిరర్థేషు బహుధా భ్రాంతిరుచ్యతే ।
యథార్థాకార సంవిత్తిర్విద్యేతి పరికీర్త్యతే ॥
వికల్ప రహితం తత్త్వం పరమిత్యభిధీయతే ।
వైపరీత్యాదసచ్ఛబ్దః కథ్యతే వేదవాదిభిః ॥
తయోః పతిత్వాత్తు శివస్సదసత్పతిరుచ్యతే ।
క్షరాక్షరాత్మకం ప్రాహుః క్షరాక్షరపరం పరే ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

ఈ చరాచర జగత్తు దేవదేవుని శరీరము. జీవులు బంధము బలమైనదగుటచే దానిని ఈ విధముగా తెలియ జాలకున్నారు. ఓ యదుకుమారా! మహర్షులు భేదములు లేని పరమార్థస్థితిని యెరుంగని కారణముగా అద్వితీయుడగు ఆ పరమేశ్వరుని అనేకరూపములలో వర్ణించుచున్నారు. ఆద్యంతములు లేనివాడు, సర్వాతీతుడు అగు మహాదేవుని కొందరు అపరబ్రహ్మ స్వరూపుడనియు, మరికొందరు పరబ్రహ్మస్వరూపుడనియు చెప్పుచున్నారు. పంచభూతములు, ఇంద్రియములు, అంతఃకరణము, ప్రధానము (అవ్యక్తము), విషయములు అనే స్వరూపము గలది అపరబ్రహ్మ అనియు, కేవలచేతనస్వరూపము పరబ్రహ్మ అనియు నిర్దేశించ బడినది, పెద్దది మరియు వ్యాపకము అగుటచే పరమాత్మ బ్రహ్మ అని పిలువబడు చున్నాడు. సృష్టికర్తయగు బ్రహ్మకు అధీశ్వరుడు, సర్వసమర్థుడు అగు ఆ పరబ్రహ్మకు రెండు రూపములు

గలవు. ఈశ్వరుడు విద్య మరియు అవిద్య స్వరూపముగా కలిగి రెండు రూపములలో నున్నాడని కొందరు చెప్పుచున్నారు. చేతనరూపము విద్య అనియు, జడము అవిద్య అనియు చెప్పెదరు. చేతనజడాత్మకమగు ఈ జగత్తు, సర్వవ్యాపకుడు మరియు జగత్తునకు తండ్రి అగు శివుని రూపమే. సందేహము లేదు. ఏలయనగా, జగత్తు ఆయన వశములో నున్నది. భ్రాంతి, విద్య, పరావిద్య అని శివునకు మూడు ఉత్కృష్టరూపములు గలవని చెప్పుచున్నారు, వస్తువులను ఉన్నవి ఉన్నట్లుగా గాక, పలు విధములుగా తెలుసుకొనుట భ్రాంతి అనబడును. వస్తువుల ఆకారమును ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొనుట విద్య అని కీర్తించ బడుచున్నది. భేదములు లేని తత్త్వము పరము (పరావిద్య) అనబడును. దానికి విరుద్ధమైనదీ అసత్ అని వేదవేత్తలు చెప్పుచున్నారు. ఆ రెండిటికీ ప్రభువు అగుటచే శివునకు సదసత్పతి అని పేరు. శివుడు క్షర- అక్షర స్వరూపుడని కొందరు, మరికొందరు ఆయన క్షరాక్షరములకు అతీతుడనియు చెప్పుచున్నారు.

**క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽ క్షర ఉచ్యతే ।**
**ఉభే తే పరమేశస్య రూపే తస్య వశే యతః ॥**
**తయోః పరశ్శివశ్శాంతః క్షరాక్షర పరస్స్మృతః ।**
**సమష్టివ్యష్టిరూపం చ సమష్టివ్యష్టకారణమ్ ॥**
**వదంతి మునయః కేచిచ్ఛివం పరమకారణమ్ ।**
**సమష్టిమాహురవ్యక్తం వ్యష్టిం వ్యక్తం తథైవ చ ॥**
**తే రూపే పరమేశస్య తదిచ్ఛాయాః ప్రవర్తనాత్ ।**
**తయోః కారణభావేన శివం పరమకారణమ్ ॥**
**కారణార్థవిదః ప్రాహుస్సమష్టివ్యష్టి కారణమ్ ।**
**జాతివ్యక్తిస్వరూపీతి కథ్యతే కైశ్చిదీశ్వరః ॥**
**యా పిండేయ్యనువర్తేత సా జాతిరితి కథ్యతే ।**
**వ్యక్తిర్వ్యా వృత్తిరూపం తం పిండజాతేస్సమాశ్రయమ్ ॥**
**జాతయో వ్యక్తయశ్చైవ తదాజ్ఞా పరిపాలితాః ।**
**యతస్తతో మహాదేవో జాతివ్యక్తి వపుస్స్మృతః ॥**
**ప్రధానపురుషవ్యక్తకాలాత్మా కథ్యతే శివః ।**
**ప్రధానం ప్రకృతిం ప్రాహుః క్షేత్రజ్ఞం పురుషం తథా ॥**
**త్రయోవింశతితత్త్వాని వ్యక్తమాహుర్మనీషిణః ।**
**కాలః కార్యప్రపంచస్య పరిణామైక కారణమ్ ॥**
**ఏషామీశోఽధిపో ధాతా ప్రవర్తకనివర్తకః ।**
**ఆవిర్భావతిరో భావపేతురేకస్స్వరాడజః ॥**

సకలపదార్థములు క్షరము (నశించునది) అనబడును. కమ్మరివాని దాగలి వలె వికారములు లేని చైతన్యము అక్షరమనబడును. ఆ రెండు పరమేశ్వరుని రూపములే. ఏలయనగా, అవి ఆయన వశములో నున్నవీ. ఆ రెండింటికీ అతీతమైనవాడు, శాంతుడు అగు శివుడు క్షరాక్షరపరుడు అని

చెప్పబడు చున్నాడు. సమష్టి మరియు వ్యష్టి శివుని రూపమే. సమష్టికి మరియు వ్యష్టికి ఆయనయే కారణమగుచున్నాడు. శివుడు సర్వకారణకారణుడని కొందరు మునులు చెప్పుచున్నారు. అవ్యక్తము (జగద్బీజము) నకు సమష్టి అనియు, వ్యక్తము (జగత్తు) నకు వ్యష్టి అనియు పేరు. అవి పరమేశ్వరుని ఇచ్ఛనుండి ఉద్భవించుట వలన ఆయన రూపములు అగుచున్నవి. ఆ సమష్టివ్యష్టులకు కారణమగుట వలన శివుడు పరమకారణమని కారణతత్త్వము తెలిసిన పెద్దలు చెప్పుచున్నారు. ఈశ్వరుడు జాతివ్యక్తిస్వరూపుడని కొందరు చెప్పుచున్నారు. ప్రతీ శరీరమునందు అనువృత్తమగునది జాతి అనబడును. శరీరముయొక్క జాతిని ఆశ్రయించికొని ఉండి దానిని ఇతరమునుండి వేరు చేసి చూపునది వ్యక్తి అనబడును. జాతులు మరియు వ్యక్తులు ఆ శివుని ఆజ్ఞ చేతనే పరిపాలించ బడుచున్నవి. కావుననే, మహాదేవుడు జాతివ్యక్తులే శరీరముగా గలవాడని చెప్పబడుచున్నాడు. ప్రధానము, పురుషుడు, వ్యక్తము, కాలము స్వరూపముగా గలవాడు శివుడు అని చెప్పబడుచున్నాడు. ప్రధానమనగా జగత్తుయొక్క ఉపాదానము. క్షేత్రము (దేహేంద్రియమనస్సంఘాతము) ను తెలియు చేతనుడు పురుషుడనబడును. ఇరవై మూడు తత్త్వములకు వ్యక్తమని పేరు అని విద్వాంసులు చెప్పుచున్నారు. కార్యజగత్తులో వచ్చే మార్పులకు కాలమే ఏకైక కారణము. స్వయంప్రకాశస్వరూపుడు, పుట్టుక లేనివాడు, అద్వితీయుడు అగు శివుడు వీటిని సృష్టించి ప్రవర్తింప జేసి, నివర్తింపజేసి, ఇవి అవిర్భవించుటకు, మరల అంతర్ధానమగుటకు కారణమగు చున్నాడు.

తస్మాత్ప్రధాన పురుషవ్యక్త కాలస్వరూపవాన్ ।
హేతుర్నేతాధిపస్తేషాం ధాతా చోక్తో మహేశ్వరః ॥
విరాడ్ఢిరణ్య గర్భాత్మా కైశ్చిదీశో నిగద్యతే ।
హిరణ్య గర్భో లోకానాం హేతుర్విశ్వాత్మకో విరాట్ ॥
అంతర్యామీ పరశ్చేతి కథ్యతే కవిభిశ్శివః ।
ప్రాజ్ఞస్తైజస విశ్వాత్మేత్యపరే సంప్రచక్షతే ॥
తురీయమపరే ప్రాహుస్సౌమ్యమేవ పరే విదుః ।
మాతా మానం చ మేయం చ మతం చాహురథాపరే ॥
కర్తా క్రియా చ కార్యం చ కరణం కారణం పరే ।
జాగ్రత్స్వప్నసుషుప్త్యాత్మేత్యపరే సంప్రచక్షతే ॥
తురీయమపరే ప్రాహుస్తుర్యాతీతమితీతరే ।
తమాహుర్నిర్గుణం కేచిద్గుణవంతం పరే విదుః ॥
కేచిత్సంసారిణం ప్రాహుస్తమసంసారిణం పరే ।
స్వతంత్రమపరే ప్రాహురస్వతంత్రం పరే విదుః ॥
ఘోరమిత్యపరే ప్రాహుస్సౌమ్యమేవ పరే విదుః ।
రాగవంతం పరే ప్రాహుర్వీతరాగం తథాపరే ॥
నిష్క్రియం చ పరే ప్రాహుస్సక్రియం చేతరే జనాః ।
నిరింద్రియం పరే ప్రాహుస్సేంద్రియం చ తథాపరే ॥

ధ్రువమిత్యపరే ప్రాహుస్తమధ్రువ మితీతరే ।
అరూపం కేచిదాహుర్వై రూపవంతం పరే విదుః ॥

కావున, ప్రధానము పురుషుడు వ్యక్తము మరియు కాలము అనునవి స్వరూపముగా గల మహేశ్వరుడు పోటీకి కారణమై పోటీని సృష్టించి వాటిని నడిపిస్తూ వాటికి అధిపతి అగుచున్నాడని చెప్పబడినది, ఈశ్వరుడు విరాట్ (స్థూలజగదభిమాని) అనియు, హిరణ్యగర్భుడు (సూక్ష్మజగదభిమాని) అనియు కొందరు చెప్పుచున్నారు. లోకములకు కారణమైనవాడు హిరణ్యగర్భుడు. స్థూలజగత్స్వరూపుడు విరాట్, శివుడు అంతర్యామి రూపముగా నున్న పరంబ్రహ్మ అని విద్వాంసులు చెప్పుచున్నారు. ఆయన ప్రాజ్ఞ (నిద్రావస్థాభిమాని), తైజస (స్వప్నావస్థాభిమాని), విశ్వ (జాగ్రదవస్థాభిమాని) స్వరూపుడని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన తురీయుడు (మూడు అవస్థలకు అతీతుడు) అనీ మరికొందరు చెప్పుచున్నోరు. ఆయన అఘోరరూపుడని కొందరు చెప్పుచున్నారు. ప్రమాత (తెలుసుకొనువాడు), ప్రమాణము (తెలుసుకొనే సాధనము), ప్రమేయము (తెలియబడేది), మరియు ప్రమా (జ్ఞానము) అనునవి ఆయన స్వరూపమేనని ఇంకొందరు చెప్పుచున్నారు. కర్త, క్రియ, కార్యము, సాధనము, కారణము కూడా ఆయనయేనని కొందరు చెప్పుచున్నారు. ఆయన జాగ్రత్స్వప్నసుషుప్తులనే అవస్థలే స్వరూపముగా గలవాడని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన తురీయుడు (మూడు అవస్థలకు సమానమగు చైతన్యము) అనీ కొందరు చెప్పగా, తురీయమునకు అతీతుడని మరి కొందరు చెప్పుచున్నారు. ఆయన సంసారీ అనీ కొందరు చెప్పగా అసంసారీ అని మరి కొందరు చెప్పుచున్నారు. ఆయన స్వతంత్రుడని కొందరు, అస్వతంత్రుడని మరి కొందరు చెప్పుచున్నాడు. ఆయన భయంకరాకారుడని కొందరు, ప్రసన్నమగు ఆకారము గలవాడని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన రాగము. గలవాడని కొందరు, విరాగి యని మరి కొందరు చెప్పుచున్నారు. ఆయన క్రీయ గలవాడని కొందరు చెప్పగా, మరి కొందరు జనులు ఆయనయందు క్రియ లేదని చెప్పుచున్నారు. ఆయనకు ఇంద్రియములు లేవని కొందరు, కలవని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన శాశ్వతుడనీ కొందరు, కాదని కొందరు చెప్పుచున్నారు. ఆయనకు రూపము లేదని కొందరు, ఉన్నదని మరి కొందరు చెప్పుచున్నారు.

అదృశ్యమపరే ప్రాహుర్దృశ్యమిత్యపరే విదుః ।
వాచ్యమిత్యపరే ప్రాహురవాచ్యమితి చాపరే ।
శబ్దాత్మకం పరే ప్రాహుశ్శబ్దాతీత మథాపరే ॥
కేచిచ్చింతామయం ప్రాహుశ్చింతయా రహితం పరే ।
జ్ఞానాత్మకం పరే ప్రాహుర్విజ్ఞానమితి చాపరే ॥
కేచిత్ జ్ఞేయమితి ప్రాహురజ్ఞేయమితి కేచన ।
పరమేకే తమేవాహురపరం చ తథా పరే ॥
ఏవం వికల్పమానం తు యాథాత్మ్యం పరమేష్ఠినః ।
నాధ్యవస్యంతి మునయో నానా ప్రత్యయకారణాత్ ॥
యే పునస్సర్వభావేన ప్రపన్నాః పరమేశ్వరమ్ ।
తే హి జానంత్యయత్నేన శివం పరమకారణమ్ ॥
యావత్పశుర్నైవ పశ్యత్యనీశం పురాణం భువనస్యేశితారమ్ ।
తావద్దుఃఖే వర్తతే బద్ధపాశస్సంసారేఽస్మిన్ చక్రనేమిక్రమేణ ॥
యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్ ।
తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమముపైతి సామ్యమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివతత్త్వ
నిరూపణం నామ పంచమోఽధ్యాయః ॥

ఆయన కంటికి కానరాడని కొందరు, కానవచ్చునని మరికొందరు అభిప్రాయ పడుచున్నారు. ఆయన వాక్కులకు గోచరము కాడని కొందరు, అగునని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన శబ్దస్వరూపుడని కొందరు, శబ్దమునకు అతీతుడని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన మనస్సునకు గోచరమగునని కొందరు చెప్పగా, మనస్సునకు అతీతుడని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన నిర్విశేషజ్ఞానస్వరూపుడని కొందరు చెప్పగా, సవిశేషజ్ఞానస్వరూపుడని మరి కొందరు చెప్పుచున్నారు. ఆయన తెలియబడునని కొందరు చెప్పగా, తెలియబడడని మరికొందరు చెప్పుచున్నారు. ఆయన నిర్గుణుడని కొందరు, సగుణుడని మరికొందరు చెప్పుచున్నారు. ఈ విధముగా వివిధములగు అభిప్రాయములు ఉన్న కారణముగా మునులు ఆ పరమేశ్వరుని యథార్థస్వరూపమును గురించి కల్పనలను చేయుచూ నిశ్చయమునకు రాలేక పోవుచున్నారు. కాని, ఎవరైతే పరమేశ్వరుడే సర్వస్వము అనే భక్తితో శరణు జొచ్చెదరో, వారు అనాయాసముగా సర్వకారణకారణుడగు శివుని తెలుసుకొనుచున్నారు. తనకంటే అధికుడగు ఈశ్వరుడు లేనివాడు, సనాతనుడు, భువనమును పాలించువాడు అగు పరమేశ్వరుని జీవుడు ఎంతవరకు తెలియజాలడో, అంతవరకు దుఃఖముతో నిండిన ఈ సంసారమునందు రథచక్రము యొక్క ధరకు ఉండే క్రమములో క్రిందికి పైకి తిరుగుచుండును. ఎప్పుడైతే వివేకము గల సాధకుడు స్వయంప్రకాశస్వరూపుడు, జగత్కర్త, చేతనుడు, బ్రహ్మగారికి కూడా కారణమైనవాడు అగు ఈశ్వరుని దర్శించునో, అపుడా జ్ఞాని పుణ్యపాపములను దులిపి వేసుకొని నిర్మలుడై ఆ పరమేశ్వరునితో సర్వోత్తమమగు అభేదమును పొందును.

# 6 – శివుని మహిమను వర్ణించుట

ఉపమన్యురువాచః

న శివస్యాణవో బంధః కార్యో మాయేయ ఏవ వా ।
ప్రాకృతో వాథ బోద్ధా వా హ్యహంకారాత్మకస్తథా ॥
నైవాస్య మానసో బంధో న చైత్తో నేంద్రియాత్మకః ।
న చ తన్మాత్రబంధోఽపి భూతబంధో న కశ్చన ॥
న చ కాలః కలా చైవ న విద్యా నియతిస్తథా ।
న రాగో న చ విద్వేషశ్శంభో రమితతేజసః ॥
న చాస్త్యభినివేశోఽస్య కుశలాఽకుశలాన్యపి ।
కర్మాణి తద్విపాకశ్చ సుఖదుఃఖే చ తత్ఫలే ॥
ఆశయైర్నాపి సంబంధస్సంస్కారైః కర్మణామపి ।
భోగైశ్చ భోగసంస్కారైః కాలత్రితయగోచరైః ॥
న తస్య కారణం కర్తా నాదిరంత స్తథాంతరమ్ ।
న కర్మ కరణం వాపి నాకార్యం కార్యమేవ చ ॥
నాస్య బంధురబంధుర్వా నియంతా ప్రేరకోఽపి వా।
న పతిర్న గురుస్త్రాతా నాధికో న సమస్తథా ॥
న జన్మమరణే తస్య న కాంక్షితమకాంక్షితమ్ ।
న విధిర్న నిషేధశ్చ న ముక్తిర్న చ బంధనమ్ ॥
నాస్తి యద్యదకల్యాణం తత్తదస్య కదాచన ।
కల్యాణం సకలం చాస్తి పరమాత్మా శివో యతః ॥
స శివస్సర్వమేవేద మధిష్ఠాయ స్వశక్తిభిః ।
అప్రచ్యుతస్స్వతో భావాత్ స్థితః స్థాణురతస్స్మృతః ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను-

అణువులకు (పదార్థమునకు), లేదా క్రియకు, లేదా మాయకు, లేదా ప్రకృతికీ, లేదా బుద్ధికీ, లేదా అహంకారమునకు, లేదా మనస్సునకు, లేదా చిత్తము (స్మరణము) నకు, లేదా ఇంద్రియములకు, లేదా భూతతన్మాత్రలకు, లేదా పంచభూతములకు సంబంధించిన బంధము ఏదియు శివునకు లేదు, అనంతమగు తేజస్సు గల శివునకు కాలము గానీ, అంశము (కళ) గాని, విద్య గాని, నియతి గాని, రాగము గాని, ద్వేషము గాని లేవు. ఆయనకు పట్టుదల, కుశలము (కర్మలో నేర్పు లేక వివేకము), అకుశలము, కర్మలు, అవి పరిపక్వమగుట, పోటీ ఫలములగు సుఖదుఃఖములు లేవు. శివునకు మూడు కాలములయందు ఉండే భావనలతో గాని, కర్మల సంస్కారములతో గానీ, భోగములతో గాని, భోగసంస్కారములతో గాని సంబంధము లేనే లేదు. కారణము, కర్త, ఆది, అంతము, మధ్యము, కర్మ, కరణము, చేయకూడనిది, చేయవలసినది, బంధువు, బంధువు కానివాడు, నియమించు వాడు, ప్రేరేపించు వాడు, ప్రభువు గురువు,

రక్షించువాడు, అధికుడు, సమానుడు, పుట్టుక, మరణము, కోరబడేది, కోరబడనిది, విధి, నిషేధము, మోక్షము, బంధము అనునవి శివునకు లేవు. శివుడు పరమాత్మ గనుక, ఆయనకు సర్వము మంగళమే గాని, ఏ కాలమునందైననూ మంగళము కానిది లేనే లేదు. ఆ శివుడు ఈ సర్వమును తన శక్తులచే అధిష్ఠించి ఉన్నాడు. కానీ, ఆయన తన స్వరూపమునుండి జారిపోకుండ నుండుటచే, ఆయనకు స్థాణువు (చలనము లేనివాడు) అని పేరు వచ్చినది.

**శివేనాధిష్ఠితం యస్మాజ్జగత్ స్థావరజంగమ్ ।**

**సర్వరూపస్స్మృత శ్శర్వస్తథా జ్ఞాత్వా న ముహ్యతి ॥**

**శర్వో రుద్రో నమస్తస్మై పురుషస్సత్పరో మహాన్ ।**

**హిరణ్య బాహుర్భగవాన్ హిరణ్యపతిరీశ్వరః ॥**

**అంబికాపతిరీశానః పినాకీ వృషవాహనః ।**

**ఏకో రుద్రః పరం బ్రహ్మ పురుషః కృష్ణపింగలః ॥**

**బాలాగ్రమాత్రో హృన్మధ్యే విచింత్యో దహరాంతరే ।**

**హిరణ్యకేశః పద్మాక్షో హ్యరుణస్తామ్ర ఏవ చ ॥**

**యోఽవసర్పత్య సౌ దేవో నీలగ్రీవో హిరణ్మయః ।**

**సౌమ్యో ఘోరస్తథా మిశ్రశ్చాక్షరశ్చామృతోఽవ్యయః ॥**

**స పుంవిశేషః పరమో భగవానంతకాంతకః ।**

**చేతనాచేతనోన్ముక్తః ప్రపంచాచ్చ పరాత్పరః ॥**

**శివేనాతిశయత్వేన జ్ఞానైశ్వర్యే విలోకితే ।**

**లోకేశాతి శయత్వేన స్థితం ప్రాహుర్మనీషిణః ॥**

**ప్రతిసర్గప్రసూతానాం బ్రహ్మణాం శాస్త్ర విస్తరమ్ ।**

**ఉపదేష్టా స ఏవాదౌ కాలావచ్ఛేద వర్తినామ్ ॥**

**కాలావచ్ఛేదయుక్తానాం గురూణామప్యసౌ గురుః।**

**సర్వేషామేవ సర్వేశః కాలావచ్ఛేద వర్జితః ॥**

**శుద్ధా స్వాభావికీ తస్య శక్తిస్సర్వాతి శాయినీ ।**

**జ్ఞానమప్రతిమం నిత్యం వపురత్యంతనిర్మితమ్ ॥**

చరాచర జగత్తు శివునిచే అధిష్ఠించబడి యుండుటచే సంహారకుడగు శివుడే సర్వజగద్రూపములో నున్నాడని మహర్షులు చెప్పుచున్నారు. ఆ సత్యమును తెలుసుకున్న వ్యక్తి మోహమును పొందడు. రుద్రుడే సంహారకుడు. ఆయనకు నమస్కారమగు గాక! చేతనుడు, సద్రూపుడు, సర్వాతీతుడు, సర్వాధికుడు, బంగరు వలె మెరిసే చేతులు గలవాడు, షడ్గుణసంపన్నుడు, తేజస్సునకు ప్రభువు, జగన్నాథుడు, పార్వతీపతి, ఈశానరూపుడు, పినాకమును ధరించువాడు, వృషభము వాహనముగా గలవాడు, అద్వితీయుడు, రుద్రరూపుడు, పరంబ్రహ్మ, నలుపు యెరుపుల మిశ్ర వర్ణము గల పురుషుడు, హృదయమధ్యములో కేశాగ్రము వలె సూక్ష్మరూపములో నుండువాడు, బంగరు కేశములు గలవాడు, పద్మమును పోలిన కన్నులు గలవాడు, అరుణవర్ణము వాడు, రాగి రంగు గలవాడు అగు శివుని

హృదయాకాశములో ధ్యానించ వలెను. నల్లని కంఠము గలవాడు, తేజోమయుడు అగు శివుడే సూర్యరూపములో ఆకాశమునందు సంచరించు చున్నాడు. ప్రసన్నము, భయంకరము మరియు రెండింటి కలయిక అగు రూపములు ఆయనకు గలవు. ఆయన వినాశము లేనివాడు. ఆయన అమృతస్వరూపుడు మరియు వికారములు లేనివాడు. సర్వాతీతుడు, షడ్గుణై శ్వర్య సంపన్నుడు, మృత్యువునకు మృత్యువు, జడచేతనములనుండి విముక్తుడు, ప్రపంచమునకు మాత్రమే గాక ప్రకృతికి కూడ అతీతుడు అగు ఆ శివుడే పురుషోత్తముడు. జ్ఞానము మరియ ఈశ్వరత్వము అను వాటి చరమసీమను దర్శించుటచే, శివుడు లోకములయందలి ప్రభువులందరికంటే అతిశయముగా నున్నాడని విద్వాంసులు చెప్పుచున్నారు. ప్రతి సృష్టియందు పుట్టి, కాలమునకు వశవర్తులై యుండే బ్రహ్మలకు ఆయనయే సృష్ట్యాదియందు విస్తారమగు వేదమును ఉపదేశించును. కాలమునకు వశవర్తులై యుండే గురువులకు కూడా ఆయనయే గురువు. కాలపరిచ్ఛేదము లేని ఆ సర్వేశ్వరుడే అందరికీ ప్రభువు. ఆయనయొక్క శక్తి పరిశుద్ధమైనది, స్వభావసిద్ధమైనది, సర్వమును అతిశయించునది. ఆయన జ్ఞానము సాటి లేనిది, మరియు నిత్యము. నిర్మాణమునకు అతీతమైన ఆయన దేహము అవినాశి.

ఐశ్వర్యమ ప్రతిద్వంద్వం సుఖమాత్యంతికం బలమ్ ।
తేజః ప్రభావో వీర్యం చ క్షమా కారుణ్యమేవ చ ॥
పరిపూర్ణస్య సర్గాద్యైర్నాత్మనోఽస్తి ప్రయోజనమ్ ।
పరానుగ్రహ ఏవాస్య ఫలం సర్వస్య కర్మణః ॥
ప్రణవో వాచకస్తస్య శివస్య పరమాత్మనః ।
శివరుద్రాది శబ్దానాం ప్రణవో హి పరస్స్మృతః ॥
శంభోః ప్రణవవాచ్యస్య భవనాత్తజ్జపాదపి ।
యా సిద్ధిస్సా పరా ప్రాప్యా భవత్యేవ న సంశయః ॥
తస్మాదేకాక్షరం దేవమాహురాగమపారగాః ।
వాచ్యవాచకయోరైక్యం మన్యమానా మనస్వినః ॥
అస్య మాత్రాస్సమాఖ్యాతాశ్చతస్రో వేదమూర్ధని ।
అకారశ్చాప్యు కారశ్చ మకారో నాద ఇత్యపి ॥
అకారం బహ్వృచం ప్రాహురుకారో యజురిత్యపి ।
మకారస్సామనాదోస్య శ్రుతిరాథర్వణీ స్మృతా ॥
అకారశ్చ మహాబీజం రజస్స్రష్టా చతుర్ముఖః ।
ఉకారః ప్రకృతిర్యోనిస్సత్త్వం పాలయితా హరిః ॥
మకారః పురుషో బీజం తమస్సంహారకో హరః ।
నాదః పరః పుమానీశో నిర్గుణో నిష్క్రియశ్శివః ॥
సర్వం తిస్సృభిరేవేదం మాత్రాభిర్నిఖిలం త్రిధా ।
అభిధాయ శివాత్మానం బోధయత్యర్ధమాత్రయా ॥

యస్మాత్పరం నాపరమస్తి కించిద్యస్మాన్నాణీయో న జ్యాయోఽస్తి కించిత్ ।

వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్యేకస్తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్ ॥

ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివమహిమ

వర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥

ప్రతిద్వంద్వ లేని ఈశ్వరభావము, ఆత్యంతికమగు (వచ్చి పోయేది కానిది) సుఖము, బలము, తేజస్సు, మహిమ, సామర్థ్యము, క్షమ, దయ అనువాటియందు పరిపూర్ణుడగు శివునకు సృష్టి మొదలగు వాటిచేత స్వీయమగు ప్రయోజనమేమియు లేదు. శివునకు ఈ సకలకర్మలకు ఫలము ఇతరులను అనుగ్రహించుట మాత్రమే. ఆ శివపరమాత్మను ఓంకారము నిర్దేశించును. శివుడు, రుద్రుడు మొదలగు శబ్దముల కంటే ఓంకారము ఉత్కృష్టమైనదని చెప్పబడినది. ఓంకారముచే నిర్దేశించబడే శంభుని ధ్యానించుట వలన, ఓంకారమును జపించుట వలన ఏ పరమసిద్ధి లభించునో, అది తప్పక పొందదగినది. సందేహము లేదు. కావున, వాచ్యమగు శివునకు వాచకమగు ఓంకారమునకు అభేదమును భావన చేసిన ధ్యాననిష్ఠులగు వేదవేత్తలు ఓంకారము ఒకే అక్షరము గల పరంబ్రహ్మ అని చెప్పుచున్నారు. దీనికి అకారము, ఉకారము, మకారము, నాదము అనే నాలుగు మాత్రలు గలవని ఉపనిషత్తులో చెప్పబడినది. అకారము ఋగ్వేదమునకు, ఉకారము యజుర్వేదమునకు, మకారము సామవేదమునకు, నాదము అథర్వణవేదమునకు ప్రతీకయని చెప్పెదరు. మహాబీజమగు అకారము రజోగుణమును, సృష్టిని చేయు చతుర్ముఖ బ్రహ్మను నిర్దేశించును. ఉకారము ప్రకృతి అనబడే జగత్కారణమును, సత్త్వగుణమును, పాలకుడగు విష్ణువును నిర్దేశించును. మకారము చేతనుడగు పురుషుని (జీవుని), మాయాబీజమును, తమోగుణమును, ప్రళయకర్తయగు రుద్రుని నిర్దేశించును. పురుషోత్తముడు, ఈశ్వరుడు, నిర్గుణుడు, ప్రియుడు అగు శివుని నాదము నిర్దేశించును. ఓంకారము మూడు మాత్రలచే ఈ త్రిగుణాత్మకమగు సకలజగత్తును బోధించి, అర్ధమాత్రచే శివస్వరూపమును బోధించు చున్నది. ఎవని కంటే గొప్పది గాని తక్కువది గాని ఏదీ లేదో, దేనికంటే చిన్నది కాని పెద్దది గాని ఏదీ లేదో, ఏ అద్వితీయపూర్ణపురుషుడు చెట్టువలె స్వప్రకాశమునందు స్థిరముగా నున్నాడో, అట్టి శివునిచే ఈ సకలజగత్తు నిండి యున్నది.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివుని మహిమను వర్ణించే ఆరవ అధ్యాయము ముగిసినది.

# 7 – శివానుగ్రహముయొక్క మహిమ

ఉపమన్యురువాచః

శక్తిస్స్వాభావికీ తస్య విద్యా విశ్వవిలక్షణా ।
ఏకానేకస్య రూపేణ భాతి భానోరివ ప్రభా ॥
అనంతాశ్శక్తయో యస్యా ఇచ్ఛా జ్ఞాన క్రియాదయః ।
మాయా ద్యాశ్చాభవన్ వహ్నేర్విస్ఫులింగా యథా తథా ॥
సదాశివేశ్వరాద్యా హి విద్యాఽ విద్యేశ్వరాదయః।
అభవన్ పురుషాశ్చాస్యాః ప్రకృతిశ్చ పరాత్పరా ॥
మహదాది విశేషాంతాస్త్వజాద్యాశ్చాపి మూర్తయః ।
యచ్చాన్యదస్తి తత్సర్వం తస్యాః కార్యం న సంశయః ॥
సా శక్తిస్సర్వగా సూక్ష్మా ప్రబోధానందరూపిణీ ।
శక్తిమానుచ్యతే దేవశ్శివశ్శీతాంశు భూషణః ॥
వేద్యశ్శివశివా విద్యా ప్రజ్ఞా చైవ శ్రుతిస్స్మృతిః ।
ధృతిరేషా స్థితిర్నిష్ఠా జ్ఞానేచ్ఛాకర్మశక్తయః ॥
ఆజ్ఞా చైవ పరం బ్రహ్మా ద్వే విద్యే చ పరాపరే ।
శుద్ధవిద్యా శుద్ధకలా సర్వం శక్తికృతం యతః ॥
మాయా చ ప్రకృతిర్జీవో వికారో వికృతిస్తథా ।
అసచ్చ సచ్చ యత్కించిత్తయా సర్వమిదం జగత్ ॥
సా దేవీ మాయయా సర్వం బ్రహ్మాండం సచరాచరమ్ ।
మోహయత్య ప్రయత్నేన మోచయత్యపి లీలయా ॥
అనయా సహ సర్వేశస్సప్తవింశ ప్రకారయా ।
విశ్వం వ్యాప్య స్థితస్తస్మాన్ముక్తిరత్ర ప్రవర్తతే ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

విద్యారూపమైనది, జగత్తుకంటే విలక్షణమైనది అగు శక్తి ఆ శివునియందు సహజసిద్ధముగా నున్నది. ఆ శక్తి ఒక్కటియే అయిననూ సూర్యుని కాంతి వలె అనేకరూపములలో ప్రకాశించుచున్నది. ఇచ్ఛ జ్ఞానము క్రియ మొదలైనవి, మాయ మొదలైనవి అగు ఆ శక్తి యొక్క రూపములు మంటనుండి లేచే నిప్పు కణముల వలె అనంతములుగా నున్నవి. సదాశివుడు, ఈశ్వరుడు మొదలగు వారు మరియు విద్య, విద్యేశ్వరుడు మొదలగు పురుషులు ఆ శక్తినుండీయే ప్రకటమైనారు. సర్వకారణములకు కారణమగు ప్రకృతి కూడా ఆ శక్తినుండియే ఉదయించినది. మహత్తు మొదలుకొని పరమాణువులలోని విశేషము వరకు గల పదార్థములు, బ్రహ్మ మొదలగు మూర్తులు, ఇంకనూ ఏమైన ఉన్నచో ఆ సర్వము ఆ శక్తినుండి పుట్టినవియే. సందేహము లేదు. సర్వవ్యాపకము, సూక్ష్మము అగు ఆ శక్తి, జ్ఞానము మరియు ఆనందముల రూపములో నున్నది. చల్లని కిరణముల చంద్రుని శిరముపై నలంకరించుకున్న శివదేవుడు శక్తిమాన్

అనబడును. తెలియదగినవాడు శివుడు. విద్యాస్వరూపిణి పార్వతి. ప్రజ్ఞ (వినూత్నవిషయములను కనుగొనే బుద్ధిశక్తి), వేదము, స్మృతులు, ధైర్యము, మనయందు కానవచ్చే స్థిరత్వము, నిష్ఠ (పట్టుదల), జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, ఆజ్ఞ, పరంబ్రహ్మ, పరావిద్య మరియు అపరావిద్య అనే రెండు విద్యలు, శుద్ధవిద్య, శుద్ధకళ అనునవి ఆ శక్తిరూపములే. ఏలయనగా, సర్వము శక్తిచేతనే చేయబడి యున్నది. మాయ, ప్రకృతి, జీవుడు, పంచభూతములనే వికారములు, వాటిచే నిర్మాణమైన పదార్థములు, ఉనికి, అభావము అనేవి ఏవి గలవో ఆ ఈ సర్వము ఆ శక్తి చేతనే వ్యాపించబడి యున్నది. ఆ దేవి మాయచే చరాచరప్రాణులతో కూడియున్న బ్రహ్మాండమునంతనూ ప్రయత్నము లేకుండగనే మోహపెట్టు చున్నది; లీలచే విముక్తులను కూడ చేయుచున్నది, ఇరువది యేడు రకములుగా ప్రకటమైన ఈమెతో గూడి సర్వేశ్వరుడు జగత్తును వ్యాపించి యున్నాడు. కావున, ఈమెయందే మోక్షము ప్రవర్తిల్లు చున్నది.

**ముముక్షవః పురా కేచిన్మునయో బ్రహ్మవాదినః ।**
**సంశయావిష్టమనసో విమృశంతి యథాతథమ్ ॥**
**కిం కారణం కుతో జాతా జీవామః కేన వా వయమ్ ।**
**కుత్రాఽస్మాకం సంప్రతిష్ఠా కేన వాధిష్ఠితా వయమ్ ॥**
**కేన వర్తామహే శశ్వత్సుఖేష్వన్యేషు చానిశమ్ ।**
**అవిలంఘ్యా చ విశ్వస్య వ్యవస్థా కేన వా కృతా ॥**
**కాలస్స్వభావో నియతిర్యదృచ్ఛా నాత్ర యుజ్యతే ।**
**భూతాని యోనిః పురుషో యోగస్త్వేషాం పరోఽథ వా ॥**
**అచేతనత్వాత్కాలాదేశ్చేతనత్వేఽపి చాత్మనః ।**
**సుఖదుఃఖాని భూతత్వాదనీశత్వాద్విచార్యతే ॥**
**తద్ధ్యానయోగానుగతాం ప్రపశ్యన్ శక్తిమైశ్వరీమ్ ।**
**పాశవిచ్ఛేదికాం సాక్షాన్నిగూఢాం స్వగుణైర్భృశమ్ ॥**
**తయా విచ్ఛిన్నపాశాస్తే సర్వకారణ కారణమ్ ।**
**శక్తిమంతం మహాదేవమపశ్యన్ దివ్యచక్షుషా ॥**
**యః కారణాన్యశేషాణి కాలాత్మసహితాని చ ।**
**అప్రమేయోఽనయా శక్త్యా సకలం యోఽధితిష్ఠతి ॥**
**తతః ప్రసాదయోగేన యోగేన పరమేణ చ ।**
**దృఢేన భక్తియోగేన దివ్యాం గతిమవాప్నుయుః ॥**
**తస్మాత్సహ తహ శక్త్యా హృది పశ్యంతి యే శివమ్ ।**
**తేషాం శాశ్వతికీ శాంతిర్నేతరేషామితి శ్రుతిః ॥**

పూర్వము మోక్షమును కోరే బ్రహ్మవాదులగు కొందరు మునులు సంశయములతో ఆవేశించబడిన మనస్సులు గలవారై వస్తుస్థితిని విమర్శ చేసిరి. జగత్కారణమేది? మనము ఎక్కడనుండి పుట్టితిమి? మనము దేనిచే జీవించుచున్నాము? మన నిశ్చలస్థితి ఎక్కడ నున్నది? మనము దేనిచే

అధిష్టించబడి యున్నాము? దేనిచే మనము శాశ్వతకాలము నిత్యము సుఖదుఃఖములను అనుభవించుచున్నాము? జగత్తుయొక్క ఉల్లంఘింప శక్యము కాని ఈ వ్యవస్థను ఎవరు చేసిరి? కాలము, స్వభావము, నియతి (నిశ్చితముగా ఫలమునిచ్చే కర్మ), యదృచ్ఛ (ఆకస్మికముగా జరిగే ఘటన) అనునవి ఈ జగత్తునకు కారణములనుట యుక్తియుక్తముగా లేదు. పంచభూతములు గాని, జీవుడు గానీ, వాటి కలయిక గాని, లేక మరియొకటి గాని కారణము కాజాలవు. ఏలయనగా, కాలము జడము, జీవుడు చేతనుడే అయినా దానికి సుఖదుఃఖములున్నవి; పైగా, జీవుడు అసమర్థుడు. జగత్కారణము ఈ విధముగా విచారము చేయబడుచున్నది. బంధమును పోగొట్టునది, సత్త్వరజస్తమస్సులు అనే తన గుణములచేతనే నిశ్చయముగా కప్పివేయబడి ఉండునది అగు ఈశ్వరశక్తిని వారు ధ్యానయోగముననుసరించి సాక్షాత్తుగా దర్శించిరి. ఆమెచే తొలగించి వేయబడిన బంధములు గల ఆ మునులు, శక్తితో గూడియున్న మహాదేవుడు సర్వకారణములకు కారణమైనవాడు అను సత్యమును దివ్యనేత్రములతో దర్శించిరి. ప్రమాణములకు అతీతుడైన ఆ శివుడు ఈ శక్తితో గూడి కాలముతో మరియు జీవులతో గూడియున్న సకలకారణములను మరియు సకలజగత్తును అధిష్ఠించి యున్నాడు. తరువాత వారు ప్రసాద (అనుగ్రహ) యోగముచే, పరమయోగముచే మరియు దృఢమగు భక్తియోగముచే దివ్యమగు గతి (మోక్షము) ని పొందిరి. కావున, ఎవరైతే శక్తితో గూడియున్న శివుని హృదయములో దర్శించెదరో, వారికి మాత్రమే శాశ్వతమగు శాంతి లభించుననియు, ఇతరులకు కాదనియు వేదము చెప్పుచున్నది.

న హి శక్తిమతశ్శక్త్యా విప్రయోగోఽస్తి జాతుచిత్ ।
తస్మాచ్ఛక్తేశ్శక్తిమతస్తా దాత్మ్యాన్నిర్వృతిర్ద్వయోః ॥
క్రమో వివక్షితో నూనం విముక్తౌ జ్ఞానకర్మణోః ।
ప్రసాదే సతి సా ముక్తిర్యస్మాత్కరతలే స్థితా ॥
దేవో వా దానవో వాపి పశుర్వా విహగోఽపి వా ।
కీటో వాథ కృమిర్వాపి ముచ్యతే తత్ప్రసాదతః ॥
గర్భస్థో జాయమానో వా బాలో వా తరుణోఽపి వా ।
వృద్ధో వా మ్రియమాణో వా స్వర్గస్థో వాథ నారకీ ॥
పతితో వాపి ధర్మాత్మా పండితో మూఢ ఏవ వా ।
ప్రసాదే తత్క్షణాదేవ ముచ్యతే నాత్ర సంశయః ॥
అయోగ్యానాం చ కారుణ్యాద్భక్తానాం పరమేశ్వరః ।
ప్రసీదతి న సందేహో నిగృహ్య వివిధాన్మలాన్ ॥
ప్రసాదాదేవ సా భక్తిః ప్రసాదో భక్తిసంభవః ।
అవస్థా భేదముత్ప్రేక్ష్య విద్వాంస్తత్ర న ముహ్యతి ॥
ప్రసాదపూర్వికా యేయం భుక్తిముక్తి విధాయినీ ।
నైవ సా శక్యతే ప్రాప్తుం నరైరేకేన జన్మనా ॥

**అనేకజన్మ సిద్ధానాం శ్రౌతస్మార్తాను వర్తినామ్ ।**

**విరక్తానాం ప్రబుద్ధానాం ప్రసీదతి మహేశ్వరః ॥**

**ప్రసన్నే సతి దేవేశే పశౌ తస్మిన్ ప్రవర్తతే ।**

**అస్తి నాథో మమేత్యల్పా భక్తిర్బుద్ధిపురస్సరా ॥**

శక్తిమంతుడగు శివునకు శక్తితో ఎన్నడైననూ వియోగము ఉండదు. కావున, శక్తిశక్తిమంతులనే ఇద్దరి తాదాత్మ్యము వలన ఆనందము కలుగును. మోక్షమునందు జ్ఞానకర్మల క్రమము చెప్పబడిన మాట వాస్తవమే. కానీ, వారి అనుగ్రహము ఉన్నచో, ఆ మోక్షము అరచేతిలో నున్నది. దేవత గానీ, రాక్షసుడు గాని, పశువు గానీ, పక్షి గాని, కీటకము గాని, క్రిమి గాని ఆ శివుని అనుగ్రహమున్నచో మోక్షమును పొందును. గర్భమునందలి శిశువు గాని, అప్పుడే పుట్టుచున్నవాడు గాని, పిల్లవాడు గాని, యువకుడు గాని, ముదుసలి గాని, మరణించుచున్నవాడు గాని, స్వర్గమునందున్నవాడు గాని, నరకమునందున్నవాడు గాని, పతితుడు గాని, ధర్మాత్ముడు గాని, పండితుడు గాని, మూర్ఖుడు గాని శివుని అనుగ్రహమున్నచో, వెనువెంటనే మోక్షమును పొందుననుటలో సందేహము లేదు. పరమేశ్వరుడు అయోగ్యులగు భక్తులయందలి దయచే వారియందలి వివిధములగు దోషములను నివారించి అనుగ్రహించుననుటలో సందేహము లేదు. శివుని అనుగ్రహము వలననే ఆ భక్తి కలుగును. భక్తినుండి అనుగ్రహము పుట్టును. అవస్థలలోని భేదమును బట్టి ఈ స్థితులు ఉండునని ఊహించి విద్వాంసుడు ఆ విషయములో మోహమును పొందడు. అనుగ్రహము వలన కలిగి, భుక్తిని మరియు ముక్తిని ఇచ్చే ఈ ఏ భక్తి గలదో, దానిని మానవుడు ఒక్క జన్మలో పొందలేడు. అనేకజన్మలలో శ్రౌతస్మార్తకర్మలను చేసి సిద్ధి (అంతఃకరణశుద్ధి) ని పొంది విరక్తులై జ్ఞానమును పొందిన వారిని మహేశ్వరుడు అనుగ్రహించును. జీవునియందు ఆ దేవదేవుడు ప్రసన్నుడు కాగానే, నాకు నాథుడు. గలడు అనే బుద్ధితో గూడియున్న అల్పమగు భక్తి వానియందు ఉదయించును.

**తపసా వివిధైశ్శై వైర్ధర్మైస్సంయుజ్యతే నరః।**

**తత్ర యోగే తదభ్యాసస్తతో భక్తిః పరా భవేత్ ॥**

**పరయా చ తయా భక్త్యా ప్రసాదో లభ్యతే పరః ।**

**ప్రసాదాత్సర్వపాశేభ్యో ముక్తిర్ముక్తస్య నిర్వృతిః ॥**

**అల్పభావోఽపి యో మర్త్యస్సోఽపి జన్మత్రయాత్పరమ్ ।**

**న యోనియంత్రపీడాయై భవేన్నైవాత్ర సంశయః ॥**

**సాంగాఽనంగా చ యా సేవా సా భక్తిరితి కథ్యతే ।**

**సా పునర్భిద్యతే త్రేధా మనోవాక్కాయసాధనైః ॥**

**శివరూపాదిచింతా యా సా సేవా మానసీ స్మృతా ।**

**జపాదిర్వాచకీ సేవా కర్మ పూజాది కాయికీ ॥**

**సేయం త్రిసాధనా సేవా శివధర్మశ్చ కథ్యతే ।**

**స తు పంచవిధః ప్రోక్తశ్శివేన పరమాత్మనా ॥**

స తు పంచవిధః ప్రోక్తశ్శివేన పరమాత్మనా ॥

తపః కర్మ జపో ధ్యానం జ్ఞానం చేతి సమాసతః ।

కర్మ లింగార్చనాద్యం చ తపశ్చాంద్రాయణాదికమ్ ॥

జపస్త్రి ధా శివాభ్యాసశ్చింతా ధ్యానం శివస్య తు ।

శివాగమోక్తం యద్ జ్ఞానం తదత్ర జ్ఞానముచ్యతే ॥

శ్రీ కంఠేన శివేనోక్తం శివాయై చ శివాగమః ।

శివా శ్రితానాం కారుణ్యాచ్ఛ్రేయసామేక సాధనమ్ ॥

తస్మాద్వివర్ధయేద్భక్తిం శివే పరమకారణే ।

త్యజేచ్చ విషయాసంగం శ్రేయోర్థీ మతిమాన్నరః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివానుగ్రహ మహిమ వర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥

ఆ భక్తుడు తపస్సుతో మరియు వివిధములగు శైవధర్మములతో సంయోగమును పొందును. ఆ సంయోగమును పొంది వాటిని అభ్యాసము చేయుట వలన, ఆతనికి పరాభక్తి కలుగును. ఆ పరాభక్తిచే గొప్ప అనుగ్రహము లభించును. అనుగ్రహము వలన సకల బంధములనుండి మోక్షము లభించును. మోక్షము వలన ఆనందము లభించును. అల్పమగు భక్తి గల మానవుడైననూ మూడు జన్మల తరువాత మరల గర్భవాస దుఃఖమునననుభవించబోడు. ఈ విషయములో సందేహము లేదు. అంగములతో కూడినది మరియు అంగములు లేనిది అగు సేవకు భక్తి అని పేరు. మనస్సు, వాక్కు, శరీరము అను సాధనములను బట్టి, ఆ భక్తి మరల మూడు రకములుగా నున్నది. శివుని రూపము మొదలగు వాటిని ధ్యానించుట మానససేవ అనబడును. జపము మొదలైనవి వాచిక సేవ. పూజ మొదలగు కర్మలు కాయిక సేవ అగును. మూడు సాధనములతో చేయబడే ఈ సేవకే శివధర్మము అని కూడ పేరు. అది సంగ్రహముగా తపస్సు, కర్మ, జపము, ధ్యానము, జ్ఞానము అనే అయిదు రకములుగా నున్నదని శివపరమాత్మ చెప్పియున్నాడు. లింగార్చన మొదలగునవి కర్మ, చాంద్రాయణము మొదలైనవి తపస్సు. శివమంత్రమును మూడు విధములుగా (బిగ్గరగా ఉచ్చరించుట, పైకి వినబడనీ వీధముగా ఉచ్చరించుట, మనస్సులో మాత్రమే ఉచ్చరించుట) ఆవృత్తి చేయుటయే జపము. శివుని తలపోయుచుండుటయే ధ్యానము. ఇచట జ్ఞానమనగా శివాగమములో చెప్పబడిన జ్ఞానము మాత్రమే. విషకంఠుడగు శివుడు తనను ఆశ్రయించిన వారిపై గల దయచే శ్రేయస్సులకు ఏకైక సాధనమగు శివాగమమును పార్వతికి చెప్పినాడు. కావున, శ్రేయస్సును కోరే బుద్ధిమంతుడగు మానవుడు విషయసుఖములయందలి, ఆసక్తిని విడిచి పెట్టి, సర్వకారణకారణుడగు శివునియందు భక్తిని పెంపొందించు కొనవలెను.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివభక్తియొక్క మహిమను వర్ణించే ఏడవ అధ్యాయము ముగిసినది.

# 8 – శివుని ఆదిత్య రూపమును వర్ణించుట

శ్రీకృష్ణ ఉవాచః

భగవన్ శ్రోతుమిచ్ఛామి శివేన పరిభాషితమ్ ।
వేదసారం శివజ్ఞానం స్వాశ్రితానాం విముక్తయే ॥
అభక్తానామబుద్ధీనామయుక్తానామ గోచరమ్ ।
అర్థైర్దశార్ధైస్సంయుక్తం గూఢమప్రాజ్ఞ నిందితమ్ ॥
వర్ణాశ్రమకృతైర్ధర్మైరిపరీతం క్వచిత్సమమ్ ।
వేదాత్ షడంగాదుద్ధృత్య సాంఖ్యాద్యోగాచ్చ కృత్స్నశః ॥
శతకోటి ప్రమాణేన విస్తీర్ణం గ్రంథసంఖ్యయా ।
కథితం పరమేశేన తత్ర పూజా కథం ప్రభోః ॥
కస్యాధికారః పూజాదౌ జ్ఞానయోగాదయః కథమ్ ।
తత్సర్వం విస్తరాదేవ వక్తుమర్హసి సువ్రత ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను –

ఓ పూజ్యా! శివుడు తనను ఆశ్రయించిన వారి మోక్షము కొరకై చెప్పియున్న వే్రదసారమగు శివజ్ఞానమును నేను వినగోరుచున్నాను. భక్తులు కానివారికీ, బుద్ధి లేనివారికి, అయోగ్యులకు అందనిది, అయిదు అంశములతో కూడియున్నది, రహస్యమైనది, మూర్ఖులచే నిందించబడేది, వర్ణాశ్రమధర్మములతో కొన్నిచోట్ల సమానముగ నున్ననూ కొన్నిచోట్ల విభేదించునది అగు శివజ్ఞానము పరమేశ్వరునిచే ఆరు అంగములతో కూడిన వేదము నుండి సాంఖ్యమునుండి మరియు యోగమునుండి పూర్తి సారమును పైకి తీసి వంద కోట్ల శ్లోకసంఖ్య గల గ్రంథరూపముగా చెప్పబడినది. దానియందు ఆ ప్రభుని పూజ ఎట్లు చెప్పబడినది? పూజ మొదలగు వాటియందు ఎవనికి అధికారము గలదు?. జ్ఞానయోగము మొదలగునవి ఎట్లు చెప్పబడినవి? ఓ గొప్ప వ్రతము గలవాడా! ఆ విషయమునంతనూ నీవు విస్తరముగా చెప్పదగుదువు.

ఉపమన్యురువాచః

శైవం సంక్షిప్య వేదోక్తం శివేన పరిభాషితమ్ ।
స్తుతినిందాదిరహితం సద్యః ప్రత్యయకారణమ్ ॥
గురు ప్రసాదజం దివ్యమనాయాసేన ముక్తిదమ్ ।
కథయిష్యే సమాసేన తస్య శక్యో న విస్తరః ॥
సిసృక్షయా పురావ్యక్తచ్ఛివః స్థాణుర్మహేశ్వరః ।
సత్కార్య కారణోపేతస్స్వయమా విరభూత్ప్రభుః ॥
జనయామాస చ తదా ఋషిర్విశ్వాధిపః ప్రభుః ।
దేవానాం ప్రథమం దేవం బ్రహ్మాణం బ్రహ్మణస్పతిమ్ ॥
బ్రహ్మాది పితరం దేవం జాయమానో న్యవైక్షత ।
తం జాయమానం జనకో దేవః ప్రాపశ్యదాజ్ఞయా ॥

దృష్టో రుద్రేణ దేవోఽసౌ వస్యజద్విశ్వమీశ్వరః ।
వర్ణాశ్రమవ్యవస్థాం చ చకార స పృథక్ పృథక్ ॥
సోమం ససర్జ యజ్ఞార్థే సోమాద్ద్యౌస్సమజాయత ।
ధరా చ వహ్నిస్సూర్యశ్చ యజ్ఞో విష్ణుశ్శచీపతిః ॥
తే చాన్యే చ సురా రుద్రం రుద్రాధ్యాయేన తుష్టువుః ।
ప్రసన్నవదనస్తస్థౌ దేవానామగ్రతః ప్రభుః ॥
అపహృత్య స్వలీలార్థం తేషాం జ్ఞానం మహేశ్వరః ।
తమపృచ్ఛంస్తతో దేవాః కో భవానితి మోహితాః ॥
సోఽబ్రవీద్భగవాన్ రుద్రో హ్యహమేకః పురాతనః ।
ఆసం ప్రథమమేవాహం వర్తామి చ సురోత్తమాః ॥

ఉపమన్యువు ఇట్లు చెప్పెను –

వేదముచే చెప్పబడినది, మరల శివునిచే చెప్పబడినది, స్తుతి నింద మొదలగు◌నవి లేనిది, వెనువెంటనే జ్ఞానమును కలిగించునది, గురువుయొక్క అనుగ్రహముచే లభించునది, దివ్యమైనది, అనాయాసముగా ముక్తిని ఇచ్చునది అగు శైవాగమమును సంగ్రహముగా చెప్పెదను. దానిని విస్తారముగా చెప్పుట సంభవము కాదు. పూర్వము నిర్వికారుడు, మహేశ్వరుడు, సద్రూపమగు కార్యకారణములతో కూడియున్నవాడు అగు శివప్రభుడు అవ్యక్తము (ప్రకృతి) నుండి సృష్టిని చేయగోరి తాను అవిర్భవించెను. అపుడు మంత్రద్రష్ట జగత్తునకు ప్రభువు అగు ఆ ప్రభువు దేవతలలో మొదటి దేవత, వేదమునకు ప్రభువు అగు బ్రహ్మను సృష్టించెను, బ్రహ్మ కూడా పుట్టుచుండగా తండ్రియగు శివదేవుని చూచెను. తండ్రియగు ఆ శివదేవుడు పుట్టుచున్న ఆ బ్రహ్మను చూచేను. రుద్రునిచే చూడబడి తద్వారా ఆజ్ఞాపించబడిన ఈ జగత్ప్రభువగు బ్రహ్మదేవుడు జగత్తును సృష్టించి, వేర్వేరుగా వర్ణాశ్రమవ్యవస్థను కూడ చేసెను . ఆయన యజ్ఞము కొరకై సోమమును సృష్టించెను. సోమమునుండి ఆకాశము, భూమి, అగ్ని, సూర్యుడు, యజ్ఞము, విష్ణువు, శచీపతియగు ఇంద్రుడు ప్రకటమైనారు. వారు మరియు ఇతరదేవతలు రుద్రాధ్యాయముతో రుద్రుని స్తుతించిరి. ఆ ప్రభుడు ప్రసన్నమగు ముఖము గలవాడై దేవతల యెదుట నిలబడెను. మహేశ్వరుడు తన లీల కొరకై వారి జ్ఞానమును అపహరించేను. అపుడు మోహమును పొందిన దేవతలు ఆయననే, నీవెవరివి? అని ప్రశ్నించిరి . అపుడా రుద్రభగవానుడు ఇట్లు పలికెనుః సృష్టికి ముందులో సనాతనుడగు నేను ఒక్కడిని మాత్రమే ఉంటిని. ఓ గొప్ప దేవతలారా! ఇప్పుడు కూడ నేను ఉన్నాను.

భవిష్యామి చ మత్తోఽన్యో వ్యతిరిక్తో న కశ్చన ।
అహమేవ జగత్సర్వం తర్పయామి స్వతేజసా ॥
మత్తోఽధికస్సమో నాస్తి మాం యో వేద స ముచ్యతే ।
ఇత్యుక్త్వా భగవాన్ రుద్రస్తత్రైవాంతరధత్త సః ॥
అపశ్యంతస్తమీశానం స్తువంతశ్చైవ సామభిః ॥

వ్రతం పాశుపతం కృత్వా త్వథర్వశిరసి స్థితమ్ ।
భస్మసంఛన్నసర్వాంగా బభూవురమరాస్తదా ॥
అథ తేషాం ప్రసాదార్థం పశూనాం పతిరీశ్వరః ॥
సగణశ్చోమయా సార్ధం సాన్నిధ్యమకరోత్ప్రభుః ।
యం వినిద్రా జితశ్వాసా యోగినో దగ్ధకిల్బిషాః ।
హృది పశ్యంతి తం దేవం దదృశుర్దేవపుంగవాః ।
యామాహుః పరమాం శక్తిమీశ్వరేచ్ఛానువర్తినీమ్ ॥
తామపశ్యన్మహేశస్య వామతో వామలోచనామ్ ।
యే వినిర్ధూతసంసారాః ప్రాప్తాశ్శైవం పరం పదమ్ ॥
నిత్యసిద్ధాశ్చ యే వాన్యం తే చ దృష్టా గణేశ్వరాః ।
అథ తం తుష్టువుర్దేవా దేవ్యా సహ మహేశ్వరమ్ ॥
స్తోత్రైర్మాహేశ్వరైర్దివ్యైః శ్రౌతైః పౌరాణికైరపి ।
దేవోఽపి దేవానాలోక్య ఘృణయా వృషభధ్వజః ॥
తుష్టోఽస్మీత్యాహ సుప్రీతస్స్వభావమధురాం గిరమ్ ।
అథ సుప్రీతమనసం ప్రణిపత్య వృషధ్వజమ్ ।
అర్థం మహత్తమం దేవాః పప్రచ్ఛురిదమాదరాత్ ॥

భవిష్యత్తులో కూడ నేనే ఉండగలను. నాకంటే భిన్నముగా మరియొకడు లేడు. నేనే జగత్తునకంతకూ నా తేజస్సుతో తృప్తిని కలిగించు చున్నాను. నాకంటే అధికుడు గాని, నాతో సమానమైన వాడు గానీ లేడు. నన్ను తెలుసుకున్నవాడు మోక్షమును పొందును.. ఆ రుద్రభగవానుడు ఇట్లు పలికి, అచటనే అంతర్ధానమును చెందెను. ఆ ఈశ్వరుని కనజాలక దేవతలు ఆయనను స్తోత్రములతో స్తుతిస్తూ, అపుడు అథర్వోపనిషత్తులో చెప్పబడిన పాశుపతవ్రతమును చేసి, భస్మను సకలావయవములకు పూసుకొనిరి. అపుడు పశుపతి, జగన్నాథుడు అగు ఈశ్వరుడు వారిని అనుగ్రహించుట కొరకై గణములతో మరియు పార్వతితో గూడి వారికి తన సన్నిధిని ఇచ్చెను. నిద్రను వీడి శ్వాసను జయించి పాపములను దహించివేసి యోగులు ఏ ఈశ్వరుని హృదయములో దర్శించుచున్నారో, అట్టి దేవుని దేవనాయకులు దర్శించిరి. ఏ పరమశక్తి ఈశ్వరుని ఇచ్ఛకు అనురూపముగా ప్రవర్తిల్లునని పెద్దలు చెప్పుచున్నారో, అట్టి సుందరమగు కన్నులు గల పార్వతిని. వారు ఆయనకు ఎడమ భాగమునందు దర్శించిరి. ఎవరైతే సంసారమును త్రోసిపుచ్చి సర్వశ్రేష్ఠమగు శివపదమును పొంది నిత్యసిద్ధులైనారో, అట్టి గణేశ్వరులను కూడ వారు చూచిరి. తరువాత దేవతలు దేవితో కూడియున్న ఆ మహేశ్వరుని, వేదములలో మరియు పురాణములలో ఉండే దివ్యములైన మహేశ్వరునకు సంబంధించిన స్తోత్రములతో స్తుతించిరి. వృషభము ధ్వజమునందు చిహ్నముగా గల శివదేవుడు కూడ దేవతలను దయాదృష్టితో చూచి, మిక్కిలి ప్రీతిని పొందినవాడై, స్వభావము చేతనే మధురమైన వాక్కుతో, నేను సంతోషించితిని అని పలికెను. తరువాత దేవతలు మిక్కిలి సంతోషముతో నిండిన మనస్సు గల ఆ వృషభధ్వజునకు నమస్కరించి మిక్కిలి మహత్త్వము గల ఈ విషయమును గురించి ఆదరముగా ప్రశ్నించిరి.

దేవా ఊచుః ।

భగవాన్ కేన మార్గేణ పూజనీయోఽపి భూతలే ।
కస్యాధికారః పూజాయాం వక్తుమర్హసి తత్త్వతః ॥
తతస్సస్మితమాలోక్య దేవీం దేవవరో హరః ।
స్వరూపం దర్శయామాస ఘోరం సూర్యాత్మకం పరమ్ ॥
సర్వైశ్వర్య గుణోపేతం సర్వతేజోమయం పరమ్ ।
శక్తిభిర్మూర్తిభిశ్చాంగైర్గ్రహైర్దేవైశ్చ సంవృతమ్ ॥
అష్టబాహుం చతుర్వక్త్రమర్ధనారీకమద్భుతమ్ ।
దృష్ట్వైవమద్భుతాకారం దేవా విష్ణుపురోగమాః ॥
బుద్ధ్వా దివాకరం దేవం దేవీం చైవ నిశాకరమ్ ।
పంచ భూతాని శేషాణి తన్మయం చ చరాచరమ్ ॥
ఏవముక్త్వా నమశ్చక్రుస్తస్మై చార్ఘ్యం ప్రదాయ వై ॥
సిందూరవర్ణాయ సుమండలాయ సువర్ణవర్ణాభరణాయ తుభ్యమ్ ।
పద్మాభనేత్రాయ సపంకజాయ బ్రహ్మేంద్రనారాయణకారణాయ ॥
సురత్నపూర్ణం ససువర్ణతో యం సకుంకుమాద్యం సకుశం సపుష్పమ్ ।
ప్రదత్తమాదాయ సహేమపాత్రం ప్రశస్తమర్ఘ్యం భగవన్ ప్రసీద ॥
నమశ్శివాయ శాంతాయ సగణాయాది హేతవే ।
రుద్రాయ విష్ణవే తుభ్యం బ్రహ్మణే సూర్యమూర్తయే ॥
యశ్శివం మండలే సౌరే సంపూజ్యైవ సమాహితః ।
ప్రాతర్మధ్యాహ్నసాయాహ్నే ప్రదద్యాదర్ఘ్య ముత్తమమ్ ॥
ప్రణమేద్వా పఠేదేతాన్ శ్లోకాన్ శ్రుతిముఖానిమాన్।
గ న తస్య దుర్లభం కించిద్భక్తశ్చేన్ముచ్యతే దృఢమ్ ॥

దేవతలు ఇట్లు పలికిరి -

ఓ భగవాన్! భూలోకములో నిన్ను ఏ మార్గములో పూజించవలెను? పూజయందు అధికారము ఎవరికి గలదు? నీవీ విషయమును యథాతథముగా చెప్ప దగుదువు (26). తరువాత దేవతలలో శ్రేష్ఠుడగు శివుడు పార్వతీదేవి వైపు చిరునవ్వుతో చూచి, భయంకరమైనది, సూర్య స్వరూపములో నున్నది, సర్వశ్రేష్ఠమేనది, సకలమైన ఈశ్వరగుణములతో కూడియున్నది, సకలతేజస్సులతో నిండియున్నది, శక్తులు మూర్తులు అంగములు గ్రహములు మరియు దేవతలు అను వాటితో చుట్టువారబడి యున్నది, ఎనిమిది బాహువులు నాలుగు ముఖములు గలది, సగభాగము స్త్రీ రూపములో నున్నది, అద్భుతమైనదీ అగు తన స్వరూపమును చూపించెను. విష్ణువు మొదలగు దేవతలు ఈ విధముగా అద్భుత రూపమును చూచి, శివుడే సూర్యుడనియు, పార్వతియే చంద్రుడనియు, మిగిలిన దేహావయవములు పంచభూతములనియు, చరాచరజగత్తు శివునితో నిండి యున్నదనియు తెలుసుకొని, ఆయనకు అర్ఘ్యమునిచ్చి, ఇట్లు పలికి నమస్కరించిరి . ఎర్రని రంగు గలవాడు, చక్కని మండలము గలవాడు, బంగారు రంగు గల

ఆభరణములు గలవాడు, పద్మమును పోలిన కన్నులు గలవాడు, పద్మముతో కూడియున్నవాడు, బ్రహ్మ ఇంద్రుడు నారాయణుడు అను వారికి కారణమైన వాడు అగు నీకు నమస్కారము. ఓ భగవాన్! చక్కని రత్నములు, బంగారము, కుంకుమ, దర్భలు, పుష్పములు మొదలగునవి గల, నీటితో నింపబడిన బంగరు పాత్రను మేము సమర్పించుచున్నాము. ఈ ప్రశస్తమైన అర్ఘ్యమును స్వీకరించి ప్రసన్నుడవు కమ్ము. శాంతస్వరూపుడు, గణములతో కూడియున్నవాడు, ఆదికారణుడు, భయంకరుడు, బ్రహ్మవిష్ణుశివస్వరూపుడు, సూర్యరూపములో నున్నవాడు అగు నీకు నమస్కారము. ఎవడైతే సూర్యమండలములో ఈ విధముగా ఏకాగ్రచిత్తముతో శివుని ఉదయము, మధ్యాహ్నము మరియు సాయంకాలము చక్కగా పూజించి, ఉత్తమమగు అర్ఘ్యమును ఇచ్చి నమస్కరించునో, లేదో వేదమునందు చెప్పబడిన ఈ శ్లోకములను పఠించునో, వానికి లభించ శక్యము కానిది ఏదీ లేదు. అతడు భక్తుడు అయినచో, నిశ్చయముగా ముక్తిని పొందును.

తస్మాదభ్యర్చయేన్నిత్యం శివమాదిత్య రూపిణమ్ ।
ధర్మకామార్థ ముక్త్యర్థం మనసా కర్మణా గిరా ॥
అథ దేవాన్ సమాలోక్య మండలస్థో మహేశ్వరః ।
సర్వాగమోత్తరం దత్త్వా శాస్త్రమంతరధాద్ధరః ॥
తత్ర పూజాధికారోఽయం బ్రహ్మక్షత్రవిశామితి।
జ్ఞాత్వా ప్రణమ్య దేవేశం దేవా జగ్ముర్యథాగతమ్ ॥
అథ కాలేన మహతా తస్మిన్ శాస్త్రే తిరోహితే ।
భర్తారం పరిపప్రచ్ఛ తదంకస్థా మహేశ్వరీ ॥
తయా స చోదితే దేవో దేవ్యా చంద్రవిభూషణః ।
అవదత్కరముద్ధృత్య శాస్త్రం సర్వాగమోత్తరమ్ ॥
ప్రవర్తితం చ తల్లోకే నియోగాత్పరమేష్ఠినః ।
మయాగస్త్యేన గురుణా దధీచేన మహర్షిణా ॥
స్వయమప్యవతీర్యోర్వ్యాం యుగావర్తేషు శూలధృక్ ।
స్వాశ్రితానాం విముక్త్యర్థం కురుతే జ్ఞానసంతతిమ్ ॥
ఋభుస్సత్యో భార్గవశ్చ హ్యంగిరాస్సవితా ద్విజః ।
మృత్యుశ్శతక్రతుర్ధీమాన్ వసిష్ఠో మునిపుంగవః ॥
సారస్వతస్త్రిధామా చ త్రివృతో మునిపుంగవః ।
శతతేజాస్స్వయం ధర్మో నారాయణ ఇతి శ్రుతః ॥
స్వరక్షశ్చారుణిర్ధీమాంస్తథా చైవ కృతంజయః ।
కృతంజయో భరద్వాజో గౌతమః కవిరుత్తమః ॥
వాచస్రవా మునిస్సాక్షాత్తథా సూక్ష్మాయణిశ్శుచిః ।
తృణబిందుర్మునిః కృష్ణశ్శక్తిశ్శాక్తేయ ఉత్తరః ॥
జాతూకర్ణ్యో హరిస్సాక్షాత్కృష్ణద్వైపాయనో మునిః ।
వ్యాసావతారాన్ శృణ్వంతు కల్పయోగేశ్వరాన్ క్రమాత్ ॥

కావున, నిత్యము సూర్యుని రూపములో నున్న శివుని ధర్మార్థకామమోక్షముల కొరకై మనోవాక్కాయములచే చక్కగా పూజించవలెను తరువాత సూర్యమండలమునందున్న మహేశ్వరుడగు హరుడు దేవతలను చూచి, సర్వశాస్త్రములలో శ్రేష్ఠమైన శాస్త్రమును ఇచ్చి అంతర్ధానమయ్యెను. దానియందు బ్రాహ్మణక్షత్రియవైశ్యులకు ఈ పూజ యందు అధికారము చెప్పబడినది అని తెలుసుకొని, దేవతలు దేవదేవుడగు శివునకు నమస్కరించి వచ్చిన దారిన వెళ్లిరి. తరువాత చాల కాలమునకు ఆ శాస్త్రము కనబడకుండా పోగా, శివుని అంకముపై కూర్చున్న మహేశ్వరి తన భర్తను దానిని గురించి ప్రశ్నించెను . చంద్రుని ఆభరణముగా దాల్చిన ఆ దేవుడు ఆ దేవిచే ప్రోత్సహించబడినవాడై చేతిని పైకెత్తి సర్వశాస్త్రములలో శ్రేష్ఠమైన శాస్త్రమును చెప్పెను . పరమేశ్వరుని ఆజ్ఞచే ఆ శాస్త్రమును లోకములో నేను, గురుదేవుడగు అగస్త్యుడు, దధీచమహర్షి ప్రవర్తిల్లజేసితిమి. త్రిశూలధారియగు శివుడు తనను ఆశ్రయించిన వారి మోక్షము కొరకై తాను కూడ మహాయుగముల కాలచక్రములో భూమిపై స్వయముగా అవతరించి, జ్ఞానపరంపరను నిలబెట్టెను. ఓ బ్రాహ్మణులారా! ఋభువు, సత్యుడు, భార్గవుడు, అంగీరసుడు, సూర్యుడు, మృత్యువు, ఇంద్రుడు, బుద్ధిశాలియగు వసిష్ఠమహర్షి, సారస్వతుడు, త్రిధాముడు, త్రివృతమహర్షి, శతతేజసుడు, సాక్షాత్తుగా ధర్మస్వరూపుడుగా ప్రసిద్ధిని గాంచిన నారాయణుడు, స్వరక్షుడు, బుద్ధిశాలియగు ఆరుణి, కృతంజయుడు, (మరో) కృతంజయుడు, భరద్వాజుడు, గౌతముడు, కవి, ఉత్తముడ సాక్షాత్తుగా వాచఃశ్రవ మహర్షి సూక్షాయణి, శుచి, తృణబిందుమహర్షి, శ్రీకృష్ణుడు, శక్తి, శక్తి- ఉపాసకుడగు ఉత్తరుడు , జాతకర్ణుడు, హరి, సాక్షాత్తుగా కృష్ణద్వైపాయనమహర్షి అను వారు వ్యాసుని అవతారములు. క్రమముగా కల్పయోగేశ్వరులను గురించి వినుడు .

**లైంగే వ్యాసావతారా హి ద్వాపరాంతేషు సువ్రతాః ।**

**యోగాచార్యావతారాశ్చ తథా శిష్యేషు శూలినః ॥**

**తత్ర తత్ర విభోశ్శిష్యాశ్చత్వారస్సుర్మహౌజసః ।**

**శిష్యాస్తేషాం ప్రశిష్యాశ్చ శతశోఽథ సహస్రశః ॥**

**తేషాం సంభావనాల్లోకే శైవాజ్ఞకరణాదిభిః ।**

**భాగ్యవంతో విముచ్యంతే భక్త్యా చాత్యంతభావితాః ॥**

**ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివస్య ఆదిత్య రూపవర్ణనం నామ అష్టమోఽధ్యాయః ॥**

ఓ గొప్ప వ్రతము గలవారా! ద్వాపరయుగము పూర్తి అయిన తరువాత వచ్చే వ్యాసావతారములు, మరియు శివుడు స్వీకరించిన యోగాచార్యావతారములు లింగ పురాణములో వర్ణించ బడినవి. అంతేగాక, శివుని శిష్యులలో ప్రముఖులు కూడ ఆ పురాణములో వర్ణించబడినారు. ఆయా అవతారములలో శివునకు నలుగురు గొప్ప తేజశ్శాలురగు శిష్యులు ఉండిరి. వారి శిష్యులు, ప్రశిష్యులు వందల వేల సంఖ్యలో నున్నారులోకములో వారి ఉపదేశమునసుసరించి, శివుని ఆజ్ఞను నెరవేర్చుట మొదలగు వాటి ద్వారా భక్తిచే అత్యంతము ప్రభావితులైన భాగ్యవంతులు మోక్షమును పొందెదరు .

## 9 – శివుని యోగావతారము

**శ్రీకృష్ణ ఉవాచః**

**యుగావర్తేషు సర్వేషు యోగాచార్యచ్ఛలేన తు ।**
**అవతారాన్ హి శర్వస్య శిష్యాంశ్చ భగవన్ వద ॥**

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను –

కాలచక్రములోని మహాయుగములన్నింటి యందు శివుడు యోగాచార్యరూపముగా అవతరించినాడు గదా! ఆ అవతారములను మరియు ఆ శిష్యులను గురించి చెప్పుము (1).

**ఉపమన్యురువాచః**

**శ్వేతస్సుతారో మదనస్సుహోత్రః కంక ఏవ చ ।**
**లౌగాక్షిశ్చ మహామాయో జైగీషవ్యస్తథైవ చ ॥**
**దధివాహశ్చ ఋషభో మునిరుగ్రోఽత్రిరేవ చ ।**
**సుపాలకో గౌతమశ్చ తథా వేదశిరా మునిః ॥**
**గోకర్ణశ్చ గుహావాసీ శిఖండీ చాపరస్స్మృతః॥**
**జటామాలీ చాట్టహాసో దారుకో లాంగులీ తథా ॥**
**మహాకాలశ్చ శూలీ చ దండీ ముండీశ ఏవ చ ।**
**సహిష్ణుస్సోమశర్మా చ లకులీశ్వర ఏవ చ ॥**
**ఏతే వారాహకల్పేఽస్మిన్ సప్తమస్యాంతరే మనోః ।**
**అష్టావింశతిసంఖ్యాతా యోగాచార్యా యుగక్రమాత్ ॥**
**శిష్యాః ప్రత్యేకమేతేషాం చత్వారశ్శాంతచేతసః ।**
**శ్వేతాదయశ్చ రుష్యాంతాస్తాన్ బ్రవీమి యథాక్రమమ్ ॥**
**శ్వేతశ్శ్వేతశిఖశ్చైవ శ్వేతాశ్వశ్శ్వేతలోహితః ।**
**దుందుభిశ్శతరూపశ్చ ఋచీకః కేతుమాంస్తథా ॥**
**వికోశశ్చ వికేశశ్చ విపాశః పాశనాశనః ।**
**సుముఖో దుర్ముఖశ్చైవ దుర్గమో దురతిక్రమః ॥**
**సనత్కుమారస్సనకస్సనందశ్చ సనాతనః ।**
**సుధామా విరజాశ్చైవ శంఖశ్చాండజ ఏవ చ ॥**
**సారస్వతశ్చ మేఘశ్చ మేఘవాహస్సువాహకః ।**
**కపిలశ్చాసురిః పంచశిఖో బాష్కల ఏవ చ ॥**

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

శ్వేతుడు, సుతారుడు, మదనుడు, సుహోత్రుడు, కంకుడు, లౌగాక్షి, మహామాయావియగు జైగీషవ్యుడు, దధివాహుడు, ఋషభుడు, ఉగ్రముని, అత్రి, సుపాలకుడు, గౌతముడు, వేదశిరముని, గోకర్ణుడు, గుహావాసి, శిఖండి, జటామాలి, అట్టహాసుడు, దారుకుడు, లాంగులి, మహాకాలుడు, శూలి, దండి,

ముండీశుడు, సహిష్ణుడు, సోమశర్మ, లకులీశ్వరుడు అనువారు వరాహకల్పములోని ఏడవ మన్వంతరములో మహాయుగముల వరుస ననుసరించి వచ్చిన ఇరవై ఎనిమిది యోగాచార్యులు. వీరిలో ప్రతి ఒక్కరికీ శ్వేతునితో మొదలిడి రుష్యుని వరకు ఉండే శాంతమైన మనస్సు గల నలుగురు శిష్యులు గలరు. వారిని వరుసగా చెప్పెదను. శ్వేతుడు, శ్వేతశిఖుడు, శ్వేతాశ్వుడు, శ్వేతలోహితుడు, దుందుభి, శతరూపుడు, ఋచీకుడు, కేతుమంతుడు, వికోశుడు, వికేశుడు, విపాశుడు, పాశనాశనుడు, సుముఖుడు, దుర్ముఖుడు, దుర్గముడు, దురతిక్రముడు, సనత్కుమారుడు, సనకుడు, సనందుడు, సనాతనుడు, సుధాముడు, విరజస్సు, శంఖుడు, అండజుడు, సారస్వతుడు, మేఘుడు, మేఘవాహుడు, సువాహకుడు, కపిలుడు, ఆసురీ, పంచశిఖుడు, బాష్కలుడు.

పరాశరశ్చ గర్గశ్చ భార్గవశ్చాంగిరాస్తథా।
బలబంధుర్నిరామిత్రః కేతుశృంగస్తపోధనః ॥
లంబోదరశ్చ లంబశ్చ లంబాత్మా లంబకేశకః ।
సర్వజ్ఞస్సమబుద్ధిశ్చ సాధ్యస్సిద్ధిస్తథైవ చ ॥
సుధామా కశ్యపశ్చైవ వసిష్ఠో విరజాస్తథా ।
అత్రిరుగ్రో గురుశ్రేష్ఠః శ్రవణో ఽ థ శ్రవిష్ఠకః ॥
కుణిశ్చ కుణిబాహుశ్చ కుశరీరః కునేత్రకః।
కాశ్యపో హ్యుశనాశ్చైవ చ్యవనశ్చ బృహస్పతిః ॥
ఉతథ్యో వామదేవశ్చ మహాకాలో మహానిలః ।
వాచఃశ్రవాస్సువీరశ్చ శ్యావకశ్చ యతీశ్వరః ॥
హిరణ్యనాభః కౌశల్యో లోకాక్షిః కుథుమిస్తథా ।
సుమంతుర్జైమినిశ్చైవ కుబంధః కుశకంధరః ॥
ప్లక్షో దారాయణిశ్చైవ కేతుమాన్ గౌతమస్తథా ।
భల్లవీ మధుపింగశ్చ శ్వేతకేతుస్తథైవ చ ॥
ఉశిజో బృహదశ్వశ్చ దేవలః కవిరేవ చ।
శాలిహోత్రస్సువేషశ్చ యువనాశ్వశ్శరద్వసుః ॥
అక్షపాదః కణాదశ్చ ఉలూకో వత్స ఏవ చ ।
కులికశ్చైవ గర్గశ్చ మిత్రకో రుష్య ఏవ చ ॥
ఏతే శిష్యా మహేశస్య యోగాచార్యస్వరూపిణః ।
సంఖ్యా చ శతమేతేషాం సహ ద్వాదశసంఖ్యయా ॥

పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, అంగిరసుడు, బలబంధుడు, నిరామిత్రుడు, కేతుశృంగుడు, తపోధనుడు, లంబోదరుడు, లంబుడు, లంబాత్ముడు, లంబకేశకుడు, సర్వజ్ఞుడు, సమబుద్ధి, సాధ్యుడు, సిద్ధి, సుధాముడు, కశ్యపుడు, వసిష్ఠుడు, విరజసుడు, అత్రి, ఉగ్రుడు, గురు శ్రేష్ఠుడు, శ్రవణుడు, శ్రవిష్ఠకుడు, కుణి, కుణిబాహుడు, కుశరీరుడు, కునేత్రకుడు, కాశ్యపుడు, ఉశనసుడు, చ్యవనుడు, బృహస్పతి, ఉతథ్యుడు, వామదేవుడు, మహాకాలుడు, మహానిలుడు, వాచఃశ్రవసుడు, సువీరుడు, శ్యావకుడు, యతీశ్వరుడు, హిరణ్యనాభుడు, కౌశల్యుడు, లోకాక్షి, కుడుమి, సుమంతుడు, జైమిని, కుబంధుడు, కుశకంధరుడు, పక్షుడు, దార్బాయణి, కేతుమంతుడు, గౌతముడు, భల్లవి, మధుపింగుడు, శ్వేతకేతువు, ఉశిజుడు, బృహదశ్వుడు, దేవలుడు, కవి, శాలిహోత్రుడు, సువేషుడు, యువనాశ్వుడు, శరద్వసువ, అక్షపాదుడు, కణాదుడు, ఉలూకుడు, వత్సుడు, కులికుడు, గర్గుడు, మిత్రకుడు, రుష్యుడు అనువారలు యోగాచార్యరూపములో అవతరించిన మహేశ్వరుని శిష్యులు. వీరి సంఖ్య నూట పన్నెండు గలదు.

సర్వే పాశుపతాస్సిద్ధా భస్మోద్ధూలితవిగ్రహాః ।

సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞా వేదవేదాంగపారగాః ॥

శివాశ్రమరతాస్సర్వే శివజ్ఞానపరాయణాః ।

సర్వే సంగవినిర్ము క్తాశ్శివైకాసక్తచేతసః ॥

సర్వద్వంద్వసహా ధీరాస్సర్వభూతహితే రతాః ।

ఋజవో మృదవస్స్వస్థా జితక్రోధా జితేంద్రియాః ॥

రుద్రాక్షమాలాభరణాస్త్రి పుండ్రాంకితమస్తకాః ।

శిఖాజటాస్సర్వజటా అజటా ముండశీర్షకాః ।।

ఫలమూలాశన ప్రాయాః ప్రాణాయామపరాయణాః ।

శివాభిమాన సంపన్నాశ్శివధ్యానైక తత్పరాః ॥

సమున్మథిత సంసార విషవృక్షాంకురోద్గమాః ।

ప్రయాతుమేవ సన్నద్ధాః పరం శివపురం ప్రతి ॥

సదేశికానిమాన్మత్వా నిత్యం యశ్శివమర్చయేత్ ।

స యాతి శివసాయుజ్యం నాత్ర కార్యా విచారణా ॥

ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివస్య యోగావతారవర్ణనం నామ నవమోఽధ్యాయః ॥

వీరందరు పాశుపతులు, సిద్ధులు, భస్మచే పూయబడిన దేహములు గలవారు, సర్వశాస్త్రముల సారమునెరింగిన వారు, వేదవేదాంగములలో దిట్టలు. వీరందరు శివాశ్రమము (శివుని సేవించే ఆశ్రమము) నందు ప్రీతి గలవారు, శివజ్ఞానమునందు తత్పరులు. వీరందరు ఆసక్తి నుండి విముక్తిని పొందినవారు, కేవలము శివునియందు మాత్రమే లగ్నమైన మనస్సులు గలవార వీరు సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములనన్నింటినీ సహించే ధీరులు. వీరు సకలప్రాణుల హితమునందు శ్రద్ధ గలవారు. వీరు తిన్నని మృదువైన స్వభావము గలవారే ప్రసన్నముగా నుండెదరు. వీరు కోపమును, ఇంద్రియములను జయించిన వారలు. వీరందరు రుద్రాక్షమాలలనే ఆభరణములుగా ధరించి ముఖముపై త్రిపుండ్రమును అలంకరించుకొనెదరు. వీరిలో కొందరు శిఖవద్ద మాత్రము జటను ధరించువారు; కొందరు పూర్తిగా జటాజూటమును ధరించువారు; కొందరు జటలు లేకుండగా ముండితశిరస్కులు. వీరి ఆహారము ప్రధానముగా పళ్లు, దుంపలు మాత్రమే. వీరు ప్రాణాయామమునందు నిష్ఠ గలవారు; నేను శివుని వాడను అను అభిమానము గలవారు; శివుని ధ్యానించుటయందు మాత్రమే తత్పరులు. సంసారమనే విషవృక్షముయొక్కఅంకురము కూడ మొలకెత్తకుండగా పెకిలించిన ఈ శిష్యులు సర్వోత్కృష్టమగు శివపురమును గురించి వెళ్లుటకు సంసిద్ధముగా నున్నారు. వీరి గురువగు శివుని, వీరిని తలచి నిత్యము ఎవరైతే శివుని పూజించునో, వాడు శివుని సాయుజ్యమును పొందును. ఈ విషయములో ఆశంకకు అవకాశము లేదు.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు శివుని యోగావతారమును వర్ణించే తొమ్మిదవ అధ్యాయము ముగిసినది .

# 10 – శివభక్తియొక్క మహిమ

**శ్రీకృష్ణ ఉవాచః**

**భగవన్ సర్వయోగీంద్ర గణేశ్వర మునీశ్వర ।**
**షడాననసమప్రఖ్య సర్వజ్ఞాననిధే గురో ॥**
**ప్రాయస్త్వమవతీర్యోర్వ్యాం పాశవిచ్ఛిత్తయే నృణామ్ ।**
**మహర్షివపురాపస్థాయ స్థితోఽసి పరమేశ్వర ॥**
**అన్యథా హి జగత్యస్మిన్ దేవో వా దానవోఽపి వా ।**
**త్వత్తోఽన్యః పరమం భావం కో జానీయాచ్ఛివాత్మకమ్ ॥**
**తస్మాత్తవ ముఖోద్గీర్ణం సాక్షాదివ పినాకినః ।**
**శివజ్ఞానామృతం పీత్వా న మే తృప్తమభూన్మనః ॥**
**సాక్షాత్సర్వజగత్కర్తుర్భర్తురంకం సమాశ్రితా ।**
**భగవన్ కిం ను పప్రచ్ఛ భర్తారం పరమేశ్వరీ ॥**

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను –

ఓ పూజ్యా! నీవు యోగులందరిలో గొప్పవాడవు. ఓ గణాధ్యక్షా! మహర్షి! కుమారస్వామితో సమానమగు ప్రకాశము గలవాడా! సకలజ్ఞానమునకు నిధియైనవాడా! గురుదేవా! ఓ పరమేశ్వరా! బహుశః నీవు మానవుల పాశములను తెంచివేయుట కొరకై భూమియందు మహర్షిరూపములో అవతరించి మాముందు ఉన్నావు. అట్లు గానిచో, ఈ జగత్తులో దేవత గాని, దానవుడు గాని నీవు తప్ప మరియొకడు శివతత్త్వమునెరింగిన వాడు ఎవడు గలడు? కావున, సాక్షాత్తుగా ఆ పినాకధారియగు శివుడే నీ రూపములో నున్నాడా యన్నట్లు, నీ ముఖము నుండి వెలువడే శివజ్ఞానము అనే అమృతమును పానము చేసిననూ నాకు తృప్తి కలుగుట లేదు. ఓ పూజ్యా! సాక్షాత్తుగా సకలజగత్తులను సృష్టించిన తన భర్తయగు శివుని అంకమునందు కూర్చున్నదే ఆ పరమేశ్వరి తన భర్తను ఏమి ప్రశ్నించెను?

**ఉపమన్యు ఉవాచః**

**స్థానే పృష్టం త్వయా కృష్ణ తద్వక్ష్యామి యథాతథమ్ ।**
**భవభక్తస్య యుక్తస్య తవ కల్యాణచేతసః ॥**
**మహాధరవరే దివ్యే మందరే చారుకందరే ।**
**దేవ్యా సహ మహాదేవో దివ్యే ధ్యానగతోఽభవత్ ॥**
**తదా దేవ్యాః ప్రియసఖీ సుస్మితాస్యా శుభావతీ ।**
**ఫుల్లాన్య తిమనోజ్ఞాని పుష్పాణి సముదాహరత్ ॥**
**తతస్స్వమంకమారోప్య దేవీం దేవవరో రహః ।**
**అలంకృత్య చ తైః పుష్పైరాస్తే హృష్టతరస్స్వయమ్ ॥**
**అథాంతఃపురచారిణ్యో దేవ్యో దివ్యవిభూషణాః ।**
**అంతరంగా గణేంద్రాశ్చ సర్వలోకమహేశ్వరీమ్ ॥**

భర్తారం పరిపూర్ణం చ సర్వలోకమహేశ్వరమ్ ।
చామరాసక్తహస్తాశ్చ దేవీం దేవం సిషేవిరే ॥
తతః ప్రియాః కథా వృత్తా వినోదాయ మహేశయోః ।
త్రాణాయ చ నృణాం లోకే యే శివం శరణం గతాః ।
తదావసరమాలోక్య సర్వలోక మహేశ్వరీ ।
భర్తారం పరిపప్రచ్ఛ సర్వలోకమహేశ్వరమ్ ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను -

ఓ శ్రీ కృష్ణా! నీవు చాల యోగ్యమగు ప్రశ్నను వేసితివి. శివభక్తుడవు, యోగ్యుడవు, మంగళకరమగు ఆలోచనలు గలవాడవు అగు నీకు. నేనా విషయమును యథాతథముగా చెప్పెదను. పర్వతములలో శ్రేష్టమైనది, దివ్యమైనది, సుందరమగు గుహలు గలది అగు మందర పర్వతమునందు ప్రకాశస్వరూపుడగు మహాదేవుడు దేవితో గూడి, ధ్యానమును పొంది యుండెను. అపుడు దేవియొక్క ప్రియసఖియగు శుభావతి చిరునవ్వుతో ప్రకాశించే ముఖము గలదై మిక్కిలి అందమైన వికసించిన పుష్పములను తెచ్చెను. తరువాత శివుడు దేవిని ఏకాంతములో తన అంకముపై కూర్చుండ బెట్టుకొని మిక్కిలి హర్షమును పొంది స్వయముగా ఆ పుష్పములతో ఆమెను అలంకరించు చుండెను. అపుడు అంతఃపురమునందు సంచరించే దివ్యములగు ఆభరణములను ధరించి యున్న దేవతామూర్తులు మరియు ఆంతరంగికులగు గణాధ్యక్షులు సర్వలోకములకు మహేశ్వరియగు ఆ దేవిని, పూర్ణుడు సర్వలోకములకు మహేశ్వరుడు అగు ఆ దేవుని, చేతులలో వింజామరలను పట్టుకొని సేవించిరి. అపుడు పార్వతీపరమేశ్వరుల వినోదము కొరకై ప్రీతికరమగు గాథలు చెప్పబడెను. అపుడు సర్వలోకమహేశ్వరి యగు దేవి సరియగు సమయమును చూచి, లోకములో శివుని శరణు పొందిన మానవుల రక్షణ కొరకై, సర్వలో కమహేశ్వరుడగు తన భర్తను ప్రశ్నించెను.

**దేవ్యువాచః**

కేన వశ్యో మహాదేవో మర్త్యానాం మందచేతసామ్ ।
ఆత్మతత్త్వాద్యశక్తానామాత్మ నామకృతాత్మనామ్ ॥

దేవి ఇట్లు పలికెను -

మందబుద్ధి గలవారు, ఆత్మతత్త్వము మొదలగు వాటియందు శక్తి లేనివారు, కృతార్థులు కానివారు అగు మానవులకు మహాదేవుడు వశమయ్యే ఉపాయమేది?

ఈశ్వర ఉవాచః

న కర్మణా న తపసా న జపైర్నాసనాదిభిః ।
న జ్ఞానేన న చాన్యేన వశ్యోఽహం శ్రద్ధయా వినా ॥
శ్రద్ధా మయ్యస్తి చేత్పుంసాం యేన కేనాపి హేతునా ।
వశ్యస్స్పృశ్యశ్చ దృశ్యశ్చ పూజ్యస్సంభాష్య ఏవ చ ॥
సాధ్యా తస్మాన్మయి శ్రద్ధా మాం వశీకర్తుమిచ్ఛతా ।
శ్రద్ధా హేతుస్స్వధర్మస్య రక్షణం వర్ణినామిహ ॥
స్వవర్ణాశ్రమధర్మేణ వర్తతే యస్తు మానవః ।
తస్యైవ భవతి శ్రద్ధా మయి నాన్యస్య కస్యచిత్ ॥
ఆమ్నాయసిద్ధమఖిలం ధర్మమాశ్రమిణామిహ ।
బ్రహ్మణా కథితం పూర్వం మమైవాజ్ఞాపురస్సరమ్ ॥
స తు పైతామహో ధర్మో బహువిత్త క్రియాన్వితః ।
నాత్యంతఫలభూయిష్ఠః క్లేశాయాససమన్వితః ॥
తేన ధర్మేణ మహతా శ్రద్ధాం ప్రాప్య సుదుర్లభామ్ ।
వర్ణినో యే ప్రపద్యంతే మామనన్య సమాశ్రయాః ।
తేషాం సుఖేన మార్గేణ ధర్మకామార్థముక్తయః ॥
వర్ణాశ్రమసమాచారో మయా భూయః ప్రకల్పితః ।
తస్మిన్ భక్తిమతామేవ మదీయానాం తు వర్ణినామ్ ॥
అధికారో న చాన్యేషామిత్యాజ్ఞా నైష్ఠికీ మమ ।
తదాజ్ఞప్తేన మార్గేణ వర్ణినో మదుపాశ్రయాః ॥
మలమాయాదిపాశేభ్యో విముక్తా మత్ప్రసాదతః ।
పురం మదీయమాసాద్య పునరావృత్తిదుర్లభమ్ ॥
పరమం మమ సాధర్మ్యం ప్రాప్య నిర్వృతిమాయయుః ॥
తస్మాల్లబ్ధ్వాఽప్యలబ్ధ్వా వా వర్ణధర్మం మయేరితమ్ ।
ఆశ్రిత్య మమ భక్తశ్చేత్స్వాత్మనాత్మాన ముద్ధరేత్ ॥
అలబ్ధలాభ ఏవైష కోటికోటిగుణాధికః ।
తస్మాన్మే ముఖతో లబ్ధం వర్ణధర్మం సమాచరేత్ ॥

ఈశ్వరుడిట్లు పలికెను –

శ్రద్ధ లేనిచో, కర్మ, తపస్సు, జపములు, ఆసనములు మొదలగు వా◌ాటికి గాని, జ్ఞానము నకు గాని, ఇతరమునకు గానీ నేను వశము గాను. నాయందు-మానవులకు ఏ కారణము చేతనైననూ శ్రద్ధ ఉన్నచో, నేను వారికి వశుడనగుదును; వారు నన్ను స్పృశించ వచ్చును; చూచి పూజించి సంభాషించవచ్చును. కావున, నన్ను వశము చేసుకొన గోరు వ్యక్తి నాయందు శ్రద్ధను సాధన చేయవలెను. స్వధర్మమునకు హేతువు అగు శ్రద్ధ ఈ లోకములో వర్ణములవారిని అందరినీ రక్షించును. ఏ మానవుడైతే తన వర్ణాశ్రమధర్మమునకు అనురూపముగా

జీవించునో, వానికి మాత్రమే నాయందు శ్రద్ధ కలుగును; ఇతరులకు ఎవరికైననూ కలుగదు. పూర్వము నా ఆజ్ఞను అనుసరించియే బ్రహ్మ ఈ లోకములో ఆశ్రమముల వారిని ఉద్దేశించి వేదములలో బోధింపబడిన సకలధర్మములను చెప్పి యున్నాడు. బ్రహ్మచే బోధింపబడిన ఆ ధర్మము చాల ధనముచే సాధ్యమయ్యే కర్మలతో, క్లేశముతో మరియు ఆయాసముతో కూడియున్ననూ అత్యధికఫలమును ఇచ్చునది గాదు. ఏ వర్ణముల వారైతే ఆ గొప్ప ధర్మముచే మిక్కిలి దుర్లభమగు శ్రద్ధను పొంది, సంసారమును విడిచిపెట్టి నన్ను మాత్రమే ఆశ్రయించెదరో, వారికీ సుఖకరమగు మార్గముచే ధర్మార్థకామమోక్షములు లభించును. వర్ణాశ్రమములకు సంబంధించిన చక్కని ఆచారమును నేనే పలుపర్యాయములు సృష్టించితిని, దానియందు భక్తిని కలిగి నన్ను శరణు పొందిన వర్ణముల వారికి మాత్రమే అధికారముగలదు; ఇతరులకు లేదు. ఇది సా ఖచ్చితమైన ఆజ్ఞ. నేను ఆజ్ఞాపించియున్న ఆ మార్గముచే వర్ణములకు చెందినవారు నన్ను ఆశ్రయించి, నో అనుగ్రహము పాపములు, మాయ మొదలగు బంధములనుండి విముక్తిని పొందెదరు. వెనుకకు తిరుగుట లేనిది, దుర్లభమైనదీ, సర్వోత్కృష్టమైనది అగు నో పురమునకు వచ్చి వారు నాతో ఐక్యమును పొంది మోక్షమును పొందెదరు. కావున, నేను చెప్పిన వర్ణధర్మమును పొందినవారు గానీ, పొందని వారు గాని, నన్ను శరణు పొందిన భక్తుడైనచో, తనను తాను ఉద్ధరించు కొనును. ఇది కోటి కోటి రెట్లు అధికమైన లాభము. ఈ లాభము పూర్వములో పొందినది కాదు. కావున, నా ముఖమునుండి వచ్చిన వర్ణధర్మమును చక్కగా ఆచరించవలెను.

**మమావతారా హి శుభే యోగాచార్యచ్ఛలేన తు ।**
**సర్వాంతరేషు సంత్యార్యే సంతతిశ్చ సహస్రశః ॥**
**అయుక్తానామబుద్ధీనామభక్తానాం సురేశ్వరి ।**
**దుర్లభం సంతతిజ్ఞానం తతో యత్నాత్సమాశ్రయేత్ ॥**
**స నిస్తన్మహచ్ఛిద్రం స మోహస్సాంధకూపతా ।**
**యదన్యత్ర శ్రమం కుర్యాన్మోక్షమార్గబహిష్కృతః ॥**
**జ్ఞానం క్రియా చ చర్యా చ యోగశ్చేతి సురేశ్వరి ।**
**చతుష్పాదస్సమాఖ్యాతో మమ ధర్మసనాతనః ॥**
**పశుపాశపతిజ్ఞానం జ్ఞానమిత్యభిధీయతే ।**
**షడధ్వశుద్ధివిధినా గుర్వధీనా క్రియోచ్యతే ॥**
**వర్ణాశ్రమ ప్రయుక్తస్య మయైవ విహితస్య చ ।**
**మమార్చనాదిధర్మస్య చర్యా చర్యేతి కథ్యతే ॥**
**మదుక్తేనైవ మార్గేణ మయ్యవస్థితచేతసః ।**
**వృత్త్యంతరనిరోధో యో యోగ ఇత్యభిధీయతే ॥**
**అశ్వమేధగణాచ్ఛ్రేష్ఠం దేవి చిత్త ప్రసాధనమ్ ।**
**ముక్తిదం చ తథా హ్యేతద్దుష్ప్రాప్యం విషయైషిణామ్ ॥**
**విజితేంద్రియవర్గస్య యమేన నియమేన చ ।**
**పూర్వపాపహరో యోగో విరక్తస్యైవ కథ్యతే ॥**

మదుక్తేనైవ మార్గేణ మయ్యవస్థితచేతసః ।
వృత్త్యంతరనిరోధో యో యోగ ఇత్యభిధీయతే ॥
అశ్వమేధగణాచ్ఛ్రేష్ఠం దేవి చిత్త ప్రసాధనమ్ ।
ముక్తిదం చ తథా హ్యేతద్దుష్ప్రాప్యం విషయైషిణామ్ ॥
విజితేంద్రియవర్గస్య యమేన నియమేన చ ।
పూర్వపాపహరో యోగో విరక్తస్యైవ కథ్యతే ॥
వైరాగ్యా జ్జాయతే జ్ఞానం జ్ఞానాద్యోగః ప్రవర్తతే ॥

ఓ శుభకరులారా! యోగాచార్యులు అనే మిషతో మహాయుగములన్నింటియందు౦ు నా అవతారములు గలవు. వారి శిష్యపరంపర కూడ వేలాది మంది గలరు . ఓ దేవదేవీ! అయోగ్యులు, మందబుద్ధులు, భక్తి లేనివారు అగు జనులకు పరంపరా ప్రాప్తమగు ఈ జ్ఞానము దుర్లభము. కావున, ప్రయత్నపూర్వకముగా నన్ను ఆశ్రయించ వలెను. మానవుడు మోక్ష మార్గమునుండి బహిష్కృతుడై ఇతరములగు సంసారవిషయములయందు శ్రమించుట అనునది యేది గలదో, అదియే హాని; అదియే పెద్ద లోటు; అదియే మోహము; అదియే గ్రుడ్డితనము మరియు మూగితనము . ఓ దేవదేవీ! సనాతనమగు నా ధర్మమునందు జ్ఞానము, క్రియ, చర్య మరియు యోగములనే నాలుగు పాదములు గలవు జీవుడు, బంధము, ఈశ్వరుడు అనువాటి జ్ఞానమునకు జ్ఞానమని పేరు. యథావిధిగా గురువునకు వశుడై చేసే ఆరుమార్గముల శుద్ధికి క్రియ అని పేరు వర్ణాశ్రమములలో చేయబడే నా పూజ మొదలగు ధర్మము నా చేతనే విధించబడినది. దానిని ఆచరించుట చర్య అనబడును . నేను చెప్పిన మార్గము చేతనే నాయందు స్థిరముగా నున్న మనస్సు గలవాడై సాధకుడు ఇతరమగు మనోవృత్తులను నిరోధించుటయే యోగమని చెప్పబడు చున్నది. ఓ దేవీ! అనేకములగు అశ్వమేధయాగములకంటే శ్రేష్ఠమైనది, మనస్సునకు ప్రసన్నతను కలిగించునదీ మరియు మోక్షమునిచ్చునది అగు ఈ యోగము విషయభోగములయందు కోరిక గలవారికి లభించుట చాల కష్టము. యమనియమములచే పూర్వమునందలి పాపములను హరించి వేసే యోగము ఇంద్రియసమూహమును జయించిన విరక్తునకు మాత్రమే చెప్పబడినది. వైరాగ్యమునుండి జ్ఞానము పుట్టును. జ్ఞానము వలన యోగము ముందుకు సాగును .

యోగజ్ఞః పతితో వాపి ముచ్యతే నాత్ర సంశయః ।
దయా కార్యాథ సతతమహింసా జ్ఞానసంగ్రహః ॥
సత్యమస్తేయమాస్తిక్యం శ్రద్ధా చేంద్రియనిగ్రహః ।
అధ్యాపనం చాధ్యయనం యజనం యాజనం తథా ॥
ధ్యానమీశ్వరభావశ్చ సతతం జ్ఞానశీలతా ।
య ఏవం వర్తతే విప్రో జ్ఞానయోగస్య సిద్ధయే ॥
అచిరాదేవ విజ్ఞానం లబ్ధ్వా యోగం చ విందతి ।
దగ్ధ్వా దేహమిమం జ్ఞానీ క్షణాత్ జ్ఞానాగ్నినా ప్రియే ॥

ప్రసాదాన్మమ యోగజ్ఞః కర్మబంధం ప్రహాస్యతి ।
పుణ్యాపుణ్యాత్మకం కర్మ ముక్తేస్తత్ప్రతి బంధకమ్ ॥
తస్మాన్నియోగతో యోగీ పుణ్యాపుణ్యం వివర్జయేత్ ॥
ఫలకామనయా కర్మకరణాత్ప్రతి బధ్యతే ।
న కర్మమాత్రకరణాత్తస్మాత్కర్మఫలం త్యజేత్ ॥
ప్రథమం కర్మయజ్ఞేన బహిస్సంపూజ్య మాం ప్రియే ।
జ్ఞానయోగరతో భూత్వా పశ్చాద్యోగం సమభ్య సేత్ ॥
విదితే మమ యాథాత్మ్యే కర్మయజ్ఞేన దేహినః ।
న యజంతి హి మాం యుక్తాస్సమలోష్టాశ్మకాంచనాః ॥
నిత్యయుక్తో మునిః శ్రేష్ఠో మద్భక్తశ్చ సమాహితః ।
జ్ఞానయోగరతో యోగీ మమ సాయుజ్యమాప్నుయాత్ ॥
అథావిరక్తచిత్తా యే వర్ణినో మదుపాశ్రితాః ।
జ్ఞానచర్యా క్రియాస్వేవ తేఽధికుర్యుస్తదర్హకాః ॥

యోగమునెరింగిన వాడు పతితుడే అయినా మోక్షమును పొందును. ఈ విషయములో సందేహము లేదు. సాధకుడు సర్వకాలములలో దయను కలిగి యుండవలెను. అహింస, జ్ఞానమును ప్రోగుచేసుకొనుట, సత్యము, పరధనమును అపహరించ కుండుట, ఈశ్వరుని యందు అస్తిత్వబుద్ధి, శ్రద్ధ, ఇంద్రియములపై నిగ్రహము, శాస్త్రమును బోధించుట, తాను చదువుట, పూజను తాను చేయుట, ఇతరులచే చేయించుట, ధ్యానము, ఈశ్వరభక్తి, సర్వకాలములలో జ్ఞాననిష్ఠను కలిగియుండుట అను లక్షణములను ఏ బ్రాహ్మణుడైతే కలిగియుండునో, అతడు జ్ఞానయోగము సిద్ధించుటకు యోగ్యుడగును. అతడు తొందరలోననే విశేషజ్ఞానమును పొంది, యోగమును కూడ పొందును. ఓ ప్రియురాలా! ఆ జ్ఞాని ఈ దేహమును జ్ఞానమనే అగ్నిచే క్షణకాలములో దహించి, నా అనుగ్రహముచే యోగమును తెలుసుకొని కర్మబంధమునుండి విముక్తుడగును. పుణ్యపాపములనే రెండు రకముల కర్మ కూడా మోక్షమునకు ఆటంకమగును. కావున, యోగి నిశ్చితమగు యోగము ద్వారా పుణ్యపాపములను రెండింటినీ విడువవలెను . ఫలమునందలి కోరికతో కర్మను చేయువాడు బంధితుడగును. కానీ, కేవలము కర్మను చేసినంత మాత్రాన బంధము ఉండదు. కావున, కర్మఫలమును విడువ వలెను. ఓ ప్రియురాలా! ముందుగా నన్ను కర్మరూపమగు యజ్ఞముచే బాహ్యమూర్తియందు చక్కగా పూజించి, జ్ఞానయోగమునందు ప్రీతిని పొంది, తరువాత యోగమును చక్కగా అభ్యసించవలెను. మానవునకు కర్మరూపమగు యజ్ఞముచే నా స్వరూపము యథాతథముగా తెలిసినప్పుడు, మట్టిబెడ్డ రాయి బంగారము అనువాటియందు సమానమగు ప్రవృత్తి గల అట్టి యోగులు నా పూజనుండి విరమించెదరు. సర్వకాలములలో సావధానుడై యుండువాడు, మననశీలుడు, ఉత్తముడు, నాభక్తుడు, ఏకాగ్రచిత్తము గలవాడు, జ్ఞానయోగమునందు ప్రీతి గలవాడు అగు యోగి నా సాయుజ్యమును పొందును. దీనికి భిన్నముగా, వైరాగ్యము లేని మనస్సు గలవారు, వర్ణములకు చెందినవారు

అగు ఏ మానవులు నన్ను ఆశ్రయించెదరో, వారికి జ్ఞానము చర్య క్రియ అనువాటియందు మాత్రమే అధికారము గలదు. వారు వాటికి అర్హులు .

ద్విధా మత్పూజనం జ్ఞేయం బాహ్యమాభ్యంతరం తథా ।
వాఙ్మనః కాయభేదాచ్చ త్రిధా మద్పూజనం విదుః ॥
తపః కర్మ జపో ధ్యానం జ్ఞానం వేత్యనుపూర్వశః ।
పంచధా కథ్యతే సద్భిస్తదేవ భజనం పునః ॥
అన్యాత్మ విదితం బాహ్యమస్మదభ్యర్చనాదికమ్ ।
తదేవ తు స్వసంవేద్యమాభ్యంతర ముదాహృతమ్ ॥
మనో మత్ప్రవణం చిత్తం న మనో మాత్రముచ్యతే ।
మన్నామనిరతా వాణీ వాజ్ మతా ఖలు నేతరా ॥
లింగైర్మచ్ఛాసనాదిష్టైస్త్రి పుండ్రాదిభిరంకితః ।
మమోపచారనిరతః కాయః కాయో న చేతరః ॥
మదర్చా కర్మ విజ్ఞేయం బాహ్యే యాగాది నోచ్యతే ।
మదర్థే దేహసంశోషస్తపః కృచ్ఛ్రాది నో మతమ్ ॥
జపః పంచాక్షరాభ్యాసః ప్రణవాభ్యాస ఏవ చ ।
రుద్రాధ్యాయాదికాభ్యాసో న వేదాధ్యయనాదికమ్ ॥
ధ్యానం మద్రూపచింతాద్యం నాత్మాద్యర్థసమాధయః ।
మమాగమార్థవిజ్ఞానం జ్ఞానం నాన్యార్థవేదనమ్ ॥
బాహ్యే వాభ్యంతరే వాథ యత్ర స్యాన్మనసో రతిః।
ప్రాగ్వాసనావశాద్దేవి తత్రనిష్ఠాం సమాచరేత్ ॥
బాహ్యాదాభ్యంతరం శ్రేష్ఠం భవేచ్ఛతగుణాధికమ్ ।
అసంకరత్వాద్దోషాణాం దృష్టానామప్యసంభవాత్ ॥

బాహ్యము, ఆభ్యంతరము అని నా పూజ రెండు రకములుగా నున్నది. మనోవాక్కాయములు అనే భేదమును బట్టి నా సేవ మూడు విధములుగా నున్నదని పెద్దలు చెప్పెదరు . నా సేవనే మరల తపస్సు, కర్మ, జపము, ధ్యానము, జ్ఞానము అని ఐదు విధములుగా క్రమముగా సత్పురుషులు విభాగమును చేసినారు. ఇతరులకు తెలిసే విధముగా చేయబడే పూజ మొదలగునది బాహ్యమనబడును. దానినే తనకు మాత్రమే తెలిసే విధముగా చేసినచో, అది ఆభ్యంతరమగును. మనస్సు అనగా నాయందు లగ్నమైన మనస్సే గాని, కేవలము ఆలోచించుట మాత్రమే మనస్సు కాదు. నా నామమునందు లగ్నమైన వాక్కు వాక్కు అగునే గాని, కేవలము మాటలాడుట వాక్కు కాదు. నా శాసనముచే ఆదేశించబడిన విధముగా త్రిపుండ్రము మొదలగు చిహ్నములచే చిహ్నింపడి నా సేవయందు లగ్నమైన దేహమే దేహము గాని, శరీరమాత్రము దేహము కాదు (51). బాహ్యమునందు చేసే యజ్ఞము మొదలగునవి కర్మ కావు. కర్మ అనగా నా పూజ అని తెలియవలెను. నా కొరకై శరీరమును కృశింప జేయుటయే తపస్సు; కృచ్ఛము మొదలగు వ్రతములు తపస్సు అనబడవు. పంచాక్షరమంత్రమును, ఓంకారమును,

రుద్రాధ్యాయము మొదలగువాటిని పదే పదే ఉచ్చరించుట జపమనబడును; వేదాధ్యయనము మొదలగునవి జపము కావు. నా రూపమును తలపోయుట మొదలగునవి ధ్యానమగునే గాని, ఆత్మ మొదలగు వాటికొరకు చేసే చిత్తైకాగ్రతలు ధ్యానము అనబడవు. నా ఆగమముయొక్క అర్థమును తెలియుటయే జ్ఞానమగును గాని, ఇతరవిషయములను తెలియుట కాదు. ఓ దేవీ! పూర్వమునందలి వాసనలకు లోబడి బాహ్యమునందు గాని, ఆంతరము (లోపల) నందు గానీ, మనస్సునకు ఎక్కడ ప్రీతి కలుగునో, దానియందు మాత్రమే దృఢమగు తత్త్వ నిష్ఠను కలిగి యుండవలెను. బాహ్యము కంటే ఆభ్యంతరము వంద రెట్లు గొప్పది. ఏలయన, దానియందు దోషముల సాంకర్యము ఉండదు. మరియు దానియందు ప్రత్యక్షముగా కనబడే దోషములు సంభవించవు.

**శౌచమాభ్యంతరం విద్యాన్న బాహ్యం శౌచముచ్యతే ।**

**అంతశ్శౌచవిముక్తాత్మా శుచిరప్యశుచిర్భవేత్ ॥**

**బాహ్యమాభ్యంతరం చైవ భజనం భావపూర్వకమ్ ।**

**న భావరహితం దేవి విప్రలంభైక కారణమ్ ॥**

**కృతకృత్యస్య పూర్ణస్య మమ కిం క్రియతే నరైః ।**

**బహిర్వాభ్యంతరం వాథ మయా భావో హి గృహ్యతే ॥**

**భావైకాత్మా క్రియా దేవి మమ ధర్మస్సనాతనః ।**

**మనసా కర్మణా వాచా హ్యనపేక్ష్య ఫలం క్వచిత్ ॥**

**ఫలోద్దేశేన దేవేశి లఘుర్ధర్మ సమాశ్రయః ।**

**ఫలార్థీ తదభావే మాం పరిత్యక్తుం క్షమో యతః ॥**

**ఫలార్థినోఽపి యస్యైవ మయి చిత్తం ప్రతిష్ఠితమ్ ।**

**భావానురూపఫలదస్తస్యామ్యహమ నిందితే ॥**

**ఫలానపేక్షయా యేషాం మనో మత్ప్రవణం భవేత్ ।**

**ప్రార్థయేయుః ఫలం పశ్చాద్భ క్తాస్తేఽపి మమ ప్రియాః ॥**

**ప్రాక్ సంస్కారవశాదేవ యే విచింత్య ఫలాఫలే ।**

**వివశా మాం ప్రపద్యంతే మమ ప్రియతమా మతాః ॥**

**మల్లాభాన్న పరో లాభస్తేషామితి యథాతథమ్ ।**

**మమాపి లాభస్తల్లాభాన్న పరః పరమేశ్వరి ॥**

**మదనుగ్రహతస్తేషాం భావో మయి సమర్పితః ।**

**ఫలం పరమనిర్వాణం ప్రయచ్ఛతి బలాదివ ॥**

అంతరంగశౌచమే శౌచము గాని, బాహ్యము కాదని తెలియవలెను. ఏలయనగా, అంతశ్శౌచము లేని వ్యక్తి శుచిగా నున్ననూ అశుచియే బాహ్యము మరియు ఆంతరము అగు సేవ భక్తిపూర్వకముగా నుండవలెను. ఓ దేవీ! భక్తి లేని సేవ సేవయే కాదు; అది కేవలము మోసమునకు మాత్రమే కారణమగును. కృతార్థుడను, పవిత్రుడను అగు నాకు జనులు ఏమి చేయవలసి యున్నది? వారు చేసే బాహ్యము మరియు అభ్యంతరము అగు కర్మలలో నేను కేవలము భావనను మాత్రమే చూచెదను. ఓ దేవీ! క్రియయొక్క ఆత్మ కేవలము భావము (అనురాగము) మాత్రమే. అదియే సనాతనమగు నా ధర్మము. ఫలమును ఏ కాలమునందైననూ అపేక్షించకుండగా మనోవాక్కాయములతో కర్మను చేయవలెను . ఓ దేవీ! ఫలమును ఉద్దేశించి చేసినచో, నన్ను ఆశ్రయించుటయందు తేలిక భావము వచ్చినట్లగును. ఏలయనగా, ఫలమును కోరువాడు ఫలము లేని పక్షములో నన్ను విడుచుటకు సమర్థుడే యగును. దోషములు లేని ఓ పార్వతీ! ఫలమును కోరువానికైననూ ఎవని మనస్సు నాయందు స్థిరముగా నుండునో, వానికి కూడ వాని భావమునకు తగిన ఫలమును నేను ఇచ్చెదను. ఎవరి మనస్సులు ఫలమును అపేక్షించకుండగా నాయందు లగ్నమగునో, ఆ భక్తులు తరువాత ఫలమును కోరిననూ, నాకు ప్రియులే అగుచున్నారు. ఎవరైతే ఫలమును గురించి గాని, దాని అభావమును గురించి గాని, ఆలోచించకుండగా పూర్వమునందలి సంస్కారములకు వశులై ఒళ్లు మరిచి నన్ను శరణు వేడెదరో, వారు నాకు అతిశయించిన ప్రీతికి పాత్రులగుదురు . ఓ పరమేశ్వరీ! వారికి నన్ను పొందుట కంటే గొప్పదగు వాస్తవికలాభము లేదు. నాకు కూడ వారిని పొందుట కంటే అధికమగు లాభము మరియొకటి లేదు , నాయందు సమర్పించ బడిన వారి ప్రేమ నా అనుగ్రహముచే బలాత్కారముగానా యన్నట్లు సర్వోత్కృష్టమగు మోక్షఫలమును ఇచ్చును .

**మహాత్మనామనన్యానాం మయి సన్న్యస్తచేతసామ్ ।**

**అష్టధా లక్షణం ప్రాహుర్మమ ధర్మాధికారిణామ్ ॥**

**మద్భక్తజనవాత్సల్యం పూజాయాం చానుమోదనమ్ ।**

**స్వయమభ్యర్చనం చైవ మదర్థే చాంగచేష్టితమ్ ॥**

**మత్కథాశ్రవణే భక్తిస్స్వరనేత్రాంగవి క్రియాః ।**

**మమానుస్మరణం నిత్యం యశ్చ మాముపజీవతి ॥**

**ఏవమష్టవిధం చిహ్నం యస్మిన్ మ్లేచ్ఛేఽపి వర్తతే ।**

**స విప్రేంద్రో మునిః శ్రీమాన్ స యతిస్స చ పండితః ॥**

**నమే ప్రియశ్చతుర్వేదీ మద్భక్తో శ్వపచోఽపి యః ।**

**తస్మై దేయం తతో గ్రాహ్యం స చ పూజ్యో యథా హ్యహమ్ ॥**

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**

**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥**

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివభక్తి మహిమవర్ణనం నామ దశమోఽధ్యాయః॥**

నాయందు అనన్య ( భేదము లేని) భక్తి గలవారు, నాయందు సమర్పించబడిిన చిత్తము గలవారు, నా ధర్మమునందు అధికారులు అగు మహాత్ములకు ఎనిమిది లక్షణములు గలవని చెప్పుదురు. నా భక్తజనులపై ప్రేమ, నా పూజను ప్రోత్సహించుట, స్వయముగా నన్ను పూజించుట, నా కొరకు మాత్రమే దేహమునందు చేష్టలను చేయుట, నా కథలను వినుటయందు భక్తి, కంఠస్వరము బొంగురు పోవుట కన్నులనుండి నీరు కారుట శరీరము స్తంభించుట మొదలగు భక్తివికారములు, సర్వకాలములలో నన్ను స్మరించుచుండుట, సర్వదా నన్ను మాత్రమే ఆశ్రయించి జీవించుట అనే ఈ ఎనిమిది లక్షణములు ఎవనియందు ఉండునో, వాడు మ్లేచ్ఛుడే అయిననూ, వాడే గొప్ప బ్రాహ్మణుడు, ముని, శోభ గలవాడు, యతి మరియు పండితుడు నాలుగు వేదములను చదివిన పండితుడు నాకు ప్రియుడు కాడు. నా భక్తుడు శునకమాంసభక్షకుడే అయిననూ, వానికే ఈయవలెను; వాని నుండియే గ్రహించ వలెను. వాడు నాతో సమానముగా పూజకు అర్హుడు . ఎవడైతే నాకు ఆకుని గాని, పుష్పమును గాని, పండును గాని, నీటిని గాని భక్తితో ఇచ్చునో, వానికి నేను కనబడకుండగా పోను; ఆతడు నా దృష్టిలో లేకుండగా నుండడు .

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివభక్తిమహిమను వర్ణించే పదవ అధ్యాయము ముగిసినది.

# 11 – శివజ్ఞానము యొక్క మహిమ

ఈశ్వర ఉవాచః

అథ వక్ష్యామి దేవేశి భక్తానామధికారిణామ్ ।
విదుషాం ద్విజముఖ్యానాం వర్ణధర్మం సమాసతః ॥
త్రిస్స్నానం చాగ్నికార్యం చ లింగార్చనమనుక్రమమ్ ।
దానమీశ్వరభావశ్చ దయా సర్వత్ర సర్వదా ॥
సత్యం సంతోషమాస్తిక్యమహింసా సర్వజంతుషు ।
హ్రీః శ్రద్ధాధ్యయనం యోగస్సదాధ్యాపనమేవ చ ॥
వ్యాఖ్యానం బ్రహ్మచర్యం చ శ్రవణం చ తపః క్షమా ।
శౌచం శిఖోపవీతం చ ఉష్ణీషం చోత్తరీయకమ్ ॥
నిషిద్ధా సేవనం చైవ భస్మరుద్రాక్ష ధారణమ్ ।
పర్వణ్య భ్యర్చనం దేవి చతుర్దశ్యాం విశేషతః ॥
పానం చ బ్రహ్మకూర్చస్య మాసి మాసి యథావిధి ।
అభ్యర్చనం విశేషేణ తేనైవ స్నాప్య మాం ప్రియే ॥
సర్వక్రియాన్నసంత్యాగః శ్రాద్ధాన్నస్య చ వర్జనమ్ ।
తథా పర్యుషితాన్నస్య యావకస్య విశేషతః ॥
మద్యస్య మద్య గంధస్య నైవేద్యస్య చ వర్జనమ్ ।
సామాన్యం సర్వవర్ణానాం బ్రాహ్మణానాం విశేషతః ॥
క్షమా శాంతిశ్చ సంతోషస్సత్యమస్తేయమేవ చ।
బ్రహ్మచర్యం మమ జ్ఞానం వైరాగ్యం భస్మసేవనమ్ ॥
సర్వసంగనివృత్తిశ్చ దశైతాని విశేషతః ।
లింగాని యోగినాం భూయో దివా భిక్షాశనం తథా ॥

ఈశ్వరుడిట్లు పలికెను –

ఓ దేవదేవీ! భక్తులు, అధికారులు, విద్వాంసులు అగు బ్రాహ్మణ శ్రేష్ఠులు పాటించదగిన వర్ణధర్మమును గురించి సంగ్రహముగా చెప్పెదను. మూడు సార్లు స్నానము, అగ్నికార్యము, తరువాత లింగార్చనము, దానము, ఈశ్వరునియందు భక్తి, సర్వకాలములలో సర్వప్రాణులయందు దయ, సత్యము, సంతోషము, ఆస్తికుడై యుండుట, సర్వప్రాణులయెడ దయ, వినయము, శ్రద్ధ, అధ్యయనము, యోగము, సర్వకాలములలో ఇతరులకు జ్ఞానమును బోధించుట, ధార్మికమగు ప్రవచనములను చేయుట, బ్రహ్మచర్యము, వేదాంతమును శ్రవణము చేయుట, తపస్సు, క్షమ, శౌచము, పిలకను యజ్ఞోపవీతమును తలపాగాను మరియు ఉత్తరీయమును ధరించుట, నిషేధించబడిన విషయములను సేవించకుండుట, భస్మను రుద్రాక్షలను ధరించుట అను ధర్మములను వారు పాటించవలెను. ఓ దేవీ! వారు పర్వదినములయందు, విశేషించి చతుర్దశినాడు, ఈశ్వరుని పూజించవలెను.

ఓ ప్రియురాలా! ప్రతీ మాసమునందు వారు యథావిధిగా పంచగవ్యమును హోమము చేసి దానిని పానము చేయవలెను. దానితో డనే నన్ను అభిషేకించి విశేషముగా పూజించవలెను. సకలకర్మలలో భాగముగా ఈయబడే అన్నమును, శ్రాద్ధమునాడు ఈయబడే అన్నమును, నిలవ ఉన్న అన్నమును, గంజినీ వారు స్వీకరించ రాదు. మద్యమును, మద్య గంధము గల నైవేద్యమును కూడా విడిచిపెట్టుట సర్వవర్ణముల వారికి వర్తించే నియమము. ఇది బ్రాహ్మణులకు విశేషముగా వర్తించును క్షమ, మనోనిగ్రహము, సంతోషము, సత్యము, పరధనముపై మనస్సులోనైననూ ఆశ పడకుండుట, బ్రహ్మచర్యము, శివజ్ఞానము, వైరాగ్యము, భస్మను ధరించుట , సర్వవిధముల ఆసక్తినుండి నివృత్తి అనే ఈ పది యోగుల విశేషలక్షణములు. ఇంతేగాక, వారు పగలు మాత్రమే భిక్షాన్నమును భుజించవలెను .

**వానప్రస్థాశ్రమస్థానాం సమానమిదమిష్యతే ।**
**రాత్రౌ న భోజనం కార్యం సర్వేషాం బ్రహ్మచారిణామ్ ॥**
**అధ్యాపనం యాజనం చ క్షత్రియస్య ప్రతిగ్రహః ।**
**వైశ్యస్య చ విశేషణ మయా నాత్ర విధీయతే ॥**
**రక్షణం సర్వవర్ణానాం యుద్ధే శత్రువధస్తథా ।**
**దుష్టపక్షిమృగాణం చ దుష్టానాం శాతనం నృణామ్ ॥**
**అవిశ్వాసశ్చ సర్వత్ర విశ్వాసో మమ యోగిషు ।**
**స్త్రీసంసర్గశ్చ కాలేషు చమూరక్షణమేవ చ ॥**
**సదా సంచారిభిశ్చారైర్లోక వృత్తాంతవేదనమ్ ।**
**సదాస్త్ర ధారణం చైవ భస్మకంచుకధారణమ్ ॥**
**రాజ్ఞాం మమాశ్రమస్థానామేష ధర్మస్య సంగ్రహః ।**
**గోరక్షణం చ వాణిజ్యం కృషిర్వైశ్యస్య కథ్యతే ॥**
**శుశ్రూషేతరవర్ణానాం ధర్మశ్శూద్రస్య కథ్యతే ।**
**ఉద్యానకరణం చైవ మమ క్షేత్రసమాశ్రయః ॥**
**ధర్మపత్న్యాస్తు గమనం గృహస్థస్య విధీయతే ।**
**బ్రహ్మచర్యం వనస్థానాం యతీనాం బ్రహ్మచారిణామ్ ॥**
**స్త్రీణాం తు భర్తృశుశ్రూషా ధర్మో నాన్యస్సనాతనః ।**
**మమార్చనం చ కల్యాణి నియోగో భర్తురస్తి చేత్ ॥**
**యా నారీ భర్తృశుశ్రూషాం విహాయ వ్రతతత్పరా ।**
**సా నారీ నరకం యాతి నాత్ర కార్యా విచారణా ॥**

ఈ ధర్మము వానప్రస్థాశ్రమములోని వారికి కూడ సమానముగా వర్తించును. బ్రహ్మచారులతో సహా వీరందరు రాత్రియందు భుజించరాదు . శాస్త్రములను బోధించుట, యజ్ఞములను చేయించుట మరియు దానమును స్వీకరించుట అను వాటిని నేను ఈ సందర్భములో క్షత్రియులకు, విశేషించి వైశ్యులకు విధించుట లేదు . సర్వవర్ణముల వారిని రక్షించుట, యుద్ధములో

శత్రువులను వధించుట, దుష్టమగు పక్షులను మృగములను సంహరించుట, దుష్టులగు మానవులను దండించుట , అందరినీ విశ్వసించ కుండుట, శివయోగులయందు విశ్వాసమును కలిగియుండుట, యోగ్యమగు కాలములలో స్త్రీ తోడి సంగమము, సైన్యమును రక్షించుట , సర్వకాలములలో సంచరిస్తూ ఉండే చోరుల ద్వారా లోకములోని వృత్తాంతములను తెలుసుకొను చుండుట, సర్వదా ఆయుధములను, భస్మను, కవచమును ధరించుట అనునవి నా భక్తిని చేసే రాజులు పాటించ వలసిన ధర్మముల సంగ్రహస్వరూపము. గోవులను పాలించుట, క్రయవిక్రయములను చేయుట, పంటలను పండించుట అనునవి వైశ్యుల ధర్మములని చెప్పబడినవి. ఇతరవర్ణముల వారికి శుశ్రూషను చేయుట, ఉద్యానవనములను పెంచుట, శివక్షేత్రములను ఆశ్రయించుకొని ఉండుట అనునవి శూద్రుల ధర్మములని చెప్పబడినది. ధర్మపత్నితో సంయోగము గృహస్థునకు విధించబడినది. బ్రహ్మచారులకు, వానప్రస్థులకు, యతులకు బ్రహ్మచర్యము విధించ బడినది. స్త్రీలకు భర్తృశుశ్రూష తప్ప మరియొక కర్తవ్యము లేదు. ఇది సనాతనమగు ధర్మము. ఓ కల్యాణీకి భర్త అనుమతించినచో, వారు నన్ను పూజించ వచ్చును . ఏ స్త్రీ భర్తయొక్క శుశ్రూషను విడిచి పెట్టి, వ్రతములయందు తత్పరురాలగునో, ఆ స్త్రీ నరకమును పొందుననుటలో సందేహము లేదు .

అథ భర్తృవిహీనాయా వక్ష్యే ధర్మం సనాతనమ్ ।
వ్రతం దానం తపశ్శౌచం భూశయ్యా నక్తభోజనమ్ ॥
బ్రహ్మచర్యం సదా స్నానం భస్మనా సలిలేన వా ।
శాంతిర్మౌనం క్షమా నిత్యం సంవిభాగో యథావిధి ॥
అష్టమ్యాం చ చతుర్దశ్యాం పౌర్ణమాస్యాం విశేషతః ।
ఏకాదశ్యాం చ విధివదుపవాసో మమార్చనమ్ ॥
ఇతి సంక్షేపతః ప్రోక్తో మయాశ్రమ నిషేవిణామ్ ।
బ్రహ్మక్షత్రవిశాం దేవి యతీనాం బ్రహ్మచారిణామ్ ॥
తథైవ వానప్రస్థానాం గృహస్థానాం చ సుందరి ।
శూద్రాణామథ నారీణాం ధర్మ ఏష సనాతనః ॥
ధ్యేయస్త్వయాహం దేవేశి సదా జప్యః షడక్షరః ।
వేదోక్తమఖిలం ధర్మమితి ధర్మార్థసంగ్రహః ॥
అథ యే మానవా లోకే స్వేచ్ఛయా ధృతవిగ్రహాః ।
భావాతిశయసంపన్నాః పూర్వసంస్కార సంయుతాః ॥
విరక్తా వానురక్తా వా స్త్ర్యాదీనాం విషయేష్వపి ।
పాపైర్న తే విలింపంతే పద్మపత్రమివాంభసా ॥
తేషాం మమాత్మవిజ్ఞానం విశుద్ధానాం వివేకినామ్ ।
మత్ప్రసాదాద్విశుద్ధానాం దుఃఖమాశ్రమరక్షణాత్ ॥
నాస్తి కృత్యమకృత్యం చ సమాధిర్వా పరాయణమ్ ।
న విధిర్న నిషేధశ్చ తేషాం మమ యథా తథా ॥

ఇపుడు భర్త లేని స్త్రీ పాటించదగిన సనాతనమగు ధర్మమును గురించి చెప్పెదను. వ్రతము, దానము, తపస్సు, శౌచము, నేలపై పరుండుట, రాత్రియందు మాత్రమే భుజించుట, సర్వకాలములలో బ్రహ్మచర్యము, భస్మతో గాని నీటితో గానీ స్నానమును చేయుట, మనోనిగ్రహము, మౌనము, నిత్యము సహనమును కలిగి యుండుట, యథావిధిగా దానమును చేయుట అష్టమి, చతుర్దశి, పూర్ణిమలయందు, విశేషించి ఏకాదశినాడు ఉపవాసమును చేసి నన్ను పూజించుట అనునవి ఆమె ధర్మములు ఓ దేవీ! నేను ఈ విధముగా వివిధములగు ఆశ్రమములలోనుండువారు, బ్రాహ్మణక్షత్రియవైశ్యులు, యతులు, బ్రహ్మచారులు పాటించ వలసిన ధర్మములను సంగ్రహముగా చెప్పితిని. ఓ సుందరీ! అదే విధముగా, వానప్రస్థులు, గృహస్థులు, శూద్రులు మరియు స్త్రీలు పాటించదగిన ధర్మమును చెప్పితిని. ఈ ధర్మము సనాతనమైనది . ఓ దేవదేవీ! నీవు నన్ను ధ్యానము చేయుము. సర్వకాలములలో ఆరు అక్షరముల మంత్రమును జపించవలెను. వేదములో చెప్పబడిన సకలధర్మముల సారము ఇదియే. ఇదియే ధర్మార్థముల సంగ్రహస్వరూపము. ఈ లోకములో తమ ఇచ్ఛచే నా విగ్రహము (లింగము) ను ధరించినవారు, గొప్ప భక్తితో నిండినవారు, పూర్వజన్మసంస్కారము గలవారు అగు మానవులు ఎవరైతే గలరో , వారు స్త్రీ మొదలైన విషయములలో వైరాగ్యము గలవారైనా, రాగము గలవారైనా, తామరాకును నీరు వలె, వారిని పాపములు స్పృశించవు. పరిశుద్ధమైన జీవనము మరియు వివేకము గల అట్టి మానవులకు నా అనుగ్రహముచే అంతఃకరణము శుద్ధమై నా స్వరూపమైన ఆత్మజ్ఞానము కలుగును. ఆశ్రమధర్మమును రక్షించినవారగుటచే వారికి దుఃఖము గాని, కర్తవ్యము గాని, చేయరానిది గాని, సమాధి గాని, ప్రయత్నించి పొందదగిన గొప్ప లక్ష్యము గాని ఉండవు. నాకు ఎల్లాగైతే విధినిషేధములు లేవో, వారికి కూడ అటులనే అవి ఉండవు .

తథేహ పరిపూర్ణస్య సాధ్యం మమ న విద్యతే ।
తథైవ కృతకృత్యానాం తేషామపి న సంశయః ॥
మద్భక్తానాం హితార్థాయ మానుషం భావమాశ్రితాః ।
రుద్రలోకాత్పరిభ్రష్టాస్తే రుద్రా నాత్ర సంశయః ॥
మమానుశాసనం మద్వద్బ్రహ్మాదీనాం ప్రవర్తకమ్ ।
తథా నరాణామన్యేషాం తన్నియోగః ప్రవర్తకః ॥
మమాజ్ఞాధారభావేన సద్భావాతిశయేన చ ।
తదాలోకనమాత్రేణ సర్వపాపక్షయో భవేత్ ॥
ప్రత్యయాశ్చ ప్రవర్తంతే ప్రశస్తఫలసూచకాః ।
మయి భావవతాం పుంసాం ప్రాగదృష్టార్థగోచరాః ॥
కంపస్స్వేదోఽశ్రుపాతశ్చ కంఠే చ స్వరవిక్రియా ।
ఆనందాద్యుపలబ్ధిశ్చ భవేదాకస్మికీ ముహుః ॥
స తైర్వ్యస్తైస్సమస్తైర్వా లింగైరవ్యభిచారిభిః ।
మందమధ్యోత్తమైర్భావైర్విజ్ఞేయాస్తే నరోత్తమాః ॥

యథాయోగ్నిసమావేశాన్నాయో దహతి కేవలమ్ ।
తథైవ మమ సాన్నిధ్యాన్న తే కేవలమానుషాః ॥
హస్తపాదాదిసాధర్మ్యాద్రుద్రాన్మర్త్యవపుర్ధరాన్ ।
ప్రాకృతానివ మన్వానో నావజానీత పండితః ॥
అవజ్ఞానం కృతం తేషు నరైర్వ్యామూఢచేతసైః ।
ఆయుః శ్రియం కులం శీలం హిత్వా నిరయామావత్ ॥
బ్రహ్మవిష్ణుమహేశానామపి తూలాయతే పదమ్ ।
మత్తోన్యదనపేక్షాణా ముద్ధృతానాం మహాత్మనామ్ ॥
అశుద్ధం బౌద్ధమైశ్వర్యం ప్రాకృతం పౌరుషం తథా ।
గుణేశానామతస్త్యాజ్యం గుణాతీతపదైషిణామ్ ॥
అథ కిం బహునోక్తేన శ్రేయః ప్రాప్త్యేకసాధనమ్ ।
మయి చిత్తసమాసంగో యేన కేనాపి హేతునా ॥

పరిపూర్ణుడనగు నాకు ఈ లోకములో సంపాదించ దగినది ఏదీ లేదు. అదే విధముగా, కృతార్థులైన ఆ మానవులకు కూడ పొందదగిన లక్ష్యములు లేవు. ఈ విషయములో సందేహము లేదు నా భక్తుల హితము కొరకై రుద్రలోకమునుండి దిగి వచ్చి మనుష్య దేహమును ధరించి యున్న అట్టి వ్యక్తులు కూడ రుద్రులే ననుటలో సందేహము లేదు. నా ఆజ్ఞను ఏ విధముగా బ్రహ్మ మొదలగు వారు పాటించెదరో, అదే విధముగా వారి ఆజ్ఞను ఇతరులగు మానవులు పాటించవలెను. నా శాసనమునకు వారు ఆధారమై ఉండుటచే, మరియు వారియందు సద్-జ్ఞానము అతిశయించి ఉండుటచే, వారిని చూచినంత మాత్రాన పాపములన్నియు నశించును. నాయందు భక్తి గల జనులకు ఇది వరలో కనబడనివి, ప్రశస్తమగు ఫలమును సూచించునవి అగు చిహ్నములు కానవచ్చును వణుకు, చెమట పట్టుట, కన్ను వెంబడి నీరు కారుట, కంఠస్వరములో వికారము, ఆనందానుభూతి మొదలగునవి పలుమార్లు అకస్మికముగా కలుగును . ఈ చిహ్నములు కొన్ని గాని, అన్నీ గానీ, మందము, మధ్యమము మరియు ఉత్తమము అను స్థాయిలలో తప్పని సరిగా వారియందు కనబడును. వీటిని బట్టి వారు మానవులలో శ్రేష్ఠులని తెలియవలెను. నిప్పులో కాలిన ఇనుము దహించును. కాని దహించేది నిప్పుయే గాని కేవలము ఇనుము మాత్రమే కాదు గదా! అదే విధముగా, వారు నా సన్నిధి ఉండుటచే, కేవలము మనుష్యమాత్రులు కారు. వారు మనుష్యరూపములో నుండే రుద్రులు. చేతులు, కాళ్లు మొదలగునవి వారికి ఇతరులకు వలెనే ఉన్నవి అనే పోలికను బట్టి పండితుడు వారిని సామాన్య మానవులని భావించి అవమానించ రాదు. మానవులు మోహమును పొందియున్న బుద్ధిగలవారై అట్టివారిని అవమానించినచో, ఆయుర్దాయమును, సంపదను, కులమును, శీలమును పోగొట్టుకొని నరకమును పొందెదరు. నన్ను తప్ప మరియొక దానిని అపేక్షించని వారు, సామాన్యులకంటే ఉన్నతమగు స్థానమునందుండు వారు అగు అట్టి మహాత్ముల దృష్టిలో బ్రహ్మవిష్ణుమహేశ్వరపదవులు కూడ గడ్డిపోచతో సమానము.

సత్త్వరజస్తమోగుణములకు వశులై యుండే ప్రభువుల జ్ఞానము మరియు ఈశ్వరభావము దోషముతో కూడినది; వారి పౌరుషము సర్వసాధారణమైనది. కావున, గుణాతీతులగు మహాత్ములు వారిని పరిత్యజించెదరు. ఇన్ని మాటలేల ! ఏదో ఒక ఉపాయముచే మనస్సును నాయందు లగ్నము చేయుట మాత్రమే శ్రేయస్సును పొందుటకు ఏకైకమార్గము

**ఉపమన్యురువాచః**

ఇత్థం శ్రీకంఠనాథేన శివేన పరమాత్మనా ।
హితాయ జగతాముక్తో జ్ఞానసారార్థసంగ్రహః ॥
విజ్ఞానసంగ్రహస్యాస్య వేదశాస్త్రాణి కృత్స్నశః ।
సేతిహాసపురాణాని విద్యా వ్యాఖ్యానవిస్తరః ॥
జ్ఞానం జ్ఞేయమనుష్ఠేయమధికారో ఽ థ సాధనమ్ ।
సాధ్యం చేతి షడర్థానాం సంగ్రహస్త్వేష సంగ్రహః ॥
గురోరధికృతం జ్ఞానం జ్ఞేయం పాశః పశుః పతిః ।
లింగార్చనాద్యను ష్ఠేయం భక్తస్త్వధికృతోఽపి యః ॥
సాధనం శివమంత్రాద్యం సాధ్యం శివసమానతా ।
షడర్థసంగ్రహస్యాస్య జ్ఞానాత్సర్వజ్ఞతోచ్యతే ॥
ప్రథమం కర్మ యజ్ఞాదేర్భక్త్యా విత్తానుసారతః ।
బాహ్యేభ్యర్చ్య శివం పశ్చాదంతర్యాగరతో భవేత్ ॥
రతిరభ్యంతరే యస్య న బాహ్యే పుణ్య గౌరవాత్ ।
న కర్మ కరణీయం హి బహిస్తస్య మహాత్మనః ॥
జ్ఞానామృతేన తృప్తస్య భక్త్యా శైవశివాత్మనః ।
నాంతర్న చ బహిః కృష్ణ కృత్యమస్తి కదాచన ॥
తస్మాత్క్రమేణ సంత్యజ్య బాహ్యమాభ్యంతరం తథా ।
జ్ఞానేన జ్ఞేయమాలోక్య జ్ఞానం చాపి పరిత్యజేత్ ॥
నైకాగ్రం చేచ్ఛివే చిత్తం కిం కృతేనాపి కర్మణా ।
ఏకాగ్రమేవ చేచ్చిత్తం కిం కృతేనాపి కర్మణా ॥
తస్మాత్కర్మాణ్యకృత్వా వా కృత్వా వాంతర్బహిః క్రమాత్ ।
యేన కేనాప్యుపాయేన శివే చిత్తం నివేశయేత్ ॥
శివే నివిష్టచిత్తానాం ప్రతిష్ఠితధియాం సతామ్ ।
పరత్రేహ చ సర్వత్ర నిర్వృతిః పరమా భవేత్ ॥
ఇహోన్నమశ్శివాయేతి మంత్రేణానేన సిద్ధయః ।
స తస్మాదధిగంతవ్యః పరాపరవిభూతయే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే
శివజ్ఞానవర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను -

ఈ విధముగా కంఠమునందు విషమును ధరించే, పరమాత్మయగు శివప్రభుడు లోకముల హితము కొరకే జ్ఞానసారమును సంగ్రహించి ఆ తత్త్వమును చెప్పినాడు. సకలములగు వేదములు, శాస్త్రములు, ఇతిహాసములు, పురాణములు, విద్యలు ఈ జ్ఞానసారము యొక్క విస్తారమగు వ్యాఖ్యానములు మాత్రమే . ఈ సంగ్రహసారమునందు జ్ఞానము, జ్ఞేయము, అనుష్ఠేయము, అధికారము, సాధనము మరియు సాధ్యము అనే ఆరు అంశములు సంక్షిప్తముగా సంగ్రహించబడినవి. గురువునుండి పొందబడేది జ్ఞానము అగును. బంధము, జీవుడు, శివుడు అను వాటి తత్త్వము జ్ఞేయము. లింగార్చనము మొదలైనవి అనుష్ఠేయము, భక్తుడు అధికారీ శివమంత్రము మొదలగునవి సాధనము. శివునితో సమానమగు స్థితి సాధ్యము. ఈ ఆరు అంశముల సంగ్రహస్వరూపమును తెలిసిన వాడు సర్వజ్ఞుడనబడును ముందుగా ధనబలమును బట్టి బాహ్యమునందు శివుని భక్తితో యజ్ఞము మొదలగు కర్మల ద్వారా పూజించి, తరువాత సాధకుడు అంతర్యాగము నందు ప్రీతి గలవాడు కావలెను . అధికమగు పుణ్యముయొక్క ప్రభావముచే ఎవనికి బాహ్యకర్మయందు ప్రీతి లేదో, అట్టి మహాత్ముడు బాహ్యకర్మను చేయనక్కర లేదు . ఓ శ్రీకృష్ణా! పార్వతీ పరమేశ్వరుల యందలి భక్తిచే శివభక్తులతో మరియు శివునితో ఐక్యమును పొంది జ్ఞానమనే అమృతముతో తృప్తిని చెందిన వ్యక్తి ఎప్పుడైననూ బాహ్యకర్మను గాని, ఆంతరకర్మను గాని చేయనక్కర లేదు. కావున, సాధకుడు బాహ్యకర్మను, ఆంతరకర్మను అదే వరుసలో విడిచి పెట్టి, జ్ఞానముచే జ్ఞేయమును దర్శించి, ఆ జ్ఞానమును కూడ విడిచి పెట్ట వలెను . మనస్సు శివునిపై ఏకాగ్రము కానిచో, కర్మను చేసి ప్రయోజనమేమున్నది? మనస్సు శివునియందు ఏకాగ్రమైన పక్షములో కర్మతో పని యేమి? కావున, బాహ్యకర్మలను, ఆంతరకర్మలను క్రమముగా చేసి గాని, చేయకుండగా గానీ, ఏదో ఒక ఉపాయముచే మనస్సును శివుని యందు ఏకాగ్రము చేయవలెను. శివునియందు లగ్నమైన మనస్సు కలిగి స్థిరమైన బుద్ధి గల సత్పురుషులకు ఇహపరలోకములలో సర్వకాలములలో పరమానందము లభించును. ఓం నమశ్శివాయ అను మంత్రముచే ఇహలోకములో సిద్ధులు లభించును. కావున, మోక్షము కొరకు మాత్రమే గాక, ఇహపరలోకములలోని మహిమలను పొందుట కొరకు కూడా ఈ మంత్రమును చేపట్టవలెను .

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివజ్ఞానముయొక్క మహిమను వర్ణించే పదకొండవ అధ్యాయము ముగిసినది .

# 12 - పంచాక్షర మంత్ర మాహాత్మ్యము

**శ్రీకృష్ణ ఉవాచః**

మహర్షివర సర్వజ్ఞ సర్వజ్ఞానమహోదధే।
పంచాక్షరస్య మాహాత్మ్యం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ గొప్ప మహర్షీ! సర్వమును తెలిసిన వాడా! నీవు సకలజ్ఞానమునకు గొప్ప సముద్రము వంటి వాడవు. నేను పంచాక్షరమంత్రము యొక్క మహిమను యథాతథముగా వినగోరుచున్నాను .

**ఉపమన్యురువాచః**

పంచాక్షరస్య మాహాత్మ్యం వర్షకోటిశతైరపి ।
అశక్యం విస్తరాద్వక్తుం తస్మాత్సంక్షేపతః శృణు ॥
వేదే శివాగమే చాయము భయత్ర షడక్షరః।
సర్వేషాం శివభక్తానామ శేషార్థప్రసాధకః ॥
తదల్పాక్షరమర్థాఢ్యం వేదసారం విముక్తిదమ్ ।
ఆజ్ఞాసిద్ధమసందిగ్ధం వాక్యమేతచ్ఛివాత్మకమ్ ॥
నానాసిద్ధియుతం దివ్యం లోకచిత్తానురంజకమ్ ।
సునిశ్చితార్థం గంభీరం వాక్యం తత్పారమేశ్వరమ్ ॥
మంత్రం సుఖముఖోచ్చార్యమ శేషార్థ ప్రసిద్ధయే ।
ప్రాహోన్నమశ్శివాయేతి సర్వజ్ఞస్సర్వదేహినామ్ ॥
తద్బీజం సర్వవిద్యానాం మంత్రమాద్యం షడక్షరమ్ ।
అతిసూక్ష్మం మహార్థం చ జ్ఞేయం తద్వటబీజవత్ ॥
దేవో గుణత్రయాతీతసర్వజ్ఞస్సర్వకృత్ప్రభుః ।
ఓమిత్యేకాక్షరే మంత్రే స్థితస్సర్వగతశ్శివః ॥
ఈశానాద్యాని సూక్ష్మాణి బ్రహ్మాణ్యే కాక్షరాణి తు ।
మంత్రే నమశ్శివాయేతి సంస్థితాని యథాక్రమమ్ ।
మంత్రే షడక్షరే సూక్ష్మే పంచబ్రహ్మతనుశ్శివః ॥
వాచ్యవాచకభావేన స్థితస్సాక్షాత్స్వ భావతః ।
వాచ్యశ్శివో ప్రమేయత్వాన్మంత్రస్తద్వాచక స్మృతః ॥
వాచ్యవాచకభావోఽ యమనాదిసంస్థితస్తయోః ।
యథాఽనాదిప్రవృత్తోఽయం ఘోరసంసారసాగరః॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

పంచాక్షరమంత్రముయొక్క మహిమను విస్తరముగా వర్ణించుట వందకోటి సంవత్సరముల కాలములోనైననూ సంభవము కాదు. కావున, సంగ్రహముగా వినుము ఓంకారముతో కలిపి ఆరు అక్షరములు గల ఈ మంత్రము వేదము మరియు శివాగమము అను రెండింటిలో కానవచ్చును. ఇది శివభక్తులందరికీ సకలప్రయోజనములను చేకూర్చును. తక్కువ అక్షరములు గలది, గంభీరమగు అర్థము గలది, వేదముల సారము, మోక్షమునిచ్చునది, శివుని ఆజ్ఞచే సిద్ధించినది, సందేహములకు అవకాశమునీయనిది అగు ఆ మంత్రరూపవాక్యము శివుని స్వరూపమే పరమేశ్వరుని బోధించే ఈ దివ్యమగు వాక్యము (మంత్రము) అనేకములగు సిద్ధులను ఇచ్చి, జనుల మనస్సులను రంజిల్ల జేయును. దీనికి ఖచ్చితముగా నిర్ధారణ చేయబడిన గంభీరమగు అర్థము గలదు. సర్వజ్ఞుడగు శివుడు ఓం నమశ్శివాయ అనే సుఖముగా నోటితో ఉచ్చరించ దగిన మంత్రమును సకలప్రాణుల సకలప్రయోజనములు సిద్ధించుట కొరకై బోధించెను. ఆరు అక్షరములు గల ఆ మొట్ట మొదటి మంత్రము విద్యలన్నింటికీ మూలము. మర్రి విత్తు వలె అది మిక్కిలి సూక్ష్మమే అయిననూ, గొప్ప అర్థమును కలిగి యున్నది. మూడు గుణములకు అతీతుడు, సర్వము తెలిసిన వాడు, స్వమును సృష్టించి రక్షించువాడు, సర్వవ్యాపకుడు అగు శివుడు ఓం అనే ఒకే అక్షరము గల మంత్రములో నున్నాడు ఈశానుడు మొదలగు అయిదు బ్రహ్మలు సూక్ష్మరూపములో ఒకే అక్షరమునందున్నవారై క్రమముగా నమశ్శివాయ అను మంత్రమునందు నిలిచి యున్నారు. ఆరు అక్షరములు గల ఈ సూక్ష్మమగు మంత్రమునందు అయిదు బ్రహ్మలే దేహముగా గల శివుడు సాక్షాత్తుగా సహజముగా వాచ్యవాచక భావముచే నిలిచి యున్నాడు. ఇతరప్రమాణములకు గోచరము కాని శివుడు వాచ్యుడు (ప్రతిపాదించబడువాడు) అనియు, మంత్రము ఆయనకు వాచకము (బోధించునది) అనియు మహర్షులు చెప్పుచున్నారు . ఈ భయంకరమగు సంసారసముద్రము ఏ విధముగా అనాదికాలమునుండియు వచ్చుచున్నదో, అదే విధముగా ఓంకారమునకు శివునకు ఈ వాచ్యవాచకభావము అనాది కాలమునుండియు స్థిరముగా నున్నది .

**శివోఽపి హి తథానాదిసంసారాన్మోచకః స్థితః ।**
**వ్యాధీనాం భేషజం యద్వత్ప్రతి పక్షస్స్వభావతః ॥**
**తద్వత్సంసారదోషాణాం ప్రతిపక్షశ్శివస్స్మృతః ।**
**అసత్యస్మిన్ జగన్నాథే తమోభూతమిదం భవేత్ ॥**
**అచేతనత్వాత్ప్రకృతేరజ్ఞత్వాత్పురుషస్య చ ।**
**ప్రధానపరమాణ్వాది యావత్కించిదచేతనమ్ ॥**
**న తత్కర్తృ స్వయం దృష్టం బుద్ధిమత్కారణం వినా ।**
**ధర్మాధర్మోపదేశశ్చ బంధమోక్షౌ విచారణాత్ ॥**
**న సర్వజ్ఞం వినా పుంసామాదిసర్గః ప్రసిధ్యతి ।**
**వైద్యం వినా నిరానందాః క్లిశ్యంతే రోగిణో యథా ॥**

తస్మాదనాదిస్సర్వజ్ఞః పరిపూర్ణస్సదాశివః ।
అస్తి నాథః పరిత్రాతా పుంసాం సంసారసాగరాత్ ॥
ఆదిమధ్యాంత నిర్ముక్తస్స్వభావవిమలః ప్రభుః ।
సర్వజ్ఞః పరిపూర్ణశ్చ శివో జ్ఞేయశ్శివాగమే ॥
తస్యాభిధానమంత్రోఽ యమభిధేయశ్చ స స్మృతః।
అభిధానాభిధేయత్వాన్మంత్రస్సిద్ధః పరశ్శివః ॥
ఏతావత్తు శివజ్ఞానమేతావత్పరమం పదమ్ ।
యదోం నమశ్శివాయేతి శివవాక్యం షడక్షరమ్ ॥
విధివాక్యమిదం శైవం నార్థవాదం శివాత్మకమ్ ।
యస్సర్వజ్ఞస్సుసంపూర్ణస్స్వభావమలశ్శివః ॥
లోకానుగ్రహకర్తా చ స మృషార్థం కథం వదేత్।
యద్యథావస్థితం వస్తు గుణదోషైస్స్వభావతః ॥
యావత్ఫలం చ తత్పూర్ణం సర్వజ్ఞస్తు యథా వదేత్ ।
రాగా జ్ఞానాదిభిర్దోషైర్గ్రస్తత్వాదనృతం వదేత్ ॥

మరియు శివుడు అనాదినుండియు సంసారమునుండి మోక్షమును అనుగ్రహించుచున్నాడు. వ్యాధులకు మందు స్వభావము చేతనే విరోధియైన విధముగా, శివుడు సంసారములోని దోషములకు ప్రతిపక్షియని మహర్షులు చెప్పుచున్నారు. జగన్నాథుడగు ఈ శివుడు లేనిచో, ఈ జగత్తు అంధకారమయమై ఉండెడిది . ప్రకృతి జడమగుట వలన, పురుషుడు అజ్ఞాని యగుట వలన, ప్రధానము పరమాణువులు మొదలగునవి అన్నీ జడములు అగుట వలన, చేతనమగు మరియొక కారణము లేకుండగా ఆ జగత్తునకు అవి స్వయముగా కర్తలు కాజాలవు. విచారించినచో, ధర్మ- అధర్మముల ఉపదేశము, బంధమోక్షములు, జీవుల ఆదిసృష్టి అనునవి సర్వజ్ఞుడగు ఈశ్వరుడు లేనిదే సిద్ధించవు. వైద్యుడు లేనిచో రోగులు ఆనందము లేనివారై క్లేశములకు గురి యగుచుందురు గదా! కావున, ఆది లేనివాడు, సర్వమును తెలిసిన వాడు, పరిపూర్ణుడు, పాలకుడు, జీవులను సంసారసముద్రమునుండి అన్ని విధములుగా రక్షించువాడు అగు సదాశివుడు గలడు. శివుడు ఆదిమధ్యాంతములు లేనివాడు, స్వభావము చేతనే దోషరహితుడు, పాలకుడు, సర్వజ్ఞుడు మరియు పరిపూర్ణుడు అని తెలియవలెను. ఈ మంత్రము ఆయనను బోధించు అభిధానమనియు, ఆయన అభిధేయుడు (బోధింపబడేవాడు) అనియు చెప్పబడినది. ఈ మంత్రమునకు శివునితో ఇట్టి అభిధాన- అభిధాయభావము ఉండుటచే, ఈ మంత్రము పరమ శివస్వరూపమేననియు, ఇది సిద్ధమంత్రమనియు మహర్షులు చెప్పుచున్నారు. శివజ్ఞానమనగా ఓం నమశ్శివాయ అనే ఈ ఆరు అక్షరముల మంత్రము మాత్రమే; ఇదియే పరమపదము. ఇది శివునకు సంబంధించిన విధివాక్యమే గాని, అర్థవాదము (ముఖ్యార్థమునందు తాత్పర్యము లేని స్తుతి) కాదు. ఈ మంత్రము శివుని స్వరూపమే. సర్వజ్ఞుడు, పరిపూర్ణుడు, స్వభావము చేతనే దోషరహితుడు, లోకములను అనుగ్రహించువాడు అగు శివుడు సత్యము కాని

విషయమును ఎట్లు చెప్పును? ఏ వస్తువు ఎట్టి స్వరూపమును కలిగి యున్నదో, దానియందు స్వభావముచేతనే ఏయే గుణదోషములు గలవో, దాని ఫలము ఎంతటిదో అనే ఈ సర్వమును సర్వజ్ఞుడగు శివుడు యథాతథముగా చెప్పును. కాని, దీనికి భిన్నముగా జీవుడు రాగము, అజ్ఞానము మొదలగు దోషములకు వశుడై యుండుటచే, అసత్యమును పలుకుచుండును

తే చేశ్వరే న విద్యేతే బ్రూయాత్స కథమన్యథా ।
అజ్ఞాతాశేషదోషేణ సర్వజేన శివేన యత్ ॥
ప్రణీతమమలం వాక్యం తత్ప్రమాణం న సంశయః ॥
తస్మాదీశ్వరవాక్యాని శ్రద్ధేయాని విపశ్చితా ।
యథార్థం పుణ్యపాపేషు తదశ్రద్ధో వ్రజత్యధః ॥
స్వర్గాపవర్గసిద్ధ్యర్థం భాషితం యత్సుశోభనమ్ ।
వాక్యం మునివరైశ్శాంతైస్తద్విజ్ఞేయం సుభాషితమ్ ॥
రాగద్వేషానృతక్రోధకామతృష్ణానుసారి యత్ ।
వాక్యం నిరయహేతుత్వాత్తదుర్భాషిత ముచ్యతే ॥
సంస్కృతేనాపి కిం తేన మృదునా లలితేన వా ।
అవిద్యారాగవాక్యేన సంసారక్లేశహేతునా ॥
యచ్ఛ్రుత్వా జాయతే శ్రేయో రాగాదీనాం చ సంశయః।
విరూపమపి తద్వాక్యం విజ్ఞేయమితి శోభనమ్ ॥
బహుత్వేపి హి మంత్రాణాం సర్వజ్ఞేన శివేన యః ।
ప్రణీతో విమలో మంత్రో న తేన సదృశః క్వచిత్ ॥
సాంగాని వేదశాస్త్రాణి సంస్థితాని షడక్షరే ।
న తేన సదృశస్తస్మాన్మంత్రోఽప్యస్త్యపరః క్వచిత్ ॥
సప్తకోటి మహామంత్రై రుపమంత్రైరనేకధా ।
మంత్రః షడక్షరో భిన్నస్సూత్రం వృత్త్యాత్మనా యథా ॥
శివజ్ఞానాని యావంతి విద్యాస్థానాని యాని చ ।
షడక్షరస్య సూత్రస్య తాని భాష్యం సమాసతః ॥

ఆ దోషములు ఈశ్వరునియందు ఉండవు. కావున, ఆయన అసత్యమును చెప్పుట యెట్లు సంభవమగును? సమస్తదోషములు లేనివాడు, సర్వజ్ఞుడు అగు శివుడు ఏ నిర్దోషమగు వాక్యమును చెప్పునో, అదియే ప్రమాణమనుటలో సందేహము లేదు. కావున, వస్తుతత్త్వము, పుణ్యపాపములు అను విషయములో వివేకవంతుడు ఈశ్వరుని వాక్యముల యందు శ్రద్ధను కలిగి యుండవలెను. అట్టి శ్రద్ధ లేనివాడు అధోగతిని పొందును . మనోనిగ్రహము గల మహర్షులు స్వర్గము మరియు మోక్షము లభించుట కొరకై ఏ అతిశయించిన శోభ గల వాక్యమును చెప్పియున్నారో, అదియే సుభాషితమని తెలియదగును. రాగద్వేషములు, కామక్రోధములు, తృష్ణ అను లక్షణములచే ప్రభావితమై చెప్పబడిన వాక్యము నరకహేతువు అగును. కావుననే, దానికి దుర్భాషితము అని పేరు. అజ్ఞానము, రాగము మూలమునందు గలది, సంసారములోని క్లేశములకు కారణమైనది అగు ఆ వాక్యము సంస్కృత భాషలో (లేదా సంస్కారయుక్తముగా) మృదుమధురముగా చెప్పబడియున్ననూ, దాని వలన ప్రయోజనమేమున్నది? ఏ వాక్యమును విన్నచో రాగము మొదలగునవి నశించి మోక్షము కలుగునో, అట్టి వాక్యము వికృతముగా నున్ననూ, అదియే మిక్కిలి సుందరమైనది యని తెలియవలెను. మంత్రములు అనేకములు గలవు. కానీ, సర్వజ్ఞుడగు శివునిచే బోధింపబడిన నిర్మలమగు మంత్రముతో సాటియగు మంత్రము ఎక్కడనైననూ లేదు. ఆరు అక్షరముల మంత్రములో అంగములతో కూడిన వేదములు మరియు శాస్త్రములు గలవు. కావున, దానితో సాటియగు మంత్రము మరియొకటి ఎక్కడనైననూ లేదు. సూత్రము (తత్త్వమును సంగ్రహముగా బోధించే వాక్యము) వృత్తి (సూత్రమును వివరించే వాక్యము) కంటే భిన్నముగా నుండును. అదే విధముగా, ఆరు అక్షరముల మంత్రము ఏడు కోట్ల మహామంత్రముల కంటే మరియు ఉపమంత్రము (మహామంత్రమును అనుసరించి ఉండే అవాంతరమంత్రము) ల కంటే అనేకవిధములుగా భిన్నముగా నున్నది. శివజ్ఞానములు మరియు విద్యాస్థానములు (పదునాలుగు) ఎన్ని గలవో, అవి అన్నియు సూత్రస్థానీయమగు ఆరు అక్షరముల మంత్రము యొక్క సంగ్రహభాష్యములు మాత్రమే.

కిం తస్య బహుభిర్మంత్రైశ్శాస్త్రైర్వా బహువిస్తరైః ।

యస్యోన్నమశ్శివాయేతి మంత్రోఽయం హృది సంస్థితః ॥

తేనాధీతం శ్రుతం తేన కృతం సర్వమనుష్ఠితమ్ ।

యేనోన్నమశ్శివాయేతి మంత్రాభ్యాసః స్థిరీకృతః ॥

నమస్కారాదిసంయుక్తం శివాయేత్యక్షర త్రయమ్ ।

జిహ్వాగ్రే వర్తతే యస్య సఫలం తస్య జీవితమ్ ॥

అంత్యజో వాధమో వాపి మూర్ఖో వా పండితోఽపి వా ।

పంచాక్షరజపే నిష్ఠో ముచ్యతే పాపపంజరాత్ ॥

ఇత్యుక్తం పరమేశేన దేవ్యా పృష్టేన శూలినా।

హితాయ సర్వమర్త్యానాం ద్విజానాం తు విశేషతః ॥

ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే పంచాక్షర మంత్రమాహాత్మ్యవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥

ఎవని హృదయములో ఓం నమశ్శివాయ అనే ఈ మంత్రము చక్కగా నిలిచియున్నదో, వానికి అనేకమంత్రములతో గాని, అతిశయించిన విస్తారము గల శాస్త్రములతో గానీ పని యేమున్నది? ఎవడైతే ఓం నమశ్శివాయ అనే మంత్రమును స్థిరముగా జపించునో, వాడు సర్వమును అధ్యయనము చేసినట్లే; సర్వమును విన్నట్లే; సర్వమును అనుష్టించినట్లే యగును. మొదట నమః అని, తరువాత శివాయ అనే మూడు అక్షరములు ఎవని నాలుక కొనపై నుండునో, వాని జీవితము సఫలమగును, అంత్యజుడు గాని, అధముడు గాని, మూర్ఖుడు గాని, పండితుడు గాని ఎవడైతే పంచాక్షరమంత్రజపమునందు నిష్ఠను కలిగి యుండునో, వాడు పాపబంధమునుండి విముక్తుడగును. పార్వతీదేవి ప్రశ్నించగా శూలధారియగు పరమేశ్వరుడు సర్వమానవుల హితము కొరకు, విశేషించి బ్రాహ్మణుల హితము కొరకు ఈ విధముగా చెప్పినాడు .

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో పంచాక్షరమంత్రమహిమను వర్ణించే పన్నెండవ అధ్యాయము ముగిసినది.

# 13 – పంచాక్షర జప విధి

**దేవ్యువాచ।**

**కలౌ కలుషితే కాలే దుర్జయే దురతిక్రమే ।**
**అపుణ్యతమసాచ్ఛన్నే లోకే ధర్మపరాఙ్ముఖే ॥**
**క్షీణే వర్ణాశ్రమాచారే సంకటే సముపస్థితే ।**
**సర్వాధికారే సందిగ్ధేఽనిశ్చితే వాపి పర్యయే ॥**
**తదోపదేశే విహతే గురుశిష్యక్రమే గతే ।**
**కేనోపాయేన ముచ్యంతే భక్తాస్తవ మహేశ్వర ॥**

దేవి ఇట్లు పలికెను –

జయింప శక్యము కానిది, అతిక్రమింప శక్యము కానిది అగు కలికాలములో పాపము అనే చీకటిచే కప్పివేయబడి యున్న మానవుడు ధర్మమునందు విముఖుడు అగును. వర్ణములకు మరియు ఆశ్రమములకు సంబంధించిన ఆచారములు సన్నగిల్లి, ధర్మసంకటము సంప్రాప్తమగును. అందరి అధికారము సందేహములో పడును; లేదా, నిశ్చయించ శక్యము కాని విపరీతస్థితిలో పడును. ఆ సమయములో గురుశిష్యపరంపర నష్టమై ధర్మోపదేశమునకు ఆటంకము ఏర్పడును. ఓ మహేశ్వరా! ఆ సమయములో నీ భక్తులు ఏ ఉపాయముచే మోక్షమును పొందెదరు?.

**ఈశ్వర ఉవాచః**

**ఆశ్రిత్య పరమాం విద్యాం హృద్యం పంచాక్షరీం మమ ।**
**భక్త్యా చ భావితాత్మానో ముచ్యంతే కలిజా నరాః ॥**
**మనోవాక్కాయజైర్దోషైర్వక్తుం స్మర్తుమగోచరైః ।**
**దూషితానాం కృతఘ్నానాం నిందకానాం ఛలాత్మనామ్ ॥**
**లుబ్ధానాం వక్రమనసామపి మత్ప్రవణాత్మనామ్ ।**
**మమ పంచాక్షరీ విద్యా సంసారభయతారిణీ ॥**
**మయైవమసకృద్దేవి ప్రతిజ్ఞాతం ధరాతలే ।**
**పతితోఽపి విముచ్యేత మద్భక్తో విద్యయానయా ॥**

ఈశ్వరుడిట్లు పలికెను –

కలియందు జన్మించు మానవులు సర్వోత్కృష్టమైనది, మనోహరమైనది అగు నా పంచాక్షరీ విద్యను ఆశ్రయించి, భక్తిచే సంస్కరించబడిన అంతఃకరణములు గలవారై మోక్షమును పొందెదరు. మనోవాక్కాయములనుండి పుట్టిన దోషములతో చెప్పుటకు ఊహించుటకు కూడా అందని దోషములతో కూడినవారు, చేసిన ఉపకారమును మరచువారు, ఇతరులను నిందించువారు, మోసబుద్ధి గలవారు, లోభులు, వక్రబుద్ధి గలవారు అగు వ్యక్తులైననూ నాయందు లగ్నమైన మనస్సు గలవారైనచో, వారిని నా పంచాక్షరీ విద్య సంసారభయమునుండి తరింప జేయును. ఓ దేవీ! ఈ విధముగా నేను

పలుపర్యాయములు ప్రతిజ్ఞను చేసి యున్నాను. భూలోకములో పతితుడైన మానవుడైననూ నా భక్తుడైనచో, ఈ విద్యచే మోక్షమును పొందును.

**దేవ్యువాచ**

**కర్మయోగ్యో భవేన్మర్త్యః పతితో యది సర్వథా ।**
**కర్మయోగ్యేన యత్కర్మ కృతం చ నరకాయ హి ।**
**తతః కథం విముచ్యేత పతితో విద్యయాఽనయా ॥**

దేవి ఇట్లు పలికెను –

అన్ని విధములుగా పతితుడై పోయిన మనిషి కర్మకు అనర్హుడగును. కర్మకు యోగ్యత లేనివాడు ఏ కర్మను చేసిననూ, అది వానికి నరకమును మాత్రమే కలిగించును. ఇట్టి స్థితిలో పతితుడైన వ్యక్తి ఈ విద్యచే మోక్షమును పొందుట ఎట్లు పొసగును?

**ఈశ్వర ఉవాచః**

**తథ్యమేతత్త్వయా ప్రోక్తం తథా హి శృణు సుందరి ।**
**రహస్యమితి మత్వైతద్గోపితం యన్మయా పురా ॥**
**సమంత్రకం మాం పతితః పూజయేద్యది మోహితః ।**
**నారకీ స్యాన్న సందేహో మమ పంచాక్షరం వినా ॥**
**అబ్భక్షా వాయుభక్షాశ్చ యే చాన్యే వ్రతకర్శితాః ।**
**తేషామేతైర్వ్రతైర్నాస్తి మమ లోకసమాగమః ॥**
**భక్త్యా పంచాక్షరేణైవ యో హి మాం సకృదర్చయేత్ ।**
**సోఽపి గచ్ఛేన్మమ స్థానం మంత్రస్యాస్యైవ గౌరవాత్ ॥**
**తస్మాత్తపాంసి యజ్ఞాశ్చ వ్రతాని నియమాస్తథా ।**
**పంచాక్షరార్చనస్యైతే కోట్యంశేనాపి నో సమాః ॥**
**బద్ధో వాప్యథ ముక్తో వా పాశాత్పంచాక్షరేణ యః ।**
**పూజయేన్మాం స ముచ్యేత నాత్ర కార్యా విచారణా ॥**
**అరుద్రో వా సరుద్రో వా సకృత్పంచాక్షరేణ యః ।**
**పూజయేత్పతితో వాపి మూఢో వా ముచ్యతే నరః ॥**
**షడక్షరేణ వా దేవి తథా పంచాక్షరేణ వా ।**
**స బ్రహ్మాంగేన మాం భక్త్యా పూజయే ద్యది ముచ్యతే ॥**
**పతితోఽపతితో వాపి మంత్రేణానేన పూజయేత్ ।**
**మమ భక్తో జితక్రోధో సలబ్ధోఽ లబ్ధ ఏవ వా ॥**
**అలబ్ధాల్లబ్ధ ఏవేహ కోటికోటిగుణాధికః ।**
**తస్మాల్లబ్ధ్వైవ మాం దేవి మంత్రేణానేన పూజయేత్ ॥**
**లబ్ధ్వా సంపూజయేద్యస్తు మైత్ర్యాదిగుణసంయుతః।**
**బ్రహ్మచర్యరతో భక్త్యా మత్సాదృశ్యమవాప్నుయాత్ ॥**

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓ సుందరీ! నీవు చెప్పినది వాస్తవమే. అయిననూ వినుము. ఈ విషయము రహస్యమని తలచి పూర్వములో నేను దీనిని దాచి యుంచితిని. పతితుడైన వ్యక్తి మోహమునకు వశుడై పంచాక్షరమంత్రము కాకుండా నన్ను ఇతరములగు మంత్రములతో పూజించినచో, వాడు నరకమును పొందుననుటలో సందేహము లేదు. ఎవరైతే గాలిని భక్షించి, లేదా నీటిని మాత్రమే త్రాగి కేవలమగు తపస్సును చేయుదురో, ఎవరైతే తమ శరీరమును వ్రతములతో కృశింప జేయుదురో, వారు ఈ వ్రతములచే నా లోకమును పొందజాలరు. ఎవడైతే నన్ను భక్తిపూర్వకముగా పంచాక్షరమంత్రముతో ఒకే సారి పూజించునో, వాడు కూడ ఈ మంత్రముయొక్క ప్రభావము చేతనే నా స్థానమును పొందును. కావున తపస్సులు, యజ్ఞములు, వ్రతములు మరియు నియమములు పంచాక్షరమంత్రపూర్వకముగా చేసే పూజయొక్క కోటి వంతుతో నైననూ సరి దూగవు. బద్ధుడు గాని, ముక్తుడు గాని ఎవడైతే నన్ను పంచాక్షరమంత్రముతో పూజించునో, వాడు సంసారబంధము నుండి ముక్తుడగుననుటలో సందేహము లేదు. పతితుడు గాని, మూఢుడు గాని ఏ మానవుడైతే నన్ను రుద్రమంత్రము (రుద్రాధ్యాయము) తో కలిపి గానీ, అది లేకుండగా గాని పంచాక్షరమంత్రముతో ఒక్కసారి పూజించునో, వాడు ముక్తిని పొందును. ఓ దేవీ! ఆరు (ఓంకారముతో కలిపి) అక్షరముల మంత్రముతో గాని, ఈశానుడు మొదలగు పంచబ్రహ్మలు అంగముగా గల పంచాక్షరమంత్రముతో గాని, నన్ను భక్తిపూర్వకముగా పూజించు మానవుడు ముక్తిని పొందును, పతితుడు, లేదా పతితుడు కానివాడు అగు నా భక్తుడు కోపమును జయించినవాడై, గురువు నుండి స్వీకరించి గాని, స్వీకరించకుండగా గాని, ఈ మంత్రముతో నన్ను పూజించవలెను . ఈ మంత్రమును గురువునుండి స్వీకరించినచో, స్వీకరించని దాని కంటే అది కోటి కోటి రెట్లు అధికమగు ఫలమును ఇచ్చును. ఓ దేవీ! కావున, సాధకుడు ఈ మంత్రమును గురువునుండి స్వీకరించియే నన్ను పూజించవలెను. ఎవడైతే మైత్రి (స్నేహభావము) మొదలగు గుణములు గలవాడై ఈ మంత్రమును గురువునుండి స్వీకరించి బ్రహ్మచర్యము నందు నిష్ఠను కలిగి భక్తితో చక్కగా పూజించునో, అట్టివాడు నా సాయుజ్యమును పొందును.

**కిమత్ర బహునోక్తేన భక్తాస్సర్వేఽధికారిణః ।**
**మమ పంచాక్షరే మంత్రే తస్మాచ్ఛ్రేష్ఠతరో హి సః ॥**
**పంచాక్షర ప్రభావణ లోకవేదమహర్షయః ।**
**తిష్ఠంతి శాశ్వతా ధర్మా దేవాస్సర్వమిదం జగత్ ॥**
**ప్రలయే సమను ప్రాప్తే నష్టే స్థావరజంగమే ।**
**సర్వం ప్రకృతిమాపన్నం తన్న సంలయమేష్యతి ॥**
**ఏకోఽహం సంస్థితో దేవి న ద్వితీయోఽస్తి కుత్రచిత్ ।**
**తదా వేదాశ్చ శాస్త్రాణి సర్వే పంచాక్షరే స్థితాః ॥**

తే నాశం నైవ సంప్రాప్తా మచ్ఛక్త్యా హ్యనుపాలితాః ।
తతస్సృష్టిరభూన్మత్తః ప్రకృత్యాత్మ ప్రభేదతః ॥
గుణమూర్త్యాత్మనాం చైవ తతోఽవాంతరసంప్లుతిః ।
తదా నారాయణశ్శేతే దేవో మాయామయీం తనుమ్ ॥
ఆస్థాయ భోగిపర్యంకశయనే తోయమధ్యగః ।
తన్నాభిపంకజాజ్జాతః పంచవక్త్రః పితామహః ॥
సిసృక్షమాణా లోకాంస్త్రీన్న శక్తో హ్యసహాయవాన్ ।
మునీన్ దశ ససర్జాదౌ మానసానమితౌజసః ॥
తేషాం సిద్ధివివృద్ధ్యర్థం మాం ప్రోవాచ పితామహః ।
మత్పుత్రాణాం మహాదేవ శక్తిం దేహి మహేశ్వర॥
ఇత్యేవం ప్రార్థితస్తేన పంచవక్త్రధరో హ్యహమ్ ।
పంచాక్షరాణి క్రమశః ప్రోక్తవాన్ పద్మయోనయే ॥

ఇన్ని మాటలేల? భక్తులందరు సా పంచాక్షరమంత్రమునందు అధికారులే. కావున, అది ఇతరమంత్రముల కంటే శ్రేష్ఠమైనది. లో కములు, వేదములు, మహర్షులు, శాశ్వతములగు ధర్మములు, దేవతలు, ఈ సకలజగత్తు పంచాక్షరమంత్రప్రభావముచే మాత్రమే స్థితిని కలిగియున్నవి. ప్రళయము వచ్చి చరాచరజగత్తు అంతయు వినాశమును పొంది ప్రకృతిలో విలీనమగును. ఆ ప్రకృతి విలీనము కాదు. ఓ దేవీ! అప్పుడు నేను ఒక్కడిని మాత్రమే మిగిలి యుందును. ఎక్కడైననూ రెండవ వాడు లేడు. అపుడు వేదములు, శాస్త్రములు అన్నియు పంచాక్షరమంత్రమునందు ప్రతిష్ఠితములై యుండును . ప్రళయము తరువాత నా శక్తిచే పాలించబడిన ఆ వేదశాస్త్రములు నాశమును పొందనే పొందవు. తరువాత పురుషప్రకృతిభేదముతో కూడిన సృష్టి నానుండి ఉదయించెను. తరువాత గుణభేదము గల త్రిమూర్తులు, మూర్త్యాత్మలు అగు ఈశానాది పంచబ్రహ్మలు అవాంతరప్రళయములో విలీనమగుదురు. అపుడు నారాయణదేవుడు మాయామయమగు దేహమును దాల్చి నీటి మధ్యలో నున్నవాడై ఆదిశేషుడు అనే పాన్పుపై నిద్రించును. ఆయన నాభియందలి పద్మమునుండి అయిదు ముఖములు గల బ్రహ్మ పుట్టును. ఆయనకు మూడు లోకములను సృష్టించ వలెననే కోరిక ఉన్ననూ, సహాయకుడు లేకుండుటచే ఆయన ఆ పనిని చేయలేక పోయెను. ఆయన ముందుగా అనంతమగు తేజస్సు గల పదిమంది మునులను మానసపు సృష్టించెను . ఆ పితామహుడు వారి సిద్ధి వర్ధిల్లుట కొరకై నాతో ఇట్లు చెప్పెను ఓ మహాదేవా! మహేశ్వరా! నా పుత్రులకు శక్తిని ఇమ్ము. ఆయన ఇట్లు ప్రార్థించగా, నేను అయిదు మోములను ధరించి, వరుసగా అయిదు అక్షరములను బ్రహ్మకు చెప్పితిని.

స పంచవదనైస్తాని గృహ్ణాంల్లోక పితామహః ।
వాచ్యవాచకభావేన జ్ఞాతవాన్మాం మహేశ్వరమ్ ॥
జ్ఞాత్వా ప్రయోగం వివిధం సిద్ధమంత్రః ప్రజాపతిః ।
పుత్రేభ్యః ప్రదదౌ మంత్రం మంత్రార్థం చ యథాతథమ్ ॥

తే చ లబ్ధ్వా మంత్రరత్నం సాక్షాల్లోక పితామహాత్ ।
తదాజ్ఞప్తేన మార్గేణ మదారాధనకాంక్షిణః ॥
మేరోస్తు శిఖరే రమ్యే ముంజవాన్నామ పర్వతః ।
మత్ప్రియస్సతతం శ్రీమాన్మద్భక్తై రక్షితస్సదా ॥
తస్యా భ్యాశే తపస్తీవ్రం లోకం స్రష్టుం సముత్సుకాః ।
దివ్యం వర్షసహస్రం తు వాయుభక్షాస్సమాచరన్ ॥
తేషాం భక్తిమహం దృష్ట్వా సద్యః ప్రత్యక్షతామియామ్ ।
ఋషిం ఛందశ్చ కీలం చ బీజం శక్తిం చ దైవతమ్ ॥
న్యాసం షడంగం దిగ్బంధం వినియోగమశేషతః।
ప్రోక్తవానహమార్యాణాం జగత్సృష్టివివృద్ధయే ॥
తతస్తే మంత్రమాహాత్మ్యాదృషయస్తపసేధితాః ।
సృష్టిం వితన్వతే సమ్యక్ సదేవాసురమానుషీమ్ ॥
అస్యాః పరమవిద్యాయాస్స్వరూపమధునోచ్యతే ।
ఆదౌ నమః ప్రయోక్తవ్యం శివాయ తు తతః పరమ్ ॥
సైషా పంచాక్షరీ విద్యా సర్వ శ్రుతిశిరోగతా ।
శబ్దజాతస్య సర్వస్య బీజభూతా సనాతనీ ॥

లోకములకు పితామహుడగు ఆ బ్రహ్మ అయిదు మోములతో ఆ అక్షరములను స్వీకరిస్తూ, వాటికి నాకు మధ్య గల వాచ్య వాచకభావముచే నన్ను మహేశ్వరునిగా తెలుసుకొనేను. ఆ ప్రజాపతి మంత్రము యొక్క వివిధ ప్రయోగములను తెలుసుకొని మంత్రసిద్ధిని పొంది, మంత్రమును దాని అర్థమును యథాతథముగా తన పుత్రులకు ఇచ్చెను. వారు ఆ శ్రేష్ఠమగు మంత్రమును సాక్షాత్తుగా లోకములకు పితామహుడగు బ్రహ్మవద్ద నుండి పొంది, ఆయన ఆజ్ఞాపించిన మార్గమునననుసరించి నన్ను ఆరాధించ వలెననే కోరికను కలిగి యుండిరి. మేరువు యొక్క సుందరమగు శిఖరమునందు ముంజవాన్ అను పర్వతము గలదు. నాకు సర్వదా ప్రియమైన శోభాయుతమగు ఆ పర్వతమును నా భక్తులు సర్వదా రక్షించుచుందురు. లోకమును సృష్టించుటయందు గొప్ప ఉత్సాహము గల ఆ బ్రహ్మ పుత్రులు దానికి దగ్గరలో వేయి సంవత్సరములు వాయువును మాత్రమే భక్షిస్తూ తీవ్రమగు తపస్సును చేసిరి. నేను పూజ్యులగు ఆ బ్రహ్మపుత్రుల భక్తిని చూసి వెంటనే ప్రత్యక్షమై జగత్తు యొక్క సృష్టి వర్ధిల్లుట కొరకై, ఋషి ఛందస్సు, కీలకము, బీజము, శక్తి, దేవత, షడంగన్యాసము, దిగ్బంధము, వినియోగము అనే మంత్రాంగములను అన్నింటినీ వారికి చెప్పితిని. తరువాత వారు మంత్రము యొక్క మాహాత్మ్యము వలన తపస్సుచే వర్ధిల్లి దేవతలు, రాక్షసులు మరియు మానవులతో కూడిన సృష్టిని చక్కగా చేసిరి. ఈ పరమవిద్య యొక్క స్వరూపమును ఇప్పుడు చెప్పుచున్నాను. ముందుగా నమః అని పలికి, తరువాత శివాయ అని పలుకవలెను. శబ్దసముదాయమునకు అంతకూ బీజభూతము మరియు సనాతనము అగు ఈ పంచాక్షరీ మంత్రోపాసనము ఉపనిషత్తులన్నింటియందు గలదు.

ప్రథమం మన్ముఖోద్గీర్ణా సా మమైవాస్తి వాచికా ।
తప్తచామీకరప్రఖ్యా పీనోన్నతపయోధరా ॥
చతుర్భుజా త్రినయనా బాలేందుకృతశేఖరా ।
పద్మోత్పలకరా సౌమ్య వరదాభయపాణికా ॥
సర్వలక్షణసంపన్నా సర్వాభరణభూషితా ।
సితపద్మాసనాసీనా నీలకుంచితమూర్ధజా ॥
అస్యాః పంచవిధా వర్ణాః ప్రస్ఫురద్రశ్మిమండలాః ।
పీతః కృష్ణస్తథా ధూమ్రస్స్వర్ణాభో రక్త ఏవ చ ॥
పృథక్ ప్రయోజ్యా యద్యేతే బిందునాద విభూషితాః ।
అర్ధచంద్రనిభో బిందుర్నాదో దీపశిఖాకృతిః ॥
బీజం ద్వితీయం బీజేషు మంత్రస్యాస్య వరాననే ।
దీర్ఘపూర్వం తురీయస్య పంచమం శక్తిమాదిశేత్ ॥
వామదేవో నామ ఋషిః పంక్తిశ్ఛంద ఉదాహృతమ్ ।
దేవతా శివ ఏవాహం మంత్రస్యాస్య వరాననే ॥
గౌతమోఽత్రిర్వరారోహే విశ్వామిత్ర స్తథాంగిరాః ।
భరద్వాజశ్చ వర్ణానాం క్రమశశ్చర్షయ స్స్మృతాః ॥
గాయత్ర్యనుష్టుప్ త్రిష్టుప్ చ ఛందాంసి బృహతీ విరాట్ ।
ఇంద్రో రుద్రో హరిర్బ్రహ్మా స్కందస్తేషాం చ దేవతాః ॥
మమ పంచముఖాన్యాహుః స్థానే తేషాం వరాననే ।
పూర్వాదేశ్చోర్ధ్వపర్యంతం నకారాది యథా క్రమమ్ ॥

మున్ముందుగా నా ముఖమునుండి పుట్టిన ఆ మంత్రము నన్ను మాత్రమే బోధించుచున్నది. పుటము పెట్టిన బంగారము వలె ప్రకాశించునది, పీనోన్నతస్తనములు గలది , నాలుగు భుజములు మూడు కన్నులు గలది, చంద్రవంకను శిరోభూషణముగా ధరించినది, పద్మమును కలువను చేతిలో పట్టుకున్నది, ప్రసన్నమగు ముఖము గలది, చేతులలో వరదముద్రను అభయముద్రను దాల్చినది, సకలలక్షణములతో ఒప్పారుచున్నదీ, సకలాభరణములతో అలంకరింపబడి యున్నది, తెల్లని పద్మము అనే ఆసనమునందు కూర్చున్నది, నల్లని గిరజాల కేశములు గలది అగు దేవత రూపములో ఈ మంత్రమును ధ్యానించవలేను. ప్రకాశించే కాంతులను విరజిమ్మే మండలములు గల అయిదు రకముల రంగులు ఈ దేవీమూర్తికి గలవు. అవి ఆకుపచ్చ, నలుపు, బూడిద రంగు, పసుపుపచ్చ మరియు ఎరుపు అనునవి. ఈ రంగులను వేర్వేరుగా ప్రయోగించే పక్షములో వాటిని బిందువు మరియు నాదముతో అలంకరించ వలెను. బిందువు అర్ధ చంద్రుని, నాదము దీపజ్వాలను పోలియుండును. ఓ సుందరమగు ముఖము గలదానా! ఈ అక్షరములలో రెండవ అక్షరము బీజమనియు, దీర్ఘస్వరము గల నాల్గవ అక్షరము కీలకమనియు, అయిదవ అక్షరము శక్తి అనియు తెలియ వలెను , ఓ సుందరమగు దీనికి వామదేవుడు ఋషి ఛందస్సు పంకి అని చెప్పబడినది. ఈ మంత్రమునకు దేవత

శివుడనగు నేనే. ఓ సుందరీ! ఈ అయిదు అక్షరములకు క్రమముగా గౌతముడు, అత్రి, విశ్వామిత్రుడు, అంగిరసుడు, భరద్వాజుడు అను వారు ఋషులని చెప్పబడినది. వాటికి గాయత్రి, అనుష్టుప్, త్రిష్టుప్, బృహతి, విరాట్ అనునవి ఛందస్సులు; ఇంద్రుడు, రుద్రుడు, హరి, బ్రహ్మ స్కందుడు దేవతలు . ఓ సుందరమగు ముఖము గలదానా! నకారముతో మొదలిడి క్రమముగా ఆ అయిదు వర్ణములకు తూర్పుతో మొదలిడి పైవరకు గల నా అయిదు ముఖములు స్థానములు .

ఉదాత్తః ప్రథమో వర్ణశ్చతుర్థశ్చ ద్వితీయకః ।
పంచమస్స్వరితశ్చైవ తృతీయో నిహతస్స్మృతః ॥
మూలవిద్యా శివం శైవం సూత్రం పంచాక్షరం తథా ।
నామాన్యస్య విజానీయాచ్చైవం మే హృదయం మహత్ ॥
నకారశ్శిర ఉచ్యేత మకారస్తు శిఖోచ్యతే ।
శికారః కవచం తద్వద్వకారో నేత్రముచ్యతే ॥
యకారోఽస్త్రం నమస్స్వాహా వషట్ హుం వౌషడిత్యపి ।
ఫడిత్యపి చ వర్ణానామంతేఽగత్వం యదా తదా ॥
తవాపి మూలమంత్రోఽయం కించిద్భేదసమన్వయాత్।
తత్రాపి పంచమో వర్ణో ద్వాదశస్వరభూషితః ॥
తస్మాదనేన మంత్రేణ మనోవాక్కాయభేదతః ।
ఆవయోరర్చనం కుర్యాజ్జపహోమాదికం తథా ॥
యథా ప్రజ్ఞం యథాకాలం యథాశాస్త్రం యథామతి ।
యథాశక్తి యథాసంపద్యథాయోగం యథారతి ॥
యదా కదాపి వా భక్త్యా యత్ర కుత్రాపి వా కృతా ।
యేన కేనాపి వా దేవి పూజా ముక్తిం నయిష్యతే ॥
మయ్యాసక్తేన మనసా యత్కృతం మమ సుందరి ।
మత్ప్రియం చ శివం చైవ క్రమేణాప్య క్రమేణ వా ॥
తథాపి మమ భక్తా యే నాత్యంతవివశాః పునః ।
తేషాం సర్వేషు శాస్త్రేషు మయ్యైవ నియమః కృతః ॥
తత్రాదౌ సంప్రవక్ష్యామి మంత్రసంగ్రహణం శుభమ్ ।
యం వినా నిష్ఫలం జాప్యం యేన వా సఫలం భవేత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే పంచాక్షర
మాహాత్మ్యవర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥

మొదటి, రెండవ, నాల్గవ అక్షరములు ఉదాత్తములనియు, మూడవది అనుదాత్తమనియు, అయిదవది స్వరితమనియు చెప్పబడినది. ఈ మంత్రమునకు మూలవిద్య, శివము (మంగళము), శైవము (శివునకు సంబంధించినది), సూత్రము, పంచాక్షరము అను పేర్లు గలవు. శైవమనబడే ఓంకారము నాయొక్క విశాలమగు హృదయమనీ తెలియవలెను. నకారము శిరస్సు; మకారము శిఖ; శికారము కవచము; వకారము నేత్రము. యకారము అస్త్రము. ఈ విధముగా షడంగన్యాసము చెప్పబడినది. ఈ అక్షరములకు అంతమునందు నమః, స్వాహా, వషట్, హుమ్, వౌషట్, ఫట్ అను పదములను చేర్చి అంగన్యాసమును చేయవలెను. దానిలోని అయిదవ అక్షరము (య) నకు పన్నెండవ అచ్చును జోడించినచో (యై), ఈ కొద్ది భేదముతో నీ మూలమంత్రము (నమశ్శివాయై) కూడ ఇదియే యగుచున్నది. కావున, సాధకుడు ఈ మంత్రమును జపము చేసి (మానసపూజ), దీనినే పారాయణ చేసి (వాక్కుతో చేసే పూజ), దీనితోనే హోమమును చేసి, ఈ విధముగా మనలనిద్దరినీ అర్చించవలెను, ఓ దేవీ! ఏ మానవుడైననూ ఏ స్థానమునందైననూ తన ప్రజ్ఞకు, బుద్ధికి, శక్తికి, సంపదకు, యోగ్యతకు, ప్రీతికి అనురూపముగా, తనకు ఉన్న సమయములో శాస్త్రవిధిని అతిక్రమించ కుండగా, భక్తితో పూజించినచో, అది వానికి ముక్తిని ఈయగలదు. ఓ సుందరీ! సాధకుడు పూజను క్రమబద్ధముగా చేసినా, క్రమరహితముగా చేసినా, నాయందు లగ్నమైన మనస్సుతో చేసినచో, అది నాకు ప్రీతికరమై, వానికి మంగళమునీయగలదు. అయినప్పటికీ, నా భక్తులు కేవలము అస్వతంత్రులు కాదు. సర్వశాస్త్రములలో వారికి నేనే నియమములను ఏర్పాటు చేసి యున్నాను. ఆ సందర్భములో నేను ముందుగా మంత్రమును స్వీకరించే శుభవిధిని గురించి చెప్పెదను. ఈ విధి లేనిచో జపము వ్యర్థము. దీని వలన జపము సఫలమగును.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో పంచాక్షర జపవిధిని వర్ణించే పదమూడవ అధ్యాయము ముగిసినది.

# 14- పంచాక్షరమంత్రమును జపించే విధానము

ఈశ్వర ఉవాచః

ఆజ్ఞాహీనం క్రియాహీనం శ్రద్ధాహీనం వరాననే ।
ఆజ్ఞార్థం దక్షిణాహీనం సదా జప్తం చ నిష్ఫలమ్ ॥
ఆజ్ఞాసిద్ధం క్రియాసిద్ధం శ్రద్ధాసిద్ధం మమాత్మకమ్ ।
ఏవం చేద్దక్షిణాయుక్తం మంత్రసిద్ధిర్మహత్ఫలమ్ ॥
ఉపగమ్య గురుం విప్రమాచార్యం తత్త్వవేదినమ్ ।
జాపినం సద్గుణోపేతం ధ్యానయోగ పరాయణమ్ ॥
తోషయేత్తం ప్రయత్నేన భావశుద్ధిసమన్వితః ।
వాచా చ మనసా చైవ కాయేన ద్రవిణేన చ ॥
ఆచార్యం పూజయేది ప్రస్సర్వదాతి ప్రయత్నతః ।
హస్త్యశ్వరథరత్నాని క్షేత్రాణి చ గృహాణి చ ॥
భూషణాని చ వాసాంసి ధాన్యాని చ ధనాని చ ।
ఏతాని గురవే దద్యాద్భక్త్యా చ విభవే సతి ॥
విత్తశాఠ్యం న కుర్వీత యదీచ్ఛేత్సిద్ధిమాత్మనః ।
పశ్చాన్నివేద్య స్వాత్మానం గురవే సపరిచ్ఛదమ్ ॥
ఏవం సంపూజ్య విధివద్యథాశక్తి త్వవంచయన్ ।
ఆదదీత గురోర్మంత్రం జ్ఞానం చైవ క్రమేణ తు ॥
ఏవం తుష్టో గురుశ్శిష్యం పూజకం వత్స రోషితమ్ ।
శుశ్రూషమనహంకారం స్నాతం శుచిముపోషితమ్ ॥
స్నాపయిత్వా విశుద్ధ్యర్థం పూర్ణకుంభఘృతేన వై ।
జలేన మంత్రశుద్ధేన పుణ్య ద్రవ్యయుతేన చ ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓ సుందరమగు ముఖము గలదానా! గురువు యొక్క ఉపదేశము, క్రియ, శ్రద్ధ మరియు విధిని పాలించుటకై ఈయదగిన దక్షిణ లేని జపము నిష్ఫలమగును. గురువుయొక్క ఉపదేశము, క్రియ, శ్రద్ధ మరియు గురువునకు ఈయబడిన దక్షిణ అనువాటితో కూడిన మంత్రము నా స్వరూపమే యగును. అట్టి మంత్రము సిద్ధించి సాధకునకు గొప్ప ఫలమునిచ్చును. బ్రాహ్మణుడు, బ్రహ్మజ్ఞాని, తత్త్వవేత్త, జపమును చేయువాడు, మంచి గుణములతో కూడినవాడు, ధ్యానయోగమునందు నిష్ఠ గలవాడు అగు గురువును అంతఃకరణశుద్ధి గల సాధకుడు సమీపించి, ఆయనను మనోవాక్కాయములతో మరియు ధనముతో సంతోషపెట్టవలెను. బ్రాహ్మణుడు సర్వకాలములలో పూర్ణప్రయత్నమును చేసి ఆచార్యుని పూజించ వలెను. ఏనుగులు, గుర్రములు, రథములు, రత్నములు, పొలములు, ఇళ్లు, అలంకారములు, వస్త్రములు, ధాన్యములు, ధనములు అను వాటిని సంపద ఉన్న సాధకుడు గురువునకు భక్తితోనీయవలెను . తనకు సిద్ధి

కలుగవలెనని కోరుకొనే సాధకుడు ధనవిషయములో శక్తివంచన చేయరాదు. తరువాత సాధకుడు సర్వసామగ్రితో సహా తనను ఆచార్యునకు సమర్పించు ఈ విధముగా శక్తిని అతిక్రమించకుండగా, శక్తివంచన లేకుండగా యథావిధిగా గురువును పూజించి, గురువు వద్దనుండి ముందుగా మంత్రమును తరువాత జ్ఞానమును స్వీకరించ వలెను. తనను పూజించువాడు, తనవద్ద సంవత్సరకాలము మకాము చేసి శుశ్రూషను చేసినవాడు, అహంకారము లేనివాడు, స్నానము చేసియున్నవాడు అగు శిష్యుని చూచి, గురువు సంతోషి విశేష శుద్ధి కొరకై పూర్ణకుంభమునందలి నేయితో, పుణ్య ద్రవ్యములతో కూడిన మంత్రముచే పవిత్రము చేయబడిన నీటితో స్నానమును చేయించవలెను.

**అలంకృత్య సువేషం చ గంధస్రగ్వస్త్ర భూషణైః ।**
**పుణ్యాహం వాచయిత్వా చ బ్రాహ్మణానభిపూజ్య చ ॥**
**సముద్రతీరే నద్యాం చ గోష్ఠే దేవాలయేఽపి వా ।**
**శుచౌ దేశే గృహే వాపి కాలే సిద్ధికరే తిథౌ ॥**
**నక్షత్రే శుభయోగే చ సర్వదోషవివర్జితే ।**
**అనుగృహ్య తతో దద్యాత్ జ్ఞానం మమ యథావిధి ॥**
**స్వరేణో చ్చారయేత్సమ్యగేకాంతేఽతి ప్రసన్నధీః ।**
**ఉచ్చార్యోచ్చారయిత్వా తమావయోర్మంత్ర ముత్తమమ్ ॥**
**శివం చాస్తు శుభం చాస్తు శోభనోఽస్తు ప్రియోఽస్త్వితి ।**
**ఏవం దద్యాద్గురుర్మంత్రమజ్ఞాం చైవ తతః పరమ్ ॥**
**ఏవం లబ్ధ్వా గురోర్మంత్రమజ్ఞాం చైవ సమాహితః ।**
**సంకల్ప్య చ జపేన్నిత్యం పురశ్చరణపూర్వకమ్ ॥**
**యావజ్జీవం జపేన్నిత్యమష్టోత్తర సహస్రకమ్ ।**
**అనన్యస్తత్పరో భూత్వా స యాతి పరమాం గతిమ్ ॥**
**జపేదక్షరలక్షం వై చతుర్గుణితమాదరాత్ ।**
**నక్తాశీ సంయమీ యస్య పౌరశ్చరణిక స్స్మృతః ॥**
**యః పురశ్చరణం కృత్వా నిత్య జాపీ భవేత్పునః ।**
**తస్య నాస్తి సమో లోకే స సిద్ధస్సిద్ధిదో భవేత్ ॥**
**స్నానం కృత్వా శుచౌ దేశే బధ్వా రుచిరమాసనమ్ ।**
**త్వయా మాం హృది సంచింత్య సంచింత్య స్వగురుం తతః ॥**

ఆ సాధకుడు వస్త్రములతో చక్కని ముస్తాబును చేసుకొని, మాలతో మరియు ఆభరణములతో అలంకరించుకొని, గంధమును పూసుకొని, పుణ్యాహవాచనమును చేసి, బ్రాహ్మణులకు ఎదురుగా కూర్చుని వారిని పూజించ వలెను. తరువాత సముద్రతీరమునందు గాని, నదీతీరమునందు గానీ, గోశాలయందు గాని, దేవళమునందు గానీ, లేదా ఇంటిలో పవిత్రమగు స్థానమునందు గానీ, సిద్ధిని కలిగించే పుణ్యతిథి, శుభనక్షత్రము, శుభయోగము గల సకలదోషములు లేని కాలమునందు గురువు ఆ శిష్యుని అనుగ్రహించి

యథావిధిగా శివజ్ఞానమునీయ వలెను. గురువు మిక్కిలి ప్రసన్నమగు బుద్ధి గలవాడై, ఏకాంతమునందు ఉత్తమమగు మన యిద్దరి మంత్రమును స్వరసహితముగా చక్కగా ఉచ్చరించి, అతనిచే ఉచ్చరింప జేయవలెను. మంగళమగు గాక శుభమగు గాక! సుసంపన్నమగు గాక! ప్రియమగు గాక! అని పలికి గురువు మంత్రమునిచ్చి తరువాత ఆజ్ఞను ఈయవలెను . సాధకుడు ఈ విధముగా గురువు వద్దనుండి మంత్రమును మరియు ఆజ్ఞను పొంది, ఏకాగ్రచిత్తము గలవాడై సంకల్పమును చేసి, నిత్యము పురశ్చరణ పూర్వకముగా జపమును చేయవలెను. ఎవడైతే బ్రతికి యున్నంత కాలము మరియొక దానిపైకి దృష్టిని మళ్లించకుండగా తత్పరుడై నిత్యము నూట యెనిమిది సార్లు జపమును చేయునో, వాడు మోక్షమును పొందును . అక్షరముల సంఖ్యను నాలుగుతో గుణించి అన్ని లక్షల జపమును ఎవడైతే రాత్రి మాత్రమే భుజిస్తూ ఇంద్రియజయము గలవాడై భక్తితో చేయునో, వాడు పురశ్చరణ చేసిన వాడగునని మహర్షులు చెప్పుచున్నారు. ఎవడైతే పురశ్చరణను చేసి మరల నిత్యము జపమును చేయునో, వానితో సమానమైనవాడు లోకములో లేడు. మంత్రసిద్ధిని పొందియున్న అట్టి వ్యక్తి ఇతరులకు కూడ సిద్ధిని ఈయగలడు. సాధకుడు స్నానమును, చేసి, పవిత్రమగు స్థానములో అందమగు ఆసనముపై కూర్చుండి (లేదా, అందమగు యోగాసనములో కూర్చుండి), నీతో గూడియున్న నన్ను మనస్సులో ధ్యానించి, తరువాత తన గురువును ధ్యానించవలెను.

**ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా మౌనీ చైకాగ్రమానసః ।**
**విశోధ్య పంచ తత్త్వాని దహనప్లావనాదిభిః ॥**
**మంత్రన్యాసాదికం కృత్వా సకలీకృతవిగ్రహః ।**
**ఆవయోర్విగ్రహౌ ధ్యాయన్ ప్రాణాపానౌ నియమ్య చ ॥**
**విద్యాస్థానం స్వకం రూపమృషిచ్ఛందోఽధిదైవతమ్ ।**
**బీజం శక్తిం తథా వాక్యం స్మృత్వా పంచాక్షరీం జపేత్ ॥**
**ఉత్తమం మానసం జాప్యముపాంశుం చైవ మధ్యమమ్ ।**
**అధమం వాచికం ప్రాహురాగమార్థ విశారదాః ॥**
**ఉత్తమం రుద్రదైవత్యం మధ్యమం విష్ణుదైవతమ్ ।**
**అధమం బ్రహ్మదేవత్యమిత్యాహురను పూర్వశః ॥**
**యదుచ్చనీచస్వరితైస్స్పష్టా స్పష్టపదాక్షరైః ।**
**మంత్రముచ్చారయేద్వాచా వాచికోఽయం జపస్స్మృతః ॥**
**జిహ్వామాత్రపరిస్పందాదీషదుచ్చారితోఽపి వా ।**
**అపరైరశ్రుతః కించిచ్ఛ్రుతో వోపాంశురుచ్యతే ॥**
**ధియా యదక్షరశ్రేణ్యా వర్ణాద్వర్ణం పదాత్పదమ్ ।**
**శబ్దార్థచింతనం భూయః కథ్యతే మానసో జపః ॥**
**వాచికస్త్వేక ఏవ స్యాదుపాంశుశ్శతముచ్యతే ।**
**సహస్రం మానసః ప్రోక్తస్సగర్భస్తు శతాధికః ॥**

**ప్రాణాయామసమాయుక్తస్సగర్భో జప ఉచ్యతే ।**

**ఆద్యంతయోరగర్భేఽపి ప్రాణయామః ప్రశస్యతే ॥**

సాధకుడు ఉత్తరముఖముగా గాని, తూర్పు ముఖముగా గాని కూర్చుండి, మౌనముగా ఏకాగ్రమగు చిత్తము గలవాడై, దహనము ప్లావనము మొదలగు ప్రాణయామములతో అయిదు తత్త్వములను (పృథివి మొదలైనవి) శోధన చేసి, మంత్రన్యాసము మొదలగు వాటిని చేసి, దేహమునకు సకలీకరణము అనే ప్రక్రియను పూర్తి చేసి, మన యిద్దరి మూర్తులను ధ్యానము చేయుచూ ప్రాణయామమును చేసి, విద్య, స్థానము, తన రూపము, ఋషి ఛందస్సు, అధిష్ఠాన దేవత, బీజము, శక్తి మరియు వాక్యము అనువాటిని స్మరించి పంచాక్షరీ మంత్రమును జపించ వలెను. మానసజపము ఉత్తమమనియు, ఉపాంశుజపము మధ్యమమనియు, వాచికజపము అధమమనియు దతాత్పర్యమునెరింగిన పండితులు చెప్పుచున్నారు. రుద్రుడు దేవతగా గల మంత్రము ఉత్తమమనియు, విష్ణుదేవతాకమగు మంత్రము మధ్యమమనియు, బ్రహ్మ దేవతగా గలది అధమమనియు ఈ క్రమమును పెద్దలు చెప్పుచున్నారు. ఉదాత్తానుదాత్తస్వరితములనే స్వరములతో, స్పష్టము మరియు అస్పష్టము అగు పదములతో మరియు అక్షరములతో మంత్రమును వాక్కుతో ఉచ్చరించినచో, అది వాచికజపమని చెప్పబడినది. నాలుక మాత్రమే కదులుతుండగా మెల్లగా ఉచ్చరిస్తూ ఇతరులకు వినబడనీ విధముగా, లేదా వినబడీ వినబడని విధముగా చేసే జపమునకు ఉపాంశుజపమని పేరు. అక్షరముల వరుసలో ఒక అక్షరమునుండి మరియొక అక్షరమునకు, ఒక పదమునుండి మరియొక పదమునకు బుద్ధితో ముందుకు సాగుతూ శబ్దమును దాని అర్థమును మరల మరల భావన చేస్తూ చేసే జపమునకు మానసజపమని పేరు. వాచకజపము ఒకవంతు ఫలమునీయగా, ఉపాంశుజపము వంద రెట్లు, మానసజపము వేయి రేట్లు, సగర్భజపము లక్ష రెట్లు ఫలమునిచ్చునని చెప్పబడినది. ప్రాణాయామముతో కూడిన జపమునకు సగర్భజపమని పేరు. అగర్భజపములో కూడ ముందులో మరియ ఆఖరున ప్రాణాయామమును చేయుట శ్రేష్ఠమని చెప్పబడినది.

**చత్వారింశత్సమావృత్తీః ప్రాణాయమ్య సంస్మరేత్ ।**

**మంత్రం మంత్రార్థవిద్ధీమానశక్తశ్శక్తితో జపేత్ ॥**

**పంచకం త్రికమేకం వా ప్రాణాయామం సమాచరేత్ ।**

**అగర్భం వా సగర్భం వా సగర్భస్తత్ర శస్యతే ॥**

**సగర్భాదపి సాహస్రం సధ్యానో జప ఉచ్యతే ।**

**ఏషు పంచవిధేష్వేకః కర్తవ్యశ్శక్తితో జపః ॥**

**అంగుల్యా జపసంఖ్యానమేకమేవ ముదాహృతమ్ ।**

**రేఖయాష్టగుణం విద్యాత్పుత్రజీ వైర్దశాధికమ్ ॥**

**శతం స్యాచ్ఛంఖమణిభిః ప్రవాలైస్తు సహస్రకమ్ ।**

**స్ఫటికైర్దశసాహస్రం మౌక్తికైర్లక్ష ముచ్యతే ॥**

పద్మాక్షైర్దశ లక్షం తు సౌవర్ణైః కోటిరుచ్యతే ।
కుశగ్రంథ్యా చ రుద్రాక్షైరనంతగుణితం భవేత్ ॥
త్రింశదక్షైః కృతా మాలా ధనదా జపకర్మణి ।
సప్తవింశతిసంఖ్యాతైరక్షైః పుష్టిప్రదా భవేత్ ॥
పంచవింశతి సంఖ్యాతైః కృతా ముక్తిం ప్రయచ్ఛతి ।
అక్షైస్తు పంచదశభిరభిచార ఫలప్రదా ॥
అంగుష్ఠం మోక్షదం విద్యాత్తర్జనీం శత్రునాశినీమ్ ।
మధ్యమాం ధనదాం శాంతిం కరోత్యేషా హ్యనామికా॥
అష్టోత్తరశతం మాలా తత్ర స్యాదుత్తమోత్తమా ।
శతసంఖ్యోత్తమా మాలా పంచాశద్భిస్తు మధ్యమా ॥

మంత్రముయొక్క అర్థమును తెలిసిన వివేకి ప్రాణాయామమును చేయుచూ నలభైసార్లు మంత్రమును భావన చేయవలెను. అన్ని సార్లు చేసే శక్తి లేనిచో, శక్తిని అనుసరించి చేయవచ్చును. ప్రాణాయామమును అయిదు సార్లు, మూడు సార్లు లేదా ఒకసారి చేయవచ్చును. జపమును ప్రాణాయామముతో కలిపి (సగర్భ) గాని, లేదా ప్రాణాయామము లేకుండగా (అగర్భ) గాని చేయవచ్చును. కానీ వాటిలో సగర్భజపము శ్రేష్ఠమని చెప్పబడినది. సగర్భజపము కంటే సధ్యాన (ధ్యానముతో కూడిన) జపము వేయి రెట్లు శ్రేష్ఠమని చెప్పబడినది. సాధకుడు ఈ అయిదు రకముల జపములలో ఏదో ఒక దానిని శక్తిమేరకు చేయవలెను. వ్రేళ్లతో లెక్క పెట్టుట ఒక వంతు ఫలమునీయగా, రేఖలతో లెక్కించుట ఎనిమిది రెట్లు, గింజల మాలతో లెక్కించుట పది, గవ్వల మాలతో వంద, పగడముల మాలతో వేయి, స్ఫటికమాలతో పది వేలు, ముత్యముల మాలతో లక్ష, పద్మముల విత్తనముల మాలతో పది లక్షలు, బంగరు పూసల మాలతో కోటీ, దర్భముడులతో గాని రుద్రాక్షమాలతో గాని లెక్కించుట అనంతమగు రెట్లు ఫలమును ఇచ్చునని చెప్పబడినది. జపమునందు ముప్పది పూసల మాల ధనమును, ఇరవై ఏడు పూసల మాల ఆరోగ్యమును, ఇరవై అయిదు పూసల మాల మోక్షమును, ఏబది పూసల మాల శత్రుహాని అనే ఫలమును ఇచ్చును . జపములో బొటన వ్రేలును ఉపయోగించినచో మోక్షమును, చూపుడు వేలు శత్రునాశమును, మధ్య వేలు ధనమును, అనామిక శాంతిని ఫలముగా ఇచ్చును. వాటిలో నూట యెనిమిది పూసల మాల ఉత్తమోత్తమము; నూరు ఉత్తమము; ఏభై మధ్యమము.

చతుః పంచాశదక్షైస్తు హ్యచ్ఛేష్ఠా హి ప్రకీర్తితా ।
ఇత్యేవం మాలయా కుర్యాజ్జపం కస్మై న దర్శయేత్ ॥
కనిష్ఠాऽక్షరణీ ప్రోక్తా జపకర్మణి శోభనా ।
అంగుష్ఠేన జపేజ్జప్యమన్యైరంగులిభిస్సహ ॥
అంగుష్ఠేన వినా జప్యం కృతం తదఫలం యతః ।
గృహే జపం సమం విద్యాద్గోష్ఠే శతగుణం విదుః ॥
పుణ్యారణ్యే తథారామే సహస్రగుణముచ్యతే ।
అయుతం పర్వతే పుణ్యే నద్యాం లక్షముదాహృతమ్ ॥

కోటిం దేవాలయే ప్రాహురనంతం మమ సన్నిధౌ ।
సూర్యస్యాగ్నేర్గురోరిందోర్దీపస్య చ జలస్య చ ॥
విప్రాణాం చ గవాం చైవ సన్నిధౌ శస్యతే జపః।
తత్పూర్వాభిముఖం వశ్యం దక్షిణం చాభిచారికమ్ ॥
పశ్చిమం ధనదం విద్యా దౌత్తరం శాంతిదం భవేత్।
సూర్యాగ్నివిప్రదేవానాం గురూణామపి సన్నిధౌ ॥
అన్యేషాం చ ప్రశస్తానాం మంత్రం న విముఖో జపేత్ ।
ఉష్ణీషీ కంచుకీ నగ్నో ముక్తకేశో గలావృతః ॥
అపవిత్రకరోఽశుద్ధో విలపన్న జపేత్క్వచిత్ ।
క్రోధం మదం క్షుతం త్రీణి నిష్ఠీవనవిజృంభణే ॥
దర్శనం చ శ్వనీచానాం వర్జయేజ్జపకర్మణి ।
ఆచమేత్సంభవే తేషాం స్మరేద్వా మాం త్వయా సహ ॥

ఏభై నాలుగు పూసల మాల మనోహరము మరియు శ్రేష్ఠము అని చెప్పబడినది. ఈ విధముగా జపమును చేయుటకు ఉపయోగించే మాల ఇతరులకు కనబడరాదు. జపకర్మలో అందనుగు చిటికెన వేలు అక్షరణి ( జపఫలమును నశించకుండగా కాపాడేది) అని చెప్పబడినది. బొటన వ్రేలిని మిగిలిన వ్రేళ్లతో కలిపి మంత్రమును జపించ వలెను . ఏలయనగా, బొటన వ్రేలిని విడిచి పెట్టి చేసిన జపము ఫలమునీయదు. జపమును ఇంట్లో చేసినచో సమానమగు ఫలము, గోశాలలో వంద రెట్లు, పవిత్రమగు అరణ్యములో మరియు ఉద్యానవనములో వేయి, పవిత్రమగు పర్వతముపై పది వేలు, నదీలో లక్ష, దేవాలయము నందు కోటి రెట్లు ఫలము లభించగా, నా సన్నిధిలో అనంతమగు ఫలము లభించును. సూర్యుడు, అగ్ని, గురువు, చంద్రుడు, దీపము, నీరు, బ్రాహ్మణులు, గోవులు అను వాటి సన్నిధిలో జపము శ్రేష్ఠమని చెప్పబడినది. తూర్పుముఖముగా చేసిన జపము వశీకరణశక్తిని, దక్షిణముఖము శత్రుహానిని, పడమట ధనమును, ఉత్తరము శాంతిని ఇచ్చునని తెలియవలెను. ఎక్కడనైననూ సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, దేవుడు, గురువులు, ఇతరశ్రేష్ఠపురుషులు అను వారి సన్నిధిలో వారికి పెడముఖమును పెట్టి జపమును చేయరాదు. ఏ కాలమునందైననూ తలపాగాను, చొక్కాను దాల్చి గాని, నగ్నముగా గాని, జుట్టు విరబోసుకొని గాని, మెడకు బట్టను చుట్టుకొని గాని, పవిత్రము (దర్భముడి) లేని చేతితో గాని, శుచి కాకుండగా గాని, ఏడుస్తూ గాని జపమును చేయరాదు. జపకర్మయందు కోపమును, గర్వమును, తుమ్ము ఆవులింత ఉమ్మి అను మూడింటిని విడిచి పెట్టవలెను. జపమును చేయుచుండగా కుక్కను, దుష్టులను చూడరాదు. అట్టు జరిగినచో, ఆచమనమును చేయవలెను. లేదా, నీతో గూడియున్న నన్ను స్మరించ వలెను.

జ్యోతీంషి చ ప్రపశ్యేద్వా కుర్యాద్వా ప్రాణసంయమమ్ ।
అనాసనశ్శయానో వా గచ్ఛన్నుత్థిత ఏవ వా ॥
రథ్యాయామశివే స్థానే న జపేత్తిమిరాంతరే ।
ప్రసార్య న జపేత్పాదౌ కుక్కుటాసన ఏవ వా ॥
యానశయ్యాధిరూఢో వా చింతా వ్యాకులితోఽథ వా ।
శక్తశ్చేత్సర్వమేవైతదశక్తశ్శక్తితో జపేత్ ॥
కిమత్ర బహునోక్తేన సమాసేన వచః శృణు ।
సదాచారో జపన్ శుద్ధం ధ్యాయన్ భద్రం సమశ్నుతే ॥
ఆచారః పరమో ధర్మ ఆచారః పరమం ధనమ్ ।
ఆచారః పరమా విద్యా ఆచారః పరమా గతిః ॥
ఆచారహీనః పురుషో లోకే భవతి నిందితః ।
పరత్ర చ సుఖీ న స్యాత్తస్మాదాచారవాన్ భవేత్ ॥
యస్య యద్విహితం కర్మ వేదే శాస్త్రే చ వైదికైః ।
తస్య తేన సమాచారస్సదాచారో న చేతరః ॥
సద్భిరాచరితత్వాచ్చ సదాచారస్స ఉచ్యతే ।
సదాచారస్య తస్యాహురాస్తిక్యం మూలకారణమ్ ॥
ఆస్తికశ్చేత్ప్రమాదాద్యైస్సదాచారాద విచ్యుతః ।
న దుష్యతి నరో నిత్యం తస్మాదాస్తికతాం వ్రజేత్ ॥
యథేహాస్తి సుఖం దుఃఖం సుకృతైర్దుష్కృతైరపి ।
తథా పరత్ర చాస్తీతి మతిరాస్తిక్యముచ్యతే ॥

లేదా, సూర్యుడు మొదలగు కాంతిమండలములను దర్శించ వలెను. లేదా, ప్రాణాయామమును చేయవలెను. ఆసనము లేకుండగా గాని, పరుండి గాని, నడుస్తూ గాని, నిలబడి గాని జపము చేయరాదు. వీధిలో గాని, అపవిత్రస్థానమునందు గాని, చీకటిలో గాని జపించరాదు. కాళ్లను చాచుకొని గాని, కోడి వలె కూర్చుండి (కుక్కుటాసనము) గాని జపమును చేయరాదు . బండిని ఎక్కి గాని, శయ్యపై కూర్చుండి గాని, ఆందోళనతో కల్లోలముగా నున్న మనస్సుతో గాని జపమును చేయరాదు. శక్తి గలవాడు ఈ నియమములను అన్నింటినీ పాటించ వలెను, శక్తి లేనిచో తనకు శక్తి ఉన్నంత వరకు నియమములను పాటిస్తూ జపించ వలెను. ఇన్ని మాటలేల? సంగ్రహముగా చెప్పెదను. వినుము. సదాచారమును కలిగి శుద్ధహృదయముతో జపమును ధ్యానమును చేయు వ్యక్తి మంగళమును పొందును. సచ్ఛీలమే సర్వశ్రేష్ఠమగు ధర్మము. సదాచారమే అనగా సచ్ఛీలమే అన్నింటికంటే గొప్ప ధనము. ఆచారమే సర్వోత్కృష్టమగు విద్య. ఆచారమే మోక్షము. ఆచారమునేరుంగని వ్యక్తి లోకములో నిందకు గురి యగును. అట్టి వానికి పరలోకములో నైననూ సుఖము ఉండదు. కావున, మానవుడు సచ్ఛీలము కలవాడు కావలెను. వేదవిద్వాంసులు చెప్పిన విధముగా వేదశాస్త్రములు ఎవనికి ఏ కర్మను విధించు చున్నవో, దానిని వాడు అనుష్ఠించుటయే సదాచారమగును గాని,

మరియొకటి కాదు. సత్పురుషులు ఆచరించుటచే దానికి సదాచారమని పేరు వచ్చినది. అట్టి సదాచారమునకు మూలకారణము ఆస్తిక్యబుద్ధి అని చెప్పెదరు. మానవుడు సర్వకాలములలో ఆస్తికుడై యున్నచో, మరుపు మొదలగు దోషముల కారణముగా సదాచారమునుండి జారిపోడు. అట్టి వానికి పాపము ఉండదు. కావున, మానవుడు ఆస్తిక్యమును కలిగి యుండవలెను. ఇహలోకములో మంచి పని చేయువారికి సుఖము, చెడు పని చేయువారికి దుఃఖము కలిగే విధముగానే, పరలోకములో కూడ జరుగుననే నిశ్చయబుద్ధికి ఆస్తిక్యమని పేరు.

**రహస్యమన్యద్వక్ష్యామి గోపనీయమిదం ప్రియే ।**
**న వాచ్యం యస్య కస్యాపి నాస్తికస్యాథ వా పశోః ॥**
**సదాచారవిహీనస్య పతితస్యాంత్యజస్య చ ।**
**పంచాక్షరాత్పరం నాస్తి పరిత్రాణం కలౌ యుగే ॥**
**గచ్ఛతస్తిష్ఠతో వాపి స్వేచ్ఛయా కర్మ కుర్వతః ।**
**అశుచేర్వా శుచేర్వాపి మంత్రోఽయం న చ నిష్ఫలః ॥**
**అనాచారవతాం పుంసామవిశుద్ధషడధ్వనామ్ ।**
**అనాదిష్టోఽపి గురుణా మంత్రోఽయం న చ నిష్ఫలః ॥**
**అంత్యజస్యాపి మూర్ఖస్య మూఢస్య పతితస్య చ ।**
**నిర్మర్యాదస్య నీచస్య మంత్రోఽయం న చ నిష్ఫలః ॥**
**సర్వావస్థాం గతస్యాపి మయి భక్తిమతః పరమ్ ।**
**సిధ్యత్యేవ న సందేహో నాపరస్య తు కస్యచిత్ ॥**
**న లగ్నతిథినక్షత్రవారయోగాదయః ప్రియే ।**
**అస్యాత్యంతమపేక్ష్యాస్స్యుర్నైష సుప్తస్సదోదితః ॥**
**న కదాచిన్న కస్యాపి రిపురేష మహాత్మనః ।**
**సుసిద్ధో వాపి సిద్ధో వా సాధ్యో వాపి భవిష్యతి ॥**
**సిద్ధేన గురుణాదిష్టస్సుసిద్ధ ఇతి కథ్యతే ।**
**అసిద్ధేనాపి వా దత్తస్సిద్ధస్సధ్యస్తు కేవలః ॥**
**అసాధితస్సాధితో వా సిధ్యత్యేవ న సంశయః।**
**శ్రద్ధాతిశయయుక్తస్య మయి మంత్రే తథా గురౌ ॥**

ఓ ప్రియురాలా! మరియొక రహస్యమును చెప్పెదను. దీనిని దాచి పెట్టుము. ఎవరికి పడితే వారికి గాని, నాస్తికునకు గాని, లేదా సదాచారము లేని మూర్ఖునకు గాని దీనిని చెప్పరాదు. కలియుగములో పతితునకు, అంత్యజులకు పంచాక్షరము కంటే గొప్ప రక్షణ లేదు. ఈ మంత్రమును నడుస్తూ, నిలబడి, తనకు నచ్చిన పనిని చేసుకుంటూ, శుచిగా గాని, శుచి కాకుండగా గాని జపము చేసిననూ ఈ మంత్రము వ్యర్థము కాదు. ఆచారము లేనివారు, ఆరు మార్గముల విశేషశోధనము లేనివారు, గురువుయొక్క ఉపదేశము లేనివారు అగు పురుషులు చేసిననూ ఈ మంత్రము వ్యర్థము కాదు . అంత్యజుడు, మొండి పట్టుదలవాడు, అజ్ఞాని, పతితుడు, మర్యాద లేనివాడు, నీచుడు అగు వ్యక్తి చేసిననూ ఈ

మంత్రముయొక్క జపము వ్యర్థము కాదు. నాయందు భక్తి గలవాడు ఎట్టి అవస్థను పొందియున్ననూ ఈ మంత్రము నిశ్చయముగా సిద్ధించి తీరును. సందేహము లేదు. నాయందు భక్తి లేనివానికి ఎవనికైననూ ఇది సిద్ధించదు . ప్రియురాలా! ఈ మంత్రమునకు లగ్నము, తిథి, నక్షత్రము, వారము, యోగము మొదలగు వాటితో అధికమగు అపేక్ష లేదు. జాగరూకముగా నుండునే గాని, నిద్రించదు. ఈ మహామంత్రము ఎవనికైననూ ఎప్పుడైననూ హానిని చేయదు. సుసిద్ధము, సిద్ధము, సాధ్యము అను మూడు విధములుగా ఈ మంత్రము ఉన్నది. సిద్ధుడగు గురువుచే ఉపదేశించబడిన మంత్రము సుసిద్ధమనబడును. సిద్ధిని పొందని గురువు ఉపదేశించినచో, అది సిద్ధము అగును. ఉపదేశము లేనిది సాధ్యము. నాయందు, మంత్రమునందు మరియు గురువునందు అతిశయించిన శ్రద్ధ గల వ్యక్తికి ఈ మంత్రము గురువుచే ఉపదేశించ బడినది అయినా, కాకపోయినా, నిస్సందేహముగా సిద్ధించి తీరును .

**తస్మాన్మంత్రాంతరాంస్త్యక్త్వా సాపాయానధికారతః ।**
**ఆశ్రయేత్పరమాం విద్యాం సాక్షాత్పంచాక్షరీం బుధః ॥**
**మంత్రాంతరేషు సిద్ధేషు మంత్ర ఏష న సిధ్యతి ।**
**సిద్ధే త్వస్మిన్ మహామంత్రే తే చ సిద్ధా భవంత్యుత ॥**
**యథా దేవేష్వలబ్ధోఽస్మి లబ్ధేష్వపి మహేశ్వరి ।**
**మయి లబ్ధే తు తే లబ్ధ మంత్రేష్వేషు సమో విధిః ॥**
**యే దోషాస్సర్వమంత్రాణాం న తేఽస్మిన్ సంభవంత్యపి ।**
**అస్య మంత్రస్య జాత్యాదీననపేక్ష్య ప్రవర్తనాత్ ॥**
**తథాపి నైవ క్షుద్రేషు ఫలేషు ప్రతియోగిషు ।**
**సహసా వినియుంజీత యస్మాదేష మహాబలః ॥**

కావున, వివేకవంతుడు అధికారస్థితిని బట్టి విఘ్నములతో కూడియున్న ఇతరమంత్రములను విడిచిపెట్టి, సర్వోత్కృష్టమగు ఈ పంచాక్షరీవిద్యను ఆశ్రయించ వలెను . ఇతరమంత్రములు సిద్ధించిననూ, ఈ మంత్రము సిద్ధించినట్లు కాదు. కాని, ఈ మహామంత్రము సిద్ధించినచో, అవి సిద్ధించును. ఓ మహేశ్వరీ! దేవతలు లభించిననూ, నేను లభించినట్లు కాదు. కాని, నేను లభించినచో, ఆ దేవతలు లభించినట్లే. ఇదే న్యాయము ఈ మంత్రమునకు కూడా వర్తించును. ఈ మంత్రము జాతి మొదలగు అర్హతలను అపేక్షించకుండగా ప్రవర్తిల్లుటచే, ఇతరములగు మంత్రములన్నింటిలో ఏ దోషములు గలవో, అవి దీనియందు సంభవమే కావు. అయినప్పటికీ, ఈ మంత్రమును వెంట వెంటనే అల్పఫలముల కొరకు గాని, శత్రుహాని కొరకు గాని వినియోగించ రాదు. ఏలయనగా, ఇది మహాబలము గలది .

**ఉపమన్యురువాచః**

**ఏవం సాక్షాన్మహాదేవ్యై మహాదేవేన శూలినా ।**
**హితాయ జగతాముక్తః పంచాక్షరవిధిర్యథా ॥**
**య ఇదం కీర్తయేద్భక్త్యా శృణుయాద్వా సమాహితః ।**
**సర్వపాపవినిర్ముక్తః ప్రయాతి పరమాం గతిమ్ ॥**

**ఇతి శ్రీశివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే పంచాక్షర మంత్రజపవిధివర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥**

ఉపమన్యుడు ఇట్లు పలికెను -

ఈ విధముగా సాక్షాత్తు శూలధారియగు మహాదేవుడు లోకముల హితమును గోరి మహాదేవికి పంచాక్షరమంత్రవిధిని చెప్పినాడు. ఆ చెప్పిన విధముగా ఎవడైతే దీనిని భక్తితో కీర్తించునో, లేదా ఏకాగ్రచిత్తముతో వినునో, అట్టివాడు సకలపాపముల నుండి విముక్తుడై మోక్షమును పొందును .

శ్రీశివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో పంచాక్షర మంత్రజపవిధిని వర్ణించే పదునాల్గవ అధ్యాయము ముగిసినది .

# 15 – గురు మహిమ – గురు శుశ్రూష

**శ్రీ కృష్ణ ఉవాచ।**

**భగవన్మంత్రమాహాత్మ్యం భవతా కథితం ప్రభో ।**
**తత్ప్రయోగవిధానం చ సాక్షాచ్ఛ్రుతిసమం యథా ॥**
**ఇదానీం శ్రోతుమిచ్ఛామి శివసంస్కారముత్తమమ్ ।**
**మంత్రసంగ్రహణే కించిత్సూచితం న తు విస్మృతమ్ ॥**

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ పూజ్యా! పంచాక్షరమంత్రమాహాత్మ్యమును, సాక్షాత్తుగా వేదముతో సమానమైన దాని ప్రయోగవిధానమును నీవు చెప్పియుంటివి. ఇప్పుడు నేను ఉత్తమమగు శివసంస్కారమును వినగోరుచున్నాను. దానిని గురించి నీవు మంత్రమును గ్రహించే ప్రకరణములో కొద్దిగా సూచించితివి. దానిని నేను మరువలేదు .

**ఉపమన్యురువాచః**

**హంత తే కథయిష్యామి సర్వపాపవిశోధనమ్ ।**
**సంస్కారం పరమం పుణ్యం శివేన పరిభాషితమ్ ॥**
**సమ్యక్ కృతాధికారస్స్యాత్పూజాదిషు నరో యతః ।**
**సంస్కారః కథ్యతే తేన షడధ్వపరిశోధనమ్ ॥**
**దీయతే యేన విజ్ఞానం క్షీయతే పాశబంధనమ్ ।**
**తస్మాత్సంస్కార ఏవాయం దీక్షేత్యపి చ కథ్యతే ॥**
**శాంభవీ చైవ శాక్తీ చ మాంత్రీ చైవ శివాగమే ।**
**దీక్షోపదిశ్యతే త్రేధా శివేన పరమాత్మనా ॥**
**గురోరాలోకమాత్రేణ స్పర్శాత్సంభాషణాదపి ।**
**సద్యస్సంజ్ఞా భవేజ్జంతోః పాశోపక్షయకారిణీ ॥**
**సా దీక్షా శాంభవీ ప్రోక్తా సా పునర్భిద్యతే ద్విధా ।**
**తీవ్రా తీవ్రతరా చేతి పాశోపక్షయభేదతః ॥**
**యయా స్యాన్నిర్వృతస్సద్యస్సైవ తీవ్రతరా మతా ।**
**తీవ్రా తు జీవతోత్యంతం పుంసః పాపవిశోధికా ॥**
**శాక్తీ జ్ఞానవతీ దీక్షా శిష్యదేహం ప్రవిశ్య తు ।**
**గురుణా యోగమార్గేణ క్రియతే జ్ఞానచక్షుషా ॥**
**మాంత్రీ క్రియావతీ దీక్షా కుండమండలపూర్వికా ।**
**మందమందతరోద్దేశాత్కర్తవ్యా గురుణా బహిః ॥**
**శక్తిపాతానుసారేణ శిష్యోఽను గ్రహమర్హతి ।**
**శైవధర్మానుసారస్య తన్మూలత్వాత్సమాసతః ॥**

ఉపమన్యుడు ఇట్లు పలికెను -

సకలపాపములను విశేషముగా శుద్ధి చేయునది, పరమపవిత్రమైనది, శివునిచే బోధింపబడినది అగు సంస్కారమును నీకు తప్పక చెప్పెదను. ఆరు మార్గముల శోధనము వలన మానవునకు పూజ మొదలగు వాటియందు చక్కని అధికారము లభించును. కావుననే, దానికి సంస్కారము అను పేరు వచ్చినది. దీని వలన మానవునకు విజ్ఞానము లభించి సంసారబంధము నశించును. కావుననే, దీనికి దీక్ష అను పేరు కూడ గలదు. శివాగమములో శాంభవి, శాక్తి, మాంత్రి అను మూడు రకముల దీక్షను శివపరమాత్మ బోధించినాడు. జీవునకు గురువుయొక్క దర్శనమాత్రముచే, స్పృశించుటచే మరియు సంభాషించుటచే వెంటనే సంసారబంధమును నశింపజేసే సమ్యగ్ జ్ఞానము కలుగును ఆ దీక్షకు శాంభవి అని పేరు. సంసారబంధమును నశింపజేయుటలో గల భేదమును బట్టి ఆ దీక్షయే తీవ్రము మరియు తీవ్రతరము అని రెండు విధములుగా నున్నది. దేనిచే వెనువెంటనే శాంతి కలుగునో, దానికి తీవ్రతరము అని పేరు. జీవించుచున్న పురుషుని పాపములను పూర్తిగా నశింపజేసే దీక్షకు తీవ్ర అని పేరు. గురువు యోగమార్గముచే శిష్యుని దేహమును ప్రవేశించి జ్ఞాననేత్రముతో జ్ఞానయుక్తమగు దీక్షను ఇచ్చును. దానికి శాక్తి అని పేరు. అగ్నికుండములో మరియు మండలములో వివిధక్రియలతో కూడియున్న బాహ్యదీక్షకు మంత్రి అని పేరు. దానిని గురువు మందము లేదా మందతరము అగు ఉద్దేశ్యముతో ఇచ్చును శక్తిపాతముననుసరించి శిష్యుడు గురువుయొక్క అనుగ్రహమును పొందును. శైవధర్మముయొక్క అనుసరణము శక్తిపాతమే మూలముగా కలిగి యున్నది. కావున, అది సంగ్రహముగా చెప్పబడుచున్నది.

**యత్ర శక్తిర్న పత్తా తత్ర శుద్ధిర్న జాయతే ।**<br>
**న విద్యా న శివాచారో న ముక్తిర్న చ సిద్ధయః ॥**<br>
**తస్మాల్లింగాని సంవీక్ష్య శక్తిపాతస్య భూయసః ।**<br>
**జ్ఞానేన క్రియయా వాథ గురుశ్శిష్యం విశోధయేత్ ॥**<br>
**యోఽన్యథా కురుతే మోహాత్స వినశ్యతి దుర్మతిః ।**<br>
**తస్మాత్సర్వ ప్రకారేణ గురుశ్శిష్యం పరీక్షయేత్ ॥**<br>
**లక్షణం శక్తిపాతస్య ప్రబోధానందసంభవః ।**<br>
**సా యస్మాత్పరమా శక్తిః ప్రబోధానందరూపిణీ ॥**<br>
**ఆనందబోధయోర్లింగమంతఃకరణవి క్రియాః ।**<br>
**యథా స్యాత్కంపరోమాంచస్వర నేత్రాంగవి క్రియాః ॥**<br>
**శిష్యోఽపి లక్షణైరేభిః కుర్యాద్గురుపరీక్షణమ్ ।**<br>
**తత్సంపర్కైశ్శివార్చాదౌ సంగతైర్వాథ తద్గతైః ॥**<br>
**శిష్యస్తు శిక్షణీయత్వాద్గురోర్గౌరవరణాత్ ।**<br>
**తస్మాత్సర్వ ప్రయత్నేన గురో ర్గౌరవమాచరేత్ ॥**

యో గురుస్స శివః ప్రోక్తో యశ్శివస్స గురుస్స్మృతః ।
గురుర్వా శివ ఏవాథ విద్యాకారేణ సంస్థితః ॥
యథా శివస్తథా విద్యా యథా విద్యా తథా గురుః ।
శివవిద్యాగురూణాం చ పూజయా సదృశం ఫలమ్ ॥
సర్వదేవాత్మకశ్చాసౌ సర్వమంత్రమయో గురుః ।
తస్మాత్సర్వప్రయత్నేన తస్యాజ్ఞాం శిరసా వహేత్ ॥

ఎవనియందు శక్తిపాతము (గురువునుండి శిష్యునిలోనికి శక్తి ప్రవహించుట) జరుగలేదో, వానికి శుద్ధి కలుగదు. వానియందు విద్య, శివాచారము, ముక్తి మరియు సిద్ధులు అనునవి లేవు. కావున, అధికమగు శక్తిపాతముయొక్క చిహ్నములను గుర్తించి గురువు జ్ఞానముచే గాని, క్రియచే గాని శిష్యుని విశేషముగా శోధన చేయవలెన. ఎవడైతే మోహము వలన దీనికి భిన్నముగా చేయునో, అట్టి దుర్బుద్ధి వినాశమును పొందును. కావున, గురువు శిష్యుని అన్ని ప్రకారములుగా పరీక్షించ వలెను. ప్రకృష్టమగు జ్ఞానము మరియు ఆనందము కలుగుటయే శక్తి పాతము యొక్క లక్షణము. ఏలయనగా, ప్రకృష్టమగు జ్ఞానము మరియు ఆనందము ఆ శ్రేష్ఠమగు శక్తియొక్క స్వరూపమే యున్నవి అంతఃకరణమునందలి వికారములు ఆనందజ్ఞానములకు చిహ్నములు. కరణవికారము వలన వణుకు, గగుర్పాటు, గొంతు బొంగురు పోవుట, కన్నుల వెంబడి నీరు స్రవించుట అనే దేహవికారములు కలుగును. శిష్యుడు కూడా శివపూజ మొదలగు సందర్భములలో గురువుతో సంపర్కమును పెట్టుకొని, లేదో ఆయన వద్ద ఉండి చనువును పెంచుకొని, ఈ లక్షణములను బట్టి గురువును గురువుచే విద్య గడపబడువాడు గనుక శిష్యునకు ఆ పేరు వచ్చినది. శిష్యునిచే సమ్మానింపబడువాడు గనుక, గురువునకు ఆ పేరు వచ్చినది. కావున, శిష్యుడు సకలప్రయత్నముల ద్వారా గురువును గౌరవించవలెను . గురువే శివుడనియు, శివుడే గురువనియు చెప్పబడినది. శివుడే విద్యయొక్క ఆకారమును పొంది గురువై ఉన్నాడు. ఏ తత్త్వము శివుడో, అదియే విద్య. ఏది విద్యయో అదియే గురువు. శివుడు, విద్య మరియు గురువు అనువారిని పూజించుట వలన సమానమగు ఫలము లభించును శివుడు సర్వదేవతాస్వరూపుడు కాగా, గురువు సర్వమంత్రస్వరూపుడు. కావున, సకలప్రయత్నములను చేసి ఆయన ఆజ్ఞను శిరసా వహించవలెను .

శ్రేయోఽర్థీ యది గుర్వాజ్ఞాం మనసాపి న లంఘయేత్ ।
గుర్వాజ్ఞాపాలకో యస్మాత్ జ్ఞానసంపత్తిమశ్నుతే ॥
గచ్ఛంస్తిష్ఠన్ స్వపన్ భుంజన్నాన్యత్కర్మ సమాచరేత్ ।
సమక్షం యది కుర్వీత సర్వం చానుజ్ఞయా గురోః ॥
గురోర్గృహే సమక్షం వా న యథేష్టాసనో భవేత్।
గురుర్దేవో యతస్సాక్షాత్తద్గృహం దేవమందిరమ్ ॥
పాపినాం చ యథా సంగాత్తత్పాపాత్పతితో భవేత్ ।
యథేహ వహ్నిసంపర్కాన్మలం త్యజతి కాంచనమ్ ॥

తథైవ గురుసంపర్కాత్పాపం త్యజతి మానవః।
యథా వహ్నిసమీపస్థో ఘృతకుంభో విలీయతే ॥
తథా పాపం విలీయేత హ్యాచార్య స్య సమీపతః।
యథా ప్రజ్వాలితో వహ్నిశ్శుష్కమార్ద్రం చ నిర్దహేత్ ॥
తథాయమపి సంతుష్టో గురుః పాపం క్షణాద్దహేత్।
మనసా కర్మణా వాచా గురోః క్రోధం న కారయేత్ ॥
తస్య క్రోధేన దహ్యంతే హ్యాయుః శ్రీజ్ఞానసత్క్రియాః।
తత్క్రోధకారిణో యే స్యుస్తేషాం యజ్ఞాశ్చ నిష్ఫలాః ॥
యమాశ్చ నియమాశ్చైవ నాత్ర కార్యా విచారణా।
గురోర్విరుద్ధం యద్వాక్యం న వదేజ్జాతుచిన్నరః ॥
వదేద్యది మహామోహాద్రౌరవం నరకం వ్రజేత్।
మనసా కర్మణా వాచా గురుముద్దిశ్య యత్నతః ॥
శ్రేయోర్థీ చెన్నరో ధీమాన్న మిథ్యాచారమాచరేత్।
గురోర్హితం ప్రియం కుర్యాదాదిష్టో వా న వా సదా ॥

శ్రేయస్సును కోరు శిష్యుడు గురువుయొక్క ఆజ్ఞను మనస్సులోనైననూ ఉల్లంలంఘించరాదు. ఏలయనగా, గురువుయొక్క ఆజ్ఞను పాలించువాడు జ్ఞానము అనే సంపదను పొందును శిష్యుడు నడుస్తూ ఉన్నా, నిలబడి ఉన్నా, నిద్రిస్తున్నా, భుజిస్తున్నా, గురువు యొక్క ఆజ్ఞను మినహాయించి ఇతరములగు కర్మలను చేయరాదు. గురువుయొక్క సమక్షములో ఏ కర్మను చేసిననూ, సర్వమును ఆయన అనుమతితో మాత్రమే చేయవలెను. గురువుయొక్క ఇంట్లో గానీ, ఆయన యెదుట గానీ ఇచ్ఛ వచ్చిన రీతిలో ఆసనముపై కూర్చుండరాదు. ఏలయనగా, గురువు సాక్షాత్తుగా దేవుడే. ఆయన గృహము దేవాలయము. పాపాత్ముల సంగము వలన కలిగే పాపము వలన మానవుడు ఏ విధముగా పతనమును చెందునో, ఈ లోకములో బంగారము అగ్నితోడి సంపర్కము వలన ఏవిధముగా మాలిన్యములను పోగొట్టుకొనునో, అదే విధముగా, మానవుడు గురువుతోడి సంపర్కము వలన పాపమును విడిచి పెట్టును. ఏ విధముగా నిప్పుకు దగ్గరలో నున్న కుండలోని నెయ్యి కరిగి పోవునో, అదే విధముగా గురువునకు సమీపములో పాపము వినాశమును పొందును. భగభగ మండే నిప్పు ఎండు కట్టెలను మాత్రమే గాక, పచ్చి కట్టెలను కూడ ఏ విధముగా దహించి వేయునో , అదే విధముగా ఈ గురువు సంతోషించిన దహించి వేయును. మనస్సుచే గాని, కర్మచే గాని, వాక్కుతో గాని గురువునకు కోపమును కలిగించరాదు. గురువునకు కోపము వచ్చినచో, ఆయుర్దాయము, సంపద, జ్ఞానము, చేసుకున్న పుణ్య కర్మలు ఆ కోపములో పడి మసియగును. ఆయనకు కోపము తెప్పించిన వారి యజ్ఞములు, యమములు, నియమములు వ్యర్థములనుటలో సందేహము లేదు. మానవుడు ఏ కాలమునందైననూ గురువునకు విరుద్ధమగు వాక్యమును పలుకరాదు. గొప్ప మోహముచే అట్లు పలికినచో, అట్టివాడు రౌరవనరకమును పొందును. వివేకవంతుడగు మానవుడు శ్రేయస్సును కోరువాడైనచో, ప్రయత్నపూర్వకముగా

గురువు విషయములో మనోవాక్కాయముల ద్వారా తప్పు పని జరుగకుండునట్లు జాగ్రత్త పడవలెను. గురువు ఆదేశించినా, ఆదేశించక పోయినా, ఆయనకు హితమును ప్రియమును సర్వదా ఆచరించుచుండవలెను.

**అసమక్షం సమక్షం వా తస్య కార్యం సమాచరేత్ ।**

**ఇత్థమాచారవాన్ భక్తో నిత్యముద్యుక్తమానసః ॥**

**గురు ప్రియకరశ్శిష్యశ్శైవధర్మాంస్తతోఽర్హతి ।**

**గురుశ్చేద్గుణవాన్ ప్రాజ్ఞః పరమానందభాసకః ॥**

**తత్త్వవిచ్ఛివసంసక్తో ముక్తిదో న తు చాపరః ।**

**సంవిత్సంజననం తత్త్వం పరమానందసంభవమ్ ॥**

**తత్తత్త్వం విదితం యేన స ఏవానందదర్శకః ।**

**న పునర్నామమాత్రేణ సంవిదా రహితస్తు యః ।**

**అన్యోన్యం తారయేన్నౌకా కిం శిలా తారయేచ్ఛిలామ్ ।**

**ఏతస్యా నామమాత్రేణ ముక్తిర్వై నామమాత్రికా ॥**

**యైః పునర్విదితం తత్త్వం తే ముక్తా మోచయంత్యపి ।**

**తత్త్వహీనే కుతో బోధః కుతో హ్యాత్మపరిగ్రహః ॥**

**పరిగ్రహ వినిర్ముక్తః పశురిత్యభిధీయతే ।**

**పశుభిః ప్రేరితశ్చాపి పశుత్వం నాతివర్తతే ॥**

**తస్మాత్తత్త్వవిదేవేహ ముక్తో మోచక ఇష్యతే ।**

**సర్వలక్షణసంయుక్తస్సర్వశాస్త్ర విదప్యయమ్ ॥**

**సర్వోపాయవిధిజ్ఞోఽపి తత్త్వహీనస్తు నిష్ఫలః ।**

**యస్యానుభవపర్యంతా బుద్ధిస్తత్త్వే ప్రవర్తతే ॥**

**తస్యావలోకనాద్యైశ్చ పరానందోఽభిజాయతే ।**

**తస్మాద్యస్యైవ సంపర్కాత్ప్రబోధానంద సంభవః ॥**

**గురుం తమేవ వృణుయాన్నాపరం మతిమాన్నరః ।**

**స శిష్యైర్వినయాచారచతురైరుచితో గురుః ॥**

**యావద్విజ్ఞాయతే తావత్సేవనీయో ముముక్షుభిః ।**

**జ్ఞాతే తస్మిన్ స్థిరా భక్తిర్యావత్తత్త్వం సమాశ్రయేత్ ॥**

గురువు ఎదురుగా ఉన్నా లేకున్నా ఆయన కార్యమును చక్కగా చేయవలెను. ఈ విధమైన ప్రవృత్తి గలవాడు, భక్తుడు, నిత్యము సావధానముగా నుండే మనస్సు గలవాడు , గురువునకు ప్రియమును చేయువాడు అగు శిష్యుడు ఆ శుశ్రూష వలన శైవధర్మములకు అర్హుడు అగును. గురువు గుణవంతుడు, జ్ఞాని, పరమానందస్వరూపమగు తత్త్వమును ప్రకాశింపజేయగలవాడు, తత్త్వము తెలిసినవాడు, శివునియందు భక్తి గలవాడు అయినచో, శిష్యునకు మోక్షమునీయగలడు; దీనికి భిన్నమైనవాడు ఈయలేడు. తత్త్వమనగా శుద్ధచైతన్యస్వరూపము మరియు పరమానందఘనము. ఆ తత్త్వము (పరంబ్రహ్మ) ను తెలిసినవాడు మాత్రమే ఆనందస్వరూపమును చూపించగలడు. అంతేగాని,

జ్ఞాని కాని నామమాత్రపు గురువు ఆనందస్వరూపమును చూపలేడు. ఒక నౌక మరియొక నౌకను లాగి సముద్రమును దాటించగలదు. కానీ, ఒక రాయి మరియొక రాయిని దాటించగలదా? గురువు నామమాత్రుడైనచో, ముక్తి కూడ నామమాత్రమే యగును (38). దీనికి భిన్నముగా, తత్త్వము తెలిసిన వారు తాము ముక్తులై ఇతరులను కూడ ముక్తులను చేయగలుదురు. తత్త్వము తెలియని వానియందు జ్ఞానమెక్కడిది? ఆత్మసాక్షాత్కారమెక్కడిది? ఆత్మసాక్షాత్కారము లేనివాడు పశువు అనబడును. ఇతరపశువులచే ప్రేరితుడైన పశువు (అజ్ఞానియగు జీవుడు) తన పశుత్వము (అజ్ఞానము) ను అతిక్రమించ లేడు . కావున, ఈ లోకములో తత్త్వమును తెలిసి ముక్తిని పొందినవాడు మాత్రమే ఇతరులకు ముక్తిని ఈయగలును, సకలలక్షణములు గలవాడైననూ, సకలశాస్త్రములను చదివినవాడైననూ, సకలములగు ఉపాయములను విధులను తెలిసినవాడే అయిననూ, తత్త్వము తెలియని వాడైనచో వ్యర్థము. ఎవనీ బుద్ధి తత్త్వమునందుల్లనో, వానీని చూచుట మొదలగు వాటి వలన పరమానందము కలుగును. కావున, బుద్ధిమంతుడగు మానవుడు, ఎవని సంపర్కము వలన మాత్రమే ప్రకృష్టమగు జ్ఞానము మరియు ఆనందము కలుగునో, వానిని మాత్రమే గురువుగా ఎన్నుకొనవలెనే గాని, మరియొకనిని గాదు. అట్టి యోగ్యుడగు గురువును మోక్షమును కోరే శిష్యులు వినయముతో, సదాచారముతో మరియు నేర్పుతో, జ్ఞానము స్థిరమగు భక్తి మరియు తత్త్వమునందు నిష్ఠ కలిగే వరకు సేవించవలెను.

తు తత్త్వం త్యజేజ్ఞాతు నోపేక్షేత కథంచన ।
యత్రానందః ప్రబోధో వా నాల్పమప్యుపలభ్యతే ॥
వత్సరాదపి శిష్యేణ సోఽన్యం గురుముపాశ్రయేత్ ।
గురుమన్యం ప్రపన్నో ఽపి నావమన్యేత పౌర్వికమ్ ।
గురో ర్భృత్యాంస్తథా పుత్రాన్ బోధకాన్ ప్రేరకానపి ॥
తత్రాదావుపసంగమ్య బ్రాహ్మణం వేదపారగమ్ ।
గురుమారాధయేత్ప్రాజ్ఞం శుభగం ప్రియదర్శనమ్ ॥
సర్వాభయ ప్రదాతారం కరుణా క్రాంతమానసమ్ ।
తోషయేత్తం ప్రయత్నేన మనసా కర్మణా గిరా ॥
తావదారాధయేచ్ఛిష్యః ప్రసన్నోఽసౌ భవేద్యథా ।
తస్మిన్ ప్రసన్నే శిష్యస్య సద్యః పాపక్షయో భవేత్ ॥
తస్మాద్ధనాని రత్నాని క్షేత్రాణి చ గృహాణి చ ।
భూషణాని చ వాసాంసి యానశయ్యాసనాని చ ॥
ఏతాని గురవే దద్యాద్భక్త్యా విత్తానుసారతః ।
విత్తశాఠ్యం న కుర్వీత యదీచ్ఛేత్పరమాం గతిమ్ ॥
స ఏవ జనకో మాతా భర్తా బంధుర్ధనం సుఖమ్ ।
సఖా మిత్రం చ యత్తస్మాత్సర్వం తస్మై నివేదయేత్ ॥

నివేద్య పశ్చాత్స్వాత్మానం సాన్వయం సపరిగ్రహమ్ ।
సమర్ప్య సోదకం తస్మై నిత్యం తద్వశగో భవేత్ ॥
యదా శివాయ స్వాత్మానం దత్తవాన్ దేశికాత్మనే ।
తదా శైవో భవేద్దేహీ న తతోఽస్తి పునర్భవః ॥

సాధకుడు ఎన్నడైననూ తత్త్వమును విడిచి పెట్టరాదు; ఏ విధముగ నైననూ ఉపేక్షించరాదు. ఏ గురువు వద్ద శిష్యునకు సంవత్సరకాలము తరువాత కూడ ఆనందము కాని జ్ఞానము కాని అల్పము కూడ లభించదో, అతడు ఆ గురువును విడిచిపెట్టి, మరియొక గురువును ఆశ్రయించ వలెను. అతడు మరియొక గురువును ఆశ్రయించిన తరువాత కూడ పూర్వగురువును గానీ, ఆయన సోదరులు పుత్రులు మొదలగు వారిని గాని, ఆ గురువును చూపించి ప్రోత్సహించిన వారిని గాని, అవమానించ రాదు . ఇట్టి స్థితిలో ముందుగా బ్రాహ్మణుడు, వేదవేత్త, జ్ఞానీ, శుభలక్షణములు, గలవాడు, ఆహ్లాదకరమగు దర్శనము గలవాడు, అందరికీ అభయమునిచ్చువాడు (సన్న్యాసి), దయతో నిండిన మనస్సు గలవాడు అగు గురువును సమీపించి ఆరాధించ వలెను. ఆయనను మనోవాక్కాయములచే ప్రయత్నపూర్వకముగా సంతోష పెట్టవలెను. ఆయన ప్రసన్నుడగు వరకు శిష్యుడు ఆయనను ఆరాధించ వలెను. ఆయన ప్రసన్నుడైనచో, శిష్యునకు వెంటనే పాపక్షయమగును. కావున, ధనములు, రత్నములు, పొలములు, ఇళ్లు, అలంకారములు, వస్త్రములు, ప్రయాణసాధనములు, శయ్యలు, ఆసనములు అనువాటిని సాధకుడు తన ఆర్థికస్థితిని బట్టి గురువునకు భక్తితో నీయవలెను. మోక్షమును కోరు శిష్యుడు శక్తివంచన లేకుండగా ధనము నీయ వలెను. గురువే తండ్రి, తల్లి, పోషించువాడు, బంధువు, ధనము, సుఖము, మిత్రుడు మరియు సహచరుడు అగుటచే, సర్వమును ఆయనకు నివేదించ వలెను. ఈ విధముగా నివేదించి తరువాత తనను తన కుటుంబమును తన సమస్తసంపదను అయనకు నీటిని వదిలి సమర్పించి సర్వదా ఆయనకు వశుడై ఉండవలెను. మానవుడు ఎప్పుడైతే తనను గురురూపములోనున్న శివునకు సమర్పించు కొనునో, అప్పుడు ఆతడు శైవుడు అగును. అట్లు చేయుట వలన ఆతనికి పునర్జన్మ లేదు.

గురుశ్చ స్వాశ్రితం శిష్యం వర్షమేకం పరీక్షయేత్ ।
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం ద్వివర్షం చ త్రివర్షకమ్ ॥
ప్రాణ ద్రవ్య ప్రదానాద్యైరాదేశైశ్చ సమాసమైః ।
ఉత్తమాంశ్చాధమే కృత్వా నీచానుత్తమకర్మణి ॥
ఆకృష్టాస్తాడితా వాపి యే విషాదం న యాంత్యపి ।
తే యోగ్యాస్సంయతాశ్శుద్ధాశ్శివసంస్కారకర్మణి ।
అహింసకా దయావంతో నిత్యముద్యుక్తచేతసః ।
అమానినో బుద్ధిమంతస్త్యక్తస్పర్ధాః ప్రియంవదాః ॥
ఋజవో మృదవస్స్వచ్ఛా వినీతాః స్థిరచేతసః ।
శౌచాచారసమాయుక్తాశ్శివభక్తా ద్విజాతయః ॥

**ఏవం వృత్తసమోపేతా వాఙ్మనః కాయకర్మభిః ।**
**శోధ్యా బోధ్యా యథాన్యాయమితి శాస్త్రేషు నిశ్చయః ॥**
**నాధికారస్స్వతో నార్యాశ్శివసంస్కారకర్మణి ।**
**నియోగాద్భర్తురస్త్యేవ భక్తియుక్తా యదీశ్వరే ॥**

గురువు కూడ తనను ఆశ్రయించిన శిష్యుడు బ్రాహ్మణుడైనచో ఒక సంవత్సరము, క్షత్రియుడైనచో రెండేళ్లు, వైశ్యుడైనచో మూడేళ్లు పరీక్షించవలెను. ప్రాణసంకటము, అధికమగు ధనమునకు పూచీని అప్పజెప్పుట మొదలగు పరీక్షలను చేయవలెను. ఉచితములు మరియు అనుచితములు అగు ఆదేశములను ఇచ్చి ఉత్తములను అధమకార్యమునందు, అధములను ఉత్తమకార్యమునందు నియోగించి పరీక్షించ వలెను ఎవరైతే తిట్టినా, కొట్టినా దుఃఖమును కూడ పొందరో, అట్టి చిత్తైకాగ్రము గల శుద్ధాంతఃకరణులు శివసంస్కార కర్మకు అర్హులు. హింసను చేయనివారు, దయ గలవారు, సర్వదా సేవ చేయుటకు సంసిద్ధమైన మనస్సు గలవారు, గర్వము లేనివారు, బుద్ధిశాలురు, అసూయను వీడినవారు, ప్రియమును పలుకుతారు, ఋజువర్తనులు, మృదుస్వభావము గలవారు, స్వచ్ఛమైన వారు, వినయవంతులు, స్థిరమగు బుద్ధి గలవారు, శౌచము మరియు ఆచారముతో సంపన్నమైనవారు, శివభక్తులు, ఉపనయనమును చేసుకున్నవారు అగు శిష్యుల ప్రవృత్తిని పరీక్షించి, మనోవాక్కాయకర్మల ద్వారా వారిని పవిత్రులను చేసి వారికి ధర్మమునతిక్రమించకుండగా బోధించ వలెనని శాస్త్రములయందు నిశ్చయించ బడినది. స్త్రీకి తనంత తానుగా శివసంస్కారకర్మయందు అధికారము లేదు. కాని, ఆమెకు ఈశ్వరునియందు భక్తి ఉండి భర్త అనుమతి ఉన్నచో, అధికారము గలదు .

తథైవ భర్తృహీనాయాః పుత్రాదేరభ్యనుజ్ఞయా ।
అధికారో భవత్యేవ కన్యాయాః పితురాజ్ఞయా ।
శూద్రాణాం మర్త్యజాతీనాం పతితానాం విశేషతః ॥
తథా సంకరజాతీనాం నాధ్వశుద్ధిర్విధీయతే ।
తేష్వ కృత్రిమ భావాశ్చేచ్ఛివే పరమకారణే ॥
పాదోదకప్రదానాద్యైః కుర్యుః పాపవిశోధనమ్ ।
అత్రానులోమజాతా యే యుక్తా ఏవ ద్విజాతిషు ॥
తేషామధ్వవిశుద్ధ్యాది కుర్యాన్మాతృకులోచితమ్ ।
యా తు కన్యా స్వపిత్రాద్యైశ్శివధర్మే నియోజితా ॥
సా భక్తాయ ప్రదాతవ్యా నాపరాయ విరోధినే ।
దత్తా చేత్ప్రతికూలాయ ప్రమాదాద్బోధయేత్పతిమ్ ॥
అశక్తా తం పరిత్యజ్య మనసా ధర్మమాచరేత్ ।
యథా మునివరం త్యక్త్వా పతిమత్రిం పతివ్రతా ॥
కృతకృత్యాఽ భవత్పూర్వం తపసారాధ్య శంకరమ్ ।
యథా నారాయణం దేవం తపసారాధ్య పాండవాన్ ॥
పతీన్ లబ్ధవతీ ధర్మే గురుభిర్న నియోజితా ।
అస్వాతంత్ర్యకృతో దోషో నేహాస్తి పరమార్థతః ॥
శివధర్మే నియుక్తాయాశ్శివశాసన గౌరవాత్।
బహునాత్ర కిముక్తేన యోఽపి కోఽపి శివాశ్రయః ॥
సంస్కార్యో గుర్వధీనశ్చేత్సం స్త్రియా న ప్రభిద్యతే ।
గురోరాలోకనాదేవ స్పర్శాత్సంభాషణాదపి ॥
యస్య సంజాయతే ప్రజ్ఞా తస్య నాస్తి పరాజయః ।
మనసా యస్తు సంస్కారః క్రియతే యోగవర్త్మనా ॥
స నేహ కథతో గుహ్యో గురువక్త్రైకగోచరః ।
క్రియావాన్ యస్తు సంస్కారః కుండమండపపూర్వకః ।
స వక్ష్యతే సమాసేన తస్య శక్యో న విస్తరః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే గురు
మహిమవర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥

అదే విధముగా భర్త లేని స్త్రీ విషయములో పుత్రులు మొదలగు వారి అనుమతిని పొందినచో, శివసంస్కారమునకు అర్హత తప్పక కలుగును; తండ్రి అనుమతితో కన్యకు అర్హత గలదు. శూద్రులు మొదలగు మానవజాతులకు, విశేషించి పతితులకు (63), అదే విధముగా సంకరజాతి వారికి మార్గశుద్ధి విధించబడలేదు. వారు కూడా సర్వజగత్కారణుడగు శివునియందు కపటము లేని భక్తి గలవారైనచో (64), గురువుయొక్క పాదములపై నీటిని పోయుట (లేదా, శివుని పాదోదకమును తమపై చల్లుకొనుట) మొదలగు కర్మలచే పాపక్షాళనమును చేసుకొన వలెను. బ్రాహ్మణులలో నైననూ అనులోమవివాహము (తల్లి బ్రాహ్మణి కాని స్థితి) వలన జన్మించిన వారిలో యోగ్యులు ఎవరు గలరో (65), వారికి తల్లి వంశము యొక్క ఆచారమును బట్టి మార్గశుద్ధి మొదలగు వాటిని చేయవలెను. ఏ కన్యనైతే తల్లి తండ్రి మొదలగు వారు శివధర్మమునందు నియోగించేదరో (66), ఆమెను శివభక్తునకు మాత్రమే ఇచ్చి వివాహమును చేయవలెను; శివవిరోధి యగు మరియొకనికి ఈయరాదు. ఒకచో పొరపాటున శివవిరోధికి ఇచ్చియున్నచో, ఆమె భర్తకు శివధర్మమును బోధించ వలెను (67). ఆమె ఆతనిని సన్మార్గములోనికి తీసుకు రాలేక పోయినచో, వానిని విడిచిపెట్టి తన మనస్సులో ధర్మమును అనుష్ఠించ వలెను. దీనికి కొన్ని దృష్టాంతములు గలవు. పూర్వము పతివ్రత యగు అనసూయ అత్రిమహర్షిని విడిచిపెట్టి తపస్సుచే శంకరుని ఆరాధించి కృతార్థురాలు ఆయెను. ద్రౌపదిని ఆమె గురువులు ధర్మమునందు నియోగించ లేదు. ఆమె నారాయణుని తపస్సుచే ఆరాధించి పాండవులను భర్తలుగా పొందెను. ఈ లోకములో శివధర్మమునందు నియోగించ బడిన స్త్రీకి శివుని శాసనము యొక్క మహిమచే స్వాతంత్ర్యము లేని కారణముగా వచ్చే దోషము యథార్థముగా సంక్రమించదు. ఇన్ని మాటలేల? ఎట్టి మానవుడైనా శివుని ఆశ్రయించి గురువును శరణు పొందినచో, వానికి శివసంస్కారమును చేయవలెను. సంస్కారపద్ధతిలో భేదము లేదు. గురువును చూచిన వెంటనే, లేదా స్పృశించుటచే, లేదా సంభాషించుట చేతనైననూ ఎవనికైతే జ్ఞానము కలుగునో, వానికి పరాజయము లేదు. యోగమార్గములో మానసికముగా చేయబడే సంస్కారము ఏది గలదో, అది రహస్యము మరియు గురువు ద్వారా మాత్రమే తెలియదగినది. అగుటచే, ఈ సందర్భములో చెప్పబడుట లేదు. అగ్నికుండము, మండపము అను. వాటితో కూడిన కర్మరూపమైన సంస్కారము ఏది గలదో, అది మాత్రమే సంగ్రహముగా చెప్పబడ గలదు. దానిని విస్తరముగా చెప్పుట అసంభవము .

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో గురుమహిమను గురుశుశ్రూషను వర్ణించే పదునైదవ అధ్యాయము ముగిసినది.

# 16 - శివ సంస్కార విధి

ఉపమన్యురువాచ:

పుణ్యేఽహని శుచౌ దేశే బహుదోషవివర్జితే ।
దేశికః ప్రథమం కుర్యాంత్సంస్కారం సమయాహ్వయమ్ ॥
పరీక్ష్య భూమిం విధివద్గంధవర్ణరసాదిభిః ।
శిల్పిశాస్త్రోక్తమార్గేణ మండపం తత్ర కల్పయేత్ ॥
కృత్వా వేదిం చ తన్మధ్యే కుండాని పరికల్పయేత్ ।
అష్టదిక్షు తథా దిక్షు తత్రైశాన్యాం పునః క్రమాత్ ॥
ప్రధానకుండం కుర్వీత యద్వా పశ్చిమభాగతః ।
ప్రధానమేకమేవాథ కృత్వా శోభాం ప్రకల్పయేత్ ॥
వితానధ్వజమాలాభిర్వి విధాభిరనేకశః ।
వేదిమధ్యే తతః కుర్యాన్మండలం శుభలక్షణమ్ ॥
రక్తహేమాదిభిశ్చూర్ణైరీశ్వరావాహనోచితమ్ ।
సిందూరశాలినీవారచూర్ణైరేవాథ నిర్ధనః ॥
ఏకహస్తం ద్విహస్తం వా సితం వా రక్తమేవ వా ।
ఏకహస్తస్య పద్మస్య కర్ణికాష్టాంగులా మతా ॥
కేసరాణి తదర్ధాని శేషం చాష్టదలాదికమ్ ।
ద్విహస్తస్య తు పద్మస్య ద్విగుణం కర్ణికాదికమ్ ॥
కృత్వా శోభోపశో భాఢ్యమైశాన్యాం తస్య కల్పయేత్ ।
ఏకహస్తం తదర్ధం వా పునర్వేద్యాస్తు మండలమ్ ॥
వ్రీహితండులసిద్ధార్థతిల పుష్పకుశాస్తృతే ।
తత్ర లక్షణసంయుక్తం శివకుంభం ప్రసాధయేత్ ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను -

పవిత్రదినమునాడు అనేకదోషములు లేని పవిత్రమగు స్థానములో గురువు ముందుగా సమయ అనే సంస్కారమును చేయవలెను (1). గంధము, రంగు, రుచి మొదలగు అంశములను బట్టి భూమిని యథావిధిగా పరీక్షించి, అచట శిల్పశాస్త్రములో చెప్పిన విధముగా మండపమును నిర్మించవలెను (2). దాని మధ్యలో వేదిని కట్టి, ఎనిమిది దిక్కులలో వరుసగా కుండములను ఏర్పాటు చేయవలెను. మరల ఈశాన్యమునందు గాని, పశ్చిమమునందు గాని ప్రధానకుండమును కట్టవలెను. ప్రధానకుండము ఒక్కటి మాత్రమే నుండును. దానిని అనేకరకములైన చాందినీ, పతాకము మరియు మాలలు అను వాటితో అలంకరించ వలెను. తరువాత వేదిమధ్యలో ఈశ్వరుని ఆవాహన చేయుటకు తగిన శుభలక్షణములు గల మండలమును ఎరుపు మొదలగు రంగులు గల పొడులతో మరియు బంగారపు చూర్ణముతో ముగ్గు వేయవలెను. నిర్ధనుడైనచో సిందూరము, బియ్యపు పిండి, నివ్వెర బియ్యపు పిండి అను వాటితో ముగ్గు వేయవలెను (3-6).

దానిలో ఒక చేయి లేదా రెండు చేతుల పరిమాణము గల తెల్లనీ లేదా ఎర్రని పద్మమును గీయవలెను. ఒక చేయి పరిమాణము గల పద్మమునకు కర్ణిక (దుద్దు) ఎనిమిది అంగుళములు ఉండవలెను (7), కేసరములు నాలుగు అంగుళముల పరిమాణములో రేకులు మొదలగు వాటిని కల్పించ వలెను. రెండు చేతుల పరిమాణము గల పద్మమునకు కర్ణిక మొదలగు వాటి పరిమాణము కూడ రెట్టింపు ఉండవలెను (8). మరల ఆ వేదికి ఈశాన్యమునందు ఒక చేయి లేక దానిలో సగము పరిమాణము గల మండలమును గీసి దానిని శోభను ఇనుమడింప జేసే సామగ్రితో అలంకరించ వలెను (9), ధాన్యము, బియ్యము, ఆవాలు, నువ్వులు, పువ్వులు మరియు దర్భలు అను వాటితో దానిని కప్పి, దానిపై శుభలక్షణములతో కూడిన శివకలశమును స్థాపించ వలెను .

**సౌవర్ణం రాజతం వాపి తామ్రజం మృన్మయం తు వా।**
**గంధపుష్పాక్షతాకీర్ణం కుశదూర్వాంకురాచితమ్ ॥**
**సితసూత్రావృతం కంఠే నవవస్త్ర యుగావృతమ్ ।**
**శుద్ధాంబుపూర్ణముత్కూర్చం సద్రవ్యం సవిధానకమ్ ॥**
**భృంగారం వర్ధనీం చాపి శంఖం చ చక్రమేవ వా ।**
**వినా సూత్రాదికం సర్వం పద్మపత్రమథాపి వా ॥**
**తస్యాసనారవిందస్య కల్పయేదుత్తరే దలే।**
**అగ్రతశ్చందనాంభో భిరస్త్ర రాజస్య వర్ధనీమ్ ॥**
**మండలస్య తతః ప్రాచ్యాం మంత్రకుంభే చ పూర్వవత్ ।**
**కృత్వా విధివదీశస్య మహాపూజాం సమాచరేత్ ॥**
**అథార్ణవస్య తీరే వా నద్యాం గోష్ఠేఽపి వా గిరౌ ।**
**దేవాగారే గృహే వాపి దేశేఽన్యస్మిన్మనోహరే ॥**
**కృత్వా పూర్వోదితం సర్వం వినా వా మండపాదికమ్ ।**
**మండలం పూర్వవత్కృత్వా స్థండిలం చ విభావసోః ॥**
**ప్రవిశ్య పూజాభవనం ప్రహృష్టవదనో గురుః ।**
**సర్వమంగల సంయుక్తస్సమాచరితనైత్యకః ॥**
**మహాపూజాం మహేశస్య కృత్వా మండలమధ్యతః ।**
**శివకుంభే తథా భూయశ్శివమావాహ్య పూజయేత్ ॥**

అది బంగారు, వెండి, రాగి లేదా మట్టి కలశము కావచ్చును. దానికి గంధమును పూసి, పుష్పములను, అక్షతలను, దర్భలను మరియు దూర్వాంకురములను అలంకారము కొరకై దానిలో వేసి (11), దానికి కంఠములో తెల్లని దారమును చుట్టి, రెండు నూతనవస్త్రములతో కప్పి, స్వచ్ఛమైన నీటితో నింపి, దర్భకట్టను కొనలు పైకి ఉండునట్లు దానియందు వేసి, దానియందు పవిత్రద్రవ్యములను (బంగారము మొదలైనవి) వేసి, కప్పి యుంచవలెను (12), ఝరీ, వర్ధని (ఒక ప్రత్యేకమగు నీటి పాత్ర), శంఖము, చక్రము, పద్మపత్రములు అను వాటిని అన్నింటినీ పద్మరూపములో నున్న ఆ ఆసనముయొక్క ఉత్తరదళమునందు అమర్చుకొన వలెను. సూత్రము మొదలగునవి అక్కర లేదు. దానికి ఎదురుగా అస్త్ర

రాజము కొరకై గంధపు నీటితో నింపిన వర్ధనిని ఉంచవలెను ( 13, 14). తరువాత మండలమునకు తూర్పునందు పైన చెప్పిన విధముగనే మంత్రకలశమును యథావిధిగా స్థాపించి ఈశ్వరునకు మహాపూజను చేయవలెను (15). తరువాత సముద్రతీరము, నది, గోశాల, పర్వతము, దేవాలయము లేదా ఇల్లు అనే ఏదో ఒక స్థానమునందు గాని, లేదా మరియొక సుందరప్రదేశమునందు గాని (16), మండపనిర్మాణము మొదలగు వాటిని మినహాయించి మిగిలిన సర్వమును పైన చెప్పిన విధముగానే చేసి, మరల మండపమును మరియు అగ్ని కొరకు వేదిని పైన చెప్పిన విధముగా నిర్మించవలెను (17). మహానందముతో ప్రకాశించే ముఖము గల గురువు నిత్యకర్మలను పూర్తి చేసుకొని మంగళ ద్రవ్యములను అన్నింటినీ పట్టుకొని పూజాభవనమును ప్రవేశించి (18), మహేశ్వరుని మహాపూజను చేసి, మండలమధ్యమునందలి శివకలశమునందు మరల అదే విధముగా శివుని ఆవాహన చేసి పూజించ వలెను.

**పశ్చిమాభిముఖం ధ్యాత్వా యజ్ఞరక్షకమీశ్వరమ్ ।**

**అర్చయేదస్త్రవర్ధన్యామస్త్ర మీశస్య దక్షిణే ॥**

**మంత్ర కుంభే చ విన్యస్య మంత్రం మంత్రవిశారదః ।**

**కృత్వా ముద్రాదికం సర్వం మంత్రయాగం సమాచరేత్ ॥**

**తతశ్శివానలే హోమం కుర్యాద్దేశికసత్తమః ।**

**ప్రధానకుండే పరితో జుహుయుశ్చాపరే ద్విజాః ॥**

**ఆచార్యాత్పాదమతం వాహోమస్తేషాం విధీయతే ।**

**ప్రధానకుండ ఏవాథ జుహుయాద్దేశికోత్తమః ॥**

**స్వాధ్యాయమపరే కుర్యుః స్తోత్రం మంగలవాచనమ్ ।**

**జపం చ విధివచ్చాన్యే శివభక్తిపరాయణాః ॥**

**నృత్యం గీతం చ వాద్యం చ మంగలాన్యపరాణి చ।**

**పూజనం చ సదస్యానాం కృత్వా సమ్యగ్విధానతః ॥**

**పుణ్యాహం కారయిత్వాథ పునస్సంపూజ్య శంకరమ్ ।**

**ప్రార్థయేద్దేశికో దేవం శిష్యానుగ్రహకామ్యయా ॥**

**ప్రసీద దేవదేశ దేహమావిశ్య మామకమ్ ।**

**విమోచయైనం విశ్వేశ ఘృణయా చ ఘృణానిధే ॥**

పశ్చిమము వైపునకు తిరిగి కూర్చుండి యజ్ఞమును రక్షించే ఈశ్వరుని ధ్యానించి, అస్త్రమునకు సంబంధించిన వర్ధనీపాత్రలో దక్షిణమునందు ఈశ్వరుని అస్త్రమును పూజించవలెను. (20). మంత్రశాస్త్రములో దిట్టయగు ఆ గురువు మంత్రకలశములో మంత్రన్యాసమును చేసి, ముద్రలు మొదలగు వాటిని అన్నింటిని చేసి, మంత్రయాగమును చక్కగా చేయవలెను (21). తరువాత ఆ గురుశ్రేష్ఠుడు ప్రధానకుండములోని శివాగ్నియందు హోమమును చేయవలెను. మిగిలిన బ్రాహ్మణులు దాని చుట్టూ కూర్చుండి హోమమును చేయుదురు (22). ఆచార్యుడు చేసే హోమములలో సగము గాని, నాల్గవ వంతు గాని వారు చేయవలెనని విధించ

బడినది. ఆ గురు శ్రేష్ఠుడు ప్రధానకుండములో మాత్రమే హోమమును చేయవలెను (23). శివభక్తి నిరతులగు కొందరు వేదపారాయణమును, కొందరు స్తోత్రపఠనమును, మరి కొందరు మంగళవాచనమును, ఇంకొందరు జపమును యథావిధిగా చేయవలెను (24). నృత్య గీతవాద్యములను, ఇతరములగు మంగళములను చేయించి, సభాసదులను చక్కని విధానముతో పూజించి (25), తరువాత పుణ్యాహవాచనమును చేయించి, గురువు మరల శంకరుని పూజించి శిష్యుని అనుగ్రహింప జేసే కోరికతో ఆ దేవుని ప్రార్థించ వలెను (26). ఓ దేవ దేవా! ఈశ్వరా! విశ్వేశ్వరా! దయానిధీ! నీవు ప్రసన్నుడవై దయతో నా దేహములో ప్రవేశించి వీనికి ముక్తిని ఇమ్ము .

**అథ చైవం కరోమీతి లబ్ధానుజ్ఞస్తు దేశికః।**
**ఆనీయోపోషితం శిష్యం హవిష్యాశినమేవ వా ॥**
**ఏకాశనం వా విరతం స్నాతం ప్రాతఃకృతక్రియమ్ ।**
**జపంతం ప్రణవం దేవం ధ్యాయంతం కృతమంగలమ్ ॥**
**ద్వారస్య పశ్చిమస్యాగ్రమండలే దక్షిణస్య వా ।**
**దర్భాసనే సమాసీనం విధాయోదఙ్ముఖం శిశుమ్ ॥**
**స్వయం ప్రాగ్వదనస్తిష్ఠన్నూర్ధ్వకాయం కృతాంజలిమ్ ।**
**సంప్రోక్ష్య ప్రోక్షణీ తోయై ర్మూర్ధన్య స్త్రేణ ముద్రయా ॥**
**పుష్ప క్షేపేణ సంతాడ్య బధ్నీయాల్లోచనం గురుః ।**
**దుకూలార్ధేన వస్త్రేణ మంత్రితేన నవేన చ ॥**
**తతః ప్రవేశయేచ్ఛిష్యం గురుర్ద్వారేణ మండలమ్ ।**
**సోఽపి తేనేరితశ్శంభో రాచరేత్త్రిః ప్రదక్షిణమ్ ॥**
**తతస్సువర్ణసంమిశ్రం దత్త్వా పుష్పాంజలిం ప్రభో।**
**ప్రాఙ్ముఖశ్చోదఙ్ముఖో వా ప్రణమేద్దండవత్ క్షితౌ ॥**
**తతస్సంప్రోక్ష్య మూలేన శిరస్య స్త్రేణ పూర్వవత్ ।**
**సంతాడ్య దేశికస్తస్య మోచయేన్నేత్ర బంధనమ్ ॥**
**స దృష్ట్వా మండలం భూయః ప్రణమేత్సాంజలిః ప్రభుమ్ ।**
**అథాసీనం శివాచార్యో మండలస్య తుదక్షిణే ॥**
**ఉపవేశ్యాత్మనస్సవ్యే శిష్యం దర్భాసనే గురుః।**
**ఆరాధ్య చ మహాదేవం శివహస్తం ప్రవిన్యసేత్ ॥**

ఆ తరువాత ఈ విధముగా చేసెదనని ఈశ్వరుని అనుమతిని పొంది ఆచార్యుడు శిష్యుని తీసుకు రావలెను. ఆతడు ఉపవాసమును చేసి ఉండవలెను. లేదా, హవిస్సును భుజించ వచ్చును (28). ఒక పూట మాత్రమే భోజనము చేసే అలవాటు గల ఆ శిష్యుడు విరక్తుడై ఉండి, స్నానమును చేసి ప్రాతః కాలీనములగు నిత్యకర్మలను చేసి ఓంకారమును జపిస్తూ శివుని ధ్యానిస్తూ ఉండవలెను. ఆతడు మంగళకృత్యములను చేసి ఉండవలెను (29). ద్వారమునకు పశ్చిమమునందు గాని, దక్షిణమునందు గాని మండలమునకు ఎదురుగా ఆ పిల్ల వాని వంటి శిష్యుని

ఉత్తరాభిముఖముగా దర్భాసనమునందు కూర్చుండబెట్టి (30), గురువు తాను తూర్పు ముఖముగా నుండవలెను. గురువు చేతులను జోడించి నిటారుగా కూర్చుండి యున్న శిష్యుని తలపై ప్రోక్షణిపాత్రలోని నీటిని చల్లి, అస్త్రముద్రతో పూలను విసిరి కొట్టవలెను. తరువాత గురువు మంత్రించిన కొత్త వస్త్రమును సగమునకు చింపి ఆ శకలముతో శిష్యుని కళ్లకు గంత కట్టవలెను (31,32). తరువాత గురువు శిష్యుని ద్వారము గుండా మండలము లోనికి ప్రవేశ పెట్ట వలెను. ఆ శిష్యుడు కూడా గురువుయొక్క ప్రేరణను అనుసరించి మూడు సార్లు శివునకు ప్రదక్షిణమును చేయవలెను (33). తరువాత అతడు శివప్రభువునకు బంగారముతో కలిసియున్న దోసెడు పూవులను సమర్పించి, తూర్పు ముఖముగా గాని ఉత్తరముఖముగా గాని సాష్టాంగప్రణామమును చేయవలెను (34). తరువాత గురువు శిష్యుని తలపై మూలమంత్రముతో నీటిని చల్లి, పైన చెప్పిన విధముగా అస్త్రమంత్రముతో కొట్టి వాని కళ్లకు కట్టిన గంతను విప్పవలెను (35). ఆ శిష్యుడు మరల మండలమును చూచి చేతులను జోడించి శివప్రభువునకు, కూర్చుండియున్న గురువునకు నమస్కరించ వలెను. తరువాత శివస్వరూపుడగు ఆ గురువు మండలమునకు దక్షిణమునందు తనకు ఎడమవైపు శిష్యుని దర్భాసనముపై కూర్చుండబెట్టి, మహాదేవుని ఆరాధించి, శివుని తేజస్సుతో గూడియున్న తన చేతిని ఆతని తలపై పెట్టవలెను.

శివతేజోమయం పాణిం శివ మంత్రముదీరయేత్ ।
శివాభిమానసంపన్నో న్యసేచ్ఛిష్యస్య మస్తకే ॥
సర్వాంగాలంబనం చైవ కుర్యాత్తేనైవ దేశికః ।
శిష్యోఽపి ప్రణమేద్భూమౌ దేశికాకృతిమీశ్వరమ్ ॥
తతశ్శివానలే దేవం సమభ్యర్చ్య యథావిధి ।
హుతాహుతిత్రయం శిష్యముపవేశ్య యథా పురా ॥
దర్భాగ్రైస్సంస్పృశంస్తం చ విద్యయాత్మానమావిశేత్ ।
నమస్కృత్య మహాదేవం నాడీసంధానమాచరేత్ ॥
శివశాస్త్రోక్తమార్గేణ కృత్వా ప్రాణస్య నిర్గమమ్ ।
శిష్యదేహప్రవేశం చ స్మృత్వా మంత్రాంస్తు తర్పయేత్ ॥
సంతర్పణాయ మూలస్య తేనైవాహుతయో దశ।
దేయాస్త్రి ప్రస్తథాంగానామంగైరేవ యథాక్రమమ్ ॥
తతః పూర్ణాహుతిం దత్వా ప్రాయశ్చిత్తాయ దేశికః ।
పునర్దశాహుతీన్ కుర్యాన్మూలమంత్రేణ మంత్రవిత్ ॥
పునస్సంపూజ్య దేవేశం సమ్యగాచమ్య దేశికః ।
హుత్వా చైవ యథాన్యాయం స్వజాత్యా వైశ్యముద్ధరేత్ ॥
తస్యైవం జనయేత్ క్షాత్రముద్ధారం చ తతః పునః ।
కృత్వా తథైవ విప్రత్వం జనయేదస్య దేశికః ॥
రాజన్యం చైవముద్ధృత్య కృత్వా విప్రం పునస్తయోః ।
రుద్రత్వం జనయే ద్విప్రే రుద్రనామ్నైవ సాధయేత్ ॥

నేను శివుడను అనే జ్ఞానముతో గూడియున్న గురువు శివుని తేజస్సుతో నిండి యున్న తన చేతిని శిష్యుని శిరస్సుపై నుంచి, శివమంత్రమును ఉచ్చరించ వలెను (38). గురువు అదే చేతితో శిష్యుని శరీరావయవములను అన్నింటినీ స్పృశించ వలెను. శిష్యుడు కూడ గురువు రూపములో నున్న శివునకు సాష్టాంగప్రణామము నాచరించ వలెను (39). తరువాత శివాగ్నియందు యథావిధిగా ఈశ్వరుని చక్కగా పూజించి మూడు ఆహుతులను ఇచ్చియున్న శిష్యుని కూర్చుండబెట్టి, గురువు పైన చెప్పిన విధముగనే (40) దర్భ కొనలతో అతనిని స్పృశిస్తూ, ఉపాసనచే తనను అతనియందు ఆవేశింప జేయవలెను. మరియు మహాదేవుని నమస్కరించి నాడీసంధానమును చేయవలెను (41). శివశాస్త్రములో చెప్పిన విధముగా ప్రాణమును బయటకు తీసుకువచ్చి, శిష్య దేహములో ప్రవేశించినట్లుగా భావన చేసి, మంత్రములను తర్పణ చేయవలెను (42). మూలమంత్రము యొక్క తర్పణ కొరకై దానినే ఉచ్చరిస్తూ పది ఆహుతులను, అంగమంత్రముల తర్పణ కొరకై వాటితోనే వరుసగా మూడు ఆహుతులను ఈయవలెను (43). తరువాత మంత్రవేత్త యగు గురువు పూర్ణాహుతిని ఇచ్చి, ప్రాయశ్చిత్తము కొరకై మరల మూలమంత్రముతో పది ఆహుతులను ఈయవలెను (44). గురువు మరల దేవదేవుని చక్కగా పూజించి ఆచమనమును చేసి హోమమును చేసి, శాస్త్రములో చెప్పిన విధముగా వైశ్యుడగు శిష్యుని తన జాతినుండి పైకి తీసుకు రావలెను (45). ఈ విధముగా గురువు వానిని క్షత్రియజాతిలోనికి ఉద్ధరించి, తరువాత వానికి అదే విధానములో బ్రాహ్మణత్వమును కలిగించ వలెను (46). క్షత్రియుని కూడ ఇదే విధముగా ఉద్ధరించి బ్రాహ్మణునిగా చేసి, మరల వారిద్దరికి రుద్రత్వమును కలిగించ వలెను. బ్రాహ్మణునియందు కేవలము రుద్రనామమును స్థాపించ వలెను.

**ప్రోక్షణం తాడనం కృత్వా శిశో స్స్వాత్మానమాత్మని ।**
**శివాత్మకమనుస్మృత్య స్ఫురంతం విస్ఫులింగవత్ ॥**
**నాడ్యా యథోక్తయా వాయుం రేచయేన్మంత్రతో గురుః ।**
**నిర్గమ్య ప్రవిశేన్నాడ్యా శిష్యస్య హృదయం తథా ॥**
**ప్రవిశ్య తస్య చైతన్యం నీలబిందునిభం స్మరన్।**
**స్వతేజసాపాస్తమలం జ్వలంతమనుచింతయేత్ ॥**
**తమాదాయ తయా నాడ్యా మంత్రీ సంహారముద్రయా ।**
**పూరకేణ నివేశ్యైనమేకీ భావార్థమాత్మనః ॥**
**కుంభ కేన తయా నాడ్యా రేచకేన యథా పురా ।**
**తస్మాదాదాయ శిష్యస్య హృదయే తన్నివేశయేత్ ॥**
**తమాలభ్య శివాల్లబ్ధం తస్మై దత్త్వోపవీతకమ్ ।**
**హుత్వాఽఽహుతిత్రయం పశ్చాద్దద్యాత్పూర్ణాహుతిం తతః ॥**
**దేవస్య దక్షిణే శిష్యముపవేశ్య వరాసనే ।**
**కుశపుష్పపరిస్తీర్ణే బద్ధాంజలిముదఙ్ముఖమ్ ॥**

**స్వస్తికాసనమారూఢం విధాయ ప్రాఙ్ముఖస్స్వయమ్ ।**

**వరాసనస్థితో మంత్రైర్మహామంగలనిస్స్వనైః ॥**

**సమాదాయ ఘటం పూర్ణం పూర్వమేవ ప్రసాదితమ్ ।**

**ధ్యాయమానశ్శివం శిష్యమభిషించేత దేశికః ॥**

**అథాపనుద్య స్నానాంబు పరిధాయ సితాంబరమ్ ।**

**ఆచాంతోలంకృతశ్శిష్యః ప్రాంజలిర్మండపం వ్రజేత్ ॥**

గురువు తన పుత్రునివంటి శిష్యునిపై నీటిని చల్లి కొట్టి, నిప్పు కణము వలె ప్రకాశించే శివస్వరూపమగు ఆతని ఆత్మ తన ఆత్మలో ప్రవేశించినట్లుగా భావన చేసి, పైన చెప్పిన విధముగా మంత్రపూర్వకముగా నాడీమార్గము గుండా గాలిని రేచకము (విడిచిపెట్టుట) చేయవలెను. ఆ నాడీ గుండా గురువు తాను బయటకు వచ్చి శిష్యుని హృదయమును ప్రవేశించ వలెను (48, 49). గురువు శిష్యునియందు ప్రవేశించి ఆతని చైతన్యమును నీలబిందువును పోలియున్న దానినిగా, తన తేజస్సుచే తొలగిన మాలిన్యములు గలదై ప్రకాశించుచున్న దానినిగా భావన చేయవలెను (50). మంత్రవేత్తయగు ఆ గురువు ఆ శిష్యుని చైతన్యమును తనతో ఐక్యము చేయుట కొరకై ఆ నాడిగుండా సంహారముద్రతో పూరకము (గాలిని లోపల నింపుట) ద్వారా లోపలికి తీసుకురావలెను (51). తరువాత కుంభకము (గాలిని లోపల నిలిపి యుంచుట) ను చేసి, అదే నాడి గుండా పైన చెప్పిన విధముగా రేచకమును చేసి, దానినుండి శిష్యుని చైతన్యమును పైకి తీసుకు వచ్చి వాని హృదయములో నుంచవలేను (52). తరువాత వానిని స్పృశించి శివుని నుండి లభించిన యజ్ఞోపవీతమును వానికి ఇచ్చి, మూడు ఆహుతులను హోమము చేసి, తరువాత పూర్ణాహుతినీ ఈయవలెను (53). గురువు తాను శ్రేష్ఠమగు ఆసనమునందు తూర్పు ముఖముగా నిలబడి, దేవునకు దక్షిణము నందు దర్భలు మరియు పుష్పములు పరచిన శ్రేష్ఠమగు ఆసనమునందు శిష్యుని ఉత్తరము ముఖముగా చేతులను కట్టుకుని ఉండునట్లుగా స్వస్తికాసనమునందు కూర్చుండబెట్టి, మంత్రములతో మరియు గొప్ప మంగళధ్వనులతో, అంతకు ముందే స్థాపన పూర్వకముగా పరమేశ్వరుని ప్రసాదరూపముగా సిద్ధము చేయబడి యున్న జలపూర్ణకలశమును తీసుకుని, శివుని ధ్యానిస్తూ, శిష్యుని అభిషేకించ వలెను (54-56). తరువాత శిష్యుడు ఆ స్నానపు నీటిని తుడుచుకొని, తెల్లని వస్త్రమును ధరించి, ఆచమనము చేసి, అలంకరించుకొని, చేతులను జోడించి మండపమును ప్రవేశించ వలెను .

**ఉపవేశ్య యథాపూర్వం తం గురుర్దర్భవిష్టరే ।**

**సంపూజ్య మండలే దేవం కరన్యాసం సమాచరేత్ ॥**

**తతస్తు భస్మనా దేవం ధ్యాయన్మనసి దేశికః ।**

**సమాలభేత పాణిభ్యాం శిశుం శివముదీరయేత్ ॥**

**అథ తస్య శివాచార్యో దహనప్లావనాదికమ్ ।**

**సకలీకరణం కృత్వా మాతృకాన్యాసవర్త్మనా ॥**

తతశ్శివాసనం ధ్యాత్వా శిష్యమూర్ధని దేశికః ।
తత్రావాహ్య యథాన్యాయమర్చయేన్మనసా శివమ్ ॥
ప్రార్థయే త్ప్రాంజలిర్దేవం నిత్యమత్ర స్థితో భవ ।
ఇతి విజ్ఞాప్య తం శంభోస్తేజసా భాసురం స్మరేత్ ॥
సంపూజ్యాథ శివం శైవీమాజ్ఞాం ప్రాప్య శివాత్మికామ్ ।
కర్ణే శిష్యస్య శనకైశివమంత్రము దీరయేత్ ॥
స తు బద్ధాంజలిః శ్రుత్వా మంత్రం తద్గతమానసః ।
శనైస్తం వ్యాహరేచ్ఛిష్యశ్శివాచార్యస్య శాసనాత్ ॥
తతశ్శాక్తం చ సందిశ్య మంత్రం మంత్రవిచక్షణః।
ఉచ్చారయిత్వా చ సుఖం తస్మై మంగలమాదిశేత్ ॥
తతస్సమాసాన్మంత్రార్థం వాచ్యవాచకయోగతః ।
సమాదిశ్యేశ్వరం రూపం యోగమాసనమాదిశేత్ ॥
అథ గుర్వాజ్ఞయా శిష్యశ్శివాగ్ని గురుసన్నిధౌ।
భక్త్యైవమభిసంధాయ దీక్షావాక్యముదీరయేత్ ॥

పైన చెప్పిన విధముగా గురువు దర్భాసనమునందు వానిని కూర్చుండబెట్టి, మండలమునందు దేవుని పూజించి, కరన్యాసమును చేయవలెను (58). తరువాత గురువు దేవుని మనస్సులో ధ్యానిస్తూ రెండు చేతులలో భస్మను తీసుకొని తన పుత్రుని వంటి శిష్యుని స్పృశిస్తూ శివమంత్రమును ఉచ్చరించ వలెను (59). తరువాత శివస్వరూపుడగు గురువు వానికి మాతృకాన్యాసపద్ధతితో దహనము, ప్లావనము మొదలైన సకలీకరణక్రియను చేయవలెను (60). తరువాత గురువు శిష్యుని శిరస్సుపై శివుని ఆసనమును భావన చేసి, దాని యందు యథాశాస్త్రముగా శివుని ఆవాహన చేసి, మానసపూజను చేయవలెను (61). ఆయన చేతులను జోడించి దేవుని ప్రార్థించి, సర్వదా ఇచట స్థిరముగా నుండుమని విన్నవించి, ఆశిష్యుని శివతేజస్సుతో ప్రకాశించుచున్న వానినిగా భావన చేయవలెను (62). తరువాత శివుని చక్కగా పూజించి శక్తిస్వరూపమేయగు శివుని ఆజ్ఞను పొంది, శిష్యునీ చెవిలో మెల్లగా శివమంత్రమును చెప్పవలెను (63). ఆ శిష్యుడు చేతులను జోడించుకొని మంత్రముపై మనసును పెట్టి విని శివరూపములోనున్న ఆచార్యుని ఆజ్ఞచే దానిని మెల్లగా ఉచ్చరించవలెను.(64). తరువాత మంత్రకోవిదుడగు గురువు వానికి శక్తిమంత్రమును కూడ ఉపదేశించి, సులభముగా ఉచ్చరించునట్లు చేసి, మంగళాశీస్సులను ఈయవలెను (65). తరువాత మంత్రమునకు శివునితో గల వాచ్యవాచకసంబంధపురస్సరముగా మంత్రార్థమును సంక్షేపముగా బోధించి, ఈశ్వరస్వరూపమును మరియు యోగాసనమును బోధించవలెను (66). తరువాత శిష్యుడు గురువుయొక్క ఆజ్ఞచే శివుడు, అగ్ని, గురువు అను వారి సన్నిధిలో భక్తిపూర్వకముగా దీక్షావాక్యమును పలుకుతూ ఇట్లు ప్రతిజ్ఞను చేయవలెను .

వరం ప్రాణపరిత్యాగశ్ఛేదనం శిరసో ఽపి వా ।
న త్వనభ్యర్చ్య భుంజీయ భగవంతం త్రిలోచనమ్ ॥
స ఏవ దద్యాన్నియతో యావన్మోహవిపర్యయః ।
తావదారాధయేద్దేవం తన్నిష్ఠస్తత్పరాయణః ॥
తతస్స సమయో నామ భవిష్యతి శివాశ్రమే ।
లబ్ధాధికారో గుర్వాజ్ఞాపాలకస్తద్వశో భవేత్ ॥
అతః పరం న్యస్తకరో భస్మాదాయ స్వహస్తతః ।
దద్యాచ్ఛిష్యాయ మూలేన రుద్రాక్షం చాభిమంత్రితమ్ ॥
ప్రతిమా వాపి దేవస్య గూఢదేహమథాపి వా ।
పూజాహోమజపధ్యానసాధనాని చ సంభవే ॥
సోఽపి శిష్యశ్శివాచార్యాల్లబ్ధాని బహుమానతః।
ఆదదీతాజ్ఞయా తస్య దేశికస్య న చాన్యథా ॥
ఆచార్యాదాప్తమఖిలం శిరస్యాధాయ భక్తితః ।
రక్షయేత్పూజయేచ్ఛంభుం మఠే వా గృహ ఏవ వా ॥
అతః పరం శివాచారమాదిశేదస్య దేశికః ।
భక్తి శ్రద్ధానుసారేణ ప్రయాశ్చానుసారతః ॥
యదుక్తం యత్సమాజ్ఞాతం యచ్చైవాన్య త్ప్రకీర్తితమ్ ।
శివాచార్యేణ సమయే తత్సర్వం శిరసా వహేత్ ॥
శివాగమస్య గ్రహణం వాచనం శ్రవణం తథా ।
దేశికాదేశతః కుర్యాన్న స్వేచ్ఛా న చాన్యతః ॥
ఇతి సంక్షేపతః ప్రోక్తస్సంస్కారస్సమయాహ్వయః ।
సాక్షాచ్ఛివపురప్రాప్తౌ నృణాం పరమసాధనమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శివసంస్కార
విధివర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥

ముక్కంటి భగవానుని పూజించకుండగా భోజనమును చేయుటకంటె తలను నరుకుకొని ప్రాణములను వీడుటయే శ్రేష్ఠము. కావున, నేను అట్లు చేయను (68). మోహము దూరమై జ్ఞానము కలుగునంతవరకు సాధకుడు ఆ దేవుని మాత్రమే ఆశ్రయించి ఆయన యందు నిష్ఠ గలవాడై నియమపూర్వకముగా ఆరాధించవలెను. సర్వమును ఆయనయే ఇచ్చును (69). అట్లు చేసినచో, ఆతనికి శివశ్రమమునందు అధికారము లభించి, సమయ అనే పేరు వచ్చును. ఆతడు గురువుయొక్క ఆజ్ఞను పాలిస్తూ ఆయనకు వశుడై ఉండవలెను (70). తరువాత గురువు కరన్యాసమును చేసి, తన చేతితో భస్మను తీసుకొని, మూలమంత్రముతో అభిమంత్రించిన రుద్రాక్షతో సహా దానిని శిష్యునకు ఈయవలెను (71). శివుని ప్రతిమను గాని, లేదా శివుని రహస్యశరీరమగు లింగమును గాని, వీలైనంత వరకు పూజ హోమము జపము ధ్యానము అను వాటికి ఉపయోగించే పరికరములను కూడ ఈయవలెను (72). ఆ శిష్యుడు కూడ ఆ గురువుయొక్క ఆజ్ఞచే ఆయన వలన లభించిన వస్తువులను సాదరముగా స్వీకరించ వలెనే గాని, వాటిని నిరాదరణ చేయరాదు (73). ఆచార్యుని నుండి లభించిన సర్వమును భక్తితో తలపై నిడుకొని తీసుకువెళ్లి భద్రము చేయవలెను. శంభుని మఠములో గాని, ఇంటిలోననే గాని పూజించవలెను (74). ఆ తరువాత గురువు వీనికి భక్తి శ్రద్ధలకు మరియు ప్రజ్ఞకు అనురూపముగా శివాచారమును ఉపదేశించవలెను (75). శివస్వరూపుడగు ఆచార్యుడు సమయాచారవిషయములో ఇంకనూ దేనిని చెప్పి కీర్తించి చక్కగా ఆజ్ఞాపించినాడో, దానినంతనూ శిష్యుడు శిరసా వహించవలెను (76). ఆతడు గురువుయొక్క ఆదేశముతో మాత్రమే శివాగమమును స్వీకరించుట, ప్రవచించుట మరియు వినుట అను పనులను చేయవలెను. తన ఇచ్ఛచే గాని, ఇతరుల ప్రోత్సాహముతో గాని చేయరాదు (77). ఈ విధముగా సమయ అను పేరు గల సంస్కారమును నేను సంక్షేపముగా చెప్పితిని. మానవులు సాక్షాత్తుగా శివధామమును పొందుటకు ఇది సర్వోత్కృష్టమైన సాధనము.

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శివసంస్కారవిధిని వర్ణించే పదునారవ అధ్యాయము ముగిసినది .

# 17 – షడధ్వ శోధన విధి

ఉపమన్యురువాచః

అతః పరం సమావేక్ష్య గురుశ్శిష్యస్య యోగ్యతామ్ ।
షడధ్వశుద్ధిం కుర్వీత సర్వబంధవిముక్తయే ॥
కలాం తత్త్వం చ భువనం వర్ణం పదమతః పరమ్ ।
మంత్రశ్చేతి సమా సేన షడధ్వా పరిపఠ్యతే ॥
నివృత్త్యాద్యాః కలాః పంచ కలాధ్వా కథ్యతే బుధైః ।
వ్యాప్తాః కలాభిరితరే త్వధ్వానః పంచ పంచభిః ॥
శివతత్త్వాదిభూమ్యంతం తత్త్వాధ్వా సముదాహృతః ।
షడ్వింశత్సంఖ్యోపేతశ్శుద్ధాశుద్ధో భయాత్మకః ॥
ఆధారాద్యున్మనాంతశ్చ భువనాధ్వా ప్రకీర్తితః ।
వినా భేదోపభేదాభ్యాం షష్టిసంఖ్యాసమన్వితః ॥
పంచాశద్రుద్రరూపాస్తు వర్ణా వర్ణాధ్వ సంజ్ఞితాః ।
అనేకభేదసంపన్నః పదాధ్వా సముదాహృతః ॥

ఉపమన్యువు ఇట్లు చెప్పెను --

శివసంస్కారకర్మ అయిన పిదప గురువు శిష్యుని యోగ్యతను పరిశీలించి, సకలబంధములనుండి విముక్తి కొరకై షడధ్వ (ఆరు మార్గముల) శుద్ధిని చేయవలెను (1). కళ, తత్త్వము, భువనము, వర్ణము, పదము, మంత్రము అనునవి సంగ్రహముగా ఆరు మార్గములు అని చెప్పబడినవి (2). నివృత్తి మొదలగు అయిదు కళలు కళాధ్వ అగునని పండితులు చెప్పుచున్నారు. మిగిలిన అయిదు అధ్వలు అయిదు కళలచే వ్యాపించబడి యున్నవి (3). శివతత్త్వముతో మొదలిడి భూమి వరకు తత్త్వాధ్వ అనబడును. శుద్ధము, అశుద్ధము అనే రెండు రకముల ఈ అధ్వలో ఇరవై ఆరు తత్త్వములు గలవు (4) ఆధారముతో మొదలిడి ఉన్మన వరకు గల అధ్వ భువనాధ్వ అని కీర్తించ బడినది. భేదములను అవాంతర భేదములను ఉపేక్షించినచో, దీనిలో అరవై మార్గములు గలవు (5). రుద్రరూపములగు ఏభై వర్ణములకు వర్ణాధ్వ అని పేరు. పదములే పదాధ్వ. దీనిలో అనేకభేదములు గలవు .

సర్వోపమంత్రైర్మంత్రాధ్వా వ్యాప్తః పరమవిద్యయా ।
యథా శివో న తత్త్వేషు గణ్యతే తత్త్వనాయకః ॥
మంత్రాధ్వని న గణ్యేత తథాసౌ మంత్రనాయకః ।
కలాధ్వనో వ్యాపకత్వం వ్యాప్యత్వం చేతరాధ్వనామ్ ॥
న వేత్తి తత్త్వతో యస్య నైవార్హత్యధ్వశోధనమ్ ।
షడ్విధస్యాధ్వనో రూపం న యేన విదితం భవేత్ ॥
వ్యాప్యవ్యాపకతా తేన జ్ఞాతుమేవ న శక్యతే ।
తస్మాదధ్వస్వరూపం చ వ్యాప్యవ్యాపకతాం తథా ॥

యథావదవగమ్యైవ కుర్యాదధ్వవిశోధనమ్ ।
కుండమండలపర్యంతం తత్ర కృత్వా యథా పురా ॥
ద్విహస్తమానం కుర్వీత ప్రాచ్యాం కలశమండలమ్ ।
తతస్స్నాతశ్శివాచార్యస్సశిష్యః కృతనైత్యకః ॥

ఉపమంత్రములన్నియు కలిసి మంత్రాధ్వ అగును. అది పరమవిద్యచే వ్యాపించబడి యున్నది. తత్త్వములకు ప్రభువు అగు శివుడు తత్త్వములలో లెక్కించబడడు. అదే విధముగా మంత్రములకు రాజగు పంచాక్షరవిద్య మంత్రాధ్వలో పరిగణించ బడదు. కళాధ్వ వ్యాపకము (ఇతరములగు అధ్వలయందు వ్యాపించునది) కాగా, మిగిలిన అధ్వలు వ్యాప్యములు (వ్యాపించ బడునవి) అగుచున్నవి (7,8). ఈ విషయము యథాతథముగా ఎవనికి తెలియదో, వాడు అధ్వశోధనమునకు అర్హుడు కాడు. ఎవనికి ఆరు విధముల మార్గముల స్వరూపము తెలియదో, వానికి వ్యాప్యవ్యాపకభావము తెలిసే ప్రసక్తియే లేదు. కావున, అధ్వల స్వరూపమును, వ్యాప్యవ్యాపకభావమును యథాతథముగా తెలుసుకొనియే అధ్వశో ధనమును చేయవలెను. ఇదివరలో చెప్పిన విధముగా, కుండము మండలము వరకు పూర్తి చేసి, తూర్పు దిక్కునందు రెండు చేతుల పరిమాణము గల కలశమండలమును చేయవలెను. తరువాత శివస్వరూపుడగు ఆచార్యుడు శిష్యునితో కలిసి స్నానమును చేసి, నిత్యకర్మలను చేసుకొన వలెను .

ప్రవిశ్య మండలం శంభోః పూజాం పూర్వవదాచరేత్ ।
తత్రాఢకావరైస్సిద్ధం తండులైః పాయసం ప్రభోః ॥
అర్ధం నివేద్య హోమార్థం శేషం సముపకల్పయేత్ ।
పురతః కల్పితే వాథ మండలే వర్ధమండితే ॥
స్థాపయేత్పంచ కలశాన్ దిక్షు మధ్యే చ దేశికః ।
తేషు బ్రహ్మాణి మూలార్ణైర్బిందునాదసమన్వితైః ॥
నమఆద్యైర్య కారాంతైః కల్పయేత్కల్పవిత్తమః ।
ఈశానం మధ్యమే కుంభే పురుషం పురతః స్థితే ॥
అఘోరం దక్షిణే వామే వామం సద్యం చ పశ్చిమే ।
రక్షాం విధాయ ముద్రాం చ బద్ధ్వా కుంభాభిమంత్రణమ్ ॥
కృత్వా శివానలైర్హోమం ప్రారభేత యథా పురా ।
యదర్ధం పాయసం పూర్వం హోమార్థం పరికల్పితమ్ ॥
హుత్వా శిష్యస్య తచ్ఛేషం భోక్తుం సముపకల్పయేత్ ।
తర్పణాంతం చ మంత్రాణాం కృత్వా కర్మ యథా పురా ॥
హుత్వా పూర్ణాహుతిం తేషాం తతః కుర్యాత్ప్రదీపనమ్ ।
ఓంకారాదను హుంకారం తతో మూలం ఫడంతకమ్ ॥
స్వాహాంతం దీపనే ప్రాహురంగాని చ యథాక్రమమ్ ।
తేషామహుతయస్తిస్రో దేయా దీపనకర్మణి ॥

ఆయన మండలమును ప్రవేశించి శివుని పూజను ఇదివరలో చెప్పిన విధముగా◌ా చేయవలెను. ఆ పూజలో ఇంచుమించు నాలుగు శేర్ల బియ్యముతో పరమాన్నమును సిద్ధము చేసి, శివప్రభునకు దానిలో సగమును నైవేద్యము పెట్టి, మిగిలిన సగమును హోమము కొరకు ఉంచుకొన వలెను. తరువాత గురువు తూర్పు వైపునకు నిర్మించబడిన, అనేకములగు రంగులతో అలంకరించ బడిన మండలమునందు నాలుగు దిక్కులలో మరియు మధ్యలో వెరసి అయిదు కలశములను స్థాపించవలెను. కల్పవేత్తలలో శ్రేష్ఠుడగు గురువు వాటియందు బిందువు మరియు నాదములతో కూడి, నమః అనే పదముతో మొదలై యకారముతో అంతమయ్యే మూలమంత్రము (ఓం నమశ్శివాయ) యొక్క వర్ణములతో పంచబ్రహ్మలను స్థాపించ వలెను. మధ్య కుంభములో ఈశానుని, తూర్పువైపు ఉన్న కుంభములో తత్పురుషుని, కుడివైపు అఘోరుని, ఎడమ వైపు వామదేవుని, పశ్చిమమునందు సద్యోజాతుని స్థాపించవలేను. రక్షలను కట్టి, ముద్రలను బంధించి, కలశములను అభిమంత్రించి, శివస్వరూపమగు అగ్ని యందు ఇదివరలో చెప్పిన విధముగా హోమమును అరంభించ వలెను. ఇదివరలో హోమము కొరకై భద్రము చేసిన సగము పాయసమును హోమము చేసి, దాని శేషమును శిష్యుడు భుజించుటకు భద్రము చేయవలెను. ఇదివరలో చెప్పిన విధముగా మంత్రముల తర్పణము వరకు కర్మను పూర్తి చేసి, పూర్ణాహుతి హోమము చేసి, తరువాత ప్రదీపనము అను కర్మను చేయవలెను. ఈ ప్రదీనకర్మలో ఓం నమః శివాయ ఫట్ స్వాహా అను మంత్రమునుచ్చరించి, హృదయము మొదలగు ఆరు అంగములకు (హృదయము, శిరస్సు, శిఖ, కవచము, నేత్రత్రయము, అస్త్రము) ఒక్కొక్క అంగమునకు మూడు ఆహుతులు చొప్పున ఈయవలెను .

**మంత్రైరేకైకశస్తైస్తు విచింత్యా దీపమూర్తయః ।**
**త్రిగుణం త్రిగుణీకృత్య ద్విజకన్యాకృతం సితమ్ ॥**
**సూత్రం సూత్రేణ సంమంత్ర్య శిఖాగ్రే బంధయేచ్ఛిశోః ।**
**చరణాంగుష్ఠపర్యంతమూర్ధ్వం కాయస్య తిష్ఠతః ॥**
**లంబయిత్వా తు తత్సూత్రం సుషుమ్నాం తత్ర యోజయేత్ ।**
**శాంతయా ముద్రయాదాయ మూలమంత్రేణ మంత్రవిత్ ॥**
**హుత్వాహుతిత్రయం తస్యాసాన్నిధ్యమను కల్పయేత్ ।**
**హృది సంతాడ్య శిష్యస్య పుష్పక్షేపేణ పూర్వవత్ ॥**
**చైతన్యం సముపాదాయ ద్వాదశాంతే నివేద్య చ ।**
**సూత్రం సూత్రేణ సంయోజ్య సంరక్ష్యాస్త్రేణ వర్మణా॥**
**అవగుంఠ్యాథ తత్సూత్రం శిష్యదేహం విచింతయేత్ ।**
**మూలత్రయమయం పాశం భోగభోగ్యత్వలక్షణమ్ ॥**
**విషయేంద్రియదేహాదిజనకం తస్య భావయేత్ ।**
**వ్యోమాదిభూతరూపిణ్యశ్శాంత్యతీతాదయః కలాః ॥**

సూత్రే స్వనామభిర్యోజ్యాః పూజ్యాశ్చైవ నమోయుతైః ।
అథవా బీజభూతైస్తత్కృత్వా పూర్వోదితం క్రమాత్ ॥
తతో మలాదేస్తత్త్వాదౌ వ్యాప్తిం సమవలోకయేత్ ।
కలావ్యాప్తిం మలాదౌ చ హుత్వా సందీపయేత్కలాః ॥
శిష్యం శిరసి సంతాడ్య సూత్రం దేహే యథాక్రమమ్ ।
శాంత్యతీతపదే సూత్రం లాంఛయేన్మంత్రముచ్చరన్ ॥
ఏవం కృత్వా నివృత్త్యంతం శాంత్యతీతమను క్రమాత్।
హుత్వాహుతిత్రయం పశ్చాన్మండలే చ శివం యజేత్ ॥

ఆ మంత్రములతో ఒక్కొక్కటిగా అంగములను ప్రకాశించే స్వరూపము గలవిగా భావన చేయవలెను. బ్రాహ్మణకన్యకచే త్రింపబడిన తెల్లని దారమును మూడు పేటలుగా పేనీ, మరల దానిని మూడు పేటలుగా చేసి ఆ సూత్రమును అభిమంత్రించి, ఒక కోనను పుత్రుని వంటి శిష్యుని పిలకయొక్క అగ్రభాగమునకు కట్టవలెను. శిష్యుడు తలను పైకెత్తి నిలబడగా ఆ సూత్రముయొక్క రెండవ కొన కాలి బొటనవ్రేలికి తగులునట్లుగా వ్రేలాడదీసి, దానిని సుషుమ్నానాడితో కలిపి ఉంచవలెను. మంత్రవేత్తయగు గురువు శాంతముద్రను పట్టి మూలమంత్రము ( ఓం నమశ్శివాయ) తో మూడు అహుతులను ఇచ్చి, ఆ నాడిని సూత్రములో ప్రవేశపెట్టవలెను. ఇదివరలో చెప్పిన విధముగా శిష్యుని హృదయముపై పుష్పమును విసిరి కొట్టి, జీవచైతన్యమును తీసుకొని పన్నెండు ఆహుతుల తరువాత శివునకు నివేదించి, వ్రేలాడే సూత్రమును మరియొక దారముతో దేహమునకు దగ్గరగా కట్టి, అస్త్ర కవచములతో (హుం ఫట్) చక్కటి రక్షణను కల్పించి, ఆ సూత్రమును కప్పి వుంచవలెను. శిష్యుని దేహము మూలప్రకృతియొక్క మూడు గుణములతో నిండిన పాశమనియు, భోగము మరియు భోగ్యత్వము దాని లక్షణములనియు, ఈ పాశమే విషయములను, ఇంద్రియములను, దేహము మొదలగువాటిని ఉత్పన్నము చేయుననియు భావన చేయవలెను. ఆకాశము మొదలగు అయిదు భూతములే రూపముగా గల శాంత్యతీత మొదలగు కళలను వాటి పేర్లకు నమః అను పదమును జోడించి, లేదా వాటి బీజాక్షరములను ఉచ్చరించి, ఆ సూత్రమునందు కలిపి పూజించవలెను. ఈ క్రమము ఇదివరలో చెప్పబడి యున్నది (22-29). తరువాత మలము మొదలగు పాశములు తత్త్వములు మొదలగు వాటి యందు వ్యాప్తిని చెంది యున్నట్లు, మరియు మలము మొదలగు పాశములయందు కళల వ్యాప్తిని భావన చేయవలెను. తరువాత హోమమును చేసి ఆ కళలను ప్రకాశింప జేయవలెను (30). శిష్యుని శిరస్సుపై కొట్టి, మూలమంత్రమును ఉచ్చరిస్తూ సూత్రమును దేహమునుండి క్రమమును అతిక్రమించకుండగా విడదీసి, శాంత్య తీతకళయొక్క స్థానమునందు అంకితము చేయవలెను (31). శాంత్యతీతము తరువాత ఇదే విధముగా నివృత్తి కళ వరకు చేసి, మూడు ఆహుతులను ఇచ్చి, తరువాత మండలమునందు శివుని పూజించ వలెను.

దేవస్య దక్షిణే శిష్యముపవేశ్యోత్తరాముఖమ్ ।
సదర్భే మండలే దద్యాద్ధోమశిష్టం చరుం గురుః ॥
శిష్యస్తద్గురుణా దత్తం సత్కృత్య శివపూర్వకమ్ ।
భుక్త్వా పశ్చాద్ద్విరాచమ్య శివమంత్రముదీరయేత్ ॥
అపరే మండలే దద్యాత్పంచగవ్యం తథా గురుః।
సోఽపి తచ్ఛక్తితః పీత్వా ద్విరాచమ్య శివం స్మరేత్ ॥
తృతీయే మండలే శిష్యముపవేశ్య యథా పురా ।
ప్రదద్యాద్దంతపవనం యథాశాస్త్రోక్తలక్షణమ్ ॥
అగ్రేణ తస్య మృదునా ప్రాఙ్ముఖో వాప్యుదఙ్ముఖః ।
వాచం నియమ్య చాసీనశ్శివ్యో దంతాన్విశోధయేత్ ॥
ప్రక్షాల్య దంతపవనం త్యక్త్వాచమ్య శివం స్మరేత్ ।
ప్రవిశేద్దేశికాదిష్టః ప్రాంజలిశ్శివమండలమ్ ॥
త్యక్తం తద్దంతపవనం దృశ్యతే గురుణా యది ।
ప్రాగుదక్పశ్చిమే వాగ్రే శివమన్యచ్ఛివేతరమ్ ॥
అప్రశస్తాశాముఖే తస్మిన్ గురుస్తద్దోషశాంతయే ।
శతమర్ధం తదర్ధం వా జుహుయాన్మూలమంత్రతః ॥
తతశ్శిష్యం సమాలభ్య జపిత్వా కర్ణయోశ్శివమ్ ।
దేవస్య దక్షిణే భాగే తం శిష్యమధివాసయేత్ ॥
అహతాస్తరణాస్తీర్ణే స దర్భశయనే శుచిః ।
మంత్రితేఽ తశ్శివం ధ్యాయన్ శయీత ప్రాక్ఛిరా నిశి ॥
శిఖాయాం బద్ధసూత్రస్య శిఖయా తచ్ఛిఖాం గురుః।
ఆబంధ్యాహతవస్త్రేణ తమాచ్ఛాద్య చ వర్మణా ॥
రేఖా త్రయం చ పరితో భస్మనా తిలసర్షపైః ।
కృత్వాస్త్ర జప్తైస్తద్బాహ్యే దిగీశానాం బలిం హరేత్ ॥
శిష్యోఽపి పరతోఽనశ్నన్ కృత్వైవమధివాసనమ్ ।
ప్రబుధ్యోత్థాయ గురవే స్వప్నం దృష్టం నివేదయేత్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే షడధ్వ
శోధన విధానవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥

దర్భలను పరచిన మండలమునందు దేవునకు దక్షిణమునందు గురువు శిష్యుని ఉత్తరాభిముఖముగా కూర్చుండబెట్టి, హోమములో మిగిలిన అన్నమును ఈయవలెను (33) . గురువుచే ఈయబడిన ఆ అన్నమును శిష్యుడు సాదరముగా సత్కరించి తీసుకొని భుజించి, తరువాత రెండు ఆచమనములను చేసి శివమంత్రమును ఉచ్చరించవలెను (34). అదే విధముగా గురువు మరియొక మండలములో పంచగవ్యమును ఈయవలెను. ఆ శిష్యుడు కూడ తన శక్తి మేరకు త్రాగి, రెండు ఆచమనములను చేసి, శివుని స్మరించవలెను (35). పైన చెప్పిన విధముగానే గురువు మూడవ మండలములో శిష్యుని కూర్చుండబెట్టి శాస్త్రములో చెప్పబడిన లక్షణములు గల పళ్లను తోముకొనే పుల్లను ఈయవలెను (36). శిష్యుడు తూర్పు ముఖముగా గాని, ఉత్తరముఖముగా గాని కూర్చుండి, మౌనమును పాటిస్తూ, దాని కొనను మెత్తగా చేసి, పళ్లను తోముకొనవలెను (37). ఆ పనుదోము పుల్లను కడిగి పారవేసి ఆచమనమును చేసి శివుని స్మరించవలెను. గురువు యొక్క అనుమతిని పొంది ఆతడు చేతులను జోడించి శివుని మండలమును ప్రవేశించవలెను (38). పారవేసిన ఆ పనుదోము పుల్లను గురువు తూర్పు, ఉత్తరము లేదా పశ్చిమమునందు తన యెదుట చూచినచో మంగళము కలుగును. దక్షిణములో చూచినచో, అమంగళము (35). గురువు దానిని ప్రశస్తము కాని దక్షిణ దిక్కులో చూచినచో, ఆ దోషమును శాంతింప జేయుటకే మూలమంత్రముతో వంద, లేక ఇరవై అయిదు ఆహుతులను ఈయవలెను (40). తరువాత గురువు శిష్యుని స్పృశించి చెవులు రెండింటిలో శివనామమును చెప్పి, దేవునకు దక్షిణభాగమునందు ఆతనిని కూర్చుండ బెట్టవలెను (41). రాత్రి యందు ఆ శిష్యుడు నూతనవస్త్రమును కప్పి అభిమంత్రించిన దర్భల శయ్యపై శుచిగా శివుని మనస్సులో ధ్యానిస్తూ తూర్పు వైపు తలను పెట్టుకొని పరుండవలెను (42), శిఖయందు కట్టబడిన సూత్రము గల ఆ శిష్యుని శిఖను గురువు శిఖతోనే బంధించి, హుం అని ఉచ్చరించి నూతనవస్త్రమును వానిపై కప్పి వాని చుట్టూ ఫట్ అని ఉచ్చరిస్తూ భస్మ, నువ్వులు మరియు ఆవాలతో మూడు గీతలను గీసి, వాటికి బయట దిక్పాలకులకు ఆహారమును ఈయవలెను (43,44). శిష్యుడు కూడ మరియొకరినుండి ఆహారమును స్వీకరించకుండగా ఈ విధముగా అచట నిద్రించి తెలివి వచ్చిన తరువాత లేచి గురువునకు తాను కలలో చూచిన విషయములను విన్నవించ వలెను.

శ్రీ శివమహాపురాణములో వాయవీయసంహితయందు ఉత్తరఖండలో షడధ్వ శోధనవిధిని వర్ణించే పదునేడవ అధ్యాయము ముగిసినది.

# 18 – తత్త్వ శోధనము – కళాస్వరూపము

ఉపమన్యురువాచ।

తతస్స్నానాదికం సర్వం సమాప్యాచార్యచోదితః ।
గచ్ఛేద్బద్ధాంజలిర్ధ్యాయన్ శివమండలపార్శ్వతః ॥
అథ పూజాం వినా సర్వం కృత్వా పూర్వదినే యథా ।
నేత్రబంధనపర్యంతం దర్శయేన్మండలం గురుః ॥
బద్ధనేత్రేణ శిష్యేణ పుష్పావకిరణే కృతే ।
యత్రాపతంతి పుష్పాణి తస్య నామాస్య సందిశేత్ ॥
తం చోపనీయ నిర్మాల్యమండలేఽస్మిన్ యథా పురా ।
పూజయేద్దేవమీశానం జుహుయాచ్చ శివానలే ॥
శిష్యేణ యది దుస్స్వప్నో దృష్టస్తద్దోషశాంతయే ।
శతమర్ధం తదర్ధం వా జుహుయాన్మూలవిద్యయా ॥
తతస్సూత్రం శిఖాబద్ధం లంబయిత్వా యథా పురా ।
ఆధారపూజాప్రభృతి యన్నివృత్తికలాశ్రయమ్ ॥
వాగీశ్వరీపూజనాంతం కుర్యాద్ధోమపురస్సరమ్ ।
అథ ప్రణమ్య వాగీశం నివృత్తేర్వ్యాపికాం సతీమ్ ॥
మండలే దేవమభ్యర్చ్య హుత్వా చైవాహుతిత్రయమ్ ।
ప్రాపయేచ్చ శిశోః ప్రాప్తిం యుగపత్సర్వయోనిషు ॥
సూత్రదేహేఽథ శిష్యస్య తాడన ప్రోక్షణాదికమ్ ।
కృత్వాత్మానం సమాదాయ ద్వాదశాంతే నివేద్య చ ॥
తతోఽస్యాదాయ మూలేన ముద్రయా శాస్త్రదృష్టయా ।
యోజయేన్మనసాచార్యో యుగపత్సర్వ యోనిషు ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను –

తరువాత శిష్యుడు స్నానము మొదలగు వాటిని అన్నింటినీ పూర్తిచేసుకొని ఆచార్యునిచే ఆదేశించ బడినవాడై చేతులను జోడించి శివుని మండలము ప్రక్కకు వెళ్లవలెను (1). తరువాత గురువు పూజను మినహాయించి మిగిలిన కర్మను అంతనూ కళ్లకు బంధమును కట్టే వరకు పూర్వదినమునందు వలెనే చేసి, వానికి మండలమును చూపించ వలెను (2). కళ్లకు బంధము కట్టబడి యున్న శిష్యుడు పుష్పములను విసరగా, అవి ఎక్కడ పడునో, అక్కడనే గురువు వానికి శివుని నామమును ఉపదేశించ వలెను (3). గురువు వానిని పూర్వమునందు వలెనే నిర్మాల్యమండలము వద్దకు తీసుకువచ్చి, ఈశానదేవుని పూజించి శివాగ్ని యందు హోమమును చేయవలెను (4). శిష్యుడు చెడు కలను చూచియున్నచో ఆ దోషము శాంతించుట కొరకై మూలమంత్రముతో వంద, లేక ఏభై, లేక ఇరవై అయిదు ఆహుతులను ఈయవలెను (5). తరువాత శిఖకు కట్టబడిన సూత్రమును ఇదివరలో వలెనే వ్రేలాడదీసి ఆధారశక్తి పూజతో మొదలిడి నివృత్తికళకు

ఆశ్రయమగు వాగీశ్వరి యొక్క పూజ వరకు హోమముతో సహా చేయవలెను. తరువాత వాగీశ్వరునకు, నివృత్తి కళను వ్యాపించియుండే సతీదేవికి నమస్కరించి, మూడు ఆహుతులను ఇచ్చి, పుత్రునివంటి శిష్యునకు ఒకేసారి సమస్త ప్రాణియోనులలో జన్మ లభించినట్లు భావన చేయవలెను (6-8). తరువాత గురువు సూత్రముతో కూడియున్న శిష్యుని దేహమునందు కొట్టుట, నీటిని చల్లుట మొదలగు సంస్కారములను చేసి, ఆతని ఆత్మను తీసుకొని, పన్నెండు దళముల హృదయపద్మమునందు గల శివునకు నివేదించి, శాస్త్రములో చెప్పబడిన ముద్రను చూపి మూలమంత్రముతో అక్కడ నుండి కూడ ఆ ఆత్మ చైతన్యమును భావనారూపముగా తీసుకొని, ఒకేసారి దానికి అన్ని ప్రాణియోనులతో సంబంధమును భావన చేయవలెను.

దేవానాం జాతయశ్చాష్టౌ తిరశ్చాం పంచ జాతయః ।
జాత్యైకయా చ మానుష్యా యోనయశ్చ చతుర్దశ ॥
తాసు సర్వాసు యుగపత్ప్రవేశాయ శిశోర్ధియా ।
వాగీశాన్యాం యథాన్యాయం శిష్యాత్మానం నివేశయేత్ ॥
గర్భనిష్పత్తయే దేవం సంపూజ్య ప్రణిపత్య చ ।
హుత్వా చైవ యథాన్యాయం నిష్పన్నం తదనుస్మరేత్ ॥
నిష్పన్నస్యైవముత్పత్తి మనువృత్తిం చ కర్మణా ।
ఆర్జవం భోగనిష్పత్తిః కుర్యాత్ప్రీతిం పరాం తథా ॥
నిష్కృత్యర్థం చ జాత్యాయుర్భోగ సంస్కారసిద్ధయే ।
హుత్వాహుతిత్రయం దేవం ప్రార్థయేద్దేశికోత్తమః ॥
భోక్తృత్వవిషయా సంగమలం తత్కాయశోధనమ్ ।
కృత్వైవమేవ శిష్యస్య ఛింద్యాత్పాశత్రయం తతః ॥
నికృత్యా పరిబద్ధస్య పాశస్యాత్యంతభేదతః ।
కృత్వా శిష్యస్య చైతన్యం స్వచ్ఛం మన్యేత కేవలమ్ ॥
హుత్వా పూర్ణాహుతిం వహ్నౌ బ్రహ్మాణం పూజయేత్తతః ।
హుత్వాహుతిత్రయం తస్మై శివాజ్ఞామనుసందిశేత్ ॥
పితామహ త్వయా నాస్య యాతుశ్చైవం పరం పదమ్ ।
ప్రతిబంధో విధాతవ్యశ్శైవాజ్ఞైషా గరీయసీ ॥
ఇత్యాదిశ్య తమభ్యర్చ్య విసృజ్య చ విధానతః ।
సమభ్యర్చ్య మహాదేవం జుహుయాదాహుతిత్రయమ్ ॥

దేవతల జాతులు ఎనిమిది, పశుపక్షులవి అయిదు, మనుష్య జాతి ఒకటి, వెరసి పదునాలుగు జాతులు గలవు (11). గురువు వాటిలో అన్నింటియందు ఒకే సారిగా శిష్యుని ఆత్మను భావనారూపముగా ప్రవేశపెట్టుట కొరకై యథాశాస్త్రముగా వాగీశ్వరీదేవియందు ప్రవేశ పెట్ట వలెను (12). ఆ గర్భము సఫలమగుట కొరకై దేవుని చక్కగా పూజించి నమస్కరించి, యథాశాస్త్రముగా ఆహుతులనిచ్చి, అది సఫలమైనట్లు భావన చేయవలెను (13). ఈ విధముగా

సఫలమైన ఆ గర్భమునకు ఉత్పత్తిని, కర్మానువృత్తిని వివిధ సేవల ద్వారా నిలబెట్టుట), సరళత్వము (ఇబ్బందులు కలుగకుండుట), భోగము లభ్యమగుట మరియు పరమ ప్రీతి అను వాటిని భావనారూపముగా సమకూర్చ వలెను (14). ఉత్తముడగు గురువు ఆ జీవుని ఉద్ధారము కొరకు, జాతకర్మ ఆయుష్కర్మ మరియు భోగసంస్కారము అనునవి సిద్ధించుట కొరకు మూడు ఆహుతులనిచ్చి దేవుని ప్రార్థించవలెను (15). తరువాత గురువు భోక్తృత్వము మరియు విషయ భోగముల యందలి ఆసక్తి అను మాలిన్యమును పోగొట్టి, కాయశుద్ధిని చేసి, శిష్యుని మూడు పాశములను నశింప జేయవలెను (16). అజ్ఞానముచే కలిగించబడిన బంధములను పూర్తిగా నశింప జేసి, శిష్యుని చైతన్యము పూర్ణముగా స్వచ్ఛమైనదని భావన చేయవలెను (17). తరువాత అగ్నియందు పూర్ణాహుతిని చేసి బ్రహ్మను పూజించవలెను. తరువాత ఆ బ్రహ్మగారికి మూడు ఆహుతులను సమర్పించి, శివుని ఆజ్ఞను వినిపించవలెను (18). ఓ పితామహా! శివుని పరమపదమునకు వెళ్లే ఈ జీవునకు ఆటంకమును కలిగించకుము. ఇది ఉత్కృష్టమగు శివుని ఆజ్ఞ (19) అని విన్నవించి, ఆయనను పూజించి, యథావిధిగా ఉద్వాసన చెప్పి, మహాదేవుని చక్కగా పూజించి, మూడు ఆహుతులను ఈయవలెను.

నివృత్త్యా శుద్ధముద్ధృత్య శిష్యాత్మానం యథా పురా ।
నివేశ్యాత్మని సూత్రే చ వాగీశం పూజయేత్తతః ॥
హుత్వాహుతిత్రయం తస్మై ప్రణమ్య చ విసృజ్య తమ్ ।
కుర్యాన్నివృత్తస్సంధానం ప్రతిష్ఠాకలయా సహ ॥
సంధానే యుగపత్పూజాం కృత్వా హుత్వాహుతిత్రయమ్ ।
శిష్యాత్మనః ప్రతిష్ఠాయాం ప్రవేశం త్వథ భావయేత్ ॥
తతః ప్రతిష్ఠామావాహ్య కృత్వా శేషం పురోదితమ్ ।
తద్వ్యాప్తిం వ్యాపికాం తస్య వాగీశానీం చ భావయేత్ ॥
పూర్ణేందుమండలప్రఖ్యాం కృత్వా శేషం చ పూర్వవత్ ।
విష్ణవే సంవిశేదాజ్ఞాం శివస్య పరమాత్మనః ॥
విష్ణోర్విసర్జనాద్యం చ కృత్వా శేషం చ విద్యయా ।
ప్రతిష్ఠామనుసంధాయ తస్యాం చాపి యథా పురా॥
కృత్వానుచింత్య తద్వ్యాప్తిం వాగీశాం చ యథాక్రమమ్ ।
దీప్తాగ్నౌ పూర్ణహోమాంతం కృత్వా శేషం చ పూర్వవత్ ॥
నీలరుద్రముపస్థాప్య తస్మై పూజాదికం తథా ।
కృత్వా కర్మ శివాజ్ఞాం చ దద్యాత్పూర్వోక్తవర్త్మనా ॥
తతస్తమపి చోద్వాస్య కృత్వా తస్యాథ శాంతయే ।
విద్యా కలాం సమాదాయ తద్వ్యాప్తిం చావలోకయేత్ ॥
స్వాత్మనో వ్యాపికాం తద్వద్వాగీశీం చ యథా పురా ।
బాలార్కసదృశాకారాం భాసయంతీం దిశో దశ ॥

నివృత్తి కళద్వారా పరిశుద్ధమైన శిష్యుని ఆత్మను పూర్వమునందు చెప్పిన విధముగా పైకి తీసి, తన ఆత్మయందు మరియు సూత్రమునందు ఉంచి, తరువాత వాగీశ్వరుని పూజించ వలెను (21). ఆయనకు మూడు ఆహుతులను ఇచ్చి, నమస్కరించి, ఉద్వాసనను చెప్పి అక్కడనుండి మరల వచ్చి, ప్రతిష్ఠాకళతో సాన్నిధ్యమును స్థాపించుకొన వలెను (22). సంధానము కలిగిన తరువాత ఒకసారి పూజను చేసి, మూడు ఆహుతులను ఇచ్చి, తరువాత శిష్యుని ఆత్మ ప్రతిష్ఠాకళయందు ప్రవేశించినట్లు భావన చేయవలెను (23). తరువాత ప్రతిష్ఠాకళను ఆవాహన చేసి, పూర్వములో చెప్పిన కర్మను అంతనూ చేసి, దాని వ్యాప్తిని, దానిని వ్యాపించియుండే, పూర్ణచంద్రునితో సమానమగు కాంతిగల వాగీశ్వరీదేవిని భావన చేయవలెను. మిగిలిన కర్మను పూర్వమునందు వలెనే చేసి, శివపరమాత్మ యొక్క ఆజ్ఞను విష్ణువునకు వినిపించవలెను (24, 25). విష్ణువునకు ఉద్వాసనను చెప్పుట మొదలగు మిగిలిన కర్మను పూర్తి చేసి, విద్యా కళతో ప్రతిష్ఠి కళను అనుసంధానము చేసి, ఆ విద్యా కళయందు కూడ పూర్వము నందు వలెనే చేసి, దాని వ్యాప్తిని మరియు వాగీశ్వరిని యథాక్రమముగా భావన చేసి, ప్రజ్వరిల్లే అగ్నియందు పూర్ణాహుతి వరకు మిగిలిన కర్మను పూర్తి చేయవలెను (26, 27). నీలరుద్రుని ప్రతిష్ఠించి, ఆయనకు పూజ మొదలగు కర్మను చేసి, పూర్వములో చెప్పిన మార్గములో శివాజ్ఞను వినిపించవలెను (28). తరువాత ఆయనకు కూడ ఉద్వాసనను చెప్పి, తరువాత శిష్యుని దోషములు శాంతించుట కొరకై విద్యాకళను స్వీకరించి దాని వ్యాప్తిని భావన చేయవలెను (29). అదే విధముగా పూర్వమునందు వలెనే తన ఆత్మను వ్యాపించునది ఉదయించే సూర్యుని పోలిన ప్రకాశము గలది, పది దిక్కులను ప్రకాశింప జేయునది అగు వాగీశ్వరిని ధ్యానించ వలెను .

**తతశ్శేషం యథాపూర్వం కృత్వా దేవం మహేశ్వరమ్ ।**
**ఆవాహ్యారాధ్య హుత్వాస్మై శివాజ్ఞాం మనసా దిశేత్ ॥**
**మహేశ్వరం తథోత్సృజ్య కృత్వాన్యాం చ కలామిమామ్ ।**
**శాంత్యతీతాం కలాం నీత్వా తద్వ్యాప్తిమవలోకయేత్ ॥**
**స్వాత్మనో వ్యాపికాం తద్వద్వాగీశాం చ విచింతయేత్।**
**నభోమండలసంకాశాం పూర్ణాంతం చాపి పూర్వవత్ ॥**
**కృత్వా శేషవిధానేన సమభ్యర్చ్య సదాశివమ్ ।**
**తస్మై సమాదిశేదాజ్ఞాం శంభోరమితకర్మణః ॥**
**తత్రాపి చ యథాపూర్వం శివం శిరసి పూర్వవత్ ।**
**సమభ్యర్చ్య చ వాగీశం ప్రణమ్య చ విసర్జయేత్ ॥**
**తతశ్శివేన సంప్రోక్ష్య శిష్యం శిరసి పూర్వవత్ ।**
**విలయం శాంత్యతీతాయాశ్శక్తితత్త్వేఽథ చింతయేత్ ॥**
**షడధ్వనః పరే పారే సర్వాధ్వవ్యాపినీం పరామ్ ।**
**కోటిసూర్య ప్రతీకాశాం శైవీం శక్తిం చ చింతయేత్ ॥**
**తదగ్రే శిష్యమనీయ శుద్ధస్ఫటికనిర్మలమ్ ।**
**ప్రక్షాల్య కర్తరీం పశ్చాచ్ఛివశాస్త్రోక్తమార్గతః ॥**

**కుర్యాత్తస్య శిఖాచ్ఛేదం సహ సూత్రేణ దేశికః।**

**తతస్తాం గోమయే న్యస్య శివాగ్నౌ జుహుయాచ్ఛిఖామ్ ॥**

**వౌషడంతేన మూలేన పునః ప్రక్షాల్య కర్తరీమ్ ।**

**హస్తే శిష్యస్య చైతన్యం తద్దేహే వినివర్తయేత్ ॥**

తరువాత మిగిలిన కర్మను పూర్వమునందు వలెనే చేసి, మహేశ్వర దేవుని ఆవాహన చేసి, పూజించి, ఆయనకు భావనారూపముగా శివుని ఆజ్ఞను వినిపించవలెను (31). అదే విధముగా మహేశ్వరునకు ఉద్వాసనము చెప్పి, మరియొకటి యగు శాంతి కళను శాంత్యతీతకళలోనికి తీసుకు వచ్చి, దాని వ్యాప్తిని భావన చేయవలెను (32). అదే విధముగా తన ఆత్మను వ్యాపించునది, ఆకాశమండలమును పోలియున్నది అగు వాగీశ్వరీదేవిని ధ్యానించవలెను. తరువాత పూర్ణాహుతి పూర్తి యగువరకు పూర్వములో వలెనే చేసి, మిగిలిన విధానముతో సదాశివుని చక్కగా పూజించి, అనంతమగు శక్తి గల శంభుని ఆజ్ఞను ఆయనకు వినిపించవలెను (33,34). అక్కడ కూడ పూర్వమునందు వలెనే శిష్యుని శిరస్సుపై వాగీశ్వరుని చక్కగా పూజించి, నమస్కరించి, ఉద్వాసన చెప్పవలెను (35), తరువాత పూర్వము నందు వలెనే శివనామముతో శిష్యుని శిరస్సునందు నీటిని చల్లి, శక్తితత్త్వమునందు శాంత్యతీతకళయొక్క విలీనమును ధ్యానించవలెను (36). ఆరు మార్గములకు అతీతమగు పరంబ్రహ్మాయందు ఉండునది, ఆరు మార్గములను వ్యాపించి యుండునది, కోటి సూర్యులను బోలియున్నది అగు శివుని పరాశక్తిని ధ్యానించవలేను (37), శుద్ధస్ఫటికము వలె నిర్మలుడైన శిష్యుని ఆ శక్తికి యెదురుగా తీసుకు వచ్చి, కత్తెరను కడిగి, తరువాత శివశాస్త్రములో చెప్పిన మార్గమునసుసరించి, గురువు వాని శిఖను సూత్రముతో సహా కత్తిరించ వలెను. తరువాత ఆ శిఖను గోమయములో నుంచి, ఓం నమశ్శివాయ వౌషట్ అను మంత్రముతో శివాగ్నియందు హోమము చేయవలెను. మరల కత్తెరను కడిగి, శిష్యుని చైతన్యమును చేతి ద్వారా ఆతని దేహములోనికి మరల ప్రవేశ పెట్టవలెను .

**తతస్స్నాతం సమాచాంతం కృతస్వస్త్యయనం శిశుమ్ ।**

**ప్రవేశ్య మండలాభ్యాశం ప్రణిపత్య చ దండవత్ ॥**

**పూజాం కృత్వా యథాన్యాయం క్రియావైకల్యశుద్ధయే ।**

**వాచకేనైవ మంత్రేణ జుహుయాదాహుతిత్రయమ్ ॥**

**ఉపాంశూచ్చారయోగేన జుహుయాదాహుతిత్రయమ్ ।**

**పునస్సంపూజ్య దేవేశం మంత్రవైకల్యశుద్ధయే ॥**

**మానసోచ్చారయోగేన జుహుయాదాహుతిత్రయమ్ ।**

**తత్ర శంభుం సమారాధ్య మండలస్థం సహాంబయా ।**

**హుత్వాహుతిత్రయం పశ్చాత్ప్రార్థయేత్ప్రాంజలిర్గురుః ॥**

**భగవంస్త్వత్ప్రసాదేన శుద్ధిరస్య షడధ్వనః ।**

**కృతా తస్మాత్పరం ధామ గమయైనం తవావ్యయమ్ ॥**

**ఇతి విజ్ఞాప్య దేవాయ నాడీసంధాన పూర్వకమ్ ।**

**పూర్ణాంతం పూర్వవత్కృత్వా తతో భూతాని శోధయేత్ ॥**

స్థిరాస్థిరే తతశ్శుద్ధ్యై శీతోష్ణే చ తతః పదే ।
ధ్యాయేద్వ్యాప్త్యై కతా కారే భూతశోధనకర్మణి ॥
భూతానాం గ్రంథివిచ్ఛేదం కృత్వా త్యక్త్వా సహాధిపైః ।
భూతాని స్థితియోగేన యోజయేత్పరమే శివే ॥
విశో ధ్యాస్య తనుం దగ్ధ్వా ప్లావయిత్వా సుధాకణైః ।
స్థాప్యాత్మానం తతః కుర్యాద్విశుద్ధాధ్వమయం వపుః ॥

తరువాత స్నానమును ఆచమనమును స్వస్తిపుణ్యాహవాచనమును చేసియున్న శిష్యుని గురుదేవు మండలము వద్దకు తీసుకు వెళ్లి, దానిలో ప్రవేశ పెట్టి, సాష్టాంగనమస్కారమును చేసి, యథాశాస్త్రముగా పూజను చేసి, కర్మలోపములను సరిదిద్దుట కొరకై వాచక మగు మంత్రమును మాత్రమే పైకి వినబడని విధముగా ఉచ్చరిస్తూ మూడు ఆహుతులను ఈయవలెను. ఆయన మరల దేవదేవుని చక్కగా పూజించి, మంత్రలోపములను పోగొట్టుట కొరకై ఆ మంత్రమును మనస్సులో ఉచ్చరిస్తూ మూడు ఆహుతులను ఈయవలెను. అపుడు ఆయన మండలమునందు జగన్మాతతో కూడియున్న శంభుని చక్కగా పూజించి, మూడు ఆహుతులను ఇచ్చి, తరువాత చేతులను జోడించి ప్రార్థించవలేను (41-44). ఓ భగవన్! నీ అనుగ్రహముచే వీనికి ఆరు మార్గముల శుద్ధి చేయబడినది. కావున, వీనిని నీయొక్క వినాశము లేని పరమధామమును పొందించుము (45). ఈ విధముగా విన్నవించి, పూర్వము నందు వలెనే నాడీ సంధానపురస్సరముగా, పూర్ణాహుతితో, అంతమయ్యే కర్మను చేసి, తరువాత పంచభూతములను శోధన చేయవలెను (46). భూతశుద్ధి అనే కర్మయందు పంచభూతములనే తత్త్వముల శుద్ధి కొరకై స్థిరతత్త్వమగు పృథివిని, అస్థిరతత్త్వమగు వాయువును, తరువాత చల్లదనమునకు ఆశ్రయమగు నీటిని, వేడికి ఆశ్రయమగు అగ్నిని, తరువాత వ్యాపకము మరియు నిరవయవము అగు ఆకాశమును ధ్యానించవలెను (47). పంచభూతముల గ్రంథవిచ్ఛేదనమును చేసి (అనగా భావన ద్వారా వాటికి అతీతుడై), వాటిని వాటి అధిష్టానదేవతలతో సహా విడిచి పెట్టి, స్థితియోగము ద్వారా పరమశివునియందు ప్రవేశ పెట్టవలెను (48). ఈ విధముగా శిష్యుని శోధన చేసి భావనా రూపముగా శరీరమును దహించి, అమృత బిందువులతో తడిపి ఉజ్జీవింపజేసి, తరువాత దానియందు ఆత్మను స్థాపించి, తరువాత దేహమును విశుద్ధమగు అధ్వలతో నిండియున్న దానినిగా చేయవలెను .

తత్రాదౌ శాంత్యతీతాం తు వ్యాపికాం స్వాధ్వనః కలామ్ ।
శుద్ధామేవ శిశోర్మూర్ధ్ని న్యసేచ్ఛాంతిం ముఖే తథా ॥
విద్యాం గలాదినాభ్యంతం ప్రతిష్ఠాం తదధః క్రమాత్।
జాన్వంతం తదధో న్యస్యేన్నివృత్తిం చానుచింతయేత్ ॥
స్వబీజైస్సూత్రమంత్రం చ న్యస్యాంగైస్తం శివాత్మకమ్ ।
బుద్ధ్వా తం హృదయాంభోజే దేవమావాహ్య పూజయేత్ ॥
ఆశాస్య నిత్యసాన్నిధ్యం శివస్వాత్మ్యం శిశౌ గురుః।
శివతేజోమయస్యాస్య శిశోరాపాదయేద్గుణాన్ ॥
అణిమాదీన్ ప్రసీదేతి ప్రదద్యాదాహుతిత్రయమ్ ।
తథైవ తు గుణానేవ పునరస్యోపపాదయేత్ ॥
సర్వజ్ఞతాం తథా తృప్తిం బోధం చాద్యంతవర్జితమ్ ।
అలుప్తశక్తిం స్వాతంత్ర్యమనంతాం శక్తిమేవ చ ॥
తతో దేవమనుజ్ఞాప్య సద్యాదికలశైస్తు తమ్ ।
అభిషించేత దేవేశం ధ్యాయన్ హృది యథాక్రమమ్ ॥
అథోపవేశ్య తం శిష్యం శివమభ్యర్చ్య పూర్వవత్ ।
లబ్ధానుజ్ఞశ్శివాచ్చైవీం విద్యామస్మై సమాదిశేత్ ॥
ఓంకారపూర్వికాం తత్ర సంపుటాం తు నమోంఽతగామ్ ।
శివశక్తియుతాం చైవ శక్తివిద్యాం తు తాదృశీమ్ ॥
ఋషిం ఛందశ్చ దేవం చ శివతాం శివయోస్తథా ।
పూజాం సావరణాం శంభోరాసనాని చ సంది శేత్ ॥
పునస్సంపూజ్య దేవేశం యన్మయా సమనుష్ఠితమ్ ।
సుకృతం కురు తత్సర్వమితి విజ్ఞాపయేచ్ఛివమ్ ॥
సహశిష్యో గురుర్దేవం దండవత్ క్షితిమండలే ।
ప్రణమ్యోద్వాసయేత్తస్మాన్మండలాత్పావకాదపి ॥
తతస్సదసికాస్సర్వే పూజ్యాః పూజార్హకాః క్రమాత్॥
సేవ్యా విత్తానుసారేణ సదస్యాశ్చ సహర్త్విజః ।
విత్తశాఠ్యం న కుర్వీత యదీచ్ఛేచ్ఛివమాత్మనః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే షడధ్వ
శుద్ధ్యాదికథనం నామ అష్టాదశోఽధ్యాయః ॥

వాటిలో ముందుగా అధ్వలన్నింటియందు వ్యాపించియుండే శుద్ధమగు శాంత్యతీతకళను శిష్యుని తలపై న్యాసము చేసి, అదే విధముగా శాంతికళను ముఖమునందు, విద్యాకళను కంఠమునుండి నాభి వరకు, ప్రతిష్ఠాకళను నాభి క్రింద వరుసగా మోకాళ్ల వరకు, వాటి క్రింద నివృత్తికళను న్యాసము చేసి భావన చేయవలెను (50,51). స్వీయబీజములతో కూడియున్న సూత్రమంత్రమును న్యాసము చేసి, శిష్యుడు ఈ అంగన్యాసములచే శివస్వరూపుడైనాడని తెలుసుకొని, హృదయపద్మమునందు ఆ దేవుని ఆవాహన చేసి పూజించవలెను (52). గురువు శిష్యునకు శివుని నిత్యసన్నిధి, శివస్వరూపుడై యుండుట లభించునట్లు ఆశీర్వదించి, శివుని తేజస్సుతో నిండియున్న ఆ శిష్యునకు అణిమ (దూదివలె తేలిక యగుట) మొదలగు గుణములను ఆపాదించ వలెను. ఓ శివా! ప్రసన్నుడవు కమ్ము అని పలికి మూడు ఆహుతులను ఈయవలెను. అంతే గాక, మరల శిష్యునకు సర్వజ్ఞత్వము, తృప్తి, ఆద్యంతములు లేని జ్ఞానము, లోపించని బలము, స్వాతంత్ర్యము, అనంతమగు శక్తి అనే గుణములను భావనాత్మకముగా ఆపాదించవలెను (53- 55). తరువాత దేవుని అనుమతిని భావనారూపముగా పొంది ఆ దేవదేవుని హృదయములో ధ్యానిస్తూ సద్యోజాత మొదలగు కలశములలోని జలముతో క్రమముగా అభిషేకించ వలెను (56). తరువాత ఆ శిష్యుని కూర్చుండబెట్టి, పూర్వమునందు వలెనే శివుని చక్కగా పూజించి, శివునినుండి అనుమతిని పొంది, ఈతనికి ఆదిలో ఓంకారముతో అంతములో నమః తో సంపుటితమై ఉండే శైవీ విద్యను (ఓం ఓం నమశ్శివాయ ఓం నమః), శివశక్తులతో కూడియున్న అటువంటిదే అగు శక్తివిద్యను (ఓం ఓం నమశ్శివాయై ఓం నమః) కూడ ఉపదేశించవలెను (57,58). ఋషిని, ఛందస్సును, దేవతను, పార్వతీపరమేశ్వరుల మంగళస్వరూపమును, ఆవరణపూజను మరియు శివుని ఆసనములను కూడ ఉపదేశించవలెను (59). మరల ఆ దేవదేవుని చక్కగా పూజించి, ఓ దేవా! నేను చేసిన కర్మను అంతను యోగ్యమైనదిగా చేయుము అని శివునకు విన్నవించుకొనవలెను (60). గురువు శిష్యునితో గూడి దేవునకు సాష్టాంగ నమస్కారమును చేసి, ఆ మహామండలమునుండి మరియు అగ్నినుండి ఉద్వాసనను చెప్పవలెను (61). తరువాత పూజకు అర్హులగు సభాసదులను అందరినీ వరుసగా పూజించి (62), తన ఆర్థికస్థితిని బట్టి సభాసదులకు మరియు ఋత్విక్కులకు సేవను చేయవలెను. తనకు మంగళమును కోరు సాధకుడు ఈ విషయములో లౌభ్యమును చూపరాదు .

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో తత్త్వశోధనను, కళాస్వరూపమును వర్ణించే పదునెనిమిదవ అధ్యాయము ముగిసినది .

# 19 – పంచాక్షరీ మంత్ర పురశ్చరణము

ఉపమన్యురువాచ:

అతః పరం ప్రవక్ష్యామి సాధకం నామ నామతః ।
సంస్కారమంత్రమాహాత్మ్యం కథనే సూచితం మయా ॥
సంపూజ్య మండలే దేవం స్థాప్య కుంభే చ పూర్వవత్ ।
హుత్వా శిష్యమనుష్ణీషం ప్రాపయేద్భువి మండలే ॥
పూర్ణాంతం పూర్వవత్కృత్వా హుత్వాహుతిశతం తథా ।
సంతర్ప్య మూలమంత్రేణ కలశైర్దేశికోత్తమః ॥
సందీప్య చ యథాపూర్వం కృత్వా పూర్వోదితం క్రమాత్ ।
అభిషిచ్య యథాపూర్వం ప్రదద్యాన్మంత్రముత్తమమ్ ॥
తత్ర విద్యోపదేశాంతం కృత్వా విస్తరశః క్రమాత్ ।
పుష్పాంబున శిశోః పాణౌ విద్యాం శైవీం సమర్పయేత్ ॥
తవైహికాముష్మికయోస్సర్వ సిద్ధిఫలప్రదః ।
భవత్యేవ మహామంత్రః ప్రసాదాత్పరమేష్ఠినః ॥
ఇత్యుక్త్వా దేవమభ్యర్చ్య లబ్ధానుజ్ఞశ్శివాద్గురుః ।
సాధనం శివయోగం చ సాధకాయ సమాది శేత్ ॥
తచ్ఛ్రుత్వా గురుసందేశం క్రమశో మంత్రసాధకః ।
పురతో వినియోగస్య మంత్రసాధనమాచరేత్ ॥
సాధనం మూలమంత్రస్య పురశ్చరణముచ్యతే ।
పుగతశ్చరణీయత్వాద్వినియోగాఖ్య కర్మణః ॥
నాత్యంతం కరణీయం తు ముముక్షోర్మంత్రసాధనమ్ ।
కృతం తు తదిహాన్యత్ర తస్యాపి శుభదం భవేత్ ॥

ఉపమన్యువు ఇట్లు చెప్పెను –

నేను ఈ పైన ఇంతకు ముందు చెప్పిన దానిలో సూచించిన సాధకుని స్వరూపమును, సంస్కారమంత్రమాహాత్మ్యమును చెప్పెదను (1). పూర్వములో చెప్పిన విధముగానే మండలమునందు కలశములో దేవుని ప్రతిష్ఠించి చక్కగా పూజించి, హోమమును చేసి, తలపాగా లేకుండగా శిష్యుని మండలములో నేలపై కూర్చుండబెట్ట వలెను (2). ఉత్తముడగు గురువు ఇంతకు ముందు చెప్పిన విధముగా పూర్ణాహుతి పూర్తి యగువరకు చేసి, వంద ఆహుతులను హోమము చేసి, మూలమంత్రమును ఉచ్చరిస్తూ కలశములతో తర్పణమును చేసి, పూర్వమునందు వలెనే క్రమబద్ధముగా దీపమూర్తులను ప్రకాశింపజేసి, ఇదివరలో చేసినట్లుగనే అభిషేకమును చేసి, ఉత్తమమగు మంత్రమును ఈయవలెను (3,4). ఆ స్థానములో (శైవీ) విద్యోపదేశము పూర్తి యగువరకు వరుసగా విస్తారముగా కర్మను చేసి, పుష్పములతో కూడిన నీటితో శిష్యుని చేతిలో శైవీవిద్యను సమర్పించవలెను (5). పరమేశ్వరుని అనుగ్రహముచే మహామంత్రము నీకు

ఇహపరలోకములలో సకల సిద్ధులను మరియు ఫలములను ఇచ్చి తీరును (6) అని పలికి, గురువు దేవుని చక్కగా పూజించి, శివునినుండి అనుమతిని పొందీ సాధకునకు సాధనమును, శివయోగమును ఉపదేశించవలెను (7). క్రమముగా మంత్రసిద్ధిని గోరు ఆ సాధకుడు ఆ గురుసందేశమును విని ఆయన యెదుటనే వినియోగముయొక్క మంత్రసాధనను చేయవలెను (8). మూలమంత్రముయొక్క సాధనకు పురశ్చరణము అని పేరు. ఏలయనగా, వినియోగము అనబడే ఈ కర్మను అన్నింటికంటే ముందుగా చేయవలెను (9). ముముక్షువు మంత్రసాధనకు పురశ్చరణను మించి అదే పనిగా చేయనక్కరలేదు (జ్ఞానసాధనకు అడ్డు కారాదని అభిప్రాయము). చేసినంతవరకు అది వానికి ఇహపరలోకములలో శుభమును కలిగించును .

**శుభేఽహని శుభే దేశే కాలే వా దోషవర్జితే ।**
**శుక్లదంతనఖస్స్నాతః కృతాపూర్వాహ్ణికక్రియః ॥**
**అలంకృత్య యథా లబ్ధైర్గంధమాల్య విభూషణైః ।**
**సోష్ణీషస్సోత్తరాసంగస్సర్వ శుక్లస్సమాహితః ॥**
**దేవాలయే గృహేఽన్యస్మిన్ దేశే వా సుమనోహరే ।**
**సుఖేనాభ్యస్తపూర్వేణ త్వాసనేన కృతాసనః ॥**
**తనుం కృత్వాత్మనశ్శైవీం శివశాస్త్రోక్తవర్త్మనా ।**
**సంపూజ్య దేవదేవేశం నకులీశ్వరమీశ్వరమ్ ॥**
**నివేద్య పాయసం తస్మై సమాప్యారాధనం క్రమాత్।**
**ప్రణిపత్య చ తం దేవం ప్రాప్తానుజ్ఞశ్చ తన్ముఖాత్ ॥**
**కోటివారం తదర్ధం వా తదర్ధం వా జపేచ్ఛివమ్ ।**
**లక్షవింశతికం వాపి దశలక్షమథాపి వా ॥**
**తతశ్చ పాయసాక్షారలవణైకమితాశనః ।**
**అహింసకః క్షమీ శాంతో దాంతశ్చైవ సదా భవేత్ ॥**
**అలాభే పాయసస్యాశ్నన్ ఫలమూలాదికాని వా ।**
**విహితాని శివేనైవ విశిష్టాత్యుత్తరోత్తరమ్ ॥**
**చరుం భక్ష్యమథో సక్తుకణాన్యావకమేవ చ।**
**శాకం పయో దధి ఘృతం మూలం ఫలమథోదకమ్ ॥**
**అభిమంత్ర్య చ మంత్రేణ భక్ష్యభోజ్యాదికాని చ ।**
**సాధనేఽస్మిన్ విశేషేణ నిత్యం భుంజీత వాగ్యతః ॥**

శుభదినమునాడు శుభస్థానమునందు దోషములు లేని సమయములో స్వచ్ఛమైన దంతములు మరియు గోళ్లు గలవాడై, స్నానమును చేసి, ఉదయకాలీనములగు నిత్యకర్మలను పూర్తి చేసుకొని (11), లభించినంత వరకు గంధము, పుష్పమాలలు, అభరణములు అనువాటితో అలంకరించుకొని, తలపాగా కట్టుకొని, ఉత్తరీయమును కప్పుకొన వలెను. ఇవి అన్నియు తెల్లని వస్త్రములై యుండవలెను. ఆతడు ఏకాగ్రమగు చిత్తము గలవాడై (12),

దేవాలయమునందు గాని, ఇంటియందు గాని, లేదా మరియొక మిక్కిలి అందమగు స్థానమునందు గానీ తనకు అలవాటైన పద్ధతిలో సుఖకరమగు ఆసనమునందు కూర్చుండి (13), శివశాస్త్రములో చెప్పిన విధముగా తన దేహమును శివమయముగా చేసుకొని, దేవదేవుడు సర్వజగన్నియంత అగు నకులీశ్వరుని చక్కగా పూజించి ( 14), ఆయనకు పాయసమును నైవేద్యము పెట్టి, క్రమముగ పూజావిధానమును ముగించి, ఆ దేవునకు ప్రణమిల్లీ, సాక్షాత్తుగా ఆయననుండి అనుమతిని పొంది (15), కోటి, ఏభై లక్షలు, ఇరవై అయిదు, లక్షలు, ఇరవై లక్షలు లేదా పది లక్షలు శివమంత్రమును జపించవలెను (16), ఆ తరువాత పాయసమును, వగరు ఉప్పు లేని మరియొక పదార్థమును మితముగా భుజిస్తూ, హింసను చేయకుండగా, మనోనియంత్రణ గలవాడై, సర్వదా ఇంద్రియజయము గలవాడై ఉండవలెను (17). పాయసము దొరకనిచో పళ్లు, దుంపలు మొదలగు వాటిని భుజించ వలెను. ఈక్రింది పదార్థములను శివుడే స్వయముగా విధించినాడు. వాటిలో ముందు చెప్పిన దాని కంటే దాని తరువాతిది శ్రేష్ఠతరము అగును (18). వండిన అన్నమును భక్షించుట మొదటి పక్షము. పిండి కణములు రెండవది. బార్లీ అన్నము, కూరలు, పాలు, పెరుగు, నెయ్యి, దుంప, పండు నీరు అనునవి ఆ భక్ష్యములు (19). భక్ష్యములు, భోజ్యములు అగు ఆ పదార్థములపై మంత్రముతో నీటిని చల్లి, సాధకుడు ప్రత్యేకించి ఈ సాధనసమయములో ప్రతినిత్యము వీలైనంత మౌనముగా భుజించవలెను .

**మంత్రాష్టశతపూతేన జలేన శుచినా వ్రతీ ।**
**స్నాయన్నదీనదోత్థేన ప్రోక్షయేద్వాథ శక్తితః ॥**
**తర్పయేచ్చ తథా నిత్యం జుహుయాచ్చ శివానలే ।**
**సప్తభిః పంచభిర్వా వైస్త్రిభిర్వాథ ఘృతేన వా ॥**
**ఇత్థం భక్త్యా శివం శైవో యస్సాధయతి సాధకః ।**
**తస్యేహాముత్ర దుష్ప్రాపం న కించిదపి విద్యతే ॥**
**అథవాహరహర్మంత్రం జపేదేకాగ్రమానసః ।**
**అనశ్నన్నేవ సాహస్రం వినా మంత్రస్య సాధనమ్ ॥**
**న తస్య దుర్లభం కించిన్న తస్యాస్త్యశుభం క్వచిత్ ।**
**ఇహ విద్యాం శ్రియం సౌఖ్యం లబ్ధ్వా ముక్తిం చ విందతి ॥**
**సాధనే వినియోగే చ నిత్యే నైమిత్తికే తథా ।**
**జపేజ్జలైర్భస్మనా చ స్నాత్వా మంత్రేణచ క్రమాత్ ॥**
**శుచిర్బద్ధశిఖస్సూత్రీ సపవిత్రకరస్తథా ।**
**ధృతత్రిపుండ్రరుద్రాక్షో విద్యాం పంచాక్షరీం జపేత్ ॥**
**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం పంచాక్షరీ మంత్ర పురశ్చరణవర్ణనం నామ ఏకోనవింశోఽధ్యాయః ॥**

పురశ్చరణ వ్రతములోనున్న సాధకుడు నూట యెనిమిది సార్లు చేసిన మంత్రజపముచే పవిత్రము చేయబడినది, స్వచ్ఛమైనది, గంగ మొదలగు నదినుండి గాని సింధు మొదలగు నదము నుండి గాని తెచ్చినది అగు నీటితో స్నానమును చేయవలెను. స్నానమును చేయుటకు సమస్య ఉన్నచో, శక్తిని బట్టి ఆ నీటిని దేహముపై చల్లుకొనవలెను (21). అదే విధముగా ప్రతి దినము తర్పణములను చేసి, శివస్వరూపమగు అగ్నియందు ఏడు, అయిదు, లేదా మూడు ద్రవ్యముల కలయిక అగు హవిస్సుతో గాని, లేదా నేతితో గాని హోమమును చేయవలెను (22). శివభక్తుడగు ఏ సాధకుడు ఈ విధముగా భక్తితో శివుని ఆరాధించునో, వానికి ఇహపరలోకములలో పొంద శక్యము కానిది ఏదీ ఉండదు (23). పైన చెప్పిన జపమునకు. మరియొక వికల్పము గలదు. సాధకుడు ఏకాగ్రమగు మనస్సు గల వాడై ప్రతిదినము భోజనమును చేయుటకు ముందే మంత్రమును వేయి సార్లు జపించ వలెను. మంత్రసాధనను చేయకున్ననూ (24), ఈ విధముగా చేయువానికి లభించ శక్యము కానిది ఏదీ ఉండదు. వానికి ఎప్పుడైననూ అశుభము లేదు. అతడు ఇహలోకములో విద్యను, సంపదను, సౌఖ్యమును పొంది, ముక్తిని కూడ పొందును (25). సాధనయందు, వినియోగమునందు మరియు నిత్య నైమిత్తిక కర్మలయందు మంత్రమును జపించవలెను. సాధకుడు క్రమముగా నీటితో, భస్మతో మరియు మంత్రముతో స్నానమును చేసి (26), శుచియై శిఖను ముడి వేసుకొని, సూత్రమును ధరించి, చేతికి పవిత్రమును కట్టుకొని, త్రిపుండ్రమును రుద్రాక్షలను ధరించి, పంచాక్షరీమంత్రమును జపించవలెను .

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో పంచాక్షరీ మంత్ర౷ పురశ్చరణ పద్ధతిని వర్ణించే పందొమ్మిదవ అధ్యాయము ముగిసినది .

# 20 – శిష్యుని ఆచార్యస్థానములో అభిషేకించుట

**ఉపమన్యురువాచః**

**అథైవం సంస్కృతం శిష్యం కృతపాశుపతవ్రతమ్ ।**
**ఆచార్యత్వేఽభిషించేత తద్యోగ్యత్వే న చాన్యథా ॥**
**మండలం పూర్వవత్కృత్వా సంపూజ్య పరమేశ్వరమ్ ।**
**స్థాపయేత్పంచ కలశాన్ దిక్షు మధ్యే చ పూర్వవత్ ॥**
**నివృత్తిం పురతో న్యస్య ప్రతిష్ఠాం పశ్చిమే ఘటే ।**
**విద్యాం దక్షిణతశ్శాంతిముత్తరే మధ్యతః పరామ్ ॥**
**కృత్వా రక్షాదికం తత్ర బద్ధ్వా ముద్రాం చ ధైనవీమ్ ।**
**అభిమంత్ర్య ఘటాన్ హుత్వా పూర్ణాంతం చ యథా పురా ॥**
**ప్రవేశ్య మండలే శిష్యమనుష్ణీషం చ దేశికః ।**
**తర్పణాద్యం తు మంత్రాణాం కుర్యాత్పూర్ణావసానకమ్ ॥**
**తతస్సంపూజ్య దేవేశమనుజ్ఞాప్య చ పూర్వవత్ ।**
**అభిషేకాయ తం శిష్యమాసనం త్వధిరోహయేత్ ॥**
**సకలీకృత్య తం పశ్చాత్కలాపంచకరూపిణమ్ ।**
**న్యస్తమంత్రతనుం బద్ధ్వా శివం శిష్యం సమర్పయేత్ ॥**
**తతో నివృత్తి కుంభాదిఘటానుద్ధృత్య వై క్రమాత్।**
**మధ్యమాంతాచ్ఛివేనైవ శిష్యం తమభిషేచయేత్ ॥**
**శివహస్తం సమర్ప్యాథ శిశోశ్శిరసి దేశికః ।**
**శివభావసమాపన్నశ్శివాచార్యం తమాదిశేత్ ॥**
**అథాలంకృత్య తం దేవమారాధ్య శివమండలే ।**
**శతమష్టోత్తరం హుత్వా దద్యాత్పూర్ణాహుతిం తతః ॥**

ఉపమన్యువు ఇట్లు పలికెను –

తరువాత ఈ విధముగా సంస్కారమును పొంది, పాశుపత వ్రతమును ఆచరించిన శిష్యుని గురువు ఆతడు యోగ్యుడైనచో, ఆచార్యస్థానమునందు అభిషేకించ వలెను; యోగ్యుడు కానిచో, చేయరాదు (1). ఇదివరలో చెప్పిన విధముగా మండలమును చేసి, పరమేశ్వరుని చక్కగా పూజించి, ఇదివరలో చెప్పిన విధముగనే నాలుగు దిక్కులలో నాలుగు, మధ్యలో ఒకటి, వెరసి అయిదు కలశములను స్థాపించవలెను (2). తూర్పు కలశమునందు నివృత్తికళను, పశ్చిమకలశమునందు ప్రతిష్టను, దక్షిణమునందు విద్యను, ఉత్తరమునందు శాంతినీ, మధ్యలో శాంత్యతీతకళను న్యాసము చేసి (3), వాటియందు రక్షాబంధనము మొదలగు కర్మలను చేసి ధేనుముద్రను చూపించి, ఆ కలశములను అభిమంత్రించి, ఇదివరలో చెప్పిన విధముగానే పూర్ణాహుతి పర్యంతము హోమములను చేసి (4), గురువు శిష్యుని తలపాగా లేకుండగా మండలములో ప్రవేశ పెట్టి, మంత్రములకు తర్పణములను, పూర్ణాహుతి

పర్యంతము హోమములను చేయవలెను (5). తరువాత దేవదేవుని చక్కగా పూజించి, ఇదివరలో చెప్పిన విధముగనే అభిషేకము కొరకై అనుమతిని పొంది, ఆ శిష్యుని ఆసనముపైకి ఎక్కించవలెను (6). తరువాత వానికి సకలీకరణము అను సంస్కారమును చేసి, అయిదు కళలే స్వరూపముగా గలవాడు, మంత్రన్యాసము చేయబడిన దేహము గలవాడు అగు ఆ శిష్యుని కట్టి శివునకు సమర్పించవలెను (7). తరువాత నివృత్తితో మొదలు పెట్టి మధ్య వరకు గల కలశములను వరుసగా పైకి తీసి ఆ శిష్యుని శివమంత్రముతోనే అభిషేకించవలెను (8) . తరువాత గురువు తన పుత్రుని వంటి శిష్యుని తలపై శివహస్తమును (అరచేతిలో శివుని ఆవాహన చేసి పూజించినచో అది శివహస్తమగును) ఉంచి, శివభావమును పొందినవాడై వానిని శివాచార్యుడని నిర్దేశించవలెను (9). తరువాత వానిని అలంకరించి, శివమండలములో దేవుని ఆరాధించి, నూట యెనిమిది ఆహుతులను ఇచ్చి, తరువాత పూర్ణాహుతిని చేయవలెను .

**పునస్సంపూజ్య దేవేశం ప్రణమ్య భువి దండవత్ ।**

**శిరస్యంజలిమాధాయ శివం విజ్ఞాపయేద్గురుః॥**

**భగవంస్త్వత్ప్రసాదేన దేశికోఽయం మయా కృతః ।**

**అనుగృహ్యాత్వయా దేవ దివ్యాజ్ఞాస్మై ప్రదీయతామ్ ॥**

**ఏవం విజ్ఞాప్య శిష్యేణ సహ భూయః ప్రణమ్య చ ।**

**శివం శివాగమం దివ్యం పూజయేచ్ఛివవద్గురుః ॥**

**పునశ్శివమనుజ్ఞాప్య శివజ్ఞానస్య పుస్తకమ్ ।**

**ఉభాభ్యామథ పాణిభ్యాం దద్యాచ్ఛిష్యాయ దేశికః ॥**

**స తాం మూర్ధ్ని సమాధాయ విద్యాం విద్యాసనోపర ।**

**అధిరోప్య యథాన్యాయమభివంద్య సమర్పయేత్ ॥**

**అథ తస్మై గురుర్దద్యాద్రాజోపకరణాన్యపి ।**

**ఆచార్యపదవీం ప్రాప్తో రాజ్యం చాపి యతోఽ ర్హతి ॥**

**అథానుశాసనం కుర్యాత్పూర్వైరాచరితం యథా ।**

**యథా చ శివశాస్త్రోక్తం యథా లోకేషు పూజ్యతే ॥**

**శిష్యాన్ పరీక్ష్య యత్నేన శివశాస్త్రోక్తలక్షణైః ।**

**సంస్కృత్య చ శివజ్ఞానం తేభ్యో దద్యాచ్చ దేశికః ॥**

**ఏవం సర్వమనాయాసం శౌచం క్షాంతిం దయాం తథా ।**

**అస్పృహామనసూయాం చ యత్నేన చ విభావయేత్ ॥**

**ఇత్థమాదిశ్య తం శిష్యం శివముద్వాస్య మండలాత్ ।**

**శివకుంభానలాదీంశ్చ సదస్యానపి పూజయేత్ ॥**

గురువు మరల దేవదేవుని పూజించి సాష్టాంగనమస్కారమును చేసి తలపై చేతులను జోడించికొని శివునకు విన్నవించవలెను (11). ఓ భగవాన్! నీ అనుగ్రహముచే వీనిని ఆచార్యునిగా చేసితిని. ఓ దేవా! నీవు అనుగ్రహించి వీనికి దివ్యమగు ఆజ్ఞను ఇమ్ము (12). గురువు ఈ విధముగా ప్రార్థించి, శిష్యునితో గూడి

మరల శివునకు నమస్కరించి, దివ్యమగు శివాగమమును శివునితో సమానముగా పూజించవలెను (13). గురువు మరల శివుని అనుమతిని పొంది శివజ్ఞానము యొక్క పుస్తకమును రెండు చేతులతో శిష్యునకీయవలెను (14). ఆతడు శివవిద్యారూపమగు ఆ పుస్తకమును తలపై నిడుకొని యథాశాస్త్రముగా విద్యాసనముపై నుంచి నమస్కరించి పూజించవలెను (15). తరువాత గురువు ఆతనికి రాజునకు తగిన సాధనములను ఈయవలెను. ఏలయనగా, ఆచార్య స్థానమునకు పొందిన వానికి రాజార్హత కూడ గలదు (16). తరువాత పూర్వాచార్యులచే అనుష్ఠించబడినదీ, శివశాస్త్రములో చెప్పబడినదీ, లోకములో ఆదరమును కలిగించునది అగు ఆచారమును ఆతనికి ఉపదేశించ వలెను (17). గురువు శివశాస్త్రములో చెప్పబడిన లక్షణములను బట్టి ప్రయత్నపూర్వకముగా శిష్యులను పరీక్షించి, వారికి సంస్కారమును చేసి, శివజ్ఞానమునీయవలెను (18). ఈ విధముగా శౌచము, క్షాంతి, దయ, కామనలు లేకుండుట, అసూయ లేకుండుట అను గుణములను ప్రయత్నపూర్వకముగా పాటించి, వాటిని అనాయాసముగా (అతిసహజముగా) పాటించే లక్షణమును అలవరచు కొనవలెను (19). ఈ విధముగా ఆ శిష్యునకు ఉపదేశించి, మండలమునుండి శివునకు, శివకలశము అగ్ని మొదలగువాటికి ఉద్వాసన చెప్పి, సభాసదులను కూడ పూజించవలెను.

యుగపద్వాథ సంస్కారాన్ కుర్వీత సగణో గురుః।
తత్ర యత్ర ద్వయం వాపి ప్రయోగస్యోపదిశ్యతే ॥
తదాదావేవ కలశాన్ కల్పయేదధ్వ శుద్ధి విత్ ।
కృత్వా సమయసంస్కారమభిషేకం వినాఖిలమ్ ॥
సమభ్యర్చ్య శివం భూయః కృత్వా చాధ్వవిశోధనమ్ ।
తస్మిన్ పరిసమాప్తే తు పునర్దేవం ప్రపూజయేత్ ॥
హుత్వా మంత్రం తు సంతర్ప్య సందీప్యాశాస్య చేశ్వరమ్ ।
సమర్ప్య మంత్రం శిష్యస్య పాణౌ శేషం సమాపయేత్ ॥
అథవా మంత్రసంస్కారమనుచింత్యా ఖిలం క్రమాత్ ।
అధ్వశుద్ధిం గురుః కుర్యాదభిషేకావసానకమ్ ॥
తత్ర యశ్శాంత్యతీతాదికలాసు విహితో విధిః ।
స సర్వోఽపి విధాతవ్యస్తత్త్వత్రయ విశోధనే ॥
శివవిద్యాత్మతత్త్వాఖ్యం తత్త్వత్రయముదాహృతమ్ ।
శక్తౌ శివస్తతో విద్యా తస్యా స్త్వాత్మా సముద్భవౌ॥
శివేన శాంత్యతీతాధ్వా వ్యాప్తస్తదపరః పరః ।
విద్యయా పరిశిష్టోఽ ధ్వా హ్యాత్మనా నిఖిలః క్రమాత్ ॥
దుర్లభం శాంభవం మత్వా మంత్రమూలం మనీషిణః ।
శాక్తం శంసీత సంస్కారం శివశాస్త్రార్థపారగాః ॥
ఇతి తే సర్వమాఖ్యాతం సంస్కారాఖ్యస్య కర్మణః ।
చాతుర్విధ్యమిదం కృష్ణ కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥

**ఇతి శ్రీ శివమహాపురాణే వాయవీయసంహితాయాం ఉత్తరఖండే శిష్యస్య ఆచార్యస్థానాభిషేకవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥**

ఈ విషయములో మరియొక వికల్పము గలదు. గురువు తన శిష్యగణముతో గూడి సంస్కారములను ఒకేసారి చేయవలెను. రెండు సంస్కారములను కలిపి చేసే సందర్భములో చేయవలసిన ప్రయోగము ఇచట ఉపదేశించ బడుచున్నది. (21). దానికి ముందులోనే అధ్వశుద్ధిలో చేసినట్లుగా కలశములను స్థాపించవలెను. అభిషేకమును మినహాయించి సమయసంస్కారమునంతనూ చేసి (22), శివుని మరల పూజించి, అధ్వశోధనమును చేసి, అది పూర్తి అయిన తరువాత దేవుని మరల పూజించవలెను (23), మూలమంత్రముతో హోమమును తర్పణమును చేసి, సందీపనకర్మను చేసి, ఈశ్వరుని ఆజ్ఞను పొంది, శిష్యుని చేతిలో మంత్రమును సమర్పించి మిగిలిన కర్మను పూర్తి చేయవలెను (24). మరియొక వికల్పము గలదు. గురువు మంత్రసంస్కారమునంతనూ వరుసగా భావన చేసి, అధ్వశో ధనమును చేసి, అభిషేకముతో పూర్తి చేయవలెను (25), దానిలో శాంత్యతీత మొదలగు కళల యందు ఏ ప్రయోగము విధించబడినదో, దానినంతనూ మూడు తత్త్వముల శోధనలో కూడా చేయవలెను (26). తత్త్వత్రయమనగా శివతత్త్వము, విద్యాతత్త్వము, ఆత్మతత్త్వము అనునవి. శక్తియందు ముందుగా శివుడు, తరువాత విద్య, ఆ తరువాత ఆత్మ ఆవిర్భవించినవి (27). శివునిచే శాంత్యతీతాధ్వ, దానిచే శాంతికళ, దానిచే విద్య, విద్యచే మిగిలియున్న కళ మరియు ఆత్మచే సర్వము క్రమముగా వ్యాపించబడి యున్నవి (28). శివశాస్త్రముయొక్క సారమును దర్శించిన విద్వాంసులు మంత్రమూలకమగు శైవసంస్కారము దుర్లభమని తలచి శక్తిసంస్కారమును బోధించుచున్నారు (29). ఓ శ్రీకృష్ణా! ఈ విధముగా నేను నీకు నాలుగు విధముల సంస్కారకర్మను సమగ్రముగా చెప్పితిని. నీవు ఇంకనూ ఏమి వినగోరు చున్నావు?

శ్రీ శివమహాపురాణములోని వాయవీయసంహితయందు ఉత్తరఖండలో శిష్యుని ఆచా◌ార్యస్థానములో అభిషేకించే కర్మను వర్ణించే ఇరువదియవ అధ్యాయము ముగిసినది .